ISSN: 3048-5908 Impact Factor: 5.379(SJIF)

# తెలుగు శాఖ
# అంతర్జాతీయ సదస్సు

## ప్రత్యేక సంచిక
# *'ఆధునిక కవిత్వ వికాసం'*
**(తేదీ:21-02-2025)**

*సంపాదక మండలి*

డా. పి. అనిల్ కుమార్
కళాశాల ప్రాచార్యులు మరియు సదస్సు సంచాలకులు

ప్రధాన సంపాదకులు
శ్రీమతి డి. కనకమహాలక్ష్మి
తెలుగు శాఖాధిపతి

సహాయ సంపాదకులు
శ్రీమతి బి. ఎస్. ఎల్. పద్మశ్రీ
తెలుగు ఉపన్యాసకులు

శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల, (స్వ.ప్ర.)
తణుకు

| | |
|---|---|
| Book Subject | : Telugu |
| Book Category | : Edited book |
| Issue | :Vol-2, Special Issue-1 |
| Copy Right | : Editors |
| First Edition | : 21st February 2025. |
| Book Size | : B5 (Double Crown) |
| Paper | : 21kg, Maplitho NS |
| Price | : Rs.750/- |

| | |
|---|---|
| Published by | : Sahithyatharangini Journal |
| ISSN | : 3048-5908 |
| Impact Factor | : 5.379(SJIF) |
| Contact | : 91 21 03 98 99 |

ISSN Approved by

ISSN National Centre, India
National Science Library
CSIR-NISCPR, 14 Satsang Vihar Marg
New Delhi – 110067

**Disclaimer:** The Publisher and editor cannot be held responsible for errors or any consequences arising from the use of information in this Book; the views and opinions expressed herein are of the authors and do not necessarily reflect those of the publisher and editors. © All rights reserved. No part of the book may be reproduced, in any form or any means, without permission in writing from the publisher and the author.

## విషయ సూచిక


| S.No | Title | Author | Page |
|---|---|---|---|
| 1 | "సినారె కవిత్వానుశీలనం" | డా\|\| పి. విజయకుమార్ | 1-10 |
| 2 | "తేనె చుక్కలు" కవితా సంపుటిలో రవ్వలు సామాజిక వీక్షణం | శ్రీమతి డి కనకమహాలక్ష్మి | 11-16 |
| 3 | "విజయవాడ పౌరులారా! కవిత అనుశీలన" | డా. సముద్రాల ప్రిస్కిల్ల | 17-20 |
| 4 | జిసనారా లఘు కవితా రూపాలు (నానీ " నావి నీవి వెరసి నానీ ") | శ్రీమతి బి. శ్రీలవ పద్మశ్రీ | 21-23 |
| 5 | స్త్రీవాద కవయిత్రుల తండ్రి ప్రేమ | డా. సుంకర గోపాలయ్య | 24-27 |
| 6 | మినీ కవిత్వం - ఒక పరిశీలన | డా. టి. ఆశీర్వాదం | 28-31 |
| 7 | భావకవిత్వం - భావకవిత్వ శాఖలు | డా. భూక్య జ్యోతి | 32-35 |
| 8 | ఎండ్లూరి కవిత నల్ల ద్రాక్ష పందిరి – నవ్య పద చిత్రాలు | డా. గుండ్లూరు వెంకటరమణ | 36-40 |
| 9 | ఇక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం – సామాజికాంశాలు | డా. గౌరారపు శ్రీనివాస్<br>డా. బి. సరస్వతి | 41-46 |
| 10 | జాషువా - గబ్బిలం ప్రగతిశీల భావాలు | డా. కొణిదల పురుషోత్తం | 47-51 |
| 11 | తిలక్ కవిత్వం – వైశిష్ట్యం | డా. తంగి . ఓగేశ్వర రావు | 52-56 |
| 12 | అభ్యుదయ కవిత్వ వికాసం | డా. అంగటి పైడిరాజు | 57-59 |
| 13 | కవిత్వ నిర్మాణ వ్యూహాలు | డా. పోలుమాటి అన్నవరం సత్యనారాయణ | 60-63 |
| 14 | చైతన్య దీప్తి - కుసుమ ధర్మన్న | కె. ఎం. సౌందర్యవతి | 64-66 |
| 15 | తెలుగు గజల్ ఒక పరిశీలన | డా. కె. ప్రేమ కుమారి | 67-71 |
| 16 | ఓ చిన్న కవిత్వంలో మానవత్వాన్ని ఆకాంక్షించిన కవితా సంకలనం - కర్మ కాదు క్రియ | యలమర్తి సునీత | 72-75 |
| 17 | హైకూ కవిత్వం - ప్రకృతి తత్వపు పరిమళం | డా. ఎం.పద్మ గౌరీ | 76-79 |
| 18 | మహాప్రస్థానం మీద మార్క్సిజం ప్రభావం | డా. యస్. సి. సంజీవ రెడ్డి | 80-83 |
| 19 | "ప్రశ్న గేయం - దాశరధి అభ్యుదయ దృక్పథం" | షేక్ షానాజ్ బేగం | 84-89 |
| 20 | సీతారామశాస్త్రి కవితా సిరివెన్నెల | డా. పొన్నం రెడ్డి కుమారి నీరజ | 90-94 |
| 21 | పాస్టరల్ పొయిట్రీ - కృషీవలు కావ్యం | డా. గోపవరం పద్మప్రియ | 95-101 |

| | | | |
|---|---|---|---|
| 22 | అభ్యుదయ కవి శ్రీశ్రీ - నవ్య కవిత్వం | డా. గుంటుపల్లి గౌరి | 102-108 |
| 23 | ఆధునిక కవిత్వం - సామాజిక చైతన్యం | డా. ఎన్ . సుజాత | 109-113 |
| 24 | దిగంబర కవిత్వం - ఒక పరిశీలన | ఎం. ఎల్. ఎస్. కుమారి | 114-117 |
| 25 | "సినారె ప్రపంచ పదులు" | డా. కె. సుజాత | 118-121 |
| 26 | విమల గారి వంటిల్లు కవితలు – "స్త్రీ" జీవితం | లాలం అచ్చియ్యమ్మ | 122-124 |
| 27 | కుందుర్తి - వచన కవితా తత్వం | నల్లపనేని విజయలక్ష్మి | 125-129 |
| 28 | సంప్రదాయ ప్రతిబింబం సి.నా.రె. సాహిత్యం | డా. వాసిరెడ్డి భవాని | 130-134 |
| 29 | భగవంతునికి బహిరంగ లేఖ - దీర్ఘ కవిత నిర్వహణ | డా. యస్. దివిజాదేవి | 135-141 |
| 30 | గంటేడ గౌరు నాయుడు – రైతు సంఘీభావ కవిత్వం | శ్రీమతి ఎం. రమా గీతాదేవి | 142-145 |
| 31 | ఆధునిక కవిత్వ వికాసం "స్త్రీ - దళితవాద కవిత్వం" | డా. ఆర్. యస్. రవికుమార్ | 146-151 |
| 32 | వచన కవిత్వం - ఒక పరిశీలన | కె. అరుణ | 152-156 |
| 33 | పరదాలో ముస్లిం స్త్రీ జీవన ఘోష | అరిగెల శ్రీకాంత్ | 157-159 |
| 34 | అభ్యుదయ కవి - ఆరుద్ర | ఎస్. రజిత | 160-162 |
| 35 | కర్పూర పరిమళాలు వెదజల్లే కర్పూర వసంత రాయలు | డా. పరుచూరి విజయలక్ష్మి | 163-168 |
| 36 | "మన్యంలో" కథాకావ్య జంఝానిల వీచిక | డా. డి. ధాత్రికుమారి | 169-174 |
| 37 | షాజహానా కథలలో సామాజిక జీవన చిత్రణ | షేక్ జరీన బేగం<br>డా. ఇరపని మాధవి | 175-179 |
| 38 | శిఖామణి మువ్వల చేతి కర్ర - కవితా శిల్పం | డాక్టర్. బి. సుబ్బలక్ష్మి | 180-183 |
| 39 | బసవరాజు అప్పారావు గారి గేయాల్లో ఆత్మ సమర్పణ భావం | డా. మోగంటి సుధామయి | 184-189 |
| 40 | జాషువా కవిత్వం – మానవత్వం | కె. సురేష్ బాబు | 190-195 |
| 41 | "గోసంగి" దళిత దీర్ఘ కావ్యం - ఒక పరిశీలన | డా. కసుకుర్తి ఈశ్వరమ్మ | 196-201 |
| 42 | రాయలసీమ అస్తిత్వదీపం - పెన్నేటి పాట | డా. వంకం భాస్కర్ | 202-207 |
| 43 | మానవ జీవనవేదం "నాగలి కూడా ఆయుధమే" - కొమ్మవరపు విల్సన్ రావు | డా. రేచర్ల శ్రీలక్ష్మి | 208-214 |
| 44 | ఉత్తరాంధ్ర వలస కవిత్వ వెతలు | ఉషారాణి పిల్లి | 215-218 |
| 45 | భావ కవిత్వం - వస్తు నవ్యత | డా. జి. వెంకట లాల్ | 219-224 |

# 'సినారె కవిత్వానుశీలనం'

**డా|| పి. విజయకుమార్**
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగుశాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

**స్థూల పరిచయం:** తెలుగు సాహిత్యాకాశంలో పండువెన్నెల నిండు జాబిలి నారాయణరెడ్డి. ఆయన కవిగా ప్రఖ్యాతుడో, విమర్శకుడిగానో, వక్తగానో, వ్యాఖ్యాతగానో, రచయితగానో చెప్పడం కష్టం. అన్నింటినీ సమతూకంలో సాధించిన మేధావి, నిత్యహరిత సాహితీ చైతన్యశిఖరం సినారె.

సినారె కవిత్వానుశీలనం
"ఏదైనా రాయందే
ఈ క్షణాన్ని పోనీయను
కలాన్ని పిండే యందే
కాలాన్ని కదలనీయను
అవసరమైనప్పుడల్లా
అగ్గిపుల్లతో – చీకటి
కొవ్వును కరిగించందే
కొత్త పొద్దు రానీయను"

అని సమాజ హృదయాన్ని సంస్కరించి విశ్వకవుల పంక్తిలో ఒక సమున్నత స్థానాన్ని సాధించిన విశ్వంభర మహాకవి సినారె.

ఆయన హృదయం నాగార్జున సాగరం
ఆయన యశస్సు "కర్పూర వసంతరాయలు"
ఆయన నీడ వెన్నెలవాడ
ఆయన కవితాకుమారి "అజంతా సుందరి"
ఆయన నివాసం "మధ్యతరగతి మందహాసం"
ఆయన ఆవేదన 'మంటలూ మానవుడు'
ఆయన భావాలు "అక్షరాల గవాక్షాలు"
ఆయన కలం 'బంగారుకడ్డీ'
ఆయన పేరు నారాయణరెడ్డి
ఆ పెదవి మెదిపితే ఆణిముత్తెపుజల్లు
ఆ కలము కదిపితే అందాల హరివిల్లు
అతని తీయని వాణి అది నిత్యకళ్యాణి
అతడు నిల్చిన క్షోణి అమృతలహరి త్రివేణి
అభ్యుదయ భావాల కాతడొక సెమినారె
బుధులర సినారె! ఆ మధురకవి సినారె' అంటారు సినారె మనసెరిగిన కరుణశ్రీ.

ఆరున్నర దశాబ్దాల కవిత్వ జీవితం గల సినారెపై నాలుగు దశాబ్దాల సాహిత్య విమర్శచేసిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి కలం నుండి జాలువారిన విమర్శాక్షరం 'సినారె కవిత్వానుశీలనం', 1970 నాటికి భారతదేశంలో విప్లవోద్యమాలు పురుడు పోసుకుంటున్న తరుణమది. అటు పశ్చిమ బెంగాల్, ఇటు ఉత్తరాంధ్ర, మరోవైపు ఉత్తర తెలంగాణాలో పరిస్థితులు విప్లవీకరింపబడుతున్న తరుణమది. దేశంలో రాజకీయంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడిన తరుణంలో 1970లో సినారె 'మంటలూ - మానవుడు' కావ్యం వెలువరించారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

రానున్న ప్రభాతం రాక తప్పదు
రక్తశుక్తి సత్యమౌక్తికాన్ని
ప్రసవించక తప్పదు; నవధర్మం
ప్రభవించక తప్పదు

సామాజిక చైతన్యం పర్యవసానంగా సామాజిక మార్పు ఆకాంక్షగా, భవిష్యత్తు మీద విశ్వాసాన్ని ప్రకటించిన వైనాన్ని రాచపాళెంగారు దార్శనికతతో వెలిబుచ్చారు.

"మనిషి నా పల్లవి
మనిషి నా పతాక
మనిషి నా అవధి
మనిషి నా ఆకాశం
మనిషి నా ఉచ్ఛ్వాసం
మనిషి నా నిశ్వాసం"

మనిషిని సర్వస్వరూపంగా కవిత్వాన్ని సృజించారు సినారె. మనిషిలోని అభ్యుదయాన్ని కాంక్షించే విమర్శ చేశారు ఆర్వీఆర్. నిరంతర సృజనశీలి సినారె. నిరంతర విమర్శనశీలి ఆర్వీఆర్,

"ఈ మట్టిలోనే పుట్టాము
ఈ మట్టిలోనే పెరిగాము
ఈ మట్టిని మించిన దైవం లేదు
మట్టే మెతుకురా ఈ మట్టే బతుకురా"

అనే పాట సినారె రైతుబిడ్డగా రాసిన పాట. తనూ ఓ రైతుబిడ్డే కావడంతో ఆ పాటపై మక్కువ పెంచుకొన్నారు. కాని సమాజంలో ప్రపంచీకరణ ప్రభావం వల్ల వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్న వైనం రాచపాళెం గారిని ఆలోచనలో పడేసింది. "రాజ్యాలే తలకిందైనా రైతే నిలచురా, రైతే వెలుగురా" అన్న పంక్తులతో ఆంతర్యాన్ని పసిగట్టి "ఈ మట్టిమనిషి ఏమయ్యాడు" అనే పేరుతో రాచపాళెం గారు రాసిన వ్యాసాన్ని సినారె చదివి అభినందించారంటే 'మట్టిమనిషి' పట్ల ఆర్ద్రత మనకు స్పష్టమవుతుంది.

నా వాదం సామ్యవాదం / కవిత్వం నా మాతృభాష అని సినారె సమదృష్టిని కవిత్వ ఔన్నత్యాన్ని ప్రస్తావించారు.

నడక నా తల్లి /
పరుగు నా తండ్రి /
సమత నా భాష /
కవిత నా శ్వాస" అంటూనే
"కవిత్వమంటే క్రు మొనలోంచి మట్టి పలికినట్టుండాలి
చెమట ఆవిరిలోంచి మబ్బు పట్టినట్టుండాలి
వెయ్యి పిడికిళ్ళు ఒక్క లయలో ఉరిమితే
అది నినాదం
నగ్న నినాదం శబ్ద చైతన్యాన్ని తొడుక్కుంటే
అది కవిత్వం" అంటారు. అంతేకాదు. "ఒక్క బాష్పం చాలు, ఉన్న కవిత్వాలన్నిటికి బాసలు నేర్పడానికి" అంటూ కవిత్వానికి రూపకల్పన చేసారు సినారె. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సమాజం ఎప్పుడూ ముందుకే నడుస్తుందన్న శాస్త్రీయ భావన సినారె 'మంటలు-మానవుడు' కావ్యంలో ప్రతిధ్వనిస్తుంది అంటారు రాచపాళెం గారు.
"ప్రతీప శక్తులు అడుగడుగునా

ప్రభుత్వాన్ని నిరోధిస్తున్నా
మానవుడు ప్రగమిస్తున్నాడు.
మాపును చీలుస్తూ రేపును పిలుస్తున్నాడు"

పై సినారె కవితలో భవిష్యత్ మీద విశ్వాసం కన్పిస్తుందంటారు ఆర్సిఆర్.

ఉన్నవాడికి పన్నుల బరువు / లేనివాడికి ఆ సంపన్నుల బరువు" అంటూ 'మనసు విప్పితే' కవితలో మనసు విప్పారంటారు. సమస్యను ఏకరువు పెట్టగానే కవి బాధ్యత తీరిపోదు. పరిష్కారం కూడా కవే అన్వేషించాలి. అందుకే 'పొద్దు పొడుపు' కవితలో ఈ సమస్యకు పరిష్కారం సమసమాజ ఆవిర్భావమేనని సినారె నిర్ద్వంద్వంగా ప్రకటించారన్నారు.

"ఏ ఒక్క నొసటనో పొద్దుపొడవొద్దు
ఏ ఒక్క నోటికో ముద్ద దొరకొద్దు
అన్ని నొసళ్ళకూ కావాలి పొద్దు
అన్ని నోళ్ళకూ అందాలి ముద్ద"

అందరి ఆకలి తీరాలన్న అభ్యుదయ భావన సినారె పల్కులలో ప్రతిధ్వనించిందంటారు.

అభ్యుదయ కవిది నిరంతర పరివర్తనా సిద్ధాంతం. అభ్యుదయకవికి ప్రగతిశీల మార్పు ఆకాంక్ష. పాతకు వీడ్కోలు కొత్తకు ఆహ్వానం ప్రగతిశీల కవి కర్తవ్యం అంటారు రాచపాళెం. అందుకే సినారె 'కొత్తముఖం తొడుక్కో కవితలో "పాతముఖాన్ని బహిష్కరించి కొత్తముఖాన్ని ఆవిష్కరించాలని" ప్రతిపాదించాడంటారు. స్తబ్దతను బద్దలుకొడుతూ చలనాన్ని రగిల్చడం అభ్యుదయ కవిత్వ లక్షణం. చైతన్య ప్రబోధం అభ్యుదయ కవికి శ్వాసం అందుకే...

"చైతన్యమున్న మనీషి స్పందించక ఏమవుతాడు?
హృదయమున్న మనిషి ఎదురుతిరగక ఏం చేస్తాడు" అని సినారె ప్రశ్నించాడన్నారు. తరతరాలుగా సాగుతున్న దోపిడీవ్యవస్థకు చరమగీతం పాడడం అభ్యుదయ కవిత్వం పరమలక్ష్యం. దోపిడీ వ్యవస్థను కూకటివేళ్ళతో పెకలించి, దాని స్థానంలో దోపిడీలేని సమాజాన్ని నిర్మించడమే అభ్యుదయకవిత్వ స్వప్నం. అందుకే సినారె

"మొత్తం సొత్తును గుత్తగా దాచుకున్న
ఊడలమర్రికి తావులేదు
సమతావాదం పరశువుగా
పరిక్రమిస్తున్నది
వేలాడే ఊడలేకాదు
వేళ్ళకు వేళ్ళే తెగిపోతాయి
మర్రిచెట్టు కోట గట్టిన చోట
మామిళ్ళు తలలెత్తుతాయి"

మార్పు మీద విశ్వాసం ప్రకటించాడు. అయితే ఈ విశ్వాసం ఇంకా నిజం కావలసి ఉంది అంటారు రాచపాళెం.

అభ్యుదయకవికి వర్గసమాజ స్వభావం లోతులు తెలుస్తాయంటారు. "నీకు నాకు ఏం పోలిక?" కవితలో సినారె.

"నీకు తెలియదు శ్రమలోని రుచి
నీకు తెలిసిందల్లా ఇంద్రజాల
పదవివల్ల దక్కిన శచి
అమృతం కొనగలుగుతావు గానీ
అంబలి కొనగలుగుతావా?"

వేసిన ప్రశ్న సమాజానికి వేసిన ప్రశ్నగా భావించాలి. సంపన్న, పేదవర్గాల జీవన విధానంలోని తేడాను సినారె చక్కగా విశ్లేషించిన వైనాన్ని ప్రస్తావించారు.

"కోట్లు కోట్లు గడించినా చీట్లపేకమేడ
నీ బతుకు అర్ధరూపాయి సంపాదించినా
అమృతతుల్యం నా మెతుకు"

కవి కలం యోధుడు. కాలరథాన్ని సిరా తాడుతో ముందుకు లాగుతాడు కవి. ప్రగతివాది అయితే ముందుకు, కాకపోతే వెనక్కి నడిపిస్తాడు. అభ్యుదయ కవిది 'పదండి ముందుకు' అనే తత్త్వం. "పాతముఖాన్ని లాండ్రీలో పారేసి / కాకుంటే మ్యూజియంలో దాచేసి / కొత్త ముఖం తొడుక్కో" అంటూ మనుషుల్ని ముందుకు నడిపించే అభ్యుదయ కావ్యంగా 'మంటలూ -మానవుడు'ని పేర్కొని కవిత్వ తత్త్వాన్ని వివేచించారు.

నేటికీ ముఖం మొత్తని 'ముఖాముఖి'లో సినారె సృజించిన

"రగులుతున్న పంక్తులు
పగుళ్ళు వారిన పాదాలు
నెత్తురోడ్చే అక్షరాలు
కత్తి మొనలాంటి కవిత"

పంక్తులను అభ్యుదయ కవితకు అందమైన నిర్వచనంగా ఆర్సిఆర్ గారు పేర్కొన్నారు. అభ్యుదయకవికి అవినీతిరహిత, ఆకలిరహిత భారతదేశం ఒక స్వప్నం.

శ్రమ జీవులు చెమట బిందువులను జాతిరత్నాలుగా తలచేది మంచికి నిలబడ్డ మనిషిని మహర్షిగా కొలిచేది" ఈ భావనే అభ్యుదయకవుల భారతదేశ స్వప్నంగా పేర్కొన్నారు ఆర్సిఆర్ గారు. అభ్యుదయ కవికి మనిషే వాస్తవం. మానవుడే చరిత్ర నిర్మాత. సినారె అనేక కవితలలో మనిషిని వస్తువును చేశారు. 'ముఖాముఖి'లో 'ఒకే ఒక్క దీపం' కవిత సినారె మానవ కవితలలో ఒకటి. ప్రకృతిలోని సూర్యుడు, చంద్రుడు అనే దీపాల కన్నా, మనిషి అనే దీపం మిన్న అని సినారె ఈ కవితలో ప్రతిపాదించాడంటారు. ఆ మనిషి ప్రగతిశీల మానవుడు. ఆ దీపం "నీతికి గోరి కడితే నిప్పులు కక్కుతుంది" అని నిర్వచించడంలో ఉద్యమ మానవుడే ఉన్నాడంటారు. అభ్యుదయ కవులు ప్రజలకు చైతన్యాన్ని ప్రబోధిస్తారు. ప్రజాఉద్యమాలను సమర్థిస్తారు. అందుకే వాళ్ళు ప్రజాకవులు అయ్యారంటారు.

"అచ్చమైన జీవితం - అనుకరణంలో లేదు
ప్రతిఘటనంలో ఉంది - నిజమైన వ్యక్తిత్వం
భజనలో లేదు - సృజనలో ఉంది"

అని సినారె 'ముఖాముఖి'లో ప్రతిఘటనం కవితలో చైతన్య ప్రబోధమే చేశారన్నారు

పదునైన భావాలను అనువైన పదాలలో అభివ్యక్తం చేయడం ఏ కవికైనా తెలియాల్సిన విద్య. పద్యకవి ఛందస్సులో తేలియాడతాడు. వచనకవికి ఆ అవకాశం లేదంటారు. సినారె పద్య, గేయ వచన కవితలలో రాటుదేలిన కవి. శబ్దం మీద పదసంయోజనం మీద పట్టున్న కవి. ప్రాసకోసం ప్రయాసపడని కవి సినారె. సినారె కవిత్వం నిండా ప్రాసలుంటాయి. అవి సహజంగా కవి కలం ముందు వాలిపోతాయంటారు. పద్యంలోని ప్రాసను సినారె, వచన కవితలోకి తీసుకొచ్చి అందమైన ఊపును సాధిస్తారు. లయ అంతఃసూత్రంగా ఉంటుంది. ఈ ప్రాసవల్ల సినారె వచన కవిత్వ పదాలు ద్విపదరూపంలో ధరిస్తాయంటారు. సినారె రెండేసి పాదాలకు ఒక్కో ప్రాసాక్షరం పెడతారంటారు.

"పచ్చి మొగ్గలుగా ఉన్నప్పుడే
గుచ్చుకుంటున్న ముళ్ళను చూసి
తూర్పు ప్రసవించిందిప్పుడు
ఊర్పు ప్రణవించిందిప్పుడు" లాంటి ఉదాహరణలుగా పేర్కొన్నారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

భావాభ్యుదయకావ్యం 'జలపాతం' లో 'మానవతా' అనే కవిత అచ్చమైన ఆధునిక కవితకు సినారె ఎగురవేసిన జెండాగా అభివర్ణించారు. సినారెకి ఒక చారిత్రక పరిణామాత్మక దృష్టి ఉందంటారు.

అణుజాలం నుండి అమృతం పిండిననాడే
నీకు విముక్తి మానవతా!

ఈ కవిత మానవజాతి నాగరికతను చారిత్రకంగా వర్ణించి, ప్రపంచశాంతిని కోరుకుందంటారు. సాంకేతిక విజ్ఞానాన్ని మానవజాతి శ్రేయస్సుకు ఉపయోగించుకోమని ప్రబోధించిందంటారు. సినారెను శాంతిప్రియుడైన అభ్యుదయ కవిగా అభివర్ణించారు ఆర్సీఆర్.

సినారె రాసిన గేయకావ్యాలలో 'విశ్వగీతి' ఒకటి. తెలుగు గేయానికి నాట్యం నేర్పిన కవిగా సినారెను అభివర్ణించారు ఆర్సీఆర్ గారు. గేయగర్భంలో దాగిన నాట్యగుణాన్ని పట్టుకున్న కవిగా సినారెను గుర్తించవచ్చు. గేయం తనంతట తాను ఎన్ని వయ్యారాలు పోతుందో ప్రదర్శించడమే గాక, గేయాన్ని తానెన్ని వయ్యారాలు తిప్పగలరో కూడా రుజువు చేశారు సినారె. ఇరవైమూడేళ్ళ వయసులో ఉప్పొంగే యవ్వనం లాగే ఎగిసిపడే తరంగం వంటి గేయకావ్యం రాశారంటారు.

"నా గీతం ప్రత్యణువున
నవభావం ముద్రించెను
నా గీతం రసగళాన
నాగస్వరములు దించెను"

అభ్యుదయ కవిత్వం ప్రధాన తెలుగు కవిత్వ స్రవంతిగా ఉన్న రోజులలో, వచన కవిత్వం ప్రధానవాహికగా రూపుదిద్దుకుంటున్న రోజులలో, ఆంధ్రరాష్ట్రం ఏర్పడి, విశాలాంధ్ర ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పడబోతున్న సంధి దశలో 'విశ్వగీతి' రాశారు సినారె. పంద్రెండు మాత్రల పాదాలతో సినారె ఈ కవితను పరుగులెత్తించారంటారు.

ఈ కవితలో మూడు పార్శ్వాలున్నాయంటారు. అవి 1. కవిలో విరిసిన గీతం తత్వం, 2. ఆ గీతం పుట్టినపుడు సమాజంలో వచ్చిన కదలిక, 3. సమాజంలోని వాస్తవాలను చూచి ఆ గీతంలో వచ్చిన కదలిక.

"అంబరాల చుంబించే - అంతరాల స్పర్శించే
జలధరాల అధరాంచల గళదింద్ర ధనుర్విచిత్ర
హాసం ప్రతిబింబించే గీతం నాలో విరిసెను
గీతం నాలో మెరిసెను"

ఉత్సాహం ఉరకలువేసే వయసులో కలంపట్టిన సినారె తన కవిత్వాన్ని నిర్వచించుకోవడంలో బీద పలుకులు పలకడు. కాల్పనికత జోడించిన హుషారైన మాటలే పలుకుతాడు. మొదట తనలోంచి దూసుకొచ్చిన గీతి ఎలా ఉంటుందో పేర్కొన్నారన్నారు. కవిలోంచి గీతం పుట్టగానే స్తబ్దత తొలిగిపోయి చలనం మొదలవుతుంటారు. కవిత్వానికి స్తబ్దతను ఛేదించి చలనాన్ని సృష్టించే శక్తి ఉంది. కవిలోంచి గీతం పుట్టగానే అప్పటిదాకా గుప్తంగా ప్రవహిస్తున్న చీకటి అగిపోయింది. కాంతి ప్రసరించింది. సమాజంలో వేర్లు దించుకున్న చెడు స్వస్వరూపంతో బయటపడింది. సూర్యునిలో దాక్కున్న ఏడువర్ణాలు విడివిడిగా ఆవిష్కృతమయ్యాయంటారు.

"ప్రళయానంతర సమయం - మొలకెత్తిన సృష్టివోలె
భగ్నభగ్నమని మండిన - పాత జగత్తున లేచెను
కొత్తదనం చిగుళ్ళుగా - మెత్తదనం గుబుళ్ళుగా
రూపొందిన నవజగత్తు - లో పొంగిన సమతా సం

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

గీతం విని పరవశులై - ఏతెంచిరి కళాప్రియులు
కర్షకులూ, కార్మికులూ- నిర్వాసులు, నిర్వ్రణులు
మానవతా నిర్మాతలు - సౌజన్య ప్రదాతలు
జగమంతా ఒక కుటుంబ ముగ కనువిందు దోచెను"

అసమ సమాజాన్ని సమసమాజంగా మార్చడంలో కవిత్వం భావజాల విప్లవం కలిగించడంలో క్రియాశీల పాత్ర నిర్వహిస్తుందని 'విశ్వగీతి' కావ్యం ప్రతిపాదించిందంటారు.

"అర్ధరాత్రి పుట్టిన సూర్యోదయాన్ని
అఖిల భారతం రుజువు చేసుకున్న
సురుచిర స్వప్నాన్ని
ఇంకా దాచడమెందుకు
నేను స్వాతంత్ర్యాన్ని"

అంటూ పాతికేళ్ళ స్వతంత్రం మీద సినారె సంతకం 'మనిషీ- చిలక' కవిత్వ సంపుటి. అభ్యుదయకవి ఆశాజీవి. నిన్నటికన్నా నేడు, నేటికన్నా రేపు బాగుంటుందన్నది అభ్యుదయ కవి విశ్వాసం.

"ఇంతటి చిమ్మచీకటి సంతలో
ఎలవెలుగుల తొలిరేక విరియనుందని
ఇప్పటికీ నమ్ముతున్నాను"

అన్నది అభ్యుదయకవి నమ్మకం అంటారు. "పండుటాకులు డుల్లిన కుదుళ్ళలో పసరుటాకులు మొలవడం ఉగాది" అంటారు సినారె. దారిద్ర్యం పోవడం, వివక్షపోవడం, అణచివేత పోవడం, అరాచకం పోవడం, అన్యాయం నశించడం, అవినీతి నశించడం ఇవీ అభ్యుదయకవికి ఉగాదులు అంటారు రాచపాళెం గారు.

సమరాలకు సమాధి అవుతున్నది / శాంతికి పరిణయం జరుగుతున్నది అన్న శాంతిప్రియత్వం సినారెది. 1965లో అనేక దృశ్యాల నుండి "అక్షరాల గవాక్షాలు" పేరుతో కవిత్వ సంపుటి వెలువరించారు.

"సురలకన్న కరుణాత్ముడు
నరుడుగాక ఇంకెవ్వడు
మందిరమెరుగని దేవుడు
మనిషిగాక యింకెవ్వడు"

అభ్యుదయ కవిత్వంలో మనిషి ప్రధాన వస్తువు మనిషి, అతని శ్రమ, దాని ఫలితం, మనిషి నిర్మించిన వ్యవస్థ, దాని స్వభావం, మనిషి నిర్మించిన చరిత్ర, దాని పరిణామం ఇదే ప్రధానంగా అభ్యుదయ కవిత్వం పలికేదంటారు. మనిషిని మానవతను అనేక కవితలలో కీర్తించిన కవి సినారె అంటారు. 'అక్షరాల గవాక్షాలు'లో సినారె మనిషి జీవితాన్ని అనేక కోణాల నుండి ఆవిష్కరించారన్నారు. అక్షరాలు అనే గవాక్షం నుండి పాఠకుడికి మానవ సమాజ వాస్తవికతను చూపించి ఆలోచించమంటారు.

"అంత కడివెడు పాలపై ఒ
క్కంత మీగడ పేరినట్లుగ
మనకు మిగులును గతములోపలి
మంచి - అదియె సంప్రదాయము"

అంటూ సినారె రచించిన తన తొలినాళ్ళ కావ్యం సమన్వయవాద 'సమదర్శనం'. సినారె స్వాతంత్ర్యానంతర తొలితరం ఆధునికత తెలుగుకవి. సినారె కవిగా కలంపట్టే నాటికి భారత స్వాతంత్రోద్యమ స్ఫూర్తి, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట స్ఫూర్తి సాహిత్యరంగం మీద ప్రభావం చూపుతున్నాయి.

అభ్యుదయ సాహిత్యం ప్రధాన సాహిత్య స్రవంతిగా ఉన్నా, అనివార్యంగా యువకవులు సంప్రదాయాన్ని తిరస్కరించకుండా ఆధునికతను ఆహ్వానించవలసి వచ్చింది. ఈ అనివార్యతనే సినారె 'సమదర్శనం'లో ప్రతిపాదించారు. సమదర్శనం సినారె సమన్వయదృష్టికి సంకేతంగా పేర్కొన్నారు.

సామాజిక తేజస్సుకోసం సినారె చేసిన తపస్సే "తేజస్సు నా తపస్సు"గా అభివర్ణించారు.

"ప్రతి కవితలో ఒక జ్వలిత చేతన ఉండాలి
అది పాఠకునిలో ఒక కల్లోలం కలిగించాలి
ఆ కల్లోలం సమాజంలోని విషమగతులకు ప్రతిద్వంద్విగా ఉండాలి.
ప్రగతి శక్తులకు బాసటగా రూపొందాలి"

అన్న సినారె ఇక్కడి లక్ష్యం స్వీయశ్రేయం కాదు - జగదేయపేయం అంటారు. సమాజశ్రేయస్సే కవిత్వ ప్రయోజనంగా నిర్వచించుకొన్న కవి తన సర్వేంద్రియాలూ సమాజ పునర్నిర్మాణానికే పని చేస్తాయని ప్రకటించుకున్నారు.

"వస్తున్నాను ఇదుగో
వస్తున్నాను
సుప్తిలాంటి శూన్యంలోకి కాదు
దీప్తి లాంటి చైతన్యంలోకి
బోధిసత్వునిలా కాదు
క్రోధి నిత్యునిలా" అంటారు సినారె.

వర్తమాన సమాజ స్థితిని వ్యంగ్యంగా చిత్రించిన వైనాన్ని ఆర్సెఆర్ అభ్యుదయకోణంలో స్పష్టం చేశారు.

"బువ్వపెట్టే అన్నపూర్ణను
బొరియల్లో దాచే వంచకుల నుంచి
ప్రాణాలు పోసే మందుల్లో
ప్రాణాలు తీసే కల్తీల నుంచి ...
జాతిని నంజుకు తినే సైతాన్ల నుంచి
దేశం ముందడుగు వేయాలి.
కాకుంటే దేశాన్ని
కణకణమండే నిప్పులతో కడిగేయాలి"

అంటూ సినారె ఇచ్చిన తీర్పు "మార్పు నా తీర్పు" రెండున్నర దశాబ్దాల భారతస్వాతంత్ర్యం మీద 1974లో అభ్యుదయకవి ఇచ్చిన తీర్పే ఈ కావ్యం అని పేర్కొన్నారు.

"శిశిరం నుంచి వసంతానికి
చీకటి నుంచి ప్రభాతానికి
నిరాశ నుంచి ఆశా శిఖరానికి
అశ్రుజలధి నుంచి ఆనంద తీరానికి
నడిపించే మార్పు
నేనిచ్చే తీర్పు"

అన్న సినారె ఆలోచనను ప్రగతిశీల తీర్పు, పురోగమన తీర్పు, అభ్యుదయ తీర్పుగా అభివర్ణించారు.

మనిషి అచ్చమైన ఆశాజీవి / ఇనుని కంటె ఉజ్జ్వలం అతని భావి / సామాన్య మానవుడే / ఈనాటి మనువు అంటూ సినారె అభ్యుదయగళం. 1968లో 'మధ్యతరగతి మందహాసం'గా వెలువరించారు.

"కడివెడన్ని కలల్ని తాగేసి
కడుపు నింపడం నేర్చుకున్నాను...
నవ్వుతున్న జీవచ్ఛవానికి
రవ్వలహారంలా వున్నాను
మధ్యతరగతి మనస్తత్వానికి
మాయని గాయంలా వున్నాను"

స్తబ్దంగా పడివున్న మధ్యతరగతిని తట్టిలేపడం అభ్యుదయ కవి కర్తవ్యం. స్తబ్దతను చలనంగా మార్చడమే అభ్యుదయ కవి చేసే పని అని ఆర్.ఎస్.ఆర్ గారు ప్రస్తావించారు.

"ఆత్మలను పలికించేదే ఆత్మభాష
ఆ విలువ కరువైపోతే అది కంఠశోష"
"పరుల కోసం పాటు పడని నరుని బతుకు దేనికని
మూగనేలకు నీరందివ్వని వాగుపరుగు దేనికని"

వంటి గజళ్ళను రాసి, పాడి తెలుగు సమాజాన్ని ఉర్రూతలూగించారంటారు.

"రేఖలో బొమ్మ పలికినట్లు / కేకలో అమ్మ పలుకుతుంది" అని సినారె అమ్మను ఆర్ద్రంగా చిత్రించిన వైనాన్ని ఆవిష్కరించారు.

ముగింపు: అభ్యుదయ కవి యధాతథవాది కాదు. మార్పును ఆహ్వానించే కవి. మార్పును ఆమోదించే కవి. సంఘర్షణ మార్పునకు మార్గమని నమ్మే కవి. నైరాశ్యాన్ని నిర్లిప్తతను ఆమడ దూరంలో పెట్టే కవి. సినారె నిరంతర కవే కాదు నిరంతర పరివర్తనాపేక్ష గల కవిగా రాచపాళెం గారు అనేక కోణాల్లో సినారె కవిత్వాన్ని అనుశీలనం చేశారు. సినారె పరమపదించినపుడు అభ్యుదయ గొంతు మూగబోయింది అని భాషించారు. నిరంతర చైతన్యశీలి సినారె కవిత్వాన్ని అభ్యుదయ తూకపురాళ్ళతో బేరీజు వేసి మార్పుకు ఆహ్వానించిన వైనాన్ని మరోచూపుతో కవిత్వాన్వేషణ చేసిన నిరంతర విమర్శక హాలికుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు.

**ఆధార గ్రంథాలు:**

1. ఆధునికాంధ్ర కవిత్వ సంప్రదాయాలు ప్రయోగాలు సి. నారాయణరెడ్డి
2. నిత్యచైతన్యశీలి సినారె - పోరెడ్డి రంగయ్య
3. సినారె కవిత్వానుశీలనం రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# "తేనె చుక్కలు" కవితా సంపుటిలో రవ్వలు సామాజిక వీక్షణం

**శ్రీమతి డి. కనక మహాలక్ష్మి,**
తెలుగు అధ్యాపకురాలు,
శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), తణుకు - ఆంధ్ర ప్రదేశ్.
ఫోన్: 86392 51531

**ఉపోద్ఘాతం:** "మనిషికున్న సామాజిక బాధ్యతలను, మానవీయ విలువలను పెంచి పోషించేందుకు తీపిగుళికల్లాంటి 'క్యాప్సిల్స్'గా 'తేనెచుక్కలు' అనే 'రవ్వల్ని' అందించారు" అన్నటు వంటి విశాలాంధ్ర దినపత్రిక ఎడిటర్ శ్రీ ముత్యాల ప్రసాద్ గారి మాటలను బట్టి దారితప్పుతున్న సమాజానికీ, దాన్ని నడిపిస్తున్న మనిషిలోని జబ్బును దారికి తెచ్చే అక్షరాస్త్రాలు, కవితాఖడ్గాలుగా ఈ కవితలను చెప్పవచ్చు. ఇవి శరీరానికి గాయం చేయవుగానీ, మనస్సును ప్రక్షాళనం చేస్తాయి. ప్రపంచీకరణ మనల్ని చుట్టుముట్టుతున్నవేళ ప్రపంచమంతా ఆవరించిన వ్యాపార విలువల నేపథ్యంలో సామాజిక, మానవీయ విలువలు లుప్తమవుతున్నాయా? అనే సందేహం కలగడం సహజం. ఈ వికృతికి చికిత్సలు, శస్త్రచికిత్సలు అందుబాటులోకి తీసుకువస్తున్నారు మన అక్షరవైద్యులు. అటువంటి వారిలో ఒకరు నారిశెట్టి వెంకట కృష్ణారావు.

రవ్వలు - సామాజిక వీక్షణం: సామాజిక సందేశాల 'రవ్వలు' తేనెచుక్కలు. సాధారణ వ్యక్తికి, కవికి వ్యత్యాసం ఉంటుంది. సామాన్యుడు ఒక్క విషయాన్ని చూసి, తర్వాత మర్చిపోతాడు. లేదా ఒక ఆలోచన చేస్తాడు. వెంటనే తన మస్తిష్కం నుంచి అది తరలిపోతుంది. కాని కవి దృష్టి వేరు. తాను గమనించిన, తన అనుభవంలోనికి వచ్చిన, తన ఆలోచనకు వచ్చిన అంశాన్ని గురించి మేధోమథనం చేస్తాడు. ఆ మథనంనుంచి వెలువడ్డ నవనీతమే ఈ కవిత్వం. భావసంఘర్షణ నుంచి వెలువడ్డ ఆలోచనలే మెరుపు కవిత్వం. కాలాన్నిబట్టి కవిత్వం తన రూపురేఖల్ని మార్చుకొంటుందని చెప్పటానికి భిన్నకాలాల్లో వెలువడ్డ కవితారూపాలే సాక్ష్యం. ఇటీవల కాలంలో, వెలువడిన లఘురూప కవితాప్రక్రియ 'రవ్వలు'. దీని సృష్టికర్త భూపతిరాజు విశ్వేశ్వరవర్మగారు. హిందీ సాహిత్యంతోపాటు తెలుగుసాహిత్యాన్ని కూడా మథించి కవిత్వం రచించిన వర్మగారు ఇటీవల 'రవ్వలు' పేరుతో ఒక కవితా సంపుటిని వెలువరిస్తూ ఆచార్య ఎన్వీకృష్ణారావుగారిని ముందుమాట రాయమని అడిగితే తన అభిప్రాయాల్ని వెల్లడిస్తూ, తానుకూడా 'రెండు రవ్వలు' రాల్చటం

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

అభినందనీయమైన అంశం. అంటే వర్మగారి ప్రయత్నం కృష్ణారావు గారి ద్వారా సఫలమైందని భావించవచ్చు. తన కవిత్వానికి వారసుని సంపాదించుకోగలిగిన వర్మగారి కృషి సార్థకమైంది.

కవిత్వ రచన కృష్ణారావుకు కొత్తకాదు. కవితా సంపుటాల్ని వెలువరించటమే కాకుండా పలు కవి సమ్మేళనాల్లో పాల్గొన్న అనుభవజ్ఞుడు. ఆధునిక కవితా ప్రక్రియగా వెలువడ్డ 'రవ్వలు'ను 'తేనెచుక్కలు'గా మలచి రచనలో తన భావుకతను, అనుభవాన్ని, విజ్ఞానాన్ని జోడించాడు. సాహిత్యం సామాజిక సందేశ దీక్షతో సాగాలనే అభిప్రాయానికి అనుగుణంగా రవ్వలు ప్రక్రియను సాగించాడు. ఈ కవితా సంపుటిలో రెండు వందలకు పైగా 'రవ్వలు' ఉన్నాయి. అవన్నీ ఎదో ఒక సామాజిక అంశాన్ని స్పర్శించినవే.

"మంచి మాట ఎక్కని
చక్కని బాట పట్టని
మేటి లోచన చెయ్యని
మనిషి బ్రతుకు కష్టమే" అని సామాజిక వాస్తవాన్ని పాఠకులకు ప్రబోధం గావించాడు. మనిషి జీవితం సార్థకం కావాలంటే మంచి మాటల్ని వినాలి- ఆచరించాలి. అలాగే మంచి ఆలోచనతో సాగాలి. మనిషి మనసు మంచిదైతే అతని జీవితం కూడా మహత్తరంగా సాగిపోతుంది. ఈ విషయాన్ని అల్పాక్షరాల్లో 'అనల్పార్థ రచన' అనే మాటలు సార్థకమయ్యేరీతిలో రచించాడు కవి.

ఆధునిక కాలంలో వినిపిస్తున్న మాట 'వ్యక్తిత్వవికాసం'. సాహిత్యం వ్యక్తి మానసిక వికాసానికి దోహదం చెయ్యాలి. అంటే ప్రజలలో మంచి భావాల్ని పెంపొందింపచెయ్యాలి. మంచి మార్గంలో నడిచేటట్లు చెయ్యాలి. ప్రాచీన సాహిత్యాన్ని కూడా మనం జాగ్రత్తగా పరిశీలన చేస్తే ఆయా గ్రంథాల్లో వ్యక్తిత్వ వికాస సూత్రాలు మనకు కనిపిస్తాయి. ఆధునిక కాలంలో కథా వస్తువులు తగ్గిపోయి విషయ ప్రాధాన్యంతో కవిత్వ రూపాలు వస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాయి అని చెప్పటానికి కృష్ణారావు రచించిన రవ్వలు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని చెప్పటం సముచితం. ఆ కోవలో స్నేహ మాధుర్యాన్ని వివరిస్తూ -

"కల్పించేవాడు కవి
కవ్వించేవాడు శత్రువు
కూడదన్న వాడు మిత్రుడు
స్నేహ గీతం ఆనంద భైరవం". ఈ కవిత ద్వారా శత్రువు కవ్విస్తున్నా వైరం తగదని మిత్రుడు ప్రబోధం చేస్తాడని సామాజిక సందేశం ఇచ్చాడు కవి. స్నేహం ఆనందం ఇస్తుందని వైరం విషాదాన్ని కలిగిస్తుందని ఈ కవిత ద్వారా స్పష్టం చేశాడు కవి.

"యుగం ఏదైనా
ప్రాంతం ఏదైనా
కాలం ఎప్పుడైనా
వ్యక్తిత్వమే వజ్రం". వ్యక్తిత్వం వజ్రం లాంటిదని చెప్పటం ద్వారా రచయిత వ్యక్తిత్వాన్ని చక్కగా రూపొందించుకోవాలని, దాన్ని కాపాడుకోవాలని, ఏ ప్రాంతంలోనైనా ఏ కాలంలోనైనా వ్యక్తిత్వాన్ని వదులుకోకూడదని తన సహజ రీతిగా భిన్నంగా మసులుకోకూడదని ప్రబోధం చేశాడు.

కవిత్వం ద్వారా సామాజిక సమస్యలూ, భావాలూ ప్రస్ఫుటమవుతాయని మనకు తెలుసు. వాటిని ఒక్కొక్కరు ఒక్కోరీతిలో చెబుతారు. కొందరు ఆవేశం, అవేదనలను ఆయుధాలుగా చేసుకుంటారు. కృష్ణారావు మాత్రం ఆలోచనలను ఎంచుకున్నారు. చాలా

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

సూటిగా, నిక్కచ్చిగా విషయాన్ని ఈ తేనెచుక్కలు మనకు అందిస్తాయి. తేనెచుక్కలు రుచి ఎంతో బాగుంటుంది. అదే సమయంలో అది ఔషధంగానూ పనిచేస్తుంది.

"చంద్రుడన్నావ్
అంగారకుడన్నావ్
అంతరిక్ష శోధనన్నావ్
ముందు ఆత్మశోధన చేసుకో" అంటాడు కవి. నిజమే, అంగారకుడిని అందుకున్నా, నేడు అదృశ్య శత్రువు కరోనాను జయించలేని నిస్సహాయస్థితిలో ఉన్నాడు మానవుడు. ఈ కరోనా మహమ్మారి విజృంభణకు కారణం ప్రకృతిని విధ్వంసం చేసి జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నది మనిషేగదా! సమస్త జీవులతో సహజీవనం మరచి మనిషి చేస్తున్న పనులే అతని పతనానికి పునాది వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ తేనెచుక్కలు చదివినప్పుడు అవి చురకత్తులై మన మనస్సును కదిలిస్తాయి. కష్టనష్టాలు మనిషికిగాక మానులకు వస్తాయా? జీవితమంటేనే సవాల్. దాన్ని ఎదిరించి ముందుకు సాగడమే నాగరికతకు మార్గం. గతంలో ఎన్నెన్ని మహమ్మారులను మనిషి చూడలేదు. ప్లేగ్, కలరా, మశూచిని తిప్పికొట్టిన మనిషి కరోనాను కట్టడి చేయలేదా! అందుకే..

"చీకటి సగం
వెలుగు సగం
సగం సగం సంపూర్ణం
చీకటి వెలుగులే జీవితం" అంటాడు కవి.

స్త్రీకి మనోవైజ్ఞానిక వికాస అవసరాన్ని చాలా మంది నొక్కి చెప్పారు. మానవ జీవితం, వివాహ వ్యవస్థను విడాకుల కిందకు దిగజాజర్చడంపై నిరసన తెలిపారు. స్త్రీ పురుషులు ఒక్కటైతేనే జీవితం, జననం, ఈ విశ్వం అని స్పష్టం చేస్తాడు కవి.

స్త్రీ సగం
పురుషుడుజి సగం
సంగం విశ్వజనీనం". మనిషి ఎంత ఆధునికుడైనా, అంతరిక్ష విజ్ఞానాన్ని సముపార్జించినా. అతనికి బతుకుదెరువునిచ్చేది వ్యవసాయం. ఆ పని చేసేది రైతు. రైతు లేనిదే ప్రగతి లేదు. కానీ నేడు మనం రైతుకు ఇస్తున్న ప్రాధాన్యత శూన్యం.

"పొలంలో పిలకా లేదు.
ఇంట్లో మొలకా లేదు.
కుటుంబానికి కునుకూ లేదు.
రైతు బతుకు నరకం" అంటాడు కవి. నిజమే, అన్నదాత ఆత్మహత్యలను నిలువరించే నాథుడేడి? ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి రవ్వ ఒక నిప్పురవ్వే. మన మెదళ్లను తొలుస్తుంది. ఈ తేనెచుక్కలు సమాజానికి స్వస్థత చేకూర్చేందుకు వదిలిన అక్షరాస్త్రాలు. శ్రీశ్రీ 'రెక్కవిప్పిన రెవల్యూషన్' అన్నారు. తెలుగు కవిత్వం ఎన్నెన్నో ప్రక్రియలు, ప్రయోగాలతో పరిపుష్టమౌతుంది. ఈ ప్రక్రియలు, ప్రయోగాలు కవిత్వాన్ని మరింత పదునెక్కిస్తున్నాయి.

తాత్విక సాంద్రతకు కొదువలేదు. వస్తువిస్తృతికి పరిధి లేదు. క్లుప్తత ప్రధాన లక్షణంగా సాగుతున్న ఈ రవ్వలు విస్తృత వ్యాఖ్యానికీ, విశ్లేషణకూ అవకాశం కల్పిస్తున్నాయి. సామాజిక వైరుధ్యాల ప్రకటన, ప్రాకృతిక, అనుభూతిపరమైన స్పందన, జీవిత సంఘటనల్లోని తాత్వికత ఈ రవ్వల్లో కవి రంగరించాడు.

"ప్రతిదీ తేలికగా తీసుకోకు
అంతా సీరియస్ గా పట్టుకోకు
సందర్భాలు గుర్తించు.
'బి' పాజిటివ్ 'డూ ' పాజిటివ్ " అనే కవితలో మనిషి అనుకూల దృక్పథాన్ని ఏర్పరచుకోవాలని చెప్పటమే కాకుండా విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయించుకుంటే

జీవనయానం చక్కగానే సాగుతుందనే ప్రభోధాన్ని నిక్షిప్తం చేశాడు. ఆధునిక కాలంలో ప్రతి విషయంలోనూ నైపుణ్య ప్రతిభను ప్రదర్శించిన వారే విజయాలను సాధిస్తున్నారు. అందుకే కవి

"రౌతు నైపుణ్యం గుర్రం పరుగు,
రైతు నైపుణ్యం పంటల మెరుగు,
రాజు నైపుణ్యం ప్రజల వెలుగు
నైపుణ్యం మహా మంత్రం" అనే కవితను రచించాడు. సమాజంలో సాటి మనిషిని పట్టించుకోవాలని, తనకు ఉన్నదానిలోనే ఇతరులకు పంచాలని, అదే పరమార్థమని చెబుతూ..

"సంపాదించిన దానిలో దాచు
దాచిన దాన్లో పంచు
పంచితేనే పరమార్థం
పరోపకారం దైవగుణం" అని పరోపకార గుణాన్ని ప్రబోధం చేశాడు. "సొంత లాభం కొంత మానుకు పొరుగువారికి తోడుపడవోయి" అన్న గురజాడ మాటలు ఇక్కడ స్ఫురించక మానవు. మనిషి సుఖంగా ఉ ండాలంటే ఉన్నదానితో తృప్తి పడాలి. అందుకే పోతన గారు "తృప్తింజందని నరుడు సప్త ద్వీపములనైనన్ జక్కంబడునే" అంటాడు. అందుకే కవి..

"ఆస్తి మూరెడు
ఆశ బారెడు
ప్రపంచమంతా కావాలి
అసంతృప్తి చంపే జబ్బు" అనే కవితను రచించాడు. అసంతృప్తి మానవుడిని పీడిస్తూ చావుకి కారణం అవుతుంది. కాబట్టి తృప్తితో జీవించాలనే పరోక్ష ప్రబోధం గావించాడు. ఆధునిక సమాజాన్ని పట్టిపీడిస్తున్న సెల్, టీవీ, కల్తీ, అమానవీయ విలువలు మొదలైనవన్నీ ఈ కవితా సంపటిలో మన ముందు సాక్షాత్కారిస్తాయి. సమాజంలో భిన్న తత్వాన్ని కవితా వస్తువులుగా స్వీకరించి రచించిన కవి ప్రాపంచిక దృక్పథం అభినందనీయం. కవిత్వం సహజంగా సంక్రమిస్తుందని ప్రయత్నిస్తే సాధ్యమయ్యేది కాదని పెద్దల భావం. ఆ ఆలోచనని మరొకసారి జ్ఞాపకం చేస్తూ..

"చూసే ప్రతివాడు చూపరికాడు
చెప్పే ప్రతివాడు నేర్పరికాడు
రాసే ప్రతివాడు కవిగాడు
కల సహజ వరం" అనే కవితలో వ్యక్తం చేశాడు. అందుకే పెద్దలు కవులు పుడతారు, విమర్శకులు తయారవుతారు అని చెప్పారు. కవిత్వం సహజసిద్ధ ప్రతిభతో వెలువడుతుందనే వాస్తవాన్ని కవి వాక్కుల ద్వారా మనం గుర్తించవచ్చు. సమాజంలోని అనేక విషయాలని నిశితంగా పరిశీలించి వాటిని కవిత్వంగా మలిచాడు కవి. అలాగే రైతు ధైర్యాన్ని కళ్ళకు కట్టినట్లు కవి తన రవ్వల ద్వారా చూపించారు.

"కళ్ళల్లో పొలం
గుండెల్లో పొలం
మనుషుల్లో పొలం
మాట పడిపోయింది" అంటూ తన అస్తిత్వాన్ని పొలంతో నింపుకున్న రైతుకి మిగిలింది మాటల్లో చెప్పలేనంత విషాద జీవితమే అంటాడు కవి. వ్యవసాయం ఎదుర్కొంటున్న కష్టాలను నిత్యం తిలకిస్తున్నాయి కళ్ళు. చేతికందాల్సిన ఫలం కడుపు కోత మిగిల్చినప్పుడు గుండె రోధించింది. పొలం చుట్టూ లతల అల్లుకున్న బ్రతుకు ఆశలు అడియాస అయినప్పుడు మనసు కుమిలిపోతుంది. ఇక్కడ కవి ఎంత చమత్కారంగా రైతు దుస్థితిని

వర్ణిస్తూ, కళ్ళల్లో గుండెల్లో మనుషుల్లో పొలం ఉంది గాని పొట్టలో లేదు. వాస్తవానికి పొలం అవసరం పొట్టకే కదా!.

అలాగే స్త్రీకి జరుగుతున్న అగౌరవాన్ని మరో రవ్వలో ప్రతీకత్మకంగా చెప్పారు.

"సరస్వతి పార్వతి
దేవతలు కాదు అమ్మలు." అనడంలో ప్రతి స్త్రీ మనల్ని కన్న తల్లికున్నంత ఔన్నత్యం కలిగి ఉందని చెప్పటమే ఈ రవ్వ ప్రధాన ఉద్దేశం.

"జీవితం గొప్పది
జీవించాలి జీవింపజేయాలి
జన జీవితం ఇంకా గొప్పది
జనాలు లేని సమాజం ఎక్కడిది" జనజీవన హితం సమాజ హితం అవుతుంది. జగత్తు అప్పటికి మురిపింపజేసిన స్థిరంగా నిలబడదు. వాస్తవికత కావాలి. వాస్తవికతకి దగ్గరగానున్న కవిని, కవిత్వాన్ని జనాలు ఆదరిస్తారు. అనుకరిస్తారు. అలాంటి జనం గురించి చెబుతూ

"నువ్వూ నేనూ మనం
వారూ వీరూ జనం
జనం జనం ప్రభంజనం
జగతికి ఉనికి జనమే.." ప్రభంజనం రావాలంటే జనం జనం కదం తొక్కుతూ చేయి చేయి కలిపి ముందుకు నడవాల్సిందే. జగతికి జీవనం జనమే అని చెప్పడంలో జనం లేని రాజ్యం శూన్యం అనే అంతః సూత్రం దాగి ఉంది. మరి జన జీవితం ఎలా ఉండాలనుకుంటున్నారంటే-

"పుట్టావా మనిషివి
చచ్చేవా పీనుగువి
మధ్య ఎంత పోరాటం
మనీషిగా మరణించు "బతుకుతో పోరాడితే గాని మనీషిగా ఎదగలేడు. అందుకు పోరాటపటమను సంతరించుకోవాలి. తన బ్రతుకు అవసరాలకి పోరాటం తప్పనిసరి.

"పత్తి చేలో
విత్తు వేస్తే
నెత్తురు పూసింది
నమ్మకం ఎండమావి" అంటాడు కవి. అన్నివేళలా అన్నిచోట్ల అందరిలోనూ నమ్మకం ఎండమావిగామారుతున్న ఈ రోజులలో నమ్మకం ఎంత అవసరమో చెప్తుంది ఈ కవిత. పత్తి చేలో విత్తు వేస్తే పత్తి పూయాలి గాని నెత్తుర పూయడమేమిటి? అవును, ఇప్పుడు సంభవిస్తున్న విపత్తులు, మార్కెట్ మోషాల మధ్య రైతు కంట కన్నీరు కాదు నెత్తురు చుక్కలు కారుతున్నాయి

"నేటి పాలనలో
బక్క రైతు బలవలేదు
దిగిన బతుకు ఎదగలేదు
రైతు జీవితం ఎంత వెటకారం". అలాగే సగటు మనిషి జీవితాన్ని ఉటంకిస్తూ...

"ఉన్నవాళ్లకి బొమ్మల కొలువు,
లేని వాళ్లకు బతుకులు బరువు,
మధ్య వాళ్లవి మజ్జిగ బతికులు
సమన్యాయం ఎక్కడా లేదు". సమన్యాయం కావాలంటున్న కవి ప్రగతి కారకుడే. అలాగే చరిత్రకి కొత్త భాష్యం చెబుతూ... "పుట్టిన నాడు పాపాయి/ పెరిగితే యువకుడు/ ముదిరితే ముసలి/ అనుభవమే చరిత్ర" అనడంలో అనుభవం నేర్పే పాఠాల చారిత్రక విశిష్టతని

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

తెలియజేస్తాయి. ఇన్ని కష్టాలు మధ్య మనిషి వ్యక్తిత్వాన్ని నింపుకొని ఆత్మవిశ్వాసంతో సాగడమే జీవన పోరాటం అంటాడు కవి .

ముగింపు: రచయిత స్పృశించని కోణం లేదు. ఆధునిక విద్యా విధానాన్ని, సామాజిక దురాచారాల్ని, అవినీతిని, అత్యాచారాలను, కాలుష్యాన్ని, కల్తీని.. ఇలా అన్నింటిని చురుక్కు మనిపించారు. తన కవితలు ద్వారా దయనందన జీవితంలో మనిషి ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను రవ్వ అనే చిన్న అద్దంలో చూపించారు. ఎంత పెద్ద కొండనైనా మనం చిన్న అద్దంలో చూడవచ్చును. ఎంత పెద్ద సమస్య అయినా బుల్లి రవ్వల్లో చదవవచ్చు. 'మట్టి' స్వరూపాన్ని గుండెల్లో దాచుకొని పూచిన పూలు 'రవ్వలు' ఒక ఆలోచనను తళుక్కున మెరిపిస్తాయి. బియ్యం ఉడికిందో లేదో చూడటానికి అన్నం అంతా తినాలా? ఒక మతికి చాలదు? కవిత్వం ఎంత పండిందో కూడా తెలుసుకోవడానికి చిన్న రవ్వ చాలు. ఈ కవితా చంపటిలో కృష్ణారావు గారి కలం నుండి వెలువడిన తేనె చుక్కలు కవితా సంపుటిలోని రవ్వలు మొత్తం సామాజిక బాధ్యతను ఎరిగి సమాజంలోని వ్యక్తుల ఆలోచనల్లో మెరుపుల్లా చైతన్యం అనే రవ్వలు మెరిసాయనడంలోనూ, సామాజిక బాధ్యతను గుర్తు చేసాయనడంలోనూ సందేహం లేదు.

**ఆధార గ్రంధాలు:**

1. తేనె చుక్కలు (రవ్వలు-2 )
2. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధంతాలు
3. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు -ప్రయోగాలు. -ఎన్ . వి . కృష్ణా రావు, ఆచార్య వెలమల సిమ్మన్న -ఆచార్య సి. నారాయణ రెడ్డి.

## "విజయవాడ పౌరులారా! కవిత అనుశీలన"

**డా||సముద్రాల ప్రిస్కిల్ల**
తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల రాజమండ్రి, 533103
Cell: 7075091195
email id: priskilla.samudrala@gmail.com

**ఉపోద్ఘాతం:** ఆరుద్ర పూర్తి పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి. ఈయన విశాఖపట్నంలో 1925 ఆగస్టు 31న జన్మించాడు. ఈయన అభ్యుదయ రచయితల సంఘం వ్యవస్థాపకుల్లో ఒకడు. త్వమేవాహం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, కథలు నవలలు, గేయాలు, గేయ నాటికలు, పీఠికలు, సినీ గీతాలు, వంటివి రాసి తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి చేశాడు. ఆరుద్ర నిత్యపరిశోధకుడు, హేతువాది. ఈయన రాసిన కవితల్లో "విజయవాడ పౌరులారా" అనేటటువంటి కవిత గురించి ప్రస్తావన చేసుకొని నేటి కాలానుగుణంగా ఈ కవిత ప్రాముఖ్యతను గుర్తించవలసిన అవసరం ఉంది.

వ్యాస ఆవశ్యకత: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పరిపాలన రంగంలో భాగంగా విజయవాడ నగరాన్ని రాజధానిగా ప్రకటించాలని, మద్రాసు ప్రెసిడెన్సీ నుండి విడిపోయిన తరువాత రాజధానిగా విజయవాడ నగరం ఉండాలని కాంక్షించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. జస్టిస్ వాంఛూ కమిటీ క్షేత్రస్థాయి పర్యటన చేసి విజయవాడ నగరాన్ని రాజధానిగా నియమించడానికి సిఫారసు చేసింది. ఈ ప్రాంతం రైలు, జల, రోడ్డు రవాణా మార్గాల ద్వారా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు అనుసంధానమై ఉందని పరిపాలనకు అనువుగా ఉంటుందని భావించడం జరిగింది. కొందరు అనుభవజ్ఞులు ప్రస్తుత కాల పరిస్థితుల దృష్ట్యా విజయవాడ రాజధానిగా రావాలని 60 సంవత్సరాల కల అని భావించారు. అయితే అంతకుముందే మొదటగా తెలుగు కవిగా ఆరుద్ర విజయవాడ రాజధానిగా కాంక్షించడం గమనార్హమైన

విషయం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్ట్యా, విజయవాడు నగర విపత్తు దృష్ట్యా ఈ "విజయవాడ పౌరులారా" అనేటటువంటి కవిత పరిశీలన చేయడం అత్యంత అవశ్యకం.
శీర్షికోపయుక్తం: స్వాతంత్ర్యానంతరం ఎన్నికల నిర్వహణలో తెలుగు కవులు బాధ్యతాయుతమైనటువంటి కీలకపాత్రను వహించిన విషయం భావి భారత నిర్మాతలుగా శిల్పులుగా వారి పాత్రను గుర్తించిన విషయం ఈ కవితలో స్పష్టంగా కనిపిస్తుంది. "విజయవాడు పౌరులారా" అనే ఈ కవిత కవుల కృషికి నిదర్శనంగా, తెలుగు కవులు భావిభారత శిల్పులు అనే భావనను స్వీకరిస్తూ "విజయవాడు పౌరులారా కవిత అనుశీలన" అనేటటువంటి శీర్షిక పెట్టడం జరిగింది.
కవితా సందర్భం: స్వాతంత్ర అనంతరం 1953వ సంవత్సరంలో మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. విజయవాడు రాజధానిగా ఉండాలని కొందరు, కర్నూలు రాజధానిగా ఉండాలని ఇంకొందరు భావించారు. ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే ఆంధ్రరాష్ట్ర అవతరణకు ముందే 1951వ సంవత్సరంలో హరింద్రనాథ్ చటోపాధ్యాయ పార్లమెంటుకి స్వతంత్ర అభ్యర్థిగా విజయవాడ నుంచి నిలబడ్డాడు. ఈ సందర్భంగా ఆరుద్ర బాధ్యతగల కవిగా విజయవాడ పౌరులకు కవిత్వం ద్వారా విజయవాడ రాజధాని గురించి ప్రకటనాత్మకంగా ఉద్దేశించి ఎన్నికల గురించి నిర్వహణతో రాసిన కవిత ఈ కవిత రాశాడు.

కవిత విశ్లేషణ:
అభ్యర్థుల యోగ్యత
- పార్లమెంటు ఎన్నికల అభ్యర్థిత్వం
- అభ్యర్థుల రకాలు
- జాతిపిత ప్రస్తావన
- నాటి సామాజిక స్థితులు
- స్వాతంత్ర్యం - కాంక్షించిన సంస్థ

తెలుగు కవుల పాత్ర
నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి ప్రకటనం: విజయవాడ నగర పౌరులకు విజయవాడ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నిలబడినటువంటి హరేంద్రనాథ్ చటోపాధ్యాయ తరపున కవి తన గళము, కలము విప్పి విజ్ఞాపనతో అభ్యర్థిత్వాన్ని స్వీకరించమని నివేదించిన కవిత ఇది. స్వార్థ రాజకీయాల వల్ల గోవు లాంటి సాధువులైనటువంటి పేదల కన్నీళ్ళు కుంభవృష్టిగా కురుస్తున్నట్టు ఉంది. కాబోయే విజయవాడ నగరంలో కవిగా నేను (ఆరుద్ర) నిలబడ్డాను. ఉదయించే రవిగా (హరేంద్రనాథ్ చటోపాధ్యాయ) అభ్యర్థిగా నిలబడ్డాడు, అని ప్రకటన పూర్వకంగా చేసినటువంటి కవిత "విజయవాడ పౌరులారా!".
అభ్యర్థుల మధ్య తేడాలు: ఈ కవితలో ఆరుద్ర రెండు రకాల మనస్తత్వాలు కలిగిన, అభ్యర్థిత్వం కోసం విభిన్న దృక్పథాలు కలిగిన అభ్యర్థులను గుర్తించి విశదీకరించాడు కవి. అబద్ధాలు వల్లించి, స్వలాభం ఆశించి, సాకులతో కాలం గడిపేస్తూ ప్రజలను మభ్యపెట్టే వారిని ఆసేతు హిమాచలం హిమాచలం (అనగా భారత దేశమంతా) అభివృద్ధి అభ్యర్థులుగా నిలబెటారని నిజాయితీపరులకు చోటు దక్కలేదని వాస్తవీకరించారు. ఆరుద్ర అభిప్రాయం ప్రకారం గుర్తించిన అభ్యర్థులను గమనిస్తే అవి రెండు రకాలుగా గుర్తించబడ్డాయి.
మొదటి రకం అభ్యర్థులు: వీరు స్వార్థ రాజకీయాలు చేసేవారు, కల్లబొల్లి మాటలతో అబద్ధాలతో అభ్యర్థులుగా గెలిచేవారు. నిష్ప్రయోజనమైన తామరాకులాంటివారు. సమాజానికి, సామాన్య ప్రజలకు వీరి వల్ల నిష్ప్రయోజనం.

రెండవ రకం అభ్యర్థులు: రెండవ రకం అభ్యర్థులు జాతిపిత లాంటివారు భారతమాత పాదాలకు అర్పించబడిన అమలిన పుష్పం లాంటివారుగా అరుద్ర భావించాడు. వీరు ప్రజలలో నాలుకలా జీవిస్తూ ప్రజాస్వరం వినిపిస్తారు.
అభ్యర్థుల యోగ్యతలు: ధనంతులు, భూస్వాములు, పరిశ్రమల అధికారులు, పదవులపై దాహంతో లాభార్జన పై మోహంతో అభ్యర్థిత్వం వహిస్తే ప్రజల సమస్యలు పరిష్కరించబడవు. వాళ్ళ కన్నీళ్ళ కుంభవృష్టికి అంతే ఉండదు. కాబట్టి అభ్యర్థిత్వం వహించిన వ్యక్తి కొన్ని యోగ్యతలను కలిగి ఉండాలని చెప్పి ఆరుద్ర గుర్తు చేశాడు.
యోగ్యతలు:
1. సరిహద్దులు భావం లేకుండా, ప్రాంతీయ భేదం లేకుండా ఉండాలి.
2. సమతను ఆశించేవాడై ఉండాలి.
3. శాంతి ప్రియిత్వం కలిగి ఉండాలి.
4. కాంతి కారుడు, అందరికి దారి చూపే వాడై ఉండాలి.

స్వాతంత్ర్యకాంక్షకు సంస్థల భాగస్వామ్యం- జాతిపిత ప్రస్తావన: స్వాతంత్రం రావడానికి ప్రధాన కారణమైన ఒక సంస్థ (*1) భారతమాతకు మలినం లేని గొప్ప పుష్పాన్ని అందించిందని పేర్కొన్నాడు ఆరుద్ర. తామరాకు మీద నీటి బొట్టు వేస్తే ఆణిముత్యంగా మారదు కదా, పోనీ తామరాకు మీద నీళ్లు పూసలుగా అనుకొని దండగా కురిస్తే దేశమాత కంఠంలో హారముగా వేయడానికి కుదరదు కదా. దేశమాత పాదాలకు మలినం లేని పువ్వును అర్చించినట్టుగా జాతిపితను (*2) అర్పించింది ఆ సంస్థ. ప్వార్థమనే బురదతో తామరాకు సాధించే ప్రయోజనం ఏమీ లేదు కదా!
స్వాతంత్ర్య భారతదేశంలో ఎన్నికల దృష్ట్యా కవుల పాత్ర: ఒక నియోజకవర్గం తరపున స్వతంత్ర అభ్యర్థులుగా నిలబెట్టడానికి నాటి తెలుగు కవులు పోషించిన పాత్ర అతి కీలకమైనది మరియు బాధ్యతాయుతమైనది. ఈ "విజయవాడు పౌరులారా" అనే ఆరుద్ర రాసిన కవితను బట్టి వరుసగా చూస్తే- ఆహారం వస్త్రాలు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేని పేదల గోడు వినేవాడు కవి. ప్రజల బాధను తన బాధగా భావించి, పాటలు సైతం అల్లి ప్రజలను చైతన్యం చేయగలిగిన వాడు కవి. ఈటెల్లాంటి మాటలతో, కత్తులు లాంటి పాటలతో కోట్ల ప్రజల బాధాతప్త పరిస్థితిలను కూకటివేళ్ళతో పెకలించి బంగాళాఖాతంలో పడేస్తాడు కవి.

ప్రపంచాన్ని పొలంగా, కవిత్వం హలంగా, ఆశయాలు అనే ఎడ్ల జతలతో, ఆదర్శమనే కాడితో, బీడలు వారి పగుళ్ళతో ఉన్న ప్రజల బీళ్ళను దున్న గలవాడు కవి. ఖనిజాలు, భారత సంపద తరలించిన దుర్మార్గులు భారతదేశ వదిలి వెళ్ళినా, "పరపీడన" (*4) పోలేదని కవులంతా గుర్తించారని గుర్తించారని ఆరుద్ర ఈ కవితలో స్పష్టంగా తెలియజేశాడు.

బాధితులు అంతా వాళ్ళ ఘోష వినిపిస్తే కవులందరూ కార్యదీక్షతో కలం పట్టి గళం ఎత్తి ప్రజలకు చైతన్య బోధిస్తూ "ప్రజల నుండి ప్రజల కొరకు ప్రజాప్రతినిధులు" (*5) ఆచరణాత్మకంగా ఉండి ప్రతిజ్ఞతో వివేకంతో దివిని ఈ భూమికి దిగువచ్చేలా చేయగలరని కవులకంత సత్తా ఉందని నిరూపించిన కవిత ఈ "విజయవాడ పౌరులారా" కవిత.
సామాజిక పరిస్థితులు:
1. కర్షకుడు : కష్టపడి పొలంలో పనిచేసే శ్రామికులను ధనవంతులు కాల్చుకు తింటున్నారని, అందువల్లనే కరువు కాటకాలు వచ్చాయని ఆరుధ్ర భావన.
2. పాలేరు : కష్టపడి పని చేస్తున్న వారికి పట్టెడన్న కూడా దొరికిన పేదరికం ఉందనీ, పని చేయని సోమరులు మాత్రం పంచభక్ష పరమాన్నాలు తినగలగడం కనిపిస్తుంది.
3. కార్మికులు : ప్యాక్టరీలలో విరామం లేకుండా, తిండి వస్త్రాలు ఇల్లు లేకుండా, రాత్రింబవళ్ళు పని చేసేవారు కష్టాలతో ఉంటున్నారు.

4. పేద రైతు : బక్క చిక్కిన పేద రైతుకు దుక్కి దున్నితేనే అన్నం దొరుకుతుందనీ, ఆ రైతు కష్టపడి సంపాదించితే ఆ గింజలు ఇంకెవరో ఎత్తుకుపోతున్నారని, వారి కష్టం పరులపాలు అవుతుందని తెల్పాడు.
5. వీరితో పాటుగా కచేరి బంట్రోతు, జాలరి, అగశాలి, కంసాలి, చదువుకున్న ఎన్జీవోలు, నిరక్షరాస్యులు, అందరూ పేదరికంతో బాధామయంగా జీవిస్తున్నారని ఈ కవితలో సామాజిక పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చూపించాడు.

ముగింపు: ఆరుద్ర గారు రాసిన "విజయవాడ పౌరులారా" అనే ఈ కవిత 1951వ కాలం నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అద్దం పట్టిన కవిత. స్వాతంత్ర్య అనంతరం భారతదేశానికి కవులు కలమెత్తి, గళమెత్తి దేశపురోగతికి కృషిచేసిన విషయం ఈ కవితలోని నిక్షిప్తీకరించబడిన వాస్తవిక సత్యం.

కవితలో ప్రస్తావించబడిన నూతన భావనలు చూస్తే, మొత్తం భారతదేశంలో 1951 వ కాలం నాటికి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడే నాటి కాలంలో హరేంద్రనాథ్ చటోపాధ్యా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడం, తత్కారణం తెలుగు కవుల ప్రోత్సాహకర పాత్ర, కంసాలి నుండి బంట్రోతు వరకు, కార్మికుల నుండి కూలీ వరకు అందరితో మాట్లాడి సందర్శించి వాళ్ళ సాధక బాధకాలు తెలుసుకొని తెలుగు కవులు తమ గళం విప్పి తమ వంతు ఎలక్షన్లలో స్వతంత్ర అభ్యర్థిత్వం కోసం కృషి చేశారు. విజయవాడ రాజధానిగా ఉండాలనే భావన 1951 నాటిక ఉ ందన్న విషయం ఈ కవితలో రికార్డు చేయబడింది.

**ఆధారగ్రంథాలు:**

1. ఆరుద్ర రచన కవితలు విప్లపత్రిక నుండి సంకలనం ఆరుద్ర 1985 డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా ఐటెం
2015.386119
2. తెలుగు ఆన్లైన్ ఇండియా డాట్ కాం ఫైవ్ సెప్టెంబర్ 2014 ఏపీ న్యూస్ రాజధానిగా విజయవాడ నిజమైన 60 ఏళ్ల కల.

# జిసనారా లఘు కవితా రూపాలు
# (నానీ "నావి నీవి వెరసి నానీ")

**బి. శ్రీలవ పద్మశ్రీ, ఎం.ఎ., యం.ఫిల్**
తెలుగు అధ్యాపకురాలు
శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి)
తణుకు. ఆంధ్రప్రదేశ్,
చరవాణి నెం.9704760915

**స్థూల పరిచయం:** తెలుగు సాహిత్యంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. కవిత్వంలో ఎన్నో మార్పులు జరిగాయి. చాలా ప్రయోగాలు చేసారు. వస్తువులో, గుణంలో, రూపంలో, పద్ధతిలో, నడకలో ఒకటి ఏమిటి అన్ని అంశాలలో మార్పు అనేది తప్పని సరి అయినది. ఈ పరిణామం అన్ని భాషలలో ఉంది. ఇది ఎవరూ కాదనలేనిది. తెలుగు సాహిత్యంలో క్రొత్తగా వచ్చిన ప్రక్రియ "నానీలు". దేశి కవితా ప్రక్రియ "నానీలు".

నానీలకు నాంది పలికిన ఆచార్య గోపిగారు "నానీలు" ఒక విలక్షణమైన కవితా ప్రక్రియ. "నానీలు" అనగా క్రొత్త ప్రక్రియను వచన కవిత్వంలో ఆవిష్కరించి నాలుగు లైనులలో అనంత భావాలను వ్యక్తం చేసారు.

**గోపి గారి "నానీ" కవిత్వం** ఆలోచన ముందుకు వచ్చి వారి ఆలోచనలలో ఆవిష్కరణలలో జిసనారా "అక్షర క్షణాలు" అయిన "నానీలు" వర్తమానకాలంలో దూసుకుపోతున్న "నానీల" సన్నివేశాన్ని గమనించారు. కాలంతోపాటు కదలిపోగల తాజాదనం వల్లే ఆయన "నానీలు" వ్రాయగలరు అని అక్షర క్షణాలు ముందు మాటలో "జిసనారా నానీలు" "సెలయేటి పరుగుల కన్నా అనుభవం అనే పెద్ద కొండకు మొలచిన మొక్కలులా ఉన్నాయి" అని ఆచార్య గోపిగారు ఈ నానీలలో ఉన్న కవితా తత్వాన్ని చెప్పడం జరిగింది.

"అక్షరక్షణాలు" నా సాహిత్య ప్రస్థానంలో "నానీలు" అని తన వాణిని వినిపించారు, "నానీని" సులభంగా వ్రాయవచ్చు అనుకోవచ్చుగాని దానికి రూప నిర్మాణం శిల్పం మెరుపులాంటి మెళుకువలు ఉన్నాయి. మంచి "నానీలు" వ్రాయడం సులభం కాదు ఏ ప్రక్రియ అయినా అందులో ఒక చమత్కారం కవిత్వ స్పర్శ ఉన్నపుడే మనల్ని ఆకర్షిస్తుంది అని "జిసనరా" అన్నారు.

**జిసనారా నానీ విశ్లేషణ:** బాల్యమిత్రుని ముందు/సాదరంగా మూట విప్పాను/గుప్పెడు అటుకులు స్నేహితుడి మీద అభిమానాన్ని చాటడానికి గుప్పెడు అటుకులు చాలు అన్న అర్థం స్ఫురిస్తుంది. మిత్రుడు అటుకులు అనగానే మనకు కుచేలుడు శ్రీకృష్ణుడు గుర్తుకువస్తారు.

అంబులెన్స్/కనిపిస్తే భయం / ఎక్కడ పక్షి ఎగిరిపోతుందేమోనని అంబులెన్స్ శబ్దం వినగానే ఎవరో ఆపదలో ఉన్నారని అనిపిస్తుంది. పక్షి ఎగిరిపోతుందేమో అని అంటే ప్రాణం పోతుందేమోనని కవి భావన.

ప్రాజెక్టుల్లో నీరు వదిలారు. కాలవలన్నీ ప్రక్క జేబుల్లోకే, ప్రాజెక్టులకు నీరు వదిలితే పొలాలకు ఉపయోగం. ఒక వేళ వాటి ఫలసాయం రైతు ఇంటికే కాదు ప్రక్క జేబుల్లోకి ఇప్పుడు ప్రాజెక్టుల వాదన వింటున్నాం కదా. సమకాలీన స్పందన వినిపించడం ఉత్తమ కవి లక్షణం.

నా కళ్ళలో/నీ చిరునవ్వు అందుకే ననుకుంట ఇప్పుడది నానీ నా కళ్లలో "నా" "నీ" చిరునవ్వులో వాటి ప్రారంభంతో "నానీ॥ అయింది.
ఆ స్పర్శ తీరే/అంత
అనంత మాధుర్యం/దాని పేరు అమ్మ.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

అమ్మ స్పర్శే మధురానుభూతి. మాటలలో చెప్పలేనిది అని అమ్మ స్పర్శను కవిగుర్తుకు తెచ్చుకొన్నారు.
కరెంటు పోతే/పర్వాలేదు.
ప్రక్కవీధిలో ఉంటేనే/మనకు బాధ.
కరెంటు పోతే పరవాలేదు అనటంలో మనకు పోయినా పరవాలేదు కాని పక్కన వాడికి ఉండకూడదు అన్న మనిషి బుద్ధి ఎలాంటిదో కవి ఇక్కడ చెప్పడం జరిగినది.

నగరమంతా జెండాల సందడి. రిపబ్లిక్ డే కాదు/ ఎన్నికల కోలాహలం నగరమంతా జెండాల సందడి. రిపబ్లిక్ డే అనుకుంటున్నారేమో ఎన్నికల కోలాహలం అంటే ఎన్నికలప్పుడు రాజకీయ పార్టీలు జెండాలతో నగరమంతా సందడి చేస్తున్నట్టు ఉంది అని కవి భావన. సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కూడా సంతోషం ఉండదు. ఎన్నికలు అప్పుడు మనిషి మాత్రం మైమరిచిపోతాడు అని అర్ధం.
మిరపకాయ బజ్జీలకు/టాటా
పిజ్జాల రుచి/నవతరం కోటా
ఒకప్పుడు మిరపకాయబజ్జీ అంటే అందరికి ఇష్టం కాని ఇప్పటి తరం పిజ్జాలపై ఆసక్తి చూపిస్తున్నారని అర్ధం.
మన జీవితాన్ని/మనమే
చదువుకుంటే/తప్పులు దిద్దుకోవచ్చు
మన జీవితాన్ని మనమే చదువుకుంటే అంటే జీవితములో తప్పులు దిద్దుకునే అవకాశం వుంటుంది. మనము ఏమి చేస్తున్నామో మనం ఆలోచించుకోవాలి అపుడు తప్పులు చేయం అన్న అర్ధం స్ఫురిస్తుంది.
వెలుగు/ఉన్నంతవరకే
వెంపర్లాట/సూర్యుడస్తమిస్తే చీకటి
ఈ కవిత చదవగానే మనకు దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి అన్నది గుర్తుకు వస్తుంది.
లక్ష్మి/స్థానచలనం ఎక్కువ!
చేతులు మారినా/విలువ ఒకటేనా?
ధనం అనేది మనిషి మనుగడకు ఇంధనం అవసరాలకు మనిషి ఉపయోగించుకుంటాడు. ఎక్కడ వున్న ఎన్ని చతులు మారినా దాని విలువ ఒక్కటే.
దొరికిన మిత్రుడొక్కడే /అది నేనే
జీవితమంతా వెదికినా దొరికిన స్నేహితుడు ఒక్కడే తీరా చూస్తే అది నేనే అనటంలో మనకి మనమే స్నేహితులం మన గురించి మనమే ఆలోచించుకోవాలి అర్ధం.
మనకంటే /సూర్యుడే లక్కీ ఫెలో!
రిటైర్మెంటు లేని/ఉద్యోగం!
మనకంటే సూర్యుడే అదృష్టవంతుడు. తన కర్తవ్యాన్ని నిర్వహించడంలో అలుపు అనేది లేకుండా ప్రపంచానికి వెలుగునిస్తాడు.
పెరుగుతున్న/అక్రమాల పై
దైవాన్ని ప్రశ్నిస్తే/నా దృష్టికి రాలేదన్నాడు!
ఈ అన్యాయాలు అక్రమాలు ఏమిటి అని దైవాన్ని ప్రశ్నిస్తే భగవంతుడు నా దృష్టికి రాలేదన్నాడు అంటే దైవానికి కూడ అంతుబట్టకుండా అక్రమాలు చేస్తున్నారని అర్ధం.
అనుమానించడం/మనసురుగ్మత!
అభిమానించడం/సహృదయత
మనిషికి అనుమానం అనేది మానసిక జబ్బు అని అభిమానించడం అనేది మంచి మనస్సుకు నిదర్శనం అని కవి భావన.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

పాత ఫోటోలు/చిన్ననాటి బాల్యం!
ఎదనిండ/కదలాడిన బాల్యం!
పాత ఫోటో చూసినప్పుడు చిన్ననాటి స్నేహం గుర్తుకు వచ్చి మనస్సు నిండి బాల్యంనాటి జ్ఞాపకాలు కదలాడినాయి. బాల్యం ఎప్పుడు అద్దం లాంటి స్వచ్ఛమైన ఆలోచనలు కలిగి ఉంటారని అర్థం.
**జిసనార గారి నానీలు:** కొన్ని పానీ త్రాగినట్లు అనిపించినా కొన్ని ఆలస్యంగా మంచి నీళ్ళు త్రాగితే మింగుడు పడని విధంగా ఉన్నాయి. ఈ నానీలలో సామాజిక స్పృహ మనిషి జీవితంలో ప్రతి అంశాన్ని గమనించినట్లుగా అనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**
1. సాహిత్య చరిత్ర - ప్రొ॥ వెలమల సిమ్మన్న
2. అక్షర క్షణాలు - నానీలు - జిసనారా

# స్త్రీవాద కవయిత్రుల తండ్రి ప్రేమ

**డాక్టర్ సుంకర గోపాలయ్య**
తెలుగు అధ్యాపకులు, డి.ఆర్. జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
తాడేపల్లిగూడెం
9492638547

**పరిచయం:** తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ప్రభుత్వం చూపు వేరు. పుత్తూరు స్వామి వ్యవస్థలోని లోపాలను గుర్తిస్తూ ,స్త్రీ అస్తిత్వం ప్రధానంగా ఈ కవిత్వం సాగింది. స్త్రీ పురుష సమానత్వాన్ని కోరుకుంది. వస్తున్నా బలంగా నిరసించిన రచయిత్రులు తండ్రి ప్రేమను గుండెలకు హత్తుకున్నారు. ఇది చాలా విభిన్నంగా అనిపిస్తుంది. తండ్రిని తలచుకుంటూ, వారి జ్ఞాపకాలను కలబోసుకుంటూ కవిత్వం రాసిన కవయిత్రులకవితల్ని పరిశీలిద్దాం.
పరిశోధన పత్ర నేపథ్యం:
అందరూ తండ్రులు గొప్పతండ్రులు కాకపోవచ్చు. అందరూ తండ్రులు స్ఫూర్తి మార్గం కాకపోవచ్చు. నాన్న వేలు పట్టి నడిపించి మార్గదర్శనం చేసే దిక్సూచి కావొచ్చు. తాను దుఃఖాన్ని మోస్తూ మనకు సంతోషాన్ని ఇచ్చే భరోసా కావచ్చు. కొందరు మధ్యలోనే గాడి కింద పడేసి బంధాల్ని అనుబంధాల్ని విడిచినవారు ఉన్నారు. కవి అన్వర్ ఒకచోట అన్నట్టు అయితే అమ్మ ఎవరికైనా అమ్మే అన్నట్టు, నాయిన కూడా ఎవరికైనా నాయినే. కొందరికి నాన్న ద్వేషానికి సంబంధించిన వస్తువు కూడా. కుటుంబానికి లేదా జీవితంలో వచ్చే కష్టాన్ని పిల్లలకు చెప్పలేక తండ్రి మౌనంగా భరించే సందర్భాలు ఉన్నాయి. తండ్రి

గాంభీర్యాన్ని ప్రదర్శిస్తాడు. ఆ పాత్ర అలా నిర్మించబడింది. నాన్న ఉత్తరంలో చిరునామా. మార్కుల పత్రంలో ఆధారం నాన్న కొందరికి ఇష్టుడు. మరికొందరికి పెత్తనం చెలాయించే అధికారం. కసురుకునే కర్ర నాన్న నిచ్చెనెక్కి ఎంతోమంది ఉన్నంత స్థానంలో నిలబడ్డారు. నిచ్చెనలుగా మారని నాన్నలు ఉన్నారు అమ్మని బానిసగా చూసిన నాన్నలు ఉన్నారు. నాన్న పేరు మీదే కదా పితృ స్వామ్య వ్యవస్థ ఉంది. స్త్రీవాదాన్ని బలంగా వినిపించిన కవయిత్రులు కొందరు వాళ్ళ తండ్రిని హృదయాలకు హత్తుకున్నారు.

సాంకేతిక పదాలు: స్త్రీవాద కవిత్వం- స్మృతి-నాన్న-కవయిత్రులు-జ్ఞాపకం-నాన్న పదం- తండ్రి ప్రేమ

స్త్రీవాద కవయిత్రుల తండ్రి ప్రేమ-విశ్లేషణ:

ప్రముఖ స్త్రీవాద కవయిత్రి, ఘంటసాల నిర్మల వారి తండ్రి స్మృతిలో వెలువరించిన కవిత 'ఒక మామూలు నాన్నారి కోసం'. దాదాపు 90 పాదాల కవిత ఇది. నాన్నను గొప్పగా పరిచయం చేసిన కవిత. రైల్వే శాఖలో నలభై ఏళ్లపాటు పనిచేసిన తండ్రి జీవితాన్ని కవయిత్రి మన ముందు ఉంచుతారు. ఎక్కే రైలుతో దిగే రైలుతో దాదాపు 40 ఏళ్ల జీవితం గడిచిపోయిందంటారు. తమని క్రమశిక్షణతో పెంచారనీ, 'మహా పిసినారి మీరు' అనీ, అయినా అవన్నీ మా బాగు కోసమేనని కవయిత్రి చెప్పుకొస్తారు. ఆయన అమాయకంగానే బతికారు. అనవసరపు భయాలతో గడిపారు.

" నాన్నారూ /ఉన్నన్నాళ్ళూ - మాకు జవజీవాల్ని సమకూర్చి/ జీవితాల్ని అమర్చి పెట్టినన్నాళ్ళూ మీరు /సమాజం రుద్దిన విలువల చట్రంలో ఆపాదించిన/ సూత్రాల చక్రంలో నలుగుతూ /నలుగుతున్నాననుకోకుండానే కాలాలు గడిపారు/ సగం జీవితం చద్ది అన్నమే! రెండు క్యారేజీలతో ఇవాళ తెల్లవారు జామున/ మెయిలుకో, సర్కారుకో డ్యూటీ ఎక్కితే మళ్ళీ రావడం రేపు రాత్రికే"నని కవయిత్రి దిగులుపడతారు..అలా వెళ్ళివచ్చినా, ఇంటి దగ్గర ఏదో ఒక పనిచేస్తూ ఉండటం ఆయనకే చెల్లిందంటారు కవయిత్రి. నలుగురు పిల్లల్ని చాలా బాధ్యతగా పెంచిన తండ్రి. ఆప్యాయతను పంచిన తండ్రి. జీవితాన్ని గొప్పగా అందించిన తండ్రి. నాన్న తనకోసం లెక్కలు చెప్పడం, స్టీలు క్యారేజీ తనకిచ్చి సత్తు క్యారేజీ మోసుకెళ్ళడం పోటీలో బహుమతులు వస్తే ఆయనే గెలిచినట్టు ఆనంద పడటం పెద్దమ్మాయి సంగీతానికి పరవశం చెందడం ఇలా ఎన్నో తీపి గుర్తును కవయిత్రి నమోదు చేశారు. అయినా మృత్యువు ఎవరికీ మినహాయింపు కాదు.అంత చిరంతపు తీపి బాల్యాన్ని/ ఇంత ఘాటయిన క్రమశిక్షణనీ/ రంగరించి ఇచ్చిన మీరు /అలా చెప్పకుండా అర్ధాటున/ వెళ్ళిపోయారేం /నాన్నారూ! ఉద్యోగాసాంతం అసలెప్పుడూ ఆఖరి నిమిషంలోనే - బండిఅందుకున్న మీరు/ ఎంత డ్యూటీ అయిపోయిందను కుంటే మాత్రం /అంత అకస్మాత్తుగా వెళ్లిపోతారా! అని విలపిస్తారు. ఇది కరుణలేని కాలం. ఆయన దూరమైన 'దిగులు దుఃఖం' ఉండకడుతూనే ఉంది. కళ్ళు కాల్వలు ఎడతెగడం లేదని కవయిత్రి కలం కన్నీరు కార్చింది.

మందరపు హైమవతి, తండ్రి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాక 'నాన్న' అనే కవిత రాశారు. పితృస్వామ్య వ్యవస్థపై తిరుగు బావుటా ఎగరేసిన కవయిత్రికి, 'నాన్న' మాత్రం 'అమ్మ'లా కనపడ్డాడు. ఈ కవయిత్రి నాన్నను గుండెల్లో పెట్టుకున్నారు."అమ్మ బొజ్జలో బజ్జున్నది /ఆడపిల్లని తెలిస్తే/విషం సూది గుచ్చి/ విముక్తి గీతం పాడుతారు/ కొందరు నాన్నలు/ నాన్నకు నేనంటే ఆరో ప్రాణం " అంటూ అక్షరాల్లో దాచుకున్నారు.కొందరికి నాన్నంటే చందమామ కథల్లో రాక్షసుడు. ఇంకొందరికి జానపద గాథల్లో మాంత్రికుడు. నాన్నంటే పిల్లలకు సింహ స్వప్నం. నాన్నని చూస్తే గుండెల్లో బాంబులు పేలతాయి. ఏం కావాలన్నా అమ్మ మధ్యవర్తి కానీ కవయిత్రి మాటల్లో వారి నాన్న ఇందుకు మినహాయింపు. . "బాల్యంలో నా అభీష్ట క్రీడాస్థలం / నాన్న వక్షస్థల మైదానం/ చిన్నప్పుడు నిద్ర మంచం మీద నుంచి కింద పడి/ గుక్క పట్టి ఏడుస్తున్నప్పుడు/ భుజం మీద ఎత్తుకొని తెల్లవార్లు

జోకొట్టి/ నిద్రపుచ్చిన లాలి పాట" అని నాన్నకి కితాబు ఇచ్చింది.తను సీతాకోక చిలుకల వెంట పరుగెత్తే సందర్భంలో, నాన్న పరుగుల వీరుడు. వానలో తనతో పాటు పడవలు వదిలిన బాలుడు నాన్న. గగన వీధి నుండి దిగి, ఇంటి కొచ్చిన చందమామ నాన్న. శీతాకాలం గోరు వెచ్చని సూరీడు నాన్న. మార్కులు తగ్గినపుడు అమ్మ కోప్పడితే, చల్లని మాటల ఛత్రం నాన్న అంటూ కవయిత్రి 'నాన్న'ను పొదువుకుంటారు. నాన్న నా ఆరాధ్యదైవం అంటారు. అంతటి అపురూపమూర్తి దూరం కావడం దురదృష్టమే. కానీ తప్పదు. అందరూ వెళ్ళి పోవాల్సిందే. కవయిత్రి నాన్న కూడా వెళ్లిపోయాడు.ప్రపంచ సాహిత్యంలో "నా అభిమాన పదం నాన్న"అని ఆమె ప్రకటించారు. కవయిత్రి నిజంగానే తండ్రిని ఆకాశం చేశారు. ఒక స్త్రీవాద కవయిత్రి 'నాన్న' నా అభిమాన పదం అని ప్రకటించారంట, తండ్రి ఆమెను ఎంత ప్రభావితం చేశాడో తెలిసిపోతుంది.

ఉన్నట్టుండి వెళ్లిపోతారని తెలిసినా, వెళ్ళి పోయినా ఆ జ్ఞాపకాల నుండి తేరుకోవడం కష్టమే. అవెప్పుడూ కళ్ళ ముందు కదులుతుంటాయి. అలాంటి జ్ఞాపకాల కలబోతతో 'కొనసాగింపు' అనే కవిత రాశారు శిలాలోలిత. ఎంత మర్చిపోదామన్నా 'మరుపు' రావడం లేదంటారు. నాన్న జ్ఞాపకాలు జ్ఞాపకాలుగా కదులుతున్నారంటారు. వర్షపు చుక్కల్లో బాధ' కురుస్తూనే ఉంది. నాన్న 'వెళ్ళి' తలుపేసుకున్నారు. అయితే, అది ఎప్పటికీ తీయని తలుపు అని కవయిత్రి విలవిల లాడిపోతారు. "అర నిమిషం కరెంటు పోయినా/ఊపిరాడని నాన్నను/ గాజు ముక్కల గదిలో మూసేశాం కదా/ చిన్నప్పుడు స్నానాలు చేయించిన నాన్నను/ బాకీ తీర్చుకోవడానికా అన్నట్లు తలోచెంబూ నీళ్ళు పోసి స్నానాలు చేయించామని "అంటారు.

నాన్న ప్రేమను, ఆప్యాయతను, అనురాగాన్ని పొంది వెలిగిన మరో కవయిత్రి చల్లపల్లి స్వరూపారాణి. నాన్న కోసం అనే కవితలో నాన్నను ఆంతరంగిక మిత్రుడుగా చూశారు. బాల్య స్నేహితుడిగా చాటారు .వారి తండ్రి ముందు భూమి ఆకాశాలు కూడా చిన్నబోతాయని చెప్పారు. నాన్న మాటల్ని, రూపాన్ని కవయిత్రి గుర్తుచేసుకుంటారు. తండ్రి స్మృతి తొలిపొద్దులా మెరుస్తూనే ఉంటుందట. 'మానాన్న రిమోట్ నాన్నకాదు, పోలీసు నాన్నకాదు' అంటూ పొంగిపోతారు. అంతలోనే నాన్న జ్ఞాపకాల 'అపరాధ శిలువ' గుండె కెత్తుకున్నాను అని ఇలా వేదనకు గురౌతారు.

"నీ సమాధి తల వాకిట్లో /వెలితి వెలితిగా నిలబడి/ బొట్లు బొట్లుగా కరిగే/ కొవ్వొత్తిని నేనే నాన్నా". కొన్ని సందర్భాలలో తండ్రి చెప్పిన మాటలు, పిల్లలు పెడ చెవిన పెడతారు. తండ్రి మాటల్ని గౌరవించరు. 'నీకేం తెలుసు పో' అంటారు. కానీ వారు సంతానాన్ని పొందాక, తండ్రి పాత్ర ఏమిటో నెమ్మదిగా తెలుస్తుంది. తండ్రి దూరమయ్యాక అర్థం కావడం మొదలౌతాడు. ఈ నేపథ్యంలో శైలజామిత్ర అనే కవయిత్రి 'ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నావు' అనే 'తండ్రి స్మృతి' రాశారు.నాన్నా ! సగానికి పైగా జీవితం గడిచాక ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నావు ,"ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి /కలిస్తేనే ఒక రోజవుతుందని తెలుసు కాని /స్వార్థం, అసూయ, కపటం, అబద్ధం /కలగలిపితేనే నేడొక మనిషని ఒకప్పుడు నువ్వు చెప్పింది గుర్తుకు వచ్చి/ ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నానాన్నా" అంటూతన తండ్రి చెప్పిన సమాజ పోకడల్ని గురించి కవయిత్రి గుర్తు చేసుకున్నారు.అలాగే జీవితాన్ని చూడాల్సిన చూపు, సాధించాల్సిన ఆశయాలు, నాన్న చూపిన కోపంలో దాగిన ప్రేమ ఇటువంటివన్నీ ఇప్పుడిప్పుడే తెలుస్తున్నాయి అంటారు. తండ్రి మాటల ఆంతర్యం ఇన్నాళ్ళకు తెలిసిందనీ, ఈ జీవితం సరికొత్త పేజీలా ఉంది అని చెబుతారు.

కొందరు నాన్నలు అపురూప జ్ఞాపకాలైతే, మరికొందరు నాన్నలు చేదు జ్ఞాపకాలు. కాఠిన్య హృదయాలు. ఔన్నత్యపు తండ్రులు కొందరు. అలసత్వపు తండ్రులు మరికొందరు. కె.గీత రచించిన 'చివరి స్పర్శ' రెండు పార్శ్వాలు చూపిన కవిత. నాన్న ఒక గుణపాఠంగా మిగిలాడుగానీ, ఏ ఒక్క గుండెలోనూ చిత్రపటం కాలేక పోయారని కవయిత్రి బాధ పడతారు. తండ్రి వీపు మీద ఆడిన బాక్సింగ్, భుజాలపై తిరిగిన రంగుల రాట్నం, ఇలా కొన్ని జ్ఞాపకాల్ని

చెబుతారు. ఐతే తల్లిని కొట్టిన తండ్రిని పెట్రోలు పోసి తగలేయాలనిపించిందని కూడా నిక్కచ్చిగా తెలియ చేశారు.
"అమ్మ కళ్ళు నిండినప్పుడల్లా /పెట్రోలేసి నిన్ను తగలెయ్యాలన్పించేది/ నిన్న - ఎందుకో బతికితే బావుణ్ణనిపించింది హఠాత్తుగా పాడె మించి లేచి/ నువ్వు నడిచెళ్ళిపోతే బావుణ్ణనిపించింది".తండ్రి బతకాలని కవయిత్రి కోరుకున్నారు. తండ్రి చనిపోయే ముందు తన కోసం చూడటం, వచ్చాక చెయ్యి పట్టుకొని పడ్డ వ్యధల్ని గుర్తు చేసుకున్నారు.
ముగింపు: "నువ్వు నాకు వద్దనిపించే నాన్నవి /అమ్మని కష్టపెట్టిన రాక్షసుడివి /అయినా నా శరీరంలో భాగం కాలిబూడిదైనట్లయింది/ పార్థివ కర్ణంలో అన్నయ్య 'డేడి' అని పిల్చినపుడు /నిన్ను పట్టి కుదిపి తీసుకెళ్ళి పోవాలన్పించిందని "కవయిత్రి బోరునవిలపించారు. ఈ కవితలన్నీ కూడా కవయిత్రులు వాళ్ల తండ్రులు చనిపోయాక రాసిన కవితలు. సాహితీ లోకంలో తమ తండ్రులకి వాళ్ళు ఇచ్చిన గొప్ప నివాళి. మన నాన్నలు కూడా మనకేదో ఒకటి ఇచ్చే ఉంటారు. సమాజంలో దాదాపు అందరికీ తండ్రి జ్ఞాపకాలు ఉంటాయి .అలా లేకపోవడం కూడా దురదృష్టం .తండ్రిని గొప్ప వ్యక్తిగా భావించినప్పుడు, ఆయన దూరం కావడం విపరీతంగా బాధిస్తుంది. తండ్రి కూర్చున్న కుర్చి, పడుకునే మంచం, తినే కంచం, చదివే పుస్తకం దేన్ని చూసినా ఆ జ్ఞాపకాలలోకి వెళ్ళిపోతాం చదవాలే గాని ప్రతీ తండ్రి ఒక బతుకు పుస్తకం.

**ఆధార గ్రంథాలు:**

1. నాయిన- అన్వర్( సంకలనం)
2. నాన్న పదం-ఘంటసాల నిర్మల(సంకలనం)
3. నీలి గోరింట- మందరపు హైమవతి
4. ద్రవభాష-కె. గీత
5. వచన కవిత్వంలో స్మృతి- డాక్టర్ సుంకర గోపాలయ్య

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# మినీ కవిత్వం - ఒక పరిశీలన

**డా. టి. ఆశీర్వాదం**
తెలుగు అధ్యాపకులు
పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాల (అ), కాకినాడ
చరవాణి సంఖ్య : 8309654029
Email : aseervadamtadimalla @ gmail.com

**స్థూల పరిచయం:** కవిత్వం అంటే సృజన, మనోగత భావాల ప్రకటన. అది అనుభవ పూరితము. అనుభూతి సమ్మేళనము. మనోగత భావాలు కల్పనాన్వితాలు అయినప్పుడు, ప్రత్యక్షమయ్యే జ్ఞాన ప్రకటనము కవిత్వం గా చెప్పవచ్చు. అలౌకికమైన ఆనందం దాని ప్రధాన లక్షణం. సామాన్య మానవాతీతమైన వ్యక్తులు మాత్రమే తన కవిత్వం ద్వారా సత్య స్వరూపమైన ఆనందాన్ని అందించగలుగుతారు. సహృదయులైన మానవులకు అది జీవన గమనాన్ని నిర్దేశించి ఉత్తమమైన, ఉన్నతమైన ఆలోచన రీతులను నింపుతుంది. అది జ్ఞాన సమ్మిళితమైన బుద్ధి ప్రేరకమై తార్కికమైన భావనలు నింపి నిర్దిష్టమైన లౌకిక జీవన గమనాన్ని నిర్దేశిస్తుంది. ఈ విధమైన జ్ఞాన సృష్టి ఋషితుల్యుడైన కవి మాత్రమే చెయ్యగలడనేది పండితుల వాక్కు. ఇక్కడ ఋషి శబ్దానికి 'దీక్షాశక్తి' గలవాడని మనం గ్రహిస్తే కవి కర్మ అయిన కావ్యం జ్ఞాన దృష్టితో, అనుభవ ప్రకటనమై చిరకాలం సామాజిక ప్రయోజనాన్ని సాధిస్తుంది. సృష్టికి ప్రతి సృష్టి చేయగల కవి కర్మ నైపుణ్యం అతని కావ్యం ద్వారా స్పష్టమవుతుంది. అప్పుడు సమాజం ధార్మిక, నైతిక విలువలు నేర్పగలుగుతుంది. మానవతా విలువలు గ్రహించగలుగుతుంది. ప్రతిభావంతుడైన కవి కావ్యము అభ్యాస యోగ్యమై ప్రతి అంశానికి వ్యుత్పత్తి, గ్రహించ గలుగు యుక్తిని, శక్తిని సమకూరుస్తుంది.
మానవజాతి మునుగడ విభిన్న కోణాలకు ప్రతిబింబం: ముందు తరాల అనుభవం ఒకటి. ప్రత్యక్షంగా దర్శించి అనుభూతాత్మక ఫలితాలను పరిశీలించి ప్రకటించడం రెండవది. అనంతర కాలాలకు దానిని అందించాలనే జ్ఞాన దృష్టి మూడవది. ఈ మూడిటి సమ్మేళనమే కవిత్వ సృష్టి. దీనికి వాస్తవాలు ఎంత అవసరమో, కల్పన, ఊహ కూడా అంత అవసరమై రూపు దిద్దుతుంది. ఇట్టి కవిత నిర్మాణంలో పారదర్శకమైన, మానవాతీతమైన, అత్యద్భుత భావన బంధురమైన విషయాలు ప్రకటించబడ్డాయి. అవి భారతీయ భాషలలో పుంఖాను పుంఖాలుగా వెలువడ్డాయి. శతాబ్దాలుగా ప్రజలు ఆ కవితా సంపదను అనుభవించారు.

తెలుగులో రూప వైవిధ్యాన్ని చూపిన కవిత్వంలో "మినీ కవిత" ఒకటి. 1970 నుండే మినీ కవిత్వ ఛాయలు కనిపిస్తున్నప్పటికీ, 1975 నుండి అదొక వెల్లవగా రావడం జరిగింది. ఆ కవితకు దేన్నైనా వస్తువుగా గ్రహించవచ్చు. మినీ కవితకు ఉచ్ఛ్వాసం క్లుప్తత, విశ్వాసం ధ్వని, రాసే కవి ప్రతిభను బట్టి ఎంత క్లుప్తతకైనా అవకాశం ఉంది. ఇది ప్రతిభకు నిదర్శనం వంటిది. "నిజమైన మినీ కవితను చదివిన తర్వాత చాలాసేపు ఆలోచింప చేస్తుంది. చెప్పదలచిన భావాన్ని సూటిగా చెప్పక అభ్యంతరకరంగా చెప్పి హృదయం మీద ఎక్కువ ముద్ర వేస్తుంది" అని విమర్శకులు పేర్కొన్నారు.

మినీ కవితా రూపం తనదైన ప్రత్యేక లక్షణాలతో తెలుగు కవిత్వం లోనికి వచ్చింది. అప్పటి ఆంధ్రజ్యోతి' వార పత్రిక సంపాదకులు శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ 'మినీ కవిత' అనే పేరుతో ప్రచురించి ఈ ప్రక్రియను ప్రచారంలోనికి తెచ్చారు. ఈ రూపం యువతరాన్ని బాగా ఆకర్షించి, అన్ని పత్రికలలో అప్పటినుండి బాగా ప్రచురితమైంది. సామాజిక ప్రగతిశీల వస్తువు ప్రధానంగా అందర్నీ ఆకర్షించి రూపానికి సంబంధించిన ఒక ఉద్యమమా అన్నట్లుగా

వ్యాప్తి పొందింది. అప్పటికి ఇప్పటికీ కవిత్వంలో ప్రగతిశీల వస్తువుదే ప్రథమ స్థానం అయింది. అయితే అభివ్యక్తి రూపంగా మినీ కవిత ప్రత్యేకత ఒక ప్రభంజనముగా రూపొందింది. విపరీతంగా ప్రబలితమైన దశ, సన్నగిల్లిన తర్వాత కూడా ఈ రూపం కవితా రూపం నుండి తొలగిపోలేదు. ఏదైనా కొత్తగా వచ్చినప్పుడు వరదలా వస్తుంది. తర్వాత నిదానంగా ప్రవహిస్తుంది. అలాగే మినీ కవితను ఈనాటి వరకు చాలా మంది రాస్తున్నారు. ఈ రూపాన్ని సామాజికంగా వినియోగించుకుంటున్నారు.

సామాజిక చైతన్యం కలిగించడంలో మినీ కవితకు ముఖ్యపాత్ర ఉంది. మినీ కవిత సామాన్య పాఠకుడిని వెంటనే ఆకర్షించి, అతని మనసు మీద ముద్ర వేస్తుంది. అందుకే ఈ ప్రక్రియ ఈనాడు బహుళ ప్రచారాన్ని పొందింది. అదీ కాక సభల్లో సామాజిక వ్యంగ్యమున్న మినీ కవితకు అద్భుతమైన ప్రతి స్పందన వస్తుంది" అని అద్దేపల్లి రామ్మోహన్ రావు గారు అన్నారు. మినీ కవితలో ఉన్న కొద్ది పాదాల్లో ఒక తూకం ఉండటం అనేది దాని ముఖ్య లక్షణాలలో ఒకటి. ఈ సమతూకం భావాన్ని ముద్రించే మార్గంలో మాత్రమే వస్తుంది. ఈ సమతూకంలో చివరి పదాలలో కనిపించే సామ్యం కూడా భావ స్ఫురణకే దోహదం చేయాలి. కేవలం శబ్దలయ 'అనుప్రాసల్లాగా 'కనిపించకూడదు. "మినీ కవితలో ప్రాసలు, అంత్యప్రాసలకు అవకాశం తక్కువ. అయితే ప్రాసలు, అంత్యప్రాసలూ మొదలైనవి ఏ కవిత్వంలోనైనా పోర్స్ కి చాలాచోట్ల ఉపయోగపడతాయి. మినీ కవితలో అంత్యప్రాస అర్థానికి బలాన్నిస్తుంది" అని అద్దేపల్లి వారన్నారు.

మినీ కవిత లో కొసమలుపు, కొసమెరుపు కొసచరుపు అనే లక్షణాలు ప్రధానంగా ఉండటం, వ్యర్థ పదాల్ని ప్రయోగించకుండా చెప్పదలచిన భావం పూర్తయిన వెంటనే కవితను ముగించడం కనిపిస్తుంది. పాఠకుల్ని ఎంతో ఆకర్షిస్తుంది. మినీ కవిత్వంలో కవి చెప్పదలచిన ఒక 'అంశం' ప్రధానంగా ఉండడం మన గమనించవచ్చు. మినీ కవిత్వాన్ని 'మెరుపు కవిత' (ఫ్లాష్ పోయెట్రీ) అని కొంతమంది పేర్కొన్నారు. 1975-80 ప్రాంతంలో విప్లవకవులు విరివిగా తమ ప్రచారానికి వినియోగించుకున్న మినీ కవితను నేడు ఒక ఉద్యమానికి చెందిన కవులే కాకుండా, భావజాలంతో సంబంధం లేకుండా రాస్తున్నారు. శ్రీ శ్రీ, కుందుర్తి, ఆరుద్ర, సినారె, ఎస్ గోపి, మొదలైన ప్రముఖ కవులే కాకుండా యువ కవులు కూడా మినీ కవితలు రాస్తున్నారు. వీరిలో చాలామంది మినీ కవితలు అంటే సూక్తుల్ని చెప్పటం గా భావిస్తున్నారు. కానీ సూక్తులు చెప్పటమే కవిత్వం కాదు. జీవితాన్ని వెలిగించగల దర్శనం, ప్రదర్శనం కవిత్వంలో ఉండాలి. సమాజంలో జీవించే మనిషి పొందే అనుభవాలు, ఆశలు, ఆశయాలు, వేదనలు, సామాజిక సంవేదనలు మొదలైనవన్నీ కవిత్వంలో రాయగలగాలి. చాలామంది మినీ కవితలనే 'హైకూ 'లుగా భ్రమిస్తున్నారు. కానీ హైకూ వేరు. హైకూ లన్ని మినీ కవితలు కావచ్చునేమో కానీ, మినీ కవితలన్నీ హైకూలు కావు. దీనికి హైకూ లక్షణాలు అడ్డంకి అవుతాయని గమనించాలి.

మినీ కవిత విస్తృత విషయాన్ని చెప్పే అవకాశం తగ్గిపోతుందనీ, విశాలమైన పరిధి కుంచించుకు పోతుందని విమర్శించే వారికి జవాబుగా "ఒక విషయాన్ని బట్టి దాన్ని అభివ్యక్తిలోని ప్రత్యేకతను బట్టి, రచన ప్రక్రియలో భేదాలు వస్తాయి. అంతేగాని ఎక్కువ విషయాలు చెప్పడం చేత పెద్ద వచ్చిన కవిత అవుతుందనీ, ఆ విషయాన్ని తగ్గించడం చేత మినీ కవిత అవుతుందనీ చెప్పలేం. మినీ కవిత - తనకోక విశిష్టత కలిగిన ప్రత్యేకమైన ప్రక్రియ. ఒక భావాన్ని వ్యక్తీకరించడంలో తనదైన శిల్పం గల స్వరూపం. ఈ విషయాన్ని చాలామంది గమనించకుండా పెద్ద వచన కవిత రాయగలవాడికి పది పన్నెండు మ్యాగ్జిమం లెయిన్స్ గల కవిత రాయడం చాలా సులభమనే అభిప్రాయంలో ఉన్నారు. ఒకే ఒక భావాన్ని సాధ్యమైనంత శక్తివంతంగా హృదయంలో పడేటట్లు, ధ్వని పూర్వకంగా చెప్పడానికి మినీ కవిత ఉరికివస్తుంది. అందుకే దీన్ని ఫ్లాస్ పోయెట్రీ అనవచ్చు. స్థూలంగా చెప్పాలంటే కదలికతో కూడిన అనుభూతులతో నిండిన చలనచిత్రానికి, ఒకే ఒక్క అనుభూతి గుండెకు

హత్తుకొనే చిత్రపటానికీ ఎలాంటి భేదం ఉందో దీర్ఘ కవితకు, విని కవితకు అలాంటి భేదం ఉంది.

మినీ కవిత అంటే లఘు రూపం. అనేకమంది కవులు, విమర్శకులు వారి వారి కోణాల్లోంచి దర్శించిన మినీ కవిత్వం యొక్క రుచిని తెలియజేయడం జరిగింది. 'బండెడు చెత్త కంటే ఒక్క మినీ కవిత గొప్పది'అన్నారు మహాకవి శ్రీశ్రీ. 1970 దశకం ప్రారంభంలో రేఖామాత్రంగా తెలుగు కవిత రంగంలోకి ప్రవేశించిన మినీ కవిత 1980 దశకం వచ్చేనాటికి ఉదృతంగా, ఒక వెల్లువలాగా కవితాకాశంలో విహరించే స్థాయికి ఎదిగింది. తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కూడా పొందింది. తక్కువ పదాలతో భాషా పటిమతో భావ స్ఫూరకంగా చెప్పడమే ఇందుకు కారణం అని విమర్శకులు చెబుతారు.

మినీ కవిత అభ్యుదయం కోసం నిరంతరంగా సాగే ప్రయాణం కోసం తపన పడినవారు డా,, రావి రంగారావు గారు మినీ కవిత్వాన్ని ఒక ఉద్యమముగా భుజాన వేసుకుని మినీ కవులందరికో ప్రోత్సాహాన్ని అందిస్తున్న విషయం మర్చిపోకూడదు. "మినీ కవిత ఆయుష్షు మెరుపంత కానీ అది ప్రసరిస్తుంది – కాలమంత" అని సినారే గారు అన్నారు. "ఎన్ని గజాలు రాశాడు అన్నది కాదు ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం" అని ఆరుద్ర వంటి వారు విని కవిత్వాన్ని నిర్వహించారు. ఎస్ ఆర్ పృథ్వీ గారు 1992లో పృథ్వీ తరంగాలు అనే మినీ కవితా సంపుటి ప్రచురించారు. అందులో తాను దర్శించిన సామాజిక వైరుధ్యాన్ని వ్యక్తి ప్రవర్తనలోని వక్రతల్ని, తాను అభిమానించే తత్వాన్ని పృద్వీతరంగాల్లో మినీ కవితలు వ్యక్తీకరించారు ఉదాహరణకి చూడండి.

కష్టపడిన వాడికి
ప్రతిఫలం తూచి, తూచి
స్వామీజీల పాద పూజకి
వేలు, లక్షలు దాచి, దాచి అంటూ శ్రమ జీవితాన్ని గౌరవించలేని సమాజాన్ని విమర్శించడం పై మినీ కవితలో కనిపిస్తుంది. ఇక్కడ కష్టపడే వాడికి మనం తూచి తూచి ఇస్తాం. కానీ స్వామీజీలకు దాచి దాచి మరీ ఇస్తాం. అని కవి లోకం తీరును గొప్పగా వివరించారు

"ఓటు -జాతి ప్రగతికి గీటు
నోటు - జీవన గతిని మీటు
ఓటు - నోట్ల ఆటుపోట్లు
సామాన్యుని బ్రతుకులో
మిగిలే అగచాట్లు అంటూ కవి ఇక్కడ రెండు ముఖ్యమైన విషయాలను ప్రస్తావించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా విలువైనది అని దాని పైనే జాతి ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. అదేవిధంగా మనిషి లోకంలో బ్రతకడానికి 'నోటు' చాలా అవసరం. నోటుతో ఓటును కొంటె మాత్రం సామాన్యుని కష్టాలు తప్పవు అనే మెరుపులాంటి సందేశం ఈ మినీ కవితలు అంతర్లీనంగా బోధిస్తుంది.

ముగింపు: కవిత్వం ఎంత ఎంత రాస్తే మాత్రం ఏముంది? అందులో సమాజానికి పనికివచ్చే అంశం వస్తువు అయి ఉండాలి. అది మనిషిని నిద్రలేపేదిగా ఉండాలి. ఆలోచింప చేసేదిగా ఉండాలి. డా,, దాశరధి గారి శైలిలో మినీ కవిత్వానికి ఒక నిర్వచనం చెప్పారు. క్లుప్తత, ఆప్తత, గుప్తత, క్లుప్తంగా ఉండాలి. అంటే చిన్నదిగా ఉండాలి అంటారు. ఎంత చిన్నది అయితే అంత మంచిది. ఆప్తత అంటే పాఠకుడి హృదయాన్ని ఆకర్షించాలి. గుప్తత అంటే ప్రయోజనం మెరుపుతీగ లాగా ఉండాలి. 'మినీ కవిత' అంటే కవి చెప్పే విషయం సూటిగా పాఠకుడి హృదయాన్ని తాకే స్వభావం ఉన్న ప్రక్రియ. మనసుని సంఘర్షంపజేసి, ప్రశ్నల్ని ఉదయింప జేస్తుంది. జవాబుల కోసం అన్వేషింప చేస్తుంది. ఇటువంటి లక్షణాలు ఉండడం వాళ్లని మినీ కవిత చిరంజీవిగా నిలిచి ఉంది.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**ఆధార గ్రంథాలు:**
1. స్వాతంత్రానంతరం తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం- ఆచార్య ఎస్. శరత్ జోష్నారాణి.
2. తెలుగు సాహిత్య చరిత్ర -ఆచార్య వెలమల సిమ్మన్న.
3. పృధ్వీ తరంగాలు - ఎస్ ఆర్ పృధ్వీ.
4. కదంబం తెలుగు సాహిత్య ప్రక్రియలు రూపాలు సాగి కమలాకర శర్మ.
5. కవితాలోచనం డా,, రావి రంగారావు.
6. మైలురాయి - ఆచార్య ఎస్ గోపి.

## భావకవిత్వం – భావకవిత్వ శాఖలు

**డా. భూక్య జ్యోతి**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల
మదనపల్లి

**ఉపోద్ఘాతం**: గురజాడ రాయప్రోలుతో ప్రారంభమైన నవ్యకవిత్వ లక్షణములను, దానిని ఇరువురు యుగకర్తలు కలగించిన వికాసస్ఫూర్తిని స్థూలదృష్టితో చూచినచో ఈ నవ్యకవిత్వంలో తాలోత్తాలమైన ఉద్యమములు రెండే రెండు. ఒకటి భావకవిత్వం, రెండవది అభ్యుదయ కవిత్వము. భావకవితోద్యమము దాదాపు దశాబ్దములపాటుగా ఆంధ్ర సాహిత్య కేదారమున పసిడిపంట పండించింది. ఒక్కమాట భావకవితా విహాయసమును పరికించినచో రాయప్రోలు విశ్వనాథ, వెంకటపార్వతీశ్వరులు, కృష్ణశాస్త్రి, దువ్వూరి జాషువా, బాపిరాజు, నండూరి మున్నగు కవి నక్షత్రములు అక్షరకాంతి వృష్టిని కురియుచు కనిపించును.

భావకవిత్వం అంటే భావోద్వేగాలను, వ్యక్తిగత అనుభవాలను కవిత్వంగా వ్యక్తపరిచే ప్రక్రియ. ఇది తెలుగు సాహిత్యంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుంది. ఈ కవిత్వం మనిషి మనసులోని భావాలను, ఆలోచనలను హృదయానికి హత్తుకునే విధంగా సులభమైన భాషలో వివరిస్తుంది.

భావకవిత్వ నిర్వచనము: రాయప్రోలు వారి కావ్యములో భావగీతము, భావపదము తొలిసారి కనిపించుచున్నవి. తరువాత విశ్వనాథవారి గిరికుమారుని ప్రేమగీతములలో కృష్ణశాస్త్రిగారి ఊర్వశిలో భావగీతము ఉపయోగించారు.

భావకవిత్వమును నిర్వచించిన వారిలో పంచాగ్నులవారు, విశ్వనాథవారు గణనీయులు. "కవి యొక్క ఒక అవిసృష్టి వాంఛాకురుము, ఒక అతర్నిగూఢతాపము, ఒక చిన్న కావ్యములో ఊదబడినచో" అది భావకవిత్వమని విశ్వనాథవారన్నారు. ఇంగ్లీషు

విమర్శకులు Lyrical poetry చెప్పిన నిర్వచనముతో తలమాగుచున్నవి. కాని కవి తన మనస్సులోని సుఖదుఃఖములను విభిన్న కాంక్షలను 'లిరికు' ద్వారా వ్యక్తము చేయునని స్పష్టమైనది. ఈ విధంగా కవులు వారివారి యొక్క అభిప్రాయాలను తెలియజేశారు.
భావకవిత్వం మరీ అంత పెద్దది కాకుండా మరీ అంత చిన్నది కాకుండా మధ్యస్తంగా ఉంటుంది. సంక్షిప్తత ప్రధానగుణంగా ఉంది. రసావిర్భాతిని కలిగిస్తుంది.

భావకవిత్వ శాఖలు: కవితావస్తు స్వరూప స్వభావాన్ని బట్టి భావకవిత్వాని ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, ఆధ్యాత్మిక కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, మానవతావాద కవిత్వం, స్తుతికవిత్వం, స్మృతికవిత్వం, బాలగేయకవిత్వం అని కొన్ని విధాలుగా విభజించవచ్చు.

ప్రణయ కవిత్వం: ప్రణయ కవిత్వం తెలుగు సాహిత్యంలో ఎంతో ప్రాచుర్యం పొందినది. ప్రణయ కవితలు సాధారణంగా ప్రేమ, ఆప్యాయత, విరహం వంటి భావాలను వ్యక్తపరుస్తాయి. భావకవిత్వములో 'ప్రణయము' దాదాపు స్త్రీ-పురుషల మధ్యగల ప్రేమపరముగానే వాడబడినది. మానవ జీవితానికి పరమావధి ప్రేమ. దీనికి నాశనం తమ సృష్టి ఉన్నంతవరకు ఇది సజీవంగానే ఉంటుంది. ఈ ప్రేమ భావకవుల్ని ఊహాలోకంలో విహరింపజేసింది. అలాంటి వారిలో దేవులపల్లి, విశ్వనాథ, తల్లావజ్ఝల, నాయని మొదలైనవారు. వీరందరికి ఇష్ట దేవతలున్నారు. నాయనికి వత్సల, కృష్ణశాస్త్రికి 'ఊర్వశి' విశ్వనాథకి కిన్నెరసాని ఊహ ప్రేయసులు, ఉపాసనా దేవతలు అయ్యారు. భావకవులు తమ కవిత్వాన్ని ఆత్మ శ్రమరీతిలో కొనసాగించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తమ భావాలను ఈ కవిత్వం ద్వారా తెల్పారు.

"ఎను మరణించుచున్నాను ఇటు నశించు నా కొరకు చెమ్మగిల నయనమ్ములేదు పిసిడి వేకువ పెండ్లిండ్ల బడిన యెవరు కరగనేర్తురు జరఠాంధకారమృతికి" అని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ప్రేమ లేదా, దుఃఖములను ఒక భావనను అద్భుతముగా ఉపయోగించారు. ఎవరు మరణించుచున్నారు? ఎందుకు మరణించుచున్నారు? అను విషయములు మనకు తెలియవు. కాని భావన చేసికొనవలెను.

ప్రకృతి కవిత్వం: భావకవిత్వములో ప్రణయకవిత్వము దేశభక్తి కవిత్వము ప్రధానమైనవి. ప్రకృతి వర్ణన ఈ నాటివి కావు. కవి తావతరణమే ప్రకృతి వర్ణనలతో ప్రారంభమైనదనవచ్చును. గడగడమని ఒక మేఘము గర్జించినప్పుడు తుళుక్కని ఒక మెరపు మెరసినప్పుడు ఫెళ ఫెళర్భటులతో పిడుగు పడినప్పుడు వానకురిసినప్పుడు, వెన్నెల విరిసినప్పుడు మనస్సులోని ఉద్వేగోల్లాసియులు, హాసత్రాసిములు, వినోద విస్మయములు, ఛందోరూపమునా, మందహాసము చేసినవి. అవన్నియు ప్రకృతి వర్ణనలే. భావకవులకు ప్రకృతి ప్రాణం. వీరికి ప్రకృతికి విడదీయరాని అనుబంధం ఉంది. బాపిరాజు కవికొండల, నాయని, దువ్వూరి, విశ్వనాథ మొ|| వారు ప్రకృతి చిత్రీకరణలో తమ ప్రజ్ఞాపాటవాల్ని ప్రదర్శించారు.

కృష్ణశాస్త్రిగారు "కృష్ణపక్షంలో ఆకులో ఆకునై పూవులో పూవునై కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై ఈయడవి దాగిపోనా ఎటులైనా నిచటనే యాగి పోనా" అని ప్రకృతిలో లీనమౌతాడు.

ఆధ్యాత్మిక కవిత్వం: ఆధ్యాత్మిక కవిత్వంలో ఆంగ్లంలో బ్లేక్, వర్డ్స్వర్త్, షెల్లీ, టెన్నిసన్ మొదలగువారు ప్రముఖులు ఉన్నారు. ఆధ్యాత్మిక కవిత్వం అంతర్ముఖస్థాయిలో ఆత్మశుద్ధి, దేవుని సంకల్పం, భగవంతుని ప్రేమ ఆధ్యాత్మిక విషయల మీద భావనలను తెల్పుతుంది.

తెలుగులో కృష్ణశాస్త్రి, విశ్వనాథ, బసవరాజు, వేంకటపార్వతీశ్వరకవులు మొదలగు వారు ఘనంగా కీర్తింపబడ్డారు. రాయప్రోలు సుబ్బారావుగారు జడకుచ్చులు రాధ పిలుపులో "పొదలలో పూవలె పోయినావేమొ తమ్మిలో తేనె వై దాగినావేమొ నిన్నెందు చూతురా

చిన్నారికృష్ణా ఏమూల వెదికేనురా మెహనాంగా" అని అనడంలో అద్వైతతత్వం వెల్లడవుతుంది.

దేశభక్తి కవిత్వం: ఆధునికాంధ్ర కవిత్వములో దేశభక్తి రెండుపాయలుగా ప్రవహించినవి. ఒకటి భారత జాతీయాభిమానం, రెండవది ఆంధ్రాభిమానం అని రెండు పాయలుగా ప్రవహించింది. దేశభక్తి కవిత్వానికి దేశంలో ప్రజార్విల్లిన స్వాతంత్ర దీక్ష ఊపిరికాగా, దేశం యొక్క విశిష్టతను గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని వర్ణించి చెప్పటం లక్ష్యమైంది. భారతజాతీయతను గూర్చి చిలకమర్తి, గురజాడ, రాయప్రోలు మొదలైన కవులు చక్కగా ప్రబోధించారు. రాజమహేంద్రవర సభలో చంద్రపాల్గారి ఉపన్యాసము విని ఉద్రికులై చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు.

"భరత ఖండబు చక్కని పాడియావు, హిందువులు లేగదూడలై యేడ్చుచుండ, తెల్లవారను గడసరి గొల్లవారు పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అనే పద్యం వారి జాతీయాభిమానానికి ప్రతీకగా నిలుస్తుంది.

'జన్మభూమి' గేయంలో రాయప్రోలు సుబ్బారావుగారి "ఏ దేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలపరా నీ జాతి నిండు గౌరవము" అని జాతీయ భావన స్ఫూర్తి ప్రస్ఫుటమౌతుంది.

సంఘసంస్కరణ కవిత్వం: ఆంధ్రదేశములో పందొమ్మిదవ శతాబ్ది అంతమున వీరేశలింగంగారు. సంఘసంస్కరణోద్యమాన్ని ప్రారంభించిరి. 20వ శతాబ్దం నుండి ఆయన ఉద్యమ మరింత విజృభించినది. వీరేశలింగంగారికి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు కుడిభుజమై నిల్చిరి. ఎంతోమంది భావకవులు సంఘసంస్కరణ దృష్టితో సంఘసంస్కరణ కవిత్వానికి శ్రీకారం చుట్టారు.

"మంచి చెడ్డలు మనుజులందున, యెంచి చూడగా రెండు కులములు, మంచి యన్నది మాలమైతే, మాలనే అగుదున్" అనే గేయంలో గురజాడ విశ్వమానవ సౌభ్రాతృత్వానికి చక్కని ఉదాహరణ.

మానవతా దృక్పథం: మానవాతావాదం వ్యక్తికీ, జాతికి స్వాతంత్ర్యాన్ని కోరుతుంది. దీని సర్వమానవ సౌభ్రాతృత్వం, మానవ సౌభ్యాద్వేషణ లక్ష్యం అందరినీ ఆకర్షించింది. గురజాడ, జాషువా, తుమ్మల, కరుణశ్రీ మొదలైన కవులందరూ మానవతావాద కవిత్వం రాశారు. కృష్ణశాస్త్రిగారు మానవతపై ఎన్నో గేయాలు రాశారు.

"కులందాటి, మతందాటి, కొద్దిదాటి, సమభోగం, సమభాగ్యం, సమసంస్కృత నాటి కొత్తశాంతి, కొత్తకాంతి, భారతావాని నిందె" అని మతాన్ని నిరసించారు.

స్తుతి కవిత్వం: స్తుతి కవిత్వం అనేది కవితా ప్రక్రియల్లో ఒకటి. ఈ ప్రక్రియలో కవి తమ భావాలను అనుభూతులను వ్యంగ్యంగా, ఉల్లాసంగా లేదా ఆకర్షణీయంగా వ్యక్తం చేస్తారు. స్తుతి కవిత్వం తరచుగా సామాజిక, రాజకీయ లేదా వ్యక్తిగత అంశాలపై విమర్శలను చేయడానికి వాడతారు. ఈ కవిత్వంలో నవ ప్రయోగం చమత్కారం పరమార్థం కలగలిపి ఉంటాయి. విశ్వనాథవారు ఆంధ్ర పత్రికాధిపతి శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు గారిని, ప్రముఖ కాంగ్రేస్ నాయకుడు భోగరాజుగారిని ప్రశంసిస్తూ పద్యాలు రాశారు.

సోకుల నందున సుఖమిది కానరాదు, పూర్వజన్మ వ్యాధి పోవనో!..... అని కాశినాథుని వ్యంగమైన కవిత్వం యొక్క ఉదాహరణలు.

స్మృతికవిత్వం: స్మృతికవిత్వం అంటే మనసులో గుర్తిండిపోయిన అనుభవాలను, సంఘటనలు, వ్యక్తులను గురించి రాసిన కవిత్వం. ఇది భావోద్వేగాలకు స్మృతిలకు ప్రతిబింబిస్తుంది. స్మృతికవిత్వంలో భావోద్వేగం, నొప్పి, ఆనందం వంటి అన్ని రకాల భావాలను మనం చూసే అవకాశం ఉంటుంది. విశ్వనాథ, దువ్వూరి, నాయని మొదలైన వారు స్మృతికవిత్వంలో రాశారు.

బాలగేయ కవిత్వం: బాలగేయం కవిత్వం అంటే పిల్లల కోసం రాసే కవిత్వం. ఈ కవిత్వం పిల్లకు సాహిత్య, నైతిక, సామాజిక విలువలను నేర్పడంలో సహాయపడుతుంది. కథలు, వ్యాసాలు, గేయాలు మొదలైన బాలగేయ కవిత్వంలోకి వస్తాయి. తెలుగులో బాపిరాజు గారు బాలగేయాల్ని రాసి బాలసాహిత్యానికి మెరుగులుదిద్దారు.

ముగింపు: ఈ విధంగా భావకవులు భావకవిత్వాన్ని వివిధ శాఖలుగా విభజించుకొని అందులో తమ ప్రతిభను చక్కగా ప్రదర్శించారు. ఈ విభాగాలలోని కవిత్వం, సమాజంలో జరిగిన మార్పులు, ప్రబల భావజాలాలు, వ్యక్తిగత భావోద్వేగాలను ప్రతిబింబిస్తుంది. ఆధునిక కవిత్వం భావోద్వేగాలను ఆలోచనలను అత్యంత స్వేచ్ఛగా వ్యక్తీకరించి ఒక ప్రక్రియగా భావించబడుతుంది.

**ఆధారగ్రంథాలు:**

1. ఆధునికాంధ్ర కవిత్వములు - సంప్రదాయము, ప్రయోగములు- సి. నారాయణరెడ్డి
2. తెలుగులో కవితోద్యోమాలు ఆచార్య కాత్యాయనీ విద్మహే, డా॥ కోవెల సంపత్కుమారాచార్య, డా॥ ద్వా.నా. శాస్త్రి.

## ఎండ్లూరి కవిత నల్ల ద్రాక్ష పందిరి - నవ్య పద చిత్రాలు

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**డా|| గుండ్లూరు వెంకట రమణ**
తెలుగు ఉపన్యాసకులు
శ్రీ చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణపవరం
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
చరవాణి: +91 9000418264
Email: gvrhcu09@gmail.com

**స్థూలంశాలు:** సాహిత్యం మానవుని జీవిత కార్యకలాపాల్ని, సజీవ సమాజ వాస్తవ స్థితిగతుల్ని చిత్రించే ఏకైక సాధనమని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యాన్ని మన అధ్యయన సౌలభ్యం కోసం ప్రాచీన తెలుగు సాహిత్యమనీ, ఆధునిక తెలుగు సాహిత్యమని రెండు భాగాలుగా విభజిస్తున్నాం. ప్రాచీన తెలుగు సాహిత్యంలో పద్యం ప్రధాన వాహికగా కనబడుతుంది. ఆధునిక సాహిత్యంలో వచనం ప్రధాన భూమికను పోషిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యం కందుకూరి వీరేశలింగం గారితో ప్రారంభమైందని చెప్పవచ్చు.
ఆధునిక తెలుగు సాహిత్యంలో సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం, భావకవిత్వోద్యమం, అభ్యుదయ కవిత్వోద్యమం, విప్లవ కవిత్వోద్యమం, దిగంబర కవిత్వోద్యమం, పైగంబర కవిత్వోద్యమం, చేతనా వర్తన కవిత్వోద్యమం లాంటి ఉద్యమాలు, మినీ కవిత్వం, లాంటి ధోరణులు. స్త్రీ వాదం, దళిత వాదం, బి.సి మైనార్టీవాదం, ముస్లిం మైనార్టీ వాదం, క్రిష్టియన్ మైనారిటీ వాదం, ప్రాంతీయ వాదం, అస్తిత్వ వాదం లాంటి అనేక వాదాలు చోటు చేసుకున్నాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన వాదాల్లో దళితవాదం ప్రాముఖ్యమైంది. క్రిష్టియన్ మైనారిటీ వాదం దళిత వాదంలో ఒక భాగంగా కనిపిస్తుంది. ఎందుకంటే సమాజంలో ఎక్కువశాతం దళితులే క్రైస్తవులుగా వుండటం వల్ల. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన అత్యాధునిక ధోరణుల్లో క్రిష్టియన్ మైనారిటీ సాహిత్యం కూడా ఒకటి.
ఆధునిక కాలంలో వస్తున్న అనేక మార్పుల్ని, పరిణామాల్ని, అంశాల్ని సాహిత్య వస్తువుగా స్వీకరించడం జరుగుతోంది. అందులో భాగంగా బైబిల్ లో ఉన్న పదాల్ని, వ్యక్తుల్ని, స్థలాల్ని తీసుకొని ప్రతీకాత్మకంగా చిత్రించడమనేది ఆధునిక కాలంలో వచ్చిన ఒక కొత్త మార్పు. సమాజంలో అస్పృశ్యులుగా, వెలివేయబడిన వారుగా, భావించబడే దళితులు క్రిష్టియన్ ఫాదర్ లు, చర్చిలు, స్కూలు, పాఠశాలలు, కళాశాలల సహాయ సహకారాలతో, ప్రేమాదరణలతో సమాజంలో తమకంటూ ఒక స్థానాన్ని గుర్తింపును సంపాదించుకున్నారు.
ఆధునిక కాలంలో క్రైస్తవ దృక్పథంతో కవిత్వాన్ని అందిస్తున్న వారిలో ఎండ్లూరి సుధాకర్ గారిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. ఒక దళిత సామాజిక వర్గం నుంచి వచ్చి, అనేక అవమానాలకు, కష్టాలకు, కన్నీళ్ళకు, ఆకలిబాధలకు తట్టుకుని తన అనుభవాల సారాన్ని కవిత్వీకరించి ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. ఎండ్లూరి సుధాకర్ 1969-70ల ప్రాంతం నుంచి బాలగేయాలతో తన కవితా ప్రస్థానాన్ని ప్రారంభించారు. సాహిత్యపరంగా ఆయనపై ఎక్కువగా దాశరథి, సినారెల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. సామాజికంగా చూసినప్పుడు అంబేద్కర్ ప్రభావం ఆయనపై వున్నట్లు తెలుస్తోంది. దైవచింతన లేక ఆధ్యాత్మిక దృక్పథంతో చూచినప్పుడు బైబిల్ ప్రభావం ఉన్నట్లు, ఆయన కవిత్వాన్ని చదివినప్పుడు మనకు అవగతమవుతుంది. భాషా పరంగా ఎండ్లూరి సుధాకర్ పై ఉర్దూ భాషా ప్రభావం ఉన్నట్లు కూడా తెలుస్తోంది. ఆయన కిరాణా షాపుల దగ్గర, కొట్ల దగ్గర వినిన సంభాషణల్ని సహజంగా తన కవిత్వంలో పొందు పరుస్తారు. ఆయన కవిత్వంలో శృత పాండిత్యం పాల్లు ఎక్కువ. ప్రధానంగా ఆయన కవిత్వంలో ప్రాచీన సాహిత్యపు అభివ్యక్తి, సౌందర్యాత్మక దృష్టి, అంబేద్కర్ ప్రభావం, దళిత చైతన్యం మనకు దర్శనమిస్తాయి.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**ఎండ్లూరి సుధాకర్ పరిచయం:** ఎండ్లూరి సుధాకర్ తన 'వర్తమానం'లో నడుస్తున్న సమాజ చరిత్రను, 'మల్లె మొగ్గల గొడుగు కిందకు తీసుకొచ్చి చూపించాడు. ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని నమ్ముకొని బతికామే కాని శ్రీనాథుని లాగా వాటిని సంతలో అమ్ముకొని బతకలేదనే ఆత్మ గౌరవాన్ని 'గోసంగి' లో ఘోషింపజేస్తాడు. జాషువా గబ్బిలానికి కొత్తదనాన్ని అపాదించి కొత్త గబ్బిలం ద్వారా తన సందేశాన్ని వినిపిస్తాడు. తాము బతికి చెడినోళ్ళమే కానీ చెడగొట్టి బతికే వాళ్ళం కాదనే అంశాన్ని 'వర్గీకరణీయం'లో చెబుతాడు. ఆనాడు పాదలేపనంతో హిమాలయాన్ని సందర్శించిన (అటజనికాంచె) ప్రవరుని కంటే తానేం తక్కువవాడిని కానని నిరూపిస్తూ, ఎగిరే లోహశ్యేనంలో హిమాలయం కంటే పదింతల దూరముండే అమెరికాను సందర్శించిన విశేషాలను 'ఆటా జనికాంచె' లో మనకు చూపిస్తాడు.

**నల్లద్రక్షా ప్రత్యేకత:** ఎండ్లూరి రాసిన 'నల్లద్రాక్ష పందిరి'లో ఒక ప్రత్యేకత ఉంది. పైన చెప్పిన కవితా సంపుటాల్లోంచి ఎంపిక చేసిన కవితల హారమే ఇది. ఇందులో ఆయన వాడిన నవ్య పదాల్ని, వాటి భావ చిత్రాల్ని పరిచయం చేయడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం. అందులోనూ బైబిల్ లో నుంచి తీసుకున్న పదాల్ని, ప్రతీకల్ని, భావ చిత్రాలను పరిచయం చేయడం ఈ వ్యాసం ప్రధాన ఆశయం. ఈ కవితా సంపుటి 'అమ్మ గాజులు' అనే కవితతో ప్రారంభించబడింది.

'అమ్మ గాజులు' అనే కవితలో తన గతస్మృతుల్ని, తల్లి ప్రేమను, తన తండ్రి చనిపోయినప్పుడు పగుల గొట్టిన అమ్మగాజుల శబ్దాలు జ్ఞాపకాలను గుర్తు చేస్తాడు. 'ఆత్మ కథ'లో తన గురించి అభినందన పత్రాలు చదివినప్పుడు అవమానాల చురకత్తులు గుచ్చుకుంటున్నాయంటాడు.

**1. ప్రార్థన:** ఎండ్లూరి తన 'నల్ల ద్రాక్ష పందిరి'ని అంకితమిస్తూ 'ప్రార్థించిన' అపురూప హస్తాలకు అని అన్నారు. క్రైస్తవులు మాత్రమే వాడే పదం ప్రార్థన. ప్రతిదానికీ ప్రార్థన చేయాలి అన్న భావన కలిగి వుంటారు. ఎందుకంటే ఏసు తన శిష్యులకు తానే స్వయంగా ప్రార్థించటమెట్లాగో నేర్పించాడు.

**2. పునరుత్థానం:** నల్లద్రాక్ష పందిరికి ముందుమాట రాస్తూ డా.వి. చంద్రశేఖర రావు 'పునరుత్థానాన్ని సాధించిన వాళ్ళ గొంతుకలివి' అన్నారు. అంటే దళితులు పునరుత్థానం ద్వారా పొందిన సజీవమైన గొంతుకలు కలవారనే అర్థం స్ఫురిస్తోంది. పునరుత్థానం అంటే మరణాన్ని జయించి తిరిగి లేవటం అని అర్థం. ఈ ప్రపంచంలో చనిపోయి తిరిగి లేచిన వ్యక్తి ఏసుక్రీస్తు ఒక్కడే. ఆయనకు పునరుత్థానం మీద అధికారం కలదు. కాబట్టి క్రీస్తు ద్వారా చావుని జయించి తిరిగి లేచిన వాళ్ళ గొంతులోంచి వస్తున్న మాటలే ఈ కవితలు అని చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు.

**3. నీళ్ళ మీద నడిచిన ఏసు:** ఈ భావ చిత్రాన్ని గూర్ఖా అనే కవిలో చూస్తాం.

ఏండ్లూరి 'గూర్ఖా' కవిత చాలా ప్రసిద్ధమైంది. గూర్ఖా యొక్క జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తాడు.

గూర్ఖా భార్యా బిడ్డల్ని, అనందాల్ని, సంతోషాలన్నింటినీ దూరంలో పెట్టి రాత్రంతా కావలి కచేరీ చేస్తాడు. ప్రతి రాత్రీ గౌతమ బుద్ధుడౌతాడు. బిచ్చగాళ్ళనీ, మూలుగుతున్న తల్లిదండ్రుల్ని, పీడితుల్ని, కుష్టురోగుల్ని, వేశ్యల్నీ అందర్నీ చూస్తాడు.

గూర్ఖా "రక రకాల సుఖదుఃఖాల దృశ్యాల్ని విలోకిస్తూ గొప్ప కవిగా ఏవేవో భావిస్తూ నీళ్ళ మీద నడిచిన క్రీస్తులా అతడు కన్నీళ్ళ మీద నడుచుకుంటూ పోతాడు" అని అతని జీవితాన్ని చూపిస్తాడు. క్రీస్తు నీళ్ళమీద నడిచినప్పుడు అతని శిష్యులు చూచి భయపడ్డారు. నీళ్ళమీద నడిచింది క్రీస్తు ఒక్కడే. అయితే రోజూ కన్నీళ్ళ మీద నడిచే గూర్ఖా క్రీస్తులెందరో....

**ప్రార్థించడం:** "చెరువు లేని ఊరు" అనే కవితలో "అకాశం వైపు చేతులు మోడ్చి / మాకో చెరువునియ్యమని ప్రార్థించాం" అనంటాడు. వర్షాలు లేక కరువు ఏర్పడిన సందర్భంలో ఈ విషయాల్ని ప్రస్తావించారు. వర్షాలు రానప్పుడు ఏలియా అనే ప్రవక్త ప్రార్థించినప్పుడు దేశంలో వర్షాలు పడి పంటలు పండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లినట్లు ఉంది. ఆ సన్నివేశాన్ని అధారం చేసుకున్నట్లనిపిస్తుంది.

**గాడిద - డక్కలి పిల్ల (పంచమ చాలిక):** ఈ కవితలో డక్కలి పిల్ల ఊరూరూ తిరిగి గాడిద పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటూంది. ఆ పిల్ల జీవితం గురించి ఇందులో "ఆ పంచమ బాలిక గాడిదను మాత్రమే నమ్ముకునేది". అట్లాగే, "గాడిద మీదెక్కి/ ఆ పిల్ల మా గూడెంలోకి వచ్చిందంటే / యెరూషలేములోకి యేసు ప్రవేశించినట్లుండేది" అనంటాడు. డక్కలి పిల్లను ఏసుతో, గూడేన్ని యెరూషలేంతో పోల్చాడు. భూమి మీదున్న యెరూషలేం పట్టణంలో గొప్ప కట్టడాలు ఉన్నాయి. క్రిష్టియన్ గా పుట్టిన వాళ్ళు జీవితంలో ఒకసారయినా యెరూషలేం ను చూడాలనుకుంటారు. అంత పవిత్రమైన పట్టణంగా భావిస్తారు. అలాంటి గొప్పదే మా గూడెం కూడా అనే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నాడు. ఏసు గాడిద మీదనే ప్రయాణం చేశాడు. మనుష్యులు అందరి చేత తృణీకరించబడిన గాడిదను కూడా ఏసు ప్రేమించాడు. దానినే తన వాహనంగా చేసుకున్నాడు. డక్కలి పిల్ల జీవితం కూడా తృణీకరించ బడ్డదే. సమాజంలోనుంచి వెలివేయబడిందే.

**ఆత్మ:** 'తపన' అనే కవితలో ఈ పదం కనిపిస్తోంది. కవి మంచి స్నేహం కోసం మనసు మండలమంతా తిరిగానంటాడు. అలా తిరుగుతూ స్నేహం చేద్దామని పూలనడుగుతాడు. అందుకు పూలు "చిరకాలం జీవించేవాళ్ళు మీరు / ఒక పరిమిత కాలం బతికే వాళ్ళం మేము / కలుషితం చేయ్యద్ధ"ని అంటాయి. రెండోదిగా చెట్లుతో చెలిమి చేద్ధామని అడిగితే 'కత్తులు దూసేవాడితో కరచాలనం పనికిరాద"ని చెబుతాయి. మూడోదిగా కొవ్వొత్తినడిగితే 'చీకటి నా మిత్రుడు అతని చూసిపోదామని వచ్చా'నని కొవ్వొత్తి కూడా తిరస్కరిస్తుంది. నాలుగోదిగా ఒక చిలకనడుగుతాడు. చిలక 'ఇది ద్రోహకాలమే కానీ స్నేహకాలం కాదం'టుంది. ఐదోదిగా ఓ పిపీలకాన్ని అడుగుతాడు. అందుకు 'పిపీలకం' ఉత్పత్తి సంబంధాల వల్మీక లోకంలో / ఉత్తుత్తి స్నేహాలే తప్ప / అదనపు విలువల కోసం ఆరాటం అనవసరం" అని బదులిస్తుంది. ఆరోదిగా చీమనడిగితే 'ప్రతి పరిచయమూ స్నేహం కాదు / ప్రతి స్నేహం ఒక అవసరమేన'ని స్నేహానికి కొత్త భాష్యం చెప్పి వెళ్ళిపోతుంది. చివరిగా తనలోని ఆత్మనడుగుతాడు. ఆ ఆత్మ 'స్నేహానికి మరొక ఆత్మే'నని ఆత్మీయంగా అంతిమ తీర్పునిచ్చిందంటాడు.

కవి 'తపన' కవితలో స్నేహం కోసం తపించినట్లు కన్పిస్తుంది. మనుష్యుల స్నేహం మీద విసుగు, విరక్తి చెంది సృష్టిలోని జంతు వృక్షాలతో స్నేహం చేయాలనుకుంటాడు. అవన్నీ తమ లక్షణాలను చెప్పి ఇతనితో స్నేహం చెయ్యమని చెప్తాయి. కుంగిపోయిన కవి తన ఆత్మ సాక్షి ద్వారా 'ఆత్మే' స్నేహానికి సరైందని తెలుసుకుంటాడు. ప్రతి మనిషిలో ఆత్మ ఉంది. ఆ ఆత్మతో స్నేహం అంటే మనిషితోనే స్నేహం అని ఒక అర్థం. 'దేవుడు ఆత్మ' అని బైబిల్ లో ఉంది. అంటే మనిషి స్నేహం చెయ్యడానికి 'ఆత్మ' అంతిమం. ఆ ఆత్మ దేవుడు అని అర్థం. 'ఆత్మ' విస్తృతార్థాలలో ఉన్నట్లు బైబిల్ లో చూస్తాం. మనిషి స్నేహానికి చివరిగా దేవుడే మిగిలాడు. అతనితో స్నేహం చెయ్యమంటాడు.

**ఆడక్రీస్తు:** 'నల్లతల్లి' అనే కవితలో ఈ ప్రయోగం కనిపిస్తుంది. తన తల్లిని గురించి రాసుకొన్న కవిత. ఆమె పడిన బాధలు, పొందిన అవమానాలు, ఆకలికేకలు, ఆర్తనాదాలు అన్నింటినీ ఆడక్రీస్తులా భరిస్తూ మౌనంగా ఉండిపోయిందంటారు. క్రీస్తు శ్రమ పెట్టే వాళ్ళను, బాధించేవాళ్ళను, దూషించేవాళ్ళను ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడు. అన్నింటినీ భరించినట్లు తన తల్లి కూడా అలాగే భరిస్తూ మౌనంగా ఉండిపోయిందంటాడు. 'నాన్న' కవితలో తన తండ్రిని స్మరించుకుని 'ఆమూల మోకాళ్ళపై కూర్చొని ప్రార్థిస్తున్నట్లే వుంటుంద'నంటారు.

**శిలువల మీద బాలయేసులు:** ఈ భావచిత్రాన్ని 'నాన్నా యుద్ధమెప్పుడు ఆగిపోతుంది' అనే కవితలో చూస్తాం. టీవీలో యుద్ధ దృశ్యాన్ని చూస్తున్న తన కూతురు వేసిన ప్రశ్నే ఈ కవిత. శిలువ మరణం పొందింది యేసు మాత్రమే. ఆ దృశ్యాన్ని చూసిన ఎవరైనా కంటతడి పెట్టాల్సిందే. జీసస్ ఏమన్నాడంటే 'చిన్న పిల్లల్ని ఆటంకపరచ వద్దు /పరలోకం వాళ్ళదే' అనే విషయాన్ని గుర్తు చేస్తాడు. పరలోకపు వారసులైన చిన్న పిల్లల్ని సిలువల మీద బాలయేసుల్ని చేసి చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తాడు.
**సిలువ గౌరవం:** 'నిమ్మలిపి' లో ఈ పదం కన్పిస్తుంది. "ఎక్కడి వాడో పాపం / ఏసు మా పేటలోకి వచ్చాడు/ ఉమ్మి ముంతకు బదులు / నా మెడకు సిలువ గౌరమిచ్చాడు" అని అంటాడు. ఇందులోనే ఒలీవ కొమ్మలు, ఉపవాస ప్రార్థనలు, బిలీవర్లు, ప్రభురాత్రి భోజనం, సిస్టర్లు, సిలువలు, కన్నె మరియమ్మ, చర్చి, బంగారు వాక్యం లాంటి క్రిస్టియన్ పదాలు, భావ చిత్రాలు కనిపిస్తాయి. 'నిన్నువలే నీ పొరుగువాని ప్రేమించుము' అనే బైబిల్ సారాంశ వాక్యాన్ని అందులోని సారాన్ని అందించాడు. ప్రతి మనిషి తన పొరుగు వాన్ని ప్రేమించాలని అంటాడు. అప్పుడు మానవ సమూహం అంతా సుఖశాంతులతో, సంతోషాలతో జీవిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తారు. ఎండ్లూరి 'నెత్తుటి ప్రశ్న' అనే కవితలో మాకిప్పుడు కావలసింది నెత్తుటి రొఖ్ఖం కాదు / "మా కేం కావాలో కోరుకునే నిర్భయపు గొంతుక / కొత్త రాజ్యాంగం, కొత్త దేశం, కొత్త భూమి, కొత్త ఆకాశం" అని తాను కోరుకునే మార్పుల్నీ, స్వీకరించే కొత్త రాజ్యాంగాన్నీ, ప్రజలు సుభిక్షంగా బతికే కొత్త దేశాల్ని, కొత్త భూమిని, కొత్త ఆకాశాన్ని కోరుకునే గొంతుకను ఇవ్వమంటాడు. అదే మాకు కావల్సిందంటాడు.
**ఐదురొట్టెలు, రెండు చేపలు:** 'యుద్ధకాందహారం'లో ఏసు ఐదురొట్టల్ని రెండు చేపల్ని పంచడానికి మేఘారూఢుడై కాందహారుకొస్తాడేమోనంటాడు. వచ్చి గాయపడిన పసిపిల్లల్ని గాడిద మీద పరలోకానికి తీసుకవెళ్తాడేయో!! అనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తాడు. యుద్ధం వద్దని పరోక్షంగా ప్రతిపాదిస్తాడు.

**క్రీస్తు, రాముడు, అల్లా:** 'రెండు పయ్యల బండి' అనే కవితలో "నిజానికి సైకిలు గొప్ప తాత్విక ప్రతీక / క్రీస్తు సైకిల్ తొక్కుతుంటే / ముందు రాముడూ / వెనుక అల్లా కూర్చొని / బోధివృక్షం దాకా షికారుకెళ్ళే / అపురూప దృశ్యం / ఈ ప్రపంచం ఎప్పుడు చూస్తుందో కదా!" అనంటాడు. నిజమే మత కలహాలు మన దేశంలో ఎక్కువగా ఉన్నాయి. ఈ ముగ్గురినీ తన సైకిలు మీద కూర్చోబెట్టి ప్రజలందరికీ చూపించాలనుకున్నాడు. నడిపించే నాయకుడు క్రీస్తు అనే అభిప్రాయాన్ని తెలియజేశాడు.

'వర్తమానం'లో ఇద్దరు దేవుళ్ళ నడుమ ప్రశాంతంగా బతకలేనంటూ "నన్ను నేను శిలువేసుకుని /మేకులు కొట్టుకొని ముళ్ళ కిరీటం పెట్టుకుని / పశ్చాత్తాప భూమిలో చచ్చి పునరుత్థానం పొంది / కొత్తగా జన్మించక పోతే / ఈ దేశంలో జీవించడానికి నేను అనర్హున్ని" అనంటూ నేనొక కొత్త దేశాన్ని స్వప్నిస్తున్నానని అంటాడు. ఏసు సిలువలో చనిపోయిన తర్వాత ఆయన కొత్త దేశంలోకి ప్రవేశించాడని బైబిల్ లో ఉంది. కవి కూడా నేను ఆ కొత్త దేశంలోకి ప్రవేశించాలను కొంటున్నాడు.
**ముగింపు:** ఈ విధంగా ఎండ్లూరి సుధాకర్ తన కవిత్వంలో నూతన పదాలను, పద చిత్రాలను, భావాలను, భావ చిత్రాలను బైబిల్ నుండి గ్రహించారు. క్రిష్టియన్ మైనార్టీ సాహిత్య సృజన చేసి ఆధునిక తెలుగు సాహిత్య వికాసానికి కృషి చేశారు.

**ఆధార గ్రంథాలు:**

1. నల్ల ద్రాక్ష పందిరి ఎండ్లూరి సుధాకర్ జె.జె. ప్రచురణలు - సికింద్రబాద్ 2002, జూన్.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

2. గోసంగి ఎండ్లూరి సుధాకర్ - అంబేద్కర్ సాహితభాగం, బొబ్బిలి, విజయనగరం- 2011, మే.
3. వర్గీకరణీయం - ఎండ్లూరి సుధాకర్ మనోజ్ఞ & మానస ప్రచురణలు - రాజమండ్రి - 2004, డిసెంబర్.
4. ఆటాజనికాంచె - ఎండ్లూరి సుధాకర్ జె.జె. ప్రచురణలు- సికింద్రబాద్ 2005, జూన్,
5. వర్తమానం ఎండ్లూరి సుధాకర్ మానస ప్రచురణలు - రాజమండ్రి 1995, జూన్.
6. ఆధునిక కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు - సినారె - ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాద్
1977.
7. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తురూప విశ్లేషణ - శరత్ జ్యోత్స్నారాణి - జ్యోత్స్న కళాపీఠ ప్రచురణలు, రాంనగర్, హైదరాబాద్, 2003.

## ఇక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం- సామాజికాంశాలు

**1)డా|| గౌరారపు శ్రీనివాస్**, తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా,
**2) డా || బి. సరస్వతి**, తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**రచయిత పరిచయం:** యిక్కుర్తి నరసింహారావుగారు గుంటూరు పట్టణంలో 1949 ఏప్రిల్ 23 వ తేదీన వీరరాఘవరావు, శకుంతలమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. 1వ తరగతి నుండి 3 వ తరగతి వరకు కృష్ణాజిల్లా నూజివీడులో, 4, 5 వ తరగతులు శ్రీకాకుళం జిల్లా సాలూరులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు యిక్కుర్తి నరసింహారావుగారి తండ్రి వీరరాఘవరావు సాలూరు (శ్రీకాకుళం జిల్లా) లో సర్వేయర్గాగా ఉద్యోగం చేస్తుండగా మరణించారు. ఆయన మరణించడం వలన అక్కడ నుండి మాతామహుల ఇంటికి (గుంటూరు) వచ్చారు. 6వ తరగతి నుండి SSLC వరకు మాజేటి గురవయ్య హైస్కూల్ గుంటూరులో విద్యాభ్యాసం చేశారు.

స్నేహితుల ప్రోత్సాహం, ఆత్మీయుల ఆదరణతో రాజమండ్రి రాత్రి కళాశాలలో PUC, B.A తెలుగు మెయిన్ సబ్జెక్ట్ గా చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అన్నామలై విశ్వవిద్యాలయం నుండి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా 1980 వ సంవత్సరంలో B.Ed చేశారు.

**వివాహ జీవితం:** యిక్కుర్తి నరసింహారావుగారి వివాహం 14-7-1975 న శ్రీకాంతమ్మతో జరిగింది. వీరికి 1977వ సంవత్సరంలో మొదటి సంతానంగా పుత్రుడు జన్మించాడు. పుత్రుని పేరు వీరరాఘవ పాత్ర, ఆయన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రెండవ సంతానం 1980వ సంవత్సరంలో పుత్రిక జన్మించింది. పుత్రిక పేరు అనురూప. ఈమె హైదరాబాద్లో సాఫ్ట్వేరు ఇంజినీరుగా పని చేస్తున్నారు. 1982 వ సంవత్సరంలో మూడవ సంతానంగా

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

పుత్రుడు జన్మించాడు. అతని పేరు హరేంద్ర ప్రతాప్. ఇతను హైదరాబాద్లో సాఫ్ట్వేర్ ఇంజినీర్ గా పని చేస్తున్నారు.

**రచయితగా యెక్కుర్తి నరసింహారావు:**

**యెక్కుర్తి నరసింహారావుగారి వివిధ రచనలు:**

1) నాటికలు
2) కవితలు
3) జానపద గేయ సాహిత్యం
4) బాలసాహిత్యము

**ఉపోద్ఘాతము:** వాఙ్మయం, సారస్వతం రెండూ సమానమైన అర్థానిచ్చే పదాలు సాహిత్యము వాఙ్మయంలోని ఒక విభాగం " సహితస్యభవతీ ఇతి సాహిత్యమ్ " అని సాహిత్యానికి వ్యుత్పత్తి. హితంతో కూడినది సాహిత్యం అని అర్థం. సాహిత్య ప్రక్రియలలో ఒకటి కవిత్వం మొదట్లో కేవలం ఛందోబద్ధమైన పద్యరచననే కవిత్వం అని భావించేవారు. ఆధునిక కాలంలో వచనంలో రాసినా దాన్ని కవిత్వమనే అంటున్నారు.

కవిత్వం ద్వారా ఎన్నో సామాజిక సమస్యలను మనస్సుకు తట్టేలా గొప్పగా చెప్పవచ్చుననే అవగాహనే యెక్కుర్తిని కవిత్వం రాసేలా ప్రేరేపించింది. ఇందులో రచయిత వివిధ సామాజికాంశాల పట్ల తన మనస్సులో చెలరేగిన అనుభవం, స్పందన, భావవీచిక, విషాదం, విలాపం అన్నింటినీ 'కలం చిందులు' పేరుతో 98 చిన్న కవితలలో అందించాడు.

**కలం చిందులోని సామాజికాంశాలు:** కలం చిందులు సాంప్రదాయాన్ని గౌరవిస్తూ గణపతి స్తుతితో మొదలవుతుంది. అయితే అది నేటి సమాజాన్ని విమర్శనాత్మకంగా ఖండిస్తూ సాగుతుంది. ఆఖరికి వినాయకునికి నైవేద్యం పెట్టే సందర్భంలో కూడా కల్తీ వస్తువులే పెడుతున్నారని సమాజంలోని అవినీతిని ఎండగడుతున్నాడు.

గణపతి స్తుతి తరువాత పేర్కొన్న ఉపశృతిలో
"అందరి కోసం నా ఆరాటం
అన్యాయంతో నా పోరాటం" అని తన గమ్యాన్ని ప్రకటించాడు. కలం చిందుల ద్వారా కవి కోరుతున్నది అవినీతిరహిత, అభ్యుదయ సమాజం.

**సామాజికాంశాలు**

1. అవినీతి
2. మానవ నైజం
3. కులమత భేదాలు
4. ఆధునిక జీవనచిత్రణ
5. వస్తు వ్యామోహం

**అవినీతి:** ఆధునిక జీవనంలోని అవినీతిని యెక్కుర్తి సూక్ష్మంగా గమనించి, దాన్ని ఖండిస్తున్నాడు. మనిషిలోని వంచనను బయట పెట్టి నిజాయితీతో కూడిన అవినీతి రహిత, అభ్యుదయ సమాజాన్ని ఆకాంక్షిస్తున్నాడు. ఉదాహరణకు గణపతిస్తుతిలో..

ఓ బొజ్జ గణపయ్య నీకంటే ఎవరయ్య ఉండ్రాళ్లలో రాళ్లు నెయ్యి కల్తీ అయ్య కలం చిందుల విందు ఆరగించవయ్య! ఉడికి ఉడకని పప్పు ముద్ద కట్టదయ్య అందుకని ముందుగా నీ బొజ్జ నిండుగా.. దేవుని నైవేద్యాన్ని కూడా పవిత్రంగా భావించక, కల్తీకి పాల్పడే సమాజ అవినీతిని కలం చిందులు మొదట్లో నిరసిస్తున్నాడు కవి.

అవినీతి వ్యక్తుల స్థాయి నుండి వ్యవస్థ స్థాయికి ఎదిగితే ఉదాసీనంగా ఊరుకోకూడదు, దాని అంతు చూడాల్సిందే అనే ప్రబోధం "పగ్గాలు" కవితలో చూడవచ్చు.

"చట్టం, న్యాయం చుట్టాలైతే అబద్ధం అవసరానికి అందలమెక్కుతుంది నిజం నిజంగా నిలబడ్డానికి అవినీతికి పగ్గం వేయాల్సిందే"

ఈ దేశంలో ధర్మం, నిజం, ఖూనీ చేయబడుతోంది. కర్మ భూమి కాస్తా ఖర్మ భూమిగా మారుతోంది అని 'మార్మికం' అనే ఖండికలో మనిషిలోని అనైతికతకు కారణం వెతుకుతున్నాడు ఇలా

"నా దేశం కర్మభూమి

అందుకే కాకూడదు ధర్మహాని.... అంటూ చేస్తాడు నిజం ఖూని నిజానికి కాకేమవుతుంది ఖర్మభూమి" (పుట. 21).

ధర్మ పన్నాగాలు వల్లించే వారే ధర్మహానికి పాల్పడి, నిజాన్ని ఖూని చేస్తున్నారని ఇలాంటి వంచన ఉన్నంత కాలం దేశం అదోగతిలోనే ఉంటుందని, పరిస్థితిని మార్చాలనే ఉద్బోధ చేస్తున్నాడు యెక్కుర్తి.

**మానవ నైజం:** మానవత మరిచిన మనిషి పతనమయ్యాక లోకం భుజంగాలు తిరిగే ప్రమాదస్థలి అయిపోయిందనే "నిజాన్ని" చెప్పుతున్నాడు.

"పులిని చూసి పడకు భయం

పాము కూడ నయం నయం మనిషంటే భయం భయం

పడకుంటే బ్రతుకు నిజం" (పుట. 22)

మనిషి పాముకన్నా విషపూరితం అయిపోయాడని, ప్రమాదకారిగా మారాడని, లోకం ఆవాస యోగ్యం కాకుండా పోయిందని కవి ఆవేదన చెందుతున్నాడు.

లోకంలో తిరిగే అమాయకులను హెచ్చరిస్తూ "తస్మాత్ జాగ్రత్త" అంటూ చైతన్య పరుస్తున్నాడిలా...

"మూర్ఖత్వం మారు పేరు దౌర్జన్యం ఇంటి పేరు విష హాసం ఆభరణం వంచన, లోభం వృత్తి ప్రవృత్తులు ఎన్నెన్నో భుజంగాలు తిరుగాడే లోకం ఇది తస్మాత్ జాగ్రత్త!".

మానవ హృదయం కాలుష్యంతో నిండిపోయిందని, మంచికి పోయినా చెడే ఎదురవుతుందని "ప్రతిబింబం" కవితలో మానవ నైజాన్ని ఇలా స్పష్టం చేస్తున్నాడు.

"కల్మషమైన అద్ధంలోకి

నిష్కల్మషంగా చూసినా

బింబం కల్మషంగానే ప్రతిబింబిస్తుంది

లోకం.... ఇదే మానవ నైజం" (పుట.12

మానవ హృదయమనే అద్దమే మురికి పట్టిపోయిందని, మానవుని అంతరంగాలలో మంచికి స్థానం లేకుండాపోయిందనేది ఇక్కడ కవి ఆవేదన.

అయితే ఈ పరిస్థితిని ప్రశ్నించకపోతే "ముప్పు" తప్పదని హెచ్చరిక కూడా యిక్కుర్తి చేస్తాడు.

"కోడలికి కూడు పెట్టడం

కన్నవాళ్లకు కొరివెట్టడం

తప్పదు కదా అనడం తప్పుకదా

అడిగితే తప్పు... అడక్కపోతే ముప్పు" (పుట.41)

అని చెప్పినచోట చెడును ప్రశ్నించి, ఎదుర్కోకపోతే ముప్పు తప్పదు అని కార్యాచరణను ప్రబోధిస్తున్నాడు. యిక్కుర్తి తన ఆకాంక్షను ఇలా వెలిబుచ్చుతున్నాడు.

"ఐక్యత చచ్చిన జాతికి

అసూయ పెరిగిన మనిషికి

ద్వేషం మీసం మెలేసే రోజుకి

కక్షలు కాలు దువ్వే వ్యవస్థకు కట్టాలి సమాధులు తిరిగి లేవకుండా పునాదులు" (పుట. 36)

మానవత్వం నశించిన వ్యవస్థకు సమాధి కట్టాలని కవి యిచ్చిన పిలుపు చైతన్య ప్రేరితమైన కార్యాచరణ.

**కులమత బేధాలు:** ఆధునిక సమాజంలోనూ కులం మనుషుల్ని వేరు చేస్తూ ప్రగతికి అవరోదంగా మారుతుందని, మతం మనుషుల్ని ఏకం కాకుండా భేద భావాలకు కారణమవుతుందని యిక్కుర్తి తన కలంచిందుల్లో కుల, మతాలను నిరసిస్తున్నాడు. కుల నిర్మూలనకు కులాంతర వివాహాలే పరిష్కారం అనే అంబేద్కర్ ఆలోచన ఆచరణలో నీరు కారిపోతుందని " పాపం ప్రేమ" అనే ఖండికలో ఇలా చెబుతాడు.

"కులం పునాదులు కూల్చాలంటూ మైకులు బద్దలు కొట్టే విశ్వనాథశాస్త్రి గారి మూడో అమ్మాయి సరళ రామచంద్రారెడ్డి గారి అబ్బాయిని ప్రేమిస్తే ఏకాకైంది ప్రేమ రామకృష్ణ శర్మకు అర్ధాంగిగా మిగిలింది ఆమె" (పుట.11)

ఆధునిక జీవన చిత్రణ : ఆధునిక జీవితంలో అన్నీ అమ్మకపు వస్తువులుగా మారాయనీ, మానవ విలువలు పతనమవుతున్నాయనే కవి ఆవేదన కలం చిందుల్లో ప్రత్యేకంగా గమనించవచ్చు.

వ్యాపార విలువలు, మార్కెట్ విలువల మధ్య మానవ విలువలు మంటకలుస్తున్నాయని వీటికి కారణమైన ఆధునిక జీవన విధానాన్ని యిక్కుర్తి నిరసిస్తున్నాడు.

'నాట్ఫర్ సేల్' అనే కవితలో దేన్నయినా అమ్ముకో కానీ మనసుని మాత్రం అమ్ముకోకు అని హితబోధ కనిపిస్తుంది.

"మనసుకు మనసమ్ముకో మమతకు మమతమ్ముకో మనిషికి మాత్రం విలువ కట్టి అమ్ముకోకు మనసు మమత (పుట.14) మనసు, మమత అనే మానవ విలువల్ని అమ్మకం వస్తువుగా చూడకూడదనేది కవి ఆకాంక్ష.

డబ్బు సంపాదించాలనే యావ ప్రజల్లో పెరిగిపోయిందని ప్రజలలో సంతృప్తి అనే భావనలేదని 'కోటులో" అనే కవితలో ఇలా విశదం చేస్తున్నాడు.

"ఒకప్పుడు లక్షణంగా లక్ష ఇప్పుడు బిక్షాధికారి కోటైనా కొరతే ఇప్పుడు అప్పుకోసం 'కోటేశ్వరరావు" (పుట.38)

డబ్బుకి మార్కెట్లో కొనుగోలు శక్తి తగ్గిందని అందుకే అధిక సంపద కోసం వెంపర్లాట మొదలైందని, పది రూపాయల నోటుని తీసుకొని అది ధనవంతుడికి ఎలాంటిది? పేదవాడికి ఎంత విలువ గలది? బజారులో దాని కొనుగోలు శక్తి ఏమిటి? అని ఒక ఆర్థిక శాస్త్రవేత్తలాగా విశ్లేషణ చేస్తాడు 'నోట్' అనే కవితలో...

"కలిమి కలవాని జేబిలో ఆవగింజ లేనివారికి పులివంటి మేకపోతు కళకళ లాడెను నిండు బజారులో నిముషముండలేని పిరికిపంద పరిశీలించగా అది పది రూపాయల నోటు" (పుట. 26).

ఒకవైపు డబ్బు కోసం ఆరాటం, మరో వైపు వస్తు వినియోగ సంస్కృతి పోటీపడుతూ పెరుగుతూ పోతున్నదని, ఈ పరుగులో మానవ విలువలు పతనమవుతూ పోతున్నాయని, కవి సమకాలీన సమాజాన్ని విశ్లేషణ చేసి చూపిస్తున్నాడు.

**వస్తువ్యామోహం:** కవిత్వం సమకాలీన సమాజానికి ప్రతిబింబం అనే నిర్వచనానికి కలం చిందుల్లో అనేక దాహరణలు ఉన్నాయి. భార్యభర్తల బంధం కూడా ఈ పతనానికి దూరంగా ఉండలేకపోతుంది. ఈ వైనాన్ని 'షరామామూలే' అనే కవితలో ఇలా తెలియజేస్తాడు.

"పండక్కి చీర కొంటేనే ఆమె ముఖం రాగి కళాయి కొనకపోతే వీధి కొళాయి కొన్నాక పొరుగింటామెతో పోతుంది బడాయి ఆ రాత్రి ప్రక్కింట్లో మొదలవుతుంది లడాయి" (పుట. 6) ఇది అక్కడితో ఆగదు. అందరూ వస్తువ్యామోహంలో పడి మనశ్శాంతి పోగొట్టుకుంటూ ఉంటారు.

ఒక భార్య తన భర్తకు కొనవలసిన వస్తువుల జాబితా చెబుతుంది. 'ఇండెంట్' అనే కవితలో ఈ ఇండెంట్కి అంతా ఉండదు. ఆ కవిత ఇలా సాగుతుంది.
"ఈ నెలలో మీరు కొత్త సూట్ కొనుక్కోవాలి! పై నెల ఎరియర్స్తో మీరు రింగ్ చేయించుకోవాలి షూస్ బాగా నలిగిపోయాయి క్రొత్తవి తెచ్చుకోండి ... డైలీ షేవ్ చేసి ఎవర్ గ్రీన్ ఉండాలండి! ... వెంటనే నాకో జత బంగారుగాజులు కూడా చేయించాలి!. ప్రస్తుతం అన్ని ఇళ్ళలలో టి.వి.లు, సెల్ఫోన్లు రకరకాల వస్తువులతో నిండిపోతున్నాయి. మనిషి కంటే వస్తువు విలువైనదైపోతుంది. ఈ స్థితిని వ్యంగ్యంగా యిక్కుర్తి విమర్శిస్తున్నాడు. ఉదాహరణకు
'వజ్ర పసాదం' అనే ఖండికలో టి.వి.ని గురించి ఇలా వర్ణిస్తాడు.
"మారణాయుధం లేకుండా హింసనేది చేయకుండా మనుషుల్ని జోకొట్టి మట్టి కరిపించే సాధనం కావాలని వరమడిగినప్పుడు ఇచ్చిందే దేవుడు టీ.వి." (పుట. 36).

ఈ ఇడియట్ బాక్స్ ముందు కూర్చుని వచ్చే సీరియళ్ళను చూస్తూ కాపురాలను చెడగొట్టుకుంటున్నవారెందరో? అలాగే సెల్ఫోన్ల వినియోగాల గురించి కూడా మరో వ్యంగ్య కవిత వినిపిస్తుంది. దాని శీర్షిక 'ఆల్ ఈజ్ వెల్'. "హలో అంతా వెల్ అన్నంత వరకు ఒకే సెల్ చెవికి రాసావో ఫెవికాల్ పడుతుంది జేబుకి చిల్లు ఆపైన హెల్లు" (పుట .37)

ఒక ఇంట్లో ఐదుగురు ఉంటే వారికి పదికి పైనే సెల్లులుంటాయి. వీటి వాడకంతో మనుషుల మధ్య దూరం పెరిగిందా? లేక దగ్గర పెరిగిందా అంటే చెప్పలేం! ఒకే ఇంట్లో కూర్చుని ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా తలా ఒక సెల్ ఫోన్ పట్టుకొని గదుల్లో ఒంటరిగా కూర్చుని మాట్లాడుకుంటూ ఉంటారు. దీనికి తోడు మెసేజ్లు, ఫేస్బుక్ లు కూడా తోడయ్యాయి. మనిషి సమూహంలో ఉంటూనే ఒంటరిగా మారిపోయాడు. సెల్ఫోన్ వాడకం ఆధునిక జీవితంలోని "హెల్" ని యికుర్తి చూచాడు. దాని నుండి బయటపడమని ఉద్బోదిస్తున్నాడు.

సెల్ఫోన్ వాడకం చివరకు నరకప్రాయం అని చెప్పడం చూస్తే కవికున్న సామాజిక బాధ్యత అర్థమవుతుంది. జేబులోని డబ్బు ఖర్చు అవడమే కాదు అది మనిషి ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు వినాశనకారిగా మారడాన్ని సూచిస్తుంది.

**ఉప సంహారం:** మొత్తంగా ఆధునిక జీవితం నరకప్రాయం అయిపోతుందని, అసమానతలతో నిండి పోతోందని కవి ' కలం చిందులో' నేటి సామాజిక అంశాలను గుర్తుచేస్తున్నాడు. సమాజం ఎటువైపుకి పోతుందో చూడమంటూ మానవ విలువలు మంట కలుస్తున్నాయని వాటిని కాపాడుకోకపోతే ముప్పుతప్పదని సామాజిక స్పృహ కల్పిస్తున్నాడు.

" అనురాగం నా ఆరవ ప్రాణం అభిమానం ఊపిరి, కృషి, ఆయుష్యు" (పుట. 4) అని మానవత్వం పట్ల ప్రేమ కలిగినవాడు కాబట్టి సమానత్వాన్ని కోరుకుంటున్నాడు.

పేదరికం, శ్రమ దోపిడి పోవాలని, మానవులందరూ సుఖ శాంతులతో ఉండాలనే తన ఆకాంక్షను, ఫలశృతిగా ఇలా తెలియజేస్తున్నాడు. ప్రతి ఉదయం మీ హృదయంలో ఆనందాలు గంపెడు వెదజల్లాలని కోరుకుంటున్నా వాటా అందరికీ పంచమంటున్నా ఆ ఆనందంలో కూడా అందరికీ సమాన వాటా ఉండాలని తన సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. అభ్యుదయ కవి యిక్కుర్తి నరసింహారావుగారు.

**ఆధార గ్రంధాలు:**

1. కలం చిందులు- యిక్కుర్తి నరసింహారావు

## జాషువా - గబ్బిలం ప్రగతి శీల భావాలు

**డా|| కొణిదల పురుషోత్తం**
తెలుగు అధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ డిగ్రీ కళాశాల తిరుపతి.
Cell: 98667 26032.
Email:purushothamkonidala5@gmail.com

**స్థూల పరిచయం :-** "కవిని కన్నతల్లి గర్భంబు ధన్యంబు"- జాషువా కలం నుంచి జాలు వారిన ఆణిముత్యాలు, కోకొల్లలు, కవిని కన్న తల్లి భాగ్యమే భాగ్యము. తల్లి నిండు నూరేళ్ళు హాయిగా జీవించాలని బిడ్డను ఆశీర్వదిస్తుంది. కవి వందేళ్ళు కాదు వేల సంవత్సరాలైన జీవించే వుంటాడు. అందుకనే జాషువా "సుకవి జీవించు ప్రజల నాలుకల యందు" అంటారు.

సువిశాలమైన ప్రాపంచిక దృక్పథం జాషువాది. సామాజిక ప్రయోజనం లేని సాహిత్యం వృధా అన్నది ఆయన అభిమతం, సాహిత్యం ద్వారా సమాజానికి మేలు జరగాలన్నదే ఆయన సంకల్పం. ఈ క్రమంలో "మానవ పురోగమనానికి అడ్డంకులుగా ఉన్న కులాలను, మతాలను, ఆర్థిక అసమానతలను రూపుమాపాలని అందుకోసం తన కలాన్ని ఝుళిపించిన సాహితీ కిరణం." మానవున్ని చైతన్యం చెయ్యడానికి తన రచనలన్నింటినీ సోపానం చేశాడు. మానవీయ ప్రాపంచిక దృక్పథానికి, మనిషిని ఉన్నతీకరించే తత్వానికి ఆయన కావ్యాలు వెలుగు దివ్వెలు మనిషిని ఔన్నత్యం వైపు నడిపించి, అసమానతలు తొలగించి, వర్తమాన చైతన్యానికి ఊతమిచ్చే పలు అంశాలను, సమకాలీన సమాజానికి అవసరమైన సాంస్కృతిక విలువలను జాషువా తన కవిత్వంలో పొందుపరిచాడు. జాషువా కవితా ఝురిలో వదగని వస్తువే లేదు. ఏ అంశాన్ని తీసుకున్నా అది మనసుకు ఊరటనిస్తుంది. బాధను కలిగిస్తుంది. ఆవేశాన్నీ, ఆలోచనను కల్గిస్తుంది. స్ఫూర్తిని, చైతన్యాన్నిస్తుంది. కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. మాతృత్వ మమకారాన్ని కలిగిస్తుంది.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

మురిపంగా లాలిస్తుంది. త్యాగమంటే ఏమిటో నేర్పుతుంది. తెలుగు నుడికారం, ప్రజల నాలుకల్లో నడయాడుతుంది.

**ఉపోద్ఘాతం :-** తెలుగు పద్యం బలహీనపడుతున్న దశలో జాషువా పద్యానికి ప్రాణప్రతిష్ఠ చేసాడు. పద్యానికి పదునుపెట్టి సామాజిక ప్రయోజనం కోసం సామాజిక కవిత్వాన్ని పండించిన కృషీవలుడు, ఆయన కవిత్వం చైతన్యవంతమైనది. సమసమాజ భావజాలానికి సన్నిహితంగా ఉంటుంది. జాషువా జీవితంలోని కఠిన వాస్తవాలను కవితాబద్ధం చేశాడు. అయితే వాస్తవాలు ఒక కులానికే పరిమితం కాలేదు. మానవ జీవితంలో ప్రతి అంశాన్ని స్పృశించాడు. ప్రకృతిలోని ప్రతి విషయాన్ని ఆయన ఖండికలలో ప్రస్తావించాడు. వర్ణించే వస్తువులో తను మమేకమై ఎవరూ ఊహించని భావకతను ప్రకటిస్తాడు. జాషువా పదప్రయోగ వైచిత్రి విలక్షణమైనది. ఆయన వాడిన శబ్దాలకు ఒక ప్రత్యేకత వుంటుంది. తెలుగునుడికారం, లోకోక్తులు, మధురమైన శబ్దాలతో కూడిన సమాసాలు, విజాతీయ పదాలు, సంస్కృతి శబ్దాలను సందర్భోచితంగా ప్రయోగించి పద్యాలకు క్రొత్త కాంతిని తెచ్చిపెట్టాడు. పురోగమన దృష్టిగల కవిజీవితం సాహిత్యం ఎప్పుడూ సామాజిక అభివృద్ధి పదాలవైపే నడుస్తాయి అనడానికి జాషువా జీవితాన్ని, సాహిత్యాన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఆయన జీవితం సాహిత్యం సృజనకు ప్రేరణ. ఆధునిక తెలుగు కవిత్వాన్ని విప్లవాత్మకంగా రూపొందించిన కొద్దిమంది భావకవితా యుగకవుల్లో ఆయన గొంతు విలక్షణమైంది. జాషువా కవిత్వంలో నూతన వ్యవస్థ కోసం, సర్వజనసమానత్వపు సంఘ నిర్మాణం కోసం తపించే ఆశ్రమం కనిపిస్తుంది.

**విషయం :-** "వడగాల్పులు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం" అన్న జాషువా గారి మాటలు అక్షర సత్యం. కులమతాల గీతలతో తరతరాల తలరాతలనీ శాసించే కుళ్ళిన సమాజాన్ని దాటి విశాల కవితా సామాజిక జగత్తుకు ఎదిగిన మేటి కవితా ధీరుడు. సమాజ అభ్యుదయానికి అసమానతలపై సమరభేరి మ్రోగించాడు.

"కులమతాల గీతలు జొచ్చి పంజరాన కట్టుబడను నేను" అని చెప్పడంలోనే జాషువా మానవీయ భావన అర్థమవుతుంది. తాను విశ్వనరుడునని చెప్పుకొని రాసిన పద్యాలలో అతడెలాంటి సమాజాన్ని కోరుకుంటున్నాడో తెలుస్తుంది. శివుడు సృష్టికర్త అయితే, గబ్బిలం సృష్టి అని చెప్పి అధమ జంతువుగా పక్షిగా చెప్పబడే గబ్బిలాన్ని ఉన్నతీకరించి సృష్టిలోని ప్రాణులన్నీ సమానమన్న భావనను, వాటిపట్ల ప్రేమను వ్యక్తపరచాడు. సమాజంలో అనేక అవకతవకలు, అసమానతలు, దోపిడీలు, పీడలున్నాయి. అవన్నీ లేకుండా మానవజాతి అంతా సుఖసౌఖ్యాలతో వర్ధిల్లే సృష్టి చేయకుండా అసమానతలున్న ఈ సృష్టి చేయమని నిన్నెవరడిగారు? అని భగవంతున్ని ప్రశ్నిస్తున్నాడు.

"ఎవరడిగినారు నిన్నీ అవకతవక సృష్టి చేయమని" అని ప్రశ్నించే ధైర్యం, మనిషిని ప్రేమించే కవికి తప్ప మరెవరికి ఉంటుంది. గౌతమ బుద్ధుడు కోరిన దుఃఖ రహిత సమాజ స్థాపనను కోరుకున్న మానవతావాది జాషువా. ప్రపంచానికే శాంతి, సత్యం, అహింసా మార్గాలను అందించిన బుద్ధుని హృదయానికి హత్తుకుని రచనలు చేసిన జాషువా మానవీయ విలువలను ఉన్నతీకరించాడు.

"ప్రేమించువారి మరలం ప్రేమించి ఫలము లేదు ద్వేషించునరున్ బ్రేమింపు డపుడు మోక్ష స్వామి సమక్షమున గొప్ప ఫలము లభించున్" ప్రేమించే వారిని ప్రేమించడం గొప్ప విషయం కాదు. నిన్ను ద్వేషించే వాళ్ళను ప్రేమించడమే గొప్ప విషయం. అలా చేస్తేనే మహోన్నతమైన ఫలం దొరుకుతుంది అంటాడు జాషువా. దిన దినానికి ఒకరిపై ఒకరికి ద్వేషాలు, కోపతాపాలు, అసూయ పెరుగుతూ సమాజం హింసాయుతంగా మారుతున్న సమయంలో జాషువా చెప్పిన మానవీయ భావన అవసరం ఎంతో వుంది. తనను ద్వేషించే వారిని ప్రేమించి తీరాలన్న జాషువా మానవీయ విలువలను ఉన్నతీకరించిన గొప్ప ప్రజాస్వామిక కవి.

జాషువా ఆత్మాభిమానం కలవాడు. ఎన్నిబాధలు పడ్డాడో ఎన్ని అవమానాలు పొందాడో ఎంతగా మనోవేదన అనుభవించాడో వూహించడం కష్టమైనా ఆయన కవితలే ఆ మనోవ్యధకు కొంతవరకు అద్దం పడుతాయి. ఆయన దేశాభిమానానికి ప్రతీక అయిన "గబ్బిలం" కావ్యం. ఊరూ పేరూ లేని ఓ అరుంధతీ సుతుడు అందులో కథానాయకుడు. అనగా జాషువానే కథానాయకుడు. కైలాస నాథుని దగ్గర తన "కన్నీటి కథ"ను విన్నవించమని తన "అశ్ర సందేశాన్ని" గబ్బిలం ద్వారా రాయబారం పంపడం కావ్యంలోని ప్రధానమైన ఇతివృత్తం

"కసరి బుసకొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవనాగరాజు" ఈ అస్పృశ్యుడు అల్లంత దూరాన కనిపిస్తే చాలు "కస్సు" మని బుసులు కొడుతుందట. నేటి యీ చాతుర్వర్ణ్య సర్పరాజు హిందూ శాస్త్రాలు మనుస్మృతి నాలుగు వర్ణాల గురించే పేర్కొంటాయి. పశువులు కన్నా హీనంగా చూడబడుతున్న "పంచమ కులజుడు" ఎవరని, కన్న మహాకవి జాషువా క్రింది కవితలో...

ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు నల్వురు కుమారులనుట విన్నాముకాని పసరముకన్న హీనుడభాగ్యుడైన ఐదవ కులస్థు డెవరమ్మా సవిత్రి పాములకు పాలు పోసి చీమలకు పంచదార పెట్టడం "పుణ్య" ప్రదమని హిందూ శాస్త్రాలు "జీవకారుణ్యం" గురించి ఎక్కువగా చెబుతున్నాయి. పాలు, పంచదారతో తయారు చేసిన "పొంగలి" నైవేద్యం పెడితే ఆరగిస్తాం హైందవదేవుడు. అయితే మనిషిగా పుట్టిన "పంచమున్ని" మాత్రం. "చీత్కరించుకుని దూరంగా పొమ్మని" అటు శాస్త్రాలు ఇటు ధర్మదేవతలు విషమున్న పాముకన్న సృష్టిలో అల్పజీవి చీమకన్న హీనంగా చూస్తున్న "కర్మభూమి" అయిన మన పుణ్యభారతావని అని జాషువా ఆవేదన పడుతూనే హిందూ శాస్త్రాల్ని, హిందూ దేవుళ్ళను పరోక్షంగా ఎత్తిపొడిచాడు. "ఇక్కడి దేవతల వరము లీయరు పంచమ జాతి విరికిన్ మ్రొక్కిన స్వీకరింపరని" అంటారు. ఆనాడు హరిజనుల్ని హిందూ దేవాలయాలలోనికి రానిచ్చేవారు కాదు కదా! ఉన్నత వర్ణాల వారు ఇతనిని దగ్గరకు రానీయరు. శూద్రులు కూడా వీళ్ళను అసహ్యించుకుంటారు అంటే ఏ వర్ణానికి చెందక భయభ్రష్టత్వం పొందాడు పంచముడు.

జాషువా "గబ్బిలం" కరుణ, వీరరస ప్రధానం. కాబట్టి ఇందులో జాషువా కవిత్వం చిందించే కరుణ రసం ఉ త్తకన్నీళ్ళది కాదు. ప్రతిఘటనా పూర్వకమైనది.

"నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగు దేశమును కాల్చి వేయు" నని హెచ్చరించ గలిగాడు. కాల్చేకన్నీళ్ళను తిలకిండం అంటే కరుణ వీరరస సిద్ధాంతానికి బాట వేయడమే కదా! కుల, మత, వర్ణ వ్యవస్థను కూకటి వేళ్ళతో పెళ్ళగించాలని కలాన్ని గునపంగా ఉపయోగించాడ ఈతని కవిత్వం చతుర్ముఖాలుగా సాగింది. మతవైషమ్య నిరసనం, అస్పృశ్యతా నిరసనం అంధ విశ్వాస నిరసనం దారిద్ర్య నిరసనం అనే నాలుగు అంశాల పునాదుల మీదనే ఇతని సంఘ సంస్కరణ కవితా నిర్మాణం జరిగింది.

"కులములేని నేను కొడుకుల పుట్టించి ఈ అఖాతమందే తోయవలెనే" అంటూ పంచమునిలో వున్న నిర్వేదం, తన స్థితిపట్ల తనకే కలిగిన ఏవగింపు, నోరు విప్పినాటి సమాజం పట్ల వ్యతిరేకత చెప్పలేని దైన్యం, ఆ దుస్థితి మారే రోజుకోసం నిరీక్షణ కన్పిస్తాయి. జాషువా పాండిత్య ప్రతిభను మెచ్చుకున్నవారే తన కులం తెలియగానే అవమానించిన తీరు తలచుకుని "బాకున గ్రుంచినట్లగును పార్థివచంద్ర జాషువా వచింప సిగ్గగున్" అని బాధ పడ్డాడు. ఈ మాటల్లో జాషువా అనుభవించిన వర్ణనాతీతమైన బాధ వ్యక్తం అవుతుంది. మరో ప్రక్క పండితుల అవివేకమైన ప్రవర్తన పట్ల విస్మయం కూడా గోచరిస్తుంది.

ఈ సమాజంలో కష్టించి పనిచేసే శ్రామికుడికి పిడికెడు తిండి దొరకడం లేదని తూర్పార బట్టాడు. మత మౌఢ్యం పనికి రాదన్నాడు. రాళ్ళకు మొక్కే జనం కొంత మనసు మార్చుకుని బీదవారికింత సహాయం చేసే సమాజం ఎప్పుడు వస్తుందో అని నిట్టూర్చాడు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

నిమ్నజాతులు వారే సమాజానికి చాలా ఉపయోగం అన్నాడు. కుల, మత, తత్వాలు లాంటి సామాజిక రుగ్మతులకు ఈయన రచనలు చికిత్సగా ఉపయోగపడుతాయి. గబ్బిలం సందేశంలో కర్మసిద్ధాంతం నుండి కవిత్వం దాకా, వినుకొండ నుండి వెండికొండ దాకా నన్నయ నుండి వేమన దాకా ప్రతి అంశాన్ని రసవత్తరమైన ప్రతీకలతో స్పృశించి సామాజిక సందేశాన్ని అందించాడు.

దళిత వర్గంలో పుట్టి పెరిగిన జాషువా సమాజంలోని అసమానతలను చూసి ఆవేదన చెందారు. తన హృదయ వేదనకు అక్షర రూపమే "గబ్బిలం" అనే ఖండకావ్యం. ఇందులోని ఇతివృత్తం అస్పృశ్యతకు, ఆకలికి సంబంధించినది. జాషువా నిర్వేదం నుండి నిబిడీకృతమై, ప్రతిపద్యంలో ప్రత్యక్షమై పాఠకుల హృదయాలను కరుణార్ధం చేసి జాతికీ, సానుభూతికి పాత్రమవతుంది.

"నాదు కన్నీటి కథ సమన్వయం సేయ, నార్ధ హృదయంబు గూడ కొంత పసరంబు" - అనే మాటలను జాషువా గబ్బిలం నోట పలికించారు. అంటరాని వాడు కథానాయకుడు వాని కథే జాషువా కవిత. అదే నవ్యత. మానవత గూడు కట్టుకొన్న జాషువాది జాలి గుండె. ఈ ఖండకావ్యం ఒక అభాగ్యుని అశ్రుగాథ. ఇది ఒక సందేశ కావ్యం. అభాగ్యుడనైన కథానాయకు తన దుస్థితిని పరమేశ్వరునికి విన్నవించవలసినదిగా తన సందేశాన్ని పంపాడు ఈ కథనాయకుడు "కడగొట్టు బిడ్డడు, అరుంధతీ సుతుడు, గర్భదరిద్రుడు" కానీ నీతమంతుడు. "అప్పు వడ్డది సుమీ! భారతావని వీని సేవకున్" అని జాషువా చెప్పాడు. జాషువా ఎంతో ఆవేదనతో "వాని నుద్ధరించు భగవంతుడు లేడు, మనుజుడెట్ల వాని గనికరించు"- అనీ పులుగుం బుట్రలు కాక పేదలకు నాపుల్ చుట్ట పక్కంబులు గలరే" అని వాపోయాడు.

కాళిదాసు మేఘసందేశం కావ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జాషువా గబ్బిలాన్ని రచించాడు. లోకంలో గబ్బిలాన్ని ఒక అపశకునపు పక్షిగా గుర్తిస్తారు. ఈ లోక రీతని పాటించే గబ్బిలాన్ని పంచమ జాతికి ప్రతీకగా ఆయన గ్రహించాడు. వారి చీకటి బ్రతుకులకు ఆదొక సంకేతం. వారి దౌర్భాగ్యానికి అదొక చిహ్నం. మానవతకు జయపతాక ఈ కావ్యమంతా మానవతావాదం మీదే ఆధారపడి వుంది. జాషువా తన ఆవేదనా నివేదనంలో నవ్యతను చూపించాడు అతి నవ్యమైన ప్రతీకవాదాన్ని తన కవితలో జొప్పించాడు.

జాషువా సంప్రదాయమైన ఛందస్సులో ప్రాచీన కవుల అడుగుజాడులు కన్పించే విధంగా తన కవిత్వాన్ని తీర్చిదిద్దాడు. 'గబ్బిలం' రచనా విధానమంతా అభ్యుదయ మార్గంలోనే నడిచింది,

ఆధునిక కవులలోని సంప్రదాయం, నిర్దుష్టమైన వ్యక్తీకరణ, ఉక్తి వైచిత్ర్యం జాషువాలో ఉన్నాయి. ఈయన సందర్భోచితంగా చక్కని సూక్తులనూ, సామెతలనూ, జాతీయాలనూ, నూతన ప్రయోగాలనూ చూపడంలో మహానేర్పరి. పవిత్ర భారతావనిలో ధర్మం నాలుగు పాదాల నడవ వలసిన హైందవ సంఘంలో అతి భయంకర రూపంతో అస్పృశ్యతా జాడ్యం తాండవం చేస్తుండగా చూసిన జాషువా హృదయం ద్రవించింది. పద్యరూపంలో, గబ్బిల కావ్యరూపంలో సాక్షాత్కరించింది. ఆత్మ వేదనా రూపంలో కవిత పెల్లుబికింది సమతా మమతా మయ జగత్తును కోరుకుంది. జాషువా కవితా శక్తి అద్భుతం! ఆ కవితా శక్తి ఎప్పుడూ ఉక్తివైచిత్ర్యం మీదనే సొంతుంది. మాటను చమత్కారంగా, భంగ్యంతరంగా చెప్పడమే ఉక్తి వైచిత్రం.

"నల్దిక్కులు గల్గులోకంన దిక్కరియున్న యరంధతీ సుతుం డొక్కడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టుబిడ్డడై" - భరతమాతకు కడగొట్టు కుమారుడై పుట్టాడట! అరుంధతీ సుతుని శూద్రులు కూడా చేరనివ్వడం లేదు. "కడగొట్టు బిడ్డడు" అంటే చతుర్వర్ణాలలో వాడుగాక "పంచమ వర్ణుడని" కవి ధ్వనింప చేసాడు లోకంలో నాలుగు దిక్కులున్నా వానికి దిక్కు లేదట! "ప్రాక్తనంబైన ధర్మదేవతకు గూడ నులికి పడుజబ్బు గలదు వీడున్నచోటు" ధర్మ పరులైన వారు కూడా అతనిని చేరనివ్వడం లేదు అని భంగ్యంతరంగా చెప్పాడు.

"కసరి బుసకొట్టునాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు" అని పేర్కొన్నాడు. హిందూ మతం పాము లాంటిదనీ, చతుర్వర్ణాలే దాని పడగలనీ, పంచమ వర్ణుడైన అతనిని చూసి కసురుకొనేటట్టుగా బుసకొట్టచున్నాడని చమత్కరించాడు. దోపిడీ వ్యవస్థకు హేతువైన వర్ణవ్యవస్థను జాషువా తీవ్రంగా గర్హించాడు.

కరుణ రసార్ద్రమైన గబ్బిలం కావ్యంలో సున్నితమైన హాస్యం ఉంది. అది సహృదయ హృదయాలపై బాధలోనే చిరునవ్వు చిందింపజేస్తూంది. మానవులకు లేని గౌరవం, గబ్బిలానికి కలదని చెప్పాడు. "స్వాగతం నీకు శుభంబు కదమ్మ! నీ తనూభవులకు తల్లక్రిందుల తపంబులకున్ గుడిగోపురాలకున్" అని చెప్పడం ద్వారా సున్నితమైన హాస్యాన్ని పోషించడమైనది.

జాషువా గత వైభవాన్ని స్మృతికి తెచ్చుకొని వర్తమాన పరిస్థితిని చూసి నిట్టూర్చి, భవిష్యత్తును తలచుకొని ఆశాగీతాలను ఆలపించాడు. "ఎన్నిదేశాలు తిరిగిన నేమి నీవు నా వలె పుట్టు బానిసవు కావు" అని ఆరోపించుకోవడం వల్ల గబ్బిలంలో జాషువా తన మనస్సును తానే చిత్రించుకున్నాడు. ఈ కావ్యంలో కవి ఆత్మీయత వ్యక్తమవుతుంది. "గబ్బిలం శాశ్వతంగా వుంటుందని నా నమ్మకం" అని చెప్పాడు. కనుక గబ్బిలంలోని కవితాత్మ ఎంతగొప్పదో కవి ఆత్మీయత ఎలాంటిదో మనం గ్రహించవచ్చు. ఉత్తమ కవిత్వంలో ఉండే సమగతి, వక్రోక్తి, ప్రౌఢి, మార్దవం, మాధుర్యం కలిసి ఉన్న శైలి జాషువాది. గబ్బిలంలో వర్ణనాత్మక శైలి కనపడుతుంది. అయినప్పటికీ అధికమైన అలంకారాలు, శబ్దాడంబరత ఎక్కడా కనిపించవు.

**ముగింపు :-** నిశితమైన వ్యంగ్యాన్ని ఆశ్రయించి వర్ణవ్యవస్థను నిరసించిన మహాకవి జాషువా! గబ్బిలంలో అనర్ఘ భావరత్నాలు ఎన్నో ఉన్నాయి. జాషువా కవిత్వం మృదు మధురమైన ద్రాక్షాపాకంతో, సహజ శైలిలో ఇంపైన శయ్యతో అలరారుతూ వుంటుంది. అందుకే జాషువా "విశ్వనరుడు". తెలుగులో దళిత కవిత్వానికి ఆద్యుడు జాషువా. సంప్రదాయ ఛందస్సులో ప్రగతి శీలక భావాలు చెప్పిన కవి. వర్ణవ్యవస్థ దళితులను కనీసం మనుష్యులుగా కూడా గుర్తించలేదు. వర్ణవ్యవస్థకు బలమైన పునాది హిందూమత సంప్రదాయంలో ఉంది. హిందూ మతంలోని మూఢాచారాల అహేతుకతను ప్రశ్నించిన కవి జాషువా.

**ఆధారగ్రంథములు :-**

1.గబ్బిలం - గుర్రం జాషువా, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
2.దళిత సాహిత్యవాదం, డా॥ కత్తిపద్మారావు
3.జాషువా సాహిత్యం దృక్పథం – పరిణామం, డా॥ ఎండ్లూరి సుధాకర్
4.మహాకవి జాషువా ప్రగతి శీలత, కళాత్మకత, డా॥ అద్దేపల్లి రామమోహనరావు

# తిలక్ కవిత్వం - వైశిష్ట్యం

**తంగి ఓగేశ్వరరావు**
తెలుగు అధ్యాపకులు
వి.వి.గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప
Email: t.ogeswararao@gmail.com
Ph: 9959753832

**స్థూల పరిచయం:** "నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అంటూ తన కవితా పరమార్థం చెప్పుకున్న భావకవుల్లో అభ్యుదయ కవి, అభ్యుదయ కవుల్లో భావకవీ అయిన తిలక్ పూర్తి పేరు దేవరకొండ బాలగంగాధర్ తిలక్. ఇతడు కవి, కథకుడు, నాటకకర్త, వచన కవితా ప్రక్రియను పరిపుష్టం చేసిన కొద్దిమందిలో తిలక్కు ప్రత్యేక స్థానం ఉంది. ఈనాడు చాలా వరకు పరిపక్వమైన వచన గేయపు శైలికి అతను ఎంతో దోహదం చేశారు. వచన గేయపు శైలిలో తిలక్ చూపిన ఒరుపులవల్ల ఆ ప్రక్రియ సంప్రదాయ పద్య కవితాభిమానుల అభిమానాన్ని కూడా పొందగలిగింది.

**తిలక్ పరిచయం:** పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలుకా మండపాక గ్రామంలో 1921 ఆగష్టు 1న తిలక్ జన్మించారు. "చిన్నచిన్న ఉంగరాలు తిరిగిన నల్లజుట్టు, కొనదేరిన ముక్కు, సోగకళ్లు, సువర్ణ సవర్ణ శరీరచ్ఛాయ" అని తిలక్ అందాన్ని పొగిడారు తంగిరాల సుబ్బారావు గారు. తిలక్ తణుకు హైస్కూల్లో స్కూలు ఫైనల్ ఉత్తీర్ణుడైన తర్వాత మద్రాసు వెళ్ళి ఇంటర్మీడియట్ పూర్తిగా చదవకుండా తిరిగి వచ్చి విశాఖపట్నం ఎ.వి.యన్. కళాశాలలో చేరారు. అక్కడా చదువు పూర్తి చేయలేదు. తణుకు వచ్చేసి సాహిత్యం చదువుతూ, కవిత్వం రాస్తూ జీవితం గడిపేశారు. పెన్మెత్స సత్యనారాయణరాజుగారు తిలక్ గురువు. అతని వద్దే ఛందస్సు, వ్యాకరణం, ప్రబంధాలు నేర్చుకొన్నారు. ఆ తర్వాత నవ్యసాహిత్య పరిషత్తులో సభ్యుడై ఆధునిక భావాలు అలవర్చుకొన్నాడు.

**తిలక్ కవిత విశిష్టత;** తిలక్ ఎంత సుకుమారుడో అతని కవిత అంత నిశితమైనది. భాష ఎంత మెత్తనిదో, భావాలు అంత పదునైనవి. సంఘవంచితుల పట్ల ఎంత కారుణ్యమో, సంఘదురన్యాయాల పట్ల అంత క్రోధం. తిలక్కు తెలుగు, ఇంగ్లీషులలో చక్కని పాండిత్యం ఉంది. ప్రాచీనాధునిక పాశ్చాత్య సాహిత్యంలో చాలా భాగం అతనికి కరతాలమలకం. అయినా, తెలుగు వచనంగాని, పద్యంగాని ఎంతోబాగా రాసేవాడు. తిలక్ తన కవిత్వాన్ని స్తుతి మెత్తని వృత్త కవితతో ప్రారంభించినా, ఆధునిక జీవితాన్ని అభివర్ణించడానికి వృత్తపరిధి చాలక వచన గేయాన్ని ఎన్నుకొన్నాడు. అది అతని చేతిలో ఒకానొక ప్రత్యేకతను, సౌందర్యాన్ని పొందింది.

**తిలక్ కవిత్వ విశ్లేషణ:** మొదట దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతోనూ, తరువాత శ్రీశ్రీ ప్రభావంతోనూ కవిత్వం రాసినా, వచన కవితా ప్రక్రియను తన అసమాన ప్రతిభాసంపదతో ఉన్నత శిఖరాలకు తీసుకొని వెళ్ళిన ప్రముఖుడు దేవరకొండ బాలగంగాధర్ తిలక్. భావకవిత్వంలోని భావసౌకుమార్యం, భాషామర్దవం అభ్యుదయ కవిత్వలక్షణాలతో కలసి వెలసిన తిలక్ కవిత్వం, అభ్యుదయ, భావకవిత్వాల కలయిక.

తిలక్ 1937లో 'ప్రభాతము - సంధ్య' అనే పద్యకవితా సంకలనాన్ని వెలువరిచారు. 1945లో తర్వాత రాసిన పద్యాలూ, గేయాలూ కలిపి 'ప్రభాతము - సంధ్య' గా అచ్చయ్యాయి. 1944లో బొంబాయిలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల మహాసభలో పాల్గొన్నారు. 1961 నుంచి వచన కవితలు వెలువరిచారు. అతని మరణించిన తర్వాత అతని వచన కవితలు 'అమృతం కురిసిన రాత్రి' అనే పేరుతో 1968లో ముద్రితమైయ్యాయి. ఈ

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

వచన కవితల సంపుటికి 1971లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 'గోరువంకలు' వీరి మరోక కవితా సంకలనం. సుశీల పెళ్ళి, సుప్తశిల, సాలెపురుగు వీరి నాటకాలు. సుచిత్ర పరిణయం అనే నాటికను కూడా తిలక్ రాశారు. తిలక్ రాసిన కథలు 'తిలక్ కథలు' అనే పేరుతో వెలువడ్డాయి.

మన కళ్ళ ఎదుట ప్రతి నిత్యం జరిగిపోతున్న జీవననాటకాన్ని ప్రతిబింబించడానికి తిలక్ తన కవితను, కథలను, నాటికా ప్రక్రియను సమానంగా ఉపయోగించుకున్నారు. మనకు రోడ్లమీద తారసిల్లే వ్యక్తులు బిచ్చగాళ్ళు, అనాధలు, అశాంతులు, దగాపడ్డవారు, పడుపుగత్తెలు, చీకటి బజారు చక్రవర్తులు ఇంకా ఎందరెందరినో ఆయన పాత్రలుగా తీసుకొని అసలు వేషాలలో మన ముందు నిలబెట్టారు.

"తిలక్ కవిత అభ్యుదయ కవిత్వం కొన్ని పాళ్ళూ, భావకవిత్వం కొన్ని పాళ్ళూ కలిసిన మిశ్రమరూపం. తిలక్ ఖచ్చితమైన మానవతావాది. తిలక్ తాను ప్రధానంగా అనుభూతివాదినని బల్లగుద్ది చెప్పుకున్నాడు" అని కుందుర్తి ఆంజనేయులుగారు 'అమృతం కురిసిన రాత్రి' పీఠికలో పేర్కొన్నారు.

"తిలక్ అటు భావకవీ ఇటు అభ్యుదయ కవి కాడు. ఆ రెండు సంప్రదాయాలలోని కొన్ని లక్షణాలను సంగమింప జేసుకొని తానొక తీర్థ ప్రాయుడయ్యాడు" అని ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో కె.వి. నరసింహంగారు పేర్కొన్నారు. ఇతని మాటలను బట్టి భావ, అభ్యుదయకవిత్వాల రెండింటి లక్షణాలు కలగలిసిన మానవతా కవి తిలక్ అని స్పష్టమౌతుంది..

**తిలక్ కవిత్వంలో భావకవిత్వ లక్షణాలు:-** "తిలక్ లోని ప్రముఖమైన గుణం భావుకత్వం కించిత్ ప్రేరణకు కూడా చలించిపోగల సుకుమార హృదయ స్పందన శక్తి. శ్రీశ్రీ తర్వాత ఇంత భావుకత్వం గల కవి బహుశా మనకు లేడేమో. ఈ భావుకత్వానికి తోడు తన హృదయంలోని అనుభూతిని వ్యక్తం చేయగల శబ్దశక్తీ, అలంకార పుష్టి కలిసి రావడంతో తిలక్ ఉత్తమ శ్రేణి కవి కాగలిగాడు" అని సారస్వత వివేచన గ్రంథంలో రాచమల్ల రామచంద్రారెడ్డిగారు తెలియజేశారు.

తిలక్ భావకవిగా ప్రణయ కవిత్వం రాశారు. తిలక్ తన ప్రియురాలిని కవిత్వంగానూ, కవిత్వాన్ని ప్రియురాలిగానూ ఊహించుకొని ఈ క్రింది కవిత్వాన్ని చెప్పాడు.

"నాకును నీకు మైత్రి ఒకనాటిది కాదు కృతాంత మందు వా ల్మీకుల శోక మందు మిధి లేశునిపట్టి విషాదమం దాకృతి దాల్చెగాక మరి నవ్య శిరీష మృదుత్వ మీహృదిన్ ఏ కలలెన్ని దగ్ధమయి యీ పొడి బూడిద కొండలైచనెన్"

ఆ తర్వాత తిలక్ క్రమంగా వచన కవిత్వం వైపు మళ్ళాడు. ఆయన 1945లో
"చదల చుక్క / నెమలి రెక్క / అరటిమొక్క ఆమె నొసటి కస్తూరి చుక్క కదలివచ్చి ప్రిదిలి నవ్వి నవ్వినవ్వి నీ రెండల పరుగులెత్తి...."

"ఘోష హేష మురళి రవళి కదలి కదలి ఘణం ఘణల నిక్వణ క్వణల ఝణం ఝణల బండిమువ్వ కాలిగజ్జె కలిసిపోయి" అనే విధంగా రాశాడు.

"కవిత్వం మనస్సుకీ, ఉద్రేకాలకీ సంబంధించినది. ఈ మనస్సునీ ఉద్రేకాన్ని కొలిచే సరైన మానం యిదివరకు లేదు. ఇక ముందు రాదు అని చెప్పవచ్చును. అంతవరకూ కవిత్వానికి సరైన నిర్వాచనం రాదు. మనలోపల్లోపల జరిగే ఒకానొక అనుభూతి విశిష్టత కవిత్వానికి ఆధారం" (ఆనందవాణి) అని ప్రకటించాడు తిలక్. ఈవిధంగా తపన చెందిన తర్వాత తన కవితత్త్వం తెలిసింది. కవిత్వజ్ఞాని అయ్యాడు. తిలక్ అసలు రూపం 'అమృతం కురిసిన రాత్రి'లో రూపు కట్టింది.

"నా కవిత్వం కాదొక తత్త్వం మరికాదు మీరనే మనస్తత్వం కాదు ధనికవాద, సామ్యవాదం" అంటూ తిలక్ తన కవిత్వాన్ని తానే నిర్వచించుకున్నారు.

"అగ్ని జల్లినా అమృతం కురిసినా అందం ఆనందం దాని పరమావధి" అన్నప్పుడు కూడా ఆనందమే కవిత్వ ప్రయోజనమన్న భావం స్పష్టమవుతుంది. అమృతం కురిసిన రాత్రి వచిన కవితా సంపుటిలోని ప్రాత:కాలం, సంధ్య, ఈ రాత్రి, ప్రవాస లేఖ, వేసవి మొదలైన ఖండికలో భావకవిత్వ లక్షణాలు కనిపిస్తాయి.

**తిలక్ కవిత్వంలో అభ్యుదయకవిత్వ లక్షణాలు:-** తిలక్ అభ్యుదయ భావనకు అందమైన శైలిని సమకూర్చి, అభ్యుదయ కవితా కాలంలో ఉన్న దోషాన్ని తొలగించడానికి ప్రయత్నించాడని చెప్పవచ్చు. భావకవుల శబ్ద సౌందర్యాన్ని, శైలిని అభ్యుదయ కవితలో చొప్పించి తనదైన శైలిని రూపొందించుకున్నారు. తిలక్ రచనలలో అభ్యుదయం, వాస్తవికత తొంగి చూస్తాయి.

'ప్రార్ధన' కవితా ఖండిక తిలక్ లోని అభ్యుదయవాదానికి నిదర్శనం. "దేవుడా, రక్షించు నా దేశాన్ని పవిత్రులనుండి, పతివ్రతలనుండి పెద్ద మనుషుల నుండి నీతుల రెండు నాల్కలు సాచి బుసకొట్టే నిర్వేతుక కృపా సర్పాలనుండి లక్షలాది దేవుళ్ళనుండి, వారి పూజారుల నుండి వారివారి నిరంకుశ ప్రతినిధులనుండి.......' అని ఈ అన్యాయ వ్యవస్థకి కారకుల్ని వేలెత్తి చూపించాడు. పతివ్రతలు, పవిత్రులు, పెద్దమనుషులుగా చెలామణీ అయ్యే దొంగలను ఎండగట్టాడు. వారు దేశ ప్రగతిని నిరోధిస్తున్నారని వాపోయాడు.

"కత్తి వాదనకు తెగిన కంఠంలో హఠాత్తుగా ఆగిపోయిన సంగీతాన్ని వినిపించు మానవ చరిత్రపుటలలో నెత్తురొలికి మాసిపోయిన అక్షరాల్ని వివరించు" అని తన అభ్యుదయ కాంక్షను సూచించారు తిలక్. చాలిచాలని జీతాలతో జీవించే గుమస్తాలను, టీచర్లను, చిరుద్యోగులనూ, చిన్న సంసారులనూ తన కవిత్వంలో చూపించారు తిలక్.

"చిన్నప్పటి ఆదర్శాలు అహంకారాలు నశించి..... యౌవనంలో వృద్ధాప్యాన్ని తగుల్చుకొని భయాలచాటున ఏడుపు కొండల మాటున..... సగంసగం తిన్న కలల్ని నెమరేస్తూ సగంసగం చచ్చిన ప్రాణాల్ని జోకొట్టుతూ" ఈ విధంగా మధ్య తరగతి జీవితాన్ని చిత్రించిన కవుల్లో తిలక్ మొదటివాడు. వాళ్ళని తిరుగుబాటు చేయమని చెప్పేటంత ఆవేశపరుడు కాదుగానీ, వాళ్ళ దుర్భర పరిస్థితిని వెల్లడించగల అభ్యుదయవాదే..

"సంప్రదాయ భీరువుకీ అస్వతంత్ర వితంతువుకీ వసంతంలేదు సాహసి కానివాడు జీవన సమరానికీ స్వర్గానికి పనికిరాడు హిమసుందర శృంగమైన ఎవరెస్టుని ఒక టెన్సింగే ఎక్కగలడు" అని ప్రబోధించాడు. 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటిలో తిలక్ అభ్యుదయ దృక్పథాన్ని తెలియజేసే అనేక ఖండికలు ఉన్నాయి.

"కూడులేని లోకంయిది, గుండెలోతు తాపంయిది సోమయాజి శాపం యిది పెద్దలున్న మిద్దెలున్న పాపం యిది అడుగునున్న అడుసు తిన్నలోకం యిది" "మేం మనుష్యులం మేం మహస్సులం మాకు దాస్యం లేదు మాకు శాస్త్రం లేదు మాకు లోకం ఒక గీటురాయి మాకు కరుణ చిగురు తురాయి మేం పరపీడన సహించం మేం దివ్యత్వం నటించం" మొదలైన ఖండికలు తిలక్ అభ్యుదయవాదానికి నిదర్శనం.

సిఐడి రిపోర్టులో లంచాలు తీసుకోనివాడు, నీతి నిజాయితీలు గలవాడు ఈ సమాజంలో జీవించలేడనీ, "అతను మరణించడమే ఈ దేశానికి రక్ష" అని తిలక్ చెప్పాడు. ఇది నిరాశావాదం కాదు- వాస్తవస్థితి.

**తిలక్ కవిత్వంలో మానవత్వం:-** "తిలక్ ఖచ్చితమైన మానవతావాది. కేవలం వ్యక్తిగతమైన అనుభూతికి సంబంధించిన మానవతా భావనకు, సమాజపరమైన మానవ కారుణ్య భావనకు చాలా తేడా ఉంటుంది. తిలక్ నిశ్చయంగా యీ రెండవ పద్ధతికి చెందినవాడే. అభ్యుదయ కవితా యుగపు ప్రధాన లక్షణమైన అంతర్జాతీయ భావనా, సంకుచితమైన జాతి, మతాల సరిహద్దుల్ని చెరిపివేసి, అంకుఠిత మానవీయ పతాకను ఎగురవేసే తత్వ్వమూగల అభ్యుదయ కవికంఠమతనిది" అని 'అమృతం కురిసిన రాత్రి' వచన కవితా సంపుటి పీఠికలో కుందుర్తి ఆంజనేయులు గారు పేర్కొన్నారు.

తిలక్ మానవతావాది అనటానికి 'ఆర్తగీతం' సాక్ష్యం. దీనుల, హీనుల దుస్థితికి చలించి తిలక్ ఈ విషాదగీతం రచించారు.

"నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాణ్ణి నేను చూశాను నిజంగా నీ రంధ్ర వర్షాన వంతెన కింద నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి" అని తిలక్ తన తీవ్రానుభూతిని కళ్ళకు కట్టించాడు. అప్పటికి వచన కవిత్వంలో ఈ శైలి కొత్తదే. తిలకిని ఈ అమానుషాలు కదిలించివేశాయి.

"ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి? ఏ బుద్ధ దేవుడి జన్మభూమికి గర్వస్మృతి?" అని మన సంస్కృతినీ, విజ్ఞానాన్నీ నిలదీశాడు. "నా దేశాన్ని గూర్చి పాడలేను" అని విచారం వెలిబుచ్చాడు.

"మానవతలేని లోకాన్ని స్తుతించలేను మానవునిగా శిరసెత్తుక తిరగలేను ఈ నాగరకతారణ్యవాసం భరించలేను" అనటంలో తిలక్ మానవతావాదం స్పష్టమవుతుంది.

"చావుపుట్టుకల మధ్య సందేహం లాంటి జీవితంలో నలువైపులా అంధాకారం మంచిగంధంలా పరిమళించే మానవత్వం మాకున్న ఒకే ఒక్క అలంకారం" అంటూ కవికి, సగటు మనిషికి ఉండవలసిన మానవత్వాన్ని చాప్పాడు తిలక్.

తిలక్ జాతి, మత భేదాలను అంగీకరించలేదు. అతనిది విశాల దృక్పథం. తిలక్ విశ్వమానవ సౌభ్రాతృత్వానికి 'వసుధైకగీతం' నిదర్శనం. అందులోని ఈ పాదాలు ప్రత్యక్ష సాక్ష్యాలు:

"సంకుచితమైన జాతీయతాల సరిహద్దుల్ని చెరిపివేస్తున్నాను నేడు అకుంఠితమైన మానవీయ పతాకను ఎగురవేస్తున్నాను చూడు చరిత్రల రక్తజలధికి స్నేహ సేతువు నిర్మిస్తున్నాను రండి కవి వచస్సవిత్రుకాంతి పూరమిది స్వేచ్ఛగా జలకమాడండి". తిలక్ సృజనశక్తి సర్వతోముఖంగా విజృంభిస్తున్న సమయంలో అప్పుడే వికసించిన మల్లెపువ్వులా ఉండే తిలక్ వాడకుండానే, వాసన వీడకుండానే నలభై అయిదేళ్ల నడిప్రాయాన 1961 జూలై 1 అనారోగ్యంతో రాలిపోయారు.

"గాలి మూగదయిపోయింది. పాట బూడిదయిపోయింది. వయస్సు సగం తీరకముందే అంతరించిన ప్రజాకవి నభస్సు సగం చేరకముందే అస్తమించిన ప్రభారవి మరికనిపించదా" అని శ్రీశ్రీ తిలక్ పై స్మృతిగీతం రచించారు. ఇందులో తిలక్ని యువకవిగా, లోక ప్రతినిధిగా, నవభావామృతరసధునిగా, కవితా సతి నొసట నిత్య రస గంగాధర తిలకంగా, కవితా పుత్రునిగా, కదన క్షాత్రునిగా, సకల జగన్మిత్రునిగా మెచ్చుకున్నారు.

తిలక్ కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేస్తుంది. కవిత్వ రహస్యం కాళిదాసుకు, పెద్దనకు, కృష్ణశాస్త్రికి, శ్రీశ్రీకి మాత్రమే కాదు - తిలక్ కూ తెలుసు.

**ముగింపు :-**

ఆధునిక కవిత్వానికి పునాదులుగా భావించే భావాభ్యుదయ కవిత్వాలను మేళవించి ఆధునిక కవిత్వానికి కొత్త సొగసును అద్దిన ఖ్యాతి ఖచ్చితంగా తిలకే కే దక్కుతుంది. నేటి సమాజం ఎంతగానో ఆశిస్తున్న మానవతావాదాన్ని దాదాపు ఐదు దశాబ్దాల పూర్వమే తన రచనలలో స్పష్టంగా వ్యక్తీకరించిన నిజమైన మానవతావాది తిలక్. తిలక్ కవిత్వంలో ప్రధానంగా ఆర్ధత, ఔచిత్యం ఉన్నాయి. అతని రచనలు అనుభూతికి మన గుండెల్లో ఆకారాన్ని కడతాయి. నిజానికి తిలక్ కవిత్వం ఏ ఇజానికి, ఏ భావానికి, ఏ వాదానికి లొంగదు. జీవితంలోని ఒక పార్శ్వాన్ని కాకుండా సమగ్ర స్వభావాన్ని దర్శిస్తుంది. ఇలా తన రచనల ద్వారా ఎందరో కవులకు మార్గనిర్దేశం చేసిన తిలక్ తెలుగు సాహిత్య లోకంలో ఒక ధృవతారగా నిలిచిపోయారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**ఆధార గ్రంథాలు:**
1. డా. ద్వా.నా. శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర, మార్చి 2013, ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్
2. దేవరకొండ బాలగంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రి(కవితా సంపుటి), ఫిబ్రవరి 2006, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష (మొదటి సంపుటి), నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి, ఆగష్టు 2004.

# అభ్యుదయ కవిత్వ వికాసం

**డా|| అంగటి పైడిరాజు,**
అసోషియేట్ ప్రొఫెసర్,
డా॥ లంకపల్లి బుల్లయ్య కళాశాల, విశాఖపట్నం

**స్థూల పరిచయం:**
సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవిత్వోద్య మం అభ్యుదయ కవిత్వం. వ్యవస్థలో మార్పు వచ్చి, అందరూ సమభావంతో మెలగాలని కోరుకునేది అభ్యుదయం.
అభి + ఉదయం = అభ్యుదయం,అభ్యుదయం అనే మాటకు శుభం, మంగళమని నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లం లోని ప్రోగ్రెస్ అనే పదానికి సమానార్థకంగా అభ్యుదయం అనే పదాన్ని వాడుతున్నారు.
**ఉపోద్ఘాతం:**
భావకత్వానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ చైతన్యానికి సరికొత్త కవితారీతికి పునాది వేశారు శ్రీశ్రీ. ప్రగతి అనే అర్థంలో అభ్యుదయం అనే పదాన్ని మొట్టమొదటిసారిగా ప్రయోగించి, అభ్యుదయ పదానికి కొత్త అర్థాన్ని చెప్పారు.
"నేడే
ఈనాడే, ఈనాడే -
జగమంతా బలివితర్ది!
నరజాతికి పరివర్తన!
నవజీవన శుభ సమయం ! అభ్యుదయం !"
అంటాడు శ్రీశ్రీమహాప్రస్థానంలోని అభ్యుదయం అనే గీతములో, అలాగే
కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ,
పాడేదీ పాడించేదీ,
పెను నిద్దుర వదిలించేదీ,
మునుముందుకు సాగించేదీ,
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి - అంటాడు శ్రీశ్రీ నవకవిత అనే గేయంలో,

తెలుగు సమసమాజ నిర్మాణం కోసం అభ్యుదయ సాహిత్యం పాటుపడింది. ఆంధ్రదేశములో రెండు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యం ఉధృతంగా సాగిన కవితోద్యమం అభ్యుదయకవిత్వం. సామాన్య ప్రజల్ని గూర్చి పట్టించుకున్న సాహిత్యం అభ్యుదయ సాహిత్యం. సామాన్య ప్రజల్ని గూర్చి పట్టించుకోకపోతే సాహిత్యం వ్యర్థం అనే స్థితికి తెచ్చింది. జాతిని జాగృతం చేసి ప్రజలకష్టాల్ని పట్టించుకున్న సాహిత్యం అభ్యుదయ సాహిత్యం. 1917 నాటి రష్యన్ సోషలిస్టు విప్లవం నెలకొల్పి న శ్రామికవర్గ సమసమాజ నిర్మాణం ప్రపంచవ్యాప్తంగా కవులనూ, కళాకారులనూ ప్రభావితం చేసింది. దీనికి ముందు 1850 దశకంలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి. తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి మార్క్సిజమే పునాది.

**విషయం:**

మనిషి అభివృద్ధి సాధించాలంటే అనేకమైన అవరోదాలను అదిగమించాలి. అందుకే శ్రీశ్రీ అంటాడు 'మనదీ ఒక బ్రతుకేనా కుక్కల వలె, నక్కల వలె, మనదీ ఒక బ్రతుకేనా సంధుల్లో పందులవలె నని. మనిషి ఎంత కాలం బ్రతికాడు అన్నది కాదు ముఖ్యం ఎలా బ్రతికాడన్నదే ముఖ్యం. అందుకే మనిషి ఒకదగ్గర కూర్చొని ఉంటే ఏ అభివృద్ధి పొందలేమని, మనిషి గురించి"కుదిరితే పరిగుత్తు, లేకపోతే నడువు, అదీ చేతకాకపోతే పాకుతూ పో, అంతేకాక ఒక చోట అలా కదలకుండా ఉండిపోకు" అంటాడు శ్రీశ్రీ మనిషి అభివృద్ధిలో భాగంగా ఎన్నెన్నో అడ్డంకులు వస్తాయని వాటిని అదిగమించుకొని వెళ్ళాలే కానీ, ఎక్కడా ఆగిపోకూడదని శ్రీశ్రీ మహా ప్రస్థానం గేయములో

"దారిపొడుగునా గుండె నెత్తురులు తర్పణచేస్తూ పదండి ముందుకు! బాటలు నడిచీ, పేటలు కడచీ, కోటలన్నిటినీ దాటండీ! నదీ నదాలూ, అడవులు, కొండలు, ఎడారులా మన కడ్డంకి? అంటూనే త్రాచుల వలెనూ, రేచుల వలెనూ, ధనంజయునిలా సాగండి!" అంటాడు మహా ప్రస్థానంలో.

**అభ్యుదయం నిర్వచనాలు:**

అభ్యుదయం గురించి అనేకమంది నిర్వచించారు.

1. ఊహా లోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించింది, సామాన్య మానవుణ్ణి సాహిత్యానికి మకుటధారిని చేసింది అభ్యుదయ కవిత్వం.

**2. పి.వి. రాజమన్నారు:**

"అభ్యుదయ రచన సమకాలికమైన జీవిత పరిస్థితులకు రాజకీయ వాతావరణానికి, ఆర్థిక సమస్యలకు, సమాజ సంఘర్షణలకు, నైతిక సందర్భాలకు ఐహిక ఆముష్మిక సిద్ధాంతాలకు వైజ్ఞానిక విశేషాలకనుగుణంగా అనుకూలంగా తగినట్టి, అవసరమైనట్టి మార్పులతో విరసిల్లేను".

**3. దేవులపల్లి కృష్ణశాస్త్రి :**

"పీడింపబడేవాళ్ళూ, పీడించే వాళ్ళూ ఉన్నా యీ వర్గ సమాజం ఉండాలని ఎవరూ కోరరు. రానున్న విధానం లో సాధారణ మానవుడే మకుటదారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతి ఘటించే వారు ఎప్పుడూ అభ్యుదయవాదులు కాజాలరు. ఆ ధనిక సమాజం పోవాలనుకోవడమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకొని వ్రాసేది అభ్యుదయ రచన.

**4. శ్రీ శ్రీ:** "అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు రసాస్వాదనకు సంబంధించింది. సాహిత్యం ఒక భోగ వస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరగబడుతున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాలవల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోన్ముఖ ంగా త్రిప్పడానికి నేటి రచయితలు పాటుబడుతున్నారు".

**5. "చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం" ఏల్చేరు నారాయణరావు.**

పై నిర్వచనాలను పరిశీలించి చూస్తే, అభ్యుదయం అనేది అవగతమౌతుంది. అలాగే అభ్యుదయ సాహిత్యం అనేదానికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే....
1. అంతర్జాతీయ దృక్పథం లో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజం నెలకొనడం.
3. పెట్టుబడిదారి వ్యవస్థను కూలదోయడం,
4. సమ సమాజ స్థాపన,
5. వర్ణ, వర్గ రహితమైన సమాజ స్థాపన,
6. శ్రమదోపిడి లేని సమాజం,
7. మిగులు పంపిణీ,
8. దేశ పారిశ్రామికీకరణ,
9. నవ సమాజం నిర్మాణం,
10.వ్యక్తి చైతన్యాన్ని, సంఘ చైతన్యంగా పరివర్తింప చేయడం.

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) సుప్రాస్థికులు వ్రాసి, భావకవిత్వ ప్రభావం నుండి బయటపడ్డాడు. 1930 వరకు తెలుగు కవిత్వం తనను నడిపిస్తే, ఆతర్వాత నుంచి తెలుగు కవిత్వాన్ని తానే నడిపించానని శ్రీశ్రీ అన్నారు. అంతేకాకుండా " ఈ శతాబ్దం నాదే" అని చాటి చెప్పాడు. శ్రీశ్రీ అధునికాంధ్రా సాహిత్యములో ఒక ప్రధాన ఘట్టం. అభ్యుదయ కవుల్లో అగ్రగామి. శ్రీశ్రీ ది సమాజ సాహిత్యం. తాను భువనభవనానికి బావుటా కాగోరాడు. మహాప్రస్థానము అభ్యుదయ దృష్టినే కలిగి ఉంది. శ్రీశ్రీ కంటే ముందు భావకవిత్వం మీద శిష్ట్లా, పఠాభి, నారాయణబాబు తిరుగుబాటు చేశారు.

**ముగింపు:**

'నాగీతం నరజాతి విముక్తికి సంగీతం' అని పలికిన అభ్యుదయ కవి కుందుర్తి. నా తెలంగాణా కోటి రత్నాల వీణ అంటాడు దశరాథి. విద్వాన్ విశ్వం, ఆవంత్స సోమసుందర్ వంటివారు అద్భుతమైన అభ్యుదయ కవిత్వం వ్రాసారు. మహీదర రామమోహనరావు, వట్టి కోట ఆళ్వారు స్వామి, ఉప్పల లక్ష్మణరావు వంటి వారు అభ్యుదయ నవలలు వ్రాసారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు, ప్రజా నాట్యమండలి వంటి సంస్థలు అభ్యుదయ భావాలతో తెలుగునాట అనేక నాటకాలు ప్రదర్శించబడ్డాయి. చాగంటి సోమయాజులు, చలం, కరుణకుమార మొదలైనవారు అభ్యుదయ కథలు వ్రాసారు. శ్రీశ్రీ, కె.వి. రమణా రెడ్డి, కుటుంబరావు మొదలైనవారు అభ్యుదయ వ్యాసాలు వ్రాసారు. 1943 లో అభ్యుదయ రచయితల సంఘం స్థాపనతో అభ్యుదయ కవిత్వం విశ్వరూపం దాల్చింది. వర్తమాన సమస్యల్ని రచనా వస్తువులుగా తీసుకొని సమర్థవంతమైన కావ్యంగానో, నవలగానో, కవితగానో, నాటకంగానో, వ్యాసంగానో, గేయంగానో, చైతన్యవంతంగా వ్యక్తీకరించి ప్రగతిశీలమైన మార్పును తీసుకొని వచ్చారు అభ్యుదయ కవులు అనడములో ఎటువంటి సందేహము లేదు.

**ఆధారగ్రంథాలు:**

1. మహాప్రస్థానం మూడవ ముద్రణ - జులై 1954,
2. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు ఆచార్య వెలమల సిమ్మన్న,
3. తెలుగు సాహిత్యచరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న,
4. అంతర్జాలం.

## కవిత్వ నిర్మాణ వ్యూహాలు.

**డాక్టర్ పోలుమాటి అన్నవరం సత్యనారాయణ**
తెలుగుశాఖ అధ్యక్షులు
ప్రభుత్వకళాశాల (అ), రాజమహేంద్రవరం 9492566950.

**స్థూల పరిచయం:** కవిత్వం అని కాదు సృజనకు సంబంధించిన మరి ఏ ప్రక్రియకైనా బుద్ధి భావవేశం రెండు పనిచేయాలి అంటే ఈ రెండు మెదడు హృదయాల్లోంచి జనిస్తాయి అన్నమాట బుద్ధి కంటే భావావేశం ఎక్కువగా కలిగిన రచనే సృజనాత్మకంగా ఉంటుంది. రసాస్వదనయోగ్యమవుతుంది. భావుకత కంటే తెలివి ఎక్కువగా వినియోగించి తయారు చేసిన రచన తాలూకు వస్తువులోను అభివ్యక్తిలోనూ సంక్లిష్టత ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. అంటే పాఠకుడు ఆ రచనలో ఏముందో చూడటానికి తన హృదయం కంటే మెదడును వినియోగించాల్సి ఉంటుంది ఫలితంగా ఆ పాఠకుడికి బుద్ధి వికసిస్తుంది కానీ రసాస్వదన తక్కువగా కలిగే పరిస్థితి ఉండవచ్చు.

ఇక్కడ వ్యూహం అన్న మాటకు ప్రణాళిక అని అర్థం తీసుకుంటే సరిపోతుంది. యుద్ధ వ్యూహం యుక్తి అన్న అర్థాలు కళాత్మక ఆవిష్కరణకు పొసగవు అన్నది గమనార్హం.

ఒక రచన సృజన కావాలి అంటే అదిభౌద్ధికావేశాల సమ్మిళత శక్తి లోంచి ఉద్భవించాల్సి ఉ ంటుంది. ఆయా ప్రక్రియలు ఆబౌద్ధికావేశాల హెచ్చుతగ్గులు ప్రాతిపదికగా తయారవుతాయి. ఉ దాహరణకుకథ, నవల నాటకం లాంటి ప్రక్రియలకు మెదడు ఎక్కువ పనిచేయాల్సి ఉంటుంది. కవిత గేయం హైకూలు లాంటి ప్రక్రియలకు హృదయం ఎక్కువ వినియోగించాల్సి ఉంటుంది. ఈ రెండువిభాగాల్లోనూ బౌద్ధికావేశాలు ఉండాల్సిందే కానీ వాటి ప్రాధాన్యాల భూమికగా ఆయా ప్రక్రియలు తయారవుతాయంతే!

మరి హృదయ ప్రాధాన్యం ఎక్కువగా కలిగిన కవిత ప్రక్రియకు వ్యూహం అన్న పేరు అంతగా తగదు అన్న చర్చ కూడా ఉన్నది ప్రతి ప్రక్రియకు అందులోనూ ప్రతి కవితకు దానిదైన నిర్మాణ చట్రం ఉంటుంది. ఆ చట్రాలను అధ్యయనం చేయటం వల్ల లక్షణ సమన్వయమే కాకుండా కొత్త లక్ష్యాల లోంచి కొత్త లక్షణాలు వెలికి తీయబడి లక్షణ శాస్త్రం అభివృద్ధి చెందుతుంది. లాక్షిణికులు ఎక్కువ అవుతారు తద్వారా కవికి పాఠకుడికి మధ్య దూరం తగ్గుతుంది. ఫలితంగాకవిపొందిన బ్రహ్మానంద సహోదరత్వాన్నే కాకుండా ప్రగతిశీల ఆలోచన స్రవంతిని అందిపుచ్చుకోవటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

రచన సామాగ్రిని రకరకాల ప్రమాణాల్లో వినియోగించడం ద్వారా సృజన తయారవుతుంది. చర్వితచర్వణం అయ్యి, మూస లోపోసినట్టువుండేరచన సృజన హోదా పొందలేదు. కాబట్టేసృజనకు ఇంత వైవిధ్యం. ప్రాథమికమైన మూడు రంగుల్ని వివిధ ప్రమాణాల్లో సమ్మిళితం చేయటం వల్ల వేన వేల వర్ణాలు ఏర్పడినట్టుగానే వివిధ ప్రమాణాల్లో బౌద్ధికవేశాలను రస సామాగ్రిని రచన సామాగ్రిని రంగరించడం ద్వారా రచన సృజనగా ఆవిష్కరించబడుతుంది వెంటనే సృజనను లక్ష్యంగా చేసుకొని లక్షణాలు తయారవుతాయి ఈ లక్షణాల సమాహారమే లక్షణ గ్రంథాలుగా చలామణిలోకి వస్తాయి. పాఠకుడికిదిశానిర్దేశం చేస్తాయి.

ఈ లక్ష్యాలలోంచి వెలికి తీయబడ్డ లక్షణాలు ఆయా పేర్లతో వింగడించబడతాయి. అంటే అలంకారం ధ్వని వక్రోక్తి రసం ఔచిత్యం లాంటి సిద్ధాంతాలుగా ఉనికిలో ఉంటాయి. ఆధునిక ఆలంకారిక పరిభాషలో శిల్పం శైలి భావచిత్రం ప్రతీక ఎలోగరి మెటాఫర్, సిమిలి లాంటి పేర్లతో అలంకార శాస్త్రాన్ని పరిపుష్టం చేస్తాయి.

రచనకు రచనకు ఎన్ని పోలికలు ఉంటాయో అన్ని వైవిధ్యాలు ఉంటాయి అందుకే అది సృజన కాగలుగుతుంది. నవ నవోన్మేషమైన ఆ సృజన రసం జగత్తులో మనల్ని వోలలాడించడమే కాదు ప్రగతి పథంలోకి కూడా నడిపిస్తుంది.

ప్రస్తుతం మనం కవితా ప్రక్రియకు సంబంధించి కొన్ని రచనలను ప్రస్తావిస్తూ వాటి నిర్మాణ చట్రాల తయారీ గురించి అవి అందించే రసావిష్కరణ గురించి ముచ్చటిద్దాం.

కావ్యతిహాసాల్లో కథ కవిత్వాలు రక్తమాంసాలు లాగా వాటికి ఆచ్ఛాదనగా ఆసాంతం కొంత వచనంతో పద్యం పరుచుకొని ఉండేది కానీ కాలాంతరంలో కథ కవిత్వాలు

విడిపోయాయి. పైగా అవి వేరు వేరు ప్రక్రియలుగా అస్తిత్వాన్ని సంపాదించుకున్నాయి. అదే విధంగా పద్య వచనాలు విడిపోయాయి. అవి కూడా వేరువేరు ప్రక్రియలు కు అభివ్యక్తి వైవిధ్యాలుగా చలామణిలో ఉ న్నాయి.

కథకథనంతోనూ కవిత్వం వర్ణనతోను ఉనికిలో ఉంటాయి. శ్రమలోనూ సంతోషంలోనూ కవిత్వం పాటతో పాటు పురుడోసుకుంది పాట కవిత్వం అవిభక్త కవల పిల్లలుగా ఎదిగాయి. ఆ మాటకొస్తే కవిత్వం పాటలో అంతర్లీనమైపోయింది. పాటంటే లయాత్మికమైన కవితాత్మకమైన మాటల మంత్రదండం. కేవలం లయాత్మకమైన మాటల అల్లికతోనే పాట రక్తి కట్టదు. పాటలోని మాటలు కవితాత్మకమైఉండాల్సిందే.

కథ కవిత్వం నుంచి విడివడి మనుగడలో ఉన్నప్పటికీ పాట మాత్రం కవిత్వం నుంచి విడివడి మన జాలదు. లయతో కవిత్వం జోడి కడితేనే పాటకు అర్థం పరమార్థం మరి. అందుకే పాట కవిత అవిభాజ్యం.

పాటలో లయాత్ముకమైన మాటలు ప్రధానంకాని కవితలో వర్ణనాత్మకమైన మాటలు ప్రధానం. వర్ణన అంటే రూపలావణ్యాలనే కాదు గుణగణాల ప్రత్యేకతను పూసగుచ్చినట్టు చెప్పటం. కథనంఅంటే కథ తాలూకు ఆయా సంఘటనలను పారం పర్యతను చెప్పటం అన్నమాట.

కవిత్వం వర్ణనాత్మకంగా నర్మగర్భంగా గూడార్థాలతోనూ వ్యంగ్యార్థాలతోనూ మార్మిక భాషణంతో చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పకనే చెబుతూ చూపించి చూపించనట్టు కనిపించి కనిపించనట్టు చెబుతుంది. అందుకే నారాయణరెడ్డి మాటల్లో చెబితే కప్పి చెప్పేది కవిత్వం విప్పి చెప్పేది విమర్శ అన్నమాట. కాబట్టే మన పూర్వీకులు లాక్షిణికులు కవిత్వం కాంతసమితం అన్నారు.

కద కవిత పాట వేసుకుని ఏకోన్ముఖంగా సాగడం అనేది మనకు జానపద గేయగాథల్లో కనిపిస్తుంది. కానీ కద కొన్ని మార్పులతో అంటే కథనం ప్రతీకాత్మక కథనం సంభాషణ రూపంలో కవితాత్మకంగా సినిమా పాటల్లో కనిపిస్తుంది. జానపద గేయ గాథల్లో పాట జానపద గేయంగా విడివడి ప్రత్యేక గుర్తింపు పొందడం మనం చూస్తాం. అదేవిధంగా జానపద గేయం సినిమా పాటకు జవసత్వాలను ఇవ్వడం మనకు తెలిసిందే.

దుర్గమ్మ కథ మనకు చిరపరిచితమైన కథాగేయం. బుర్రకథ హరికథలు లాంటి సాహిత్య ప్రక్రియలలో కవిత్వం కథతో కలిసి ఆసాంతం కొనసాగడం మనకు తెలుసు.

సినిమా పాట విషయానికి వస్తే "అనగనగా ఆకాశం ఉంది ఆకాశంలో మేఘం ఉంది మేఘం వెనుక రాగం ఉంది రాగం నింగిని కరిగించింది కరిగిన నింగి చినుకు అయింది. చినుకే చిటపట పాటయ్యింది చిటపట పాట తాకిన నేల చిలకలవారిని చెట్టయింది. రాచిలుక నువ్వే కావాలి రాగాల మువ్వై మోగాలి."

ఇక్కడ ముక్త పదగ్రస్తంలో లాగా ప్రతి వాక్యం చివర పదంతో తర్వాత వాక్యం ప్రారంభం అవుతూ పాట కథనాత్మకంగా గుక్కతిప్పుకోనవ్వకుండా మనల్ని ఉరకలెత్తిస్తుంది. చినుకు చెట్టు కావడం మేఘానికి చినుకుకు రాగాన్ని ఆరోపించటం అంటే పాడే గుణాన్ని ఆపాదించడం, పాడగల చినుకు మామూలు చెట్టు కాదు చిలకలవాలినచెట్టు అయింది అనటం, ఆచిలుక తన ప్రియురాలు కావడం ఇక్కడ సారాంశం. తన ప్రియురాలు ఎక్కడో చినుకు లాగా ఆకాశంలో నుంచి ఊడిపడ్డ అతిలోకసుందరి అని చెప్పకనే చెప్పటం ఇక్కడ మనకు కనిపిస్తుంది. ప్రియురాలు అరుదైనది అమూల్యమైనది అన్న సందేశం ఈ ప్రతీకాత్మక కథనంలో ఇవ్వబడింది.

లోతైన కావ్యం లాంటి ఇస్మాయిల్ చిలుకలువాలిన చెట్టును ఈ పాటలో ధ్వనింపచేయడం మరో విశేషం. చిలుక గోరింకలతో యవజంటకు సామ్యం చెప్పటం మన పలుకుబడుల్లో సామెతలలోసుప్రసిద్ధం. ప్రియురాలిని చిలుకతోపోల్చడం తమది అపూర్వమైన జంట అన్నట్టుగామనకు స్ఫురిస్తుంది.

సాధారణంగా కథఅనగనగా ఒక అడవి ఉంది. అన్నట్టు ఒక ఎత్తుగడతో మొదలవుతుంది. ఈ పాటలో కూడా ప్రియురాలు అరుదైన అతిలోకసుందరి అని చెప్పకుండానే ప్రతీకాత్మక కథనాన్ని వర్ణనాత్మకంగారాగయుక్తంగా ప్రియుడు చెబుతున్నట్టుగా మనకు తెలుస్తుంది.

రాములో రాములో అన్న పాటలో "అరే ఇంటి ముందు లైటు మిణుకుమిణుకుమంటూఉంటే నువ్వు కన్ను కొట్టినట్టు సిగ్గు పుట్టింది చీర కొంగు తలుపు చాటు చిక్కుకుంటే నువ్వు లాగినట్టు ఒళ్ళు జల్లు మంటాది"

ఇక్కడ ఒక సాధారణ సన్నివేశాన్ని వివరిస్తున్నట్టు మొదట మనకు కనిపించినప్పటికీ వెంటనే ఒక తటల్లతలాంటి భావుకత మనల్ని చుట్టుముడుతుంది అప్రయత్నంగా చీర కొంగు తలుపు సందులో ఇరుక్కుంటే ప్రయత్న పూర్వకంగా దాన్ని లాగినట్టు అనిపించింది అనటం వల్ల ఒక భావ ప్రకంపన మనల్నిసంభ్రాశ్చర్యాలలో ముంచేస్తుంది.

సిగ్గు పుట్టింది అని చెప్పడం ఒళ్ళు జళ్ళు మంటుంది అని అనటంలో విభానుభవాలు మనల్ని కూడా రసజగత్తులోకి లాక్కుపోతాయి.

"గగనపు వీధి వీడి వలస వెళ్లిపోయిన నీలిమబ్బు కోసం తరలింది తనకు తానే ఆకాశం పరదేశం శిఖరం అంచు నుండి నేల జారిపోయిన నీటి చుక్క కోసం విడిచింది చూడు నగమే తన వాసం వనవాసం" ఆకాశం పరదేశం తరలిపోవడం లో ఆకాశం పరదేశం తనవాసం వనవాసాల మధ్య శూన్య సంబంధం వ్యక్తం అవుతుంది.

ఇక్కడ నీటిమబ్బు ఎవరు నీలిమబ్బు ఎవరో ఆకాశం ఎవరు? శిఖరం నుంచి ఏమిటో నీటి చుక్క ఏమిటో నగం దేనికి ప్రతీక వనవాసం అంటే ఏమిటో తనవాసం అంటే ఏమిటో మనకు ఆ సినిమా తాలూకుసంబంధిత సన్నివేశం ద్వారా వ్యక్తం అవుతుంది.

నీకంటి రెప్పలంచున మనసు నిండి పొంగిన ఓ కన్నీటి బిందువే కదా నువ్వు కోరుకున్నసంపద ఒక్కొక్క జ్ఞాపకానికి వందేళ్ళు ఆయువుందిగా ఇంకెన్ని ముందు వేచెనోఅవన్నీ వెతుకుతూ పదా."

రెప్పల అంచు నుంచి జారే నీటి బిందువే సంపద అని చెప్పటం ఒక్కో జ్ఞాపకానికి వందేళ్లు ఆయువు ఉంది అని అనటం దాన్ని వెతుకుతూ ముందుకు నడవమనటంలో లోతైన గూఢార్థంసంబంధిత చిత్ర సన్నివేశం ద్వారా మనకు వ్యక్తం అవుతుంది. ఈ వక్రోక్తి మనల్ని కట్టిపడేస్తుంది భావోద్విగ్నతలోకి తీసుకుపోతుంది.

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా కొట్లాది ప్రాణమా" సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చుని మొరగదు పర్వతం వంగి ఎవడికి సలాం చేయదు నేను అంతా కలిపి ఒక పిడికెడు మట్టే కావచ్చు కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండా కొన్నంత పొగరు ఉంది.

ఇలాప్రతీకాత్మకంగాధ్వని గర్భితంఅయినకవిత్వం ఎక్కువప్రభావశీలమైంది అనితెలుస్తుంది.

"చొక్కాకి బొత్తం ఊడిపోతే చక్కగా కుట్టింది మా ఆవిడ/ మెడకు మెడ భుజానికి భుజాలు/నడుమ నడుముకిఅన్నీ అమరినట్టు సరిపోయాయి/ భగవంతుడో మరోడో/ గగనానికిచేర్చి సూర్యుడు బొత్తాన్ని /సూది దారంతో ఇలాగే కుట్టి ఉంటాడు/ హేమంత శరత్తులు /వసంత శిశిరాలు/ వర్షా గ్రీష్మాలు చక్కగా సరిపోయాయి".

సృష్టికి సూర్యుడు ఎంత మూలాధారమోతన జీవితానికితన భార్య అంత కేంద్ర బిందువు అన్న భావాన్ని పైభావ చిత్రం ద్వారా చిత్రిస్తాడుకవి.

ముగింపు: అందుకే రమణీయ ప్రతిపాదక శబ్దమే కావ్యం, సౌందర్యాన్ని లయాన్వితంగా సృజించడమే కవిత్వం అని, లోకోత్తరవర్ణనా నిపుణుడైనకవి కర్మే కావ్యం అని మనఆలంకారికులు అంటారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

ఒక చేత్తో ఆకాశాన్ని ఎత్తి పట్టుకుంటుంది / ఒక చేత్తో భూమిని బుజ్జగిస్తుంది /ఒక పిట్ట చేత్తో కన్నీటి బీజాలు ఏరుకుంటుంది/ ఒక సెలయేటి చేత్తో బండలని నిమిరిఓదారుస్తుంది /ఒక చేత్తో అన్నం వడ్డిస్తుంది/ ఒక చేత్తో పిల్లల్ని లాలిస్తుంది/ ఒక జ్వాలా హస్తంతో చీకట్లను సాగనంపుతుంది /ఒక చేత్తో విధిని నిలేస్తుంది /ఒక చేత్తో చిరునవ్వులకు సిగ్నల్ ఇస్తుంది /అన్నిదిక్కులా చేతులతో ఆకులతో చక్రమై జీవితబబ్బండిని రీవి గా నడిపిస్తుంది'.

ఒక చేత్తో అన్నమాట పదేపదే పునరావృత్తం చేయటం ద్వారా భార్య ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతూనే ఆమెను ఆదిపరాశక్తిగా దృశ్యీకరించడం మనకు పై భావ చిత్రంలో కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**

1.ఆధునిక కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు డాక్టర్ సి.నారాయణరెడ్డి విశాలాంధ్ర
ప్రచురణలు హైదరాబాదు 2001

2.ఒక వస్తువు దిన్న సందర్భంగా సందర్భాలు డాక్టర్ పోలుమాటి అన్నవరం సత్యనారాయణ జాస్మిన్ ప్రచురణలు రాజమహేంద్రవరం 2005.

3.బాల్చీలో చంద్రోదయం ఇస్మాయిల్కుసుమ బుక్స్ ప్రచురణలు విజయవాడ 1996.

4.సమకాలీన తెలుగు సినిమా పాటలునిర్మాణ చిత్రాలు డాక్టర్ పోలుమాటి అన్నవరం సత్యనారాయణజాస్మిన్ ప్రచురణలు రాజమహేంద్రవరం 2024

# చైతన్య దీప్తి - కుసుమ ధర్మన్న

**కె.ఎం. సౌందర్యవతి**
తెలుగు అధ్యాపకురాలు ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం
చరవాణి: 8374539203

**రచయిత విశేషాలు:**కుసుమ ధర్మన్న తొలి దళిత కవి. ఈయన తన జాతి హరిజనులు హీనత్వంతో అమానుషంగా బాధపడుతున్న స్థితిని నివారించడానికి సంఘ సంస్కరణ దృష్టితో హరిజన శతకాన్ని రచించారు. ధర్మన్న అంబేద్కర్, గాంధీజీల ప్రభావంతో స్ఫూర్తిని పొంది, అంటరానితనాన్ని నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ఆలకింపుమయ్యా! హరిజనుడా! అనే మకుటంతో హరిజన శతకాన్ని తనదైన రచనాశైలిలో రచించారు.

తన జాతి చైతన్యం కోసం తపించిన సంస్కరణ శీలి. వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడైన ధర్మన్న ఎన్నో రచనలు చేశారు. ముఖ్యంగా 1) నిమ్నజాతి ముక్తితరంగిణి, 2) నల్లదొరతనం, 3) నిమ్నజాతుల ఉత్పత్తి, 4) అసుర పురాణం (పద్యకావ్యం), 5) అంటరానివాళ్ళూ! (కథాసంపుటి), 7) హరిజన శతకం.

చైతన్య దీప్తి: ప్రజలు అంటరానితనం అనే విషాన్ని మింగి తిరుగుతున్న తరుణంలో తన జాతి హరిజనులను ప్రబోధిస్తూ హరిజన శతకం ద్వారా వారిలో పాతుకుపోయిన మూఢవిశ్వాసాలను వదిలిపెట్టాలని జన్మహక్కులకై పోరాడమనీ, ప్రాణత్యాగం అయినా అది స్వర్గ మార్గమనీ, ఆత్మాభిమానాన్ని ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని చైతన్యం కలిగించారు.

ప్రజల్లో పాతుకుపోయిన అంధ విశ్వాసాలకు చరమగీతం పాడాలన్నారు. సామాజిక చైతన్యానికి సాహిత్యం దోహదపడుతుందని ప్రజలకు చైతన్య ప్రబోధం చేయాలని ఆశించిన కుసుమ ధర్మన్న గారు తనదైన శైలిలో ఎన్నో అద్భుతమైన రచనలు వ్రాసి, ప్రజల్లో చైతన్యం కలిగించారు. అందులో ముఖ్యంగా గాంధీజీ స్ఫూర్తితో 1933లో దళితులను ప్రబోధించే

లక్ష్యంతో "ఆలకింపుమయ్య హరిజనుండ" అనే మకుటంతో ఆటవెలది పద్యాలతో శతకాన్ని రచించి సాహిత్యంతో ప్రజల చైతన్య దీప్తి కలిగించారు.

పురాతన కాలంలో ప్రజలంతా కులమత బేధాలు లేకుండా అన్నదమ్ముల వలె ఐకమత్యంతో నిశ్చింతగా జీవించేవారు. స్వార్థపరులైన ప్రజలు, అంటరానితనం అనే విషాన్ని ఉగ్గుపాలతో రంగరించిపోసి, మోసగించే దళితుల్ని దాసానుదాసులుగా చేశారన్న విషయాన్ని గ్రహించమని ధర్మన్న గారు ప్రబోధించారు. వారిలో చైతన్యాన్ని నింపి, దళితులంతా తమ హక్కులకోసం పోరాడాలని వీరు కోరారు. హక్కుల పోరాటంలో ప్రాణాలు పోయినా దాన్ని వీరస్వర్గంగా భావించాలని జనులకు హితబోధ చేశారు.

కుసుమ ధర్మన్న తన జాతీయాల్లో ఆత్మగౌరవ స్ఫూర్తినీ దీప్తిని కలిగించిన కవి. ధర్మన్న భారతీయ సమాజంలో నెలకొన్న హెచ్చుతగ్గులను నిరసించిన జాతీయ వాది.

ఓ హరిజనుడా! నీ శ్రేయస్సుకై నేను చెప్పే నిజం నీ మనస్సులోపల దర్శించు. పూర్వకాలంలో భూమిపై ప్రజలంతా అన్నదమ్ముల్లా కలసిమెలసి దురాశ, చీకు, చింతా లేకుండా ఉండి చిరంజీవులయ్యారు. ఆనాడు హక్కులూ, ఆస్తులపై అధికారములేవు. నీవు, నేనూ అనే అహంకారం లేదు. మాయా మర్మాలు లేవు.

ఆ రోజుల్లో ప్రజలకు డబ్బుపై ఆశలేదు. పాడిపంటలే వారికి భోగభాగ్యాలు. దేశమాత ఇచ్చిన సంపదలు ప్రోగుచేసి, సంఘసేవ చేసేవారు. అంతేకాక ప్రజలంతా కష్టపడి పనిచేసుకుంటూ, కడుపునిండా తిని, పేదరికం, అనారోగ్యం లేకుండా బతికేవారు. ప్రజల్లో నూతన చైతన్యం ఉరకలు వేసేది. అంతేకాక కడుపునిండి ఒకడు, ఆకలితో అలమటించేవాడు మరొకడు ఉండేవారు కాదు. అందరూ సంతోషంగా, సుఖంగా జీవించేవారు. ఆ రోజుల్లో గ్రుడ్డి, కుంటి వారు తిండి బట్ట లేక, పరుల దగ్గర చేయిచాచేవారు కాదు, వారికి దరిద్రం లేదు.

కృతయుగం దైవ హితంగా సాగింది. మొత్తం ప్రపంచమంతా స్వర్గంగా ఉండేది. కలియుగంలో కృతయుగ ధర్మములు తారుమారు అయ్యాయి. పాపం పెరిగి పోయింది. తినడానికి తిండి లేక ప్రజలు ఆకలితో పస్తులు ఉంటున్నారు. అందరిలో కలహాలు పెరిగిపోయాయి. డబ్బు పై ఆశ పెరిగి, ధర్మం దారితప్పింది.

కుసుమ ధర్మన్న కవితలో మృదుత్వం, భావ వ్యక్తీకరణలో సూటితనం, పద ప్రయోగంలో అర్ధ గాంభీర్యం, పీడిత ప్రజలపట్ల ప్రగాఢ ప్రేమానురాగం, కిరాతకమైన వైదిక సాంఘిక వ్యవస్థపట్ల పట్టరాని ఆగ్రహం, హేతుబద్ధమైన తార్కిక దృక్పథం, సామాజిక పరిస్థితులను గూర్చి నిశితమైన అవగాహన ఇవే ధర్మన్న కవితలోని విశిష్ట లక్షణాలు.

ఈటెల్లాంటి మాటలతో, బరిసెల్లాంటి ప్రశ్నలతో అగ్రవర్ణ పెత్తందార్ల గుండెల్లో ఫిరంగి గుళ్ళు విసిరిన వీరాధి వీరుడు ధర్మన్న. మధుర మంజుల మార్దవమైన తేట తెలుగులో దళితులు గతుకుల బతుకుల్లోని వెతల్ని, ధర్మన్న అత్యంత శక్తివంతమైన కవిత ద్వారా "ఆలకింపుమయ్య హరిజనుడ" అనే మకుటంతో "హరిజన శతకం"లో చెప్పారు.

పూర్వకాలంలో సంఘంలో ఎవ్వరూ తమకు కూడు గుడ్డ లేవని కుంటివారమని గుడ్డితనంతో బాధపడుతున్నామని చెప్పుకొని ఇతరుల వద్ద ముష్టి ఎత్తుకొనేవారు కాదు. ఎవరికీ ఆరోజుల్లో పేదరికం లేదు. ఎవరికీ బాధలు లేవని ఆనాటి సంఘ స్థితిని ధర్మన్న గారు తన హరిజన శతకంలో సవివరంగా తెలియజేసారు మరియు కృత యుగంలో సమస్థ జగత్తు స్వర్గంలా ఉండేదని ఆనాటి ప్రజలకు జనన మరణ విచారం లేదని భవగవంతుని ధ్యాసలో సుఖంగా ఉండేవారని వివరించారు.

కలియుగంలో కృతయుగ ధర్మం తలకిందులైంది. పాప ధర్మములు పండిపోయాయి. కూడు గుడ్డలు లేక ప్రజలంతా ఘోషిస్తున్నారు. అందరిలో కలవరం కలిగింది. కలత పుట్టి ప్రతి ఒక్కరిలో డబ్బుపై ఆశపెరిగి ధర్మ చింతన నశించింది. మనుషుల్లో మాయ అనే

పొరకప్పి మంచితనం మాయమైపోయింది. ఎక్కువ, తక్కువ బేధాలు మొదలు పెట్టారు, కుల మతాల పిచ్చి పెరిగి సంఘంలో ఉన్న ధనాన్ని దొంగిలించి కోటిమందిలో ఒకడు కోటీశ్వరుడయ్యాడు. అప్పుడే పేదరికం భయంకరంగా వ్యాపించి కోట్లాది ప్రజలు పేదవారయ్యారు. లోకంలో ధనం లోభులు పాలయ్యింది. ఒకడు పెట్టుబడి పెట్టి బీదల కష్టాన్ని దోచుకుని తాను ధనవంతుడయ్యాడు. అప్పుడే కుసుమ ధర్మన్న తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కవీంద్రుడు. అంతేకాక తన జాతి చైతన్యంకోసం తపించిన సంస్కరణశీలి. తన జాతి హరిజనులను ప్రభోధిస్తూ తరుణం మించిపోకుండా మేల్కొని జన్మహక్కులకై పోరాడమని ప్రాణత్యాగం అయినా అది స్వర్గమార్గమని ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని వారికి చాటి చెప్పాడు.

పురాతన కాలంలో ప్రజలంతా కుల, మత బేధాలు లేకుండా అన్నదమ్ములవలె ఐకమత్యంతో నిశ్చింతంగా జీవించేవారు. స్వార్ధపరులైన ప్రజలు అంటరానితనం అనే విషాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోసి మోసగించి దళితుల్ని బానిసలుగా చేసారన్న విషయాన్ని గ్రహించమని ధర్మన్న ప్రబోధించారు. దళితులంతా తమ హక్కులకోసం పోరాడాలని వీరు కోరారు. హక్కులపోరాటంలో ప్రాణాలు పోయినా దాన్ని వీరస్వర్గంగా భావించాలని చాటిచెప్పిన ధీశాలి మన కుసుమ ధర్మన్న.

శ్రీ మహావిష్ణువుచే కొనియాడబడే ఓ దళితుడా మీ మంచిని కోరుకొని వివరంగా చెబుతున్నా. ఈ నిజా నిజాలు తెలుసుకో అంతాకాక పూర్వకాలంలో మనుషులకు ఆస్తులపై ఆశలేదు, నేను నువ్వు అని విర్రవీగడంలేదు మచ్చుకికూడా వారికి మాయబుద్ధిలేదు. ఓ దళితుడా వింటున్నావా? పూర్వం ప్రజలకు ధనంపై కోరిక కొంచంకూడా లేదు. ఆధనాన్ని కూడబెట్టి దానిని అనుభవించడం అసలేలేదు. "పాడి పంటలే ఆనాటి వారి భోగ భాగ్యాలు" ఇంకా దేశమాత ఇచ్చే సంపదలను అన్నింటిని పోగుచేసి దానితో సంఘసేవ చేయడానికి శ్రమించేవారు. అదే వారికి మర్యాదనిచ్చేది. అందుకే ఆనాటి ప్రజలు కాయ కష్టం చేసుకుంటూ కడుపునిండా తింటూ కరువు కాటకాలు బారిన పడకుండా, రోగ బాధలు లేకుండా హాయిగా బ్రతికేవారు.

ఓ! దళితుడా! నీకు కులము లేదా? స్థలం లేదా? నీకు గుణ గణములు లేవా? ధనబలం లేదా? బ్రతుకు దారిలేదా? ఎందుకు ఊరూ, పేరూ లేకుండా పడి ఉంటావు? నీవు హిందూ దేశ వాసివి. భరతమాత ముద్దు బిడ్డవు, అందుకే నీ హక్కులకై పోరాడు గెలువు అని తన రచనల ద్వారా ప్రజల్లో నూతన చైతన్యాన్ని తీసుకొచ్చి దళిత ప్రజలను కాపాడి, ఎన్నో అద్భుతమైన రచనలు చేసి ప్రజల్లో ధైర్యాన్ని, చైతన్యాన్ని నింపిన మహానుభావుడు – మన కుసుమ ధర్మన్న.

సిరి సంపదలతో తులతూగేది కృతయుగం కలియుగంలో అంతా తారుమారై దేశ సంపదను దోచుకుతినే వారెక్కువైనారు. దళిత ప్రజలను పీడించి వారి సంపద సర్వం లాగేసుకునే స్వార్ధపరులు ఎక్కువయ్యారు. అపుడే సర్వజన బాంధవుడైన "కుసుమ ధర్మన్న" తన రచనల ద్వారా బానిస బతుకుల నుండి దళితులను రక్షించెను.

ముగింపు: సంఘ సంస్కర్తగా దోపిడీదారుల ఆటలను కట్టించిన వీరుడు కుసుమ ధర్మన్న, అవిరళ కృషి సల్పి, దళితుల రక్షణకై అస్పృశ్యత, అసమానతలు అంతమొందించెను. భారతదేశానికి లభించాలి స్వేచ్ఛా స్వాతంత్ర్యం అని తన రచనల ద్వారా ఎలుగెత్తిచాటి చెప్పిన ఘనుడు కుసుమ ధర్మన్న.

దళిత ప్రజలకొరకు పాటుపడిన సర్వజన బాంధవుడు ధర్మన్న అన్నిరంగాలలో దళితులు ఉన్నత స్థానంలో నిలబడాలని ప్రబోధించారు ధర్మన్న. విద్యా, వైద్య, వైజ్ఞానిక, వ్యవసాయ రంగాలలో దళితులు అగ్రస్థానంలో ఉండాలని ఆశించిన మహోన్నతుడు కుసుమ ధర్మన్న. పేదరికం సమూలంగా నాశనం కావాలని బడుగు, బలహీనవర్గాల ఆశలు

నెరవేరాలని తన రచనల ద్వారా ప్రజల్లో నూతన చైతన్యానికి నాంది పలికిన సర్వోన్నతుడు "కుసుమ ధర్మన్న".

**ఆధార గ్రంథాలు:**
1) హరిజన శతకం - కుసుమ ధర్మన్న
2) తొలి దళిత స్ఫూర్తి - కుసుమ ధర్మన్న

## తెలుగు గజల్ ఒక పరిశీలన

**డా. కె. ప్రేమ కుమారి**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం

సాహితీ ప్రక్రియల్లో గానయోగ్యమైన ప్రక్రియలెన్నున్నా వాటిలో గజల్ ప్రముఖమైన స్థానం. శతాబ్దాలుగా ఉర్దూ, పారసీ కవుల గుండెకింద తడిని జీరగొంతుతో వినిపిస్తూ రసహృదయాలను పరవశింపజేస్తున్న 'గజల్' ప్రపంచ కవితా వినీలాకాశంలో ఒక వెన్నల పుష్పం. గజల్ అనగానే ప్రేమ, ఎడబాటు, వేదనలు గుర్తుకు వస్తాయి.

హిందీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, బెంగాలీ, తమిళం, మలయాళం, కన్నడం, తెలుగు తదితర భాషా ప్రేమికుల్ని కూడా తన కవిత్వ ఇంద్రజాలంలో రసలోకంలో ఓలలాడిస్తోన్న గజల్ అరబ్బీ, పారసీ భాషల్లోని సంప్రదాయాల సమ్మిళితమై 11వ శతాబ్దం నాటికి ఇప్పుడున్న రూపాన్ని సంతరించుకుంది. పారశీ, ఉర్దూ సాహిత్యాల్లో గానయోగ్యమైన ప్రక్రియగా విలసిల్లి నేడు ప్రపంచ వ్యాప్తిమైంది. 20వ శతాబ్దంలో తెలుగు భాషలోకి ప్రవేశించి ఎంతో మంది శ్రోతల, పాఠకుల మదిని దోచుకుంది. అరబ్బీ భాషలోని 'ఖసీదా' (ప్రశంసాత్మక రచన) తెలుగులోని 'ఉదాహరణ' ప్రక్రియను పోలిఉంటుంది. ఇది అయిదు భాగాలుగా ఉంటుంది. ఇందులోని మొదటి భాగమైన 'తష్బీబ్' లో ప్రియురాలిని వర్ణిస్తే దాన్ని 'గజల్' అని పిలిచేవారు.

'గజల్' అనే పదానికి అరబ్బీ భాషలో 'రాగాలాపన' అనే అర్థం. ఉన్నా 'ప్రియురాలితో సల్లాపం' అనే భావాన్నే వ్యక్తపరుస్తుంది. విజ్ఞాన సర్వస్వం 14వ సంపుటం 'ఛందో వ్యాకరణ బద్ధమై లయానుగుణమైన నడకతో, స్వేచ్ఛా ప్రవృతిని, నిర్బం భావావేశమును ప్రకటించే రచనా ప్రక్రియ 'గజల్' అని పేర్కొంది. అంత పెద్ద వృక్షాన్ని కడుపులో దాచుకున్న మర్రి విత్తనంలాగా గజల్ ఆకాశమంత భావాన్ని తనలో ఇముడ్చుకుంది. బతికినన్నినాళ్లు ప్రేమ క్షీర సాగరంలోనే మునిగి, తేలి, ప్రేమపూరిత కవిత్వాన్నే రాసి 'గజల్' అనే కవి ప్రేరుతోనే 'గజల్' అని దాశరథి కృష్ణమాచార్య పేర్కొన్నారు. 'శృంగార రసాత్మక సిసలైన భావ కవిత 'గజల్' అని దాశరథి నిర్వచించినా తెలుగు కవులు మాత్రం దానికి శృంగార రసానికి బదులు సామాజిక దృక్పథాన్ని అద్ది తెలుగు కవిత్వం ఎప్పుడూ ప్రజల వైపే నిలుచుంటుందని చెప్పకనే చప్పారు. రెండు రెండు పాదాలు కలిపి ఒక సెట్గా కూర్చబడిన ముక్తకాలను గజల్ అంటారు. ఈ రెండు పాదాలను కలిపి 'షేర్' అంటారు. ఒక గజల్లో ఐదు, ఏడు, తొమ్మిది.. ఇలా ఎన్ని షేర్లైనా ఉండవచ్చు. మొదటి షేర్ను 'మత్లా' (ఉదయించేది) అని పిలుస్తారు. ఇది

పాటల్లో 'పల్లవి' లాంటిది. పాదంలోని చివరి పదాన్ని లేదా పద సముదాయాన్ని 'రదీఫ్' అంటారు. రదీవ్కు ముందున్నది హలంత పదమైతే ఆ పదంలోని చివరి -2-

హల్లును, అజంత పదమైతే ఆ పదంలోని చివరి అచ్చును 'కాఫియా' అంటారు. ఒక రకంగా 'కాఫియా' అంటే 'అంత్యానుప్రాస' అని, రదీఫ్ అంటే పునరావృతమయ్యే పదం అని అర్థం చేసుకోవచ్చు. ఛందస్సు క్రమంగా అమరినప్పటికీ రదీఫ్, కాఫియాల వలన కలిగే నాద సౌందర్యం విని అనుభవించవలసిందే.

గజల్లోని చివరి షేర్ను 'మక్తా' అంటారు. గజల్ రచయిత తన పేరును కాని లేదా తన పేరులోని క్లుప్తమైన పదాన్ని కాని 'మక్తా'లో ఇమిడ్చి చెప్తారు. ఇలా చెప్పడాన్ని 'తఖల్లుస్' అంటారు. 'తఖల్లుస్' అనే అరబ్బీ పదానికి 'మారుపేరు లేదా కలం పేరు' అనే అర్థం ఉంది. 'తఖల్లున్'ను చివరి పాదంలోనే చెప్పాలనే నిబంధనేమీ లేదు. ఎక్కువ మంది చివరి పాదంలో చెప్పడానికి ప్రయత్నించారు. అలాగే 'తబల్లున్'ను కచ్చితంగా పాటించాలనే నియమం కూడా ఏమీ లేదు. 'తఖల్లుస్' లేకుండానే రాసినవారున్నారు.
1. వినూత్న వ్యక్తీకరణ, చమత్కారం.
2. స్వరనామాలే వాడుతూ నామవాచకాలు లేకుండా రాయడం.
3. ప్రతీకాత్మంగా, నర్మగర్భంగారాయడం.
4. సంకేత భాషలో చెప్పడం.
5 స్థల, కాలాలను స్పష్టంగా పేర్కొనకుండా సాధారణీకరించి తాత్త్విక స్థాయిలో రాయడం.

గజల్ కు విషాదమే వస్తువు. గుండెమూలలో తొలుస్తున్న దు:ఖాన్ని ఒక నిర్వేదంతో రాయడమే గజల్ యొక్క అంతస్సారం. గాయాన్ని, దుఃఖాన్ని సున్నితంగా తట్టిలేపి మనసు లోలోపలి పొరల్లోని వేదనను కవిత్వంగా మలచడమే గజల్. సామల సదాశివ పేర్కొన్నట్లు "గజల్ మార్మిక కవిత. భావం వాచ్యం కాకూడదు. ధ్వని ప్రధానమై ఉండాలి." గజల్ రసవంతమైన, మనోహరమైన ప్రక్రియ. అతి సున్నితమైన గజల్ దీర్ఘసమాసాలను తట్టుకోలేదు. మానవుని మధుర వేదనకు ప్రతీక గజల్.

'వలపునై నీ హృదయ సీమల నిలువలెనని ఉన్నది, పిలుపునై నీ అధర వీధుల పలుకవెనని ఉన్నది." ఇదే తెలుగులో తొలి గజల్ దీన్ని 1965 సం.లో దాశరథి కృష్ణమాచార్య రచించారు. ఇందులో 'ఉన్నది' అనేది 'రదీఫ్' అయితే, 'నలువలే', 'పలుకవలె' పదాలలోని 'ఎ' అనే అచ్చు 'కాఫియా'. నిజానికి గజల్ కవి తన ప్రియురాలి గురించే చెప్పాడు. కాని అవే మాటకు ఒక ప్రేయసి తన ప్రియుడి గురించి చెబుతున్నట్టుగా కూడా తోస్తాయి. సాదారణ మనిషి తనకూ లోకానికి గల మిత్రుత్వాన్నో, శత్రుత్వాన్నో చెప్తున్నట్టుగా కూడా ఉంటాయి. "అనుభూతి-ఆలోచన, హృదయం-బుద్ధి, భౌతిక అంతరిక జగత్తులు, చేతన-అచేతన మానసిక స్థితులు, ఆశ-నిరాశలు మొదలైన ద్వంద్వాలనే రెండు రెక్కలుగా చేసుకొని విహరించే పక్షి గజల్" అని పెన్నా శివరామకృష్ణ అంటాడు. "రమ్మంటే చాలుగానీ రాజ్యాలువిడిచిరానా నీ చిన్ని నవ్వు కోసం స్వర్గాలు గడచిరానా " ఇది దాశరథికి బాగా కీర్తి ప్రతిష్ఠల్ని తీసుకొచ్చిన గజల్. ఇందులో 'రానా' అనే పదం 'రదీఫ్'. విడిచి, గడచిలోని 'ఇ'

అనే అచ్చు 'కాఫియా'. ఈ గజల్ను దాశరథి 'తఖల్లుస్' లేకుండానే రాసాడు. సామాజికపరమైన, మానవీయకోణంలో రాసిన గజళ్ళు ఎక్కువకాలం ప్రజల నోళ్ళల్లో ఉండిపోయాయి.

. "పరుల కోసం పాటు పడని నరుని బ్రతుకు దేనికని మూగ సేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికని శిశు హృదదానికి కల్లలు లేవు రస రాజ్యానికి ఎల్లలు లేవు లోపలి నలుపు 'సినారె'కు తెలుసు పైపై తొడుగ" ఇది సి. నారాయణ రెడ్డి వ్రాసిన గజల్. ఇందులో 'దేనికని' అనే పదం 'రదీఫ్'. బ్రతుకు, పరుగు పదాల్లోని 'ఉ' అనే అచ్చు కాఫియా. 'సినారె' అనేది 'తఖల్లుస్'. చమత్కారమే గజల్కు ప్రాణప్రదమైంది. ఒక అద్భుతాన్ని చూసినపుడు సంతోషంతో ఎంత ఉప్పొంగిపోతామో చమత్కారంతో కూడిన ఒక్కొక్క షేర్ను వింటున్నపుడు శ్రోత అంత ఆనందించాలి. మొదటి పాదం వినగానే శ్రోతకు ఉత్కంఠ కలగాలి. ఎందుకు? ఏమిటి? ఎలా? అనే సందేహాలు కలగాలి. రెండవ పాదం ఈ సందేహాలకు వివరణగానో, సవరణగానో, పురాణగానో ఉండాలి. ఇలా ఉంటేనే చమత్కారాన్ని సాధిస్తాం. చమత్కారం ఇలానే ఉండాలనే కొలమానాలు ఏమీ లేవు. కాని అది శ్రోతకు, పాఠకునికి చేరితే చాలు. ప్రతీకాత్మకంగా చెప్పడం మరో ఆయువుపట్టు. దీని వల్లనే షేర్కు అనేకార్థబోధకత, అన్వయ సామర్థ్యం, కొన్ని వందల ఏళ్ల క్రితం రాయబడిన షేర్ అయినా కాలదోషం పట్టకుండా ఇప్పటికీ ఎవరికి వారు అన్వయించుకునేలా ఉంటుంది. తుఫాను, పక్షి, పంజరం, సముద్రం, అలలు, వసంతం, శిశిరం, మొగ్గలు, పూలు, తోట మొదలైన గజల్ కవులు ఉపమానాలుగా, ప్రతీకలుగా వాడుతుంటారు.

"పత్తా పత్తా బూటా బూటా హాల్ హమారా, జానే హై జానే న జానే గులే న జానే బాగ్ తో సారా జానే హై" ఇది మీర్ తకీ మీర్ వ్రాసినది. ప్రతీ ఆకుకు, ప్రతి తీగకు నా పరిస్థితి తెలుసు. పుష్పానికైతే తెఉ సో లేదో కని తోటకంతా నా పరిస్థితి తెలుసు. ప్రేమలోనో, మరో విషయంలోనో చాలా మంది విఫలమై వేదన చెందుతుంటారు. మనలో కలిగిన ఆనందాన్ని కొంత ప్రయత్నం మీద దాచుకోవచ్చేమో కాని విషాదాన్ని దాచలేం. అది మన ముఖంలో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కారణం తెలియకపోయినా మన చుట్టూ ఉ న్నవారికి మన ముఖం మీది విషాదం తెలిసిపోతుంది. ఇక్కడ ఆకులను, తీగలను, తోటను లోకానికి ప్రతీకగా పువ్వును ప్రియురాలికి లేదా భగవంతుడికి ప్రతీకగా భావిస్తే కవి హృదయం అర్థమవుతుంది. ఇలా నర్మగర్భంగా చెప్పడానికి సాధన చేయాలి. పూర్వ కవులు ఏభావాన్ని ఎంత ధ్వన్యాత్మకంగా చెప్పారో పరిశీలిస్తే ఈ కిటుకు మనకు అంత బాగా బోధపడుతుంది.

ఉర్దూలో ఏ ప్రక్రియకైనా మాత్రాఛందస్సునే వాడుతారు. ఉర్దూలో ప్రాథమికంగా ఐదు మాత్రల గణాలు రెండు, ఏడు మాత్రల గణాలు అయిదున్నాయి. ఉర్దూలో ఉచ్చారణ ననుసరించి మాత్రా గణన ఉంటుంది. అయితే తెలుగులో ఈ బహర్ కు టట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. కాకపోతే పదాల నడక మీద కొంత దృష్టి పెట్టాలి. ఈ నడక ఉపయోగించే పదాల బరువు (విజన్) మీద ఆధారపడి ఉంటుంది. అంటే ఒకే విధమైన మాత్రలను వాడడం. గజల్లో అన్ని పాదాలు ఒకే తూగులో సమానంగా ఉ oడాలి. " దృష్టిని బట్టే కనిపిస్తుంది సృష్టిని విన్నాను నువ్వది వాదం అన్నావు నేనది వేదం అన్నాను"

సంత నడుమ ఒక జోలె పట్టి పసిగొంతు మోగుతుంటే నువ్వది గేయం అన్నావు నేనది గాయం అన్నాను. నమ్మిన సత్యం కోసం ఒక్కడు ప్రాణాలర్పిస్తే నువ్వది మరణం అన్నావు నేనది జననం అన్నాను. ఇవి రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు వ్రాసారు.

ఇది 'తఖల్లుస్' లేకుండానే రాసిన గజల్, పై 'మత్లా'లో, షేర్లలో రెండు పాదాలు కూడా ఒక తూగులో నడుస్తున్నట్టు గమనిస్తాం. కాబట్టి గజల్ రాసేటప్పుడు పదాల బరువును దృష్టిలో పెట్టుకోవాలి. సమాన తూగులో గజల్ సాగిపోతుందా లేదా లయాత్మకంగా పోతుందా లేదా అనేది చూసుకోవాలి. అలాగైతేనే గజల్ సౌందర్యం పెరుగుతుంది. గజల్ ప్రక్రియను కేవలం ఛందోబద్ధంగా రాస్తే సరిపోదు, భావం, లయ కూడా సరిగ్గా కుదిరి చక్కని జావళీలాగా కనిపించాలి. ప్రతీ షేర్ దేనికదే ప్రత్యేకంగా కనబడాలి. గజల్ నుండి ఏ రెండు పాదాలను విడదీసి విడిగా చదువుకున్నా ఒక శతక పద్యంగా, ముక్తకంలాగా భావం సంపూర్ణంగా ఉండాలి. గజల్లో అన్ని షేర్లు ఒకే విషయం పై ఉండాల్సిన అవసరం లేదు. ప్రేమ, సౌందర్యం, విరహం, శృంగారం, వేదాంతం, రాజకీయం, ప్రకృతిని వస్తువుగా తీసుకొని ఎన్ని రకాలుగానైనా రాయెచ్చు. అయితే అంతర్లీనంగా అన్ని షేర్లను కలిపితే ఒక ప్రత్యేక వ్యక్తీకరణ, చమత్కారం, అంత:సూత్రం, కవితాత్మక లయ ఉండాలి. అన్ని షేర్లు ఒకే విషయం గురించి కూడా రాయొచ్చు.

**కొన్ని సూచనలు :- గజల్ రాసేవారు**

1. బహర్ లేదా బరువు (వజన్) లోపించకుండా చూసుకోవలి.
2. పదాలను, పలుకుబళ్ళ అర్థాలను, వాడకాన్ని లోతుగా తెలుసుకుని వాడాలి.
3. బలహీనమైన భావవ్యక్తీకరణ లేకుండా రాయాలి.

నదీ సదృశమైన తెలుగు సాహిత్య ప్రవాహంలో గజల్ ఒక విలోణ ప్రక్రియగా ప్రవేశించి తొలి రోజుల్లో ఉర్దూ ప్రభావంతో అడుగులు వేసి తరువాత తన సొంత అస్తిత్వాన్ని చాటుతూ ప్రవహిస్తోంది. చైతన్య తరంగమై శ్రోతలను మైమరపిస్తుంది.

ప్రియురాలితో సల్లాపంతో మొదలైన గజల్, రుబాయిలు రాను రాను సమకాలీన సమాజంలోని అవ్యవస్థలను, వ్యాక్తిత్వ వికాసాన్ని, సామాజిక బాధ్యతలను అందంగా, అధిక్షేపంతో, కార్యోన్ముఖంగా చెప్పడంలో సఫలీకృతం అయ్యాయి. గానయోగ్యమై పాఠకులను రంజింపజేసే గజల్ రుబాయిలను రాసే రచయిత ఎంతో జాగ్రత్తగా, మన ముందుతరం, సమకాలీన కవులు రాస్తున్న సాహిత్యాన్ని గమనిస్తూ, భావనాబలంతో కలం కదిలించినపుడే మేలిమి సాహిత్యం పురుడుపోసుకుంటుంది.

**ఆధార గ్రంథాలు:**

1. తెలుగు సాహిత్య చరిత్ర -ఆచార్య ద్వా.నా. శాస్త్రి
2. తెలుగు సాహిత్య చరిత్ర -ఆచార్య వెలమల సిమ్మన్న

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# వచన కవిత్వంతో మానవత్వాన్ని ఆకాంక్షించిన కవితా సంకలనం కర్మ కాదుక్రియ

**యలమర్తి సునీత**
తెలుగు అధ్యాపకురాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుట్టాయి గూడెం
చరవాణి: 9573159983

**ఉపోద్ఘాతం:** తెలుగు వచ్చిన కవిత్వంలో దూసుకొస్తున్న నవతరం గొంతుక మానవతా కవులు కవిత సంకలనం కర్మ కాదు క్రియ అని ప్రకటన చేసి 2018వ సంవత్సరంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నందు ఆచార్యులుగా ఉన్న డాక్టర్ ఎన్వి కృష్ణారావు గారు సంపాదకులుగా, తన దగ్గర పరిశోధన చేసిన డాక్టర్ పొత్తూరు శ్రీనివాసులు, డాక్టర్ జి. వెంకటలాల్, డాక్టర్ రుద్రపాక జితేంద్ర కుమార్, డాక్టర్ దాసరి రమేష్, డాక్టర్ కచ్చల బలరాం, డాక్టర్ పెనుమాక రాజశేఖర్, డాక్టర్ పెరుగుపల్లి బలరాం లతో కలిపి మొత్తం ఎనిమిది మంది కవులు ఈ సంకలనం ద్వారా తమ కవితలను ప్రచురించడం జరిగింది. గతంలో ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ఉప సభాపతిగా పనిచేసిన మాన్యశ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా ఈ కవితా సంకలనాన్ని అంకితం ఇవ్వడం జరిగింది.

మానవత్వమే మానవ సమాజానికి అలంకారంగా ఆవిర్భవించిన ప్రపంచంలో నేడు మచ్చుకైనా కానరాని మానవీయ స్థితిని గుర్తించి, కవితీకరించి, మనిషిలో మానవత్వాన్ని మేల్కొల్పాలనే ఆకాంక్షతో, మనిషి ప్రవర్తనలో మార్పు రావాలనే ఉద్దేశంతో, మానవత్వమే ప్రధాన వస్తువుగా స్వీకరించి తమ కవిత్వం ద్వారా ఆధునిక సమాజంలో చైతన్యం తీసుకురావడానికి చేసిన ప్రయత్నమే కర్మ కాదు క్రియ మానవతా కవితా సంకలనం ప్రధాన ఉద్దేశం.

**" కర్మ కాదు క్రియ" కవితా సంపుటిలో కవితలు సమీక్ష:** ఈ కవితా సంపుటి నామౌచిత్యాన్ని తెలియజేస్తూబీ కర్మ అంటే పూర్వజన్మలో చేసిన పాపపుణ్యాల చిట్టా అని, క్రియ అంటే ప్రస్తుత సమాజానికి నువ్వు చేయాల్సిన చిట్టా అంటూ మనుషులు మనసుల్లో మానవత్వం

చిగిరించడమే కాకుండా అది తమ ప్రవర్తనల్లో కూడా కనిపించాలని దిశా నిర్దేశం చేశారు కవులు.
శాంతి - ఉత్తమమైనది.
అహింస - ఉదాత్తమైనది
మానవత్వం - మహోన్నతమైనది.. అంటూ మానవత్వం విశిష్టతను తెలియజేయడమే కాకుండా..
శాంతికి చిరునామా సహజీవనం
అహింసకు అడ్రస్ – అంతులేని ప్రేమ త్యాగం
మానవత్వం నిర్వచనం - బ్రతుకు బ్రతికించు.. "అంటూ ' శాంతి, అహింస, మానవత్వం' అనే కవిత ద్వారా తమ ఆలోచనా విధానాన్ని స్పష్టపరిచారు డాక్టర్ నారిశెట్టి కృష్ణారావు గారు. అలాగే మానవత్వం అంటే దైవత్వమేనని చాలా గొప్పగా మానవత్వాన్ని భావించారు. ఈ మాట ద్వారా తమ మతం మానవత్వం అని ప్రకటించినట్లుగా తెలుస్తుంది.
ఆధునిక కాలంలో విద్యా దుస్థితిని తెలియజేస్తూ -

"యుగయుగాల మతమౌఢ్యపు మత్తు ఒక వైపు తరాల ధనదాహం మరోవైపు తిరిగి తిరిగి తలలెత్తే విషనాగులై అందర్నీ కాటేస్తుంటే నైతికత, మానవతా, సభ్యత, సంస్కృతి, నేర్పాల్సిన విద్య కార్పొరేట్ కౌగిలింతలో వెచ్చదనాన్ని పొందుతుంటే బడా బాబులకి గులాములను తయారు చేస్తుంటే సాఫ్ట్వేర్లతో రియల్ ఎస్టేటర్లతో పోల్చుకుంటూ జాతిని నడపాల్సిన గురువులు లఘువులవుతుంటే ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించాల్సిన వైద్యులే ప్రాణాలను హరిస్తుంటే జాతికి అండగ నిలవాల్సిన నాయకులు స్వార్థాన్ని కావలించుకుంటే.. మనిషికి కావలసింది ఏంటి? ఆలోచించండి ఒక్కసారి ప్రశ్నించుకోండి మరొకసారి.." అంటూ ' ఓసారి ప్రశ్నించుకోండి!' అనే కవిత ద్వారా నేటి విద్యావ్యవస్థ ఎటువంటి స్వార్థపూరిత సమాజాన్ని సృష్టిస్తుందో తెలియజేశారు డాక్టర్ పత్తూరి శ్రీనివాసులు.

'ఇక్కడ మనుషులు ఉండాలి' అనే కవితలో " ఇది భూలోకం/ మానవలోకం/ 80 లక్షల జీవుల జవజీవాలతో నిండిన లోకం/ తోటి జంతువులు పక్షులతో కలిసి తిరుగుతూ, ఎగురుతూ, దూకుతూ, గంతులు వేస్తూ, తుళ్ళింతలతో కేరింతలతో మనుషులు సంచరించిన లోకం శా%మానవత్వం, దయ, ప్రేమ, కరుణ, జాలి ఉన్నాయ్ .. ఇది ఒక నాటి మాట.." అంటూ మానవత్వం కలిగిన గత సమాజ గొప్పతనాన్ని స్మరించుకున్నారు పత్తూరి శ్రీనివాసులు. అటువంటి మానవ సమాజం మరలా చూడాలని ఆశపడ్డారు.

రుద్రపాక జితేంద్ర కుమార్ తన కవితైన "చిరంజీవిగా జీవించు" లో మనిషి సాధన చేయాల్సిన తత్వాలని బోధిస్తూ...

"ప్రవహించే నీరు ఎలా బ్రతకాలో చెబుతుంది - ధర్మమంటే అదే కదా వీచే గాలి బ్రతికి ఏం సాధించాలో నేర్పుతుంది- జ్ఞానం అంటే సాధనే కదా ధర్మచింతనతో జ్ఞానవంతమైన జీవన లతకు నిజమైన అలంకారం ఉన్నతమైన హృదయ క్రాంతి ఆ దివ్య క్రాంతి ఆధ్యాత్మిక లోతుల్లో అద్వైతం భౌతిక జగతిలో ఆ దివ్య క్రాంతి పరిపూర్ణ మానవ చైతన్య ప్రస్థానంలో అఖండమై వెలిగే శాంతి లే భారతీయుడా మేలుకో - సహృదయ భావసరళిపై విశాల విశ్వాన్ని శాంతి పతాకమై సాధించు అందరి నడుమ చిరకాలం చిరంజీవి గా జీవించు.." అంటూ మనిషి తన జీవిత ప్రయాణంలో సాధించాల్సిన, సాధన చేయాల్సిన విషయాలని తాత్వికచింతనతో మార్గ నిర్దేశం చేశారు.

"నాకు ఇక్కడ చోటు లేదు" అనే కవితలో దాసరి రమేష్ గారు మానవత్వంతో శాంతిని కాంక్షించిన
మహోన్నత వ్యక్తుల పరిస్థితిని ప్రస్తావిస్తూ -'నా పేరు వచించిన మూర్ఖులను కాలగర్భంలో కలిపేశారు శాంతి కాంక్షించిన బుద్ధునికి విషమిచ్చి చంపిన లోకం శాంతి కాంక్షించిన క్రీస్తుని

శిలువ వేసి శిక్షించిన లోకం శాంతి కాంక్షించిన గాంధీని తూట్లు చేసిన లోకం..." అంటూ మానవత్వంతో సమాజాన్ని చైతన్యపరిచి శాంతిని కాంక్షించిన ఈ మహోన్నత వ్యక్తుల మనుగడను ఈ సమాజం సహించలేనిది వ్యక్తులను కాదు వారిలో ఉన్న మానవత్వాన్ని, " నా పేరు పలికితే భరించలేని లోకం నాకు రూపం ఉంటే భరిస్తుందా రూపం ఉంటే సమస్త ప్రాణులను జీర్ణించుకునే మానవాసురులకు ఏనాడో జీర్ణమయ్యే దాన్ని అందుకే నన్ను అనంత తిమరుపుటంచులకు కృష్ణ బిలాల కేంద్రంలోకి తరిమేశారు నాకు ఇక్కడ చోటు లేదు.." అంటూ మానవత్వమే రూపంగా కలిగిన మహోన్నత వ్యక్తులను ఈ అమానవీయ సమాజం కృష్ణ బిలాల కేంద్రాల్లోకి తరిమేసిందని మానవత్వంకు ఈ సమాజంలో మనుగడ లేదని నిట్టూర్చాడు.

నేను రాను" అనే కవిత ద్వారా నేటి సామాజిక దుస్థితిని కచ్చుళ్ళ బలరాం గారు ఈ విధంగా తెలియజేశారు.

"మాతృత్వం మృగ్యమాయె బ్రాతృత్వం పారిపోయే ఔదార్యం ఓడిపోయే నేను కాను నేను లేను నేను రాను మనిషిని మనిషి గుర్తించే వరకూ.." అంటూ ధన వ్యామోహంతో తల్లిదనం సోదర భావన వంటివి మరుగయ్యాయని ఇంతటి దుస్థితి కలిగిన ఈ ప్రపంచంలో మానవత్వం లేదని, ఈ ప్రపంచంలోకి మానవత్వం కలిగిన మనిషిగా రాలేనని, ఇటువంటి ప్రపంచంలో మానవత్వం గల మనిషి లేడని బాధపడుతూ, మరలా తాను ఈ ప్రపంచంలోకి రావాలంటే మనిషి మనిషిగా మారాలని జాతులు మతాలు దేశాల మధ్య ఎల్లలు తొలిగిపోవాలని అందరూ సమాన భావంతో బ్రతకాలని ఆకాంక్షించాడు కవి. అలాగే "సారాంశం" అనే కవితలో కుల మతాలను ప్రస్తావిస్తూ.....

"ప్రకృతి ధర్మాల ముందు ఏది మతం? ఏది కులం? ఆకలిదేకులం? ఆయువుదే మతం? ధర్మానిదే కులం? న్యాయానిదే మతం? నీతికి కులమతాలు ఎక్కడ? మానవత్వమే మనుష్యకులం మానవత్వమే మనిషి మతం పంచభూతాల పరమార్థమొక్కటే - మానవత్వం!" అంటూ సామాజిక అడ్డుగోడలను తొలగిస్తూ మానవత్వానికి మించిన కులమతాలు లేవని మానవత్వంతో సమాజం కలిసిమెలిసి బ్రతకాలని ఆకాంక్షించారు కవి.

"ఎంత ఎదిగినా.." అనే కవితలో పెనుమాక రాజశేఖర్ ఆదర్శవంతమైన మనుషుల మనస్తత్వాలను ప్రస్తావిస్తూ-"మహాత్ముడిలా మానవత్వాన్ని ప్రకటిద్దాం సాహితీ మూర్తుల్లా సౌభ్రాతృత్వాన్ని చాటి చెబుదాం శాంతి దూతల్లా స్నేహభావాన్ని వినిపిద్దాం ప్రేమ జ్యోతులను వెలిగిద్దాం శాంతి తత్వాన్ని బోధిద్దాం.." అని ఇకపై మనిషి మానవత్వంతో కూడిన మహా వ్యక్తుల ఆదర్శవంతంగా జీవించాలని దిశా నిర్దేశం చేసాడు కవి.

శాంతిని అరువివ్వరూ...! అనే కవితలో మానవత్వం లేని సమాజంలో మనిషి దుస్థితిని తెలియజేస్తూ....

ఉదరాంతరాలలో అగ్నిగోలాల్ల ఆకలి ఉవ్వెత్తున ఎగసి పడుతుంటే బ్రతుకులోనే చస్తున్న పేదవాడికి ఆపన్న హస్తాన్నే ఆకలి తీర్చడానికి వాడి ఆకలి అశాంతిని శాంత పరచడానికై శాంతి కావాలి నాక్కొంచెం శాంతిని శాంతిని అరువివ్వరూ...! దేశమేదైనా ప్రాంతం ఏదైనా ప్రపంచ వెపనిలో బలి పశువులు మాత్రం పేద ప్రజానీకమే కదా..

జీవిత పర్యంతమో సాగే ఈ దోపిడీని శాంతితోనే నిలవరిస్తాను ప్రశాంతిని పలువరిస్తాను.." అంటూ సమాజం శాంతియుతంగా లేకపోవడానికి మనిషిలో మానవత్వం మురిగిపోవడమే కారణం అంటాడు కవి.

శాంతి స్థాపన చేయడం అంటే ఎండమావుల్లోని నీటిని తోడుతున్నంత భారం ఆధిపత్యానికి అన్యాయిదాలు వత్తాసు పాడుతుంటే శాంతికై ఆరాట పడటం రాలిన ఆకులను తిరిగి చిగురుగా

చెట్లకు తొడగటమంత మూర?త్వం.." (శాంతికై ఆరాటం.. కవితలో ) అని మానవత్వం లేని సమాజంలో శాంతిని కాంక్షించాలంటే మూరత్వమే... అని నిరాశవాధాన్ని కూడగట్టుకున్న కవి వెంటనే ఆశావాదాన్ని పెంపొందించుకొని మానవత్వంతో కూడిన ప్రపంచాన్ని నిర్మించాలని ఆశయం తనతోనే మొదలవ్వాలని తన క్రియతోనే అడుగు వేయాలని నిశ్చయించుకున్న కవి ఇలా అంటాడు. "కొత్త పుంతలు తొక్కుతున్న హింస తన ఇనుప కౌగిట్లో శాంతికి చరమగీతం పాడక ముందే ప్రపంచాన్ని ప్రశ్నించటం వదిలి నన్ను నేను నిందించుకుంటున్న శాంతి అంటే నాతోనే మొదలవ్వాలని" అని ఆశించారు.

**ముగింపు :** పెట్టుబడి దారి ఆర్థిక వ్యవస్థ ప్రపంచం మొత్తం అలుముకొని మనిషి మానవత్వాన్ని కోల్పోయి మరమనిషిగా మారిన పరిస్థితుల్లో, మనుషులందరిలో మానవత్వం తిరిగి రావాలని, సమాజం అంతట సోదర భావం కలగాలని, సాటి మనిషి అన్న భావనతో సానుకూల వాతావరణంలో సామరస్యంగా సహజీవనం కొనసాగించాలని కోరుకుంటూ ఈ ఎనిమిది మంది కవులు తమ కలలని, ఆశలని కలాల ద్వారా వ్యక్తం చేస్తూ మానవత్వం అనే తత్వాన్ని ఆత్మగా చేసుకొని ఆవిష్కరించిన ఈ మానవతా కవితా సంపుటి కర్మ కాదు క్రియ.

**అధారగ్రంథాలు :**

1. " కర్మ కాదు క్రియ " - కవితా సంపుటి
2. తెలుగు సాహిత్య విమర్శ- ఆచార్య వెలమల సిమ్మన్న
3. ఆధునిక కవితా ధోరణలు తెలుగు అకాడమి.

## హైకూ కవిత్వం -ప్రకృతి తత్త్వపు పరిమళం

**డా॥ ఎం. పద్మగౌరి**
రాజమండ్రి
చరవాణి: 98859 62656

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**స్థూల పరిచయం:** "ఆధునికాంధ్ర సాహిత్యం వీరేశలింగం పంతులుతో ప్రారంభమైనది. అప్పటి నుండి నేటి వరకు తెలుగు సాహిత్యం ప్రపంచానికి సమస్థాయిలోను, అంత కంటే ఎక్కువగాను అభివృద్ధి, వికాసం పొందుతూ వచ్చింది. ప్రపంచలోని వివిధ భాషలకి చెందిన సాహిత్య ప్రక్రియలు కొన్ని పరిమితులతోనే ప్రవర్తిస్తూ ఉంటే, అదే ప్రక్రియ తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలతో కవులు రాస్తున్నారు.

సంస్కృతం నుంచి వచ్చినవి ప్రక్రియలు కొన్ని మన తెలుగుభాషకు సొంతంగా ఉన్నవి కొన్ని ప్రక్రియలున్నాయి. అయినప్పటికి తెలుగు కవులలో ఉన్న చైతన్య స్ఫృహ మరో భాషా కవికి లేదనటం అతిశయోక్తికాదు. నూతన ఉ త్తేజంతో, నూతన పరిమళంతో తెలుగు కవితని వికసింపచేయడం తెలుగు కవికి ఉన్న సంస్కారం. ఆవిధంగా 20వశతాబ్దం ఆఖరి దశాబ్దం 1996లో తెలుగులోకి వచ్చిన నూతన ప్రక్రియ హైకూ.

తెలుగులో ప్రప్రథమంగా స్వతంత్ర భావాలతో హైకు రచించిన కవి గాలినాసరరెడ్డి. 1990 మార్చి 4వ తేదీ ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధంలోఈయన రచించిన హైకూలు ముద్రించబడిఇడ్డాయి.

సదిలో ఈత
చంద్రుడిలో శకలాలు
గుచ్చుకుంటాయి.

అనేది తెలుగులో అక్షర నియమాన్ని నూటికి తొంబైశాతం అనుసరిస్తూ పుట్టిన తొలి స్వతంత్ర హైకూ.

పరిచయం: హైకూ జన్మించిన/ పుట్టిన దేశం జపానే. ఈహైకూ పుట్టుకకి ఒక తాత్త్విక నేపథ్యం ఉంది. ప్రపంచంలో బౌద్ధాన్ని ఆదరించి అనుసరిస్తున్న దేశాలు చాలా ఉన్నాయి. మహాయాన శాఖకి చెందినవాడు. బోధిధర్మ. ఈయన అంతశుద్ధికి చెందిన ధ్యానానికి ప్రాధాన్యమిచ్చాడు. అదే ధ్యాన బౌద్ధంగా విశ్వ వ్యాప్తమయింది. ధ్యాన శబ్దమే చైనాలో చాన్ గాను, జపాన్లో 'జీన్' గాను వికృతి చెందింది. జపాన్ లో 'జెన్ బౌద్ధం స్వేచ్ఛ, శాంతి అనే రెండు అంశాలకు చెందింది అలాంటి స్వేచ్ఛ, శాంతి అనే మహనీయమయిన గుణాలలోంచి పుట్టుకొచ్చిన కవితా రూపమే హైకూ.

జపాన్ లో ఉద్భవించిన హైకూ ఒక్కసారిగా సృష్టింపబడింది కాదు. జపాన్ కవితకు అతి ప్రాచీన రూపమైన 'తంకా' లేదా టంకా' నుంచి 'హొకు్కు మళ్ళీ ఆ హొకు్కు నుంచి వచ్చిన కవితా రూపం హైకూ.

ప్రేమైక జీవన వ్యక్తీకరణని అత్యంత ప్రతిభావంతంగా సూక్ష్మంగా తెలపడంలోనూ హైకూ నిరుపమానమైన ఖ్యాతిని పొందింది. హైకూ ప్రారంభంలో తాత్త్వికాంశాలకు చెందినదైనా అనంతర కాలంలోప్రకృతి, ప్రేమతత్త్వం వ్యక్తీకరణకి తగిన కవితారూపంగా మారింది.

పాశ్చాత్యుల నిర్వచించారు:

5-7-5 అనే అక్షర క్రమంలో మూడు పాదాలుగా ఉంటుంది. కవితా రూపంలో సంక్షిప్తత, అర్థంలో విస్తృతిని అందించే లక్షణ గలది. ఎలాంటి వస్తువునైనా ఇముడ్చుకునే శక్తి సామర్థ్యాలు కలది. ప్రాచీనఆధునిక కవితావిలువలను, విశ్లేషణలకు తగినవి. శీర్షికలు ఉండవు. కవితా శక్తి హైకూ గా రూపుదాల్చటంమొదలైన అంశాలతో హైకూ కవిత్వం ఆవిర్భవించింది.

భారతదేశంలో ప్రప్రథమంగా 1965 లో గుజరాత్ కవి స్నేహారశ్మి హైకూ కవితలు రచించాడు. 1983లో తెలుగువాడైన రాఘవాచార్యులు ఆంగ్లభాషలో హైకూ రచన చేశారు.

తెలుగులో స్వతంత్రంగా ప్రథమంగా హైకూ రచన చేసిన వారు గాలినాసర రెడ్డి. ఆంధ్రభూమి దిన పత్రిక -4- మార్చి-1990 ఆదివారం అనుబంధంలో అయిదు హైకూ కవితలు అచ్చయ్యాయి. తొలి స్వతంత్ర హైకూ కవితలు

హైకూ కవితమీద కవులు, విమర్శకులు మనసు లగ్నంచేశారు. 1991 నుంచి హైకూ కవితని విశ్లేషిస్తూ వ్యాసాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఇస్మాయిల్ వానాకాలం హైకూలు, రావి రంగారావు సామాజిక హైకూలు, ఈ నేపథ్యంలో హైకూ కవితా సంపుటాలు ప్రచురించడం ప్రారంభించారు. "రత్నమాల" వెన్నెల రాత్రి పేరుతో హైకూ కవితా సంపుటి వెలువరించి తెలుగులో తొలి హైకూ కవయిత్రిగా ఖ్యాతిని పొందారు.

హైకూ కవితకి 2002 వ సంవత్సరం ఒక మజిలీ లాంటిది. డా,, తలతోటి పృథ్వీరాజ్ అనకాపల్లిలో ఇండియన్ హైకూ క్లబ్ స్థాపించారు. అత్యధిక సంఖ్యలో హైకూ కవితా సంపుటాలు వెలువరించారు పృథ్వీరాజ్ .హైకూ పేరు వినగానే గుర్తుకొచ్చే కవి పేరు పెన్నా శివరామకృష్ణ. ఈయన వెలువరించిన రహస్య ద్వారం' మొదలుగా ఇప్పటి వరకు 100కు పైగా హైకూ సంపుటాలు వెలువడ్డాయి.

(వస్తువు) ప్రకృతి – అనుభూతి: హైకూ ను ఎంతోమంది కవులు ఆదరించారు ఎంతోమంది కవులు ఆ ఎన్నో కవితా సంపుటాలు,సంకలనాలు వచ్చాయి. హైకూలోని కవితా వస్తువు ఎన్నెన్నో మార్గాలలో పయనించింది. వర్తమాన సామాజికాంశాలను, తాత్త్వికాంశాలను, ప్రకృతిఅంశాలను, దేనినైనా వ్యక్తం చేయగల వికాస స్థితికి నిదర్శనం. ప్రకృతిలోని సమస్త జీవజాలం, వస్తు సముదాయంను అదే స్వభావంతో అందించటం హైకూ ప్రధాన లక్షణం. ఈ క్రమంలో చెరువు, చెట్టు, చంద్రుడు, కొండ, మబ్బు, వాన మొదలైనవన్నీ కవితా వస్తువులే. వస్తువు ఒకటే అయినా రచించే కవి యొక్క అనుభవాలు, అనుభూతులు ఎవరికి వారివే స్వంతం, ప్రకృతి మాధుర్యాన్ని సంక్షిప్త రూపంలో అందిస్తుంది.

చెట్టును కూర్చితే
ఆకాసంలో
పెద్ద గొయ్యి (ఇస్మాయిల్).
పిట్ట వాలే
చెట్టులా బతకాలని కోరిక (ఇస్మాయిల్).

చెరువులో చెట్టు నీడను వస్తువుగా చేసుకొని దాదాపు అందరూ రాసారు. చెరువు చెట్ల నీడలను చేరదీసిన దయామయిగా ఇస్మాయిల్కి తోస్తోంది. చెట్లే లేకపోతే పిట్టలు ఎలా బతుకుతాయని, వాటి కోరిక ఎలా తీరుతుందని భావిస్తాడు . అదే చెట్టు ను గూర్చి

చెట్టు చెరువులో
శీర్షాసనం
వేసినట్టు (లలితానంద్ )

అని లలితానంద్ అనుభూతి చెందుతాడు. ఎండ తాగి నీడనిచ్చే తల్లిగాచెట్టును లలితానంద్ భావిస్తాడు. అదే చెట్టును ఎండకు, వానకు పట్టినచిల్లుల గొడుగుగా దర్శిస్తాడు రామచంద్రారెడ్డి.

ప్రకృతిలోఅందమైన దృశ్యం చందమామ. చందమామపై వచ్చిన కవితలు చాలానే ఉన్నాయి..

చందమామ చిటారు కొమ్మకు వికసించిన పువ్వుగాఅనిపిస్తుంది ప్రసాద్కి .

అదే చందమామ పున్నమినాట వెన్నెల తొణికిసలాటను ఆనందిస్తాడు ఇస్మాయిల్ .

కోద్దామని చెట్టెక్కి
అందక దిగాక
మళ్ళీ అక్కడే చందమామ (చింతన శిరీష)

చందమామను అందుకోవాలనే నిరంతర ఆరాటం ఎప్పుడూ అందని చందమామ. ప్రకృతి లో పరవసించే వస్తువు వెన్నెల కాంతులీనే చందమామ అందకపోయినా దానికోసం నిరతరం గుర్తు చేసుకోవటం ఒక మధురమైన అనుభూతినిస్తుంది.

ప్రకృతి పరవశిస్తూ పులకరించి పోయేది వాన. వానపడగానే సంబరాన్ని తెస్తూ ఒక పరిమళాన్ని వెదజల్లుతుంది. వాన వచ్చి వెలిశాక ప్రకృతి అంతా కొత్త ప్రకాశం తో మెరుస్తుంది. వాన బ్రష్షు వచ్చి రంగులు పులమటం వల్ల వాటికా మెరుపు వచ్చిందని ఇస్మాయిల్ భావన.

చినుకు దారాలతో
వర్షం నన్ను పొట్లం
కట్టి పడేసింది (ఇస్మాయిల్)

వర్షంలో చిక్కుకొని కదలలేని తన నిస్సహాయతను తెలియజేస్తాడు. వానజల్లు నుండి రక్షణకు గొడుగులు వేసుకోవడం, గొడుగులతో పనిలేకుండా పసిపిల్లలు వానలో తడవడం ఉత్సాహపడటం -అన్నీ ఇస్మాయిల్కి ఆశ్చర్యం, మరియు ఆనందం.

ఇదే విధంగా వర్షం కురిసినపుడు వచ్చే మట్టివాసన, తడిసిన భూమి అందాన్ని, వాన వెలిశాక చెట్లు కార్చే నీటి బిందువులను, ప్రకృతితో మమేకవుతున్నట్లు పొందే అనుభూతిని రామచంద్రారెడ్డి (రంగులనింగి) తన హైకూ కవిత్వంలో వ్యక్తీకరించాడు. మమేకం అవుతూ అనుభూతి చెందుతూ ఎంతో నుంది కవులు హైకూ కవిత్వాన్ని అందించారు.

ముగింపు: భారతీయ సంస్కృతిలో భాగంగా ప్రకృతితో సంబంధంభారతీయ కవిత్వానికి కొత్తఏమో కాదు. తెలుగులో ప్రబంధ యుగంలోవచ్చిన ప్రబంధాలన్నీ ప్రకృతే ప్రధాన వస్తువు. ప్రకృతిని పరిశీలించినప్రభంద కవులు అష్టాదశ వర్ణనలతో వర్ణిస్తూ రచనలు చేశారు. కవి ప్రకృతితోమమేకవుతూ అనుభూతి చెందుతూ రచనలు చేశారు. ఇక్కడ కవి యొక్కఅనుభూతి' ప్రధానం. అది బుద్ధితో చేసేపని, దానిని తొలగించి ఆ స్థానంలోమనస్సును పెట్టింది కవితత్వం. ఇస్మాయిల్ మాటల్లో, హైకు అంటే చంద్రుణ్ణి చూసింతోకని కవితావస్తున్న ఎన్నె చాలా మార్గాలలో ప్రయాణం చేస్తుంది. వైవిధ్యభరితమైన అంశాలను, వర్తమాన సామాజికాశాలను ఏవిషయాన్నైనా సమర్థవంతంగా స్వీకరిస్తూ ఉండటం ఆ ప్రక్రియవికాస స్థితికి నిదర్శనం. వర్తమాన ఆధునిక కవీ ప్రతి ఒక్కరూ హైకులని అభిమానంతోతో ఆదరించారు. నిస్సందేహంగా హైకు ఒక చక్కని కవితారూపం, అభివ్యక్తి విధానమని నిరూపించింది.

**ఆధార గ్రంథాలు:**

1. అనుభూతి కవిత్వం ఇస్మాయిల్.
2. ఆకాశ దీపాలు. లలితానంద్.
3. తెలుగు సాహిత్యచరిత్ర వెలమల సిమ్మన్.
4. దృశ్యాదృశ్యం – ఇస్మాయిల్.
5. రంగుల నింగి రామచంద్రారెడ్డి.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# మహా ప్రస్థానం మీద మార్క్సిజమ్ ప్రభావం

**డా॥ యస్.సి. సంజీవ రెడ్డి**
తెలుగు ఉపన్యాసగులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల - జమ్మలముగు
చరవాణి: 9290447642

**సారాంశం:** కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఏంజల్స్ ఇద్దరు కలిసి చేసిన సిద్ధాంతాన్ని మార్క్సిజమ్ అంటారు. మార్క్సిజమ్ ఒక ఆధునిక సామాజిక శాస్త్రం. ప్రకృతిని ప్రపంచాన్ని మనిషిని అర్థం చేసుకోవడానికి ఒక శాస్త్రీయమైన ఆలోచన విధానాన్ని అందిస్తుంది. మార్క్సిజానికి డార్విన్ పరిణామ సిద్ధాంతం హెగెల్ గతి తార్కిక వాదము మూల సిద్ధాంతాలు. ఈ రెండు సిద్ధాంతాలను తీసుకొని మార్క్సిజమ్ భౌతిక వాదాన్ని జోడించి, గతితార్కిక భౌతిక వాదమును రూపొందించింది. దీనితో పాటు చారిత్రక భౌతిక వాదాన్ని జోడించింది. గతితార్కిక భౌతిక వాదంలో ప్రకృతిలోని విరుద్ధ శక్తుల మధ్య జరిగే సంఘర్షణలో నుంచి ప్రగతి సాధ్యమౌతుందని, ప్రతి వస్తువులోను అంతర్గత వైరుధ్యాల వల్ల మూల వస్తువు నశించి కొత్తది తయారు అవుతుందని, ఏ వ్యవస్థ అయినా పరిణామ క్రమంలో తన రూపాన్ని కోల్పోయి కొత్తదానికి అవకాశం కల్పిస్తుందని మూడు సూత్రాలున్నాయి. చారిత్రక భౌతిక వాదం ప్రకారం. ఏ సమాజానికైనా ఒక చరిత్ర ఉంటుంది. దానికి ఒక పరిణామం ఉంటుంది. దానికొక రీతి ఉంటుంది. మానవ జాతి చరిత్ర వర్గపోరాటాల చరిత్ర అని మార్క్సిజమ్ చెబుతుంది.

**శ్రీశ్రీ మార్క్సిజమ్ :-** జయభేరి కవిత వ్రాసే నాటికి గాని, దేశచరిత్ర కవిత రాసే నాటికి గానీ శ్రీశ్రీ మార్క్సిజాన్ని చదువుకోలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రేరియన్ తెచ్చి యిచ్చిన "ప్రొగ్రెసివ్వర్ మ్యానిఫెస్ట్" చదివి దేశచరిత్ర కవిత రాసినట్లు ఆయన చెప్పుకున్నాడు. అది కూడా చదువక ముందే జయభేరి కవిత వ్రాసినాడు. మార్క్సిజమ్ చదవకుండా శ్రీశ్రీ తో మార్క్సిస్ట్

కవిత్వం వ్రాయించింది. అప్పటికి మొత్తం ప్రపంచాన్ని అనేక ముఖాలుగా ప్రభావితం చేస్తున్నది మార్క్సిజమే.

**మహా ప్రస్థానం మీద మార్క్సిజమ్ ప్రభావం:-**

1. మార్క్సిజమ్ ప్రకారం సమాజ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్ర. సమాజంలో రెండు వర్గాలు ఉన్నాయని అవి పాలక, పాలిత, పీడక, పీడిత వర్గాలని వాటి మధ్య నిరంతరం యుద్ధం జరుగుతుందని మార్క్సిజమ్ చెబుతుంది. శ్రీశ్రీ దేశచరిత్రలు అనే కవిత మార్క్సిజానికి కవిత్వ రూపం.

"ఏ దేశ చరిత్ర చూసినా - ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం
పరస్పరం సంఘర్షించిన- శక్తులతో చరిత్ర పుట్టను" ఇది అచ్చమైన వర్గ సిద్ధాంత కవిత్వం.

2. మార్క్సిజమ్ ప్రకారం పరాజితుల చరిత్రే విజేతల చరిత్రగా ఇంత కాలం వక్రీకరింపబడుతూ వచ్చింది. అంటే చరిత్ర తలక్రిందులుగా రచింపబడింది. మార్క్సిజమ్ ప్రకారం పాలకులు అంతా పీడకుల క్రింద లెక్క అందుకే శ్రీశ్రీ అంటాడు.
"బలవంతుల దుర్బర జాతిని బానిసలను గావించారు నరహంతలు ధరాధి పతులై చరిత్రమున ప్రసిద్ధి కెక్కిరి"

3. మార్క్సిజమ్ ప్రకారం చరిత్ర అంటే ప్రజల చరిత్ర కానీ సాంప్రదాయ చరిత్రకారులు పాలకుల చరిత్రనే మొత్తం చరిత్రగా చిత్రీకరించారు. అందుకనే మనకు మౌర్య సామ్రాజ్యం, గుప్త సామ్రాజ్యం, అశోక సామ్రాజ్యం మొ॥ పేర్లు వచ్చాయి. మార్క్సిజమ్ దీన్ని వ్యతిరేకిస్తుంది. దీని ప్రకారం మనిషి చరిత్ర నిర్మాత. ఇక్కడ మనిషి అంటే కష్టించే మనిషి అని అర్థం. అభ్యుదయ కవిగా శ్రీశ్రీ ఇలా అన్నారు.

"నైలునదీ నాగరికతలో - సామాన్యుని జీవనమెట్టిది సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుల సాహస మెట్టిది? ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసినబోయి లెవ్వరు"
ఈ ప్రశ్నలు మానవజాతి చరిత్రను ప్రజాదృక్పథంలో తిరిగి రచించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి.

4. మార్క్సిజమ్ సమాజంలో వర్గాలున్నాయని గుర్తించడమే గాక వర్గ వ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరాన్ని కూడా గుర్తిస్తుంది. సమస్యను గుర్తించడం విశేషం కాదు. దానికి పరిష్కారాన్ని కనుగొనడం విశేషం. మార్క్సిజమ్ మానవజాతిని అనాదిగా పట్టి పీడిస్తున్న వర్గ వ్యవస్థను నిర్మూలించడమే పరిష్కారంగా చెబుతుంది. అందుకే శ్రీశ్రీ ఇలా అన్నాడు.

"చిరకాలం జరిగిన మోసం బలవంతుల దౌర్జన్యాలు ధనవంతుల ఘన్నాగులు - ఇంకానా, ఇకపై చెల్లవు ఒక వ్యక్తిని మరొక వ్యక్తి ఒక జాతిని మరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఇంకానా

ఇకపై చెల్లదు" అంటే దోపిడీ వ్యవస్థను నిర్మూలించడమే పీడిత జాతికి విముక్తి అని అభ్యుదయ కవి చెబుతున్నాడు.

5. మార్క్సిజమ్ వర్గ వ్యవస్థను నిర్మూలించడానికి తిరుగు బాటును ఏకైక మార్గంగా భోదిస్తుంది. అణగారిన వాళ్ళంతా ఏకమై దోపిడీ వ్యవస్థ మీద తిరుగుబాటు చేసినపుడే వాళ్ళకు విముక్తి కలుగుతుందని ఫలితంగా పీడన లేని ఒక కొత్త సమాజం అవిర్భవిస్తుందని మార్క్సిజమ్ చెబుతుంది.

అందుకే శ్రీశ్రీ " మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది పదండి ముందుకు పదండి త్రోసుకు పోదాంపోరాం పైపైకి కదమ్ తొక్కుతూ పదంపాడుతూ హృదంతరాళం గర్జిస్తూ పదండి పోదాం వినపడలేదా మరో ప్రపంచపు జలపాతమ్.

6. తిరుగుబాట్లు చేయడం ఒక ఎత్తైతే ఆ తిరుగు బాట్లలో మనుషులు తమ జీవితాలను త్యాగం చేయవలసి రావడం మరొక ఎత్తు. మార్క్సిజమ్ విప్లవాలు ఆకాశంలోంచి ఉడిపడవని అవి ప్రజల త్యాగాల వల్లనే వస్తాయని చెబుతుంది. అందుకే శ్రీశ్రీ ఇలా అన్నాడు.

"దారిపొడవునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ పదండి ముందుకు బాటలు నడిచి - పేటలు కడిచి కోటలన్నింటిని దాటండి నదీ నదాలు అడవులు కొండలు ఎడారులా మనకడ్డంకి"
ఈ వ్యాఖ్యాలు ఉద్యమాలలో ప్రజలు చేయవల్సిన త్యాగాన్ని గుర్తు చేస్తున్నాయి.

7. విప్లవాలు రావాలంటే వ్యవస్థలు మారాలంటే ప్రజలలో ప్రాంతీయ, కుల, మత తత్వాలు ఉంటే కుదరదు. మార్క్సిజమ్ ప్రకారం సాంఘిక, భౌగోళిక సరిహద్దులకు అతీతంగా ప్రపంచంలోని పీడిత జనమంతా ఒక్కటే. అందుకే మార్క్సిజమ్ ప్రపంచ కార్మికులారా ఏకంకండి. అని పిలుపు నిచ్చింది. మార్క్సిజమ్ ఒక అంతర్జాతీయ వాదం, శ్రీశ్రీ మహా ప్రస్థానంలో అనేక కవితల్లో అంతర్జాతీయ తత్వం బోధపడుతుంది. మానవుడా అనే కవితలో శ్రీశ్రీ మనిషిని "అవి భక్తి కుటుంబీ" అన్నాడు. "ఏకరక్త బంధు అన్నాడు" అనేక భాషలు మాట్లాడేవాడా అనేక స్థలాలలో తిరిగేవాడా అని సంభోదించాడు.

అంతేకాక దేశచరిత్రలు కవిత్వంలో "చీనాలో రిక్షావాలా చెక్ దేశపు గనిపని మనిషి ఐర్లాండున ఓడ కళాసి అణగారిన అర్థులందరూ హటన్ టాట్ జూలు నీగ్రో ఖండాంతర నానాజాతలు చారిత్రక యాదార్థ తత్వం చాటిస్తారోక గొంతుకతో"

ఈ కవిత ప్రపంచ పీడిత వర్గాలు జాతులు ఏకమై దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరగబడే చారిత్రక సందర్భం తప్పకుండా వస్తుందని గుర్తు చేస్తున్నది.

8. మార్క్సిజమ్ ప్రకారం మతం మత్తుమందు. మనిషే సత్యం, చరిత్ర నిర్మాత మానవుడే జీవితంలోని ప్రతి అంశాన్ని మనిషి తన శ్రమతో సృష్టించుకుంటూ ఉన్నాడు. మానవాతీత

శక్తి మీద విశ్వాసం భయంలోంచి పుడుతుంది. చరిత్రలో తత్వవేత్తలు ప్రజలను అజ్ఞానంలో ముంచి పాలకులకు వాళ్ళను విధేయులుగా చేయడానికి అనేక సిద్ధాంతాలను చేశారు. మానవాతీత శక్తుల ఆదిపత్యాన్ని మనిషి మీద రుద్ధారు. మార్క్సిజమ్ వీటినన్నింటినీ తిరస్కరిస్తుంది శ్రీశ్రీ 'మానవుడా' 'మిధ్యావాది' వాడు మొ॥ కవితల్లో ఈ భౌతిక భావాలను కవితీకరించాడు. మార్క్సిజమ్ చెప్పే భౌతిక వాదాన్ని నిరూపిస్తూ మనిషి పరమాణువు సంకల్పంలో ప్రభవం పొందిన వాడా అంటూ సంభోదించాడు. ఈ మనిషినే శ్రమైన జీవి అన్నాడు శరీరపరరివృతుడా అన్నాడు. ఘర్మ వర్ష సయోధుడా అన్నాడు. మిధ్యావాది అనే కవితలో "చెమట అనే వర్షాన్ని చిందించేవాడా" అన్నాడు.

"మాయంటావా అంతా
మాయంటావా నా ముద్దుల వేదాంతి మిథ్యంటావా
పాలికాపు నుదుటి చెమట కూలి వాని గుండె చెఱువు
బిచ్చగాని కడుపు కరువు మాయంటావు"

అని వేదాంతాన్ని నిలదీశాడు. శ్రీశ్రీ నిలదీయడమే గాక అభ్యుదయ కవిగా శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది. లేనే లేదని చాటాడు.

**ముగింపు:** ఈ రకంగా శ్రీశ్రీ తెలుగు కవిత్వంలోకి మార్క్సిస్ట్ తత్వ శాస్త్రాన్ని తీసుకొచ్చాడు. ఆకాశపు దారులంట హడావిడిగా వెళుతున్న తెలుగు కవిధారథాన్ని శ్రీశ్రీ భూమార్గం పట్టించాడు.

**ఆధార గ్రంధాలు:**

1. కమ్యూనిస్ట్ మానిఫెస్టో - కారల్ మార్క్స్
2. పరిణామ సిద్ధాంతం డార్విన్
3. గలి తార్కిక వాదం - హేగెల్
4. మహా ప్రస్థానం – శ్రీశ్రీ

## "ప్రశ్న గేయం - దాశరధి అభ్యుదయ దృక్పథం"

**షేక్ షానాజ్ బేగం, తెలుగు అధ్యాపకురాలు,**
టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కందుకూరు, SPSR నెల్లూరు జిల్లా.
చరవాణి: 9441442274.

**స్థూల పరిచయం:** మనిషిని మనిషిగా చూడాలనే దృక్పధాన్ని కలగజేసి, సాహిత్య గౌరవం కల్పించిన వాదం అభ్యుదయవాదం. అభ్యుదయం అంటే మంగళం, శుభం అని నైఘంటికార్థాలు. అభ్యుదయవాదులు మాత్రం ఈ పదానికి పురోగమనం, ప్రగతిశీలం అనే అర్థంలో తీసుకొని సాహిత్యంలో, సామాజిక చైతన్యం కోసం కవితలు రాశారు. శ్రామిక జనపక్షపాతం, వాస్తవికత, పీడిత జనపక్షం, సమ సమాజ నిర్మాణం అభ్యుదయవాదుల

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

లక్ష్యం. ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించింది. సామాన్య మానవుడిని సాహిత్యానికి మకుటధారిని చేసింది అభ్యుదయ కవిత్వం. శిష్లా, పఠాభి, పురిపండా, అబ్బూరి, శ్రీశ్రీ, రోణంకి నారాయణబాబు, ఆరుద్ర, కాళోజీ, దాశరధి మొదలైనవారు. దాశరధి అభ్యుదయవాది. పద్యంలోనైనా, వచనంలోనైనా అభ్యుదయాన్ని పలికించగల సాహితీమూర్తి. ప్రశ్న గేయం దాశరధి గారు రచించిన అగ్నిధార కవితా సంపుటి నుండి గ్రహించబడింది. నాటి హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం రాజులు కర్కశంగా పాలన చేస్తున్నప్పుడు మహాంధ్రోదయం కోసం అగ్నిధారను కురిపిస్తూ రుద్రవీణను మీటిన అభ్యుదయవాది. దాశరధి అక్షరాయుధ యోధుడు, అక్షరాల యోధుడు.

ఆంధ్ర మహాసభ కార్యకర్తగా, ఫ్యూడల్ వ్యతిరేక సమర సైనికుడిగా దాశరధి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని పలికాడు. కళ్ళలో కోపం, ఒళ్ళంతా కవిత్వంతో 'నిజాము రాజు తరతరాల బూజు' అని ధైర్యంగా పలికిన సాహసి.

'ఓ నిజామా పిశాచమా కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రతనాల వీణ'

అని ముసలి నక్కకు రాచరికము తగునే' అని నిజాం ప్రభుత్వ నిరంకుశత్వం, ప్రజలు పడే కష్టాలు, నిజాం ప్రభుత్వ పతనం ఇవన్నీ నా రచనకు పునాదులు అని దాశరథి స్వయంగా తానే చెప్పుకున్నాడు. కవిత్వాన్ని రాయడమే కాక దాశరధి స్వయంగా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని, లాఠీ దెబ్బలు తిన్నప్పటికిని తన అభ్యుదయ పంథాను మార్చుకోలేదు. జైలు జీవితపు బాధలను అనుభవించి, పోలీసుల తుపాకీల నుండి ప్రాణాలతో బయటపడిన ధీశాలి అయిన దాశరధి పూర్వ వరంగల్ జిల్లాలోని చిన్న గూడూరులో 1925 జూలై, 22 న వెంకటమ్మ, వెంకటాచార్యుల దంపతులకు జన్మించారు. పండిత వంశంలో పుట్టిన దాశరధి చిన్నప్పటి నుండే కవిత్వం చెప్పడం ప్రారంభించారు. 1949లో వెలువడిన అగ్నిధార దాశరధి గారి తొలి కవితా సంపుటి. పీడిత ప్రజానీకానికి తన స్వరాన్ని మైక్గా మార్చి రచనలు చేయడమే కాదు, వాటిని స్వయంగా తన జీవితంలో ఆచరించి చూపిన కవి. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం,
పునర్నవం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, కవితా పుష్పకం, తిమిరంతో సమరం, అమృతాభిషేకం ఆలోచనలు, నవమి, యాత్రాస్మృతి వంటి గ్రంథాలను రచించారు. దాశరధి గారి కవితా పుష్పకం రచనకు రాష్ట్ర సాహిత్యఅకాడమీ అవార్డు, తిమిరంతో సమరంకు కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు, గాలిబ్ గీతాలకు ఆంధ్రప్రదేశ్ ఉత్తమ అనువాద గ్రంథ పురస్కారం లభించింది. 1977లో ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతో, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిలీట్తో దాశరధిని సత్కరించింది. అనేక ప్రక్రియల్లో ఆరితేరి అభ్యుదయ ప్రస్థానంలో సంచలనం సృష్టించిన దాశరధి నవంబర్ 5, 1987 లో సాహితీ లోకాన్ని వీడి వెళ్ళారు.

**ఉపోద్ఘాతం :** ప్రశ్న అనేది లేకుంటే మానవ మనుగడే లేదు. ఎందుకు? ఏమిటి? ఎలా? అనే ప్రశ్నలు లేకపోతే ఆది మానవుడిగా అడవులలో నివసించే మానవ ప్రస్థానం అక్కడే ఆగిపోయేది. ఈ ప్రశ్నల వల్లనే మానవుడు మహనీయుడై, నాగరిక చరిత్రలో అపూర్వమైన విజయాలను సాధిస్తూ, అనంత మార్పును తీసుకొచ్చాడు. అంతరిక్షంలోకి అడుగుపెట్టాడు, ఎన్నో విశ్వ రహస్యాలను తెలుసుకుంటున్నాడు. ఈనాడు మనం అనుభవిస్తున్న ప్రతి వస్తువు మానవ మేధస్సులో ఉదయించిన ప్రశ్నల పరంపరే. సమాజంలో ఎంత మార్పు వచ్చినా, ఎన్ని ప్రశ్నలు పుట్టినా, మానవులందరూ సమానంగా జీవించే పరిస్థితులు లేవు.

పేద, ధనిక తారతమ్యంలో నాటినుండి నేటివరకు పెద్దగా మార్పులేదు. అభ్యుదయ భావనేపథ్యంతో సమాజాన్ని చూస్తున్న కవి హృదయంలో నుండి ఏడు ప్రశ్నలు పుట్టాయి. ఈ ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతాయా? వాటికి పరిష్కారం ఉందా? అనే దృక్పధంతో రాసిన గేయమే ప్రశ్న. అల్పాక్షరాల్లో అనల్పార్థ రచనకు దాశరథి కవితావేశానికి, మానవీయ విలువలకు, శాస్త్ర సాంకేతికతలకు, కవి కలలుకన్న సమాజానికి అక్షర రూపం ఈ గేయం. ఈ గేయంలో ప్రతిదీ ప్రశ్నే. ప్రతిప్రశ్న ప్రతిఒక్కరి గుండెలను సూటిగా తాకుతూ అందరికీ అర్థమయ్యే వచనరూపంలో ఈ గేయం ఆవిష్కరించబడింది. దాశరథి 'ప్రశ్న' గేయం ద్వారా కోరుకున్న అభ్యుదయ కవితా వికాసం నెరవేరిందా? లేదా? కవి తన ఏడు చరణాల్లో అభ్యుదయ దృక్పథాన్ని ఆవిష్కరించిన తీరును తెలుసుకోవడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం. **ప్రశ్న గేయం**లోని మొదటి చరణం శాస్త్ర జ్ఞానాన్ని, సామాజిక చైతన్యం, కవితాత్మక సంవేదనలను, ప్రాపంచిక దృక్పధాన్ని వివరిస్తూ రాసిన చరణం, దాని విశ్లేషణ చిన్న చరణంలో ఇంత నిగూడార్థం ఉందా? అని ఆలోచింపజేసే చిన్న కవితలో దాశరథి అభ్యుదయ దృక్పధాన్ని చూద్దాం.

ఆ చల్లని సముద్రగర్భం
దాచిన బడబానలమెంతో ?
ఆ నల్లని ఆకాశంలో
కానరాని భాస్కరులెందరో ?

సముద్రం చూడడానికి ప్రశాంతంగా, చల్లగా వచ్చి పోయే కెరటాలతో ప్రశాంతంగా కనిపిస్తుంది. కానీ సముద్రం లోపల అనేక అగ్నిజ్వాలా కేంద్రాలు దాగి ఉంటాయి. అవి ఉవ్వెత్తున ఎగసిపడిన సందర్భాలలో జరిగే నష్టాన్ని అంచనా వేయలేము. 2004 డిసెంబర్లో వచ్చిన సునామీవల్ల జరిగిన నష్టాన్ని దాదాపుగా 80 శాతం మంది చూసినవారే. సముద్రం ఎంత ప్రశాంతంగా ఉన్నప్పటికీ తుఫానులు ధాటికి ఏవిధంగా తట్టుకోలేరో, ప్రపంచంలో విభిన్న లోక ప్రవృత్తులు కల ప్రపంచం కూడా పైకి ప్రశాంతంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఎన్నో అసమానతలు, దోపిడీలు ఆధిపత్యం ఉన్న ఈ లోకంలోని అసంతృప్తి కలవాళ్ళ గుండెల్లో దాగిన అగ్ని తిరుగుబాటు జ్వాలలా పైకి ఎగసిందంటే దానిని ఆర్పడం చాలా కష్టం. నల్లని మబ్బుల్లో దాగిన సూర్యబింబాలు ఎన్నో ఉన్నాయి. ఈ భూమ్మీద అవకాశాలు రాని ప్రతిభావంతులు మరుగునపడి ఉన్నారు. వారి మనోవేదన తిరుగుబాటుగా మారే అవకాశాలు ఉన్నాయి. తిరుగుబాటు దృక్పధంతో సముద్రం, ఖగోళశాస్త్రాల పరిచయంతోపాటు దాశరథి వైజ్ఞానిక తృష్ణకు క్రింది చరణమే నిదర్శనం.

భూగోళం పుట్టుకకోసం
కూలిన సురగోళాలెన్నో?
ఈ మానవ రూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో ?

ప్రపంచం అంతా నీటితో నిండి ఉండేదని, సూర్యగ్రహంలోని కొన్ని ముక్కలు అక్కడక్కడా పడడంతో అవి ఆరి, భూమి పుట్టిందని, భూమి పుట్టుక కోసం అనంతవిశ్వంలో జరిగిన విస్ఫోటనాలు, సౌర కుటుంబంలో కూలిన సూర్యగోళాలు ఎన్నో ఉన్నాయి. అంతుచిక్కని ఖగోళ రహస్యాలను అనల్పార్థంలో రచించిన మేధావి. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని అనుసరించి డ్రయోపిథెకస్, రామా పిథెకస్, ఆస్ట్రో పిథెకస్, హోమో ఎరెక్టస్, హోమోసెపియన్స్, నియాండర్తలెన్సిస్, హోమో సేపియన్స్, సేపియన్స్, హోమో సేపియన్స్గా పరిణామం జరగడానికి కొన్ని వందల సం॥లు పట్టి, నేటి ఆధునిక మానవరూపాన్ని పొందాడు. మార్పు అనేది ఒక్కసారిగా రాదు. కొంచెం కొంచెంగా మార్పు

చెందుతూ ఒక ఖచ్చితమైన అభిప్రాయానికి వచ్చిన తర్వాతే ఆలోచనా శక్తిని పెంపొందించుకొన్న వారందరూ అభ్యుదయం వైపు అడుగులు వేస్తారని తెలియజేశారు.

ఒకరాజును గెలిపించుటలో
ఒరిగిన నర కంఠాలెన్నో?
శ్రమ జీవుల పచ్చి నెత్తురులు
త్రాగని ధనవంతులెందరో?

నిశితంగా చరిత్రను పరిశీలిస్తే దాదాపుగా రాచరికం ప్రారంభమైనప్పటి నుండి ప్రపంచ యుద్ధాలల్లో సామాన్య మానవులే ప్రాణాలు పోగొట్టుకొని రాజులకు కీర్తినిచ్చి, తమ ప్రాణాలను పోగొట్టుకోవడమే గాని, తమ ఆస్తిత్వం కోసం పాకులాడలేదు. పేదల శ్రమను దోపిడిచేసే ధనవంతులు అవుతున్నారు. ఎక్కువ శ్రమ చాలిచాలని జీతాలను ఇచ్చి, వారి అవసరాలకు అప్పులిచ్చి, వడ్డీలపై వడ్డీలు వేసి, వారి దగ్గర ఉన్న పొలం పుట్రా, నగా నట్రా లాగేసుకొని బాకీ తీరలేదని తరతరాలుగా వెట్టి చాకిరీ చేయించుకునే ధనవంతులను గురించి కవి ప్రస్తావిస్తున్నాడు. పీడిత పక్షాన ఉన్న శ్రామికుల శ్రమను ప్రతి ఒక్కరూ గుర్తించాలనే ఆకాంక్షను వెలిబుచ్చుతున్నాడు.

అన్నార్తులు అనాధలుండని
ఆ నవయుగమెంత దూరమో?
కరువంటూ కాటకమంటూ
కనుపించని కాలాలెప్పుడో ?

కవి ఒక నవయుగం కోసం కలలు కంటున్నాడు. ఆకలి దప్పులు, అనాధలు లేని సమాజం కావాలంటున్నాడు. కరువు కాటకాలు సంభవించని లోకం కావాలని కాంక్షిస్తున్నాడు. ఆ దిశగా కొత్తలోకాన్ని నిర్మించుకునే దిశగా ప్రయాణం చేద్దామని సమసమాజ నిర్మాణం కోసం అందరూ అడుగులు వేయాలనేది కవి ఆకాంక్ష. కరువు కాటకాలు లేని సమాజాన్ని కూడా మనం చూడలేకపోతున్నాం. ఎండలు భీభత్సంగా కాస్తున్నాయి. వర్షాలు పడితే అతిగా కురుస్తున్నాయి. వీటితో ఉంటే అతివృష్టి లేకపోతే అనావృష్టి వీటితో ధరలు మండిపోతూ ప్రజలందరూ అసంతృప్తితోనే జీవిస్తున్నారు.

అణగారిన అగ్నిపర్వతం
కని పెంచిన 'లావా' ఎంతో?
ఆకలితో చచ్చే పేదల
శోకంలో కోపం ఎంతో ?

అగ్నిపర్వతం బద్దలు కానంతవరకే ఎవరికి నష్టం ఉండదు. అది బద్దలయిందంటే ఆ వేడి లావా ప్రవాహాన్ని ఆపడం ఎవరివల్ల కాదు. ఆకలితో అల్లాడే పేదవారు తమ ఆకలిని తీర్చుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసి, విఫలమైన పేదల కోపాన్ని మనం అంచనా వేయలేమని కవి భావిస్తున్నాడు.

పసిపాపల నిదుర కనులలో
ముసిరిన భవితవ్యం ఎంతో?
గాయపడని కవి గుండెల్లో
రాయబడని కావ్యాలెన్నో

పసివారు ఎటువంటి ఒడిదుడుకులు, చీకూచింతా లేకుండా ప్రశాంతంగా నిద్రపోతారు. ఆ పసివారు ఎదిగిన తరవాత వారి భవిష్యత్తు అంతే హాయిగా ఆనందంగా జీవించగలరనే భరోసాను మనం ఇవ్వగలమా? వైషమ్యాలతో అసమానతలున్న లోకాన్ని చూసి కవి హృదయం గాయపడింది. ఇటువంటి లోకంలో నివసించే పసివారు. పెద్దవారైన తర్వాత ఈలోకంలో వారి భవిష్యత్తుకు భరోసా లేదని, అసమానతల మధ్య వైషమ్యాల మధ్య

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

తమ భవిష్యత్తును నిర్మించుకోలేక, తాము కన్న కలలను సాకారం చేసుకోవడానికి ప్రయత్నించి, నిరాశా నిస్పృహలకు లోనైనవారి మనస్సుల్లోని వేదనల్లో కూరుకుపోయిన కొందరి కవుల గుండెలు అంతఃఘర్షణతో రగిలిపోతూ రాయబడని కావ్యాలు ఎన్నో ఉన్నాయని కవి తెలియజేస్తున్నాడు

కులమతాల సుడిగుండాలకు
బలి యైన పవిత్రులెందరో?
భారతావని బల పరాక్రమం
చెర వీడేదింకెన్నాళ్ళకో?

మనిషిని మనిషిగా గౌరవం ఇవ్వలేక, నాల్గు పడగల హైందవ నాగరాజు యొక్క భావనలు వీడలేక వర్ణరహిత సమాజాన్ని మార్చలేక వైషమ్యాల సుడిగుండాలలో ప్రజలు చిక్కుకు పోయారు. జ్ఞానం విజ్ఞతను నేర్పించకపోగా, అహంకారాన్ని పెంచింది. ఆధిపత్య ధోరణి అలవడింది. మనదేశం సాహసాలకు పుట్టినిల్లు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్నవారెందరో ఉన్నారు. అలాంటి వీరుల శక్తిసామర్థ్యాలు అందరికీ అర్థం కావాలి. ఆధిపత్య శక్తులపై అంతిమ విజయం సాధించాలని కవి ఆకాంక్షిస్తున్నాడు. భారతావని బల పరాక్రమం / చెర వీడేదింకెన్నాళ్ళకో? అని కవి అంటున్నాడంటే ఈ కవిత 1945కు పూర్వమే రాసి ఉండాలి. 1949లో అగ్నిధార కవితా సంపుటి ముద్రించబడి ఉండవచ్చు.

**ముగింపు:** దాశరథీ, శరథీ, రథీ, థీ గా సుప్రసిద్ధుడైన దాశరథి కృష్ణమాచార్యులు ప్రశ్న గేయంలో అనేక మౌలిక ప్రశ్నల్ని సంధించారు. వీరు వేసిన ప్రతి ప్రశ్న పీడిత మానవుడి చుట్టూ వేదనాత్మకంగా సాగింది. అభ్యుదయ పంథాలో ఆలోచించేటట్లు చేసింది. అవకాశాలురాని ప్రతిభావంతులను కానరాని భాస్కరులతో పోల్చాడు. రెండవ చరణంలో అభ్యుదయం వస్తుంది. మార్పు రావడానికి కొంత సమయం పడుతుందని హెచ్చరించారు. రాచరిక వ్యవస్థలో ప్రాణనష్టం జరగకూడదని కోరారు. శ్రమదోపిడీ చేసినవారే ధనవంతులయ్యారని బూర్జువా వ్యవస్థను నిరసించారు. ఆకలితో అలమటించే పేదలు, అనాధలు ఉండకూడదని కోరారు. కానీ ప్రస్తుతం కన్నబిడ్డలే తల్లిదండ్రుల్ని అనాధలను చేసి రోడ్లమీదకు వదిలేస్తున్నారు. ఈనాడు ముసలితనం ఒక పెద్ద సమస్య. అలా వదిలేసిన వారిలో కొందరు బిచ్చగాళ్లుగా, దిక్కులేనివారిగా, ఆకలికి అలమటిస్తూ అన్నమో రామచంద్రా ! అని అలమటిస్తున్న వారు కొందరైతే, వృద్ధాశ్రమాలకు చేరుతున్నవారు కొందరు, చెట్ల క్రింద నివసిస్తూ దిక్కులేని వారిగా చనిపోయేవారు కొందరు. కేవలం వృద్ధులే కాదు. బాలలు, యువకులు వ్యసనాలకు బానిలయి తమకు దేశం ఏమి చేయలేదని నిరాశా నిస్పృహలకు లోనై, ఆత్మహత్యలకు పాల్పడేవారు కొందరున్నారు. దాశరథి కోరిన సమాజము ఏది ? ప్రస్తుత పరిస్తితులేమిటి ? ఆకలి చావులు ఉన్నాయి. బాలల భవిష్యత్తు అంధకారంలోనే సాగుతుంది. చిన్నప్పటినుండే బాల కార్మికులుగా మారి, కూలీనాలీ చేసుకుంటూ శ్రమజీవులుగా మారుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపిస్తుంది. కులమతాలు లేని సమాజం కావాలని కవి కోరుకుంటే, ప్రస్తుతం కుల వివక్ష పెరిగిపోయింది, అసమానతలు పెచ్చుమీరిపోయాయి. అగ్నిధార ఈ కవితా సంపుటి 1949 లో నాటి సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాసినప్పటికిని, ఈ గేయంలో ఆయుధాల్లాంటి చరణాలతో దాశరథి జాతిని జాగృతం చేసే కార్యాచరణకు పూనుకొని, తన కవితాచరణాలతో హృదయాన్ని కదిలిస్తూనే సామాజిక అసమానతలపై ఈటెలు విసరి మార్పును కోరారు. అభ్యుదయ దృక్పథంతో వేసిన ఈ ప్రశ్నలు ఆనాటి సమాజాన్ని ఉద్దేశించినప్పటికిని, నేటికీ ఆ ప్రశ్నలు సజీవంగా ప్రతిధ్వనించడం ఒక సామాజిక విషాదంగా భావించవచ్చు. దాశరథి గారు ఈ ప్రశ్నలకు సమాధానం దొరకదని ముందే ఊహించారేమో ? అందుకే ఈ కవితకు ? (ప్రశ్న) శీర్షికగా ఇచ్చారు. అందుకే దాశరథి వేసిన ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోయాయి.

దాశరధి గారి ప్రశ్నలకు సమాధానం దొరికితే బాగుండేది. కానీ సమాధానాలు దొరికే రోజు కోసం, అభ్యుదయ భావాలతో దాశరధిలాంటి కవులు ఆయనలా నిలబడి, ఆచరణ, కార్యశీలత కలిగి ఉండే రచనలు చేసి, ఆయనలా స్ఫూర్తిని నింపే రోజులు రావాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంధాలు :**

1. అగ్నిధార - దాశరధి
2. తెలుగు సాహిత్య చరిత్ర. జి. నాగయ్య
3. తెలుగులో కవిత్వోద్యమాలు తెలుగు అకాడమి.
4. అంతర్జాలం

## సీతారామ శాస్త్రి కవితా సిరివెన్నెల

**డా॥ పొన్నంరెడ్డి కుమారి నీరజ**
తెలుగు సహాయాచార్యులు
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల శ్రీకాళహస్తి
9885248649

p.kumarineeraja@gmail.com

**స్థూల పరిచయం:** ఆకలియే కవిత్వం, ఆలోచనయే కవిత్వం, కదిలించే ఘటనలు కవ్వించే ప్రతినలు కవితకు ప్రాతిపదికలు. కవిత్వం మౌనంనుంచి జనించి, మాటల్లోని మాధుర్యాన్ని తెల్పి, ప్రతిహృదయాన్నీ తట్టి లేపి చివరకు మౌనంపైపు ప్రయాణించేలా చేయగల అద్భుతమైన శక్తి. ఏ కవితారీతిలోనైనా ప్రవాహ సదృశంగా భావాలను పలికిస్తూ, ప్రస్తుత సమాజ స్థితి గతులకు అనుగుణంగా ఉన్నతమైన, ఉత్తమమైన భావజాలాన్ని ఏర్పరచటమే ఆధునిక కవిత్వం పని.

**అత్యంత శక్తివంతమైన కళారూపం సినిమా:** తన పదాలతో తెలుగు సాహిత్యానికి సరికొత్త అందాన్ని తీసుకొచ్చి, తన పద ప్రయోగంతో తెలుగు సినిమా పాటలకు సరికొత్త అర్థాన్ని చెప్పిన ప్రముఖ గేయ రచయిత పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి కవితా మాధుర్యాన్ని చవిచూస్తూ ఆనందిస్తూ, ఆహ్లాదిస్తూ, ఆవేశపడూతూ, చైతన్యాన్ని, స్ఫూర్తినీ పొందుదాం. వీరు 20వ తేదీ మే 1955న విశాఖపట్నం జిల్లా, అనకాపల్లిలో డా|| సి.వి.యోగి, శ్రీమతి సుబ్బలక్ష్మిగార్లకు జన్మించారు. వీరు తన గురువుగా శ్రీ వై. సత్యా సత్యారావు గారిని, ఉత్తమ విమర్శకురాలిగా భార్య పద్మావతిని పేర్కొంటారు. వీరి విద్యాభ్యాసం అనకాపల్లి, కాకినాడల్లో సాగింది.

తెలుగు చలనచిత్ర దర్శకుడు కె. విశ్వనాథ్ గారు జననీ జన్మభూమి సినిమాకు పాటలు రాసే అవకాశం కల్పించారు. 1986లో సిరివెన్నెల సినిమాకు రాసిన విధాత తలపున పాటతో బహుళ ప్రాచుర్యం పొందిన సీతారామశాస్త్రిగారికి సిరివెన్నెల ఇంటి పేరుగా మారింది. వీరికి 11 నంది అవార్డులు, 5 ఫిల్మ్ ఫేర్ అవార్డులు లభించాయి. వీరు 3000 పాటలకు పైగా రాశారు. 2019లో పద్మశ్రీ లభించింది.

సమాజంలోని లోపాలను, సామాజిక దురాచారాలను విమర్శిస్తూ తన కవితల్ని కొనసాగించిన వీరి సాహిత్యం ఆశావాద దృక్పథాన్ని కలిగి వుంటుంది. ప్రజలు సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి కావాల్సిన ప్రేరణనందిస్తుంది. కొన్ని పాటలు తిరుగుబాటు ధోరణిలో సాగుతాయి.

విధాత తలపున ప్రభవించినది అంటూ ఆయన రాసిన పాట ప్రేక్షకుల గుండెల్లో ఆయనకు సుస్థిర స్థానాన్ని సంపాదించిపెట్టింది. భావ గర్భితమైన ఈ పాట రాయడానికి తనకు వారం రోజులుపట్టినట్లు చెప్తారు సిరివెన్నెలగారు. ధన మాయను ఎంత చిన్నచిన్న పదాల్లో పొదగగలరో దైవ మాయనుకూడా అంతే సులువుగా విడమరచి చెప్పగల ప్రజ్ఞాశాలి సిరివెన్నెల.

రామగోపాల్వర్మ దర్శకత్వంలో వచ్చిన గాయం సినిమాలో వీరే రాసి నటించిన పాటలోని సాహిత్యం గమనిద్దాం. ఈ సమాజం జీవచ్ఛవంలాంటిదని, దీన్ని పవిత్రంగా భావించే అగ్నితోనే కడగాలని, ఈ జనం సిగ్గులేని వారని వారిని ఊరకే కాదు. గట్టిగా అడగాలని అంటారు. దేవుడు దిగివచ్చినా ఈ లోకం తీరు మార్చడం కష్టమని, అది సాధ్యంకాదని వాపోతారు. ఈ ప్రజలు ఒక పద్ధతి లేకుండా గాలివాటుగా పోతుంటారని, గొర్రెదాటు మనస్తత్వం వారిదని, ఇలాంటి వారికి జ్ఞానబోధ ఎంతచేసినా ప్రయోజనం లేదని అంటారు.

"నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని / అగ్నితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని మారదు లోకం మారదు కాలం /దేవుడు దిగి రాని యెవ్వరు యేమైపోని ........./ గాలివాటు గమనానికి కాలిబాట దేనికి / గొర్రెదాటు మందకి మీ జ్ఞానబోధ దేనికి"

ఎప్పుడు ప్రజలు జిత్తులమారులయ్యారని, ఈ సమాజం రావణకాష్ఠంలా, నిత్య కురుక్షేత్రంలాగే ఉందని, నాగరికంగా ఎంతో ఎదిగామని చెప్పుకుంటున్నా, రాతిగుహల్లో బ్రతికిన మనం పాలరాయిగృహాల్లోకి మారినా, ఎన్ని యుగాలు గడిచినా అడవినీతి బలవంతులే బ్రతకాలని అనుకుంటున్నారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

"యే చరిత్ర నేర్పుకుంది పచ్చని పాఠం /యే క్షణాన మార్చుకుంది జిత్తుల మార్గం రామబాణమార్పిందా రావణ కాష్టం / కృష్ణ గీత ఆపిందా నిత్య కురుక్షేత్రం పాత రాతి గుహలు పాలరాతి గృహాలయినా / అడవినీతి మారిందా ఎన్ని యుగాలయినా వేట అదే వేటు అదే నాటి కథే అంతా / నట్టడవులు నడివీధికి నడిచొస్తే వింతా బలవంతులె బ్రతకాలని సూక్తి మరవకుండా / శతాబ్దాలు చదవలేదా ఈ అరణ్యకాండ"

మన సమాజం ఎందులోనైనా అబ్బాయిల తర్వాతే అమ్మాయిలన్నట్టు చూస్తుంది. ఆత్మాభిమానం చంపుకోలేని వాళ్ళు ఆ వివక్షను తట్టుకోలేరు. ఎందులోనూ మేము మీకు తీసిపోమని హెచ్చరిస్తారు. మిస్టర్ పర్ఫెక్ట్ సినిమాలో ఆడపిల్ల గొప్పదనాన్ని చెప్తూ....
"అగ్గిపుల్లలాంటి ఆడపిల్లనేను /నన్ను చిన్నచూపు చూస్తే వూరుకోను ఎందులోనూ నీకు నేను తీసిపోను ...... అచ్చమైన పల్లె రాణి పిల్ల నేను / పచ్చ పైరగాలి పీల్చి పెరిగినాను./ లేనిపోని డాబు మానరా

భారతీయ సమాజం భార్యాభర్తల బంధాన్ని పవిత్రంగా భావిస్తుంది. విష్ణుమూర్తి లక్ష్మీదేవికి తన వక్షస్థలంలో చోటిస్తే, పరమశివుడు అమాంతం సగభాగమే ఇచ్చేశాడు. అలాంటి మన భారతదేశంలో ఆడజన్మ అపురూపమైందని, స్త్రీ ఇల్లాలైతే ఆమెకు పరిపూర్ణత్వం సిద్ధిస్తుందని, భర్తలో సగం తానుగా, తన జీవితాన్ని అంకితం చేస్తుందని, ఉన్నా లేకున్నా, కాలం కలిసిరాకపోయినా భర్తను విడిచిపోకుండా తోడుగా ఉంటుందనే విషయాన్ని ప్రతి భర్తా గమనించాలి. ఆ స్థానాన్ని ఇంకెవరూ భర్తీచేయలేని భగవంతుడిచ్చిన వరం భార్యని గుర్తించలేకపోతే అతడు మోడుగానే మిగిలిపోతాడనే సత్యాన్ని చక్కగా వివరించారు పవిత్ర బంధం సినిమాలో పాటరూపంలో.
"అపురూపమైనదమ్మ ఆడజన్మ/ ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మా /మగవాని బ్రతుకులో సగపాలు తనదిగా జీవితం అంకితం చేయగా ....... కలిమి లేములన్నీ ఒకే తీరుగా / కలిసి పంచుకోగా సదా తోడుగా కలిసిరాని కాలం వెలే వేసినా /విడిచిపోని బంధం తానై ఉండగా సహధర్మచారిణి సరిలేని వరమని /సత్యాన్ని కనలేని నాడు మోడుగా మిగలడా పురుషుడు ."

అమ్మ అందరికీ ఇష్టమైంది. మనకి రూపాన్నిచ్చి, ప్రాణంపోసింది అమ్మ. ఎంతో జాలితో మనకు దారి చూపించేది, మనల్ని నడిపించేది అమ్మ. మనపట్ల కరుణను, కోపాన్నీ చూపేదీ అమ్మే. నాని సినిమాలో అమ్మ గురించిన కవిత "పెదవే పలికిన మాటల్లోని తియ్యని మాటే అమ్మ /కదిలే దేవత అమ్మ కంటికి వెలుగమ్మ ...... మనలోని ప్రాణం అమ్మ /మనదైన రూపం అమ్మ యెనలేని జాలిగుణమే అమ్మ నడిపించే దీపం అమ్మ కరుణించే కోపం అమ్మ /వరమిచ్చే తీపి శాపం అమ్మ"

కన్న తల్లులందరూ ఒకటి కాదని, కడుపున మోసి కనకపోయినా ప్రేమను పంచే తల్లులు చాలామంది ఉంటారని, అలాంటి కోవలో నిస్వార్థంతో మనకోసం నీడనిచ్చే చెట్టును, నీళ్ళనిచ్చే మబ్బును కూడా మనం తల్లిలా భావించి ప్రేమించాలంటాడు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా కన్న తల్లిని మరచిపోకూడదు. ప్రేమించు సినిమాలో కంటేనే అమ్మ అనిపించుకోదని, కడుపుతీపి లేని అమ్మ రాతి బొమ్మేనని, అమ్మతనంలోనే ఆనందం దాగుందంటాడు. స్త్రీ జీవితానికి అర్థం పరమార్థ, సార్థకత మాతృత్వంతోనేనంటారు.
"కంటేనే అమ్మ అని అంటే ఎలా /కరుణించే ప్రతి దేవత అమ్మే కదా కన్న అమ్మే కదా ....../కడుపు తీపి లేని అమ్మ బొమ్మే కదా రాతి బొమ్మే కదా కణకణలాడే ఎండకు శిరసు మాడినా /మనకు తన నీడను అందించే చెట్టే అమ్మ చారెడు నీళ్ళైనా తాను దాచుకోక /జగతికి సర్వస్వం అర్పించే మబ్బే అమ్మ ఆ అమ్మలనే మించిన మా అమ్మకు /ఋణం తీర్చుకోలేను ఏ జన్మకూ ఎన్నో అంతస్తులుగా ఎదిగిపోయినా / మేడకున్న అసలు ఉనికి ఆ పునాది పైనే సిరుల జల్లులో నిత్యం పరవశించినా /మగువ జీవన సాఫల్యం మాతృత్వంలోనే ప్రతి తల్లికి మమకారం పరమార్థం / అదిలేని అహంకారం వ్యర్థం వ్యర్థం"

నేటి సమాజం ఇలా ఉండటానికి కారణం డబ్బు. బంధాలుకూడా డబ్బు చుట్టూనే. నేడు లోకం డబ్బుమీదే నడుస్తోంది. డబ్బు లేకపోతే ఇంకేం లేదన్నట్లు, డబ్బుకోసమే ఏ గడ్డైనా తింటూ, డబ్బే లోకంగా బంధాల్నికూడా బలిచేస్తూ బతికేస్తున్నారు ఎందుకో. లక్ష్మి ఎప్పుడూ స్థిరంగా ఉండక చేతులు మారుతూనే ఉంటుంది. డబ్బును బట్టే మనిషికి గౌరవం. ఎందరి తలరాతల్నో మారుస్తుంటుంది ఈ డబ్బు. ఏ పని చేయాలన్నా డబ్బు కావాల్సిందే అది లేందే గడవదు. ఈ జీవన చక్రం తిరగడానికి మూలం డబ్బే. డబ్బునుబట్టే మనిషికి గౌరవం. మనిషి పుట్టినప్పటినుండీ చచ్చేంతవరకూ డబ్బు ఉండాల్సిందే. దేవుడికైనా డబ్బు కావాల్సిందే హుండీలోకి. డబ్బున్నోడు తప్పును కూడా ఒప్పుగా మార్చేస్తాడు మరి. ఇది ఊసరవెల్లి. డబ్బుగూర్చి రాసిన కవిత వేదం సినిమాలో

"ఇది చేతులు మారే / రాతలు మార్చే కాగితమోయ్ తాను జేబులనుంచి జేబులలోకి దూకేసి ఎగిరే రూపాయి ..... కోటలు మేడలు కట్టాలన్నా /కాటికి నలుగురు మోయాలన్నా గుప్పెడు మెతుకులు పుట్టాలన్నా /ప్రాణం తీయాలన్నా ఒకటే రూపాయి /ఈ ఊసరవెల్లికి రంగులు రెండే

బ్లాక్ ఆర్ వైట్ /ఈ కాసుల తల్లిని కొలిచేవాడికి రాంగ్ ఈజ్ రైట్ /తన హుండీ నిండాలంటే దేవుడికైనా మరి అవసరమేనోయ్ రూపాయి /పోయే ఊపిరి నిలవాలన్నా పోరాటంలో గెలవాలన్నా /జీవన చక్రం తిరగాలన్నా జననం నుంచి మరణం దాకా రూపాయ్"

నేడు మనం బాగా గమనిస్తున్నాం. ఈ లోకమంతా డబ్బుమయం. రైలు బండి నడవడానికి పచ్చజెండా లా ఈ బ్రతుకు బండ్ నడవడానికి పచ్చనోటు ఉండాల్సిందే. డబ్బును బట్టే మనిషికి గౌరవం. వారి మాటకు విలువ. నిత్యావసరాలు తీరడానికి డబ్బే ముఖ్యం. డబ్బుంటే అందరికీ బంధువవతారు. లేని బంధాలు గుర్తొస్తాయి. ప్రభుత్వాలు నిలవాలన్నా, కూలాలన్నా డబ్బే. నువ్వు వస్తావని సినిమాలో డబ్బు గూర్చిన కవిత

"రైలుబండిని నడిపేది పచ్చజెండాలే /బ్రతుకుబండిని నడిపేది పచ్చనోటులే తళ తళ మెరిసే నోటు తీర్చును లోటు పెళ పెళలాడే నోటు పెంచును వెయిటు / డబ్బుంటే గౌరవం పెరుగుతుందని డబ్బుంటే సుబ్బిగాడినే సుబ్బారావుగారంటారు / ధనముంటే అప్పలమ్మనే అప్సరసని పొగిడేస్తారు.

....... / నోటే ఉంటే మాటకు బలమొస్తుంది......

ఏ పార్టీకి చెందని డబ్బు ప్రభుత్వాన్ని పడగొడుతుంది..... /డబ్బుంటేనే మనిషికి ఖానా పీనా చేతినిండా సొమ్ముంటే...... /ఊరినిండా చుట్టాలే " మనీ సినిమాలో డబ్బును గూర్చి

"చక్రవర్తికి వీధి బిచ్చగత్తెకి /బంధువవుతానని అంది మనీ మనీ 'అమ్మ చుట్టమూ కాదు అయ్యచుట్టమూ కాదు /బన అన్నీ అంది మనీ మనీ పచ్చనోటుతో లైఫ్ లక్ష లింకులు పెట్టుకుంటుందని /అంది మనీ మనీ పుట్టడానికీ పాడె కట్టడానికీ మధ్య /అంతా తానే అంది మనీ మనీ"

గాంధీ నిస్వార్థంతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వ్యక్తి. రెండువందల సంవత్సరాల మన యాతనను పోగొట్టి, భరతమాత తలరాతను మార్చిన వ్యక్తి గాంధీ. మన భారతీయులందర్నీ ఏకతాటిపైకి తెచ్చి ఉప్పు సత్యాగ్రహమైనా, స్వదేశీ ఉద్యమమైనా, క్విట్ఇండియా ఉద్యమమైనా బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింసతో గజగజలాడించిన వ్యక్తి. మనందరికీ పెద్ద దిక్కై స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపిన వ్యక్తి. నూలు వడుకుతూ ఆ నూలుతోనే మదపుటేనుగుల్లాంటి ఆంగ్లేయుల్ని బంధించిన మన జాతిపిత గాంధీ. అయితే ఇప్పుడు ఆ పేరును వ్యక్తులు రకరకాలుగా వాడుకుంటున్నారు. వీధులకూ పెడుతున్నారు. మహాత్మ సినిమాలో గాంధీ గారి గురించి రాసిన కవిత.

"కొంతమంది సొంత పేరు కాదురా గాంధీ / ఊరికొక్క వీధిపేరు కాదురా గాంధీ భరతమాత తలరాతను మార్చిన విధాతర గాంధీ /తరతరాల యమ యాతన తీర్చిన వరదాతర గాంధీ

గుప్పెడు ఉప్పును పోగేసి / నిప్పుల ఉప్పెనగ చేసి దండి యాత్రని దండయాత్రగా / ముందుకు నడిపిన అధినేత ..../ చరకా యంత్రం చూపించి / స్వదేశీ సూత్రం నేర్పించి నూలుపోగుతో మదపుటేనుగుల / బంధించాడురా జాతిపిత"

దేశంలో మనందరం హాయిగా నిద్రపోగలుగుతున్నామంటే మనందర్నీ కాసే సైన్యం దేశ సరిహద్దున కంచెలా బలంగా కాపలా ఉండబట్టే. వారు నిద్రాహారాలు మాని, తల్లిదండ్రులు, భార్యా పిల్లల బంధాల్నీ, భయాన్నీ వదిలి, ప్రతి నిముషం కొత్తగా పుడుతూ మనందర్నీ కంటికి రెప్పలా కాపాడుతూ మన జాతి గౌరవాన్ని పెంచుతున్నారు. నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా సినిమాలో సైనికుడి గొప్పతనం గూర్చిన కవిత 'సరిహద్దున నువ్వు లేకుంటే /ఏ కనుపాప కంటినిండుగా నిద్రపోదురా నిలువెత్తున నిప్పుకంచెవై నువ్వుంటేనే "జాతి బావుటా ఎగురుతుందిరా పైకెగురుతుందిరా ...... /పస్తులు లెక్కపెట్టవే ఓ సైనికా /పుస్తెలు లక్ష్యపెట్టవే ఓ సైనికా గస్తీ దుస్తుల సాక్షిగా ఓ సైనికా /ప్రతిపూటా నీకో పుట్టుకే ఓ సైనికా"

మనిషి ఎప్పటికీ ఏకాకే. కరోనా ఈ విషయాన్ని కళ్ళముందు చూపించింది. అయినా మనిషి అంతా నాదేననుకుంటాడు. చక్రం సినిమాలో అన్న మాటలు ఎప్పటికీ అక్షర సత్యం. "జగమంత కుటుంబం నాది /ఏకాకి జీవితం నాది సంసార సాగరం నాదే /సన్యాసం శూన్యం నాదే"

నేటి యువత నిరుత్సాహంలో బ్రతికేస్తూ, చిన్న కష్టాన్ని కూడా భరించలేక ఆత్మహత్య చేసుకుంటోంది. అవకాశాల్ని అందిపుచ్చుకోలేకపోతోంది. గుండెధైర్యంతో బ్రతకలేకపోతోంది. అయితే వెలుగు చీకటులు, గెలుపోటములు సహజమని గ్రహించాలి. ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా ఎదగడానికే ప్రయత్నించాలి. గుండె ధైర్యంతో మంచి మార్గంలో ముందుకెళ్లి పదిమందికీ వెలుగును పంచాలి. ప్రతి విషయానికీ కన్నీరు కార్చడం కాదు. ఆ కన్నీటితో తమ కలల్ని సాకారం చేసుకోవాలి. నేనున్నాను సినిమాలోని కవిత "చీకటితో వెలుగే చెప్పెను నేనున్నానని / ఓటమితో గెలుపే చెప్పెను నేనున్నానని ./తగిలే రాళ్ళని పునాది చేసి ఎదగాలని తరిమే వాళ్ళని హితులుగా తలచి ముందుకెళ్లాలని /కన్నుల నీటిని కళల సాగుకై వాడుకోవాలని కాల్చే నిప్పుని ప్రమిదగా మలచి కాంతి పంచాలని /గుండెతో ధైర్యం చెప్పెను చూపుతో మార్గం చెప్పెను /అడుగుతో గమ్యం చెప్పెను"

జీవితం ఒక యుద్ధం. ఏ యుద్ధమైనా విజయం సాధించాలంటే ధైర్యం, పట్టుదల మనిషికి చాలా అవసరం. నేటి యువతకు అది మరీ అవసరం. పట్టుదలతో, ఇష్టంతో కష్టపడితే విజయాన్ని సాధించడం సులభం. యువత సరైన ధ్యేయాన్ని ఎంచుకుని వెనుకడుగే వేయకుండా, ధైర్యంగా, పంతంతో గమ్యంవైపు దూసుకుపోవాలి. ఏపనైనా ఇష్టంగా చేస్తే కష్టమనేదే ఉండదు. కష్టమనుకుంటే తేలికైన దూదికూడా బరువైపోతుంది. లక్ష్యంలేని బ్రతుకే దండగ. మందగా ఉంటే సరిపోదు. ఎంత కొండైనా కింద నిలబడి అమ్మో అనుకుంటే అడుగుకూడా వేయలేం. అడుగువెయ్యడానికి పూనుకుంటే ఎక్కేయగలం. నవ్విన వాళ్ళే నివ్వెరపోయేట్లు దిక్కులన్నీ జయించేట్లు మన పని మనం చేసుకుని ముందుకు దూసుకుపోవాలి. ఇది నిరుత్సాహ జీవితాన్ని గడుపుతున్న నేటి యువతకు ఓ గొప్ప సందేశం. సంబరం సినిమాలో పదరా సోదరా అంటూ సాగిన కవిత "పట్టుదలతో చేస్తే సమరం తప్పకుండా నీదే విజయం
కష్టపడితే రాదా ఫలితం ...... నీ ధైర్యం తోడై ఉండగా /ఏ సాయం కోసం చూడక నీ ధ్యేయం చూపే మార్గంలో /పోరా సూటిగా ఏనాడూ వెనుకడుగేయక /ఏ అడుగు తడబడనీయక నీ గమ్యం చేరేదాకా దూసుకుపోరా సోదరా ...... ఇష్టం ఉంటే చేదుకూడా తియ్యనే / కష్టం అంటే దూదికూడా భారమే లక్ష్యమంటూ లేని జన్మే దండగ /లక్షలాదిమంది లేరా మందగా పంతంపట్టి పోరాడందే / కోరిన వరాలు పొందలేవు కద /చేస్తూ ఉంటే ఏ పనైనా సాధ్యమే

చూస్తూ ఉంటే రోజులన్నీ శూన్యమే /ఒక్క అడుగు వేసి చూస్తే చాలురా ఎక్కలేని కొండనేది లేదురా /నవ్వేవాళ్ళు నివ్వెరపోగా దిక్కులు జయించి సాగిపోరా ......."

మనిషి జీవనాన్ని గురించి రాసినా, ఓంకారాన్ని గురించి రాసినా, డబ్బు గురించి రాసినా, భార్యా భర్తల బంధం గురించి రాసినా, మాతృత్వాన్ని గురించి రాసినా, సమాజం గురించి రాసినా, గాంధీ గురించి రాసినా, స్నేహం గురించి రాసినా, మనోధైర్యాన్ని, చైతన్యాన్ని, యువతలో ఉత్సాహాన్ని పెంచడానికి రాసినా కవితలన్నీ అద్భుతమే. ఇలా రాయడం సిరివెన్నెలగారికే సాధ్యం. సిరివెన్నెల గారు కెరటంలా ఎగిరిపడగలరు, మెరుపులా మెరవగలరు, మేఘంలా గర్జించగలరు. వెన్నెలనూ కురిపించగలరు, అమ్మలా ప్రేమను పంచగలరు, గురువులా దారి చూపగలరు.

**ఆధార గ్రంథాలు:-**

1. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు - డా॥ సి. నారాయణ రెడ్డి.
2. కదంబం (తెలుగు సాహిత్య ప్రక్రియలు రూపాలు) - సాగి కమలాకర శర్మ.
3. అంతర్జాలం

# పాస్టరల్ పొయిట్రీ – కృషీవలుడు కావ్యం

**డా. గోపవరం పద్మప్రియ**
తెలుగు అధ్యాపకులు
పి.ఆర్.ఆర్ & వి.యస్. ప్రభుత్వ కళాశాల
విడవలూరు(మం.),శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్.
చరవాణి సంఖ్య: 9177355538
**విద్యుల్లేఖ:**gopavaram.padmapriya@gmail.com

**స్థూల పరిచయం:** ఆధునిక కవితకు ప్రత్యేకతను అద్దిన కవులలో కవికోకిల దువ్వూరి రామిరెడ్డి గారొకరు. వీరి జీవితం సాహిత్యం రెండూ ప్రత్యేకతను సంతరించుకున్నవే. ఎనిమిదవ తరగతితోనే చదువు ఆపిన పండితులు. ఏ డిగ్రీ లేని బహు భాషా కోవిదుడు లో. కవిత్వ కళతో పాటు చిత్రకళను నేర్చుకున్న కళాకారుడు. 18 వ ఏట వరకు కవిత్వం అంటే ఏమిటో తెలియని అజ్ఞాని. పట్టుదలతో కవిత్వాన్ని నేర్చుకొని మధించి, కవిత్వ సీమలను ఏలిన కవితా మార్మిక జ్ఞానిగా నిలిచారు. వీరి ప్రతిరచన నూతన కవితా ఛాయాలను ఆవిష్కరించి, ఆధునిక తెలుగు సాహిత్యానికి స్ఫూర్తిని - నూతన కవిత మార్గాన్ని ఏర్పరచింది. వీరి రచనల్లో కృషివలుడు కావ్యం ఆధునిక తెలుగు కవితా సీమంతిని మెడలో మెరిసే నవ్య కావ్యమణి. ఆధునిక తెలుగు సాహిత్య ఒరవడిని నూతన మార్గం వైపు మళ్ళించిన కవితాహాలికుడు దువ్వూరి రామిరెడ్డి గారు. ఆ మార్గమే పాస్టరల్ పొయిట్రీ అని విశ్లేషకుల అభిప్రాయం. ఈ కృషీవలుడు కావ్యం పాస్టరల్కి చెందినదిగా ఈ కావ్య ఉపోద్ఘాతంలో కట్టమంచి రామలింగారెడ్డి గారు అభిప్రాయపడ్డారు.

**పాశ్చాత్య సాహిత్యం - పాస్టరల్ పొయిట్రి:** పాస్టరల్ కవిత్వం అనేది పాశ్చాత్య సాహిత్యంలో ఒక కవిత్వ విధానం. మానవునికి- ప్రకృతికి మధ్య గల సంబంధాన్ని వర్ణించేది. అందులోనూ గ్రామీణాంతర వృత్తుల జీవన విధానాన్ని వర్ణించేది పాస్టరల్ పొయిట్రి అని స్థూలంగా అభివర్ణించవచ్చు. ఈ కవిత్వం ఉనికిని గురించి పరిశీలిస్తే క్రీ. పూ. 3 శతాబ్దానికి చెందిన 'థియోక్రిటస్' అనే గ్రీకు కవి గొర్రెల కాపరుల జీవన విధానం గురించి రచించిన సాహిత్యం తర్వాత కాలంలో పాస్టరల్ కవిత్వంగా ప్రసిద్ధికెక్కింది. క్రీ. పూ. 1వ శతాబ్దానికి

చెందిన 'వర్జిల్' అనే రోమన్ కవి థియోక్రిటస్ ను అనుసరించారు. వీరు గ్రామీణ నగర జీవితాల మధ్య గల వ్యత్యాసాన్ని, సంఘర్షణాయుతమైన జీవితాన్ని వర్ణించారు.

16 వ శతాబ్దంలో 'ఎడ్వర్ స్పెన్సర్' ఈ విధానాన్ని ఆంగ్ల సాహిత్యానికి పరిచయంచేశారు. 1759 వ సంవత్సరంలో వెలువడిన 12 భాగాల 'షెపెర్డ్ క్యాలెండర్' పాస్టరల్ కవిత్వానికి చెందినది. ఈ స్పెన్సర్ ఎలిజిబెత్ యుగంలో ప్రసిద్ధి చెందిన పాస్టరల్ కవి. ఈ యుగంలోనే మరో ముఖ్యమైన కవి 'క్రిస్టఫర్ మార్లో'. ఈయన రచించిన'The Passionate Shepherd to his Love'అనే రచన ఈ విభాగానికి చెందినది. 18వ శతాబ్దంలో అలెగ్జాండర్ పోప్, 19వ శతాబ్దంలో విలియం వర్డ్స్ వర్త్ లాంటి వాళ్ళు పాస్టరల్ కవిత్వానికి చెందిన ప్రముఖ కవులు.

**తెలుగు సాహిత్యం - పాస్టరల్ పొయిట్రీ:** తెలుగు సాహిత్యంలో ఈ కవిత్వ విధానం కనిపించదా అంటే ప్రకృతిని చూసి పులకించని మానవుడు ఉండడు. ఆ బావ వేషాలను వర్ణించని కవీ ఉండడు. ఇలా చేసిన వర్ణనలన్నీ ఈ కోవలోనివే. అయితే ప్రత్యేకంగా తెలుగు విమర్శకులు గ్రామీణ వృత్తుల జీవన విధాన వర్ణన ఈ కోవకు చెందినదిగా భావించారు. తెలుగు సాహిత్యంలో ఈ విధమైన కవిత్వ విధానాన్ని గోపగీతాలని, గోప కవిత్వమని, గోపకావ్యాలని పిలిచారు. అయితే ఏ పదము దీనికి సమానార్థకం కాదని పండితుల అభిప్రాయం. డా. సి.నా.రె. ప్రకృతి కవిత్వ శాఖలో అంతర్విభాగమైన పల్లీయ ప్రకృతి చిత్రణ కవిత్వం పాస్టరల్ పొయిట్రీకి మారుగా వాడిన తెలుగు పదంగా భావించారు. కాల్పనిక కవిత యుగంలో వివిధ జీవన వృత్తుల గురించి రాసిన కవిత్వాన్ని ( చేపలు పట్టే వారు, గొల్లవారు, ఆలకాపరులు) pastoral poem అంటున్నారు. ఆధునిక సాహిత్యంలోనే కాదు ప్రాచీన సాహిత్యంలో వీటి ఆనవాళ్లు ఉన్నట్లు కవులు వర్ణించారు. కట్టమంచి రామలింగారెడ్డి గారు ఎర్రన హరివంశంలోని కృష్ణ లీలల వర్ణన, పోతన భాగవత దశమస్కంధంలోని కృష్ణ లీలల వర్ణనలో పాస్టరల్ పొయిట్రీతో సరిపోతాయని భావించారు.

కృషివలుడి మీద దువ్వూరి రామిరెడ్డి గారు రచించిన కావ్యం ఈ తెగలో ఉత్తమమైన కావ్యం. గోపకులను గురించి రాసిన కవిత్వం గోప కవిత్వం అయినట్లే కృషివలులను గురించిన కవిత్వం కృషివల కవిత్వం అవుతుందని శ్రీ కడియాల రామ్మోహన్ రాయ్ గారు పేర్కొన్నారు. దువ్వూరి వారి వనకుమారి కూడా ఈ కోపకు చెందినదే. ఈ కావ్య ప్రక్రియను గోపకావ్యమని డా. సి.నా.రె. పేరు పెట్టి పిలిచారు. దువ్వూరి వారితోపాటు కవికొండల వెంకటరావు, బసవరాజు అప్పారావు, అడవి బాపిరాజు, కొనకళ్ళ వెంకటరత్నం మొదలైన కవులు ఈ రకమైన కవితా ప్రయోగాలు చేశారు. ఏది ఏమైనా గోప శబ్దం పాస్టరల్ కు సమానార్థకంగా ఉపయోగించారు. అయితే ఇది వస్తు నిర్దేశాన్ని సూచిస్తుందే గాని, ప్రక్రియా విధానాన్ని నిర్దేశించదు. దీనికి కారణం మన కవులు వస్తువు పట్ల మాత్రమే ఆకర్షితులయ్యారు గాని ప్రక్రియా నిర్దేశం వైపు దృష్టి మరల్చలేదని అంగీకరించాల్సి ఉంటుంది.

**పాస్టరల్ పోయెట్రీ లక్షణాలు:**

పాశ్చాత్య ప్రాచ్య కవులు, పండితుల వివరణలు విశ్లేషణలను అనుసరించి ఈ క్రింది మూడింటిని పాస్టరల్ పొయిట్రీకి ప్రధాన లక్షణాలుగా గుర్తించవచ్చు.

1. గ్రామీణ ప్రకృతి చిత్రణ.
2. గ్రామీణాంతర వృత్తుల జీవన చిత్రణ.
3. గ్రామీణ నగర జీవన వ్యత్యాస/సంఘర్షణల చిత్రణ.

దువ్వూరి రామిరెడ్డి రచించిన కృషివలుడి కావ్యంలో ఈ లక్షణాలన్నీ ప్రతిబింబిస్తున్నాయి.

**గ్రామీణ జీవన ,ప్రకృతి చిత్రణ:** గ్రామీణ జీవన చిత్రణ: ఈ కావ్యంలో గ్రామీణ జీవనం చక్కగా చిత్రించబడినది. నీళ్ళకొరకు సరస్సుకు వెళ్ళు స్త్రీల నూపుర రావాలు,ప్రభాత సమయంలో పిల్లల ముద్దు మాటలు, ఊ,ఊ, రాగాలు, ఆలమందను ఉదయమే బీళ్ళకు

మేతకోసం తోలడం, తల్లి ఆవుకోసం లేగదూడలు పలుపులు లాగుకొంటూ అంబా,అంబా అని అరవడం, పొదుగు నిండా పాలుచేపి దూడకోరకు తరిపి పెయ్య దొడ్డి గోడ దాటుట , కడుపునిండగా అన్నము పెరుగు తిని తమ్ముకుర్రడు దొడ్డినుండి పారిపోయిన దూడలను అమ్మలదగ్గరకు వెళ్ళకుండా కట్టివేయడం , ఉదయమే లేచి కాంతలు ఇంటి ముందు వైకుంఠ వాకిళ్ళు వేయడం, వాటిని గొబ్బిపూలతో అలంకరించడం , వాటిపై పసుపు,కుంకాలను చల్లడం, కాపులు పోలాలకేగడం మొదలైన వర్ణలు గ్రామీణ వ్యవసాయదారుడి ఇంటి నేపథ్యాన్ని రచయత మన కళ్ళముందుంచాడు.

వేకువనెలేచివైకుంఠవాకిళులను
ముంగిటరచించిగుమ్మడిపూలతోడ
గొబ్బిముద్దలనిలిపికుంకుమనుజల్లె
నీయనుంగుకూఁతురు;గాంచుమోయిసొబగు.(కృషీవలుడు19వపద్యం).

**ప్రకృతి చిత్రణ:** పాస్టరల్ పొయిట్రీ కవిత్వ లక్షణాలలో పల్లీయ ప్రకృతి వర్ణన ప్రముఖమైనది. కవి, చిత్రకారుడు, తాత్వికుడు అయిన దువ్వూరి రామిరెడ్డి ప్రకృతిని విలక్షణ దృష్టితో చూసి కవిత్వీకరించాడు. ప్రకృతిని మానవీకరించేందుకు ప్రకృతిలో సముచిత స్థానంలో మానవుని నిలిపేందుకు కాపు వారి బ్రతుకును వర్ణించే నెపాన గ్రామీణ మహాత్మ్యాన్ని వర్ణించారు అని K.V. రమణారెడ్డి వ్యాఖ్యానించారు. గ్రామీణుల రోజు కోడికూతతోనే మొదవుతుంది. వీరికి ప్రేత్యేక అలారాలు, గడియారాలు అక్కరలేదు. ప్రకృతే వీరికి పెద్ద గడియారం. అందులోని మార్పులే వీరికి అలారాలు. అందుకే ఈ కావ్యం కుడా కోడికూతతోనే ఆరంభమవుతుంది.

సమయమమూల్య,మొక్కనిమిషంబువృథాచనఁగ్రమ్మఱింపనే
రము;మనయాయువాత్రుటిపరంపరయౌటనెఱింగి,నిద్రమాం
ద్యమునుదొలంగిమీపనులనారయుఁడోజనులారయంచుడం
బముగమెడన్నిగిడ్చి కృకవాకము గూసెడి నింటికొప్పునన్. (కృషీవలుడు1వ పద్యం)

కృషీవలుడి కావ్యములో వర్ణించబడిన ప్రకృతి యంతా పొలాలకు సంబందించినదే, పొలాల గనాలపై గడ్డిచుట్టూ అల్లుకున్న సాలెగూళ్ళు , వానిపై మంచుకాలములో మంచు పడి ,సూర్య కాంతికి అవి ముత్యాల్లా మెరిసిపోతున్నాయని మనోహరంగా వర్ణించారు.

గనిమల తుంగకున్ గఱికకాడల కల్లిన సాలెగూళ్ళ స
న్నని పటికంపుమంచు పడి నాణెపు ముత్తెసరాల పోలికం
గనుఁగొన రమ్యమయ్యె రవికాంతులఁ దేలుచు, నిట్టి భావమో హనపు నిసర్గ
శిల్పముల, హాలిక, త్రొక్కక దాఁటిపొమ్మిఁకన్. (కృషీవలుడు 20వ పద్యం).

గాలికి కదులుచున్న వరిచేలు తరంగం వలె , అందులోని కొంగల రెక్కలల్లార్పులు నురగవలె ఉన్నయి. పొలం మధ్య చెట్లు గాలికి ఊగుతూ ఓడల్లా ఉన్నాయని, మొత్తానికి కేదారం పచ్చని సముద్రాన్ని తలపిస్తూ నేత్రానందంగా ఉన్నదని కవి వర్ణించారు.

కుసుమ లతావళీ వలిత కుంజములుం, గిసల ప్రకాండముల్
వనరులు గ్రక్కు వృక్షముల బాల తృణంబుల జేల గట్లు సొం
పెసగ సమస్త రత్నముల నేరిచి గుర్చిన రాలబిళ్ళలన్
వసుధ కమర్చిరో కృపికవర్యులనన్ వరిమళ్లు శోభిలున్ (కృషీవలుడు 81వ పద్యం)

**గ్రామీణాంతర వృత్తుల జీవన చిత్రణ:** పాస్టర్ పోయెట్రీ లక్షణాలు ప్రముఖమైనది గ్రామీణ వృత్తుల జీవన చిత్రణ. ఈ కావ్యంలో ప్రస్తావించబడిన వృత్తి వ్యవసాయం. వ్యవసాయాన్ని ఆశ్రయించి జీవనాన్ని సాగించే కాపు వాడి జీవన విధానాన్ని సూక్ష్మాతి సూక్ష్మంగా కవిత్వీకరించాడు. నిద్రలేచినది మొదలు పొద్దు గూకే వరకు రైతు చేసే పనులను, రైతు ఇళ్లల్లో జరిగే చర్యలను ఈ కావ్యం రికార్డు చేసిందనవచ్చు. ఒక విధంగా ఇది రైతు డైరీగా

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

ఆవిష్కరించ వచ్చు.పొద్దున లేవడం, పాలు పితకడం, పశువులను పొలాలకు తోలడం, కావడి మోయడం పొలానికి వెళ్ళడం, దున్నడం, తండ్రికి సాయం చేయడం సంధ్య వేలకు ఇల్లు చేరడం వీరి జీవితలోని ప్రతి అంశాన్ని వర్ణించారు. వీరి జీవితం, వృత్తి రెండూ పెనవేసుకుని విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉంటాయి. ప్రపంచానికి వీరి ఆవశ్యకతను, దేశ సౌబాగ్యతకు వీరు చిహ్నాలు ఆ విషయాన్ని స్పష్టీకరించారు.

మానవలోకపు కడుపు నింపే అన్నపూర్ణలు ఈ రైతులు వారికీ ఉన్నా లేకున్నా ఇతరుల ఆకలిని తీర్చి త్రుప్తితో జీవనం సాగించే కృషీవలుని జీవితం మానవాళికి ఆదర్శం.

ఉండితిన్నను లేక పస్తున్న గాని
యాసచేయవు పరుల కష్టార్జితంబు
నాకలెత్తగ నీపంచ కరుగు నతిథి
తినక,త్రావక,పోయిన దినము లేదు (కృషీవలుడు 68వ పద్యం)

**శ్రమతత్త్వం:** గ్రామీణ వృత్తుల్లో శ్రమ అనేది ప్రముఖ స్థానాన్ని వహిస్తుంది అమాయక గ్రామీణ శ్రమజీవులు శ్రమించకపోతే ప్రపంచమే స్తంభించిపోతుంది. అందుకే " నిద్ర మాంద్యమును దొలంగి మీ పనుల నారయుడు జనులారా" అని శ్రీ రామిరెడ్డి గారు కష్టజీవులను మేలుకొలిపోయారు అనుదనం అనుక్షణం పరిశ్రమలు లేకుంటే జానడు మూరెడు నేల చెమటతో తడవకుంటే సస్య సంపత్తి నాస్తి .అందుకే దువ్వూరి వారు ఇలా అంటారు.

శ్రమలు లేకయే ఫలములు దుమకబోవు
పిండి కొలదియె రొట్టె; ఓపిక విధాన
గష్టపడుము కృషీవలా,గలుగు సుఖము
ఉత్తమాసలకన్ని మేలు ద్వయంబు

కాయ కష్టంతో అవమానపడవలసిందేమీ లేదు కృషి అన్ని వృత్తులను పావనం చేస్తుంది. ఇది లేకుంటే పరిశ్రమలు ఎక్కడివి పరిశ్రమలు లేకుంటే వాణిజ్యం వాణిజ్యం లేకుంటే సంపదలు సంపదలు లేకపోతే భోగాలు ఎట్లా వస్తాయి కాబట్టి సమాజం నిరాటంకంగా నడవడానికి సౌభాగ్య సౌఖ్యాలకు కృషివంటే మూలవిరాట్ అన్న అభిప్రాయం దువ్వూరి వారిది..

కృషి సకల పరిశ్రమలకు గీలుచీల
సత్పరిశ్రమ వాణిజ్య సాధనంబు
అఖిల వానిజ్యములు సిరికాటపట్లు
సిరియే భోగోపలబ్ధికి జీవగఱ్ఱ (కృషీవలుడు 69 వ పద్యం)
కావున గృషీవలా, నీవె కారణమవు
సాంఘికోత్కృష్ట సౌభాగ్య సౌఖ్యములకు (కృషీవలుడు 70 వ పద్యం)

**స్త్రీ శ్రమ సౌందర్యం:** గ్రామీణ ఉపాధి వృత్తుల్లో శ్రమ, స్త్రీ భాగస్వామ్యతలు లేకుండా అవి ఫలవంతంగావన్న సత్యం ఈ కావ్యంలో కన్పిస్తుంది. వీటి ప్రాధాన్యతను పరిశీలించాల్సిన ఆవశ్యకత కలదు. కాపు వాని కాయ కష్టానికి తోడు నిలిచే స్త్రీ శ్రమను రెండు వర్గాలు చేసి చూడవచ్చు గృహంలోని

కాపుటిల్లాళ్ళు
పొలం వెంట నడిచే మాలతలు.

**కాపుటిల్లాళ్లు**: కృషీవలుడి కావ్యం లో కవి కాపు వాని పై కంటే వారి స్త్రీల పట్ల ఎక్కువ సానుభూతిని కనబరిచారు. భర్త భూమికి బానిసైతే,భార్య బానిసకు బానిసగా కనిపిస్తుంది. నిద్రలేచినది మొదలు ఎడతెగని చాకిరి చేస్తూ అత్త ఆడపడుచుల సూటి పోటీ మాటలు పడుతూ ఇంటిని చక్కబెడుతూ మరోవైపు భర్త మనసును తెలుసుకొని మసులుకుంటుంది. స్త్రీ కష్టాన్ని చూసి సాయం చేయడం అవమానం కాదన్నా పురుషుని సహాయాన్ని

ప్రోత్సహిస్తున్నారు దువ్వూరి వారు ఇంటి పనులతో వంటపనులతో స్త్రీకు ఆటవిడుపు లేదన్న సత్యాన్ని దువ్వూరి వక్కాణించారు స్త్రీని ప్రకృతి మాత ముద్దుబిడ్డగా అంశాల సంసారాన్ని గుట్టుగా నడిపే ఇల్లాల గొప్పతనాన్ని చక్కగా వర్ణించారు.

మగనికి బిడ్డలకు బెట్టి మిగిలియున్న
యింత దాదిని బిక్షునకిడు పురాద్రి
శాంతి నీతియు నురు కష్ట సహన శక్తి
నెవరెరుంగద రంతటి యింతి దక్క (కృషీవలుడు101 వ పద్యం)

అంతేగాక గృహ కృత్యాలలో మునిగి ఉన్న స్త్రీ సరైన అలంకారాలు లేక దువ్వు కొనుటకు తీరిక కూడా ఉండదు 360 దినములు ఆమెకు పని లేని నిమిషం అన్నది కనిపించదు. స్త్రీ ప్రకృతిని బలిపెట్ట లని ఒక కాపుటిల్లాలికే చెల్లి నది

మున్నూటరువది దినముల
నెన్నండును గననశక్య మేపనియును లే
కున్న నిమేషము; కాపు
గన్నియ , నీ కాటవిడుపు కాలము లేదే (కృషీవలుడు 29వ పద్యం)

త్యాగమునకైనా నొక హద్దు దగును గాని
శలభమట్టుల నాత్మ నాశనము మేలే
పొలతికి సతీత్వ సౌందర్యములు రెండు
బ్రార్ధనయ వరంబులై పరుగుగాదె (కృషీవలుడు 32వ పద్యం).

**మాలతులు:** గ్రామీణ జీవన విధానంలో పురుషుడికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో, స్త్రీకి అంతే ప్రాధాన్యత ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ వృత్తుల్లో వీరి పాత్ర లేనిదే ఆ పని సంపూర్ణం గాదు. ముఖ్యంగా చేనేత, వ్యవసాయం లాంటి వృత్తుల్లో స్త్రీ భాగస్వామ్యత తప్పనిసరి. ఇంటి పనులతో పాటు ఉపాధిలోను వీరి తోడ్పాటు ఎంతో అవసరం. నేటికీ నారు నాటడం, కలుపు తీయడం లాంటి పనులను స్త్రీలు మాత్రమే చేస్తున్నారు. దువ్వూరి వారు పొలాలకేగు పల్లె పడుచుల ఆహార్యాన్ని, ముగ్ధ సౌందర్యాన్ని, నిష్కపటత్వాన్ని, గడుసుదనాన్ని చక్కగా వర్ణించారు.

వ్రాలిన కొప్పులోపలి పూల రేకులు - సడలి యొక్కొక్కటి జారుచుండా
బరువంపు రొమ్ముపై బయ్యెద చినుగుళ్ళు - గాలికి నట్టిట్టు కదలియాడ
నెలుగెత్తి పాడెడి యేలలు విని బాటసారి లెకసెక్కము సలుపుచుండ
దమ్ముల పుంబూత దవిలిన వాతెరపై బలుచాలు నవ్వదే నవ్వ
చేతి కొడవలి ఝుళపుచు జిన్నెలాడి
కన్నె మాలెత పిడిచుట్టి మున్న మున్న
మునుపు తరిగెడి నింటికి బోవు వేళ
సందె డోదె యాలేవె కర్షక కుమార (కృషీవలుడు 24 వ పద్యం)

**గ్రామీణ నగర వ్యత్యాస చిత్రణ:** గ్రామాలు ప్రకృతి చే సృష్టించబడితే నగరాలు మనిషి చేత నిర్మించబడ్డాయి. ప్రకృతికి మనిషికి ఎంత దగ్గరతనముంటే అంత మంచిది. మానసిక శారీరక ఆరోగ్యం అంత చక్కగా ఉంటుంది. గ్రామాల మీద నగరాల దండయాత్ర ప్రారంభంగాని తొలి రోజుల్లో ప్రశాంతమైన పల్లె వాతావరణంలో తన జీవితాన్ని గడిపిన కవి శ్రేష్ఠుడు దువ్వూరి వారు. అందుకే ఆయన కృషీవలుడి కావ్యంలో గ్రామాలపై ఆయనకున్న మక్కువను, నగరాలపై తన విముఖతను తెలియజేశాడు. గ్రామీణ భూ వ్యవస్థ తృప్తికి రూపం అయితే, నగర ధన వ్యవస్థ తృష్ణకు మూలమనె అభిప్రాయాన్ని దువ్వూరి వారు వ్యక్తం చేశారు.గ్రామీణుల స్వచ్ఛమైన మనసు, వలపు సుఖ భోగాలను ఇస్తాయన్నారు. పట్టణ వాసుల శుష్కభావాలు అంత హాయిని ఇవ్వవని వీరి వాదన.

గ్రామ వాసులు కిట్టి నిష్కైత వంపు

ముగ్ధ పరితోషములు సుఖ భోగ్యములకు
బట్టణ నివాసకుల శుష్కభావములను
నిట్టి సామాజికానంద మెసగగలదే (కృషీవలుడు 22 వ పద్యం)
సాంఘిక, సౌభాగ్యాలకు గ్రామాలు పట్టుగొమ్మలు. నవ్య పాశ్చాత్య సభ్యత నగరాల మీదగా పల్లెలపై దాడి చేయడం వల్ల తరతరాలుగా వస్తున్న గ్రామ పద్ధతులు నాశనమవుతున్నాయి. గ్రామపంచాయతీలు, వీధిబడులు,ఒద్దిక నిష్కపటత్వం వంటి సలక్షణాలు మరుగున పడుతున్నాయి. సహకార వృత్తులు సత్య జీవనము, విశ్వాసము, భక్తి ,ఐకమత్యము అన్ని నాశనమై; బూటకములు, కుయుక్తులు, మోసగాళ్లు, కోర్టువ్యాజ్యాలు, ఫోర్జరీలు, కూటమైత్రి, స్వార్థపరత, గర్వ ప్రవృత్తి మొదలైనవి ఆక్రమిస్తున్నాయని దువ్వూరి వారు ఆవేదన చెందారు.ఈ మార్పును ఈ సంఘర్షణను కృషివలుడి కావ్యంలో (కృషీవలుడు105,106 వ పద్యం) స్పష్టంగా చిత్రించారు.
నగర ప్రపంచం పంచాయతీ సభలు వీధి బడులు
నవ్య పాశ్చాత్య సభ్యత నాగ
పల్లె లందు సస్పష్ట రూపము దాల్చి
సన్మానితములైన గ్రామ పద్ధతులను విముకుత్సాహం కొంత కలుగజేసి (కృషీవలుడు 105వ పద్యం)

**ముగింపు:** దువ్వూరి వారి కావ్యం పాస్టరల్ పొయిట్రీకి సాదృశ్యంగా ఉందని చర్చించాం. అయితే దువ్వూరి వారు పాశ్చాత్య పాస్టరల్ పొయిట్రీని చదివి ఇది రచించారా అంటే కాదని సమాధానం చెప్పుకోవాలి. భారతీయ సాహిత్యంలో వృత్తి జీవన చిత్రణ మనకు అక్కడక్కడ కనిపిస్తునే ఉంది. చేనేత సాహిత్యం ఇందులో బాగా కనిపిస్తుంది అయితే ఇవన్నీ వాటిని పోలి ఉన్నాయి కానీ పాస్టరల్ పోయిట్రీకి అనుసరణలుగా చెప్పుకోలేనము. దువ్వూరి వారి కృషీవలుడు స్వతంత్ర కావ్యం అది దేని అనుసరణ కాదు నగర జీవనము,.పారిశ్రామిక వ్యవస్థ ప్రారంభ దశలో ఉన్నప్పుడు; గ్రామాలమీద నగరాల ప్రారంభమైన తొలిరోజుల్లో ఒక కుగ్రామములో ప్రశాంత జీవనం గడిపిన దువ్వూరి వారి హృదయ స్పందనే ఈ కావ్యం.వీరి కావ్యంలో గ్రామీణ తత్త్వంతో పాటు కర్షకులకు నైతిక కర్త్వ్యప దేశము చేస్తూ పరిష్కార మార్గాలను చూపించారు. తదనంతర కాలంలో కృషివలుడు కావ్యాన్ని అనుసరించి అనేక రచనలు వెలువడ్డాయి. కొప్పరపు దుర్గాప్రసాద్ రావు గారు '**కర్షకుడు**' అనే కావ్యాన్ని,కొండవీటి వెంకయ్యగారు కర్షకా అనుగ్రందాన్ని , పెద్దిబోయిన ప్రసాదరావు గారు రైతు గీతాలను , శ్రీ గంగుల శాయి రెడ్డి కాపుబిడ్డ మొదలైన రచనలు వెలువడ్డాయి.పై రచనలన్నీ రైతుల దయనీయ స్థితిని చిత్రించినవే.అందులో ఉత్తమోత్తమ రచనగా నేటికీ కృషీవలుడు కావ్యమే నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు:**

1.ఆరుద్ర, సమగ్ర ఆంధ్రసాహిత్యం, నాలుగవ సంపుటి, పునర్ముద్రణ,తెలుగు అకాడమి, హైదరాబాద్, 2017.
2.నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ సంపుటం, 6వ ముద్రణ, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి, 2009.
3.నారాయణ రెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు, 8వ ముద్రణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 2015.
4.రామమోహన రాయ్, కడియాల. తెలుగు కవితా వికాసం,
5.రామిరెడ్డి, దువ్వూరి. కృషీవలుడు, ద్వితీయ సంస్కరణము, సరస్వతీ భాండారము వారి ప్రకటితం, 1924.

6.దువ్వూరి రామిరెడ్డి రచనలు – ఒక పరిశీలన - ముప్పాళ్ళ వెంకట శివప్రసాద రావు ,శ్రీ పతి ప్రెస్,కాకినాడ ,1985

# అభ్యుదయ కవి శ్రీశ్రీ - నవ్య కవిత్వం

**డా॥ గుంటుపల్లి గౌరి**, లెక్చరర్
ఎస్.కె.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాచర్ల, పల్నాడు జిల్లా.

**ఉపోద్ఘాతం:** మానవుడే నా సందేశం. మనుష్యుడే నా సంగీతం' అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ. ఎప్పుడు పుట్టాడన్నది వివాదాంశంగానే ఉంది. 15-4-1910 అని కొందరూ, 30-4-1910 అని మరి కొందరు భావిస్తున్నారు. శ్రీశ్రీ మాత్రం తాను 2-1-1910న జన్మించినట్లు చెప్పుకున్నాడు. 1910 విశాఖపట్నంలో శ్రీశ్రీ జన్మించాడన్నది నిర్వివాదం. అప్పన్నకొండ, వెంకట రమణయ్యలు వీరి తల్లిదండ్రులు. వీరి ఇంటిపేరు పూడిపెద్ది శ్రీరంగం సూర్యనారాయణకు శ్రీనివాసరావుని దత్తత ఇచ్చినందువల్ల ఇతని ఇంటిపేరు పూడిపెద్దికి బదులు శ్రీరంగంగా మారింది. శ్రీనివాసరావు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. శ్రీనివాసరావుకు సుభద్రమ్మ మారుతల్లి అయింది. మారుతల్లి శ్రీనివాసరావుపై అవ్యాజమైన ప్రేమాభిమానాలు కలిగుండేది. శ్రీనివాసరావు చిన్నప్పటి నుండి పెద్ద ఆరోగ్యవంతుడు కాదు. శ్రీనివాసరావు నుదుటన చుట్టతో కాల్చిన గుర్తు ఉండేది. ఎనిమిది సంవత్సరాల వయసులోనే శ్రీనివాసరావు కందపద్యం రాశాడు. 18వ ఏట 'ప్రభవ' కావ్యం వెలువరించాడు. కాల్పనికోద్యమ ప్రభావంతో రాసిన 'ప్రభవ'ను మారుతల్లి సుభద్రమ్మకు అంకితం చేశాడు. 1920లో ఆరో తరగతి చదువుకుంటున్న రోజుల్లో 'వీరసింహ విజయసింహ' అనే నవల రాసినట్లు చెప్పుకున్నాడు. తల్లిలేకపోయినందున తండ్రి ప్రేమతో పెంచాడు. బాల్యం హాయిగా గడిచిపోయింది. 1925 లో పాఠశాల విద్య పూర్తిచేశాడు. అదే సంవత్సరం ఆయన పెళ్ళి జరిగింది. అప్పుడే ఆయన 'పరిణయ రహస్యం' నవల రాసి ప్రచురించాడు. 1928-31 సంవత్సరాల మధ్య మద్రాసులో బి.ఏ. చదివాడు. 1930లో టైఫాయిడ్ జ్వరంతో రెండు నెలలు మంచం పట్టాడు. 1930 ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం సంభవించిన రోజులు.

ప్రపంచ సాహిత్య అధ్యయనం వల్ల శ్రీశ్రీ ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. అప్పుడే, కవిత్వానికి గణబద్ధ ఛందస్సు అవసరం లేదనే భావన కలిగిందీ ఆ రోజుల్లోనే. ప్రపంచ దేశాల కవులను చదవడం వల్ల ఆయన సృజనాత్మకత విస్తరించిందీ ఆ రోజుల్లోనే. Hungry thirties లో శ్రీనివాసరావు మానసికంగా, భౌతికంగా, ఆర్థికంగా చెప్పనలవి కానన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా ఖరగ్పూర్ కలకత్తా రైలుమార్గం మీద ఇరవైమైళ్ళు నడవవలసి వచ్చింది. ఆ రోజుల్లోనే ఆయన మహాకావ్యం అయిన 'మహాప్రస్థానం'లోని చాలా గేయాలు రూపుదిద్దు కొన్నాయి. బతకడం కోసం స్వంత ఇల్లు అమ్ముకోవలసివచ్చింది. 1931లో కొద్దికాలం విశాఖ హార్బర్లో 'టైంకీపర్'గా, 'వెయింగ్ క్లర్క్ 'గా

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

పనిచేశాడు. మిసెస్ ఎ.వి.యన్. కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో డిమాన్ స్ట్రేటర్ గా పనిచేశాడు. బతుకు తెరువుకోసం 'విశాఖ', 'ఆంధ్రప్రభ', 'ఆనందవాణి' వంటి పత్రికల్లో సబ్ ఎడిటర్గా పనిచేశాడు. ఆలిండియా రేడియోలో పనిచేశాడు. నైజాం కొలువులో పనిచేశాడు. స్వతంత్ర భావాలు కలిగున్న కారణంగా ఎందులోనూ ఎక్కువకాలం కొనసాగలేపోయాడు. చివరగా సినిమారంగంలో స్థిరపడ్డాడు.

1926లో పురిపండా అప్పలస్వామి, వడ్డాది సీతారామాంజనేయులుతో కలిసి 'కవితా సమితి'ని స్థాపించాడు. 1933లో బరంపురంలో జరిగిన అఖిలాంధ్ర కవి పండిత సభలో పాల్గొన్నాడు. 1934 నాటికి ఆయన మహాప్రస్థాన గేయాలు చాలా వరకు వెలుగు చూశాయి. ప్రసిద్ధుల దృష్టిని ఆకర్షించాయి. 1935 నాటికి శ్రీశ్రీ ఒక ప్రత్యేక స్థానాన్ని సాహిత్యలోకంలో సంపాయించుకొన్నాడు. 1937లో మహాపండితుడు, విమర్శకుడు 'ఉదయని' సంపాదకుడు, శ్రీశ్రీ ఆప్తమిత్రుడు అయిన కొంపెల్ల జనార్ధనరావు అస్తమించడంతో శ్రీశ్రీ తన మహాప్రస్థానాన్ని కొంపెల్లకు అంకితం చేశాడు. ఆ సంవత్సరమే సుప్రసిద్ధ నవలా రచయిత గుడిపాటి వెంకటాచలంతో పరిచయం ఏర్పడింది. చివరకు చలం శ్రీశ్రీ అభిమానయ్యాడు. ఉద్యోగవేటలో అలహాబాద్, కలకత్తా, విజయనగరం, విశాఖపట్నం ఇలా ఎన్నో నగరాలు, పట్టణాలు పట్టుకు తిరగాల్సివచ్చింది. కమ్యూనిస్టు భావాలు కలిగున్నందువల్ల ఎన్నో ఉద్యోగాలు పోగొట్టుకున్నాడు. అరసం అధ్యక్షుడయ్యాడు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన కొత్త కవితా ధోరణులకి ఆహ్వానం పలికాడు. ఎందరెందరో కవుల్ని అనువదించాడు.

పురిపండా అప్పలస్వామి, కొంపెల్ల జనార్ధనరావు, అబ్బూరి రామకృష్ణారావు గార్ల పరిచయ స్నేహాలు శ్రీశ్రీ ఆలోచనా విధానంలో పెద్ద మార్పులు తెచ్చాయి. 1935 తర్వాత కలం పట్టిన యువకులందరికీ శ్రీశ్రీ మార్గదర్శి అయ్యాడు. 1970 నాటికి అరసంతో తనకున్న బంధాలు తెంచుకొని అనేక వాదోపవాదాల మధ్య విరసం అధ్యక్ష పదవిని చేపట్టాడు. 1977లో విరసం అధ్యక్ష పదవి నుంచి వైదొలిగాడు. శ్రీశ్రీ అభిప్రాయాల్లో, ఆలోచనల్లో, ప్రవర్తనలో చాలా మార్పులు కనిపించేవి. చాలా వివాదాస్పద రచయితగా ముద్రపడ్డాడు. ప్రపంచ కవులైన స్పెండర్, ఆడెన్, ఏలన్పో, బాద్లేర్, స్విన్బర్న్ మొదలైన వారి ప్రభావంతో 1930 నాటి ఆర్థికమాంద్య ప్రభావంతో, స్పానిష్ అంతర్యుద్ధాల ప్రభావంతో తన కవిత్వం మెరుగులు తీరిందని, తన ప్రాపంచిక దృక్పథం విస్తరించిందని చెప్పుకున్నారు. అమెరికా, రష్యా, చైనా, లండన్ దేశాల ఆహ్వానంపై ఆ దేశాలు వెళ్ళి అక్కడి కవులను కలసి సాహిత్య చర్చలు జరిపి వచ్చాడు. 1930 దాక తెలుగు కవిత్వం తనని నడిపిస్తే, ఆ తర్వాత తెలుగు కవిత్వాన్ని తానే నడిపించానని... 'ఈ శతాబ్దం' తనదేనని సగర్వంగా చెప్పుకున్నాడు. 1950లో 'మహాప్రస్థానం' వెలువడింది. అందులోని చలం యోగ్యతాపత్రం సాహిత్యలోకంలో సంచలనం రేపింది. శ్రీశ్రీ ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయాడు. శ్రీశ్రీ యువకవులకు ఆరాధ్యుడై పోయాడు. ఆ కాలములో కలంపట్టిన వారెవరూ శ్రీశ్రీ ప్రభావం నుంచి తప్పించుకోలేక పోయారు. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వశక్తిగా మహాప్రస్థాన కావ్య సంపుటిని చలం కీర్తించాడు. ప్రపంచపు బాధ శ్రీశ్రీ బాధగా పేర్కొన్నాడు. ఈ వృద్ధ ప్రపంచానికి నెత్తురు కన్నీళ్ళతో తయారు చేయబడ్డ కొత్త టానిక్ గా మహాప్రస్థానాన్ని గుర్తించాడు. ఈ శతాబ్ది మధ్యకాలానికి (20వ శతాబ్దం) శ్రీశ్రీ మహాకవిగా గుర్తింపు పొందాడు.

శ్రీశ్రీ రచనలుగా పాతిక పైగా గ్రంథాలు వున్నా - శ్రీశ్రీ పేరెత్తగానే గుర్తుకు వచ్చేవి ముఖ్యంగా మహాప్రస్థానం, మరో ప్రస్థానం, ఖడ్గసృష్టి, మరో ప్రపంచం, మహాప్రస్థానం (లండన్ ప్రతి) సిప్రాలి, అనంతం, వ్యూలు రివ్యూలు, మూడు యాభైలు, రాత్రి, ప్రభవ..... మొదలైనవి. శ్రీశ్రీ సాహితీ సృజనకు గుర్తింపుగా 1966లో 'ఖడ్గసృష్టి'కి సోవియట్ భూమి అవార్డు 1973లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1979 శ్రీ రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి మొదటి అవార్డు లభించాయి. సుప్రసిద్ధ కథా రచయిత, నవలా రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి అన్నట్లు "భారత జాతికీ, ప్రపంచ సాహిత్యానికీ ఈతడు తెలుగు వారిచ్చిన వెలుగు కానుక"

తెలుగుభాష ఉన్నంతకాలం శ్రీశ్రీ ఉంటాడు. ప్రపంచంలో పేదలు, కర్షకులు, కార్మికులు, శ్రామికులు, దీనులు బాధా సర్పదష్టులు ఉన్నంతకాలం శ్రీశ్రీ కవిత్వం బతికి ఉంటుంది. తెలుగువాళ్ళకి మరో ప్రపంచాన్ని ప్రసాదించడం కోసం తన సర్వశక్తుల్నీ కవితా రూపంలో ధారపోసిన మహాకవి శ్రీశ్రీ 1983, జూన్ 4వ తేదీన భౌతికంగా ఈ లోకం నుంచీ దూరమయ్యాడు.

**మహాప్రస్థానం:** మహాప్రస్థానం 1934లో వెలువడిన గేయం. 1930లో అమెరికాలో ప్రారంభమైన ఆర్థికమాంద్యం మొత్తం ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. శ్రమను నమ్ముకొని బతికిన కోటానుకోట్ల మంది నిరుద్యోగులుగా వీధిన పడ్డారు. ఆకలి దప్పుల వాతన పడ్డారు. పెట్టుబడిదారీ దేశాల దోపిడీ దౌర్జన్య పీడనలు అధికమయ్యాయి. అప్పటి ఆర్థిక మాంద్యాన్ని తట్టుకొని సామ్యవాద రష్యా నిలబడింది. సామ్యవాద సిద్ధాంతాలు, సామ్యవాద భావాలు కవుల్ని బాగా ఆకర్షించాయి. ప్రభావితం చేశాయి. సాంఘిక ఆర్థిక అసమానతలు, దోపిడీ దౌర్జన్య పీడనలు లేని నూతన సమాజం కోసం ప్రపంచ ప్రజలంతా ఎదురు చూడసాగారు. సామ్యవాదవ్యవస్థ ఒక్కటే ప్రపంచ ప్రజల కష్టాలకి పరిష్కార మార్గంగా తోచింది. అదే మరో ప్రపంచంగా కనబడింది శ్రీశ్రీకి. యువకుడైన శ్రీశ్రీ హృదయం శివసముద్రమైంది. శ్రీశ్రీ భావాలు, ఆవేశాలు నయాగరా జలపాతాలైనాయి. ప్రపంచ ప్రజలందరినీ ఉద్దేశిస్తూ "మరో ప్రపంచం

**మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది ! పదండి ముందుకు పదండి త్రోసుకు పోదాం, పోదాం పైపైకి!**

అంటూ పిలుస్తూ నెత్తురు మండే, శక్తులు నిండే సైనికులు వంటి యువకుల్ని మరో ప్రపంచం వైపు కదం త్రొక్కుతూ, పదం పాడుతూ హృదంతరాళం గర్జిస్తూ, దారిపొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ, నదీనదాలు దాటుకుంటూ, అడవులు, కొండలు లెక్కచేయకుండా హరోం హరోం హర హర! హర! హర! హర! అంటూ, ప్రభంజనంవలె హోరెత్తుతూ, వర్షకాభ్రముల ప్రళయఘోష వలె పెళ పెళ మని విరుచుకు పడుతూ, త్రాచుల్లా, రేచుల్లా ధనంజయునిలా విజయోత్సాహంతో ముందుకు ఉరకమంటాడు.

**చివరకు** - కనబడలేదా మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు ఎర్రబావుటా నిగనిగలు హోమ జ్వాలల భుగభుగలు?

అని ప్రశ్నిస్తూ మహాప్రస్థానం గేయం ముగిస్తాడు. మహాప్రస్థానం గేయం సామ్యవాద వ్యవస్థకు ఓ కవాతుపాట. ఫ్రెంచి జాతీయగీతం, హరీన్ ఛటోపాధ్యాయ గీతాలు. నజ్రుల్ ఇస్లాం గీతాలు, ఎడ్గార్ ఎలన్ పో గురజాడ, కవికొండల గేయాలు మహాప్రస్థానం గేయానికి ప్రేరణగా చెప్పుకున్నాడు. అందులోని నడక ఆదిశంకరుల 'భజగోవిందం' నడక అన్నారు. మహాప్రస్థానం గేయంలో కనిపించే త్రేతాగ్నులు, ప్రళయఘోషలు, ఎగిరిపడుతున్న మెరుపులు, జలప్రళయ నాట్యాలు, అగ్నికిరీటాలు, హోమజ్వాలలు వంటి మత సాంప్రదాయ ప్రతీకల్ని లౌకికార్థంలో ప్రయోగించి పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేసాడు శ్రీశ్రీ. అభ్యుదయయుగాలకు మహాప్రస్థానం గేయం వికసించిన విద్యుత్తేజమైంది. వెలుగుబాటైంది.

**దేశచరిత్రలు:** శ్రీశ్రీ చారిత్రక దృష్టికీ, గతితార్కిక భౌతికవాద దృక్పథానికీ, జాతీయ అంతర్జాతీయ అవగాహనకీ, సామాజిక స్పృహకి నిలువటద్దం దేశచరిత్రలు గేయం. అంతర్జాతీయ దృష్టితో ప్రపంచదేశాల చరిత్రను అధ్యయనం చేసిన శ్రీశ్రీ - ఏ దేశ చరిత్ర చూసినా అందులో గర్వించదగ్గ విషయం ఏమీలేదని 'నరజాతి సమస్తం పరపీడనేనని, పరస్పర హరణోద్యోగమేనని, రణరక్త ప్రవాహసిక్తమేనని, బీభత్స రస ప్రధానమేనని, పిశాచగణ సమవాకారమేనని, దరిద్రులను కాల్చుకు తినడమేనని స్పష్టం చేసినాడు. మానవ చరిత్ర అంతా యుద్ధాల చరిత్రేనని, ఈ భూ ప్రపంచం మీద యుద్ధం సంభవించని

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

చోటు లేదనీ, రక్తం చిందని చోటు లేదనీ, గతమంతా కన్నీళ్ళతో తడిసిందనీ, యుద్ధాల మూలంగా అపార జననష్టం జరిగిందనీ, ఎన్నో సంసారాలు చల్లారి పోయాయనీ, చరిత్ర గర్భంలో అసహాయుల హాహాకారాలు మూలుగుతున్నాయని ఏకరువు పెట్టాడు. చరిత్రలో బలవంతులదే రాజ్యం. బలవంతులు బలహీనులను బానిసలుగా చేశారనీ, నరహంతకులు దోపిడీ పీడన దౌర్జన్యాలతో దేశాధినేతలై చరిత్రలో ప్రసిద్ధికెక్కారని కఠోరవాస్తవాన్ని గుర్తుచేస్తాడు. వైకింగులు, శ్వేతహూణులూ, సిథియన్లూ, పారశీకులూ, పిండారులు, దగ్గులు... మొదలైన వాళ్ళు అందరూ రకరకాల పేర్లతో చేసింది దోపిడీ దౌర్జన్యాలేననీ, చరిత్రలో వీరులుగా ప్రసిద్ధికెక్కిన చెంఘిజ్ ఖాన్, తామర్లేనూ, నాదిర్షా, ఘజ్నీ, ఘోరీ, సికిందరు మొదలైన వాళ్ళు నరహంతకులేననీ, వీళ్ళవల్ల ప్రజలకి జరిగిన మేలు ఏమీ లేదని, వీళ్ళు వినాశాన్నే సృష్టించారనీ, దోపిడీలే చేశారని, ప్రజల్ని శవాల గుట్టలుగా మార్చారనీ, యుద్ధోన్మాదంతో దేశాలను శ్మశానాలుగా మార్చారని తెగేసి చెప్పాడు.

"ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం" అంటాడు.

చరిత్ర అంటే...

"ఏ యుద్ధం ఎందుకు జరిగిందీ... ఏ రాజ్యం ఎన్నాళ్ళున్నిందీ అనే తారీకులు దస్తావేజులు కాదనీ, రాణుల ప్రేమ పురాణాలూ, యుద్ధాలకయిన ఖర్చులూ, మతలబులూ, కైఫీయతులు కాదంటాడు.

చరిత్ర అంటే...

నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది? తాజ్మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు? సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుల సాహస మెట్టిది? ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసిన బోయీ లెవ్వరు?

అంటూ ప్రశ్నలవర్షం కురిపించి, చరిత్రను అర్థం చేసుకోవాల్సిన క్రమాన్ని, పద్ధతిని వివరిస్తాడు. తక్షశిలా, పాటలీపుత్రం, మధ్యదరా సముద్రతీరం, హరప్పా, మొహంజొదారో, మాన్యాన్ గుహముఖాల్లో మానవకథ వికాస పరిణామాలు ఎలా జరిగాయో సామాన్యుల జీవన విధానాలను దృష్టిలో పెట్టుకొని, చారిత్రక దృష్టితో అధ్యయనం చేయాలంటాడు. ఇతిహాసపు చీకటి కోణాల్లో అట్టడుగున కన్పించని సత్యాలన్నీ వెలికి తీయాలంటాడు. భూస్వామ్య పెట్టుబడిదారీ విధానాలు అనుసరించే దోపిడీని ప్రశ్నిస్తూ-

"చిరకాలం జరిగిన మోసం బలవంతుల దౌర్జన్యాలూ ధనవంతుల పన్నాగాలూ ఇంకానా? ఇకపై చెల్లవు. ఒక వ్యక్తిని మరొకవ్యక్తి ఒక జాతిని వేరొకజాతి పీడించే సాంఘిక ధర్మం ఇంకానా? ఇకపై సాగదు" అంటూ నిరసిస్తాడు. దోపిడీ దౌర్జన్యాలు అట్లే సాగినట్లయితే..

"చీనాలో రిక్షావాలా చెక్ దేశపు గని పనిమనిషి ఐర్లాండున ఓడకళాసీ అణగారిన ఆర్తులందరూ హాటెన్ టాటా, జూలూ, నీగ్రో ఖండాంతర నానా జాతులు చారిత్రక యథార్థతత్వం చాటిస్తారొక గొంతుకతో"

అని ప్రపంచ శ్రామికులంతా ఏకమయ్యే తీరుని వాళ్ళ చైతన్యాన్ని ఏకరువు పెడతాడు. పెట్టుబడిదారీ విధానంలోని దోపిడీ పీడన దౌర్జన్య విధానాలను నిర్మూలించేందుకు ప్రపంచ శ్రామికులంతా ఏకమైననాడు

"అంతా తమ ప్రయోజకత్వం తామే భువి కధినాథుల మని స్థాపించిన సామ్రాజ్యాలూ నిర్మించిన కృత్రిమ చట్టాల్ ఇతరేతర శక్తులు లేస్తే పడిపోయేను పేకమేడలై" అంటాడు.

శ్రామికలోకం చైతన్యంతో దోపిడీ దౌర్జన్యాలను నిర్మూలించడానికి పూనుకుంటే భూస్వామ్య పెట్టుబడి విధానాలు పేకమేడల్లా కూలిపోతాయని, భూస్థాపితాలవుతాయని చారిత్రక యథార్థాన్ని గుర్తుచేస్తాడు.

"పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను"

అని మానవ చరిత్రను చారిత్రక దృష్టితో వ్యాఖ్యానించాడు.
"The history of all hitherto existing society is the history of class struggles" అన్న మార్క్స్ గతితార్కిక భౌతికవాద సిద్ధాంత సారాన్ని శ్రీశ్రీ మానవజాతి చరిత్ర అంతా వర్గ సంఘర్షణల ఫలితమే నని తేల్చి చెప్పాడు. శ్రీశ్రీ వర్గదృష్టికి చారిత్రక అవగాహనకి 'దేశ చరిత్రలు' నిజంగా నిలువుటద్దమే.

**కవిత్వ సంబంధ గేయాలు, కవితలు:** మహాప్రస్థానంలోని పాఠ్యాంశ ఖండికల్లో ఋక్కులు, నవ కవిత కవిత్వ సంబంధ కవితలు. ఋక్కులులో కవితా వస్తువు గొప్పదే అయివుండాలనే నియమం ఏమీ అవసరం లేదనీ శిల్పం బావుంటే ఏ అంశమైనా కవిత్వం అవుతుందని పూర్వ లాక్షణికుల లక్షణ నిర్దేశాలను త్రోసిరాజని కొత్త పంథాను ప్రవేశపెట్టాడు.

నవ కవిత అభ్యుదయ కవిత్వ వస్తువునీ, దాని సామాజిక ప్రయోజనాన్ని తెలియజేస్తుంది. వస్తువు మారినపుడు దాని రూపం తప్పక మారుతుంది. శ్రీశ్రీ వస్తురూపాల రెండింటిలోనూ గొప్ప మార్పు తెచ్చారు.

**ఋక్కులు:** ఋక్కులలో శ్రీశ్రీ - "కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా రొట్టెముక్కా, అరటి తొక్కా బల్లచెక్కా తలుపు గొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపు కళ్ళెం" అన్నీ కవితా మయమేననీ, రస నిర్దేశాలేననీ, శోభాలేశాలేనని వివరించి చివరకు ప్రపంచమొక పద్మవ్యూహమని కవిత్వమొక తీరని దాహమని తేల్చి చెప్పాడు.

**నవకవిత:** శ్రీశ్రీ 1937లో నవకవిత రాయడం జరిగింది. శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వ వస్తు నిర్దేశత్వాన్ని, అభ్యుదయ కవిత్వ తత్వాన్ని అభ్యుదయ కవిత్వం సాధించాలనుకున్న కవిత్వ ప్రయోజనాన్ని 'నవకవిత'లో వివరించినాడు. సామాజిక మార్పును, సామాజిక ప్రగతిని, సాంఘిక పురోభివృద్ధిని బలంగా కోరుకున్నది అభ్యుదయ కవిత్వం. కళ కేవలం ఆనందం కోసం కాదు, కళ గొప్ప సామాజిక ప్రయోజనాన్ని సాధించాలి. రచనలో సమాజం ప్రతిఫలించాలనే దృక్పథం అభ్యుదయ కవిత్వానికి ఉండడం వల్ల, అభ్యుదయ కవిత్వానికి తెలుగులో ఆద్యుడు, అభ్యుదయ కవితోద్యమ నాయకుడు అయిన శ్రీశ్రీ తప్పనిసరిగా "నవకవిత గురించి చెప్పాల్సి వచ్చింది.
'సిందూరం, రక్తచందనం, బంధూకం, సంధ్యారాగం, పులిచంపిన లేడినెత్తురూ, ఎగరేసిన ఎర్రని జెండా రుద్రాలిక నయన జ్వాలిక కలకత్తా కాళిక నాలిక కావాలోయ్ నవ కవనానికి"

అంటాడు. ఇందులో పేర్కొన్నవన్నీ ఎరుపు రంగును సూచించేవే. ఎరుపురంగు మార్పుకు చిహ్నం. విప్లవ సంకేతం. నవ కవితకు ఇలాంటి వస్తు సామాగ్రి కావాలన్నాడు. శ్రీశ్రీ.

శ్రీశ్రీ నవ కవితలో వస్తు సంభవాన్ని వివరించిన తర్వాత -
"కదిలేదీ, కదిలించేదీ / మారేదీ మార్పించేదీ పాడేదీ, పాడించేదీ / మునుముందుకు సాగించేదీ పెను నిద్దుర వదిలించేదీ / పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ కావాలోయ్ నవకవనానికి"
అంటాడు.

నవకవనం సమాజం పెనునిద్దురను పోగొట్టి పరిపూర్ణపు బతుకును ప్రసాదించే విధంగా ఉండాలని అదే అభ్యుదయ కవిత్వ లక్షణమనీ, ధర్మమనీ, అభ్యుదయ కవిత్వం ఆ విధంగా రూపొందాలని మును ముందుకు సాగాలని శ్రీశ్రీ నిర్దేశించాడు.

**జయభేరి:** పాఠ్యాంశ ఖండికల్లో జయభేరి, ప్రతిజ్ఞ శ్రమజీవన సౌందర్య కీర్తనకు సంబంధించిన జయభేరి గేయం గురించి శ్రీశ్రీ "ఒకటి మాత్రం నిశ్చయం 1933లో 'నేను సైతం ప్రపంచాగ్నికి' ఇత్యాది గీతంతో ప్రారంభించి కడసారిగా గ్రాంథిక శైలికీ గణబద్ధ ఛందస్సులకీ గుడ్బై కొట్టేశాను" అంటారు. కష్టజీవి సేవల్ని, కష్టజీవి బతుకులోని దైన్యాన్ని,

ఆ కష్టజీవి లేకుంటే కలిగే నష్టాల్ని, కష్టజీవి విశ్వవ్యాప్తిని, కష్టజీవి ఆనందోత్సాహాన్ని జయభేరిలా వినిపించాడు శ్రీశ్రీ.

**గేయం ప్రారంభంలో -**

నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను.
నేను సైతం విశ్వసృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను!
నేను సైతం భువన ఘోషకు వెర్రిగొంతుక విచ్చి మోశాను!.. అంటూ కష్టజీవి సేవల్ని తెలుపుతాడు.

మహాప్రస్థానంలోని పాఠ్యాంశ ఖండికల్ని చదివిన తర్వాత శ్రీశ్రీ కవిత్వం - ప్రళయంలా, ప్రభంజనంలా, ఉప్పెనలా, ఉద్రేకంలా, సమరంలా, సంఘర్షణలా, తుఫానులా, తూర్యారావంలా, అగ్నిలా, త్రేతాగ్నిలా, ఆకలిలా, ఆకలి కేకలా కనబడుతుంది. శ్రీశ్రీ కవితా వస్తువులో పెద్దమార్పు తెచ్చాడు. తెలుగు కవిత్వాన్ని గురజాడ ప్రజాస్వామిక భావాలవైపు మానవతావాద దృష్టితో మళ్లిస్తే - శ్రీశ్రీ ఆ మార్గాన్ని మరింత శక్తివంతంగా వర్గ దృక్పథంతో కష్టజీవుల వైపు, శ్రామికవర్గంవైపు పరుగెత్తించాడు. రాయప్రోలు, దేవులపల్లి భావస్వేచ్ఛకి, పఠాభి. క్లిష్టాలు రూపవిప్లవానికి దోహదం చేస్తే శ్రీశ్రీ వస్తురూప విప్లవాలకి పూనుకున్నాడు. తెలుగు కవిత్వానికి అభ్యుదయాన్ని విప్లవ చైతన్యాన్ని సమకూర్చిపెట్టాడు. ప్రజలే చరిత్ర నిర్మాతలన్న అభ్యుదయ భావననీ మార్పును కోరుకునేది, చైతన్యాన్ని అందించేదే కవిత్వమన్న ఆలోచనని శ్రీశ్రీ తెలుగు కవిత్వానికి అందించాడు. కళ కళకోసమేనన్న భావనని ప్రక్కనబెట్టి కళ సమాజం కోసమేనన్న కొత్త ఆలోచనని ప్రజల ముందుకు తెచ్చాడు.

శ్రీశ్రీ పాత పదాలను, పదబంధాలను, నిఘంటు పాండిత్యాన్ని, వ్యాకరణ, అలంకారశాస్త్ర గ్రంథాల పాండిత్యాన్ని వదిలిపెట్టి తెలుగు కవిత్వానికి కొత్త డిక్షన్ని, కొత్త మాత్రాఛందోరీతుల్ని అందించాడు. శబ్దలయను ప్రవేశపెట్టాడు.

**ముగింపు:** శ్రీశ్రీ తాడితులకీ, పీడితులకీ, కర్షకులకీ, కార్మికులకీ, భ్రష్టులకీ, బాధాసర్పదష్టులకీ, దీనులకీ, హీనులకీ, పతితులకీ, అనాథలకీ, అభాగ్యులకీ, అశాంతులకీ, కూడు గూడు గుడ్డలేనివాళ్ళకీ, తిరస్కృతులకీ, బహిష్కృతులకీ, కూలీలకీ, మాలీలకీ, హమాలీలకీ, గుడిసెల్లో బతికే వాళ్ళకీ, గంజి నీళ్ళు తాగి బతికే వాళ్ళకీ, అన్యాయాలకు అక్రమాలకు దోపిడీ దౌర్జన్య పీడనలకు నిరంతరం గురయ్యేవాళ్ళకీ, ఖైదీలకీ, రౌడీలకీ, ఖూనీకోర్లరీ, యోగులకీ, వియోగులకీ, వీరులకీ, యువకులకీ, ధనికులకీ, దరిద్రులకీ, వృద్ధులకీ, పిల్లలకీ, పిట్టలకీ, కుక్కపిల్లలకీ ఇలా ఎందరెందరికో, ఎన్ని ప్రాణులకో, ఎన్ని వృత్తుల వాళ్ళకో తన కవిత్వంలో స్థానం కల్పించాడు.

శ్రీశ్రీ అన్నట్లు కొన్ని కారణాలవల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలకు సాహిత్యంలో స్థానం కల్పించాడు. "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది లేనే లేదని" యావత్ ప్రపంచానికి వేయిగొంతులతో వినిపించాడు. తనలోంచి పొంగి పొరలి పరవళ్ళు తొక్కిన నవ్యకవిత్వాన్ని "కార్మిక లోకపు కళ్యాణానికి శ్రామిక లోకపు సౌభాగ్యానికి" హృదయపూర్వకంగా సమర్పించాడు. శ్రీశ్రీ అన్నట్లు అతని మార్గం 'అనితరసాధ్యం'.

**ఆధార గ్రంథాలు:**

1) ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు.
2) తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న.
3) తెలుగు సాహిత్య చరిత్ర డా॥ ద్వానా శాస్త్రి.

# ఆధునిక కవిత్వం –సామాజిక చైతన్యం

**డా . ఎన్ . సుజాత**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామచంద్రపురం

**స్థూలంశం:** ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చిన అనేక కవితాప్రక్రియలో వచనకవిత ప్రక్రియ ఒకటి .స్త్రీ వాద దళిత వాద, మైనారిటీ వాద, అనుభూతి వాదాలతో పాటు మానవ విలువలనుసమాజంలో ముందుకు తీసుకువెళ్తూన కవితా ప్రక్రియ వచన కవిత్వం . "వచన కవిత" రాస్తున్న వాళ్ళు, చదువుతున్న వాళ్ళు పెరుగుతున్న ఈ సందర్భంలో " వచన కవిత" ను 'సామాన్యుని సాహితీ ప్రక్రియ' గా అభివర్ణించవచ్చు.

**ఉపోద్ఘాతం:** 19వ శతాబ్దంలో ఫ్రెంచి ప్రతీక వాదులు వచన కవిత్వాన్ని బాగా ప్రచారం చేసారు. ఫ్రెంచ్ కవలు ప్రభావంత ఆంగ్లంలో ఆర్నాల్డ్, వార్ట్ విట్మెన్, టి-ఇన్ ఇలియట్ వంటి కవులు ఈ ప్రక్రియను చేపట్టారు. తెలుగులో ముద్దుకృష్ణ 'జ్వాల' పత్రికతోనే వచన కవిత ప్రచారంలోకి వచ్చిందని ఆరుద్ర అభిప్రాయపడ్డారు. తెలుగు పత్రికలో దొరికిన, మొదటి వచనకవితగా ముద్దుకృష్ణ రాసిన 'తురాయి'అని ఆయన పేర్కొన్నారు.

**విషయం:** "ఆధునిక కవిత్వానికి కవిత్రయంగా శ్రీశ్రీ, శిష్ట్లా, నారాయణ బాబులను చెప్పుకుంటున్నా వచన కవితకు ఆద్యుడుగా శిష్ట్లాను చెప్పుకోవాలి" అని కుందుర్తి అభిప్రాయపడ్డారు.వచన కవిత్వానికి ఇతోధికంగా కృషి చేసిన వారు కుందుర్తి ఆంజనేయులు ఆయన వచన కవిత్వాన్ని ఒక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళారు. "పాతకాలం పద్యమైతే వర్తమానం వచన గేయం" అంటూ వచన కవిత్వానికి అగ్రస్థానం కట్టబెట్టారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

వచన కవిత్వం ఆరంభం నుండి రకరకాల వాదాలు ప్రబలినాయి. ఈ 21వ శతాబ్దంలో అవి మరింత ముందుకు వెళ్ళి వస్తువు, శిల్పం, సమన్వయంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి.

**భావ కవిత్వం:**

ఆంగ్లసాహిత్యంలో లిరికల్ పొయెట్రీ, రోమాంటిసిజమ్ ప్రభావంతో తెలుగులో వచ్చిన కవిత్వం భావకవిత్వం.ఇది ప్రబంధ కవిత్వంపై తిరుగుబాటుగా వచ్చింది. ఆత్మాశ్రయత, అంతర్ముఖత్వం ఆధునిక భావకవిత్వం లక్షణాలు.అనుభూతిని ప్రధానంగా ఎంచటం, సుకుమారమైన ఊహ రచన, వియోగప్రాధాన్యం,స్వేచ్ఛ, నవ్యతాప్రీతి, రచనలోపూర్వనియమాలను ఉల్లంఘించడం భావకవిత్వంలోకనిపిస్తుంది. రాయప్రోలు, దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి వాళ్ళు భావకవిత్వం ఎక్కువగా సృజించారు. అక్కిరాజు ఉమాకాంతం రచించిన నేటి కాలపు కవిత్వం భావకవిత్వాన్ని తీవ్రంగా విమర్శించింది."త్వరగానే వస్తావులే నువ్వు - నేరేడు పళ్ళు రాలిన డొంకదారి మీద అడుగేయడానికి అల్లాడిపోయే ప్రాణానికి నన్ను తలుచుకొని, నువ్వులేని నన్ను ఊహించుకుని రావా?.

**విప్లవ కవిత్వం:**

తెలుగులో విప్లవ కవిత సుబ్బారావు పాణిగ్రాహి తోనే ప్రారంభమయ్యాయి. సాహిత్యానికి పోరాటానికి బేధం లేదని చాటిచెప్పిన కవిత్వం విప్లవ కవిత్వం.శ్రీశ్రీ మహాప్రస్థానం విప్లవ కవిత్వాన్ని శాసించింది, దీవించింది.శ్రీశ్రీ తర్వాత శివసాగర్- ఆ పంధా కొనసాగించారు.తర్వాత విప్లవ కవిత్వంలో కొంత ఆత్మాశ్రయలో కూడా చొరబడటం గమనిస్తాం. అరసవిల్లి కృష్ణ
అతడు "నేనీ దేశాన్ని ప్రేమిస్తున్నా" అనే కవితను ప్రకటించారు. "నిద్రించిన రాత్రి మారణకాండ మిగిల్చిన నిశ్శబ్దం గురించి ఎన్నిసార్లు పలవరించాలి. బోరున విలపించడానికి మనుషులు సిద్ధంగా లేరు"అంటూ ఒక దృశ్యాన్ని మన ముందులచే ప్రయత్నం చేస్తాడు కవి.

**స్త్రీవాద కవిత్వం:**

స్త్రీల యొక్క వాదన,వేదనే స్త్రీ వాదం . స్త్రీలను వ్యక్తిత్వం, సేచ్ఛలేని వ్యక్తిగా మన సమాజం అనాదిగా భావించడం స్త్రీ వాదానికి నాంది అయింది. తొలి స్త్రీవాద కవితా సంకలనం నీలిమేఘాలు.రేవతీ దేవి, ఓల్గా, సావిత్రి, జయప్రభ లాంటి కవయిత్రులు స్త్రీవాద కవిత్వం బలంగా సృజించారు. సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యానిది ప్రత్యేక స్థానం. 1993 నుంచి 2022 వరకు.. దాదాపు మూడు దశాబ్దాలుగా స్త్రీవాదం నేపథ్యంలో వచ్చిన 93 మంది కవయిత్రుల 168 కవితలను ఒక్క దగ్గర చేర్చి డాక్టర్ కె.గీత సంపాదకత్వంలో ప్రచురించిన సంకలనం 'అపరాజిత'. స్త్రీలను పూజించే చోట దేవతలు తిరుగాడతారనేది భారతీయుల విశ్వాసం. ఆ సంప్రదాయం తరతరాలుగా అపహాస్యానికి గురవుతూ వస్తున్నది. ఈ దుస్థితిని ''నాది పవిత్ర భారతదేశం/ స్త్రీని దేవతగా పూజించే మను జన్మభూమి/ అందుకే నాకు నిత్య 'అగ్ని హెూత్రాలూ'/ బడితే 'పూజలూ', 'ధూప నైవేద్యాలు'!... అంటూ షహీదా రాసిన 'బోలో స్వతంత్ర భారత నారికీ జై' అనే 1993 నాటి ఏడు ఖండికల కవితతో 'అపరాజిత' ఆరంభమవుతుంది. 'ఆమెకు బతుకు లేదు/ అమ్మ... అమ్మోరుగా మారితే తప్ప/ భూమికి శాంతి లేదు/ కొత్త నెలపొడుపై ఉదయిస్తే తప్ప' అంటూ దేవనపల్లి వీణావాణి 'నెలపొడుపు' కవితతో ముగిసే ఈ సంకలనంలో గృహహింస, భ్రూణహత్యలు, మహిళల అక్రమరవాణా, ఎంతకూ తేలని చట్టసభల్లో రిజర్వేషన్ల వాటా, లైంగిక దాడులు, వేతనంలో వివక్ష, నెలసరి సమస్యలు.. లాంటి స్త్రీలు అడుగడుగునా ఎదుర్కొంటున్న సవాళ్లపై కలమెత్తారు. ఇందులోని రచయిత్రులు. ఓల్గా, కాత్యాయనీ విద్మహే, అనిశెట్టి రజిత, చల్లపల్లి స్వరూపరాణి,

మందరపు హైమావతి, కె.గీత లాంటివారి కవితలు పురుషాధిక్య సమాజం స్త్రీలను ఎలా చూడాలో బుద్ధిచెబుతాయి.

**దళితవాద కవిత్వం:**

మాలవాండ్ర పాట (1909)తో దళిత సాహిత్యం ప్రారంభమయ్యింది.మంగిపూడి వెంకటశర్మ - నిరుద్ధభారతం తొలి తెలుగు దళిత కావ్యంగా చెప్పబడుతున్నది.కుసుమ ధర్మన్, త్రిపురనేని రామస్వామి, గుర్రం జాషువా లాంటి వారు దళిత వాద తాత్త్వికత తో కవిత్వం రాసారు.

ఆధునిక దళిత సాహిత్యంలో సతీష్ చందర్, కత్తి పద్మారావు, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, లాంటి చాలామంది విరివిగా కవిత్వం సృజించారు. మద్దూరి నగేష్ బాబు పైడి తెరేష్బాబు లాంటి కవులు దళిత కవిత్వానికి సదువైన గొంతులుగా నిలబడ్డారు

జ్యోతి బా పూలే, నారాయణ గురు, సాహు మహారాజ్ పెలియార్ రామస్వామి, అంబేద్కర్ మొదలగు వారి ఆలోచనలు దళిత సాహిత్యానికి చారిత్రక, తాత్విక భూమికను ఏర్పరచాయి.

**దళిత వ్యాకరణం:**'తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ అనే కవి "దళిత వ్యాకరణం" అనే కవితను ప్రకటించారు.. ఆధునిక సమాజంలో కులంపేరిట జరుగుతున్న దాడులు, దళిత వాడల్లో ప్రతిష్ఠించుకున్న అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేయడం, అడుగడుగునా కొనసాగుతున్న కులవివక్షను ప్రశ్నించే ప్రయత్నం. చేసారు.

భూమిని పగలగొట్టుకొని మొలక పైకొచ్చినట్లు
జాతికి వెలుగు చూపే నాయకుడు
ప్రజల గుండెల్లోంచి పుట్టుకొస్తాడు.
ఊరికో ఇందిరానగర్ వెలిసినట్లు
వాడకో విగ్రహమై మనసుల్లో నిలిచిపోతాడు.

అంటూనే కడజాతి వాళ్ళ పోరాట పదానికి దిశానిర్దేశం చేసాడనే కదా... ఒక రాతి విగ్రహం పై ఈసడింపుల రాళ్ళు విసిరేది... అగ్రవర్ణాల దుర్మార్గాన్ని ఇక్కడ నిరసిస్తూనే వాళ్ళు చేసే పనుల్ని ఎంత. నీదమైన వ్యక్తీకరించాడు కవి..

"వర్ణ వేత్తలు కులాల పిరమిడ్లపై కూర్చొని జక్రాన్ పల్లిలో ఒక సిమెంట్ విగ్రహాన్ని కూల్చి వేసినంత మాత్రాన మొలకవేసుకేనే ఒక జాతి గొంతును నులిపివేయడం సాధ్యామా!?" అంటూ కవి ధిక్కారాన్ని వ్యక్తం చేయడం గమనిస్తాం...

క్యాన్సర్ లాంటి కులం కణాన్ని తొలగించకపోతే వివక్రపోదు అంటాడు కవి. దళిత వ్యాకరణం తెలుసుకోవాలంటే లాల్ సలామ్కు జైభీమ్ కూ తేడా తెలుసుకోవాలి కదా! అంటూ కొత్త అంశాన్ని లేవనెత్తడం దళిత తాత్వికతను ముందుకు తీసుకెళ్ళిందనడంలో సందేహం లేదు.

**మైనారిటీ వాద కవిత్వం**

ముస్లింలు తమది ఆరో వర్ణంగా భావించి సృజించిన కవిత్వం మైనారిటీ వాద కవిత్వం.ఖాదర్ మొహియుద్దీన్ 1991లో పుట్టుమచ్చ అనే కవితలో ముస్లిం వాదాన్ని తొలిసారిగా ప్రతిపాదించారు.తెలుగు సాహిత్యంలో ముస్లిం వాద కవిత్వం పుట్టుమచ్చతోనే ప్రారంభమయింది.ముస్లిం వాద కవుల తొలి సంకలనం జిహాద్,తొలి ముస్లిం వాద కవయిత్రి షాజహానా. ఇక్బాల్ చంద్, జావెడ్, ఎస్.ఎ. అజీద్, సయ్యిద్ గఫార్, దిలావర్ లాంటి కవులు మైనారిటీ వాద కవిత్వాన్ని పరిపుష్టం చేసారు.

**అజాద్:**

షాజహానా అనే కవయిత్రి 'అజాది' అనే కవిత రాసారు. "డిసెంబర్ 2019న పౌరసత్వం చట్టం (సిఎఎ)ని భారత ప్రభుత్వం ఆమోదించడానికి ప్రతి స్పందనగా మరియు జామియా మిలియా

ఇస్లామియాలోని విద్యార్థులపై పోలీసు జోక్యానికి ప్రతిస్పందనగా షాహీన్ బాగ్లో ముస్లిం స్త్రీలు గడ్డకట్టిన చలిలో పిల్లలతో సహా నిలబడి పోరాటం చేసారు.

ఈ అంశాన్ని వస్తువుగా తీసుకున్న కవయిత్రి శిల్పవైవిధ్యంతో అద్భుతమైన కవితగా మలిచారు.

"నేనెప్పుడూ అనుకోలేదు. యుద్ధమైదానంలో అడుగు పెడతానని "అని మొదలవుతుంది.... కవిత ...

పూట పూట రోటీ కలలే / చిన్నదానికి ఈ వింటర్లోనైనా కొత్త స్వెట్టర్ కొంటానా అని దీర్ఘలోచన అంటూ తన చిన్న చిన్న కలల్ని సాకారం చేసుకునే ముస్లింబతుకు యుద్ధాన్ని ఆపై స్పష్టంగా కవిత్వీకరించడం తెలుస్తుంది.

1. **అనుభూతి వాద కవిత్వం:**

అనుభూతి ప్రధానమైంది అనుభూతి కవిత్వం,అనుభవాలు వాటి ద్వారా కలిగే ఊహలు ప్రతి అనుభూతి వాదికీ, కవితకి ప్రత్యేకంగా ఉంటాయి. 1970 దశకంలో అనుభూతి వాద కవిత్వం ప్రారంభమయ్యింది..అనుభూతి వాదంలోని ముఖ్యలక్షణం కళ సామాజిక ప్రయోజనం.

ప్రముఖకవి అంజతా అనుభూతి కవులను బాగా ప్రోత్సహించారు.పోలికల ద్వారా, ఊహల అల్లికల ద్వారా, ఇంద్రియ సంవేదన రేకెత్తించే వర్ణన ద్వారా అనుభూతి వాద కవిత్వం రూపుదిద్దుకోవడం జరుగుతున్నది. తిలక్, ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, ఇస్మాయిల్, మాదిరాజు రంగారావు లాంటి కవులు అనుభూతి కవిత్వం పరిపుష్టం చేసారు.

**కెమెస్ట్రి ఆఫ్ టియర్స్:**

కెమెస్ట్ ఆఫ్ టియర్స్' అనే కవిత 'కొప్పర్తి' రాసారు. ఆయన ఈ కవితలో 'కన్నీరు' అనే వస్తువును తీసుకొని కొత్తగా ఆకట్టుకునేలా రాసారు. ఎత్తుగడలోనే రక్తంకన్నా కన్నీళ్ళ గొప్పవి అంటారు. బ్లడ్ ఈస్ ధిక్కర్ డేన్ వాటర్ నిజమే కావచ్చు బటనాట్ దిక్కర్ డేన్ టియర్స్ అనడంలో కన్నీ టెకున్న గొప్ప విలువను పాఠకులకందించడంలో సఫలీకృతులయ్యారు.

మనిషిలో కన్నీళ్ళ రహస్య తటాకాలున్నాయి. నది మూలాల్లాంటి కన్నీటి చెలవులున్నాయి. ఒకరు రాయి విసరనక్కర లేదు. మరొకరు కత్తి దూయస్కర లేదు గాయపరచేదైనా అనునయించే దైనా చిన్నమాట చాలు కళ్ళదోనెల్లో నీళ్ళు కదలాడుతాయి.

కన్నీరు వచ్చే ప్రతి సందర్భాన్ని కవి తన ఈ కవితలో వ్యక్తం చేస్తారు. కన్నీరు మనిషితనానికి చిహ్నమని, కన్నీరు తొణికిసలాడితేనే నువ్వు సనిషినని తీర్మానిస్తారు కవి.

"రక్తంలా కన్నీళ్ళు అనుక్షణం తయారు కావు" అనడంలోనే 'రక్తం' పట్ల మనకున్న విలువను వాటి కన్నీటికున్న స్థాయిని పెంచుతారు.

**ముగింపు:** కవిత ఎత్తుగడలోనే కలతో మొదలయ్యే ఊహ చేయడం.జానపద శైలిలో కవిత మొత్తాన్ని నడపడం.ఆంగ్ల పదాలను విరివిగా వాడుతూ కవితను మరింత విస్తృతి పరచడం.ఏ వస్తువును కవిత్వం చేస్తున్నారో. ఆ వస్తువుడు సంబంధించిన ఉపమానాలను, రూపకాలను మాత్రమే తీసుకురావడం,సాధారణ వచనంలా అనిపిస్తూ ముగింపులో శ్లాష్ల కవితను నిర్మించడం.పూర్తి మాండలికంలో కవితను రాసి తన అస్తిత్వంగా చెప్పబడే భాషను విస్తరింపజేయడం.ప్రక్కనే ఉన్న వ్యక్తితో ఊసులాడుతున్నట్లు సంభాషణతో కవితను నిర్మిస్తూ పాఠకుడ్ని అలవోకగా కవితలోకి లాక్కుపోవడం అనేవి మనం ఆధునిక కవిత్వంలో గమనించదగ్గ అంశాలు .

**ఆధార గ్రంథాలు:**

1.వచన కవిత- కుందుర్తి పాత్ర- ఎస్వీడీ, చంద్రశేఖర్
2.వచన కవిత రూప పరిశీలన ఎన్.ఎస్.రాజు

3.తెలుగు సాహిత్య సర్వసం -దేవిరెడ్డి రామకృష్ణారెడ్డి
4.సమగ్రాంధ్ర సాహిత్యం (ఆధునిక కాలం) ఆరుద్ర
5.పరవశ కవితాసంకలనం మానస చామర్తి
6.గాజుపూలు కవితాసంకలనం గరికపాటి మణిందర్
7.పక్షితనాన్ని కలగంటూ కవితాసంకలనం పశ్కి రవీంద్రనాథ్
8.దళిత వ్యాకరణం (కవితా సంకలనం) తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
9.ఏడ్రైఏళ్ళ వాన (కవితా సంకలనం) - కొప్పర్తి
10.కవితా వార్షిక - 2022 - సాహితీ మిత్రులు విజయవాడ
11.ఈవేళప్పుడు (కవితా సంకలనం) అరసవిల్లి కృష్ణ
12.ఫిజా (షాజహానా కవిత్వం)
13.కవితా వార్షిక - 2012 – సాహిత్యం
14.నీలిగోరింట (కవితా సంకలనం) మందరపు హైమావతి

## దిగంబర కవిత్వం ఒక పరిశీలన

**ఎమ్.ఎల్.ఎస్. కుమారి**
తెలుగు లెక్చరర్
ఎ.జి. & యస్.జి.సిద్ధార్థ డిగ్రీ కళాశాల, ఉయ్యూరు.
చరవాణి: 9848547022
madalalakshmi9848@gmail.com

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**స్థూల పరిచయం:** నిజాన్ని నిజంగా చెప్పడం నిజంగా చాలా కష్టం. నష్టం! ఆ రెండింటికి సిద్ధపడే దిగామన్న 'దిగంబర కవులు' చివరిదాకా తమ ఉద్యమ స్వరూపాన్ని నిలబెట్టుకోలేదు. ఆ కథా... కమామిషూ...కొద్దిగా!

20వ శతాబ్దం ఆరంభం నుంచి తెలుగు గడ్డల మీద ఎన్నో ఉద్యమాలు చెలరేగాయి. స్వాతంత్రోద్యమం ఆంధ్రోద్యమం, తెలంగాణా సాయుధ పోరాటం, విశాలాంధ్రలో ప్రజారాజ్యం కోసం ఆరాటం. వగైరా! ప్రధానమైన ఉద్యమాలన్నింటిలో ప్రజాకవిత్వం మమేకమైంది. స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటయింది. తెలంగాణా సాయుధ పోరాటం విజయవంతమయింది. విశాలాంధ్ర సాధ్యమయింది. ఏ ఉద్యమ చైతన్యమూ ప్రేరణా లేనందున తెలుగు సాహిత్యం సామాజిక స్పృహ కోల్పోయిందని యువతలో అసంతృప్తి మొదలయింది. ఊసుబోని ప్రణయ ప్రేలాపన, ఉత్కంఠే ప్రాణంగా నేరపరిశోధన, పాలకులకు అనుకూలమైన చెక్కబజనే సాహిత్యంగా పేట్రేగడం సమాజం పట్ల జరిగే కుట్రగా భావించిన యువకులు కొందరు 1960 ప్రాంతాల్లో 'దిగంబర కవితోద్యమం' పేరుతో కరెంటు షాక్ ట్రీట్మెంట్ ఇవ్వదలిచారు. కందుర్తి 'తెలంగాణా', కాళోజీ 'నా గొడవ', సీతాదేవి నవలా ప్రక్రియ, కోకు విమర్శ వంటి ప్రగతికాముక సాహిత్యం పట్ల ఆదరణ తగ్గనప్పటికీ.. అంతకు మించిన ఆసక్తి ఊకదంపుడు సాహిత్యం మీదే పాఠక జనం ప్రదర్శించడం అభ్యుదయ సాహిత్యకాముకులకు ఆవేదన కలిగించింది. చాసో, రావిశాస్త్రి వంటి వారి నుంచి ప్రగతిశీల వచన సాహిత్యం ప్రబలంగా వస్తున్నప్పటికీ.. కవిత్వపరంగా స్తబ్దత ఆవరించడం ఆ యువత కలతకు కారణమయింది. ప్రయోజనశూన్యతను ప్రశ్నిస్తూ రక్తం ఉడికే ఓ ఐదుగురు యువకవులు 1965లో ఓ వినూత్న కవితోద్యమానికి భాగ్యనగరం నుంచి శ్రీకారం చుట్టారు. 'నన్నయను నరేంద్రుడి బొందలోనే నిద్రపోనియ్య లేపకు పీక నులిమి గోతిలోకి లాగుతాడు' అంటూ గతించిన కవిత్వ ధోరణులన్నింటిపైనా ధిక్కారస్వరం ప్రకటిస్తూ ఒక్క పెట్టున ఉప్పెనలా తెలుగు కవిత్వం మీద విరుచుకు పడిన ఆ కొత్త ప్రక్రియే 'దిగంబర కవిత్వం'. అచ్చు, ఆవిష్కరణ, కలంపేర్లు... అన్నింటా అప్పట్లో అదో గొప్ప కలకలం. జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, నగ్నముని, చెరబండరాజు, మహాస్వప్న, భైరవయ్య పేర్లతో మూడేళ్ల పాటు వీరవెల్లి రాఘవాచార్యులు, మానేపల్లి రాఘవాచార్యులు, యాదవరెడ్డి, మానేపల్లి హృషీకేశవరావు, బద్దం భాస్కరరెడ్డి, కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, మన్ మోహన్ సహాయ్, సాహిత్య సాగరంలో సృష్టించిన సునామీలకి పెద్ద పెద్ద పేర్లే చెట్లూ చేమలూ ఎక్కి పెద్దరికాన్ని కాపాడుకొన్నాయి.

దిగంబర కవిత్వం పరిశీలన: 'మానసిక దిగంబరత్వం కోసం నిత్యం సచేతన ఆత్మస్ఫూర్తితో జీవించడమే' తమ ఆశయంగా ప్రకటించుకొన్నారా దిగంబర కవులు. 'శ్వాసించే ప్రతివ్యక్తితో సారూప్యం చెంది, వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ కోసం, అంతరంగంలో అణిగి మణిగి పడి ఉన్న ఆరాటాన్ని, సంతోషాన్ని, విసుగును అక్షరాల్లో వ్యక్తీకరించి నూతన విశ్వాసాన్ని, ఆశను కలిగించాలన్న వాళ్ల సామాజిక తత్పరత తరువాత మరో మూడేళ్ళు వరకు నిత్యపరిణామ దిశగా అడుగులు వేస్తూ స్తబ్దసాహిత్య సాగరంలో నిజంగానే కల్లోలాన్ని సృష్టించింది.

పాత ఋతువులు, సంవత్సరాల మీద సైతం వాళ్లకు నిలువెల్లా పరమరోత! పురాతత్వాన్ని సంపూర్ణంగా వదలించుకొని కవిత్వాన్ని పై నుంచి కింది వరకు దిశమొలగా నిలబెట్టాలన్న దిగంబర కవుల ఆరాటం కొందరికి తెంపరితనమనిపిస్తే ఇంకొందరికి నిస్పృహ పైన నిజాయితీగా చేసే నిబద్ధ పోరాటంలాగ స్ఫూర్తినింపింది. ప్రతీ నాణేనికీ బొరుసు ఒక్కటే కాదు. బొమ్మా ఉంటుంది. తిరగేసి చూడాలి. అంతే.

'ఇది దిగంబరశకం. మేం దిగంబరకవులం. మాది దిగంబరకవిత. ఇది సాహిత్యోద్యమంలో దిగంబర కవితోద్యమం. కవితా స్వరూపాన్ని బట్టి మేం రాస్తున్నది వచన కవిత అని మేం అనదలుచుకోలేదు. అననివ్వదలుచుకోలేదు. వచన కవిత అనే పదం

మాకు నచ్చదు.' అని తమ కవిత్వ ప్రక్రియ లక్షణాలను తామే ప్రకటించుకున్నారు దిగంబర కవులు. అందరిలా కాకుండా తమ కవితలను 'ధిక్' లుగా పిలుచుకున్నారు.

ప్రాచీన సంస్కృతిని దుర్గంధభూయిష్ఠంగా గర్హించే దిగంబర కవిత్వానికి అంతర్జాతీయ నేపథ్యం ఉంది. 20 శతాబ్దంనాటి పారిశ్రామీకరణ, నాగరీకరణల ఫలితంగా సమిష్టి కుటుంబ వ్యవస్థ వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా విఛ్చిన్నమయింది. ఆ విధ్వంసం మానవ విలువలు దిగజారుడుగా భావించి వేదన చెందింది పాశ్చాత్య సాహిత్యంలోని ఒక యువ వర్గం. స్వార్థ చింతన పెచ్చుమీరడం, మనిషి ఆర్థిక సంబంధాలే ప్రధానంగా భ్రమించడం, విలాసజీవనం పట్ల నియతి, నియంత్రణలేని లౌల్యం పెరిగిపోవడం.. వ్యవస్థలో విశృంఖలతకు, అమానుషలతకు దారితీస్తున్నట్లు ఈ యువ వర్గం భావించింది. మానవ ప్రేరిత ప్రపంచ యుద్ధాల విధ్వంసం తరువాత సామ్రాజ్యవాదం తన దాష్టీకం కొనసాగింపుకే మొగ్గు చూపడం ఈ యువతను కలచివేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పన్నమయిన ఉపద్రవాలకి ప్రతిస్పందనగా మేధావివర్గాలు స్తబ్ధతనో, నిరాశావాదాన్నో, పలాయనవాదన్నో ఆశ్రయించడం ఆగ్రహం తెప్పించింది. సహజంగా ఆవేశం పాళ్లు ఒకింత అధికంగా ఉండే యువకులు కొంతమంది అత్యంత తీవ్రంగా స్పందించారు. ఆ స్పందన ఉద్యమ రూపాలు వివిధ దేశాలలో వివిధ స్వభావాలలో సాగినా అన్నింటి సామాన్యలక్షణం నిరాశ నుంచి పుట్టిన నిరసనే. తెలుగు గడ్డ మీద రేగిన ఈ తరహా సామాజిక అసంతృప్తి జ్వాలలకు సాహిత్యపరమైన ఉద్యమ రూపం దిగంబర కవిత్వం.

మానసిక సంఘర్షణ, సంప్రదాయం పట్ల నిరసన, గతమంటే గల అనాసక్తత, ఆధునికత మీద వైముఖ్యతల కారణంగా అమెరికాలో 1960ల్లో 'బీట్నీకుల్లు' 'బీట్నిక్ జనరేషన్' తరహా నిరశనోద్యమం లేవదీశారు. పొరుగుదేశాల దాడి కారణంగా జాతీయ జీవనం విచ్చిన్నమైన హంగరీ (అప్పటి ఆస్ట్రియా)లో కూడా అశాంతికి గురయిన యువకులు కొందరు 'గాయపడ్డ యువతరం' పేరుతో ఈ మాదిరి సాహిత్యపరమైన నిరశనోద్యమానికి నడుంకట్టారు. అంతర్జాతీయ ఆందోళనా బృందం 'యాంగ్రీ యంగ్మెన్'ల నిరశనోద్యమానికి సమాంతరంగా మన దేశంలో కూడా పశ్చిమబెంగాల్లో 1960లో 'హంగ్రీ యంగ్మెన్' సాహిత్య ధోరణి తలెత్తింది. పెరుగుతోన్న అన్యాయాలూ, అరాచకాలూ, ఆర్థిక అసమానత, నిరుద్యోగ పరిస్థితులకు వ్యతిరేకంగా దేశంలోఏదో ఓ మూల ఓ 'భూభీపీడీ' ఓ 'హంగ్రీ జనరేషన్' వంటి ఆకలి తరం ఆవిర్భవించే దుర్భిక్ష కాలంలో తెలుగునాటా 'దిగంబర కవులు' కొత్త సాహిత్యోద్యమానికి తెరలేపారు. 'ఊపిరి పీల్చే ప్రతి మనిషీ ఉనికి కోసం తపన పడి భావిని చూపి భయపడి వెక్కి వెక్కి ఏడ్చి పిచ్చెత్తి ప్రవచించిన కవిత తమదని లక్షణం ప్రకటించుకున్నారు. 'మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషికోసం కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రాలు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలోంచి పలుకుతున్న గొంతు'లని తమ నిరశన స్వరాలను నిర్వచించుకున్నారు. 'ఏ ఆచ్ఛాదనకీ తలవగ్గని, ఏ భయాలకీ లొంగని నిరంతర సజీవ మానవుడి కోసం ఎలుగెత్తి పిలుస్తున్నామ'ని లక్ష్యం చెప్పుకున్నారు. ఆ చెప్పడంలో ఘాటుదనమే సమాజ పెద్దరికానికి వెంపర్లు పుట్టించింది.

'నిండుగా నిజంగా ఊపిరి పీల్చేవాడు, ఆత్మయోని నుంచి పుట్టుకొస్తున్నాడు' అన్నాడు నిఖిలేశ్వర్. నిజానికి ఆత్మనుంచి పుట్టుకొస్తున్నాడన్నా.. అదే భావం! సమాజం బుద్ధిమాంద్యానికి షాక్ ట్రీట్మెంట్ ఇవ్వడమే తమ తపనగా చెప్పుకున్న దిగంబర కవులు ఈ తరహా పదప్రయోగాలకు పూనుకోవడం దిగ్భ్రాంతి కలిగించదుటొ 'చచ్చిన రాజుల పుచ్చిన గాథల మెచ్చే చచ్చు చరిత్రకారులను ముక్కు చెవులు కోసి అడగాలనుంది. మానవ పరిణామశాస్త్రం నేర్పిందేమని?' అన్నప్పుడూ 'ఆ' ముక్కుచెవుల కోతలు' కవుల కసిలోనుంచి పుట్టుకొచ్చినవే! 'దిగంబర కవిత్వంలోని అక్షరాలు కామంతో పుచ్చిపోయిన లతాంగి పయోధరాలపై నూతన నఖక్షతాలు కావ'ని భైరవయ్య ఎంత సమర్థించుకున్నప్పటికీ

'కీర్తికాముకుల నియంతల అహంతల దౌర్జన్య బాహువుల దురాక్రమణలో దేశదేశాల సుఖవ్యాధి పుండ్లతో భూమి వెలయాలై, పతితయై, భ్రష్టయై పుచ్చి గబ్బు గొడుతున్నప్పుడు నేను పుడుతున్నాను దిగంబరకవిని' (మహాస్వప్న) అనడం అప్పటి మర్యాదస్తుల సాహిత్య లోకాన్ని మెప్పించలేక పోయింది. 'ఐదేళ్ల పెంటపోగులో దొరికిన అద్దం పెంకులో పగలని తన అవయవాన్ని చూసుకుంటూ ఆంధ్రమాత గర్వంగా మురిసిపోతున్నదన'న్న (నగ్నముని) తరహా వర్ణనలు జాతిని, నాతిని ప్రేరేపించేవారెవరూ జీర్ణించుకోవడం కష్టం.

కార్యంలేని యజమాని, గుండెలేని గృహిణి, చెత్తకుండీ విస్తరాకులు యువకులతో ఈ చాప వ్యవస్థ మారేదెప్పుడు?' అని చెరబండరాజు ప్రశ్న. భయంకరంగా విజృంభించిన కుల మత దురహంకారాలకి, ధనమదంతో ప్రజాస్వామ్యాన్ని యథేచ్ఛగా వాడుకుంటున్న గూండాయిజానికి, సినిమారొంపిలో ఈదులాడుతున్న యువత బలహీనతకి, స్తోత్రపాఠాల కుడితిలో పడిపోయిన పత్రికాలోకం పడుపు జీవనానికి, అతీత జీవనంతో గడుపుతున్న మేధావుల అనాసక్తతకి, నాయకుల ఊసరవెల్లి ఆదర్శాలకి, పదవీ వ్యాపారాలకి, నేటి కుష్ఠువ్యవస్థకి క్రూరంగా బలైన కంచికచర్ల కోటేసు స్మృతికి అంకితం చేసిన మూడో సంకలనమే దిగంబర కవిత్వ పరంపరలోని ఆఖరి అంచె. మొదటి సంపుటి ఆవిష్కరణ 1965, మే6వ తేదీ అర్ధరాత్రి. హైదరాబాద్ నాంపల్లి పాండు అనే రిక్షా కార్మికుడు ఆవిష్కర్త, రెండో సంపుటి విజయవాడ జంగాల చిట్టి 1966, డిసెంబరు 8న ఆవిష్కరించింది. దిగంబర కవిత్వానికి పరిణిత దిశగా భావించే మూడో సంపుటి 1968లో విశాఖపట్నం బిచ్చగత్తె 'ఎడమసూరి యశోద' ఆవిష్కరించింది.

మూడు సంపుటాల్లో తొంబై మూడు కవితలు, అనువాదాలకు, అనుకరణలకు అలవాటు పడిన తెలుగు కవిత్వాభిమానులకు దిగంబర కవిత్వ మౌలిక రూపం నిర్ఘాంతపరచిన మాట వాస్తవం. తిరుగుబాటు కవిత్వం తెలుగువారికి కొత్తేమీ కాదు. అంతర్జాతీయం, అణుయుద్ధం, నగరజీవనం, వర్గపోరు, వ్యక్తిస్వేచ్ఛ, ప్రపంచశాంతి ఇన్నేసి అంశాల మీద గంపగుత్తగా ఇంత తీవ్రంగా దుయ్యబట్టిన సందర్భాలకు దిగంబర కవిత్వమే నాంది పలికింది.

రాచమల్లు రామచంద్రారెడ్డి అంతే తీవ్రంగా విమర్శనాస్త్రాలు దిగంబర కవిత్వం పైన సంధించారు. పాతికేళ్ల అనంతరం దిగంబర కవుల్లో ఒకరైన జ్వాలాముఖి స్వయంగా తెలుగు దినపత్రికల్లో ఆత్మవిమర్శ చేసుకున్నారు. బూతు పరిష్కారం కాబోదు. తిట్లు ఎవరిని మేల్కొలపవు. కాకపోతే స్తబ్దత నుంచి తిరుగుబాటు దారిలో విప్లవలక్ష్యం వైపుకు తెలుగు సాహిత్యం దృష్టిని మళ్లించినవారిగా దిగంబర కవులను జ్వాలాముఖి సూత్రీకరించడం సబబే అనిపిస్తుంది.

'హిందీ ధర్మయుగ్' లో దిగంబర కవిత్వానికి అనువాదాలొచ్చాయి. భారతీయ జ్ఞానీప్ఠ్, లహర్, పొయెట్, కొన్ని బెంగాళీ, కన్నడ పత్రికలూ దిగంబర కవితలకు అనువాదాలు ప్రచురించాయి. మూడు సంపుటాలనూ ప్రొఫెసర్ రామానాయుడు అనువదించారు. కేంద్రీయ సంస్థాన్ పురాస్కారం దిగంబర కవిత్వం అందుకుంది. ఉర్దూ, పంజాబీ, అస్సామీ భాషల్లో కూడా దిగంబర కవిత్వం అనువదించబడింది. కన్నడంలో బండాయ సాహిత్యానికి, హిందీలో సరికొత్త ధోరణులకు దిగంబర కవిత్వం స్ఫూర్తినిచ్చింది.

విచిత్రం ఏమిటంటే దిగంబర కవుల్లోని ఇద్దరు తదనంతర పరిణామ క్రమంలో మార్క్సిజం వైపుకు మళ్లితే, మరో ఇద్దరు అస్తిత్వవాదం వైపుకు వెళ్ళిపోయారు. నిర్దిష్టమైన భావజాలం, స్పష్టమైన సంస్థాగత నిర్మాణం లేని ఏ ఉద్యమానికయినా తదనంతర కాలంలో పట్టే దుర్గతే దిగంబర కవిత్వానికి దాపురించింది. జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, నగ్నముని, చెరబండరాజు 1970లో విప్లవ రచయితల సంఘంలోచేరి 1975 నాటికి మళ్లీ బైటకి వచ్చేసారు. పోతే మిగతా ఇద్దరూ భైరవయ్య, మహాస్వప్నలు వ్యక్తులుగా మిగిలిపోయారు.

విప్లవ కార్యకలాపాలలో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేసిన చెరబండరాజు.. బ్రెయిన్ ట్యూమర్తో కాలం చేసాడు. కఠిన కారాగారవాసాలు, పోలీసుల చిత్రహింసలు కారణమని కొందరి విశ్వాసం.

సాహిత్యంలో సంకోచాలను వదిలించుకొనేందుకు, అనుభూతులు యధేచ్ఛగా వ్యక్తీకరించుకొనేందుకు ప్రజాస్వామిక భూమికను సిద్ధం చేయడం వరకు దిగంబర కవితోద్యమం సార్ధకమయిందన్న వాదనతో అందరం అంగీకరించక తప్పదు.

ముగింపు: మొదటి సంపుటిలో సామాజిక రుగ్మతలు, రెండో సంపుటిలో మనిషి ఉనికి, సామాజిక అస్తిత్వం, మార్క్సిజం పట్ల సానుకూలత, మూడో సంపుటి సమస్యల పరిష్కారానికి సాయుధ పోరాటం అనే అంశాలచుట్టూ పరిభ్రమించినట్లు సాహిత్య విమర్శకులు విశ్లేషించుకుంటున్నారిప్పుడు. ఏదేమైనా తదనంతర కాలంలో సాహిత్యంలో కొత్త కొత్త ఆలోచనా ధోరణులకు వికాసానికి దిగంబర కవిత్వం దోహదం చేసిందన్న మాట మాత్రం వాస్తవం.

**ఆధార గ్రంధాలు:**

1.దిగంబర కవిత్వం – వికీపీడియా.
2.దిగంబర కవిత్వం – నిర్ధర.
3.దిగంబర కవిత్వం - సోషల్ మీడియా.

## "సినారె 'ప్ర'పంచ పదులు"

**Dr. K. Sujatha**
Lecturer in Telugu
T.R.R.Govt. Degree College, Kandukur
Cell: 9440011770

"ఎదురీదే చేతులుంటే ఏరు దారియివ్వక ఏంచేస్తుంది ?
పయనించే అడుగులుంటే బాట చేతులెత్తక ఏం చేస్తుంది?
తన కరాలు పరికరాలు తగిన పాళ్ళలో సమన్వయించుకుని –
చూపును సాచే కంటికి శూన్యం శిరసొగ్గక ఏం చేస్తుంది ?
పిడికిలి పిండే మనిషికి ఎడారి అలలెత్తక ఏం చేస్తుంది ?"

అంటూ మనిషిలో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని నింపే కవితాగానం చేసిన గొప్ప కవి సినారె. విశ్వంభర కావ్యం |ద్వారా దేశంలో అత్యున్నత పురస్కారమైన జ్ఞానపీఠాన్ని కైవసం చేసుకున్నారు సినారె. నూతన ఒరవడితో ప్రపంచపదులు రాయడమేగాక వాటిని ఆలాపన చేసి ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సినారె తెలుగు కవిత్వంలో స్పృశించని ప్రక్రియ లేదు. పద్యకవితలు, గేయకవితలు, వచన కవితలు, సంగీత నృత్యరూపకాలు, ముక్తకాలు, గజల్స్ మొ॥ కవితా ప్రక్రియలెన్నింటినో రచించారు. వీరి కవితా ప్రక్రియల్లో ఒకటి ఈ 'ప్రపంచపదులు. ఈ ప్రపంచపదుల్లో కవితలన్నీ వ్యక్తిత్వ నిర్మాణ సూత్రాలు. సినారె ప్రపంచపదులు ఐదుపాదాలతో మాత్రా ఛందస్సుతో రాయబడినవి కనుక పంచపదులు. వస్తువు ప్రాపంచిక వ్యవహారాలకు చెందినది కనుక 'ప్రపంచపదులు. రుబాయీలాగే మాత్రా ఛందస్సులో సమ మాత్రకంగా సాగిపోతూ ఐదు పాదాన్ని అదే విధంగా అనుసంధించడం దీని ప్రత్యేకత. ఒక్క మాటలో

చెప్పాలంటే రుబాయీకి ఐదో పాదాన్ని చేరిస్తే అవి ప్రపంచపదులుగా రూపొందాయి. వీనిలో 1, 2 పాదాలు పూర్వార్ధమని చెప్పొచ్చు. 4, 5 పాదాలు ఉత్తరార్ధమని చెప్పొచ్చు. మధ్యలో 3వ పాదం పాండవ మధ్యముడు సవ్యసాచిలాగా ఉండి సూటిగా విషయాన్ని అవగాహన చేస్తూ హృదయాన్ని తాకుతుంది. మూడవ పాదంలో తప్ప మిగిలి పాదాలన్నింటిలో అంత్యప్రాస నియమం ఉంది. ఇదొక విశిష్ట కవితా ప్రక్రియ. ఛందస్సు పంచపదీయం. వస్తువు ప్రపంచపదీయం. 'ప్రపంచ పదులు ఒక సం||ర కాలం పాటు ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికగా వెలువడ్డాయి.

ప్రతి మనిషి కనీసం అప్పుడప్పుడైనా తనలోకి తాను తొంగి చూసుకోవాలి. తనలో ఉన్న మలినాల్ని, లోపాల్ని, దోషాల్ని తొలగించుకోవాలి. నిత్యం శరీరాన్ని శుద్ధి చేసుకున్నట్లుగా కనీసం అప్పుడప్పుడైనా మనసుని కూడా శుద్ధి చేస్తుండాలి. లేకపోతే తర్వాతర్వాత వదిలించకోలేని స్థాయిలో చెత్తతనం, చెడ్డతనం పేరుకుపోయే ప్రమాదం ఉంది. కనుక ఆత్మవంచనను పక్కకు నెట్టి ప్రతి మనిషి తనని తాను ఉతికి ఆరేసుకోవాల్సిన అవసరాన్ని చెప్తున్నారీ క్రింది కవిత ద్వారా సినారె.

ఒదిలిపోదా జిడ్డు ఉతికి ఆరేసుకుంటే నిన్ను నువ్వే తొలిగిపోదా హద్దు కలిపి కుట్టేసుకుంటే నిన్ను నువ్వే ఈ ముసుగు కప్పుకొని ఎంతకాలం మనుసు నీడ్చుకెళతావు లేచిపోదా అహం కాచివడబోసుకుంటే నిన్ను నువ్వే పొడుచుకోదా నిజం తుడిచి రాసేసుకుంటే నిన్ను నువ్వే

ఏ ఆశ లేకపోతే మనిషిలో చైతన్యం ఉండదు. చివరకు జీవించాలనే ఆశ కూడా ఉండదు. ప్రతి పనిలోనూ, ప్రతి సందర్భంలోనూ ఏదో ఒక ఆశే మనిషిని ఆ దిశగా పయనించేలా, ప్రయత్నించేలా చేస్తుంది. ఏ చైతన్యం లేకుండా జీవితం నిస్తబ్ధంగా, నిస్తేజంగా మారితే ప్రమాదం. మనిషికి జీవితం పట్ల ఎన్నో ఆశలు, ఆసక్తులు ఉంటాయి. ఉండాలి. ఆ ఆశల్ని తీర్చుకునే దిశగా ప్రయత్నాలు ఉండాలి. వజ్రమైనా సానబెట్టకపోతే రంగు రాయిలాగే ఉంటుందనే విషయాల్ని చెప్తూ

ఏ రాపిడి లేకుండా వజ్రం ఎలా మెరుస్తుంది
ఏ అలజడి లేకుండా సంద్రం ఎలా నిలుస్తుంది.
నడిపించే చైతన్యం లేనిదే నడవదు ఈ సృష్టి
ఏ ప్రేరణ లేకుండా నాదం ఎలా పలుకుతుంది
ఏ స్పందన లేకుండా హృదయం ఎలా బతుకుతుంది అంటారు సినారె.

ఎప్పుడూ వెలుగులోనే ఉండే వారికి ఆ వెలుగు విలువ తెలియదు. జీవితమంతా సుఖంగా గడిచిపోయిన వాళ్ళకి ఆ సుఖం విలువ అర్థం కాదు. ఏదైనా శోకమో, కష్టమో చుట్టుముట్టినపుడే గడిచిపోయిన సుఖం విలువ తెలుస్తుంది. జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవం ఒక్కో సత్యాన్ని బోధపరుస్తుంది. ఎదురైన ప్రతి స్వానుభవం మనిషికొక పాఠాన్ని, గుణపాఠాన్ని నేర్పుతుంది. అలా నేర్చుకుంటూ ముందుకు సాగిపోతుండడమే మనిషి పని. జీవితమంటే కష్టసుఖాలు, వెలుగునీడలు, తీపిచేదులు అనే సత్యం కూడా ప్రతి మనిషి గ్రహించగలగాలి. షడ్రుచోపేతమైన భోజనం కావాలని ప్రతి మనిషి కోరుకుంటాడు కాని షడ్రుచోపేతమైన జీవితం కావాలని మాత్రం ఎవరూ కోరుకోరు. ఈ సత్యాన్ని గూర్చి చాలా చక్కగా వర్ణిస్తారీ క్రింది కవితలో సినారె.

పూల నునుపు తెలుస్తుంది ముళ్ళమొనలు ముడితేనే వేకువవెల తెలుస్తుంది చీకటి తెరపడితేనే రెండో పార్శ్వం చూడక నిండు నిజం చెబుతావా సుఖం విలువ తెలుస్తుంది శోకం పైబడితేనే జీవి అంతు తెలుస్తుంది చావులోతు తడితేనే ఎదిగే కొద్ది ఒదగడం చాలా అవసరమైన విషయం. ఎంత గొప్ప స్థాయికి ఎదిగినా మన మూలాల్ని మర్చిపోకూడదు. యేటిలో నీటి బుడగలాంటిది జీవితం. ఏ క్షణం ఏం జరుగుతుందో తెలీదు. ఆ మాత్రం దానికి మనిషికెందుకో ఈ ఆరాటాలు, తాపత్రయాలు అనే విషయాన్ని చాలా చక్కగా వర్ణించారీ క్రింది కవిత ద్వారా సినారె.

గాలిలోన ఎగిరిపడే గడ్డిపరక ఊపిరెంత ?
ఏటిలోన తుళ్ళిపడే నీటిబుడగ ఉనికి యెంత ?
అబ్బో దశ పట్టిందని ఉబ్బిపోతే యేం లాభం
కడిలిలోన మిడిసిపడే కప్పపిల్ల పాకుడెంత ?
నడమంత్రపు సిరి నేర్పిన దుడుకు బుద్ధి దూకుడెంత ?

పొలంలో ఏ విత్తనాలు చల్లితే ఆ పంటే వస్తుందని తెలుసు. మనం మంచి చేస్తే ప్రతిఫలంగా మనకి మంచే జరుగుతుందని, చెడుచేస్తే అదే ప్రతిఫలాన్ని మనం పొందాల్సి ఉంటుందని తెలిసినా మనిషి తన ధోరణిలోనే తాను సాగిపోతాడు. ఆయా ప్రతిఫలాలకు సంబంధించి తన లోపాల్ని గుర్తించక పోగా ఇతరుల మీద నెపం వేసే నైజాన్ని ఈ క్రింది కవితలో వర్ణిస్తారు సినారె.

మర్రిచెట్టు చూసి అనకు మామిడిపళ్ళేవి అని ముళ్ళతీగ చూసి అనకు మల్లెపూలు లేవే అని ఎంచుకున్ననాడే కాస్త ఇంగితముండాలి సుమా మంచుపొగలు చూసి అనకు మబ్బు కురవలేదె అని కబురు కలలు చూసి అనకు కరువు తీరలేదు అని ఈ లోకంలో ఎల్లప్పుడూ నమస్కరించదగ్గ వ్యక్తులు కొందరుంటారు. అయితే దురదృష్టవశాత్తు అలాంటివారికి నమస్కారాల కంటే తిరస్కారాలే ఎక్కువ ఎదురవుతుంటాయి. ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా తట్టుకుని నిలబడతారే తప్ప అట్టివారు తమ స్వభావాల్ని మార్చుకోరు. సత్ప్రవర్తన విషయంలో ఏ మాత్రం రాజీపడరు అట్టి వారిని గూర్చి వర్ణిస్తూ

గిరులెదురై పొమ్మంటే తిరిగిపోదు ఝరీగుణం కడుపును కలచే వ్యధలకు ఉడిగిపోదు ధరాగుణం స్థితి తప్పని గుణముంటే క్షతియేది మృతియేది తన శ్వాసను కోస్తున్నా అణిగిపోదు క్షమాగుణం తనను పీల్చివేస్తున్నా తరిగిపోదు దయాగుణం అంటారు సినారె.

ప్రతి వ్యక్తిని, ప్రతి విషయాన్ని ఏదో ఒక అనుమానపు దృష్టితో చూడడం అందరికి ఒక సహజ లక్షణంగా మారిపోయింది. ఒకరి బాగోగులను గూర్చి విమర్శించే అధికారం గాని, అర్హత గాని మనకుందా అనే విషయాన్ని విస్మరించి ఎదుటివాళ్ళపై తెలిసో తెలియకో రాళ్ళేయడం సాధారణ విషయమై పోయింది. ఒక సంఘటన లేదా ఒక సన్నివేశం ఆధారంగా ఎదుటి వ్యక్తి వ్యక్తిత్వంపై తోచిన ముద్రలేయడం సమంజసం కాదనే విషయాన్ని దాదాపు అందరూ విస్మరించడం విస్మయాన్ని కలిగిస్తుంది. బాగా చదువుకున్న వాళ్ళు కూడా ఇలాంటి ఇరుకు మనస్తత్వాలను కలిగి ఉండడం శోచనీయమైన విషయం. ఈ విషయాన్ని గూర్చి చెప్తూ

ఎంతటి సత్యానికైనా ఏవో కల్లలు బాధలు ఎంతటి దేశానికైనా ఏవో ఎల్లల బాధలు బాధలు లేనిది యెవరికి ఏదో ఒక రూపంలో ఎంతటి శీలానికైన ఏవో ధూర్తుల బాధలు ఎంతటి సింహానికైనా ఏవో దోమల బాధలు అంటారు సినారె.

ఎంత ఎత్తుకైనా ఎదగాలి. ఎదిగే కొద్ది ఒదగాలి. డబ్బుందనో లేదా అధికారముందనో అహంకారంతో కన్నుమిన్ను కానక మిడిసిపాటు పడేవాళ్ళు ఏదో ఒకనాడు ఖచ్చితంగా పశ్చాత్తాప పడవలసి వస్తుంది. స్థితిగతులన్నింటిని సమదృష్టితో చూడగలిగే తత్త్వం గొప్పది. ఇవాళ మన దగ్గరున్నవేవి కూడా మనకి శాశ్వతం కాదు. గర్వం దరిచేరితే ఆ వెనకే పతనం పొంచి ఉంటుంది. ప్రతి మనిషి ఈ సత్యాన్ని గ్రహించాలి. ఎంత ఉన్నతస్థానానికి ఎదిగిన వ్యక్తినైనా గర్వం ఆవహిస్తే, అతనెక్కడ నుండి ప్రారంభమయ్యాడో అక్కడికి తెచ్చి పడేస్తుంది గర్వం. తస్మాత్ జాగ్రత్త అంటూ...

అడుగు తప్పితే జారిపడక తప్పదు మెట్టు నుంచి పరిధి దాటితే మరుగుపడక తప్పదు జట్టు నుంచి కుదురుగా ఉంటేనే పదవికుంటుందిరా విలువ పురులు చెదిరితే ఊడిపోక తప్పదు కట్టు నుంచి పొంగు ముదిరితే పొర్లిపోక తప్పదు గట్టు నుంచి అంటారు సినారె.

ఎంత చదువు చదివినా, ఎన్ని పండిత సభల్లో పాల్గొన్నా, మనిషిగా ఏ జ్ఞానం అవసరమో ఆ జ్ఞానాన్ని పొందలేకపోతే ఆ చదువు, ఆ పాండిత్యం వృధా అనే విషయాల్ని గూర్చి వక్కాణిస్తూ....

ఎన్ని మెట్లు ఎక్కావని కాదు ఎంత ఎత్తుకెదిగావనీ ఎన్ని మునకలేశావని కాదు ఎంత లోతు చూశావనీ గమనం సార్థమవుతుంది నీ గమ్యాన్ని చేరినప్పుడే ఎన్ని సభలు తిరిగావని కాదు ఎంత బుద్ధి పెంచావనీ ఎన్ని కృతులు చదివావని కాదు ఎంత సిద్ధి పొందావనీ అంటారు సినారె.

**ముగింపు:** సినారె ప్రపంచపదులు దైన్యాన్ని పోగొట్టి ధైర్యాన్నిస్తాయి. నిరాశను పారద్రోలి ఆశలను చిగురింపచేస్తాయి. మనిషి తన లక్ష్యాన్ని చేరుకోవడానికి తగిన చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని అందిస్తాయి. ఇవి వ్యక్తిత్వ నిర్మాణ సూత్రాలే కాదు, గొప్ప తాత్త్వికతను కూడా ఇముడ్చుకున్న కవితా రత్నాలు ఈ ప్రపంచపదులు.

అడుగడుగున రేగే అలజడులకు అదరని శిరసే సముద్రం ఎన్ని రుతువులు పీల్చివేసినా ఇంకని సొగసే సముద్రం సముద్రమంటే ఉప్పు నీరనే భ్రమలో పడివుంటే యెలా కునుకే కరువై కలత కూల్చినా కుంగని మనసే సముద్రం నింగి విరిగి తన మీద కూలినా లొంగని మనిషే సముద్రం

**ఉపయుక్త గ్రంథాలు:**

1. 'ప్రపంచ పదులు - సి. నారాయణరెడ్డి
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి.

## విమలగారి వంటిల్లు కవితలో 'స్త్రీ' జీవితం

లాలం అచ్చియ్యమ్మ

తెలుగు అధ్యాపకులు
విశాఖపట్నం.

**స్థూల పరిచయం:-**

ఆధునిక కవిత్వంలో రెండు దశాబ్దాలుగా వికసించిన కొత్త కవిత్వాన్ని స్త్రీవాద కవిత్వాన్ని పరిచయం చేయటం ఈ వ్యాసం ఉద్దేశ్యం. స్త్రీలు రచనలు చేయటం 1980 నాటికి ప్రారంబమయ్యింది. స్త్రీలు హక్కులు, విలువలకోసం పోరాటం మొదట పాశ్చ్యాత్యదేశాలలోనే ప్రారంబమయ్యింది.ఇకమన దేశంలో 18వశ॥ అని చెప్పాలి. స్త్రీలపట్ల వివక్ష, అణచివేత, లైంగిక వివక్ష, వివాహవ్యవస్థ, గృహహింస, ఇలా ఎన్నో విదాలుగా స్త్రీ అనగద్రొక్క బడుతుంది. వీటి నుండి విముక్తి కలగాలని స్త్రీవాదరచయితలు తమ కవితలు ద్వారా ఆడపిల్లలసమస్యలును బయట ప్రపంచానికి తెలియపరిచారు. విమలగారి వంటిల్లు కవితలో స్త్రీ పురుషుల మద్య సామాజిక, ఆర్ధిక, రాజకీయ అసమానతలు ఉన్నాయనే విషయం మనకు తెలుస్తుంది-ఈ కవిత ద్వారా తెలియపరుస్తాను.

ఉపోద్ఘాతం:-
1960 నాటికి స్త్రీవాదం స్పష్టమైన రూపాన్ని తీసుకొచ్చింది. 1966 తరువాత స్త్రీ విముక్తి బృందాలు ఏర్పడ్డాయి. స్త్రీ అమ్మ, అక్క, చెల్లి, ఇలా అనేక రూపాలలో కుటుంబానికి, సమాజానికి ఎంతో తోడ్పాటును అందిస్తూనే ఉంటుంది. కాని స్త్రీ కష్టాన్ని అర్ధంచేసుకునేవారు ఈ సమాజంలో కొందరే. స్త్రీకి కూడా ఓటుహక్కు, విధ్యా, ఎన్నికలలో పోటీచేసే హక్కు, గర్భస్రావహక్కు వీటన్నింటినీ ప్రపంచ స్త్రీలు పోరాటాలుద్వారానే సాదించారు. ఇంకా ఇప్పటికీ చాలా దేశాలలో కనీసం స్త్రీ విద్యాహక్కుకూడా లేని సమాజాలు ఉండటం దురదృష్టకరం. మన ఆంధ్రప్రదేశ్లో కందుకూరి, చలం స్త్రీ అభ్యున్నతికి పాటుపడ్డారు. ఓల్గా అన్నట్లు "ప్రతీ స్త్రీ ఒక నిర్మల కావాలి". అప్పుడే సమాజాలు బాగుపడతాయి. దేశం, ప్రపంచం సౌఖ్యంకలిగి ఉంటుంది.
విషయం:- విమల వంటిల్లు కవితలో స్త్రీ జీవితం ఈకవితలో అమ్మ జీవితం కనిపిస్తాది, అందరి అమ్మ కధ ఒక్కటే స్త్రీలు అనుభవాలు, అనుభూతులు, ఉద్వేగాలు, ఆవేదనలు, ఆందోళనలు ఈ కవితలు ద్వారా మీరు తెలుసుకోగలుగుతారు.

విమల హైదరాబాద్ రెడ్డి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ చదివిన తరువాత తెలంగాణా సాయుద పోరాటంలో పాల్గోన్న తండ్రివారసత్వం నుండి విద్యార్ధి రాజకీయాలలో భాగస్వామిఅయ్యింది. విమెచనా, విముక్తి పత్రికలను నిర్వహించింది. ఈమె రాసిన వంటిల్లు కవితలో తెగబడిన మా కలల ప్రపంచం. స్త్రీ తల్లిదండ్రుల నీడలో బ్రతుకుంది అంటే చిన్నప్పుడు తండ్రి కర్కుడైతే తల్లిపడిన బాద, అవేదనను చూస్తూబ్రతుకుతూ పెళ్ళైయ్యాక అదే విదమైన బర్తదొరికితే ఆ స్త్రీ బ్రతుకు ఎంత అగమ్యగోచరమ ఏదైనప్పటికీ స్త్రీ వంటింటి సామాజ్యానికి పేరుకు అధిపతి, గిన్నెలన్నింటి పైనా నాన్న పేరే అంటే నాన్నే సాసిస్తాడు. అమ్మ వంటింటిలో విరామం, విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే ఉంటుంది. ఆమె పడే బాద పితృసామ్య సమాజంకు కనిపించదు, వినిపించదు. అందుకే "ఈవంటిల్లు ఒక వదలని మొహమై బాల్యాన్నంత చుట్టేసుకుంది" నాకు మా వంటిల్లోక మాయాబజారు అనిచెప్పటంలో వాస్తవమేదో బ్రమేదో అర్ధంచేసుకోవటం కష్టం ఆడపిల్లలను స్త్రీలగా తీర్చిదిద్దే కర్మాగారం, స్త్రీ జీవితచక్రం వంటిల్లు సేవలే కానీ ఆర్ధిక విలువ ఉన్న శ్రమకాదు. దీనికి గుర్తింపు, గౌరవం లేదు పురాతన కాలం నుండి స్త్రీ అంటే అమ్మ, అమ్మ చేసే ప్రతిపనిలో ప్రేమ, దయ అన్నీ ఉంటాయి. ఇంట్లో అందరికోసం అహర్నిషలు కష్టపడుతుంది.

ఆ కష్టాన్ని ఎంత మంది గుర్తుస్తున్నారు. ఈ ప్రపంచలో ఎవరి ఋణం అయినా తోర్చుకోగలరేమే కాని స్త్రీ (అమ్మ) ఋణం ఎవరైనా తీర్చుకోగలరా. ఆమెకష్టానికి ఎన్ని చేసినా

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

తక్కువే. తడికట్టెలు పోగ దగ్గర ఏడ్చి ఆమె కళ్ళు ఎంతకూ మండని పోయ్యిముందుకూర్చుని కన్నీళ్ళు కారటం మనకు తెలుసు. అట్లా ఏళ్ళ తరబడి పనిచేస్తూ ఆరోగ్యం పాడయ్యి అగమ్యగోచరమైన జీవితాలు ఎన్నో. తనది కాని ప్రాంతాలులో తిరుగుతున్న భయం, నిఘామద్య పనిచేస్తూంది. నీరాశ, దుఃఖంతో జీవించే అమ్మ కవిత ఇది. విమలగారు వంటిల్లు కవితలో స్త్రీలు పడే తీరికలేని వంటింటిచాకిరీతో తమ ఆకాంక్షలు వెరవేర్చుకోవటానికి వెచ్చించగల సమయంగానీ, అవకాశంగానీ వాళ్లకు లబించదు. ఫలితంగా స్త్రీ జీవన ఉత్సాహాన్ని కోల్పోతుంది. వంటింటిని కేంద్రంగా చేసుకొని అభివృద్ధి చెందిన లింగవివక్ష సంస్కృతిని ధ్వంసం చేయాలి. ఆమె ప్రతిభ, ఎలాంటిదైనాకానీ ఆమెఎంతటి సామాజిక హోదా ఉన్నాకానీ వంట తన కర్తవ్యం అన్నవిషయం మాత్రం ఆమె మరువకుండా చేస్తుంది. అదృష్టవసాత్తు నేనొక మంచి వంటింట్లో పడ్డానన్నరంతా. గ్యాసు, గ్రైండర్లు, సింకులు, టైల్స్ అంటూ మరల నేనొక అలంకరించిన వంటగదిలా అని విమల అన్నమాటలకు అర్ధం అధునిక సమాజం అభివృద్ధి చెందినప్పటకీ నేను స్త్రీనే అప్పటి అమ్మలానే ఈ సామ్రాజ్యానికి నేనే రాణి గిన్నెల పైన మాఆయన పేరే వంటింటి రూపం మారింది.అంతస్సారం ఒక్కటే నేను 'కీ' ఇచ్చిన బొమ్మనే భవిష్యత్ గురుంచి తమ పిల్లలు అయినా ఈ రాక్షసి గద్ద అయిన వంటింటి బారిన పడకుండా అంటే స్త్రీలు పట్ల బాధ్యత కనిపిస్తుంది.శ్రమ అనేది సామాజీకరించబడాలని సామూహిక వంటశాలలు కూడా ఏర్పడవచ్చు. ముఖ్యంగా స్త్రీ వంటింటికి మాత్రమే పరిమితం అనే బావన పోవాలి.

ఆధునిక కాలంలో కొంతమార్పు వచ్చింది. కాని ఇంకా స్త్రీ ఈ పరాకాష్టకి బలి అవుతూనే ఉన్న ఇండ్లు చాలానే ఉన్నాయి. స్త్రీ సృజనాత్మకత ప్రతిభతో అబల సాధించలేనిది ఏదీ లేదని స్త్రీలు గౌరవ సభలో ఆధరించి స్త్రీ వ్యక్తిగా మాత్రమేకాదు మహోన్నతశక్తి అని గుర్తించబడాలి.

ముగింపు:- పైన చెప్పిన పంక్తులలో స్త్రీ జీవితం వంటింటి సామ్రాజ్యానికి బందీ, బానిసగా బ్రతకటం వలన సమాజ అభివృద్ధికి ఆటంకమే స్త్రీకి గౌరవం దక్కాలి, కుటుంబ హింస నుండి బయటకురావాలి. స్త్రీలు తాముచైతన్యవంతులు అవుతూ పురుషులను చైతన్యవంతులుగా చేసుకోవాలి, ఓల్గా, జయప్రద, కొండేపుడి నిర్మల, జయ, ఈశ్వరి వీళ్ళంతా స్త్రీ పురోబివృద్ధి కోసం ఎన్నోకవితలు వ్రాసారు. సమస్థాయి సహజీవన సంబంధాలు స్త్రీ పురుషులు మద్య ఏండాలన్న ఉన్నత ప్రజాస్వామిక లక్ష్యంతో వచ్చిన స్త్రీ వాద అధ్యయనం ఈనాటికి అవసరం. స్త్రీ లేనిదే సృష్టిలేదు అందరికి తెలిసిన విషయమే అచరణలో పెట్టినప్పుడు మానవ జీవితసంబంధంకు విలువ ఉంటుంది. రానున్న తరమైన ఈ వివక్షల నుండి బయట పడాలని విమల ఆకాంక్ష. మన సమాజంలో స్త్రీ ఎన్ని అగచాట్లు అనుబవిస్తూ తనలో తాను ఘర్షనకు లోనవుతూ బ్రతుకుతుందో వాళ్ళ జీవితంలో వెలుగు వస్తేనే స్త్రీవాద కవిత్వనికి విలువ ఉంటుంది.

**అధారగ్రంథాలు :**

1) ఆధునికాంధ్ర కవిత్వం-సంప్రదాయం-ప్రయోగాలు, సి.నారాయణ రెడ్డి
2) తెలుగు సాహిత్యం కవితా కళాపరిచయం, బి.రామరాజు
3) తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానాశాస్త్రి
4)తెలుగులో స్త్రీల సాహిత్యం, కాత్యాయని విద్మహే
5) నీలిమేఘాలు అస్మితసంకలనం

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# కుందుర్తి – వచనకవితాతత్త్వం

**నల్లపనేని విజయలక్ష్మి**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) గుంటూరు
చరవాణి:9701667350

**పరిచయం:** ఈ రోజున కవిత్వం అంటే వచన కవిత్వమే. అంతగా వచన కవితారూపం స్థిరపడటానికి ఉద్యమస్థాయిలో కృషి చేసినవాడు కుందుర్తి ఆంజనేయులు. వచన కవితా పితామహుడు. 'నా ఉద్యమం యిప్పుడే తొడిగిన మొగ్గ / అది విచ్చుకొని నలుదిక్కులా పరిమళం వెదజల్లుతుంది' అన్నాడు కుందుర్తి. ఆయన ఆశించినట్లుగానే మొగ్గ విచ్చుకొని నల్దిక్కులా తన పరిమళాన్ని వెదజల్లింది. వెదజల్లుతూనే ఉంది. ఇంతకూ వచన కవిత్వం స్వరూప స్వభావాలను గురించి, వచన కవిత్వం రాసే కవులు పాటించవలసిన జాగ్రత్తలను గురించి కుందుర్తి ఎటువంటి అభిప్రాయాలను వెల్లడించాడు? ఈనాడు కుందుర్తి అభిప్రాయాల ప్రాసంగికత ఏమిటి? అనే అంశాలను పరిశీలించటం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

**ఉపోద్ఘాతం:**

'పాతకాలం పద్యమైతే
వర్తమానం వచన గేయం'

వచన కవితను చేపట్టిన ఇతర కవులు దానిని ఒక ప్రయోగంగా మాత్రమే భావించిన సమయంలో దానిని ప్రజల అభ్యున్నతికి ఉపకరించే ప్రయోజనాత్మక కవితా ప్రక్రియగా గుర్తించిన గుండె పలికించిన 'నాదమిది. వచన కవితకు తీవ్రమైన వ్యతిరేకత ఉన్న కాలంలో దానికి ప్రజామోదం కలిగించే బాధ్యతను స్వీకరించినవాడు ఆ 'నాద' కర్త కుందుర్తి.

కుందుర్తి సాహిత్య ప్రస్థానాన్ని పరిశీలిస్తే తొలి దశలో ఆయన కూడా పద్యకవిత్వాన్ని అభిమానించినవాడేనని తెలుస్తుంది. గుఱ్ఱం జాషువా, చిలకపూడి వేంకటేశ్వర్లు గార్ల శిష్యరికం తెలుగు కవిత్వం, సాహిత్యాల పట్ల కుందుర్తిలో ఆసక్తిని పెంచితే, విశ్వనాథ గారి శిష్యరికం ప్రాచీన సాహిత్యాధ్యయనం పట్ల అనురక్తిని పెంచింది. తన బంధువైన పోలూరి ఆంజనేయ ప్రసాద్ తో కలసి జంట కవిత్వం చెప్పటం, సౌప్తికం పేరుతో రెండు వందల పద్యాల ఖండికను రాసి గురువైన విశ్వనాథకు అంకితమివ్వటం తత్కాల తాత్కాలిక ప్రభావంతోనే. డిగ్రీ చదువుకునే రోజుల్లో కమ్యునిష్టు ఉద్యమ ప్రభావానికి లోనవ్వటం, మార్పును కోరుకునే సహజ స్వభావం కుందుర్తిని కొత్త తోవకు మళ్ళించాయి. నవ్యకళాపరిషత్ సభ్యుడుగా, నయాగరా కవిగా ప్రారంభించిన ఆధునిక సాహిత్య ప్రస్థానం ఆయనను వచన కవిత్వోద్యమ గమ్యానికి చేర్చింది. ఆయనకు ఆధునిక సాహిత్య చరిత్రలో వచన కవితా పితామహుడుగా శిఖరాయమానమైన కీర్తిని అందించింది.

**కుందుర్తి వచనకవితాతత్త్వం:** వచన కవిత్వం అసలు కవిత్వమే కాదన్న ధోరణి కవి పండితులలో బలంగా ఉన్న కాలంలో కుందుర్తి వచన కవిత్వాన్ని నిలబెట్టటానికి నిర్విరామ కృషి చేశాడు. వచన కవిత్వం గురించి ఎన్నో అమూల్యమైన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. ఎందరో యువకవుల పుస్తకాలకు రాసిన ముందుమాటలలో (ఇవే తరువాతి కాలంలో 'కుందుర్తి పీఠికలు' పుస్తకంగా వెలువడ్డాయి), వేరు వేరు సందర్భాలలో రాసిన వ్యాసాలలో (ఇవే తరువాతి కాలంలో 'కుందుర్తి వ్యాసాలు' పుస్తకంగా వెలువడ్డాయి), 'నాలోని నాదాలు' కవితా సంపుటిలో ఆయన అభిప్రాయాలను మనం గమనించవచ్చు.

'గ్రంథాలలో బంధించింది కాక/నాల్కల మీద నర్తించే భాషలో' రాయటం పట్ల ఆయనకు మక్కువ. వచన కవిత అనేది కవిత్వ రూపమే కదా! కవిత్వంలో వస్తువు ప్రధానం. అది ఏ రూపంలో ఉన్నా రసవంతంగా ఉండటం ముఖ్యం. అప్పుడు వచన కవిత్వాన్ని ప్రచారం చేయటం ఎందుకు? అని ప్రశ్నించే వారికి మొదట ఆయన సమాధానం చెప్పవలసి వచ్చింది. తెలుగులో ఆధునిక కవిత్వం కవిత్వానికి నూతన రూపాన్వేషణతో (ముత్యాలసరాలు) ప్రారంభమైంది. ఆధునిక కవిత్వంలోని వస్తు నవ్యత రూప నవ్యతను కోరుకుంటుంది అన్న విషయాన్ని వారికి గుర్తు చేసి, అభ్యుదయ కవితా వస్తువును ప్రజలలోకి తీసుకొని వెళ్ళటానికి, ప్రజలలో భావవిప్లవం తీసుకొని రావటానికి వచన కవితా రూపం అవసరాన్ని తెలియజెప్పాడు.

ప్రాచీన కవితా సంప్రదాయాలను చక్కగా గ్రహించినవారే ఆధునిక కవిత్వం బాగా రాయగలరు అనే సాధారణ అభిప్రాయం ఉంది. కుందుర్తి ఈ అభిప్రాయంతో విభేదించాడు. ఆధునిక కవులు ఆధునిక సాహిత్యానికి శుభారంభం పలికిన గురజాడ, వచన కవితారంభకుడైన శ్రీశ్రీ తదితరుల కవితలు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే చాలు అంటాడాయన. వీరిరువురి కవితలు అధ్యయనం చేయటంతోపాటు ఆంగ్లం సాయంతో ఇతర ప్రపంచ భాషలలోని సాహిత్య రీతులను అవగాహన చేసుకోవాలి. దానితో పాటు తెనుగు శబ్దాల సాధుత్వం, అర్థ స్ఫురణ శక్తి, వ్యవహార భాషా ప్రయోగ నైపుణ్యం తెలియాలి. అప్పుడు చక్కని వచన కవిత్వం రాయవచ్చునంటాడు. అదే సమయంలో పూర్వ కావ్యాలు చదవకూడదనే నిషేధం ఏమీ లేదని, కవి అయిన వాడికి ఎంత చదివితే అంత మంచిదే నని స్పష్టం చేశాడు.

ఛందస్సు, అలంకారాలు, కావ్యభాష తదితరాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయనవసరం లేదు కాబట్టి వచన కవిత్వం రాయటం చాలా తేలిక అని భావించేవారు

నాడూ ఉన్నారు. నేడూ ఉన్నారు. అటువంటివారికి అలంకారశాస్త్ర గ్రంథాల కంటె కష్టతరమైన లేక కనీసం దానితో సమానమైన సాధన ఏదో ఉంటేనే గాని వచనకవిత్వం రాణించదనే విషయం స్పష్టం చేశాడు. ఆయన దృష్టిలో 'గొప్ప భావాన్ని సహజంగా, సరళంగా అందించిన వాడే గొప్ప కవి'. నిరాడంబరత, నిష్కల్మషత, అక్లిష్టత, స్పష్టత కలిగి సామాజిక ప్రయోజన సాధకమై ఉంటే అప్పుడు ఆ కవిత మహా కవిత్వ లక్షణాలను కలిగి ఉన్నట్లుగా ఆయన భావించాడు.

నిరాడంబరత అంటే నిరలంకారత కాదు. 'జీవితానికి దగ్గరగా తెచ్చేముందు కవిత్వాన్ని చొక్కాలు విప్పించి తీసుకురావలసిన పని లేదు. అలంకారాలు, అందచందాలతో తీసుకురావచ్చు. తీసుకురావాలి కూడా. ఉక్కు కవచాలను, శిరస్త్రాణాలను తగిలించాకుండా వుంటే చాలు' అంటాడు. ఆయన దృష్టిలో సామాజిక ప్రయోజనం అనేది వచనగేయానికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణం. 'బాహ్య సౌందర్య చిహ్నమైన ఛందస్సును వదలి అంతస్సౌందర్య దర్శనం కొరకు చేసే అన్వేషణ వచనగేయం'. 'వృద్ధురాలైన రీతిని వదలి పునర్ యౌవన నీతికై చేసే పెనుగులాట వచనగేయం'.

ఆధునిక కవిత్వంలో వర్ణనలు వర్ణనల కోసం కాదు. ఏదో ఒక ప్రయోజనమున్నప్పుడే వర్ణన ఉంటుంది. దానిని దృష్టిలో పెట్టుకొని 'వర్ణనకు ప్రబంధం పుట్టిల్లైతే, ఆధునిక కావ్యం అత్తవారిల్లు. ఇక్కడ వర్ణన చెప్పినట్లు వినాల్సిందే గాని తోక నాడించటానికి వీల్లేదు' అని వ్యాఖ్యానించాడు కుందుర్తి, వచనగేయం వ్యావహారిక భాషా ప్రయోగ సంపన్నమైతేనే తెలుగువారిని ఆకట్టుకోగలుగుతుందని కుందుర్తి భావించాడు. 'కవిత్వం తెనుగు ప్రజల సంభాషణ స్థాయికి రావాలి. తెలుగు పలుకుబడి, తెనుగు నుడికారము అందులో పూర్తిగా ప్రవేశించాలి. తెనుగు ఇడియం పుష్కలంగా ఉండాలి... వ్రాసిన కవి మాట్లాడేటప్పుడు ఎంతగా అలంకారాలు సంభాషణలో ప్రవేశిస్తాయో అంతవరకే రాసిన కవితలో కూడా ప్రవేశించాలి. అప్పుడే కవిత రాణిస్తుంది'. తెలుగులో చొరబడిన సంస్కృత శబ్దాల నన్నింటిని వాడి వాటికి జీవం పోయటానికి ప్రయత్నించటం కంటె సజీవమైన వ్యావహారిక భాషా శబ్దాలను వాడటం మంచిదని ఆయన అభిప్రాయం. కవిత్వం మేధో క్రీడగా మిగిలిపోకూడదని ఆయన కోరుకున్నాడు. అందుకే 'కవిత్వం బాగా చెడిన రూపం నాగబంధమైతే, బాగా బాగుపడిన రూపం వచనగేయం' అని వ్యాఖ్యానించాడు. కవిత్వం సాధారణ ప్రజల సంభాషణ స్థాయికి రావాలి అని కుందుర్తి ప్రతిపాదించినప్పటికీ సాధారణ సంభాషణకు భిన్నమైన లయ కవిత్వానికి జీవమన్నవాస్తవం ఆయన హృదయాంతరాళంలో నిక్షిప్తమై ఉంది. అందువల్ల అంత్యప్రాసలను వదులుకోలేకపోయాడు.

తొలగబోతే జోలికి వచ్చి/గుండెలో కాంక్షా జ్వాలలు గ్రుచ్చి (నాలోని నాదాలు-26)
పూల రాసుల్ని కాలితో తోసేసి/కాలాన్ని బిరడా పెట్టి సీసాలో మూసేసి (నాలోని నాదాలు-16)
ఇలా నువ్వు ఆగిపోతే కాలం నడిచే దెట్లా? /చీకటి వెలుగు లేకుండా జీవితం గడిచేదెట్లా?(నాలోని నాదాలు - 9) ఆ విషయాన్ని కుందుర్తి కూడా గుర్తించాడు. వాస్తవాన్ని అంగీకరించాడు.
అంతటి విప్లవం తెచ్చి/అంత్యప్రాసలకు లొంగానని/విహంగం వెక్కిరించింది (నాలోని నాదాలు-26)

కవిత్వం ద్వారా సాధించవలసిందేమిటి? అనే విషయం మీద కుందుర్తికి స్పష్టమైన అవగాహన ఉంది. కవిత్వం సామాన్యుడి బాధల గాథల వెనుక దాగిన వాస్తవాలను వెలికితీయాలి. మంచి, చెడు తెలియజెప్పాలి. చీకటికి లొంగని, వెలుగు చూసి వెర్రిగా పొంగని స్థితప్రజ్ఞతను అలవరచాలి. ప్రతి హృదయంలో ప్రేమను వెలిగించాలి. అందమైన భవిష్యత్తును దర్శింపజేయాలి. జ్ఞాన లోచనం విచ్చుకునేలా చేయాలి. (నాలోని నాదాలు-10) ఇంతగా ప్రజలను అభ్యుదయ మార్గం పట్టించటం కవిత్వ లక్ష్యం కావాలని పోరాడిన

కుందుర్తి తానే మరో సందర్భంలో కవిత్వ ప్రధాన ప్రయోజనం ఆనందమేనని అంగీకరించాడు.
ఆకలి కాని వనమూలిక అమ్మకానికి వచ్చింది/ ఆనందానికి మారు పేరు/కవిత్వం దాని పేరు (నాలోని 3-15)

వచన కవిత ఎలా ఉంటే నిలబడగలదో ఆలోచించి కుందుర్తి అనేక ప్రతిపాదనలు చేశాడు. వాటిలో కథాకావ్య సిద్ధాంతం ఒకటి. కవిత్వంలో కథాంశం లేనప్పుడు అవి కేవలం ప్రబోధ గేయాలు, వర్ణనాత్మక రచనలుగా మిగిలిపోవటం, రసపోషణకు అవకాశం లేకపోవటం జరుగుతుందని ఆయన భావించాడు. 'నేటి వరకూ వచనగేయం కవితా ఖండికల రూపంలోనే కాలం గడుపుతున్నది. సంపూర్ణ కావ్య దృష్టి అలవరచుకోలేదు' అనేది ఆయన పరిశీలన. 'శ్రవ్యకావ్యం సమగ్రంగా ఉండాలంటే జీవితంలోని వివిధ సంఘటనల చిత్రణ, పాత్రల స్వభావ పరిశీలన ఉండాలి. అంటే నాటకీయత ఉండాలి. సామాన్య ప్రజల కథా వస్తువులను ఆలంబనగా తీసుకుంటే వచనగేయం చేయలేని పని అంటూ ఉండదు. పూర్వ ఛందస్సులను తోసిరాజన్నందుకు ప్రతిఫలంగా మహాకావ్యాలను సృష్టించవచ్చు'. ఇది ఇప్పటికీ ప్రాసంగికత కలిగిన అభిప్రాయం. ఇప్పటికీ వచన కవిత్వం కవితా ఖండికల రూపంలోనే ఎక్కువగా వెలువడుతున్నది. అడపా దడపా దీర్ఘకవితలు వస్తున్నప్పటికీ సంపూర్ణ కావ్య దృష్టితో వెలువడటం లేదు.

'వేల పూలు వికసించనీయండి' అన్నది కుందుర్తి నినాదం. కవిత్వం రాసేవాళ్ళను ప్రోత్సహించాలని, సాధనతో వారు మెరుస్తారని, శబ్ద సాధుత్వం లేదనో, రాసింది వచనంలా ఉందనో, మరొకటనో, మరొకటనో విమర్శించి వారిని నిరుత్సాహపరచటం న్యాయం కాదంటాడు.

కుందుర్తి యువ కవులకు కొన్ని సూచనలు కూడా చేశాడు. 'వస్తువు ఏదైనా దానిని చెప్పే తీరులో కవి ప్రతిభ దాగి ఉంటుంది. కనుక రాసే క్రమంలో తమదైన ప్రత్యేకతను యువతరం కవులు చూపాలి. ఎవరికీ వారు రచనా శిల్పాన్ని గురించి ఆత్మ విమర్శ చేసుకోవాలి. తాను రాసే పంక్తుల్లో వచనత్వం తొంగి చూడకుండా ఉండటానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆలోచించాలి'. మరీ పేలవంగా వుండి, యిది నినాదాల కవిత్వం అనిపించుకునేంత వాచ్యంగా వుండడమూ, కవి పండితులకు కూడా అర్థం కానంత క్లిష్టంగా వుండడమూ, నూతనత్వం కోసం ఆంగ్ల శబ్దాడంబర ప్రదర్శనం- ఈ మూడు దోషాలను పరిహరించినపుడు మంచి వచన కవిత్వం వస్తుందంటాడు కుందుర్తి.

వచన కవిత్వంలో పాదం విరుపు గురించి కుందుర్తి స్పష్టమైన అభిప్రాయాన్ని ప్రకటించాడు. ఈ విషయంలో పాఠకుల సౌకర్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని, పాదాంతం అర్థవంతంగా ఉంటే బాగుంటుందని ఆయన సూచన.

ప్రోస్ పొయిట్రీకి, పొయిటిక్ ప్రోస్ కి ఉన్న తేడాను గమనించటం అవసరం అన్నాడు కుందుర్తి. 'ఇది కవిత్వమా, వచనమా అని తేల్చుకోవడం కేవలం అచ్చు వేసిన పద్ధతిపై మాత్రమే ఆధారపడి ఉండదు. కవిత్వంలోనూ, వచనంలోనూ వాక్య నిర్మాణ వైఖరులలో చాలా తేడాలు వుంటాయి. 'వచ్చెనాతడు భీముని పగది' అని వచనంలో రాసినవాడు ప్రారంభించడు. శక్తివంతంగానో, క్లుప్తంగానో, మరోకవిధంగానో చెప్పడానికి కవి వాక్య నిర్మాణంలో ఒకానొక వక్రతను ఆశ్రయిస్తాడు. వచన రచయితకు ఆ అవసరం ఉండదు' అని స్పష్టంగా ఆ తేడాను వివరించాడు. వ్యాస కవిత్వం (Essay Poetry) వంటి నూతన సృజనాత్మక ప్రక్రియలు ముందుకు వస్తున్న తరుణంలో కుందుర్తి ఆలోచనలు పునః స్మరణీయం.

సామాజిక అభ్యున్నతి సందేశంగా గల అభ్యుదయ కవిత్వానికి వస్త్వాశ్రయ మార్గమే సరైనదని ఆయన అభిప్రాయం. 'శాస్త్రవేత్తకు సృష్టిలోని మూల సూత్రాలను గురించి పరిశీలించటం ఎంత అవసరమో రచయితకు మనస్తత్వ నిరూపణ అంత అవసరం'

అంటాడు కుందుర్తి రచన చదివిన తరువాత పాఠకుని మీద ఏ విధమైన ప్రభావం చూపించగలిగింది, జీవితం మీద ఒక నిర్దిష్ట దృక్పథాన్ని అతనిలో ఎంతవరకు కలిగించగలిగింది అనే దానిమీద ఆ రచన గొప్పతనం ఆధారపడి ఉంటుంది కనుక రచయితకు శాస్త్రీయమైన దృక్పథం ఉండాలి అన్నది ఆయన అభిప్రాయం.

'ఫ్రీ వర్స్ రచనా పద్ధతి విజయవంతం కావాలంటే ప్రతి గేయానికి ఒక Central theme, Central Idea ఉండాలి'. ఊహ పుష్కలంగా ఉన్నప్పటికీ theme అంటూ ఉండకపోవటం, దాని వల్ల ఎక్కడికక్కడ పంక్తులు తీర్చిదిద్దినట్టు అందంగా ఉన్నపటికీ, గేయం మొత్తం చదివాక అసంతృప్తి కలగటం, Central Idea లేకపోవటం వల్ల ఒక్కోసారి గేయంలోని కొన్ని పంక్తులు మొత్తం గేయానికి ఎదురు తిరిగి మాట్లాడటం, ఐక్యత చెడిపోవటం తదితర అంశాలను వివరంగా చర్చించాడు కుందుర్తి.

స్వేఛ్ఛా ప్రకటనమనే ప్రయోజనాన్ని సాధించటం కోసం సంప్రదాయ ఛందస్సులను వదిలివేసినప్పటికీ ఛందస్సు యొక్క effects మరో రూపంలో సాధించబడుతున్నాయన్నది ఆయన అభిప్రాయం. 'ఆధునిక వచన గేయాల్లోని విరుపూ, విసురూ, ధోరణి, పలుకుబడి అన్నీ ఇందుకే పుట్టినవి' అంటాడు. 'వరుసగా భావచిత్రాలు వర్షంలా కురిపించడం ఆధునిక వచన గేయానికి వద్దన్నా పోనీ లక్షణం. అదీ ఇందుకోసం పుట్టిందే. ఆ భావ పరంపరలో ఒక స్వతంత్ర లయాన్వితమైన ఛందో లక్షణం దాక్కొని ఉంది' అని వచన కవిత్వంలో భావచిత్రాలు ఎక్కువగా ఉండటానికి గల కారణాలను విశ్లేషించాడు.

భావ సాంద్రతతో రాయగలిగిన శక్తి ఉండి కూడా (అందుకు 'నగరంలో వాన' మంచి ఉదాహరణ) ఉద్దేశపూర్వకంగా దానిని పక్కన పెట్టి, పాశ్చాత్య ప్రభావాన్ని పక్కకు తోసి ఒక భిన్నమైన శైలిని కుందుర్తి ఏర్పరచుకున్నాడు. అందుకు ఆయనలోని ప్రయోగశీల దృక్పథం, సమకాలీన సమస్యల అవగాహన దోహదకారులయ్యాయి. తాను నమ్మిన అభ్యుదయ భావాలను ప్రజలకు చేర్చటానికి వచన కవిత్వమే తగిన వాహిక అని నమ్మి వచన కవిత్వం ఒక ప్రయోగంగా మిగిలిపోకుండా, ఒక ప్రక్రియగా నిలబడటానికి ఆమరణాంతం కృషి చేశాడు.

నీతికి నిలిచిన వాణ్ణి /కొత్త రీతిలో రసవాదం కొలిచిన వాణ్ణి (గుర్తుంచుకో)

**ముగింపు:** కుందుర్తి ప్రతిపాదనలు, అభిప్రాయాలు నిశ్చల నిశ్చితాలు కాకపోవచ్చు. ఆ మాట కొస్తే ఈ ప్రపంచంలో ఏ అంశానికి సంబంధించి ఎవరు చేసే ప్రతిపాదనలు అయినా నిశ్చల నిశ్చితాలు కావు. కాల ప్రభావానికి లోనై ఎన్నో అభిప్రాయాలు మారిపోతుంటాయి. అయితే ఆ కాలంలో ఆ వ్యక్తి ఎంత నిజాయితీతో తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడనేది చాలా ముఖ్యం. కుందుర్తి ఎంత నిజాయితీగా ఒకానొక కవితారూపాన్ని, ఏదైతే అభ్యుదయ భావజాలాన్ని సహజసరళంగా సామాన్య మానవుడికి చేరువ చేయగలదని నమ్మాడో ఆ కవితారూపాన్ని నిలబెట్టటానికి తపించాడో, వచన కవిత్వ ప్రతిష్ఠాపనకు అవసరమైన ప్రతి ఒక్క అంశాన్ని ఎన్ని కోణాల నుంచి ఆలోచించి ఎంత విపులంగా చర్చించాడో గమనించినపుడు ఆశ్చర్యమేస్తుంది. ఈనాడు పుంఖానుపుంఖాలుగా వచన కవిత్వం రాస్తున్న యువ కవులు ఒక్క క్షణం ఆగి కుందుర్తి భావధారను అందుకొని, వారిదైన వివేచనను జోడించి ముందుకెళితే ఆయన కోరుకున్నట్టుగా పది కాలాల పాటు మనగలిగే కవిత్వం వస్తుందేమో! అలా జరగాలని ఆశిద్దాం.

**ఆధారగ్రంథాలు:**

1. కుందుర్తి కృతులు-కుందుర్తి సన్మాన సంఘం, గుంటూరు- హైదరాబాద్ - 1975
2. కుందుర్తి పీఠికలు-స్పందన సాహితీ సమాఖ్య, మచిలీపట్నం-1977

3. కుందుర్తి వ్యాసాలు-తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్-1987
4. కుందుర్తి కవితాదృక్పథం నాలోని నాదాలు టి. లక్ష్మీనారాయణ-సిద్ధాంతగ్రంథం–1990
5. కుందుర్తి కవితా వైభవం- అద్దేపల్లి రామమోహనరావు, యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, సికిందరాబాద్-1980.

# సంప్రదాయ ప్రతిబింబం సి.నా.రె సాహిత్యం

డా. వాసిరెడ్డి భవాని
తెలుగు విభాగాధిపతి
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి), గుంటూరు
Phone: 9441289475

**పరిచయము:** ఆధునిక సాహితీ జగత్తులో సింగిరెడ్డి నారాయణ రెడ్డిగారికి ఒక విశిష్టమైన స్థానం ఉన్నది. ఆధునిక తెలుగు సాహిత్యానికి చెరగని చిరునామాగా వీరిని చెప్పుకొనవచ్చును. తెలుగు నేల తన తనయుణ్ణి చూసి ఉప్పొంగే విధంగా రచనలు చేసి సామాన్యుడు కూడా ఉన్నత సాహిత్య విలువలను తెలుసుకునే విధంగా తన కవిత్వాన్ని అందరికీ అందుబాటులో వుండేలా చేశారు. వీరి పరిశోధనాంశము ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు-ప్రయోగములు. ఈ గ్రంథములో కవిత్వ సంప్రదాయములను చక్కగా ప్రతిబింబింప చేశారు. ఆధునిక కవిత్వాన్ని తన రచనలతో కొత్త పుంతలు త్రొక్కించారు. సినీ జగత్తులో విలక్షణమైన గీత రచనతో ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసికొన్నారు. వీరి పాటలు నేటికి తెలుగుదేశంలో ఇంటింటా మారుమ్రోగుతున్నాయి. రైతుకుటుంబంలో పుట్టి సాహిత్యాన్ని ఔపోసన పట్టిన మేరునగధీరుడు. మారుమూల పల్లెనుంచి మొదలైన సి.నా.రె సాహితీ ప్రస్థానం విశిష్ట సోపానములను అధిరోహించి ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ అవార్డు తీసికొనే వరకూ కొనసాగినది. తెలుగు సంప్రదాయానికి ఆయన కవిత్వంలో పెద్దపీటవేశారు. ఈయన భారతీయ సంప్రదాయాన్ని ఎంతగా అభిమానించే వారో వారి తనయల పేర్లు గమనిస్తే తెలుస్తుంది. పెద్దఅమ్మాయి. గంగ, రెండవ అమ్మాయి యమున మూడవ అమ్మాయి సరస్వతి నాలుగో అమ్మాయి కృష్ణవేణి అని మనదేశంలోని నదుల పేర్లు పెట్టి తన దేశభక్తిని చాటుకున్నారు.

**ఉపోద్ఘాతము:** సంప్రదాయము ఎక్కడ పుట్టిందో ఆయన వ్రాసిన ఆధునిక కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు అనే గ్రంథంలో

"యద్యదాచరతి శ్రేష్ఠ : తత్తదేవే తరోజనః సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే"

అను గీతా శ్లోకమును సంప్రదాయమునకు నిర్వచనంగా పేర్కొన్నారు. కావున నలుగురు నడిచే మంచి బాటలో మనము నడవాలి. అపుడు ప్రతి నూతన మార్గము సంప్రదాయమైపోతుంది. ప్రాచ్య పాశ్చాత్య కవులందరూ సంప్రదాయములను ప్రతిష్ఠించిన వారే నారాయణ రెడ్డి గారి కవిత్వాన్ని పరిశీలించిన పూర్వకవుల ప్రయోగములు విరివిగాకన్పిస్తాయి. ఈనాటికీ ఆధునిక కవిత్వమును గూర్చి అధ్యయనం చేయవలసి వస్తే వీరి "ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు" గ్రంథమును పరిశీలించని వారుండరనడం అతిశయోక్తి కాదు. సంప్రదాయమును గూర్చి ఆయన మాటల్లోనే

"అంతకడివెడు పాలపై ఒకింత మీగడ పేరినట్లుగా మనకు మిగులుగతములోపలి మంచి అదియే సంప్రదాయము. కవిత్వాన్ని తన ఊపిరిగా, శ్వాసగా భావించిన సారస్వతమూర్తి. ఒకరోజు ఆయన భావన మనం గమనించినట్లయితే ఉక్కబోస్తుంది ఏసీగదిలో కారణం తెలిసి పోయింది కవితరాయలేదు ఇవాళ"

ఇంతగా ఆయన కవితావ్యాసంగంలో మమేకమైనారు. తన జీవితాన్ని కవిత్వానికి అంకితం చేసిన మహనీయులు నారాయణ రెడ్డి గారు.

"శివుని శిరసు నుండి జాలు వారిన గంగ కొండకోనలు దాటి పంటసీమలు తడిసి సామాన్యుడి కుండలో కొలువై దాహం తీర్చినట్లు"

ఈ కవితలో గంగమ్మ శివుని శిరసునుండి జారి కొండకోనలు దాటుకొని మనకు ఆహారాన్నిచ్చే పంటలకు నీరివ్వడమే కాక సామాన్యుడి గొంతు తడుపుతున్నదనే అద్భుత భావాన్ని వ్యక్తపరిచారు. ఇటువంటి అద్భుతమైన భావాలతోతెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి తెలుగు వారి హృదయాలలో తన స్థానాన్ని సుస్థిరం చేసికొన్న విశ్వంభరుడు.

తెలుగు ప్రాంతాలన్నా తెలుగుభాష అన్నా తెలుగుజాతి అన్నా సి. నా. రెకు ఎంతో ప్రాణం. ఇరు ప్రాంతాల మధ్య విభేదాలు ఆయన మనసుకు నచ్చేది కాదు. రెండు ప్రాంతాలు విడిపోవడం ఆయన జీర్ణించుకోలేని విషయం. ఆంధ్ర తెలంగాణా మధ్య విభేదాలు పుట్టిన సమయంలో కవిగా ఆయన హృదయం ద్రవించి ఈగీతమును వ్రాశారు.

" తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది ప్రాంతాలు వేరైనా మన అంతరంగమొకటేనన్నా

అంటూ రచన చేసి ఇరు ప్రాంతాల వారిని మెప్పించారు. ఆపాట విన్న మన మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావుగారు ఆ సమయంలో తాను చేస్తున్న తల్లా! పెళ్ళామా! అనే చిత్రంలో ఈ పాటను తెరకెక్కించి దేశమంతా మారుమ్రోగేలా చేశారు. ఈ పాటలో ఈ రోజుకూ తెలుగు జాతి గ్రహించవలసిన ఉపదేశం వున్నది.

**విషయము:** భరతజాతి అంటే ఆయనకెంత ప్రేమవున్నదో, భారతీయులు శత్రువులను ఎదుర్కొనడంలో ఎటువంటి పాత్రను పోషించగలరో ఈ పద్యమును గమనించిన మనకు తెలుస్తుంది.

" గుండె గుండెకొక దీప కరండము వెలిగింది నేడు శిరము శిరమునకొక హిమాద్రి శిఖరము పెరిగింది నేడు గళము గళము కొక కేసరిగర్జన వినిపించె నేడు జాతి రక్తమున సాగర చేతన కనిపించె చూడు."

భారతీయులలోని శక్తి యుక్తులను మేల్కొలుపుతూనే హిమాద్రి శిఖరము, కేసరిగర్జన, సాగరచేతన వంటి ఉపమానములను చెప్పి హృదయాన్ని తాకే విధంగా చెప్పడం వారి ప్రత్యేకతగా గమనించవచ్చు.

తెలుగు జాతినేకాదు తెలుగు వారి వేషాన్నికూడా ఎంతో యిష్టపడేవారు. తెలుగు వారివేషాన్ని గూర్చి ఈ చిన్న కవితను చూసి మనం తెలుసుకోవచ్చు.

"పంచెకట్టుటలో ప్రపంచాన మొనగాడు కండువా లేనిదే గడప దాటని వాడు పంచ భక్ష్యాలు తన కంచాన వడ్డించ గోంగూర కోసమై గుటకలు వేసేవాడు ఎవడయ్యా ఎవడువాడు ఇంకెవడయ్యా, తెలుగువాడు.

అంటూ తెలుగు వారి సంప్రదాయాన్ని, అభిరుచిని, దర్పాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించి చూపించడం వారి కవిత్వంలోని సహజత్వానికి నిదర్శనంగా చెప్పుకొన వచ్చును.

బౌద్ధమత సంప్రదాయమునకు అనుగుణంగా 'నాగార్జున సాగరము' అనే బౌద్ధకథను అయిదురంగాలలో గేయ కథా కావ్యంగా రచిచారు. ఈ కావ్యంలో నాయికానాయకులు శాంతిశ్రీ, పద్మదేవుడు. వీరు కేవలము మతాచార్యుడు, చారిత్రక వ్యక్తులు మాత్రమే కాదు. బౌద్ధ మత బోధల కోసం ఆనాడు సర్వ కళలను వినియోగించేవారు. ఆ ప్రయత్నంలోనే పద్మదేవుని శిల్పి గా నియమిస్తారు. శాంతిశ్రీ బౌద్ధ మతాన్ని అనుసరించే అనుయాయి. వారి ప్రేమను వర్ణించే సందర్భంలో సి. నా. రె వర్ణన, పదవిన్యాసము అనితర సాధ్యము.

"అతడు చంద్రుడాయె, ఆమె చంద్రికయాయె అతడు హృదయమ్మాయె, ఆమె భావమ్మాయె"
"ఆమె అల్లన సాగె,ఆమె మెల్లన సాగె అల్లనల్లన గుండె జల్లు జల్లున సాగె మెల్ల మెల్లన మనసు పల్లవించగ సాగె "

ఇంతటి లయబద్ధమైన కవిత్వము నారాయణ రెడ్డి గారికే సొంతము. చదువుతున్న కొద్దీ చదవాలనిపించే విధంగా వుంటుంది. ఇందులో కొత్త పదాలేవీ లేవు. అయినా ప్రత్యేకత, విలక్షణత కన్పిస్తుంది.

ఈ కావ్యంద్వారా వీరు యిచ్చిన సందేశములు అందరికీ నిజ జీవితంలోతెలుసుకొన వలసిన విషయములుగా మనం భావింప వచ్చును.

"విలాసజీవనమును వదిలివేయమని అది ధనాన్ని నాశనం చేస్తుందని చెబుతారు"
"బౌద్ధారామములు సోమరులను పోషించే నిలయములుగా మారుతాయని చెప్పారు"

ఈ "నాగార్జు సాగరము" తరువాత వ్రాసిన కమనీయ గేయకథాకావ్యము "కర్పూరవసంతరాయలు" ఈ కావ్యమును స్మరించినంత మాత్రమున కర్పూర సౌరభము గుబాళింపచేయును. 'కర్పూరవసంతరాయలు' రెడ్డిరాజుల చరిత్రకు సంబంధించిన శృంగార కావ్యము. అయిదాశ్వాసముల గేయకావ్యము. మనస్సుకు హత్తుకునే వర్ణనానైపుణ్యము, సరస సన్నివేశాలు ఈ గేయ ప్రబంధాన్ని విశిష్ట కృతిగాచేశాయి. వసంతరాయలు యిందులో నాయకుడు లకుమ నాయిక.

"లకుమకావార్తక ల్వనెలంత కంటిపా పలపైన పాలవెన్నెల సోకినట్లులయ్యె" "రాణి కావార్తకల్వనెలంత చెవులలో ఖరకరుని ఆశ్వరింఖలచప్పుడుగ తోచె"

లకుమను రాజునర్తకిగా నియమించబడిన వార్తలు ఇరువురికి ఏ విధంగా తోచిందో చక్కగా వర్ణించారు.

"మోముపై శ్రీగంధమున్నదెక్కడిది రా సింగా పూలపొడితప్ప యే ముందునే నా సామిరంగా"

వేశ్యాకులమునకు చెందిన లకుమ వాగ్దానమునెట్లు తీర్చెదను రాయని ఎలావీడగలను ఈసానిదానికి యిటువంటి హృదయాన్నెందుకిచ్చినావని ఈశ్వరుని నిందిస్తుంది.

"దేశమొక దెస నీవు ఒకదెసతేల్చుకొను మెయ్యది ఘనమ్మో వ్యక్తి సంఘములందు ఎయ్యదిప్రథమగణ్యమె చెప్పవమ్మా"

తన స్వార్థాన్ని పక్కకు తోసి దేశభద్రతకు ప్రాదాన్యత నిచ్చిన లకుమను ఆత్మార్పణ చేసికొన్న ధర్మోదాత్తగా చిత్రీకరించారు. సి.నా.రె తన ప్రపంచపదులు అనే కవితా ఖండికలో "చేతగాని తనముంటే జాతకాన్ని నిందించకు నమ్మలేని సరుకుంటే అమ్మకాన్ని నిందించకు కలంరాయకుంటే కాగితాన్ని నిందించకు" అంటూ నవతరంతో పోటీపడుతూ కొత్తశైలితో సమాజాన్ని దర్పణంలో చూపించిన నవ్యకవితాధీరుడు.

సినీ వినీలాకాశంలో సంప్రదాయానికి ప్రాధాన్యతనిచ్చిన గీతాలనెన్నింటినో అందించి లెక్కలేనన్ని అవార్డులను పొంది పురస్కారాలను అందుకుని తెలుగు సాహిత్యానికి సినిమా ప్రపంచంలో పెద్దపీట వేసిన సి.నా.రె సాహితీ శిఖరం వంటివారు.

"భలేమంచిరోజు" అనేగీతంలో "చందమామ అందినరోజుబృందావని నవ్విన రోజు" అంటూ చందమామ, బృందావనం అందానికి చిహ్నాలుగా అవి చేజిక్కించుకున్న సంబరాన్ని తన రచన ద్వారా తెలియచెప్పారు.

"అణువు అణువున వెలసినదేవా" అనుగీతంలో మహనీయుల త్యాగాలను గుర్తుచేస్తూ మన భారతీయులు పరమత సహనం కలవారని, మనది లౌకిక వాదమని తన కలంనుండి జాలువార్చారు.

"పుట్టినరోజు పండుగే అందరికీ" అనేగీతంలో "తనకోసమేకాక పరులకొరకు బ్రతకాలి తానున్నా లేకున్నా తన పేరు నిలవాలని"అనే నిస్వార్థ పూరిత సందేశాన్నిచ్చారు.

తన కవిత్వ పటిమను తెలియజేయడానికి తనకవితాదాహాన్ని తీర్చు కోవడానికి దీర్ఘ సమాసాలతోకూడిన గేయం. "చరణ కింకిణులు ఘల్లుఘల్లుమన" ఈ గేయంలో నర్తకి పదవిన్యాసాలకు తగిన పదాలతో పాదాలల్లినారు.

"హిమగిరీంద్ర శిఖరాగ్ర తాండవవ్రత్పమథ గణం కనిపించగా ప్రమథ నాథ కర పంకజ భాంకృత ఢమరుధ్వని వినిపించగా ప్రళయకాల సంకలిత భయంకరజలధరార్భటుల చలితధిక్తటుల చకిత ధిక్కరుల వికృత ఘీంకృతులసహస్రఫణ సంజనిత ఫూత్కృతుల"

అంటూ సంస్కృత సమాసాలతో రచించినప్పటికీ ప్రేక్షకలోకం తలలూపి ఈ పాటకు పట్టాభిషేకమే చేశారు. ఈ పాటలోని హిమగిరీంద్ర, ప్రమథగణం, ప్రళయకాలం, ఢమరుధ్వని, పదాలన్నీ సంప్రదాయసూచికలే. ఆత్మీయ బంధాలకు అద్దం పట్టే పాటలు వ్రాసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.

"అన్నయ్య సన్నిధి అదేనాకు పెన్నిధి" అనేపాటలో అన్నాచెల్లెళ్ళ అనుబంధాన్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు.

"ఒనాన్నా! నీమనసే వెన్న అమృతం కన్నా అదియెంతో మిన్న" అంటూ చక్కని పద బంధాలతో తండ్రీ కొడుకుల ప్రేమకు చక్కని నిదర్శనాన్ని యిచ్చారు.

స్నేహబంధానికి విలువిచ్చే విధంగా "గున్నమామిడి కొమ్మమీదగూళ్ళు రెండున్నాయి" అంటూ చిన్నపిల్లవాడిచే స్నేహమాధుర్యాన్ని వివరించారు. స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం" అంటూ కడవరకూ నిలిచేది స్నేహమేనని గుర్తుచేశారు. ఇన్ని బంధాలకు విలువనిచ్చిన సి.నా.రె మనుషులలోని కృత్రిమత్వాన్ని అసహ్యించుకుంటూ మనుషులలోని వికృతరూపాలకు ప్రతీకగా

"అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం
ఆత్మ తృప్తికై మనుషులు ఆడుకునే నాటకం. వింతనాటకం అని తన సర్వస్వతంత్రతను తెలియజేశారు.

**ముగింపు:** "అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః" అన్న సూక్తిని నిజంచేశారు. వీరి రచనలన్నీ విలక్షణములే. అంతే కాదు వీరి కవిత్వాన్ని ఇష్టపడని వారుండరని చెప్పవచ్చును. సినీ గీతాలలో కూడా కొన్ని కొత్త ప్రయోగాలను చేసి ప్రజల మన్ననలను పొందారు. పౌరాణికపాత్రలలో దుర్యోధనుడిచేత డ్యూయెట్ పాడించి ఒక వినూత్న ప్రయోగాన్ని చేశారు. "చిత్రం భళారే విచిత్రం" అనే ఈపాటను తెలుగు వారందరూ ఆదరించారు ఈ విధంగా సింగిరెడ్డి నారాయణ రెడ్డిగారు ఎన్నోప్రయోగాలు చేసి ప్రజల మనసును దోచుకోవడమేకాదు తాను అందుకున్న గౌరవ పురస్కారాలకు, అవార్డులకు తానే గుబాళింపుగా చిరస్థాయిగా తెలుగు వారి గుండెల్లో సింహాసనం వేసుకున్న కవిరాజు.

**ఆధారగ్రంథాలు**:

1. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు - డా. సి. నారాయణ రెడ్డి.
2. విశ్వంభర - డా. సి. నారాయణ రెడ్డి.
3. కర్పూర వసంతరాయలు - డా. సి. నారాయణ రెడ్డి.
4. నాగార్జున సాగరము - డా. సి. నారాయణ రెడ్డి.
5. ఆధునికాంధ్ర గేయ కవిత్వం – డా. జి. చెన్నకేశవ రెడ్డి.

# భగవంతునికి బహిరంగ లేఖ - దీర్ఘ కవితా నిర్వహణ

**డా. యస్. దివిజాదేవి,**
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.
చరవాణి - 9246806307.

**వచన కవిత్వం:** పాశ్చాత్య సాహిత్యం ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించిన ప్రక్రియలలో ఒకటి వచన కవిత్వం అని చెప్పవచ్చు. కానీ వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు గారు దీనికి అంగీకరించరు. భావావిష్కరణలోని సహజ పరిణామమే వచన కవిత ఆవిర్భావానికి కారణం అంటారు.

"పాతకాలం పద్యమైతే, వర్తమానం వచన కవిత" అన్న వీరు. అన్నట్టుగానే వచన కవితా ఉద్యమానికి ఊపిరులూదడమేకాకకడవరకూ కొనసాగించారు. తాను నాటి పాదుచేసి, నీరుపోసి పెంచిన మొక్క మహా వృక్షమైంది. నేడది శాఖోపశాఖలుగా విస్తరించి ఎందరో ఔత్సాహిక యువ కవులకు ఆలంబనగా నిలుస్తుంది.

శిష్ట్లా, శ్రీశ్రీ, నారాయణ బాబు, పఠాభి మొదట్లో వచన కవితకు ఒక రూపమిచ్చినా, కుందుర్తి వచన కవితకు అనువైన లక్షణాల్ని ప్రతిపాదించారు. కుందుర్తి కాలంలోని 'వచనగేయం' ప్రక్రియనే వచన కవితగా మార్పు చెందింది. ఇది ఓ నూతన ప్రయోగం కాబట్టే ప్రఖ్యాత కవులూ ఆ బాటలో పయనించారు, పయనిస్తున్నారు. ఆధునిక కవులు అనుసరిస్తున్నారు.

శ్రీశ్రీ రచనలు, శేషేంద్ర వ్రాసిన ఆధునిక మహాభారతం, గొరిల్లా, సినారె కలం లోంచి వెలువడ్డ మట్టి-మనిషి-ఆకాశం, విశ్వంభర, నగ్నముని రచించిన కొయ్యగుర్రం, పెన్నా శివరామకృష్ణ సృష్టి జీవనది దీనికి ఉదాహరణలు. ఇలా వచనం లో వెలువడ్డ గేయాలు,

కవితలు, దీర్ఘకవితలతో వెలువడిన పుస్తకాలు కావ్య గౌరవాన్ని పొందడమే కాదు, సాహిత్య అకాడెమీ అవార్డులతోపాటు, జ్ఞానపీఠాలనూ స్వంతం చేసుకున్నాయి.

వచన కావ్యాలు - కుందుర్తి కృషి: "వచనములో విషయ ప్రకటనమే ముఖ్య లక్షణం. చెప్పదలచుకున్న భావమును సూటిగా గుండెకు తగులునట్లుగా చెప్పే గుణము వచన కవితకున్నది. దీని వలన సమకాలీన వస్తువును కవితా వస్తువుగా తీసుకునే వీలుకలుగుతుంది" అంటారు సి.నా.రె.

కుందుర్తి వచన కవితకు ఉద్యమ నినాదమయ్యారు. సంప్రదాయ పద్య వేదిక మీద వచన కవితకు పట్టం కట్టారు. భాషలోనూ, భావంలోనూ, నవ్యతకోసం ఆరాటపడ్డారు. కవిత్వం ఏ రూపంలో ఉన్నా, సామాన్యుడి పక్షం వహించాలని ఆశించారు. పీడిత ప్రజలు చేసే ఉద్యమమే ఆయన కవితకు ఊపిరయింది.

కొన ఊపిరితో అల్లాడుతున్న వచన కవితకు ప్రాణ ప్రతిష్ఠ చేయడం వెనుక కుందుర్తి కృషి మరుపురానిది. పద్య కవితా సమ్మేళనాలు విస్తృతంగా జరుగుతున్న రోజులలో వచన కవితా ఉనికి కోసం ఉద్యమ స్థాయిలో కృషిచేశారు. ఈ పయనంలో ఎన్నో ఆటంకాలను, ప్రతిఘటనలను ఎదుర్కొన్నారు, విమర్శలను భరించారని వారి కవితలద్వారా తెలుస్తుంది.

తను వ్రాసే ప్రతీ పదంలో కొత్త కొత్త అర్థాలు, స్ఫురిస్తాయని, తన రసనాగ్రం మీద చిరునవ్వుల రవళితో అందరికీ ఆనందం పంచే సుశబ్దాల అమృతాలు వెలువడతాయని అంటారు.

తెలుగులోని సమస్త సాహిత్య శాఖలలో వ్యావహారిక వాదం విజయం పొందింది కాబట్టి, ఎదురుగా ఉండి మాట్లాడుకుంటే ఎలా ఉంటుందో, భాష, భావం అలా ఉండాలని ఆయన సంకల్పం. అందుకే అంటారు "నీమీద శతకం రాయాలని ఏనాడో అనుకున్నాను గానీ, పద్యాలమీద ఇష్టం లేక పట్టుమని పది దొర్లలేదు. పాత ఛందస్సు బంధాల్లో యిరుక్కొని కాబోలు, భక్తి భావం గుండెలో రవంతయినా పొర్లలేదు". (భగవంతునికి బహిరంగ లేఖ) దీని ద్వారా ఆయనలోని వచన కవితా ప్రియత్వం వ్యక్తమవుతోంది.

నిఖిలేశ్వర్, శీలావీర్రాజు, సిధారెడ్డి, దేవీప్రియ లాంటి ఎంతోమందిని వచన కవిత్వం వైపు నడిపిన ఘనత కుందుర్తికే దక్కుతుంది. తెలుగువాడికి తెలిసిన మాటలతోనే కవిత్వం చెప్పుకోవాలన్నది కుందుర్తి ఆశయం. ఆ ఆశయసాధనకు వారు చేసిన కృషి అజరామరం.

కవిత్వం రాయాలంటే అలంకారాలు, ఛందస్సు, పాండిత్యం అవసరం లేదు. వాడుకలో ఉన్న శబ్దస్వరూపంప్రామాణికంగా ఉంటే చాలన్నారు.

కుందుర్తి కవిత్వంలో సంప్రదాయపు ముద్ర, అభ్యుదయ, అనుభూతివాద ప్రసరణ, మానవతావాదం, వ్యంగ్య వైభవాలు, సూక్తి నిధిత్వం, వంటివి కనిపిస్తాయి. ఇంకా ప్రబంధ కవితా ధోరణిని, భావ కవితా సంప్రదాయాల్ని నిరసించిన తీరూ కనిపిస్తుంది. పురాణ ఘట్టాలను, పోరాడే వ్యక్తుల్ని స్మరించడం కూడా మనం చూడవచ్చు.

దీర్ఘ కవిత్వం: దీర్ఘ కవిత వచన కవిత యొక్క పరిణామ రూపం. ఈనాడు దీర్ఘకవితను ఒక ప్రక్రియగా భావిస్తున్నప్పటికీ అది వచన కవిత్వంలో భాగమే. ఎటువంటి ఛందోనియమాలు దీర్ఘకవితకు వర్తించవు. ఎంచుకున్న వస్తువును సమగ్రంగా ఆవిష్కరించడానికి, వస్తువులోని విభిన్న పార్శ్వాలను కవితామయం చేయడానికి కవి హృదయం తనివి తీరే వరకు అనివార్యంగా పెరిగిన వచన కవితను దీర్ఘకవిత అంటారు. అన్ని రంగాల గురించి వివరంగా చెప్పాలనే తపనకు అక్షర రూపమే దీర్ఘకవిత అని చెప్పవచ్చు.

దీర్ఘకవితా లక్షణాల్లో ప్రాథమికమైనది ఒకే వస్తువు ఉండటం. దీని వలన ఒకే వస్తువును భిన్న కోణాలలోంచి దర్శించడానికి వీలవుతుంది. దీర్ఘ కవితకు ప్రవాహ గుణం ఉండాలి. ఎక్కడికక్కడ ఆగిపోయినట్లు కాకుండా, మొదటి నుండి చివరివరకూ నదిలా ప్రవహించాలి. భాష సరళంగా ఉండాలి. ఇదిమామూలు కవిత అందివ్వలేని కథా కథన

పద్ధతికి అనువైనది. దీర్ఘకవిత కావాలని సాగదీసినట్లుగా కాకుండా, అప్రయత్నంగా పెరిగితేనే నాణ్యమైనదిగా తయారవుతుంది. సమగ్ర లక్షణాలతో వెలువడిన తొలి దీర్ఘ కవితా కావ్యం కుందుర్తి రచించిన తెలంగాణ కథాంశం లేని కవితలు కేవల ప్రభోద గేయాలే అనేవీరు, తమ రచనలను కథలోని వస్తువును కవితాత్మకంగా వ్యాఖ్యానిస్తూ, కథా సూత్రాన్ని అంతర్వాహినిగా ప్రవహింపజేశారు. "కథాకావ్య సిద్ధాంతాన్ని" ప్రతిపాదించిన వీరు తన కావ్యాలను ఈ పద్ధతిలోనే రచించారు. అందుకే దీనికి అనుకూలమైన దీర్ఘకవితా పద్ధతిని ఎన్నుకున్నారు.

దీర్ఘ కవితలు భావ, అభ్యుదయ, విప్లవ కవిత్వోద్యమాల సమయం లోనే కాకుండా వర్తమాన ధోరణులైన స్త్రీవాద, దళిత వాద, మైనారిటీ వాద, బీసీ వాద, ప్రాంతీయ వాద, ప్రపంచీకరణ ధోరణుల నేపధ్యాలతో కూడావెలువడ్డాయి.

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రపంచీకరణ భూతాన్ని ప్రతిఘటిస్తూ అనేక దీర్ఘకవితలు వచ్చాయి.

ప్రపంచీకరణ వల్ల కుదేలవుతున్న వ్యవసాయం, కులవృత్తులు, విద్య, మానవ సంబంధాలు మొదలైన వాటిగురించి కవులు ఎక్కువగా స్పందించారు.

ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక రుగ్మతలు, యుద్ధాలు వంటి సంఘటనలకు స్పందించి రాసిన వాటిని సంఘటనాత్మక దీర్ఘకవితలు అంటారు. శాస్త్రీయ దృక్పదం లోంచి వెలువడ్డవే వైజ్ఞానిక దీర్ఘకవితలు. వీటిలో కూడా కవులు తమదైన ముద్రను వేస్తూ, విభిన్న శైలులను కూడా అనుసరించారు. వాటిలో మాండలిక శైలీ, కథానాత్మక శైలీ, సంభాషణాత్మక శైలీ, ఖండిత శైలీ, అఖండిత శైలీ, నిర్వచనాత్మక శైలీ, ప్రకటనాత్మక శైలీ, వర్ణనాత్మక శైలీ వంటి అనేక శైలీ భేదాలలో రచనలను వెలువరించారు.

భగవంతునికిబహిరంగలేఖ- పరిశీలన: బహిరంగ లేఖ అంటే సమస్యను అందరికీ తెలిపేవిధంగా పెద్దలకు రాసే లేఖ. "బహిరంగ లేఖ అంటే నిజానికి బజార్లోకి యీడవడమే, నీవు జవాబు చెప్పలేక బోరున ఏడవడమే" అంటారు. సమాజంలోని రుగ్మతలను, మనుషుల ప్రవర్తనలను, సృష్టిలోని లోపాలను ఎత్తి చూపారు, వీటన్నిటికీ కారణమైన భగవంతుణ్ణి తన లేఖ ద్వారా నిలదీసారు.

"భగవంతునికిబహిరంగలేఖ"అనే లఘు కృతిలో మూడు దీర్ఘకవితలున్నాయి.

1. పలుకు భాగవంతుడా
2. ఇదీ ఇక్కడి తంతు
3. నువ్వెంత నీ సృష్టింత ?

"పలుకు భాగవంతుడా" అనే కవితను పంక్తులలో 12 పుటల కవిత కాగా, "ఇదీ ఇక్కడి తంతు" అనే కవితనుపంక్తులలో 15 పుటలలోనూ, "నువ్వెంత నీ సృష్టింత" కవితను పంక్తులలో 9 పుటలలో రాశారు. మొత్తానికి 36 పుటల దీర్ఘకవిత "భగవంతునికిబహిరంగలేఖ.

1. పలుకు భాగవంతుడా: "డియర్ గాడ్ నమస్తే, ఈ విధంగా సంబోధించే ధైర్యం, ఎంతమందికి ఉంటుందంటావు, పలుకుబడి ఎట్లా ఉన్నా, భావం ప్రధానం కాబట్టి, ఆప్యాయంగా పిలిచేవాణ్ణి ఆ క్షణంలోనే వింటావు". అంటూ సంబోధనాత్మకంగా తన లేఖను ప్రారంభిస్తారు.

పై పంక్తులలో సంబోధనే విచిత్రంగా అనిపిస్తుంది. అలా సంబోధించడానికి కారణాలను చెబుతూ, భాగ్యవంతునితో మైత్రిని కోరుతూ తానలా సంబోధించానంటారు. మనసులోని అన్నీ భావాలకంటే, మైత్రీభావం మెరుగైనది అంటారు. ఆ మైత్రీ బలం తోనే, ఎవరూచూడని నీ విశ్వరూపాన్ని నేను అవలీలగా చూడగలిగానని వ్యంగ్యంగా అంటారు. ఈ కాలంలో భాష కబ్బిన వ్యవహార బలంచేతో తానలా అనగలిగానంటారు. తనది వచనం లాంటి కవిత్వమని లేదా కవిత్వం లాంటి వచన మని, ఈ వచన కవిత్వంలో ఒకరో ఇద్దరో తప్ప ఎవరూ నిన్ను పిలిచి ఉండరని అంటారు.

సంస్కృతాన్ని సంస్కృత సాహిత్యాన్ని, మాటలను ఎద్దేవా చేశారు. సంస్కృతం లోని భారతీయ విజ్ఞానం తెలుగు వారిని ఏమాత్రం ముందుకు పోనీక అడ్డంగా నిలబడుతుందని

ఆరోపిస్తారు. సంస్కృతం దేవ భాష కాబట్టే, దాన్ని సృష్టించిన భగవంతుణ్ణి నిందిస్తారు. అదే సమయంలో తెలుగు మాటల్లోని శక్తిని ఆకాశానికి ఎత్తేస్తారు.

ఆ భగవంతుణ్ణి ఆయన అభ్యుదయ కవితా సరస్వతి ఆనందాల ఒళ్ళు విరుపులను, మధుర భావాల మబ్బుల్లో మనసు మిరుమిట్లు గొలిపే మహార్ధాల మెరుపులు చూడమంటారు. సమకాలీకులకు అందకుండా చకచక పరిగెడుతున్న తన మీద కవితా పరిమళాన్ని గుబాలింపజేయమంటాడు. సర్వ భారతీయ పురా సాహిత్య సాంప్రదాయాల చేత ప్రభావితమైన నా గుండె విపంచిలో అనంతమైన మహార్ధాలు ఆవిష్కరించే మాటలు పలికింపజేయమంటాడు.

వ్యవహార భాష బాగా వృద్ధిపొందిన రోజుల్లో కూడా పండితులు, విమర్శకులు, పామరులు ఎవరూ కూడా వచన గేయాలను ఆదరించలేదని వాపోతాడు. వచన కవితా ప్రయోగ తపస్వీ యైన తనను తాను ప్రతికూల వాతావరణంలో ప్రయాణిస్తున్న విమానంలా, కారడవిలో ఒంటరిగా ప్రయాణిస్తున్న బాటసారిలా సంభావించుకుంటాడు.

ప్రాచీన కవిత్వాన్ని పండు ముత్తైదువులాఅభివర్ణించిన వీరు వచన కవిత్వాన్ని పసిబాలగా సంభావించారు. ఇంకా ఒక దశాబ్దం ముందుగా పెరిగి పెద్దయిన నా కవిత పదహారేళ్ల నవ యవ్వన అని అంతలోనే ఆత్మ విశ్వాసాన్ని ప్రకటిస్తారు.

"డామిట్ ! కథ అడ్డంతిరిగిందన్నప్పుడే, నన్నునీవు పలికించమని విన్నవించుకున్నప్పుడే, చూశావా నేస్తం, ఈ పాడు భక్తి మనసులోకి పాకి పాకి, తోసేసింది. క్షణంలో తప్పుదారి లోకి" ఒకవైపు భగవంతుణ్ణి తనకు సహాయం చేయమంటూనే, మరోవైపు ఉలిక్కిపడి స్పృహలోకొచ్చి పశ్చాత్తాపం ప్రకటించుకున్నారు.

"పలికేది నేనే, యిందాక త్వరపడ్డాను, నరుడిమాట మనసులోకి వచ్చి కొంచం పొరపడ్డాను". అంటూ తనను తాను, తనపై పడిన ముద్రను కాపాడుకునే ప్రయత్నం చేశారు.

ఒకవైపు భగవంతుణ్ణి ప్రార్థిస్తూనే, వేడుకుంటూనే మరోవైపు విమర్శిస్తుంటాడు. నాస్తికునిగా ముద్రపడిన తాను అలాగే కోన సాగకపోతే సమకాలీకుల విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడ్డట్టుగా కనిపిస్తుంది. అనంతకోటి మానవ జన్మల అంతరాలలోని ఆలోచనా రీతులు తన లేఖ ద్వారా వినిపిస్తానంటాడు. ముక్కోటి దేవతల చేత తెలుగు పలుకుబడుల పాలన్నంతినిపిస్తానంటాడు. "మాతృభాష మా యిల్లు, తెనుగు కవిత పన్నీటి జల్లు, ఆశ్రయించిన రసజ్ఞులకు అమృతభాండమందిస్తాను". అంటూ తన మాతృభాషా మామకారాన్ని ప్రకటించుకున్నారు.

నీకూ, నాకూ గల మైత్రి లోకానికి తెలియకపోయినా, నీకూ, నాకూ గల అంతరం లోకానికి తెలియంది కాదు అంటారు. ఆ అంతరం ఎంతున్నా, ఇద్దరి ఆశయం ఒకటే కాబట్టి తమ మధ్య మైత్రి వర్ధిల్లక తప్పదంటారు. "అనంతమైన సృష్టి వైచిత్ర్యల అడవి గుహల మాటునమహార్ధాలమృగరాజులు నిద్ర నుండి మేల్కున్నప్పుడు అప్పుడు మన మైత్రి ఆరంభమైంది". అంటాడు. అంటే తనకు తాను సృష్ట్యాది పురుషుడిగానే సంభావించుకున్నారు. తమ స్నేహానికి సహేతుకాన్ని చూపించారు.

చీకట్లో వెలుగు కనిపించాలన్నా, మంచానపడ్డ మంచి మనిషిలో సాకారమవ్వాలన్నా, మనసులో నీతి లోకం నడవడిలో కలగాలన్నా, మన ఉభయులమధ్య ఎప్పుడూ మైత్రి వర్ధిల్లక తప్పదు అంటారు. ఆ మైత్రీ బలం చేతే అలా సంబోధించాను అంటారు.

చెడును నీవు సహించవు అవతారమెత్తి శిక్షిస్తావు, చెడును నేను సహిస్తాను, దానిపై జాలి వహిస్తాను. నీది హింస, నాది అహింస అంటూ ఆ భగవంతుణ్ణి హింసావాదిగా చిత్రించడమే కాకుండా, పరిస్థితుల ప్రభావం చేత పతితులైన వారిపైన భగవంతుడు దయతలచడని, సృష్టి పుట్టిన తొలిరోజుల్లో చేసుకున్న పాత నిబంధనలు సడలించడని, పాప పుణ్యాలను తూకం వేస్తాడని, కోట్ల సంవత్సరాల ఘోర తపస్సుకు గానీ గుండె కరగదని, దరిద్రులంటే కోపమని, కష్ట జీవులంటే లెక్కలేదని, తప్పుచేసి భగవన్నామ స్మరణ

చేసేవారిని నీవు క్షమిస్తావని, ఉపవాసం చేసే భోగి నీకు ఆప్తుడని శా%, ఇలా భాగవంతునిపై ఆరోపణలు చేయడమేకాదు,
తనకు భగవంతునికి ఉన్న తేడాలనువివరిస్తూ - పతితులైన వారికి తాను మిత్రుడనని, సృష్టాదిలోని పాత నిబంధనలకు తాను శత్రువునని, తాను మార్పు కోరేవాన్నని, పవిత్ర పంచశీల పథగామియైన తాను స్వర్గం జోలికి రానని అంటాడు. భగవంతునికి తనతో పనిపడ్డప్పుడు కష్టాలతో కబురు చేస్తాడని నిందిస్తాడు. అంటే తాను కష్ట సమయాల్లో భగవంతుణ్ణి స్మరిస్తాడనే ధ్వని కనిపిస్తుంది. భగవంతుణ్ణి మూర్తికతీతునిగా, తాను కీర్తి కతీతునిగా చెబుతాడు.
2. ఇదీ ఇక్కడి తంతు: "నీమీదకారాలూమిరియాలూ నేనెంతగానూరుతున్నప్పటికి, మనిద్దరం ఒకటేనని, మనుషులు కనుక్కున్నారు" అంటాడు. దానికి కారణాన్ని చెబుతూ- అశ్వత్థ వృక్షం క్రింద తాను సమిధలు ఏరుతున్నప్పుడు మనుషులకు అనుమానం వచ్చి తాను ఆధ్యాత్మికవేత్తనని అనుకున్నారు కానీ, దానికి వైద్య ప్రయోజనం కల్పించి చెప్పడానికి తన తల ప్రాణం తోకకు వచ్చిందన్నారు.

ప్రేమతో రాస్తున్నాను పెడార్థాలు తీసుకునేవు, ఎంత చెడ్డా కవిని గనుక రెండో అర్థం రావచ్చు. చాలా వరకు నాస్తికుడిగా సంచరిస్తుంటే తప్ప ఇక్కడి వాళ్ళు నన్ను నమ్మరు. మన ఇద్దరి మధ్య మైత్రి ఏమాత్రం పసికట్టినా ఇక్కడ మన ఆట కట్టు అంటారు. తనను తాను నాస్తికునిగా నిరూపించుకునే ప్రయత్నంలో. అన్నింటిలో నీ వున్నావని ఆస్తికులంటారేగానీ, తమలోనే ఉన్న నిన్ను తప్పుకునే తిరుగుతుంటారు. గుళ్ళో నిన్ను చూసినట్లుగా గుండెల్లో చూసుకోలేరు అంటారు. "దేహమేరా దేవాలయం" అనే సూత్రానికి ఇది అనుసరణగా చెప్పుకోవచ్చు.

భగవంతుడి యొక్క నిరాకార రూపాన్ని గురించి చెబుతూ- "మొదట్లో నీది మంచిరూపమే, మంచితోపాటు మానవ రూపం నాకిచ్చేసి, నీవు నిరాకారుడివైనావు" అంటారు.

మానవులలోని స్వార్థాన్ని, మోసపూరిత నైజాన్ని ఎండగట్టారు. లోకంలో చాపకిందనీరులా పారుతున్న అవినీతి భూతపుబండారాన్ని బట్టబయలు చేశారు. నాగరికత యొక్క వికృత రూపాన్ని తూర్పారబడుతూ-"నాగరికత బలిసినకొద్దీ, దుబారా పెరగడమేకాదు, ఆర్జనకు అవినీతి మార్గాలు, అంతకు పది రెట్లవుతున్నాయి" అంటారు. ధరల పెరుగుదలను గురించి చెబుతూ "నిక్కచ్చిగా వాటిని వర్ణించడం, నీక్కూడా చేతకాదు" అంటారు. ఆశ మనిషిని బ్రతికిస్తుందని, దురలవాట్లతో మనుషులు చెడిపోయారని విచారం వ్యక్తం చేస్తాడు.
3. నువ్వెంత నీ సృష్టంత ?: దీనిలో భగవంతుణ్ణి, అన్నా! అని సంబోధిస్తారు. భక్తి పేరుతో జరుగుతున్న మోసాల్ని వెల్లడించారు. విద్యార్థుల రాజకీయ రచ్చను ఎద్దేవా చేస్తారు. లోకంలో ఎక్కడేం జరిగినా బలైపోయే సిటీబస్సు దీన స్థితిని చూసి జాలిపడ్డారు.

నగరంలోని బార్లు ఏవిధంగా జీవిత గమనానికి కేంద్రబిందువులవుతున్నాయో చెబుతూ- "అమృతం మీదగ్గర నిండుకుందేమోనని అనుమానం నాకు, ఈ అంతర్లోకపు పానీయపు ట్రాఫిక్ ఆపవయ్యా నీకు పుణ్యముంటుంది" అంటారు.

అద్వైత తత్వాన్ని, అతివిశ్వాసంగల మానవ మూర్ఖత్వాన్ని, పొగడ్తలకు పడిపోయే మానవ నైజాన్ని, అతితెలివిని, అతివిశ్వాసాన్ని విమర్శిస్తాడు. ఒకవైపు భగవత్ తత్వాన్ని నిలదీస్తూనే, మానవ నైజాలనూ విమర్శించారు.

"మా లోకంలో మనిషి ఇప్పుడు తనను తాను తెలుసుకున్నాడు. అమోఘమైన శాస్త్రజ్ఞానం అతనికి తోడై నిలిచింది. ప్రకృతిని జయించడానికి బద్ధకంకణుడై వున్నాడు. నీవసలులేనే లేవని నిరూపించడానికి సిద్ధమైనాడు. అంటాడు భగవంతుని ఉనికిని ప్రశ్నిస్తూ.

"పదకొండవ అవతారం ప్రసక్తి లేకుండా, ఈనాటి అధర్మాన్ని మొక్కగా ఉన్నప్పుడే తుంచాలని, పెరిగే అవకాశాలను అందరికీ సమంగా పంచాలని, దీక్షతో కృషి చేస్తున్నాం".

"జన్మకు సార్థక్యమేమిటో ఇప్పుడు మాకు తెలిసింది. చచ్చిపోయి నీ దగ్గరకు రావడం కాదు%%. నీ ద్యాసలోపడి జీవన్మృతుడై పోవడం కాదు", "నువ్వు చేశావని చెప్తున్నఈ ఏర్పాటంతా ఆనాడు బలవంతుడు బ్రతకడానికి పనికొచ్చింది. ఈనాడు ధనవంతుడు దోచుకోవడానికి పనికొచ్చింది" అంటూ భగవంతునిపై వ్యంగ్యాస్త్రాలు కురిపిస్తాడు. నిలదీస్తాడు.

"స్వర్గానికీ మాకు మధ్య సంబంధాలు తెగిపోకుండా ఉంటే మళ్ళీ ఎప్పుడైనా రాస్తానులే". అంటూ ముగిస్తారు.

ముగింపు: భగవంతునికిబహిరంగలేఖ అనే దీర్ఘ కవితలను తన వచన కవితా ధారావాహికకుఆధరణ లభించకపోగా విమర్శల వెల్లువ వెలువడిన తరుణంలో వచ్చిందని చెప్పవచ్చు. ఈ లేఖ రాయడం ద్వారా తనలో భారం తగ్గింది అంటారు. తనలాంటివాళ్ళెందరో ఈ భూమి మీద నడవాలనేది ఆయన ఆశ. అంటే వచన కవిత్వాన్ని నిలబెట్టేవాళ్ళని అర్థం.

మానవతావాదాన్ని మన్నించిన మార్క్సిస్ట్ కవిగా మన్ననలు పొందిన వీరు, విప్లవ తత్వాన్ని చెప్పడానికి కవిత్వం రాసిన వీరు, ఒకానొక తరుణంలో తన పంథాను మార్చుకున్నట్లు తెలుస్తుంది, ఆధ్యాత్మికతనూఅలవరుచుకున్న ఛాయలు కనిపిస్తున్నాయి.

"ఎప్పుడో ఎన్నేళ్లక్రితమో, వచ్చీరాని పాండిత్యంతో, కృతిలో దోషాలు వెతికి వెలికితీసినట్లు, సృష్టి లోపాలు పేర్కొన్నందుకు, శిక్షించాడు భగవాన్ నన్ను, ఆగ్రహంతో జబ్బ పట్టుకొని, ఈ గ్రహం వైపు గిరాటు వేశాడు 7%..పదుగురికీ దూరంగా మెలగడం, ఎవణ్నీ లక్ష్యపెట్టకపోవడం, ఇవీ నా గుణాలు" తన స్వభావాన్ని వెల్లడిస్తారు. తనలోనిగుణాలకు చింతిస్తాడు. అంటూ

"పరమ లౌకిక మూఢ విశ్వాసినేల, ననుగురుతుపట్టియరుదెంచినావు స్వామి" (నీ రథము) అంటారు. అభ్యుదయవాది, హేతువాది, మార్క్సిస్టు భావజాలము కలిగిన వీరు ఒకానొక దశలో నాస్తికత్వం నుండి ఆస్తికత్వం వైపు మారినట్లు ఈ పంక్తులను బట్టీ తెలుస్తుంది. అంతేకాదు, భగవంతుని పట్ల పశ్చాత్తాపము కూడా వ్యక్తమవుతున్నది.

అంతా చూస్తూనే ఉన్నాను అనే కవితా ఖండికలో - "మానవతా చైతన్య ధనుష్పాణివై నీవు, అంతర్బహి శత్రువుల దనుమాడటం." చూశాను అంటారు.

"దేవతలకు రాసే దూషణ లేఖల మీద చిరునామాలు స్పష్టంగా రాయను నేను, ఎందుకంటే ఎవరికి చేరినా ఇష్టమే నాకు" అంటారు. దీనిద్వారా మనకు వీరు భగవంతుని గుర్తిస్తున్నారు, ఉనికిని నమ్ముతున్నారు. కానీ, భగవంతుని తీరుని వ్యతిరేకిస్తున్నట్టుగా తెలుస్తుంది.

"వయస్సు మళ్లిన పామరుడిలా, బ్రతుకు భరించలేను గానీ, బాల్యం మళ్ళీ ఒకసారి ప్రసాదించు భగవాన్" అని, "మారుజన్మ వసంతంలోకి మళ్ళీ పరుగిడదామని వుంది" అని అంటారు.

ఇలా భగవంతునికి రాసిన బహిరంగ లేఖను మూడు భాగాలుగా విభజించి 36 పుటలలో నివేదనాపూర్వకంగాను, ప్రశ్నోత్తర పద్ధతిలోనూ రాసి తానే జవాబులు కూడా చెప్పుకున్నారు. వ్యాజస్తుతి అలంకారాలతో, భగవంతుని పట్ల తన అభిప్రాయాలను వెల్లడించారు. తాను ఆశించిన 'కథాకథన పద్ధతిని కూడా మనమీ లేఖలో చూడవచ్చు. మొత్తానికి పాఠకుల మనసులో ఆసక్తిని, ఉత్కంఠను రేపుతూ సందేశాత్మకంగాదీర్ఘకవితను నిర్వహించారు.

"నలభై సంవత్సరాల వయస్సు అప్పుడు సభలూ సమావేశాల సందడి లేదు. తిట్టిపోసే విమర్శకుల దీర్ఘవ్యాసాలు తప్ప" -(పుట్టినరోజు) అంటూ వచన కవితా నిర్వహణలో తాను

ఎదుర్కొన్న ఆటుపోట్లను మనకళ్లకు కట్టినట్టు చూపిస్తారు. ఎన్ని విమర్శలను ఎదుర్కున్నా తాను తలపెట్టిన దీర్ఘకవితా యజ్ఞాన్ని సంపూర్ణంగా నిర్వహించిన పరిపూర్ణులు కుందుర్తి ఆంజనేయులుగారు.

మనలోని నిరాశ, నిస్పృహల్లోంచి, ఓటమి, ఒంటరితనాలనుండి మనల్ని బయటకు లాగి, బ్రతుకు తీపి చూపించి, నలుగురికోసం మనం నడవాల్సిన దారి చూపించే వాళ్ళే కవులు. అలాంటి కవులను సమయ సందర్భానుసారం తలచుకోవడం మన భాధ్యత. అలాంటి ఓ బృహత్తర కార్యక్రమానికి వేదిక ఈ సదస్సు.

ఆధార గ్రంధాలు:
1. కుందుర్తి కృతులు- కుందుర్తి.
2 . ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు- ప్రయోగాలు – సినారె.
3 . తెలుగు సాహిత్య చరిత్ర -ద్వానా శాస్త్రి.
4 . దీర్ఘకవితా వికాసం డా. పెళ్ళూరు సునీల్.

## గంటేడ గౌరునాయుడు - రైతు సంఘీభావ కవిత్వం

**శ్రీమతి ఎం. రమాగీతాదేవి**
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయనగరం.
Email ID: ramagitadevim@gmail.com

**నేపథ్యం:** ఆంగ్లేయులు సమస్త వర్ణాల వారిని సమానంగా అణచి వెయ్యడం వల్ల వర్ణాధిక్యభావనకు అడ్డుకట్ట పడింది. జమిందారీ వ్యవస్థ బీటలు వారింది. ఎవరికైతే భూమి మీద ఆధిపత్యం ఉందో, ఆ వర్ణాలవారు ఆర్థిక, సామాజిక రంగాల్లో తమ స్థానం కోసం పోరాటాలు ప్రారంభించారు. 1910 ప్రాంతం నుండీ రైతుల్లో కదలిక మొదలైంది. బ్రిటీష్ వారికి, జమిందార్లకు వ్యతిరేకంగా ఎన్నో రైతుసంఘాలు ఏర్పాటయ్యాయి. రైతు కుటుంబాల్లో అంతో ఇంతో చదువుకుని వర్గ చైతన్యం పొందినవాళ్ళు నుండి కవులూ, ఇతర మేధావులు వచ్చారు. సరికొత్త భూస్వామ్య భావజాలం ఏర్పడుతున్న నేపథ్యంలో "ఉత్తమం సేద్యం, మధ్యమం వ్యాపారం, అధమం సేవకవృత్తి" అనే నానుడి వచ్చింది. 'రైతులేనిదే భారతజాతి లేదు' అనే భావన బలపడింది. ఆధునిక కవులలో కర్షకుని గురించి చైతన్యం చిగురించింది. దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు', ఏటుకూరి వెంకట నరసయ్య 'క్షేత్రలక్ష్మి', అమ్మిశెట్టి లక్ష్మయ్య 'రైతుకళ్యాణం', కన్నెగంటి వీరభద్రాచార్యులు 'పెదకాపు', వానమామలై జగన్నాథచార్యులు 'రైతు రామాయణం', భైరావురెడ్డి నారాయణ రెడ్డి 'రాయలసీమ రైతు'... మొదలగు వారు తమ కావ్యాలలో రైతు జీవితాన్ని కవిత్వీకరించారు. ఈ మధ్యకాలంలో పాపినేని శివశంకర్ ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన 'రైతు కవిత' ఆధునిక తెలుగు సాహిత్యంలో రైతు స్థితిగతులను విశ్లేషించిన వాటిలో ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**రచయిత పరిచయం:** "ప్రతీ కవీ ఒక రసాత్మక కావ్యం వెలువరించడానికి, కొత్త పంటలతో గర్భం దాల్చిన పుడమి ప్రసరించడానికి పడే యాతనలాగ కష్టపడుతూనే ఉంటాడు" ఆవంత్స సోమసుందర్. తాము పుట్టి పెరిగిన మట్టిమీద మమకారంతో స్పందించి సాహిత్యసృష్టి చేసినవారు అరుదుగా ఉంటారు.

పుట్టిన ప్రతీ కవిత్వం ఆనందాల హరివిల్లు మాత్రమే కాదు. దుఃఖాశ్రువుల మాలిక కూడాను. నేటి కవిత్వంలో బాధ, బాధ్యతతో రాస్తున్న కవులలో ఒకప్పటి ఆనందాన్నీ, నేటి హృదయతాపాన్ని ఆర్తిగా అనుభవించి అక్షరీకరించినవారు గౌరునాయుడు. రైతు జీవితాన్ని అక్షరీకరించిన ఉత్తరాంధ్ర కవులలో గంటేడ గౌరునాయుడికి ప్రథమస్థానం ఇవ్వవచ్చు. వచన కవులలో ఉత్తరాంధ్ర నుండి రైతు గురించి ఎక్కువగా రాసిన వారిలో గంటేడ కన్పిస్తారు. ఈయన కవిత్వం రాగయుక్తంగా ఉండడంతో పాటు, జీవనానుభవాన్ని సూటిగా చురుక్కుమన్నట్టుగా అనిపించే ఉత్తరాంధ్రయాస కన్పిస్తుంది, ఆర్తితో మన హృదయాన్ని తడిపి ముద్ద చేస్తుంది.

**కవిత్వం:** గౌరునాయుడు గారు తన తండ్రి 2002లో కాలం చేసినపుడు అతనికి అంకితంగా రాసిన దీర్ఘకవిత "నాగేటిచాలుకి నమస్కారం", 2006 సం॥లో తీవ్ర అనారోగ్య పరిస్థితులలో అదే చివరి దశ అనుకుని చేసిన కవితాసంకలనం "నదిని దానం చేసాక", గుండెకు ఆపరేషన్ తరువాత విశ్రాంతి సమయంలో రాసిన దీర్ఘకవిత "నాగలి", వ్యవహారిక భాషలో వందరోజులపాటూ ఫేస్బుక్లో రాసిన వందపద్యాలు "సేద్యగాడు" మొదలైనవి.

కేంద్రం వ్యవసాయరంగంలో మార్పులు తెచ్చే ఉద్దేశ్యంతో తెచ్చిన మూడు చట్టాలపై రైతాంగం స్వతంత్ర్య భారత చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో పోరాటం సాగించింది. 2020 నవంబరు 26న మొదలైన రైతుల అందోళన శక్తివంతమైనది, సుదీర్ఘమైనదే కాదు అతిపెద్దది కూడానూ. దేశంలో సుమారుగా 500ల రైతు సంఘాలు 'సంయుక్త కిసాన్ మోర్చా' పేరిట ఒకే గొడుగు క్రిందకు వచ్చి చేపట్టిన ఉద్యమం. మూడు కొత్త సాగు చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న రైతు ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ, వ్యవహారిక భాషలో రోజుకొక కవిత చొప్పున నెలరోజుల పాటు గౌరునాయుడు ఫేస్బుక్లో రాసినదే "రైతు ఉద్యమ సంఘీభావ కవిత్వం".

2020 డిసెంబరు 3 నుండి 2021 జనవరి 3 వరకు రాసిన కవితలలో ఒక్కక్షణం, పాట, పుట్టెడు దుఃఖంతో, ఊరూ... ఏరూ..., కథను తిరగ రాసుకోవాలి, దండుగట్టిన నాగళ్ళు, వాళ్ళు, పద్యం, కాంక్ష, అతడు, అతడు సూర్యుడు, ఇప్పుడతను, ఒక పద్యం కోసం, ఒకే మాట, పాయిదా, శ్రేయోభిలాషి, రైతంటే దేశం, యుద్ధం వాళ్ళకు కొత్తకాదు, తువ్వాళ్ళు జెండాల్లాగా ఎగరేద్దాం, పిడుగులాంటి పాట కోసం, అతనికోసం, వాళ్ళొద్దరూ, మంచు-మంట-మనికి కొత్తేటి, దేశంలో ఎక్కడైనా, జీవసూత్రం... మొదలైన శీర్షికలతో రాయటం జరిగింది.

చెమట ధారల కాల్వలు తీసి, మొక్క మొక్కకు ప్రాణం పోసి పంట పండించే వాడు రైతు. వర్షాభావ పరిస్థితులు, పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణలతో రూపుమారుతున్న పల్లెలు, పంటలు పండకున్న భూములు అమ్ముకుని, వ్యవసాయాన్ని ఎత్తుబాటు చేసి జీవనోపాధికి కూలీలుగా మారుతున్న వైనాన్ని 'పుట్టెడు దుఃఖంతో' నేనొక చెమట కుండనై నగరం నడిబొడ్డున అమ్మకానికి నిలబడినపుడు అప్పుడు కదా మొదలైంది సత్తుకేరేజిలో గెంజినీళ్ళు పోసుకుని అడ్డా చేరి ఎవరు పనికి పిలుస్తారా అని ఎదురు చూడ్డంతో కదా మొదలైంది.

ఒకప్పుడు తూరుపు తెలవారక ముందే మంచు తువ్వాలు దులిపి, తలకి చుట్టుకుని, తొలిపొద్దును ముద్దాడే వాడు రైతు. మహాలక్ష్మి లాంటి పెళ్ళాం మట్టిగాజులతో పూజ చేసి కాళ్ళు కడిగిన ఎడ్లను పూసి మేడిపట్టి మడిలోకి దిగితే నేలతల్లి పులకరించేది. ఇప్పుడు రైతు పరిస్థితి తెల్లారుతుందంటే చాలు, అన్నపూర్ణాదేవి చేతులకు సంకేళ్ళేసినట్లు పుట్టెడు దుఃఖంతో 'ఏదోపాపం చేయడానికి బయలుదేరాల్సి వస్తుంద'ని వాపోతాడు.

రైతు కష్టాన్ని సాగుచట్టాల పేరుతో పాలకుల చుట్టాలయిన బడాపెట్టుబడి దారులకు కట్టబెట్టాలని చూస్తున్న దోపిడి స్వభావాన్ని 'దండుగట్టిన నాగళ్ళు' కవితలో....

"ఎవరేది చెప్పినా నమ్మి ఎదో ఒక గుడ్డను జండాగా ఎగరేయడానికి వాళ్ళేమైనా ఇంగిత జ్ఞానం లేనోళ్ళా చెమటామట్టీ కలిపి చేలను సృష్టించే శాస్త్రవేత్తలు" అంటూ....

"పంటకు ప్రాణగండముందని తెలిసి నమ్మిన దేవుళ్ళయినా నిలదీయడానికి.... ఎరుపెక్కిన కళ్ళతో ఢిల్లీ కోటముందు దండు గట్టిన నాగళ్ళు" అంటూ మన్నులోంచి అన్నం తీసిన నాగలి పట్టిన రైతు, రాజధాని నడిబొడ్డున మొదలెట్టిన నిరసనకు తన 'దండుగట్టిన నాగళ్ళు' కవిత ద్వారా సంఘీభావాన్ని తెలిపాడు గౌరునాయుడు.

'**అతడు**' కవితలో అతడు మంచు భూమిలో మూడుమొనల ములుగర్రతో సాగుచట్టాల మీద సమరం ప్రకటించి రుద్ర తాండవం చేస్తున్న త్రినేత్రుడు రైతు వేరెవరోకాదు. నాగలి, కొడవలి, గొడ్డలి, పలుగు పనిముట్లు ఆయుధాలుగా ధరించిన నాలుగు చేతుల నారాయుణుడు, విత్తును వేసి, ఆయువును పోసే బ్రహ్మ. త్రికాలలలోను అవిశ్రాంతంగా శ్రమించే త్రిమూర్తి. అతనికి ప్రణమిల్లుదాం అంటాడు గంటేడ.

'అతడు సూర్యుడు' కవితలో దట్టంగా అలుముకున్న కారుచీకట్ల కలుపుమొక్కలను కిరణశీరంతో దున్ని దున్ని వెలుగు పంటల్ని పండించే వాడు రైతు. అతడు సాక్షాత్తూ సూర్యుడే అంటాడు.

శతసహస్ర కిరణాయుధదారుల సమూహం, సమర నినాదాల జ్వాలా సందోహం. అతడు జడివానలకు జడడు, మంచుతెరలకు భయపడడు, ఆ సస్యకేదారాన్ని దున్నే రైతు సాక్షాత్తూ సూర్యుడే అంటాడు గంటేడ.

**ఇప్పుడతను**' కవితలో '

మడి అతనికి అమ్మఒడి పసిపాపై కేరింతలు కొడతాడు బురదలోనే పచ్చగా పలకరిస్తాడు దుమ్ము, ధూళిలోనే...

అటువంటి రైతు ఇప్పుడతను. ఆకుపచ్చని ఆశలు ఆవిరైపోతుంటే కలలు కాలిపోతున్నాయనే అందోళనలో ఉద్యమాన్ని వేదికగా నినాదాన్ని భూమికగా చేసుకున్నాడు.

అందరూ అన్నదాత రైతంట కదా! అని అంటూ ఉంటారు కదా! దేశానికి వెన్నుముక అని అంటారు కదా! మరి ఆ రైతు గోల ఎవరికి కావాలి? భూగోళం రైతు ఎత్తిపట్టిన అన్నం ముద్ద అయితే దాన్ని తన్నుకుపోవడానికి వ్యాపారమనే దుర్మార్గపు రాకాసి గెద్ద సిద్ధంగా ఉందని, దాన్ని తరమడానికి అందరూ కలిసి సమైక్యంగా రైతుకు సహకరిద్దాం అంటాడు 'రైతంటే దేశమనే' కవితలో.

'యుద్ధం వాళ్ళకు కొత్తకాదు' కవితలో... తుప్పల్లో, ముళ్ళడొంకల్లో, మెరకలమీద, పశువులెనక పరుగులు తీసినవాళ్ళు రైతులు. కండల్ని నైవేద్యంగా సమర్పించుకునే కర్షక వీరులకు యుద్ధం కొత్తకాదని, భూమి బిడ్డల బ్రతుకుపోరు నిరంతరం యుద్ధమే. ఎందుకంటే సేద్యమంటేను యుద్ధం. నిరంతరం యుద్ధం చేస్తున్నవారికి నేడు బుసలుకొడుతున్న మూడు తలల చట్టసర్పంపై పోరు పోరుసాగించడం పెద్ద విషయం కాదు. పరుగులు తీయండి. మట్టిపాదాలు రాజధానివైపు మహా సర్పాన్ని మట్టుపెట్టడానికి ఎందుకంటే వాళ్ళకు యుద్ధం కొత్త కాదు కదా! అంటారు గంటేడ.

'**వాళ్ళిద్దరూ**' కవితలో... దేశసరిహద్దులో జాతిగౌరవాన్ని జండాగా రెపరెపలాడించిన సైనికుడు, మట్టిపొరలలో తన ఊపిరి నింపి హరిత వాక్యాలు రచిస్తున్న రైతును ఒక తల్లిబిడ్డలుగా అభివర్ణిస్తాడు.

ఒకరు కరిచే మంచు భూమిలోనూ, మరొకడు కురిసే జడివానల్లోనూ ఇద్దరూ మృత్యువును పరిహసిస్తూ ఉంటారు.

ఒకరు శత్రువుతో, మరొకరు ప్రకృతితో నిరంతరం పోరాడి చివరకు సైనికుడు త్రివర్ణపతాకాన్ని గర్వంగా హత్తుకుంటే, రైతు మట్టి దుప్పటిని ఆర్తిగా కౌగిలించుకుంటారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**ముగింపు:**రైతు కుటుంబం నుంచి వచ్చినవాడు, తానే స్వయంగా వ్యవసాయం చేసి రైతులా బాధలు స్వానుభవం కలిగిన కవి గంటేడ రైతు సంఘీభావ కవిత్వాన్ని రాయడం ద్వారా రైతు చేస్తున్న చారిత్రాత్మక పోరులో తన వంతుగా తానుకూడా పదం పదం కలిపి అక్షర పుష్పాలతో రైతు ఉద్యమాన్ని అభిషేకించాడు.

**ఆధార గ్రంథాలు:**

1) గంటేడ గౌరునాయుడు సాహిత్యం- కవిత్వం (రెండవ సంపుటి)
2) నాగలిజాడ
3) వికీపీడియా

## ఆధునిక కవిత్వ వికాసం "స్త్రీ- దళితవాద కవిత్వం"

డా. ఆర్.యన్. రవికుమార్

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

తెలుగు ఆధ్యాపకులు
S.S.S. ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుక్కపట్నం, శ్రీ సత్య సాయి (జిల్లా)
చరవాణి: 9959287794
E-Mail: kumavathravi@gmail.com

**ఆధునిక కవిత్వ వికాసం:** తెలుగు సాహిత్య చరిత్రలో ఆధునిక కవితా ప్రస్థానం క్రీ.శ.1875 నుండి ప్రారంభమైందని అనేక మంది సాహితీవేత్తల అభిప్రాయం. రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్య, వైజ్ఞానిక విషయాలను వివరిస్తూ, చైతన్యవంతమైన నూతన కవితా ప్రక్రియలతో ఆధునిక కవిత్వం వికసించింది. అలాంటి ఆధునిక కవితా మార్గంలో విప్లవ ధోరణి స్థానాన్ని ఆక్రమిస్తూ 1980 లో సుడిగాలిలా తెలుగు సాహిత్యంలోకి రెండు బలమైన ధోరణులు ప్రవేశించాయి. అవి. 1) స్త్రీ వాదం. 2) దళిత వాదం.

**1. స్త్రీ వాదం:** స్త్రీలు తాము తక్కువవారు కామని, పురుషులతోపాటు సమాజంలో తమకు గౌరవం, గుర్తింపు ఉండాలనే విధానంతో, నినాదంతో వచ్చినదే "స్త్రీ వాదం".

**1. పరిచయం:** "సమాజం, కుటుంబం పనుల్లో అణచివేత, దోపిడీకి గురౌతున్న స్త్రీలలో స్ఫూర్తి, ధైర్యం, అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో, పురుషాధిక్యతను నిరసిస్తూ, ఇద్దరూ సమానమే అనే భావనను అందించే దిశగా, ఆశాదీపంలా మగువల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వచ్చిన చైతన్యవంతమైన వాదమే "స్త్రీ వాదం". దీన్ని ఆంగ్లంలో "ఫెమినిజం" అని అంటారు.

**2. ఉపోద్ఘాతం:** బిడ్డగా, భార్యగా, ఇల్లాలుగా స్త్రీలు పుట్టినప్పటి నుండి చచ్చేవరకు చాకిరేవు బండల్లాగా అతుకుల బతుకులను అనుభవిస్తున్నారు. నాడు సతీ సహగమనం, కన్యాశుల్కం, బాల్య వివాహాలు, దేవదాసీలు, భోగం మేళాలు లాంటి సాంఘిక దురాచారాలతో నరకాన్ని చూపించారు. నేడు గృహహింస, అత్యాచారాలు, మానభంగాలు, వరకట్న చావులు, యాసిడ్ దాడులతో బలిపశువును చేస్తున్నారు. అలాంటి ఆడవాళ్ళ మాన, ప్రాణ రక్షణకు, అరాచక శక్తుల ఆకృత్యాలను అణచివేసే ఆయుధంగా ఆవిర్భవించిన ఆవేశపూరిత కవిత్వమే "స్త్రీ వాదం".

**3. విషయం:** "ఆధునిక మహిళలు చరిత్రను తిరగరాస్తారు" అంటూ స్త్రీ వాదాన్ని ముందుగా చెప్పిన రచయిత గురజాడ. స్త్రీల అనుభవం, పురుషుల అనుభవం కన్నా భిన్నంగా ఉంటుందని ఆయన భావించారు. తెలుగు కథానిక "దిద్దుబాటు" మహిళా జీవిత కథావస్తువుగా పుట్టింది.

నిజానికి స్త్రీ వాదం ఇతర దేశాల్లో పుట్టింది. 1969 లో మార్గరెట్ బెన్ స్టన్ "పొలిటికల్ ఎకానమీ ఆఫ్ ఉమెన్" లో స్త్రీల వెట్టిచాకిరీకి వెలకట్టాలని చెప్పింది. 1970 లో కేట్ మిల్లెట్ "సెక్సువల్ పాలిటిక్స్" లో స్త్రీల అణచివేతకు పితృస్వామ్యం కారణమని తేల్చింది. 1972 లో జర్మైన్ గ్రీల్ రాసిన "ద ఫిమేల్ యూనిక్" లో స్త్రీ పురుషులను సెక్స్ పదంతో కాకుండా జెండర్ పదంతో సూచించాలన్నారు.

క్రీ. శ. 1960-70 లలో విదేశాల్లో మొదలైన స్త్రీ వాదం 1980 90 లలో ఆంధ్రదేశంలోకి అడుగుపెట్టింది. మొదట ఓల్గా, రంగనాయకమ్మ లాంటి స్త్రీవాదులు మార్క్సిస్టు దృక్పథంతో కవిత్వాలను రాశారు. చలం "స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి" అంటూ స్త్రీ వాదాన్ని బలపరచారు.

స్త్రీ ఉద్యమ సాహిత్యానికి తెలుగు కవయిత్రులు తమ భావాల పుష్పాలను ఒకేచోట గుదిగుచ్చి అందించిన తొలి పరిచయ పుష్పహారం "నీలిమేఘాలు" కవితా సంపుటి. ఇందులో

యుగయుగాల నుండి మహిళలు పొందిన వేదనలు, తపనలు, తహతహలను బలంగా, అత్యంత ప్రతిభావంతంగా తమ కవితల్లో ప్రతిఫలింపజేశారు.

స్త్రీ వాదాన్ని బలంగా వినిపించిన వారిలో ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, సావిత్రి, విమల, రేవతీ దేవి, రబియా బేగం, ఇల్లిందల సరస్వతిదేవి, పద్మావతి, పాటిబండ్ల రజని, జొన్నలగడ్డ లలితాదేవి వంటి స్త్రీవాద కవయిత్రులు తమ కవిత్వాలతో అతివా లోకానికి ఆలోచన, అవగాహనను కలిగించారు.

ఓల్గా రాసిన "ఔను మేము గయ్యాళులమే" కవితలో "మా గుండెల మీద కూర్చున్నది, పురుషాహంకారపు పెద్దపులి అని తెలిసాక కూడా, సుతిమెత్తగా ప్రేమ పలుకులు పలుకుతామా, మేం గయ్యాళులమే కాదు, భయంకర కహాళులం" అంటూ హెచ్చరించింది.

జయప్రభ రాసిన "చూపులు" కవితలో - "ఆ కళ్ళల్లో లక్ష వర్గాలున్నాయి. కానీ చూపులకి మాత్రం వర్గ విబేధాలు లేవు. ఇప్పుడు ఆ కళ్ళను వెంటాడడానికి కళ్ళతోనే యుద్ధం చేస్తాను. కళ్ళకే కాదు ఈ దేశంలోని ఆడదానికి ఒళ్ళంతా ముళ్ళుండే రోజు ఎప్పుడొస్తుందో" అంటూ గుచ్చి గుచ్చి చూసే కామ వికారపు చూపులను ఎదిరించాలని చెబుతుంది. అలాగే "నన్ను అబలని చేసిన పితృస్వామ్యపు అదృశ్య హస్తం పైట" అంటూ అలాంటి పైటను తగలెయ్యాలని ధిక్కార స్వరాన్ని వినిపించింది.

కొండేపూడి నిర్మల "లేబర్ రూమ్" కవితలో "కాళ్లనలా ఎడంచేసి దీనంగా, హీనంగా ఒక హింసాత్మక పరాకాష్ట కోసం ఎదురు చూడటమంటే రైలు పట్టాలమీద నాణెం విస్తరించిన బాధ, కలపను చెక్కుతున్న రంపం కింద పొట్టులో ఉండచుట్టుకున్న బాధ, ముల్లుకు గుచ్చి నిప్పులో కాలుస్తోన్న చేప ఏడుపులా" ఉ ంటుందని భావంలో, భాషలో తీవ్ర అలజడి రేపింది.

సావిత్రి "బందిపోట్లు" కవితలో "పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని" పంతులు అన్నప్పుడు "ఆఫీసులో నా మొగుడున్నాడని, అవసరమొచ్చినా సెలవివ్వడు' అని అన్నయ్య అన్నప్పుడు "వాడికేం మగ మహారాజు" అని ఆడా, మగా అన్నప్పుడు "పెళ్ళంటే-శిక్ష" అని, "మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని" "మేము పాలిచ్చి పెంచిన సగం మమ్మల్ని విభజించి పాలిస్తున్నారని" తక్కువ అక్షరాల్లో ఎక్కువ అర్థాన్ని ఇచ్చే విధంగా రచన చేశారు.

విమల "వంటిల్లు" కవితలో "వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి, అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటి పైనా మా నాన్న పేరే, అలాంటి వంటింటిని ధ్వంసం చేద్దాం రండి" అంటూ పిలుపు నిచ్చింది. పురుషాధిక్యతను నిలదీసింది.

రేవతీ దేవి తన "శిలాలోలిత" కవితా సంకలనం లోని "రుచించని మాట" అనే కవితలో "మగ వాళ్ళకి చాటుగాను ఆడవాళ్ళకు పబ్లిగ్గాను, రుచించని మాట చెప్పనా - మగకీ, ఆడకీ శీలాన్ని, ఆస్తిని సమంగా వర్తింప చేయండి, కాగితాల మీద, వేదికల మీద కాదు నిజంగా సమంగా వర్తింప చేయండి" అంటూ ఆనాటి పాలకుల బూటకపు మాటలను నిగ్గుతీసింది.

రబియా బేగం "అలాగే అన్నాడు" అనే కవితలో- బాల్యంలో "చిన్నపిల్లవి నీకేం తెల్సు కూర్చో అన్నారు, యవ్వనంలో "ఉడుకు రక్తం మంచి చెడు నీకేం తెల్సు కూర్చో" అన్నారు, వృద్ధాప్యంలో "ముసల్దానివి ఇంకేం చెబుతావ్ కూర్చో" అన్నారు. అవకాశం రానందుకు కోపంగా లేదు, కూర్చొని కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధ" అంటూ స్వేచ్ఛలేని స్త్రీ జీవితాన్ని ఆవిష్కరించింది.

పద్మావతి "గుక్కపట్టిన బాల్యం" కవితలో "నవ్వే నక్షత్రంలో అమ్మ కావాలి, లాలించే జీవనది అమ్మ కావాలి, అమ్మ ఆకాశపు గుండెల మీద ఉయ్యాలలూగాలి, నాన్న చేత తన్నులు తినని అమ్మ కావాలి" అంటూ అమ్మతనపు గొప్పదనాన్ని తెలిపింది.

పాటిబండ్ల రజని "అబార్షన్ స్టేట్మెంట్" కవితలో "పాలింకిపోవడానికున్నట్లు, మనసింకి పోవడానికి మాత్రలుంటే ఎంత బాగుండు" అనే పంక్తులు గుండెను పిండేస్తాయి.

ఇల్లిందల సరస్వతీ దేవి "పెళ్ళి కూతుళ్ళు" నవలలో వివాహ వ్యవస్థ ఎలా ఉండాలనే విషయాన్ని "కాంచన లత - పుష్పలత" పాత్రలతో చెప్పించారు.

జొన్నలగడ్డ లలితా దేవి "అగ్నిపుత్ర" నవలలో లైంగిక దోపిడీకి బలైన స్త్రీల వ్యథలను తెలిపింది.

**స్త్రీవాద ముగింపు :** స్త్రీ వాద కవిత్వం వ్యవస్థను ప్రశ్నించడంతో ప్రారంభమైంది. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా సమాజంలో పాతుకుపోయిన ద్వంద్వ ప్రమాణాలను, స్త్రీ పురుషుల అసమానతలు "అతి సహజమని" భావించే ఆలోచనావిధానం మారాలి. జీవితాన్ని, ప్రపంచాన్ని స్త్రీల దృక్పథం నుంచి చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని రంగాల్లోనూ స్త్రీ సమాన హక్కుని, స్వేచ్ఛని కోరుకుంటుంది. వైవాహిక జీవితంలో ఇద్దరికీ సమాన గౌరవం ఉండాలని ఆకాంక్షిస్తుంది.

**2. దళిత వాదం:** సమాజంలో కులతత్వంతో అణచివేయబడి, నలిగిపోతున్న వారికి మద్ధతిస్తూ, మనుషుల్లాగా బతకాలని, బతికించాలనే కోరిక నుండి పుట్టినది "దళిత వాదం".

**1. పరిచయం:** సాంఘిక అసమానత, కుల వివక్ష, అంటరానితనం, పేదరికం, చులకన భావం, నిరక్షరాస్యత, వెట్టిచాకిరీ, పాలేరు పనులు అన్నీ చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేసిన "మాల-మాదిగ" కులాలకు అండగా వారి జీవితాల్లో కష్టాలకు, కన్నీళ్ళకు, బాధలకు, ఇబ్బందులకు, అవమానాలు, అవహేళనలకు గురిచేసిన ఉన్నత కులాల, భూస్వాముల అరాచకాలను, అన్యాయాలను, ఆకృత్యాలను ఎత్తిచూపుతూ వచ్చిన తిరుగుబాటు సాహిత్యమే "దళితవాదం".

**2. ఉపోద్ఘాతం:** జ్యోతిరావ్ పూలే, అంబేద్కర్, మార్క్స్ ఆలోచనల ప్రభావంతో దళిత సాహిత్యం రూపు దిద్దుకుంది. 1970 సం.లో వికసించిన దళిత సాహిత్యం 1980 సం.లో ప్రవాహంలా మారింది. "కుల బేధాలు, కులాల మధ్య హెరీదా పెత్తనం" లాంటి అంతస్తులను కూల్చివేస్తూ, సమాజంలో గౌరవం, గుర్తింపు, రాజకీయ అధికారం సంపాదించే లక్ష్యాలతో, పదునైన భావజాలంతో "దళిత సాహిత్యం" వచ్చింది. దళిత వాదం తెలుగు సాహిత్యంలో ప్రవేశించడానికి ముందే మరాఠి, కన్నడ, బెంగాలి, హిందీ భాషలలో వచ్చింది.

**3. విషయం:** సామాజిక సమానత కోసం జరిగే సంఘర్షణ లోంచి దళితవాదం పుట్టింది. ముందుగా దళిత స్పృహని చాటిన కవి గురజాడ. ఆయన "మంచి అన్నది మాల అయితే మాల నేనగుదున్" అనే మాటల్లో కులం కన్నా మంచి మిన్న అనే ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు.

1933 లో రెండు గొప్ప దళిత కవిత్వ సంపుటాలు వచ్చాయి. 1. మంగిపూడి వెంకట శర్మ రాసిన "విరుద్ధ భారతం", 2. కుసుమ ధర్మన్న రాసిన "హరిజన శతకం". ఈ రెండు రచనలు గాంధీజీ ప్రభావంతో అస్పృశ్యతను వ్యతిరేకిస్తూ రాసినవే.

వెంకట శర్మ - "కాపురంబులు చేయగ చుట్టు గుడిసెలే, చెలికట్టంగా మాసిన చింపి గుడ్డలే, త్రావంగ నూకల జావయు గంజియే, సొగసుగా తాల్ప గాజులు పూసపేరులే, పంట పండింపగా నూరివారి చేలె, మా ఘోర దారిద్ర్య మొకరికైనను జాలి పుట్టింపదాయెనా" అనే కవిత్వంలో దళితుని అతుకుల బతుకు చిత్రాన్ని చెప్పి గుండెను కదిలింపజేశాడు.

కుసుమ ధర్మన్న స్వయానా దళితుడు కావడం చేత ఆయన కవిత్వంలో దళిత జీవన ఆవేదన వాస్తవికత, ప్రతిఘటన తీవ్రత ఇంకా స్పష్టంగా కనిపిస్తాయి. "మాలవాడని యవమానంబు గావించి, పంచముండని పరువు పారద్రోలి కొల్చు, నీకు పిచ్చ కుంచంబుతో, తాను కొల్చుకొనడే పెచ్చు కుంచమునను, అక్కరైన కొంత అప్పిచ్చి తక్కువ కూలికెపుడు పనులు గొనుచు నుండె, ఆలకింపుమయ్య హరిజనుండ" అంటూ ఒక దళితుని వేదనను రగిలే వాస్తవికతను దళిత స్వరం నుండి చెప్పాడు.

మహాకవి జాషువా "కులం- పేదరికం" నేర్పిన అనుభవాలతో దళితుని జీవన వాస్తవికత, చైతన్యం, ప్రతిఘటనా స్వరాన్ని తన కవిత్వం ద్వారా తీవ్రంగా వినిపించాడు. ప్రజా కవిత్వానికి పద్యాన్ని వినియోగించి దళిత చైతన్యానికి మార్గదర్శి అయినాడు.

"వాని రెక్కల కష్టంబు లేనినాడు, సస్యరమ పండి పులకింప సంశయించు, వాడు చెమటోర్చి ప్రపంచమునకు భోజనము బెట్టు, వానికి భుక్తి లేదు"
"చెప్పులు కుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లేదెప్పుడు, అప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్"
"ఆ అభాగ్యుని రక్తంబు నాహరించి, యినుప గజ్జెల తల్లి జీవనము సేయు గసరి బుసకొట్టు నాతని గాలిసోక, నాల్గుపడగల హైందవ నాగరాజు" అనే ప్రతి పంక్తిలో దళితుని మనోవేదనను చిత్రీకరించాడు. సామాజిక అసమానతలను తీవ్రంగా ఖండించాడు, దండించాడు.

1930 -1980 దాకా వచ్చిన మార్క్సిస్టు కవిత్వం వల్ల దళిత కవిత్వం మరింత పదునెక్కింది. దానికి తోడు 1969 లో కంచికచెర్లలో కోటేశు అనే దళితుణ్ణి అగ్రవర్ణాలు కలిసి సజీవ దహనం చేసిన సంఘటన, "మేకల్నే బలి ఇస్తారు కానీ, సింహాల్ని కాదు" అనే అంబేద్కర్ మాటలు దళిత చైతన్యానికి, సంఘటిత శక్తికి, కవితా మార్గానికి దోహదం చేసింది. పోరాటం వైపు నడిపించాయి.

దీని ఫలితంగా బొజ్జతారకం రాసిన "నది పుట్టిన గొంతుక" దళితవాద సాహిత్యానికి వేగుచుక్క "నేను అస్పృశ్యుణ్ణి నా ఒళ్ళంతా మట్టి వాసన నా బ్రతుకు నిండా వెట్టి వేదన - నా కళ్ళ నిండా ఎండ వేడిమి నన్ను ఊరికి దూరంగా ఉంచారు. ఇంట్లోకి రావద్దన్నారు చచ్చిన మీ గొడ్డు చర్మం ఒలిచి చెప్పులు కుట్టమన్నారు - నేను తొడగకూడదన్నారు నా పై కథలు కవితలు లేవు- నాలుగు వేదాల నుంచి నాలుగు పాదాల నుంచి నన్ను తొలగించారు కట్టలోంచి జారిన కట్టెలా ఒక్కన్నే ఎక్కడో ఎండిపోయాను" అనే సరికొత్త పోలికల్లో దళితుని ఆవేదన లోంచి "ఎండిన కట్టె ఎప్పుడో ఒకప్పుడు మండకపోదు" అనే ఆక్రోషపు ధ్వనిని సూచిస్తుంది.

మద్దూరి నగేష్ బాబు "నిశాని" కవితలో "మానం అంటే కడుక్కుని సరిపెట్టుకునేదాన్ని, ఈ సినిగిపోయిన రైక ఎక్కణ్ణుంచి తెచ్చుకునేదిరా" అంటూ అత్యాచారానికి గురైన దళిత మహిళ వేదనను పచ్చిగా, నిక్కచ్చిగా నిగ్గుతీసాడు. అప్పుడు అతడు వాడిన భాష చర్చనీయాంశమైంది.

కత్తి పద్మారావు "ఓనామాలు" కవితలో- దళిత జీవిత వాస్తవికతను, అమాయకతను వివరిస్తూ "మాయమ్మ ఎండి మిరపకాయలు కాల్చి కాల్చి పచ్చి పులుసు బువ్వ కలిపి పెట్టినప్పుడు, మాయప్ప కుండలో గడ్డిమీద కుడుములు ఆయిగిల బెట్టి నా నోట్లో కుక్కినప్పుడు ఆకలికి అర్థం తెలియలేదు" అనే మాటల్లో మట్టితనపు వాసనలు కనిపిస్తాయి. దళిత భాషని, దళిత జీవితాలను ఎక్కువగా రికార్డు చేసింది పద్మారావే.

ఎండ్లూరి సుధాకర్ ప్రబంధ నాయిక కన్నా దళిత స్త్రీ అందమైనదని చెబుతూ "నా నల్ల కావ్యానికి నీవే నాయికవు" అంటాడు. తన జాతి తినే తిండిని వర్ణిస్తూ...
"సంగటిముద్దలోకి - ఎండుతునకల్ని నంజుకుంటూ
వార్చిన గంజిలోకి - మిరపకాయల్ని కొరుక్కుంటూ
అంబలి జుర్రిన కమ్మదనం చెప్పుకునే స్థితికి తీసుకెళ్ళాడు. ఏ అమృతానికొస్తుందిరా" అంటూ తమ జాతి అస్తిత్వాన్ని గొప్పగా 1981 లో సలంద్ర "దళిత మానిఫెస్టో" కవితలో- "నన్ను నీ దేవుడి గుళ్ళోకి రావద్దన్నావ్ చదివితే నాలుక కోసెయ్యమన్నావ్, వింటే వేడి వేడి సీసపు లోహం చెవుల్లో పోయమన్నావ్, చచ్చిన శవాల దహన సంస్కారాలే చూసుకోమన్నావ్" అంటూ దళితులకు జరిగిన అన్యాయాలను, అవమానాలను ఎండగట్టాడు.

దళిత జీవితంలోని విషాద వాస్తవికతలను తన కవిత్వంలో చేర్చి, కూర్చి, పేర్చి రాసిన మద్దూరి నగేష్ బాబు "వెలివాడ" అనే కవితలో "చాలాకాలం తర్వాత అమ్మని చూద్దామని బయల్దేరా, బస్సు దిగేసరికి బాగా పొద్దుపోయింది, శీతాకాలపు జిగట వెన్నెల పూరి గుడిసెలపై కప్పిన మృత వస్త్రంలా ఉంది, నడుస్తుంటే నా నేల బురద చేతుల్తో నన్ను చుట్టేసింది" అంటూ పల్లె పలకరింపుతో వచ్చిన పులకరింపు పదాలతో హృదయాన్ని కదిలింపజేశాడు.

చల్లపల్లి స్వరూపారాణి తన కవిత్వంలో "ఇంట్లో పురుషాంకారం ఒక చెంప ఛెళ్ళుమనిపిస్తే, వీధిలో కులాధిపత్యం – రెండో చెంప పగులకొడుతుంది" అంటూ దళిత స్త్రీల వేదనలను వివరించారు. ఇంకా విజయలక్ష్మి, ఇందిర మొదలైనవాళ్ళు దళిత స్త్రీలు అనుభవిస్తున్న బాధలను, అవమానాలను తమ కవిత్వాలలో తెలియజేశారు.

దళిత కవిత్వం ప్రధానంగా ఆత్మ గౌరవానికి సంబంధించిన ప్రశ్నగా నిలిచింది. "నీ సంస్కృతి హీనం నీచాతి నీచం" అని తరతరాలుగా అనిపించుకున్న దళితుడు ప్రతిఘటనా శక్తితో "నా సంస్కృతి గొప్పది చరిత్ర గొప్పది" అనే ఆత్మ విశ్వాసపు స్థాయికి ఎదిగింది.

**4. దళిత వాద ముగింపు:** దళిత కవిత్వం ఒక చారిత్రక కవితోద్యమం. అగ్రవర్ణ అహంకారంతో పోరాటం తాత్కాలిక అవసరమైనా, కుల నిర్మూలన దాని అంతిమ లక్ష్యం. తాత్వికత, సమకాలీన సమస్యలు, దళిత వాస్తవిక జీవన విధానాలను కలగలిపి కవిత్వంతో రంగరించి, చైతన్యపూరిత, ఆత్మాభిమాన నినాదాన్ని బలహీనుల మనసుల్లో బలాన్ని నింపి తెలుగు కవిత్వానికి గర్వకారణమైన ఒక మహా ఉద్యమం దళితవాదం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర : డా.ద్వానా శాస్త్రి.
2. ఆధునిక సాహిత్య పరిణామక్రమం పిళ్ళా కుమార స్వామి.
3. తెలుగు కవిత్వంలో దళిత వాదం డా. అద్దేపల్లి రామమోహన రావు..

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# వచన కవిత్వం - ఒక పరిశీలన

**కె. అరుణ**
తెలుగు అధ్యాపకురాలు
పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కాకినాడ.
చరవాణి: 94902 95553

**స్థూల పరిచయం:** "Free Verse" అనే ఆంగ్లపదానికి సమానార్థకంగా తెలుగులో "వచన కవిత" అని పిలుస్తున్నాం. 1930ల తరువాత తెలుగు కవిత్వ బహిరాకృతిలో వచ్చిన మార్పు వచనకవిత్వం అని డా॥ కడియాల రామమోహనరాయ్ పేర్కొన్నాడు. "వచన కవిత"అనేక పేర్లతో వ్యవహరించబడుతూ వచ్చింది. "వచన పద్యం', "వచన గేయం", "వచన గీతం", "వచన గీతిక", "ముక్తచ్ఛందం", "స్వచ్ఛంద కవిత", "స్వేచ్ఛాకవిత", ఇట్లా ఎన్నో పేర్లు ఉన్నప్పటికీ "వచన కవిత" అనే సరళమైన మాట స్థిరపడింది. అధికంగా ప్రాచుర్యంలోనికి వచ్చింది. దీనిని ఒక ఉద్యమంగా నడిపింది కుందుర్తి ఆంజనేయులు. ఈ కారణముగా ఆయనను "వచనకవితా పితామహుడు" అని గౌరవిస్తాం.

"ఛందో రహితమైన కేవలం వచనంలో భావలయ ప్రధానంగా పలికే కవిత్వానికి వచన కవిత్వమని స్థూలంగా నిర్వచనం చెప్పవచ్చు". అని అరిపిరాల విశ్వం భావించాడు."ఏ నియమమూ లేకుండా శుద్ధ వచనమును లయాత్మకంగా మార్చినచో అది వచన గేయమగును' అన్నాడు సి. నారాయణరెడ్డి. "వచనం కవితామయంగా వుంటే, ఆ వచన కవిత్వం" అంటారు సర్దేశాయి తిరుమలరావు. "చురుకైన ఆవేశాన్నీ, సాంద్రతరమైన అనుభూతుల ఒత్తిడినీ, సూక్ష్మమైన భావననీ అనువదించడానికి కవిత (వచన కవిత) తన స్థానాన్ని ప్రత్యేకించుకొంది" అన్నాడు దేవరకొండ బాలగంగాధర తిలక్. ఈ నిర్వచనాలు ఛందస్సు లేకపోవడం, నియమం లేకపోవడం అనే వాటితో పాటుగా లయాత్మకంగా వుండడం, కవితామయంగా ఉండడం గురించి ప్రస్తావిస్తున్నాయి. అలాగే ఆదేశం, అనుభూతుల ఒత్తిడి, సూక్ష్మభావ ప్రకటన, సాంద్రత, గాఢతల గురించి కూడా చెబుతున్నాయి. మనం ఎన్ని నిర్వచనాలు చూసినా నిర్వచన పరిధికి లోబడకుండా మిగిలిపోయే అంశాలు ఎన్నో ఉంటాయి. వచన కవిత విషయంలో ఇది మరీ ఎక్కువగా ఉంటుంది. వచన కవిత అనిబద్ధంగా ఉంటుంది. ఏ నిబంధనలూ లేనది వచన కవిత.

వచన కవితకు ఆద్యుడిగా శిష్ట్లా ఉమామహేశ్వరరావును చెపుతారు. 1930ల నుండి ఆయన రాసిన కవిత్వం 1938లో "విష్ణుధనువు" "నవమి చిలుక'గా వెలువడ్డాయి. తన కవిత్వాన్ని ప్రాహ్లాద కవిత్వమని పేర్కొన్నాడు. 1939లో పఠాభి ఫిడేలు రాగాల డజన్" అను ఆరుద్ర మొదట వచన కవితా గ్రంథంగా గుర్తించాడు. "నా వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో పద్యాల నడుముల్ విరగదంతాను" అని సంచలనం సృష్టించాడు. 1944లో బెల్లంకొండ రామదాసు, కందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురు మూడేసి కవితల చొప్పున "నయాగరా" అనే వచన కవితా సంకలనాన్ని ప్రచురించారు. 1949లో ఆరుద్ర రచించిన "త్వమేవాహమ్" వెలువడింది. వచన కవితకు శ్రీ శ్రీ అభ్యుదయ దృక్పధాన్ని జోడించాడు. శిష్ట్లా, పఠాభి, శ్రీరంగం నారాయణబాబు, ముద్దు కృష్ణ, శ్రీ శ్రీ వచన కవితకు పునాదులు వేశారు. ఆరుద్ర, తిలక్, కుందుర్తి,

దాశరథి, నారాయణరెడ్డి తదితరులు వచన కవిత్వ అభివృద్ధికి, విస్తరణకు దోహదం చేశారు. వర్తమానంలో ఎందరో యువకవులు వచన కవితా వైవిధ్యానికి కొత్తదారులను వేశారు.

వచన కవితకు నియమ నిబంధనలు ఏమీ లేవు. కవి తాను తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిత్య పరిశీలన చేస్తుంటాడు. ప్రతిస్పందిస్తూ వుంటారు. తాను చూసే ప్రపంచంలో అన్యాయం, అణచివేత పీడన, దోపిడీ, హింస, క్రూరత్వం, ఆకలి, నిరుద్యోగం లాంటివి ఉండవచ్చు. కవికి సంవేదన ఉంటుంది. ఉద్వేగం ఉంటుంది. అనుభూతి ఉంటుంది. ప్రశ్నించే తత్వం ఉంటుంది. ప్రతిఘటించే స్వభావం ఉంటుంది. వీటి కారణం తాను అందరిలాగ చూస్తూ ఊరుకోడు. అతను సమాజంలో జరిగేవాటిని గురించి కలత చెందుతాడు. బాధపడతాడు. సమాజం ఉన్నతంగా, మనుషులు ఉత్తమంగా ఉండాలని ఆకాంక్షిస్తాడు. ఆ ఆకాంక్షనే తన స్పందనగా తనకు తెలిసిన భాషలో ఉద్వేగ ప్రధానంగా వెల్లడిస్తాడు. అట్లా వెల్లడించడానికి ప్రతి కవికీ తనదే అయిన పద్ధతి వుంటుంది. కవి తన భావోద్వేగాలను తెలిపే లేదా ప్రకటించే విధానాన్ని అభివ్యక్తి అని అంటాం. ఇప్పుడొక కవితను పరిశీలిద్దాం.

ఒకచోట హింస చెలరేగింది. అది అన్ని చోట్లకూ పాకింది. హింసకు కారణం కుల వివక్ష కావచ్చు. మత వివక్ష కావచ్చు. అహింస సామాజిక సామరస్యాన్ని భంగపరచింది. మనుషుల మధ్య వైషమ్యాలను పెంచింది. మనుషులలో మానుషత్వాన్ని రూపు మాపింది. ఈ హింసకు లోనైన వారి గురించి కవి ఆవేదన చెందుతున్నాడు. కవి పేరు రమాకాంత్రైథ్, ప్రముఖ ఒరియా కవి.

ఇక్కడ కాలిన కమిరిన స్త్రీ, పురుషుల పిల్లల దేహాలు / రైలు బోగీలలో చూడు చూడు ఎక్కడ బ్రతుకున్న వాడెవడూ లేడు ప్రతి వీధికి రెండు వైపులా కూలలేడు ప్రతివీధికి రెండు వైపులా కూలగొట్టిన ఇళ్ళు ముందుకు కదులు... ఎక్కడికీ నడక ? మరో ఊరికా ? ఇంకో నగరానికా ॥ ఎక్కడైనా ఇంతే కాలిన మృతదేహాలు తెగిన గొంతులు పగిలిన పొట్టలు ఎక్కడైనా ఇవే కనిపిస్తాయి నీకు. ఇది పూర్తి కవిత కాదు. కవితలోనరి ఒక భాగం మాత్రమే.

ఇదోక దాడిని సూచిస్తుంది. రైలు బోగీ అని చెప్పడం ద్వారా ఆ సంఘటన ఎక్కడ జరిగిందో సూచించాడు. ఎక్కడికి నడక అనే ఒక ప్రశ్న. అసలు మనుషులంతా ఎటు నడుస్తున్నారు అనే కవి ఆవేదనను తెలుపుతుంది. విధ్వంసం అంతటా ఉందని అంటాడు.

ఒక కవి ఏమంటాడంటే కవిత్వమంటే భాషా సామర్థ్యాన్ని తూకం వేసే సున్నితపు త్రాసు. కవిత్వం దుంగల వరసలో గంధపు చెక్క, కవిత్వం కొత్తదీ కాదు, పాతదీ కాదు. కవిత్వం మొత్తం సత్యం అని, "కవిత్వం" గురించి వరవరరావు స్పందన చూద్దాం

కవిత్వం దాచనక్కర్లేని నిజం
ప్రభుత్వం అక్కర్లేని ప్రజ
అమృతం అక్కర్లేని జీవితం
జేబులు వెతికినా / టేబిల్ మీద పుస్తకాలు కాగితాలు పొర్లించి తెర్లు చేసినా
బీరువా సొరుగులు / బీర పువ్వులాంటి హృదయ కుహరం తెరచిచూసినా పరచి చూసినా
కవిత్వం తప్ప రహస్యం లేదు
నీ కర్థంకానివా ప్రమాదకర వ్యక్తిత్వం ప్రభావమంతా కవిత్వ రహస్యమే.

దృక్పథ బలంగల కవి కవిత్వం ఎంత శక్తిమంతంగా ఉంటుందో తెలియజేస్తాడు. ఉద్యమ కవిత్వానికి గల ప్రయోజనం ఈ కవిత తెలుపుతుంది. కవిత్వం రాజ్యాన్ని రద్దుచేసి బహిరంగ రహస్యం అంటాడు కవి. కవిత్వం రాయడం గురించి కె. శివారెడ్డి రాసిన కవిత పేరు "పద్యం రాయడానికి", కవిత్వం రాయడానికి ఏవేవో కావాలని భావిస్తారు చాలా మంది. ఈ కవిత మరోకోణంలో అసలు విషయం చెబుతుంది.

పద్యం రాయడానికి ఏవీ అక్కరలేదు మహత్తర మహోన్నత సాధన సామాగ్రి అక్కరలేదు. ఒక శబ్దం చాలు, ఒక చూపు చాలు ఒక పదం చాలు, ఒకపాదం చాలు రాలుతున్న ఆకుచాలు, ఎగురుతున్న గడ్డిపోచ చాలు, ఒక కదలిక చాలు, ఒక విరుపు చాలు నుదుటి మీద పెళ్ళున విరిగిన కొమ్మచాలు నీ చిటికెన వేలు పట్టుకు నడుస్తున్న చిన్న పిల్లచాలు పిల్ల ముఖంకేసి చూడు, కళ్ళకేసి చూడు తడబడుతున్న కాళ్ళకేసి చూడు పద్యం రాయడానికేమీ అక్కర లేదు నువ్వు చాలు నువ్వు బతికుంటే చాలు.

ఈ కవితలో కవి పద్యం రాయడానికి మనిషిగా స్పందించే గుణం ఉంటే చాలునని చెబుతున్నారు. స్పందన ఉన్న ప్రతీ మనిషీ రాయగలడని చెబుతోంది కవిత. మనుషులలో మానవీయ స్పందనలు తగ్గిపోయాయి. కాబట్టి ఎవరూ తమ తోటి, సాటి మనుషులు పడే బాధలను, కష్టాలను, సహానుభూతితో అర్థం చేసుకోవడం లేదని అట్లా అర్థం చేసుకున్నప్పుడు రాయగలుగుతారు అని చెప్పవచ్చు.

అందరికీ కవిత్వం రాయాలని ఉంటుంది. కొందరు రాయాలంటే ముందుగా కవిత్వం బాగా చదవాలి. అందరిలోనూ భావాలుంటాయి. అందరికీ ఆలోచనలు వస్తుంటాయి. అందరూ ఉద్వేగం కలిగి వుంటారు. మనలో కలిగే భావాలకు తగిన భాషారూపం ఇవ్వడమే కవిత్వం రాయడం, ఎటువంటి ఉద్వేగం లేకుండా రాస్తే అది వ్యాసం అవుతుంది. ఉద్వేగంతో రాస్తే కవిత్వం అవుతుంది. కమీషనర్ కళాశాల విద్యవారు "యువతరంగం" పేరిట ప్రతీ ఏటా వివిధ పోటీలు విద్యార్థులకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే కదా ! యువతరంగంలో కవిత్వ, కథారచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 2017లో డిగ్రీ కళాశాల విద్యార్థులకు రచన ఎట్లా చేయాలనే విషయమై ఒక శిక్షణా శిబిరం కూడా నిర్వహించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సౌజన్యంతో జరిగింది. ఆ సందర్భముగా "తొలి అడుగులు" పేరుతో విద్యార్థులు రాసినరచనలను ప్రచురించారు అందులో ఒక విద్యార్థి కవిత్వం రాసే పద్ధతి గురించి చెప్పాడు. అక్షరాల్ని కూర్చి కవిత్వం రావాలి. భావాల్ని.. బాధల్ని/ ఆలోచనల్ని.. అనంతమైన / అక్షర రూపంలో ఆవిష్కరించేది / కవిత్వం / కవిత్వమంటే... మనిషి అంతరంగాన్ని/ప్రకటించేది... ప్రభావితం చేసేది / అన్నాడు మరొక విద్యార్థి తన భావాలను ఇలా చెప్పాడు. నాలో ఏముందని అడగకు / నీ శక్తిని గుర్తించి నువ్వు ముందుకు సాగు ఆకుపచ్చరంగు చూడు / హరిత విప్లవం ఎరుపు రంగుచూడు / సైనికుడిగా మారు తెలుగు రంగు చూడు / శాంతికై పోరాడు, నీలి రంగుచూడు /కవిగా కవితలుపాడు అని సందేశమిచ్చాడు. ఊబహలోకపు ఉద్వేగ భావం కవిత్వం హావభావాలకు అచ్చురూపం కవిత్వం అనేకాలోచనల మమేకమే కవిత్వం ఆత్మల్లో మెదిలే సృజనాత్మకత కవిత్వం అనుభవాలను కనుల ముందుంచేలా కవిత్వంగా నిర్వచనం చెప్పారు విద్యార్థులు.

ఎలాంటి బాధనైనా తన భావనగా తెలిపేది కవిత్వం అని చెప్పి సమాజాన్ని మేల్కొల్పేది కవే నీతిని.. న్యాయాన్ని.. మానవీయమైత్రిని కలిగింపజేసేది కవిత్వం ఇటువంటి ఉదాహరణలు తెలిపే అంశం ఏమంటే విద్యార్థులు కవిత్వం రాయగలుగుతారని వారికి సృజన్మాతక శక్తి సామర్థ్యాలున్నాయని వాటిని వెలికి తీసే పనికి పూనుకోవాలి. మెరుగుపెట్టుకొనే పనిలో పడాలి. భాషతో ఎల్లలులేని ప్రపంచాన్ని నిర్మించవచ్చు. భావంతో సమస్త మానవాళిని ఒకటి చేయొచ్చు అంటాడొక విద్యార్థి. వీటిని పరిశీలించినప్పుడు విద్యార్థులలో ఆలోచనాశక్తి ఉందని, ఉద్వేగాలున్నాయని సరైన దిశానిర్దేశం చేసేవారు లేక రాయడంలో ముందడుగు పడడం లేదని అర్థమవుతుంది.

సరళంగా ఒక భావం చెప్పాలంటే ఏం చేయాలి? ఉదాహరణకు నీరు మనుషులకు ఎంతో అవసరం. జల వనరును మనుషులు పొదుపుగా వాడుకోవాలి. సూటిగా చెబితే "నీటిని వృధా చేయరాదు అని చెప్పాలి. అనేక చోట్ల ఈ వాక్యం అందరం చూసే వుంటాం. నీల్ళు పుష్కలంగా దొరికేచోట ఈ వాక్యం పెద్దగా కదిలించదు. కానీ, ఎంతో ముందుచూపు, దూరదృష్టి, ప్రకృతి వనరులపట్ల భాధ్యత, వినియోగంలో జాగ్రత్త మొదలైనవి దీనిలో

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

కనిపిస్తాయి. త్రాగునీటికి, సాగునీటికి తీవ్రమైన ఎద్దడి ఉన్న ప్రాంతంలో ఈ వాక్యం ఎంతో ప్రాధాన్యం పొందుతుంది. నీరు దొరకకపోవడం వల్ల పడిన బాధలు వారికి తెలుసు కాబట్టి దీనికొక చక్కటి అర్థాన్ని కల్పించుకున్నారు. దానినే సందేశంగా స్వీకరించారు. కవిత్వం ద్వారా మనం చేయాల్సింది అర్థకల్పన, భావ కల్పన. అట్లాగే చీటికి మాటికి ఏడ్చేవాళ్ళున్నచోట ఒక వ్యక్తి "కన్నీళ్ళను వృధా చేయకూడదు|| అని రాశారనుకోండి. ఆయా వ్యక్తుల అనుభవ ఆవరణాన్ని బట్టి వాక్యం అర్థవంతమవుతుంది. మరొక వ్యక్తి మరింత గాఢంగా చెబుదామనే దృష్టిలో "నెత్తుటి కన్నీళ్ళను వృధా చేయరాదు" అని రాశాడు. ఈ మూడు రకాల వ్యక్తీకరణలు ఒకే చోట చేర్చి చదివినప్పుడు ఈ మూడవ వాక్యం త్వరగా ఆకర్షిస్తుంది. ఎందుకంటే దీనిలో గాఢత ఎక్కువగా ఉంది. మూడు వాక్యాలు వృధా చేయవద్దు అని ఒకే భావాన్ని వ్యక్తం చేస్తున్నప్పటికీ, మూడవ వాక్యం పట్ల దృష్టి ఎక్కువ పెడతాం. దాని నుండి అధిక భావార్థాలను ఎప్పుడూ పొందుతూ ఉంటాం. ఒక రకమైన ఉద్వేగంతో నీరు, కన్నీరు, నెత్తుటి కన్నీరు అనే మాటల్లో విశేషంగా ఉన్నది. ఈ నెత్తుటి కన్నీరు అనేది కవిత్వం రాయటమనేది మామూలు మాటలలోనే మనం విశేష అర్థాన్ని రాబట్టే పని అని అర్థం చేసుకోవాలి. ఇలా విశేషార్థం సాధిస్తూ మనం కూర్చే వాక్య సముదాయమే కవిత్వమవుతుంది.

ఒక స్త్రీ తాను గృహిణిగా ఎదుర్కొన్న అనుభవాలను పైకి సరళంగా అనిపిస్తూనే ఎంతో వేదనను ఒక కవితలో చెప్పేందుకు ప్రయత్నించింది. ఈ కవితలో విశేషం ఏమిటంటే వ్యాపార ప్రకటనల్లో తరచూ కనబడే స్త్రీని గురించి చెపుతూ తన గురించి కూడా ఇందులో చెబుతుంది. ఈ కవితలో వాస్తవిక గృహిణి, ప్రకటనల్లో కనిపించే గృహిణి పాత్ర ఈ రెండింటి మధ్య తారతమ్యాన్ని చెప్పకనే చెబుతుంది. గృహిణి ఏమీ, నిన్నే ఎల్లప్పుడూ కుటుంబం మొత్తానికి మంచి టూత్పేస్ట్ కొంటూ ఉంటావ్ మీ ఆయన నిన్ను బాగా ప్రేమించడానికి ఖరీదైన సబ్బే వాడుతూ ఉంటావ్ నలబైశాతం డిస్కౌంట్లో కొనుక్కొచ్చిన చీరనే కడుతూ వుంటావు. రెండు నిమిషాల్లోనే వంట ఎలా చేస్తావ్ దేవతలాగ కనిపిస్తూ కూడా బట్టలెలా ఉతుకుతావ్ నువ్వింత తాజాగా ఉండడంలో రహస్యమేమిటి. కొత్త అరెంజ్ ఫెస్ మినిట్స్ ఫీల్ ఆల్ ఫేస్ మాస్క్ వాడటమేనా ? చెప్పు నాకు.. నువ్వలా నవ్వడానికి వాళ్ళు నీకెంత చెల్లిస్తుంటారో చెప్పు అర్ధరాత్రి బిడ్డ నిద్రలేస్తుంది కవిత్వం రాసే చేతిని వెతుక్కుంటుంది. బిడ్డనెత్తుకొని జోకొట్టి నిద్రబుచ్చుతుందా చేయి నేను రాతబల్ల దగ్గరకు తిరిగొచ్చే సరికి రాయాల్సిన కవిత కాస్తా నిద్రలోకి జారుకుంటుంది.

కవిత్వం రాసే శక్తిగల గృహిణి తన సృజనాత్మక ప్రతిభను చూపడానికి గల ఆటంకాలను చెబుతుంది. తాను కవిత్వం రాయలేకపోతున్నది. ఇంటి పనులు, పిల్ల ఆలనాపాలనా చూసుకోవడం వల్ల, ఇక రెండవది ఎంతకీ తెమలని పనులను ప్రటకనలో స్త్రీ అలవోకగా చేయగలగడం గురించి తెలుపుతుంది. పైగా ఆ పనులన్నీ చెయ్యడానికి ఆ స్త్రీకి ఎంతో కొంత సంపాదన వస్తున్నది. ఈ గృహిణి ఇంటి చాకిరి ఎంత చేసినా కూడా జీతం లేదు. శ్రమ పడుతుంది. గాని సంపాదన లేదు. తాను పడే శ్రమకు గుర్తింపు, గౌరవం లేదు, సృజనాత్మకంగా ప్రతిభ ఉన్నా దానిని ప్రదర్శించలేకపోతున్నది. ఈ ఆవేదన అంతా కొద్ది పంక్తుల్లోనే వ్యక్తపరచగలిగింది. వ్యక్తుల అనుభవాలు, సామాజిక అనుభవాలు ప్రపంచ పరిణామాలు,. ఎన్నో అంశాలను గురించి మనకు కలిగిన భావాలను రాయవచ్చు.

**ముగింపు:** కవి తాను రాసేందకు స్వీకరించిన అంశాన్ని వస్తువు అంటారు. గృహిణి కవితలో వస్తువు ఏమిటి? గృహశ్రమకు తగ్గ వేతనం లేకపోవడం తనకున్న రాసే శక్తిని ప్రదర్శించలేకపోవడం, అందువలన కలిగిన అనుభవ వేదన. ఇది కవితలో తాను వాడిన పదాలు చెప్పిన భావం ద్వారా మనకు అర్థమవుతుంది. ఇక చెప్పిన పద్ధతిని చూస్తే కొద్దిపాటి ఆక్షేపణ కనిపిస్తుంది. ప్రకటనలో కనిపించే స్త్రీ ఎట్లా ఆ పనులు చేయగలుగుతున్నదని ప్రశ్నిస్తుంది. కొద్దిమంది కవులు పోలికలద్వారా రూపకాలద్వారా, పదచిత్రం, భావ చిత్రాల

ద్వారా చూపుతారు. కవి రాసిన విధానాన్ని స్థూలంగా శిల్పం అనవచ్చు లేదా రూపం అనాలి. "కవులు చేసిన బలమైన ఊహలే కవి సమయాలు" అని నిర్వచించాడు కుందుర్తి. కవిత్వం "జీవిత సంఘర్షణలో ఉంది. అలంకారాలలో కాదు". అని తేల్చిచెప్పినది కూడా కుందుర్తియే. 'కవిత్వం రాయడమంటే నిత్య జీవితంలోని సంఘర్షణను రాయడం అని గ్రహించి చక్కని కవిత్వం రాసి కవితా ప్రపంచంలో ధృవతారలుగా ప్రకాశించాలి.

**ఆధార గ్రంధాలు:**

1) తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా. శాస్త్రి
2) వచన కవిత - ఒక ఆలోచన - కర్లపాలెం హనుమంతరావు

# పరదాలో ముస్లిం స్త్రీ జీవన ఘోష

**అరిగెల శ్రీకాంత్**
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ కళాశాల రాజమహేంద్రవరం
చరవాణి: 7981941623

**స్థూల పరిచయం:-** ఆధునికాంధ్ర సాహిత్యంలో నేడు మైనారిటీ కవులుగా గుర్తింపబడిన ముస్లిం కవులు ఎందరో ఉన్నారు. ఏకాలంలో ఏ సందర్భంలో, ఏయే అంశాలపై కవితా సృజన జరుగుతుందో దాని ఔచిత్యాన్ని గుర్తించి, ఆ సృజనలో తమదైన భాగస్వామ్యాన్ని అందిస్తూ, ఎవరో వస్తారు, ఏదో రాస్తారు అనే భావం నుండి తమ కోసం తామే రాయాలనే ఆలోచనా రూపమే మైనారిటీ కవిత్వం.

భారతీయ రచనలు సామాన్యంగా మతంతోనే, మతసంబంధమైన అంశాలతోను, సంస్కృతి కలిగి దైవభావం గల ఏదో ఒక సంబంధాన్ని కలిగి ఉంటాయి. భారతీయ సంస్కృతిలో భాగంగా చూస్తే ముస్లిం వారి సంస్కృతి భిన్నంగా ఉంటుంది. హైందవ సంస్కృతికి సంబంధించిన ఇతివృత్తాలు గ్రహించి కావ్యాలు రాయడానికి నేటి ముస్లిం మైనారిటీ కవులు సిద్ధంగా లేరు. కారణం ప్రశ్నార్ధకమైన వారి అస్తిత్వం, తమకు తాము ప్రశ్నించుకుని, సంస్కరించుకుని ఉద్ధరించుకోవాలిసిన పరిస్థితులను నేటి కవులు గుర్తించారు.

సమాజంలో తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని, అవమానాల్ని, ఆవేశాలను ఒక సరికొత్త ధృక్పథంతో రచనలు చేశారు. అదే నేటి మైనారిటీ కవిత్వంగా రూపొందింది.

మైనారిటీవాద కవిత్వంలో తాము సమాజంలో ఎదుర్కొంటున్న అంశాలను ప్రధాన వస్తువుగా స్వీకరించారు. తాము, తమవారు అనుభవిస్తున్న బాధలు, అణచివేతలు, ఛాందస

భావాలు, కట్టుబాట్లు, ఆంక్షలు, ఆధిపత్యధోరణి, బహుభార్యత్వం, అధిక సంతానం మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకుని రచనలు చేయడం ప్రారంభించారు. 1992 లో బాబ్రీ మసీదు వివాదంతో తాము పుట్టిన దేశంలో పరాయి వాళ్లుగా వారిని చూడటంతో అభద్రతాభావానికి లోనవుతున్న తమజాతి వారి ఆందోళనను గుర్తించారు. వీరి ఆందోళన వర్తమానానికే కాదు, ఎలాంటి అభద్రతాభావం కలిగిస్తుందో గుర్తించవచ్చు

**ఉపోద్ఘాతం:** మైనార్టీలు ప్రత్యేకమైన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు కలిగి ఉండటం వలన సమాజంలో మిగతా మతాలకన్నా ముస్లిం మతం భిన్నమైనది .

ప్రత్యేకమైన మతం
ప్రత్యేకమైన భాష
ప్రత్యేకమైన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు కలిగి ఉండటం..

మైనారిటీల గుర్తింపుకు ప్రత్యేకతలుగా గ్రహించాలి. అందులో స్త్రీల పరిస్థితి భిన్నమైనది. ఇస్లాం మతంలో స్త్రీ ని పరదా చాటుకు తీసుకు వెళ్లింది. పరపురుషుల కంటపడటమే పెద్ద నేరంగా భావించి వారిని బురఖా ధరింపచేశారు. వారికి రక్షణ కల్పిస్తున్నామనే భావన కల్పించారు. కాని వారి చుట్టూ అల్లుకున్న పరదా వారి ఆశల్ని, కలల్ని నల్ల చీకటి ముసుగు కింద అణిచివేశారు మతఛాందసవాదులు.

ఇతర మతాల కంటే ముస్లిం స్త్రీ ఎక్కువ భాదలకు, నిర్బంధాలకు గురి అవుతుంది. ఇస్లాంలో మత ఆచారాలను ధిక్కరించడాన్ని మించిన నేరం లేదు. అయినా ముస్లిం కవులు మత సంస్కరణ చేయాలని భావించి 'పరదాను' ధిక్కరిస్తూ కవితలు రాశారు. పరతు, రెహాల్, మా, బూబమ్మ, ఖాసెఖిజా, ఖబడ్దార్, పరదా హటాకే దేఖో మొదలైన కవితలు రాస్తూ కవులు, కవయిత్రులు తమ నిరసనను వ్యక్తం చేస్తూ తమ గళం విన్పించారు.

**బురఖా:** 1994 లో పరతు అనే ముస్లింవాద కవిత్వాన్ని స్త్రీల సమస్యల పై రాసింది. ఇది బురఖా సమస్యను అక్షరబద్ధం చేస్తూ వచ్చిన కవితను ఖాజా రచించారు.

"గాలి సైతం స్వేచ్ఛగా పీల్చుకోలేని ఈ గాడాంధకారపు రుచి తెలుసుకోవడానికి మీరు గోషా ధరించే తీరాలని పరతు "పెడుతున్నాం.

అంటూ ముస్లిం స్త్రీల స్వేచ్ఛని మగహంకారంతో తారు డబ్బాలో మలచడాన్ని ఖండిస్తూ గాలి కూడా సరిగా పీల్చుకోలేని ఈ బురఖాలని ధరించి తిరగాలని పట్టుబడుతున్న వారందరూ కూడా బురఖా వేసుకోవాలని ధైర్యంగా చెప్పారు.

'రెహాల్ ' అనే కవితలో బురఖా వేసుకున్న తన తల్లి దయనీయ పరిస్థితిని తెలియజేస్తూ స్కైబాబా రాసిన కవిత. కన్నీటి దారాల్తో జీవన వస్త్రానికి మాసికలేస్తూ తరాల చీకటి కమ్మేసిన గోషాలో పాలిపోయిన చంద్రశిలా దేహంతో. అంటూ తన తల్లి యొక్క దయనీయ పరిస్థితిని వివరించాడు.

జీవితమంతా ఇంటికే పరిమితమై తమకంటూ ఏ అస్తిత్వం, ఏ విలువ, స్వేచ్ఛ, గౌరవం లేని జీవితాన్ని గడుపుతున్న తనతల్లి లాంటి స్త్రీలు ఎందరో ఉన్నారని, ఖురానాని మోసే 'రెహాల్' గానే మిగిలి పోయారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బూబమ్మ 'హిజాబ్ అనే కవితలో బురఖా వేసుకున్న స్త్రీలదయనీయ పరిస్థితులను గురించి వివరించాడు స్కైబాబా-

**అమ్మా!:** నువ్వు రంగు రంగుల చీరలు కట్టుకుని పాదీ సంబరానికెళితే చూడాల నుంది తన తల్లిని ఎప్పుడూ బురఖాలో చూడడమే కాని, చక్కగా అలంకరించుకుని రంగురంగుల చీరల్లో బయటకు వెళ్లడాన్ని చూడాలని ఉందంటూ తన ఆకాంక్షను కవితా రూపంలో వ్యక్తం చేశారు ఖాజా.

బయటికి వెళితే ఖచ్చితంగా బురఖా వేసుకోవాలి లాంటి ఆంక్షలు విధించిన మగవాళ్ళ అజ్ఞానాన్ని చిత్తుకాగితాల కింద అమ్మేయాలని ఉందనే నిరసనను వ్యక్తం చేశారు ఖాజా.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

నాకూ నీ చాందసా ముఖర్ డాను చూడాలని ఉండదా ?
కలలో కొచ్చినా చీకటినే కప్పుకు వస్తావే!
అంటూ తన ప్రియురాలిని ప్రశ్నిస్తున్నాడు గౌస్ మొహియుద్దీన్.

రోజూ తారసపడే నీ కాజల్ కళ్లలో "నాదిల్" ని వెతుక్కుంటానంటాడు. నిన్ను శాసిస్తున్న నోళ్ళలో ఆనల్ల గుడ్డల్ని కుక్కి వచ్చేయ్ అని అంటాడు. పరదాలు స్త్రీలకు ఒక విధమైన శిక్ష వాటిని ఛేదించుకుని రమ్మని చెబుతున్నాడు.

మైనారిటీ కవిత్వానికి దళిత వాదం ఊపిరి అందిస్తే, మైనారిటీ కవయిత్రులు కవిత్వానికి స్త్రీవాద కవిత్వం ప్రాణవాయువులు నింపింది. ఆ ప్రేరణతోనే స్త్రీలుకూడా తన భావాలని కవిత్వీకరించి మైనారిటీ కవిత్వానికి పరిపూర్ణత చేకూర్చిన వారిలో షాజహానా ఒకరు.

ఏ పరదాలు మాటున ఎంత నైరాశ్యం గూడు కట్టుకొని ఉందో ఏఏ మహా స్వప్నాలు ఒంటరి పరణాల గుహలలో బలైపోతున్నాయో..

పరదాల వెనుక బందీయైన ముస్లిం స్త్రీల జీవితాల్లో చూడలేక పోయిన గాధల్ని ఈ కవిత్వంలో తెలియ జేశారు. ముస్లిం ఆచారాల్లోని బురఖా గూర్చి తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు షాజహానా.

నా మాట మీద, పాట మీద పర్దా అడ్డు పడేది' అంటూ తనకంటూ స్వేచ్ఛ లేకపోవటాన్ని వివరించారు స్త్రీవాద రచయిత్రి మెహెజా బీన్.

"చందమామ లాంటి అందమైన నీ ముఖార విందాన్ని అమావాస్య లాంటి నల్లటి బురఖా చాటున దాచావా నీ పర్దా చాటున దాగిన ఆ నీలి కన్నులలో ఎన్ని ఆశల సౌధాలు నిస్తేజమై నిర్వీర్యమై పోతున్నాయి ! అంటూ బురఖా చాటున అమావాస్య చంద్రుడిలా చీకటిని కమ్ముకున్న చందమామ లాంటి ముఖాన్ని గూర్చి ఆవేదన వ్యక్తం చేసెను వాజిదాఖాతున్.

**ముగింపు:** ప్రపంచవ్యాప్తంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ముస్లిం స్త్రీలు భిన్నమైన సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఇస్లాం మత ఆచారాల ప్రకారం బురఖా ధరించటం నిత్యకృత్యమైంది. ఈ మతం విధించిన కట్టుబాట్లు ఆమెను ఇంటికి పరిమితం చేశాయి. పరదా అనేది చీకటి వలయమై, ఒక నల్లటి ఇనుప తెరలా సమాజంలో ఉన్న స్త్రీలకు, ముస్లిం స్త్రీలకు మధ్య తారతమ్యాల్ని తెలియజేస్తుంది. పరదా వారి యొక్క ఆశల్ని, కలల్ని, స్వేచ్ఛని, చీకటి ముసుగులో దాచి బయట ప్రపంచాన్ని దూరం చేసింది.

పరదాల చాటున పడకగదుల్లో మగ్గిపోతున్న ముస్లిం స్త్రీలు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు బయట ప్రపంచానికి తెలియకుండానే లోపలే మగ్గి కృశించిపోతున్న వారిని మేల్కొలుపుతూ, ఛాందస భావాలను వ్యతిరేకిస్తూ, పరదాని వదిలి రావాలని ఆకాంక్షిస్తూ కవులు రచనలు చేశారు. స్వేచ్ఛ, స్వచ్ఛత ప్రాణ వాయువులు. ఇలాంటి కవులకైనా మెజారిటీ శక్తులు సమాధానం చెప్పాల్సి ఉంది. ప్రగతిశీలక వర్తమాన సమాజంలో తమదైన వ్యక్తిత్వం కూడా ఉందని నిరూపించికున్న కవులు, కవయిత్రులు ఎందరో ఉన్నారు. ఇది నిరంతర శుభపరిణామం.

**ఆధార గ్రంధాలు:**

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానాశాస్త్రి
2. పర్దా -వాజీదా ఖాతూన్
3. ఫత్వా -ఖాజా
4. ముస్లిం సంస్కృతి కవిత్వం షాజహానా - స్కైబాబా
5. ముస్లిం స్త్రీ కవిత్వం- షాజహానా.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# అభ్యుదయ కవి – ఆరుద్ర

**ఎస్. రజిత**
తెలుగు సహాయ ఆచార్యులు
పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతివత్తి), హనుమకొండ.

**స్థూల పరిచయం:** అభ్యుదయం అనే పదమునకు మంగళము, శుభం, పురోగమనం, ప్రగతి అనే అర్థాలు కలవు. ఆంగ్ల పదమైన 'ప్రోగ్రెస్' అన్న పదమునకు సమానార్థకంగా "అభ్యుదయం" అనే పదాన్ని వాడుతున్నాం. తెలుగు సాహిత్యంలో భావకవితా యుగం 1910 నుండి 1940 మధ్యకాలంగా చెప్పుకొంటాము. కానీ అభ్యుదయ కవిత్వం 1935 కంటె ముందే ప్రారంభమయినది. శ్రీశ్రీ గారు రాసిన
"నేను సైతం" ప్రపంచాగ్నికి సమిదనొక్కటి ఆహితిచ్చాను నేనుసైతం భువన భవనపు భావుటాన్నై పైకి లేచాను.

అని జయభేరి (1933) కవితల ద్వారా శ్రీశ్రీ తన ప్రాపంచిక దృక్పథాన్ని సామాజిక బాధ్యతను తెలియచేసారు. 1934లో ఎన్.జి. రంగగారి ద్వారా 1935 లో క్రాంతి గీతాల సంకలనం ఇలా సామాజిక బాధ్యతతో కూడిన కవిత్వం వెలువడింది.

అభ్యుదయ కవిత్వమంటే మార్క్సిజానకు కట్టుబడిన కవిత్వం అనవచ్చు. ఎందుకంటే అభ్యుదయ కవిత్వం వెలువడటానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిస్థితులు ముఖ్యంగా మార్క్సిజం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడిత జనపక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలు అభ్యుదయం కవిత్వం వలనే తెలుగు సాహిత్యంలో ప్రవేశ పెట్టబడ్డాయి.

అభ్యదయ రచయిత రాజమన్నారు ప్రకారం అభ్యుదయమంటె సమకాలీనమైన జీవన పరిస్థితులకు, రాజకీయ వాతావరణానికి, ఆర్థిక సమస్యలకు, వైజ్ఞానిక విశేషాలకు అనుగుణంగా అవసరమైన మార్పులతో విలసిల్లాలి అని నిర్వచించారు. శ్రీశ్రీ గారి ప్రకారం సాంఘిక ప్రయోజనం అభ్యుదయ రచయితల లక్ష్యం. కొడవటి గంటి కుటుంబ రావు ప్రకారం అభ్యుదయ రచనలకు దృష్టి, శిల్పనైపుణ్యం అవసరం లేదని శ్రామిక వర్గం గురించి ఏ విధంగా రాసిన అది అభ్యుదయ కవిత్వం అంటే అభ్యుదయ కవి సామాజిక అవగాహనతో సమాజ శ్రేయస్సును కోరి సమాజ పురోగతికి అవసరమైన రచనలు చేయటమే అభ్యుదయం.
**అభ్యుదయ కవిత్వంను సిద్ధాంతాల** పరంగా చూసినట్లయితే అభ్యుదయ కవిత్వంలో వాస్తవికత ప్రధానంగా ఉండాలి. అభూత కల్పనలకు ఆధ్యాత్మిక, ఆదర్శవాద కల్పనకి భావ జాలానికి ప్రాముఖ్యత యివ్వకూడదు. వ్యక్తి చైతన్యం కంటే సామాజిక చైతన్యం కలిగి ప్రజలను ఉత్తేజ పరిచేలా కవిత్వం ఉండాలి. అభ్యుదయ కవిత్వం ప్రస్తుత సమస్యలైన ఆకలి పేదరికం వంటి వాటితో పాటు సామాజిక చైతన్యం అనే అంశాలు కవితా వస్తువులుగా ఉండాలి. వర్గ వివక్షతను గురించి చెప్పాలి, వర్గ దోపిడిని ప్రతిఘటించాలి, ప్రజా ఉద్యమాలను కవిత్వంలో ప్రతిఫలించేలా వ్రాయాలి. ప్రజా ఉద్యమాలను కవిత్వం ప్రోత్సహించాలి. అభ్యుదయ కవి ఎల్లప్పుడు ప్రజలను చైతన్య పరిచేలా ఉంటూ అంతర్జాతీయ దృక్పథంతో మానవాభ్యుదయాన్ని ఆశిస్తు కవిత్వం వ్రాయాలి. అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యానికి ప్రాపంచిక దృష్టితో పాటు భౌతిక దృక్పాథాన్ని పరిచయం చేసింది.
అభ్యుదయ సాహిత్యం అనగానే మనకు గుర్తుకు వచ్చే పేరు ఆరుద్ర, శ్రీశ్రీ తరువాత యువతరంపై ఎక్కువ ముద్ర వేసిన కవి ఆరుద్ర. అలాంటి ఆరుద్రగారి కవితలపై వ్రాసిన పరిశోదనాత్మకవ్యాసం.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**మార్చాన్:** ఏమర్రా బానిసలారా! లేవర్రా బాదితులారా! మీరే ఒక పట్టు పట్టితే పట్టేందుకు పగ్గాలుండవు కొట్టేందుకు కొరడాలుండవు లేవర్రా అనాధలారా ఏమర్రా అశాంతులారా...

బానిసలు కాని బాదితులు కాని కలిసి సాగినట్లయితే వారిని ఆపడం ఎవరితరం కాదని అదే విధంగా రష్యా, చైనా, బ్రిటన్, అమెరికా వంటి దేశాలలో ప్రజల యొక్క క్షేమాన్ని కోరే వారు అభ్యుదయ బావాల లక్ష్యాన్ని చేరుకొంటూ భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకొంటున్నారు. కాని భారత దేశంలో డిల్లీలో పాకీవాడిని, లాహోర్లో టాంగావాలను, కలకత్తాలో చీకటి మనిషిని, మదరాసులో టెబుల్ క్లీనర్ వీరందరిని ప్రస్తావిస్తూ మన తలరాతని భావించక ఎవరో వస్తారని భావించక మన లక్ష్యాన్ని చేరుకొనేందుకు అందరు సంఘటితంగా సాగి చైతన్యవంతంగా ముందుకు సాగినట్లయితే స్వర్గాన్ని మనమే సృష్టించుకోవచ్చని దేవుడిపై భారం వేయకుండా స్వశక్తిని నమ్ముకొన్నట్లయితే జీవితాన్ని స్వర్గమయం చేసుకోవచ్చాంటారు.

**ఏటికేడాది:** ఉగాదినాడు తెలుగుతల్లి దిగులుపడి కూర్చుంది. ఎందుకంటే సంవత్సరాలు గడుస్తున్న సమాజంలో మార్పు రావటం లేదు. ఆశయాలు ఎన్ని ఉన్నా భాష రాని పరదేశిలాగా ఆశయం మిగిలింది. రాజకీయ నాయకులు చేసే వాగ్దానాలు కాని, ఉద్యమాలు కాని యివేమి సామాన్యుల యొక్క జీవితాలను మార్చలేవు. స్వార్ధ రాజకీయాలతో సామాన్యుని జీవితంను ముడిపెడితే రాజకీయ నాయకులు లాభపడతారు కాని అట్టడుగు వర్గానికి మాత్రం మేలు జరుగదు.

ఎంత ఎగర వేసినా గుండా ఎగుర లేదు. తిరుగుబాటు జెండా కూలికి వచ్చిన కుబేరసైన్యం తొలి వేయలేదు. కుచేల సైన్యం గుండెల లోంచి రావాలి ఉద్యమం కండలలోంచి పెరగలి. ఉద్యమం ఎత్తిన పిడికిలిలా ఎగరాలి. జెండా ఎలుగెత్తిన నినాదాలు నిండాలి. దిక్కుల నిండా ఎండమావుల కోసం చాలించు కలహం నిండు జీవితం కోసం సాగించు పోరాటం. ఉద్యమంలు ఎప్పుడైనా బాద పడిన గుండెలలో నుండి చేసినవి మాత్రం అసలైన ఉద్యమంలు. స్వార్ధ ప్రయోజనాల కోసం చేసే ఉద్యమాలు ఎప్పుడు సఫలికృతం కావు. అణగారిన జీవితాల కోసం పోరాటం సాగిస్తే అదే అసలైన ఉ ద్యమం.

**దారిద్ర్య విద్రావణం:** అను గరీభి హటావో, అక్కు పక్షులెందరో తక్కువ కూలికి రెక్కలు ముక్కలు చేసుకుంటే తప్ప ఒక్క ధనికుడు పెక్కుల లక్షల వెనకేయలేడు కోటిమంది నోటిముందు కూట్లో దుమ్ముకొనితేనె తప్ప కోటిశ్వరుడు కుబేరుడిగా అవతరించలేదు.

ఎన్నికల సమయంలో సామాన్యుడు కాస్తా సదా మాన్యుడు అవుతాడని, దేశం రత్న గర్భ అయిన సామాన్యుని నివాసం మాత్రం మట్టిదిబ్బ సామాన్యుడికి కలలో కూడ కాయకష్టం కన్పిస్తుంది. కాని నిజ జీవితం మాత్రం కష్టాల మయంగా ఉంటుంది. శ్రామికుడు ఎప్పుడు ఆశావాహ దృక్పధమును కలిగి ఉండాలి. ఎందుకంటే ఈ ప్రకృతిలో వేటికి పక్షవాతం అన్నది లేదు. ఎంతో మంది కష్టపడితేనే ఒక సుందర భవనాన్ని నిర్మిస్తారు. కాని దానిపై విజయకేతనం ఒకరే ఎగర వేస్తారు. ఈ వ్యవస్థ మొత్తం స్వార్ధం, అధికారంతో కూడి ఉన్నది. ప్రస్తుత కాలంలో సంచులున్న వాడిదే రాజ్యం.

"కష్ట జీవులు సృష్టిస్తారు ఐశ్వర్యం కల వాళ్లు పంపిణీ చేస్తారు దారిద్ర్యం దళారీలు బలుస్తారు మధ్యలో దరిద్రులు పడిపోతారు జీవన రథంలో"

ప్రస్తుత కాలం పెట్టుబడిదారి వ్యవస్థదే రాజ్యం ఏలుతుంది శ్రామిక వర్గం సంపద సృష్టిస్తే, దానికి ప్రతిఫలంగా పెట్టుబడిదారి వ్యవస్థ వారికి దారిద్ర్యాన్ని ప్రతిఫలంగా వస్తుంది. పెట్టుబడిదారి వ్యవస్థ వాగ్దానాలు చేస్తూంటే శ్రామిక వర్గం వాటిని నమ్ముతుంది. కాని శ్రామిక వర్గంనకు నిజం తెలియనంత వరకే వారి ఆటలు సాగుతాయి. ఎప్పుడైతే అసలు నిజం తెలుస్తుందో అన్నింటికి తెగించిన శ్రామిక వర్గం సంఘటితం అయితే పెట్టుబడిదారి వ్యవస్థ నిప్పులపై నీళ్లు చల్లినట్లుగా ఎదో కొద్ది సంస్కరణలు చేసినట్లుగా నటిస్తుంటారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

"ఎందరో ఒకటైనప్పుడు అందరూ పోరాడినప్పుడు దరిద్రానికి నిశోత్సర్గం దరణీలోనే సమతా స్వర్గం"

పోయే వాడి వెంట ధనం రాదు, కాని శ్రీమంతుడు తన ధనాన్ని తన వారసులకు యిచ్చిపోతాడు. ప్రజాస్వామ్యం అన్నది ఉన్న వారికి మాత్రమే. ఇదంతా గ్రహించిన విద్యార్థులు, కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎవరి దరిద్రాన్ని వారే రూపుమాపు కోవాలని, అందుకే అందరు ఒకటై పోరాడినప్పుడు మాత్రమే అందరి జీవితాలు సుఖమయం అవుతాయి.

శ్రమించే వారికే ప్రతి ఫలం దక్కాలన్న నినాదంను అంది పుచ్చుకొని ఆరుద్రగారు తన రచనలు చేసారు. సమ సమాజ స్థాపన ద్వారా పేద ధనిక అంతరాలు తొలగుతాయనేవి అభ్యుదయ వాదుల దృక్పథం. బానిసలు ఎప్పుడు బానిసలుగా ఉండకూడదు అంటూ అందరు సంఘటితం అయితే బానిసతత్వంనుండి బయటపడచ్చు. పెట్టుబడిదారి వ్యవస్థ ఎప్పుడు శ్రామిక వర్గంను మోసం చేయాలనే చూస్తుంది. అది గ్రహించిన శ్రామిక వర్గం ఎదురు తిరిగితే ఎదో కంటి తుడుపు చర్యలు చేస్తుంది అంటూ ప్రస్తుతం ఉన్న పెట్టుబడి దారుల తత్త్వంను ఆరుద్ర గారు వివరించారు.

**ముగింపు:** పైన పేర్కొన్న కవితలు 'చంద్రుడికో నూలుపోగులా ఆరుద్ర గారి అభ్యుదయ కవిత్వం గురించి చెప్పినవి. అభ్యుదయ సాహిత్యం అశాస్త్రీయతకు తావివ్వదు. శ్రామికుల పక్షాన నిలుస్తుంది. అలా శ్రామికుల పక్షాన నిలుస్తూ ఆరుద్రగారు అభ్యుదయ కవితా లక్షణాలన్ని తన కవిత్వంలో చూపించారు.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగులో కవిత్వ నియయాలు - ప్రచురణ - తెలుగు అకాడమి.
2) ఆధునికాంధ్ర గేయ కవిత్వం డా॥ జి. చెన్న కేశవ రెడ్డి..
3) ఆరుద్ర రచన కవితలు (విపుల సంకలనం) క్వాలిటీ పబ్లిషర్స్ 1985.

# కర్పూర పరిమళాలు వెదజల్లే కర్పూర వసంతరాయలు

**డా. పరుచూరి విజయలక్ష్మి**
7702519119

**కవిపరిచయం:** "ఇవాళ నేను -విధిని నిధినీ విశ్వసించనుజనం నా జెండా -జాగృతి నా ఎజండా" అంటూ సాంఘిక స్పృహ లేని కర్మ సిద్ధాంతానికి, సామాజికాభ్యుదయం లేని ఆర్థిక వ్యవస్థకు తన కవిత్వంలో స్థానం లేదని నిర్ద్వంద్వంగా ప్రకటించిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సింగిరెడ్డి నారాయణ రెడ్డి గారు తెలంగాణా లోని కరీంనగర్ జిల్లా వేములవాడ మండలంలోని హనుమాజీ పేటలో 1931 జూలై 29న మల్లారెడ్డి బుచ్చమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య ఉన్నత విద్య కరీంనగర్ లోనే పూర్తి చేసారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బి.ఏ, ఎం.ఏ, పిహెచ్.డి చేసారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

సినారె గొప్ప కవే కాదు వక్త, ఆచార్యుడు, సినీగేయ రచయిత, పరిశోధకుడు, పరిపాలనా దక్షుడు. వివిధ రంగాలలో ప్రత్యేకతను సాధించుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.

భారత దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన తెలుగు వారిలో మొదటి వారు విశ్వనాధ సత్యనారాయణ గారు కాగా రెండవ వ్యక్తి మన నారాయణ రెడ్డి గారు. వీరు రచించిన "విశ్వంభర" కావ్యానికి ఈ జ్ఞానపీఠ అవార్డ్ లభించింది.

సినారె గా ప్రసిద్ధి చెందినా మన నారాయణ రెడ్డి గారికి చిన్న వయసునుండే సాహిత్యం మీద మక్కువ ఎక్కువ. సాహిత్యంతో పాటు హరికథలు, జానపదాలు, జంగం కథలన్నా వీరికి మక్కువ ఎక్కువ. విద్యార్థి దశలోనే 'నవ్వని పువ్వు గేయాన్ని రచించి "జనశక్తి"పత్రికలో ప్రచురించారు. ' శోభ పత్రికకు సంపాదకత్వం కూడా వహించారు.

'కవిత్వం రాయని రోజున ఏసీ గదిలో ఉన్నా ఉక్క పోసినట్లు ఉంటుంది' అని చెప్పే నారాయణ రెడ్డి గారు నిరంతర రచనా వ్యాసంగముతోవచన కవితలు, గేయ కావ్యాలు, పద్యకావ్యాలు, గద్య కృతులు, చలనచిత్ర గీతాలు, యాత్రా రచనలు, సంగీత నృత్య రూపకాలు, ముక్తక కావ్యాలు, బుర్రకథలు, గజళ్ళు, వ్యాసాలూ, విమర్శా గ్రంథాలు, అనువాదాలు ఒకటేమిటి సుమారు 18 రకాల ప్రక్రియలలో ఆయన రచనా వ్యాసంగము సాగింది.

రచనలు:- వీరు రచించిన కావ్యాలు నాగార్జునసాగరం, విశ్వనాథ నాయకుడు, కర్పూర వసంత రాయలు, జాతిరత్నం, మధ్యతరగతి మందహాసం, మనిషి చిలక, మార్పు నా తీర్పు, సమదర్శనం, మథనం, ముఖాముఖీ,మృత్యువు నుంచి మరోహరివిల్లు, భూమిక, నడక నా తల్లి, తేజస్సు నా తపస్సు, కాలం అంచు మీద, ఉదయం నా హృదయం, ఇంటి పేరు చైతన్య0, అక్షర గవాక్షాలు, ప్రపంచపదులు, మాటలు మానవుడు, విశ్వంభర, మొదలైన ఎన్నో కావ్యాలు ఉన్నాయి. ఇవి కేవలం కొన్ని మాత్రమే.

వీరు రచించిన తెలుగు గజల్ ఆంధ్ర సాహిత్యంలో అద్భుత రచనలు. దైనందిన జీవితానుభవాలను, పరిసరాలను తన తాత్విక, మానవతావాద, కవితాత్మక భావాలకు పరిపోషకాలుగా తెలుగు గజళ్ళను సినారె వెలిగించారు.

అదేవిధంగా వీరు రచించినటువంటి ప్రపంచ పదులు కూడా మానవ జీవన నిర్మాణానికి సోపానాలుగా ఉపయోగపడతాయి అనడంలో అతి శయోక్తిలేదు. అలాగే సినారె రచించినటువంటి ప్రపంచపదులను కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గారైన ఆచార్య రవ్వ శ్రీహరి గారు సంస్కృతంలోకి అనువదించి వాటికి విశ్వవిఖ్యాతిని కలిగించారు.

ఉద్యోగ బాధ్యతలు:- ఉపాధ్యాయునిగా సినారె ఎంతోమంది స్నాతకోత్తర విద్యార్థులను తీర్చిదిద్దారు. కొంతకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేశారు. తర్వాత అధికారం భాషా సంఘం అధ్యక్షునిగా, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షునిగా, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా, ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహార శాఖ సలహాదారునిగా, రాజ్యసభ సభ్యులుగా అనేక ఉన్నత పదవులను అలంకరించి తన పరిపాలన దక్షతను ప్రకటించారు వీరి రచనలు ఇంగ్లీష్, ఫ్రెంచ్, సంస్కృతం, హిందీ, మలయాళం, ఉర్దూ, కన్నడ భాషల్లోకి అనువదించబడ్డాయి 1962లో 'గులేబకావళి కథ' లోని పాటల ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. సుమారు 30000 పాటలు రాసారు.

పురస్కారాలు:- కేంద్ర సాహిత్య అకాడమీఅవార్డు, పద్మశ్రీ, కళాప్రపూర్ణ, పద్మభూషణ్, జ్ఞానపీఠ అవార్డు మొదలైన ఎన్నో పురస్కారాలు పొందారు.

కర్పూర వసంత రాయలు కావ్య పరిచయం:- గేయ కావ్య రచయిత గా డాక్టర్ సినారె ప్రసిద్ధి పొందడానికి కారణమైన కావ్యాల్లో 1957లో రాసిన కర్పూర వసంత రాయలు ప్రముఖమైనది అని చెప్పవచ్చు. మొదట్లో ఆయన నాగార్జునసాగరం అనే గేయ కావ్యాన్ని రాశారు. ఈ కర్పూర

వసంత రాయలు కావ్యాన్ని సినారె గారు “రాగి రేకులలో రాతి పలకలలో కనులు మూసిన తెలుగు చరితకు ప్రాణం పోసిన మహా మనిషి" శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారికి అంకితం ఇచ్చారు. 1981లో నారాయణ రెడ్డి గారు ఉత్తర అమెరికా వెళ్ళినప్పుడు అక్కడి తెలుగు మిత్రులు కొందరు కర్పూర వసంత రాయలు కావ్యాన్ని ఆయన చేత పాడించి రికార్డు చేయించారు. ఇప్పుడు కూడా యూట్యూబ్లో ఆ రికార్డు దొరుకుతుంది. ఆ తర్వాత ఈ కావ్యం ఎన్నో ముద్రణలు పొందిందిది. ఇది ఐదు ఆశ్వాసాల గేయ కావ్యం. 'కర్పూర వసంత రాయలు' రెడ్డి రాజుల చరిత్రకు సంబంధించిన శృంగార రస ప్రధానమైన 5 ఆశ్వాసాల గేయ కావ్యం. ఇది ఆధునిక యుగంలో వెలువడిన గేయ ప్రబంధంగా కీర్తిగాంచినది. ఈ కావ్యంలో వాతావరణం పాత్రలు చారిత్రికమైనవి. కథాశరీరం కాల్పనికం. కొండవీటి ప్రభు కుమారగిరి రసికరాజు. నర్తకీ శిరోమణి లకుమ. లకుమా, ప్రభువుల ప్రణయం, లకుమ ప్రాణత్యాగం ఈ కావ్యం లోని ప్రధాన వస్తువు.

కుమారగిరి రెడ్డి, లకుమ, కాటమవేముడు, రాణి ప్రధాన పాత్రలు. రాణి పాత్ర మాత్రం కల్పితం. మిగిలిన ముగ్గురు కుమారగిరి రెడ్డి, లకుమ, కాటమవేమారెడ్డి పాత్రలు చారిత్రకమైనవి. అనురాగానికి, ధర్మానికి మధ్య లకుమ అనుభవించిన సంఘర్షణ కావ్యంలో ఆర్ద్రపూరితం. ప్రజా శ్రేయస్సు కోసం ఆమె కథ విషాదాంతంగా ముగుస్తుంది. ఇక కావ్య కథలోకి వెళితే ఇది శృంగార రసప్రధానమైన కథ. కరుణ వీర రసాలు అంగరసాలుగా వెల్లి విరిచిన రచన ఇది.

కావ్యములో మొదటి ఆశ్వాసములో రాజు వసంతోత్సవమునకు బయలు దేరటంతో మొదలవుతుంది. ఇంద్రుడు శచిదేవితో కలసి ఐరావతం పై బయలుదేరినట్లుగా రాజు రాణితో కలిసిఏనుగు నెక్కి బయలుదేరాడు.
వెంట బావ కాటమ వేముడు, మంత్రులు, దండనాధులు, ఆశ్వ పదాతి దళంతో పాటు ఇసక వేస్తే రాలనంత జనంతో ఉద్యానవనం చేరారు. విప్రుల సూచన మేరకు విఘ్నేశ్వర పూజ చేసి, మన్మధ పూజ చేసి వసంతోత్సవాలకు శ్రీకారం చుట్టాడు.

రాజు వసంతోత్సవాలు ఆరంభిస్తూ మృగ మదం అంటే కస్తూరి శ్రీ చందనం ఎత్తి ప్రజల మీద చల్లాడు. ప్రజలు పన్నీరు చల్లుకుంటూ మురుస్తున్నారు. కుమారగిరి రెడ్డి 9 రోజులు ఈ వసంతోత్సవాలలో పంజాబ్ నుండి కర్పూరం, గోవా నుండి కుంకుమ ద్రవ్యాలను తెప్పించి ప్రజలు పై చల్లుతుండేవాడట. అందుకే ఆయనకు కర్పూర వసంత రాయలు అనే పేరు వచ్చింది.

ఎటుచూసినా కపురమే గంధమే ఏ దిశను ఆనందమే అందమే కర్పూర కస్తూరిగా చందనములతో
నేలయే కాదు- నింగియూ పరిమళించినది. అటు ఆనందోత్సాహాల మధ్య వసంతోత్సవ నృత్యం మొదలైంది. మెరుపులాంటి లకుమ నృత్యం ప్రారంభించింది. ఆ నృత్య వర్ణన సినారె వర్ణనా నైపుణ్య కౌశలానికి, నాట్య శాస్త్ర జ్ఞానానికి నిదర్శనంగా చెప్పవచ్చు. నృత్యం సాగుతూ ఉంటే ప్రభువు తన్మయుడయ్యె ప్రభువు చిన్మయుడయ్యె ప్రభువు లకుమా లగ్న పంచప్రాణుడయ్యె ఆనందపరవశుడైన రాజు ఒళ్ళు తెలియక నర్తకి దగ్గరకు వెళ్ళడానికి ప్రయత్నిస్తే రాజు లేవకుండా రాణి అతని భుజం మీద చేయి వేసింది. ఇది ఆమె అసూయతో చేసింది కాదు. రాజు మర్యాద పోగొట్టుకోకూడదని ఆ విధంగా చేసింది. అయినా రాజు లకుమ నాట్యాన్ని మెచ్చి తన మెడలోని రత్నాల హారాన్ని తీసి ఆమె మెడలో వేస్తాడు. అప్పుడు జనులు హర్షధ్వానాలు చేస్తారు. లకుమ సిగ్గుల మొగ్గ అవుతుంది. ఇక్కడ సినారె ఈ సన్నివేశాన్ని మన కళ్ళ ఎదుట నిలుపుతారు.

“సిగ్గుతో తలవాల్చి - మొగ్గయయ్యెను లకుమ, నవ్వలేక లోన - నవ్వుకున్నది రాణి నింగిలో తారాధి నేత పల్చని మెయిలు కన్నె ముసుగు తెరతోడ మోమును చాటు చేసుకునె” అంటూ ఒకేసారి అన్ని విషయాలు వరస క్రమంలో కళ్ళెదుట నిలుపుతారు.

రెండవ ఆశ్వాసములో లకుమ మీది ప్రేమతో రాజు కనులు మూసిన తెరిచిన లకుముస్వరూపమే గుర్తుకొస్తుంది.
నాటిరేయి కుమారగిరి రాణ్మౌళి కన్నుల రెప్ప వాలదు
ఎప్పుడో దాటిన దర్దరాత్రము -ఎగయుఊహల రెక్కవాలదు
అందుకే పాన్పు పై చల్లిన మల్లె పువ్వులు రాజుకు పల్లేరు కాయలుగా దోచినవి. అటు పొర్లి ఇటు పొర్లి నిదుర పట్టీ పట్టని కలలో లకుమ గురించే కలగన్నాడు.
రాజు కన్నులు విప్పి చూచె - లకుము లేదు రాణి తోచె
క్రుంగి చేతిలోనిరాణి- కొంగు నంత జారవిడిచె
ఈ రెండవ ఆశ్వాసములో సినారె చేసిన విరహవర్ణనలు ప్రబంధ కవులు శైలి కి ధీటుగా కనిపిస్తాయి.
ఇక్కడ రాజులాగానే లకుమ కూడా రాజు గురించే కలలు కంది. రాజు లకుమను రాజ నర్తకిగా నియమించ దలచాడు. ఇక్కడ సినారె కథా కథనం (స్క్రీన్ ప్లే) ఎంత గొప్పగా ఉంటుందో అనడానికి ఒక మచ్చుతునక.
లకుమ కావార్త కల్వ నెలంత కంటిపా
పలపైన పాల వెన్నెల సోకినటులయ్యే
రాణి కావార్త కల్వ నెలంత చెవులలో
ఖరకరుని అశ్వరింఖల చప్పుడుగ తోచె
ఇరువురి మనసులను మన మనసెదుట ఒకేసారి నిలిపిన తీరు అత్యద్భుతం.
తృతీయాశ్వాసములో లకుమను తీసుకొని రాజు తీర్థయాత్ర లంటూ అహోబిలం, ద్రాక్షారామం మొదలైన ప్రదేశాలు తిరుగుతున్నప్పుడు వారిరువురి ప్రేమ అందరికీ బట్టబయలు అవుతుంది. అప్పటివరకు రాజుకి లకుము మీద కన్నా లకుమా నాట్యము మీదే ప్రేమ ఎందుకంటే ఆయన రసిక రాజు కదా! సినారె.
నాలుగవ ఆశ్వాసములో ఒకమాట చెబుతారు:
తొలుత లకుమా కింకిణులకురాయండు ముగ్ధుండయ్యే
ఆ వెనుక ఆమె తను లావణ్యమునకే దాసుండయ్యే
ఉగ్ర నరసింహుని చూసి భయపడిన లకుమ బెదిరి రాజు భుజముపై ఒరగడంతో ఇరువురి మధ్య దూరం తగ్గటం ప్రాంభమై ద్రాక్షారామం లో లకుమ చేసిన నృత్యంలో మన్మధ దహనాన్ని తట్టుకోలేనని రాజు లకుమను కౌగిలించుకోవడంతో ఇద్దరి బంధం బలపడింది. రాజు, లకుమ తీర్ధ యాత్రలకు వెళ్ళేటపుడు వేరు వేరు రథముల పైన వెళ్ళారు. వచ్చేటపుడు ఒకే రథంపై వచ్చారు. అది చూసి ప్రజలు
"రాణి అధివసించు రేని పార్శ్వమున నర్తకి కూరుసుండుటేమి
జన సమక్షమున రాజన్యు డొక అన్యకాంతను ప్రక్కనున్చుటేమి"
అని గుసగుసలు పోతారు. తీర్ధ యాత్రల నుండి తిరిగి వచ్చిన తరువాత రాజు ప్రవర్తన ప్రజలకు నచ్చదు. రాణి ఉండాల్సిన స్థానంలో నర్తకి ఉండడం అనేది ప్రజలు జీర్ణించుకోలేకపోయారు కానీ చెప్పడానికి ఎవ్వరూ ధైర్యం చేయరు.
ఇక నాలుగవ ఆశ్వాసం లోకి వస్తే లకుమ కోసం రాజు ఒక కేళి మందిరం నిర్మిస్తాడు. రాజ్యపు ఆలోచన, రాణి ఆలోచన లేకుండా లకుమనాట్యాన్ని వీక్షిస్తూ, ఆమెతో శృంగారంలో తెలియాడుతూ రాత్రి పగలు ఆమెతోడిదే లోకమై మైమరచిపోతూ' వసంత రాజీవము' అనే నాట్య శాస్త్ర గ్రంథాన్ని రాసాడు. ఇక్కడ మనం ఒకటి గమనించాలి రాజు లకుమ మీద ఎంత మోహం ఉన్నప్పటికీ కూడా తనలో ఉన్నటువంటి కళాత్మక హృదయాన్ని మర్చిపోలేదు. అని చెప్పడంతో సినారె గారు రాజు పాత్రను ఇంత గొప్పగా మలచారో మనకు అర్థమవుతుంది.

ఐదవ ఆశ్వాసంలో కాటమవేముడు రాజు ఆజ్ఞతో విజయనగరం మీద దండెత్తి విజయుడై తిరిగి వస్తాడు కానీ కుమారగిరి రాజుకు ఇవేమీ పట్టలేదు
వాసరమ్ములు గడిచిపోయెను మాసములు గమయించిపోయె

రాణి వేదన గుండెలో పెను రాచ పుండుగ మారిపోయెను. రాయడు వేశ్యాలోలుండని రాజ్యములో గుసగుస హెచ్చెను. రాయడు లకుమాదాసుండని రచ్చలపై చర్చలు రెచ్చెను . ఇవన్నీ విన్నరాణి మనోవేదనకు గురై అనారోగ్యం పాలయింది. కాటమవేముడు కేళి మందిరానికి వెళ్లి వసంతరాయ రాజ్యానికి మీరు దూరం అవడం వల్ల ప్రజల్లో అశాంతి ప్రబలి శత్రు రాజుల ప్రాబల్యం పెరిగిపోతోంది. ఇక రాణి మంచాన పడింది. మీ దర్శన భాగ్యానికి మంత్రులు అధికారులు ఎదురుచూస్తున్నారు. మీరు ఒక్కసారి కొలువుకు రండి మిగతా విషయాలు నేను చూసుకుంటాను అన్నాడు. కానీ రాజు లకుమను వదిలి వెళ్ళలేకపోయాడు. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో సభాభవనానికి వచ్చాడు. సభికులు జయ ద్వానాలు చేశారు. కొంత సేపటికి లకుమ కాలు బెణికింది అనే కబురు వచ్చింది వెంటనే రాజు సభాభవనాన్ని వీడి కేళిమందిరానికి వెళ్ళాడు. అప్పుడు సభికులు

ఒక నర్తకి కాల్బెణుకుటేమి ఎకిమీడు పర్వులెత్తుట యేమి ఒక చిన్న ఘటన జరుగుటయేమి - ఒట్టోలగమ్ము వీడుటయేమి సభకిది తిరస్కారము - సభ్యతకిది సీత్కారము

అంటూ సభికులు గుసగుసలాడుతూ నిష్క్రమించారు. కాటమవేముడు అవమానపడ్డాడు. కేళిమందిరంలో లకుమ చరణాలకు రాజు అశ్రుబిందువులతో అభిషేకం చేస్తున్నాడు. రాజు కొలువు విడిచి కేళిమందిరానికి వెళ్లిపోయాడని తెలిసినప్పటి నుంచి రాణి మనసులో మనసు లేదు. కానీ తన గోడు ఎవరు పట్టించుకుంటారు. మంచంపై ఉన్న రాణిని చూడటానికి కాటమవేమారెడ్డి వచ్చాడు అప్పుడు అన్నా ఇన్నాళ్ళు నా బాధను దాచుకున్నాను కాని ఈ రోజుమాత్రము తట్టుకోలేకపోతున్నాను.

రేడు నా అంత:పురమునకు రాడనెడు దుఃఖమ్ము కన్నను రాచ గద్దెను విడిన వార్తయె - రంపమున గోసినది తండ్రీ. కేళికామందిరమున కన్నను - ఒలగమ్ముపవిత్రమైనది వ్యక్తికన్నను దేశసౌభా - గ్యమ్ము ఆదర పాత్రమైనది.

అంటూ బాధపడింది. అది చూసివెంటనే కాటమవేముడు రాజు దగ్గరికి వెళ్లి రాణి గారి ఆరోగ్యం బాగాలేదని మీరు ఒకసారి వచ్చి చూడండి లేదంటే ఆమె మనక దక్కదు. అని చెప్పాడు. కాటమవేముని మాటలు రాజు గుండెను తాకాయి. అటు చూస్తే రాణి, ఇటు చూస్తే ఏం చేయాలో తెలియక రాజు మౌనం వహించాడు. రాజు సమాధానం లేకపోవడంతో నిరాశతో కాటమవేముడు వెనుతిరిగాడు. రాణి అనారోగ్యం విషయం తెలిసిన లకుమ చాలా బాధపడింది. కాటమవేముడు రాణి కి విషయం చెప్పాడు. రాణి బాధ వర్ణించనలవి కాలేదు. చివరికి రాణి ఒక నిర్ణయం తీసుకొని ముసుగు వేసుకొని చెలికత్తెలతో లకుమ ఇంటికి వెళ్లి తలుపు తట్టింది. తలుపు తీసిన లకుమను చూసి రాణి ఆమె పాదాలపై పడింది. రాణిని లేవనెత్తి లకుమ రాణి పాదాలపై పడి వలవలా ఏడ్చింది. ఆమెను పైకి లేపిన రాణితో నా ప్రాణమైన ఇచ్చెదను ఏమి కావాలో చెప్పుమనగా రాణి నీపయిన్ ఒక ఘోర భారము మోపగా వచ్చితిని చెల్లీ పాలముంతువో నీటముంతువో బాధ్యతను గమనించు తల్లి అని పెద్ద భారమేలకుము మీద పెడుతున్నానని చెప్పింది.

రాయలు నిన్ను తన కనులలో ఉంచుకున్నాడు అందుకు నేను బాధపడను. కానీ దేశ భవిష్యత్తును కూలదోయలేను
దేశమొక దెస నీవు ఒక దెస తేల్చుకొను మెయ్యది ఘనమ్మో
వ్యక్తి సంఘములందు ఎయ్యది - ప్రధమ గణ్యమో చెప్పవమ్మ
గుండె రాయిగా చేసుకొని కడ- కొక్క మాటయే అందునమ్మా భూపతినియటులైన విడిపోవుటయే నీకు అవశ్యమమ్మా!.

ఆమె కోరిక విన్న లకుమ గుండెల్లో బాకులు దూసుకెళ్లాయి. రాణి చెప్పి వెళ్ళిపోయింది. కానీ లకుమకు ఏ ఆలోచన ఒక కొలిక్కి రాలేదు. నన్ను తన ప్రాణము కన్నా మిన్నగా అనుకున్న రాయుడిని నేను విడిచి వెళితే పిచ్చి వాడైపోతాడు. రాజ్యాన్ని, రాణిని తృణపాయంగా విడిచిన రాజును విడిచి నేనెట్లా బ్రతకగలను.

కానీ, "ఎటుల వాగ్దానమ్ము తీర్తును ఎటుల రాయని వీడనేర్తును ఎందుకీ హృదయమ్ము నిచ్చితి -వీశ్వరా! ఈ సానిదానికి" అని బాధపడుతూనే ఉంది లకుమ. సూర్యోదయ సమయానికి ఒక నిర్ణయానికి వచ్చింది. మరుసటి రోజు రాజు ఎదుట శివతాండవం చేస్తూ పిడిబాకుతో పొడుచుకున్నది లకుమ. రాజు ఆశ్చర్యపోయాడు. రాజు ఒడిలోనే లకుమ కనులు మూసింది. పిడిబాకుకు చుట్టి ఉన్న కాగితాన్ని చూసి అందులో "వ్యష్టి కన్నను దేశదృష్టియే గరిష్ట"మన్న మాటలు చదివాక రాజు కన్నులకు కొండవీడు, మహారాణి, జన సందోహము కనిపించింది. ఈనాటికీ లకుమ అందెల ఝుణత్కారములు కొండవీటి గాలులలో వినిపిస్తూనే ఉంటాయంటారు సినారె.

ఈ కావ్యంలోనాయకుడైన కుమారగిరి రెడ్డిని ధీరలలితుడుగా, ధీరోదాత్తుడుగా వర్ణించిన తీరు అనన్య సామాన్యము. అదేవిధంగా లకుమను విరహోత్కంఠితగా, జ్యోత్స్నాభిసారికగా, ఖండితగా, వాసకసజ్జితగా కనులముందు నిలిపారు. ఉపమాలంకారాలు కావ్యానికి మరింత వన్నె తెచ్చాయి.

ఈ ఉపమా లంకారములు ప్రయోగించేటపుడు సినారె గారు మన పురాణ కథలను మన మనసులలో తట్టి లేపుతారు. ఎలాగంటే

'పాల సంద్రపు నురుగు పైన దేలిన యిందిరను గనిన శ్రీ విష్ణువును బోలె నారాజు'

అన్నపుడు పాలసముద్రము నుండి పుట్టిన లక్ష్మిని చూసిన విష్ణువు వలే రాజు ఉన్నాడు అని చెప్పినపుడు క్షీరసాగ మదన వృత్తాంతము మదిలో మెదులుతుంది. అదే విధంగా

"తన కొరకు తపము చేసిన పార్వతి సమక్షమున నిల్చిన మహేశ్వరుని బోలె నారాజు"

ఇది చదివాక పార్వతి తపస్సు, శివపార్వతుల కల్యాణం మాత్రమే కాకుండా దక్షాధ్వర ధ్వంసం కూడా మన మదిలో మెదులుతుంది. ఊర్వశి పురూరవులను, శకుంతల దుష్యంతులను, తన వర్ణనలతో మనకళ్ళముందు నిలిపిన అపూర్వ రచనా వైవిధ్యం సినారె గారిది. ఒక్క కథే కాదు, ప్రత్యేకమైన రచనా వైవిధ్యం, తెలుగు పలుకు బడులు వాడుక, నాట్య సంగీత శాస్త్రాల నైపుణ్యం, వర్ణనలు మొదలైన ప్రత్యేకతల వలన సినారె సాహిత్యంలోనే కాదు సాహిత్య జగత్తు లోనే కర్పూరవసంతరాయలు ఒక అమర కావ్యమని చెప్పవచ్చు.

ముగింపు:- ఈ గేయ కావ్యములో ఇద్దరు స్త్రీ మూర్తుల ఉన్నత వ్యక్తిత్వం మన కళ్ళముందు నిలుపుతారు సినారె. రాణి రాజు తనను విడిచి లకుమతోనే కాలం గడుపుతున్నాడని బాధపడినా బయటపడలేదు. కాని రాజ్యం ఇబ్బందుల పాలవుతుంది, ప్రజలందరి ముందు రాజు తక్కువ అవుతున్నాడు, అని భావించినపుడు ఇంటిని చక్కదిద్దాల్సిన అమ్మలా ప్రవర్తించిన తీరు అనన్య సామాన్యము. రాజు తనకు అధీనుడై ఉన్నప్పటికీ రాణి మాటను గౌరవించి, రాజ్య రక్షణకోసం రాజుపై ఉన్న ప్రేమను చంపుకోలేక తననే చంపుకున్న ప్రేమమూర్తి, దేశభక్తురాలు లకుమ.

**ఆధార గ్రంథాలు:**

1. కర్పూర వసంతరాయలు: డా. సి.నారాయణరెడ్డి
2. కర్పూర వసంతరాయలు కథా కళా ఝుంకృతులు- ఆచార్య అనుమాండ్ల భూమయ్య.

## "మన్యంలో" కథాకావ్య జంఝూనిల వీచిక

**డా॥ డి. ధాత్రికుమారి**

తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర) గుంటూరు
చరవాణి: 9989753424

**వ్యాస సంగ్రహం:** నయాగరా కవులలో ఒకరైన కుందుర్తి ఆంజనేయులు గారి నిప్పులు క్రక్కే కలం నుంచి రచింపబడిన వచన కవిత 'మన్యంలో'. ఇది విశాఖ ఏజన్సీ ప్రాంతమైన మన్యం వేదికగా అల్లూరి సీతారామరాజు చేసిన విప్లవాన్ని కవితా వస్తువుగా తీసుకొని రచించబడింది. ఈ వీరగాధని కుందుర్తి కథాకావ్యంగా మలిచారు. కుందుర్తి అల్లూరిలో పరకాయ ప్రవేశం చేసి విప్లవం మొత్తాన్ని మన కనులముందు సాక్షాత్కరింపజేశారు. మన్య విప్లవ పంథాని గురించి, చరిత్రలో దానికి గల ప్రాధాన్యతను గురించి ఆవేశపూరితంగా ప్రతీకల ద్వారా తెలియజేయడమే ఈ వచన కథా కావ్యంలోని ప్రధానాంశం.

ముఖ్య పదాలు: ఫ్రీవర్స్ ఫ్రంట్, అరసం, నయాగరా సంపుటి, కథాకావ్య లక్షణాలు, మన్యం ప్రజల కష్టాలు, అల్లూరి విప్లవ పంథా.

పరిచయం: వచన కవితా పితామహుడు, అభ్యుదయ కవి, ప్రతిష్ఠాత్మక కేంద్రసాహిత్య అకాడమీ, సోవియట్ లాండ్ నెహ్రూఅవార్డుల గ్రహీత, ఫ్రీవర్స్ ఫంట్ (1958) స్థాపకుడు, నవ్యకళా పరిషత్తు స్థాపకుడు, ప్రముఖ అభ్యుదయ కవి గుర్రం జాషువా, విశ్వనాథల శిష్యుడు శ్రీ కుందుర్తి ఆంజనేయులుగారు 1922, డిసెంబర్16న గుంటూరు జిల్లా (ప్రస్తుతం బాపట్ల జిల్లా) కోటవారిపాలెం గ్రామంలో జన్మించారు. 1982 లో మరణించారు. 1967 లో వచన కవిత్వాన్ని ప్రోత్సహించి మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు 'ఉత్తమ వచన కవిత'ల బహుమతిని ప్రవేశపెట్టారు. వీరి సమగ్ర రచనలు 1974 వ సంవత్సరంలో ప్రచురించబడ్డాయి. వీరి రచనలలో సౌప్తికం, రసధుని, నయాగరా, తెలంగాణ, దండియాత్ర, నగరంలో వాన, నాలోని నాదాలు, హంస ఎగిరిపోయింది, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి పీఠికలు, కుందుర్తి వ్యాసాలు, మొదలైనవి ముఖ్యమైనవి. వచనాన్ని సాహిత్యంగా పరిగణించని రోజుల్లో కుందుర్తి వచన కవిత్వాన్ని ప్రోత్సహించారు. కవిత్వము గతమని, వచన కవిత్వము వర్తమానమని చాటారు. కుందుర్తి ఏ విషయాన్ని మొదటిసారి సమగ్రంగా దర్శించాడో అదే విషయాన్ని జీవితాంతం వివరిస్తూ వచ్చారు.

కుందుర్తికి వారి తాతగారు కృష్ణయ్య గారి వలన సాహిత్య జ్ఞానం కలిగింది. వినుకొండలో మిడిల్ స్కూల్ చదివే రోజుల్లో ఆధునిక కవిత్వాన్ని గుర్రం జాషువా వారి వద్ద వినేవాడు. విజయవాడలో విశ్వనాథ వారి వద్ద శిష్యరికం చేసి సాహిత్యాభిరుచిని పెంపొందించుకున్నప్పటికీ కుందుర్తి "అతి నవ్య కవిత్వం గురించే ఆలోచించేవాడు. కుందుర్తి పరమ వచనం ద్వారా ఆధునిక వచన కవితా రచనలో ఛందస్సుకి కొత్త అర్థాలు అన్వేషించే ప్రయత్నం అప్రయత్నంగా చేశారు. వచన కవితా ప్రక్రియను 'ఫ్రీవర్స్ ఫ్రంట్" పేరిట ఒక ఉద్యమంగా తీసుకువచ్చారు.

ఉపోద్ఘాతం: 1943 లో అరసం (అభ్యుదయ రచయితల సంఘం) స్థాపన తర్వాత అభ్యుదయ కవిత్వం ఊపందుకుంది. శ్రీశ్రీ మహాప్రస్థానంలో వదలివేసిన అంశాలకు సంబంధించిన అంశాలను తరువాతి అభ్యుదయ కవులు స్వీకరించారు. అదే బాణీలో నయాగరా కవితా సంపుటి వెలువడింది. అభ్యుదయ కవిత్వ ధోరణికి ఈ కవితా సంపుటి ప్రతినిధి వంటిది. నయాగరా కవులు కుందుర్తి అంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసుల సంయుక్త కలాల నుండి వెలువడిన కవితా కావ్య సంపుటి (ఖండకావ్యాల సంకలనం) 'నయాగరా'. ఈ కావ్యాన్ని తన మిత్రుడు అనిశెట్టికి అంకితం చేశారు. నరసరావుపేటలోని నవ్య కళా పరిషత్ వారు దీనిని ప్రచురించారు. 'నయాగరా' అనేది అమెరికాలో గల ప్రపంచంలోనే పేరెన్నిక గన్న పెద్ద జలపాతం. దీనిలో మొత్తం 9 కవితలు ఉన్నాయి. వీటిలో కుందుర్తి 'జయిస్తుంది' (అక్టోబరు 1941), 'మన్యంలో" (ఏప్రిల్ 1942), 'తరువాత' (సెప్టెంబరు 1942) అనే మూడు వచన కవితలను రచించారు.

కుందుర్తి గారే స్వయంగా నయాగరా కవితా సంపుటి ముందుమాటలో "ఇది ప్రచురణ అయ్యే నాటికి శ్రీశ్రీ గారి మహాప్రస్థానం ఇంకా వ్రాత ప్రతి రూపంలోనే ఉందని, అభ్యుదయ కవితా యుగంలో అచ్చు అయిన తొలి కావ్యం ఇదే అని చెప్పుకోవచ్చు అని తెలియజేశారు. ప్రముఖ విమర్శకులు ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం గారు యువభారతి జనవరి 1988 సంచికలో 'నయాగరా' అభ్యుదయ ప్రస్థానంలో తొలి మజిలీ అని పేర్కొన్నారు.

'మన్యంలో' కవిత 1953 లో 'కల్పన' ఆధునిక కవిత సంపుటిలో 'మన్య విప్లవం' అనే శీర్షికతో ఉంది. కుందుర్తి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వీరగాధను ఇతివృత్తంగా స్వీకరించి ఈ వచన కవితని రచించారు. 'మన్యంలో' కవిత 'వాస్తవిక సంఘటనలను ఆధారం చేసుకొని అభ్యుదయ కవితా యుగంలో రచిపబడినా మౌలిక దృష్ట్యా ఇది ఈనాటి విప్లవ కవిత్వంలో కనిపించే ఆవేశం ఆనాడే ఈ కవితలో కనిపిస్తుంది." (ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు, సినారె. పుట 95).

మానవ శరీరములు శాశ్వతములు కావు కానీ కీర్తి, అపకీర్తి శాశ్వతములు మంచి చెడ్డలు చిరకాలం నిలుస్తాయి క్షత్రియులకు యుద్ధము సహజం

సీతారామరాజు: ఈ వచన కవితలోని కథాకావ్య లక్షణాలను లేశ మాత్రంగా విశ్లేషించుటే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం. కథాకావ్య లక్షణాలు :

కావ్య రచనలోని లక్షణాలన్నీ ఉండి, కథ ప్రధానంగా ఉండి, కావ్యం కంటే భిన్నంగా పాఠకునికి అనుభూతిని కలిగించేది కథాకావ్యం. కథాకావ్య లక్షణాలలో గల వాస్తవికతకు ప్రాధాన్యత కల్పించడం, సమకాలీన సామాజిక సంఘటనలకు స్థానం కల్పించడం, ప్రతీకాత్మకంగా వ్రాయడం, నాయక ప్రతి నాయకులు పరాక్రమవంతులై ఉండి సాహస కృత్యాలు చేసినట్లు చిత్రించడం అనేవి ఈ 'మన్యంలో' కవితలో ప్రధానంగా మనం పరిశీలించవచ్చు.

కథా వస్తువు: జీవితంలో అనుభవానికి దృశ్య నిర్మాణం చేయడం భావ ప్రతిమ. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావం వస్తువు. 'మన్యంలో' కవితలో అల్లూరి సీతారామరాజు చేసిన విప్లవం ప్రధాన కథావస్తువు. మన్యంలో అల్లూరి చేసిన విప్లవాన్ని కథ రూపంలో చెప్పి ఈ వచన కవితని 'వచన కథా కావ్యం'గా మలచారు కుందుర్తి.

ఈ విప్లవాన్ని కుందుర్తే ఝంఝానిల వీచికలా పేర్కొని దానిని కొన్నిచోట్ల మకుటంలా ప్రయోగించారు. అందుకే ఈ శీర్షికకు "మన్యంలో" కథాకావ్య ఝంఝానిల వీచిక" అని పేరు పెట్టడం జరిగింది.

'సత్యాగ్రహం దేశాన్ని
సకలం ముంచెత్తిన రోజులు'

అంటూ మొదటి వచనాలలోనే భారతదేశ వ్యాప్తంగా అప్పుడు జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమ వాతావరణాన్ని ఉపోద్ఘాతంగా చెప్తూ ఆ క్రమంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కలసి ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఆంధ్రా ప్రాంతంలో అందునా 'మన్యంలో' చెలరేగిన తిరుగుబాటు అక్కడి ప్రభుత్వం వారికి ఎలా గొడ్డలిపెట్టయిందో పూర్వరంగంగా చేసి క్రమంగా కథలోకి పాఠకులను తీసుకువెళ్లారు. 1922 జనవరి నుండి 1924 మే వరకు రెండు సంవత్సరాల ఐదు నెలలు సాగిన విప్లవ కాలమే ఈ కథాకాలం.

పూర్వరంగం: రంప విప్లవం భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహణలో నడచిన ఉద్యమం కాదు. స్వాతంత్ర్యాన్ని పొందడానికై హింసా మార్గంలో విప్లవ పంథాలో ఆంధ్రప్రాంతంలో తూర్పుగోదావరి విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి పరిమితమై అల్లూరి చేసిన విప్లవమిది. ఈ విప్లవం కొంత ప్రాంతానికే పరిమితమైనప్పటికీ గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం కంటే ఆంగ్లేయులను తీవ్రంగా కలచివేసి భయభ్రాంతులకు గురిచేసింది అని చెప్తూ కథ యొక్క పూర్వరంగాన్ని ఆవిష్కరింపచేశారు కవి. ఈ విప్లవంలో అమాయక ప్రజలు నిరక్షరాస్యులైన మన్య ప్రాంత ప్రజలు. గాం మల్లుదొర, గాం గంటందొర, అగ్గి రాజు

(వేసరాజు సత్యనారాయణరాజు) మెట్టడం వీరయ్యదొర, యెండు పడాల్ మొదలగువారు అల్లూరికి అండగా నిలిచారు.

అందుకే "ఇది నిద్రాణమైన ఆంధ్రజాతిని మేల్కొల్పి, స్వాతంత్ర్య సమరాంగణమున నిల్పి ఆంధ్రదేశమునే గాక భారతభూమిని సైతము ఉత్తేజితమొనర్చిన సంగ్రామ గాధ 1857 తిరుగుబాటు ప్రథమ భారత సంగ్రామమైన, రంపా విప్లవము ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామము." అని శ్రీ అల్లూరి సీతారామరాజు చరిత్రలో యర్రమిల్లి నరసింహారావు పేర్కొన్న మాటలు ఎంతైనా సముచితం.

ప్రస్తావన: మన్యంలో తిరుగుబాటు; ప్రభుత్వం 'విరగబాటు' 'అణి'చేసిన; గొడ్డలిపెట్టు అని కథా తత్వాన్ని సూచ్యార్థ సూచనంగా తెలియజేశారు కవి.

కథాంశం: ఇక కథాంశంలోకి ప్రవేశిస్తే ఆంగ్ల పాలకులు ఆంగ్ల పోలీసులు, అటవీశాఖ అధికారులు, చింతపల్లి, తాలూకా గూడెం తాహసీల్దారు బాస్టియన్, రోడ్ కాంట్రాక్టర్ సంతానం పిళ్లై, ముఠాదారులు సాగించిన దురాగతాలే ఈ మన్యం వీరుల గుండెల్లో తుఫానును రేపినవి. అక్కడి ప్రజలలో చైతన్య జ్వాలలు రగిల్చి విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన విప్లవమే ఇందలి కథాంశం.

మన్ను తిన్న పాములాంటి/మన్యం వీరుల గుండెల్లో/రేగినై ప్రళయ ప్రళయంగా/తుఫాను సహస్రాలు ప్రశాంతంగా కనిపించే సముద్రంలో బడబాగ్ని వలే ఈ అమాయక ప్రజల గుండెల్లో రేగిన జ్వాలలు మద్రాసులోని రాజధాని ప్రాంతం వరకు రాజుకున్న ఎగసి పడినవి. వీరు చేసిన విప్లవం సెయింట్ జార్జి కోట వరకూ విప్లవ శంఖం వినిపింపజేసింది. పై వచనాలలో కుందుర్తి విప్లవ తీవ్రతను ధ్వనింపజేశారు.

కుందుర్తికి పదాన్ని ప్రయోగించడంలో స్పష్టమైన దృక్పథం కలదు. గురజాడ తర్వాత ప్రజాభాషా ప్రయోజనాన్ని కవిత్వంలో నెరవేర్చుకున్న కుందుర్తి ఈనాడు నాడు కవిత్వం/ వర్తమాన చరిత్రలోని ప్రజోద్యమ చైతన్యానికి/ పేరు మోసిన ప్రతినిధి అంటూ తన లక్ష్యాన్ని ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చుకునే క్రమంలోనే నాటి వర్తమాన చరిత్రలో జరుగుతున్న అంశాలతో ఈ వచన కవితను అనుసంధానించారు.

విప్లవస్ఫూర్తి, విప్లవమూర్తి: ఆంగ్లేయులు మన్యంలోని ప్రజలు కట్టెలు కొట్టరాదని, గడ్డి కోయరాదనుట, ఆహార పదార్థాలను మన్యం ప్రజల నుండి బలవంతంగా తీసుకొని వెళ్ళుట, వెట్టిచాకిరీ చేయించుట మొదలైన చర్యలతో ప్రజలను హింసించేవారు. వీరందరూ అల్లూరి నాయకత్వంలో ఎదురుతిరగడంతో అది ఆంగ్ల ఉద్యోగులకు కంటక ప్రాయమైంది. ఇలా మన్యం ప్రజలలో స్ఫూర్తిని కలిగించి విప్లవ శంఖం పూరించిన విప్లవమూర్తి అల్లూరి.విప్లవ గమనం - భావచిత్రాలు/ప్రతీకలు: రామరాజు 1922 ఆగస్టు 22న విప్లవ శంఖం పూరించి తాను ఏ పోలీస్ స్టేషన్ ను ముట్టడి చేయాలిచాడో ఆ స్టేషన్లకు ముందుగానే 'మిరపకాయ తపాలా' అనే పేరుతో తాఖీదులు పంపేవాడు. ఆ విధంగా వారితో ప్రత్యక్ష పోరాటం చేయడానికి 'మిరపకాయ తపాలా' అనే చిన్న భావ చిత్రం ద్వారా అక్కడి తన విప్లవ పంథాని విప్లవ కవితా గళంతో పాఠకుల ముందుంచారు కుందుర్తి.

అల్లూరి నాయకత్వాన నడచిన విప్లవం ప్రభుత్వానికి జ్వరం తెప్పించిందని ఆ జ్వరాన్ని కూడా మలేరియా చలి జ్వరంతో పోల్చి చెప్పడం ఇక్కడ సముచితం. మన్యం ప్రాంతంలో (ఏజెన్సీ అటవీ ప్రాంతంలో) మలేరియా సోకి కృశించిపోయే వారి సంఖ్య అత్యధికం. ఆ బాధని నిప్పుల కంఠంతో విప్లవ గీతం ద్వారా వినిపింపజేశారు. దీనితో ప్రభుత్వం వారు చావు దెబ్బ తిన్నారనే భావనని 'ప్రభుత్వానికి 'తెల్లగుడ్లు పడినై' అనే వచనాల ద్వారా వినిపింపజేశారు వచన కవిత్వోద్యమ కర్త.

ఆధునిక వచన కవితలో ఒక్కొక్కసారి భావం ప్రయాణం అయితే ప్రతీక దేహం అవుతుంది. కుందుర్తి కూడా తాను ఉపయోగించిన ప్రతీకలలో వాటిని సాధించారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

శ్రీశ్రీ ప్రతీకలను వివరించడానికి ఒక మానసిక దశ/ఒక ప్రకృతి దృశ్యం/ఒక సంఘటన/వ్యక్తి రూపం/తాత్విక స్ఫూర్తి అంటూ వాటిని వివరించడానికి అనేక ప్రతీకలను తన రచనలో వాడారు. ఇదే పంథాని కుందుర్తి కూడా అనుసరించారు.

కథా కథనం (వీరగాథా కథనం): అభ్యుదయ కవులు బూర్జువా వ్యవస్థను ఎదిరించి, వారిని భయ భ్రాంతులకు గురిచేసి చివరకు తమ ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి, ప్రాణాలను కోల్పోయిన వీరులను గురించి తమ వచన కవితల్లో గానం చేశారు. అల్లూరిలోని ఆవేశం మొత్తాన్ని కుందుర్తి 'మన్యంలో' కవితలో వ్యక్తపరచారు.

కథా పరిణామ క్రమ వికాసంలో నిర్భరతను తీసుకొని వచ్చి ఉద్యమ తీవ్రతని కథాగమనంలో పూర్తిగా లీనమయ్యేలా కథనాన్ని మలచారు.

మదరాసు నుండి/మలబారు నుండి/ తోలుక వచ్చిన సైన్యంలో కమాండరిన్ చీపులు / శివాలయం గోడమీద చెక్కించిన విగ్రహాలు ఈ వచన పంక్తుల్లో చివరి మూడు పాదాలలో అలంకార ధ్వనితో అద్భుత శిల్పాన్ని సాధించారు.

దిశా నిర్దేశం: కుందుర్తి అల్లూరి వీరత్వాన్ని కొనియాడుతూ శ్రీశ్రీని తలపింపజేస్తూ "విదళించిన వీరుని ఖడ్గం/పగబట్టిన పాము బుసా/చూపించిన విప్లవ మార్గం" - అని విప్లవ దిశని నిర్దేశం చేసిన వైనాన్ని తెలియజేశారు. "సామ్రాజ్యపు/కత్తుల వానకు/పట్టించిన స్వర్ణచ్ఛత్రం/అధికారపు అన్యాయమ్ములు/ అడ్డించిన రక్షా కవచం అంటూ రామరాజు - బ్రిటీష్ ప్రభుత్వం సామాన్య అమాయక ప్రజలపై చేసిన దురాగతాలను ఎదుర్కొంటూ, ప్రజల పక్షం వహించారు. వారిని కాపాడుతూ ప్రభుత్వాన్ని ఎదిరించిన తత్వాన్ని రక్షణ కవచం అనే ప్రతీకతో తెలియజేశారు.

విప్లవ క్షీణత: విప్లవకారులు గోకిరి ఎర్రేసు, కవర్డ్ హైటర్లను కాల్చి చంపగా, మిలటరీ దళం చెల్లాచెదరైపోయింది. ఈ మరణవార్త ఆంగ్లేయులను కలవరపెట్టింది. దీనితో మద్రాస్ నుంచి మరియు మలబారు నుంచి రెండు సిక్కు దళాలు ఏజెన్సీ ప్రాంతంలోకి రప్పించబడ్డాయి. పెద్దగడ్డ గూడెం వద్ద రాజు శిబిరంపై దాడిచేశారు.

ఉభయపక్షాల సంఘర్షణలో విప్లవకారులు పరాజితులయ్యారు. ఆయుధాలు ఆంగ్లేయులు పరమయ్యాయి. ఇది విప్లవవీరుల మొదటి పరాజయం. విప్లవకారులను పట్టించిన వారిపై బహుమతులు ప్రకటించారు. విప్లవం క్షీణించింది. రాజును అతని అనుచరులు వదలి వెళ్లాలని భావించిన ప్రభుత్వం మలబారు దళాన్ని అక్కడ నుంచి పంపించి వేసింది. పైగా దీనిని 'కేవలం చిన్నపాటి సంఘటన'గా కొట్టిపారవేసింది. ఈ విప్లవాన్ని చిరుగాలి తరంగంగా చేయడాన్ని కుందుర్తి నిరసించారు.

దీనిని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం వక్రీకరించి విప్లవకారుల జాడ కోసం అనేక విధాలుగా ప్రజలను హింసించుట, సామూహికంగా జరిమానాలు విధించుట మొదలగు దుశ్చర్యలకు పాల్పడింది. అనుచరులను కూడా రకరకాలుగా అణచివేశారు. పైగా ఈ విప్లవాన్ని దొమ్మీగా, రాజద్రోహంగా చిత్రీకరించడాన్ని విమర్శిస్తూ కుందుర్తి నయాగరా జలపాతపు ఝరీ వేగ గమనం వలె జంఝూనిల వీచికగా పేర్కొంటూ "రాజద్రోహంగా, నేరంగా/దోపిడీగా, దొమ్మీగా/ చరిత్రలో వ్రాసుకున్న/చేదస్తపు వ్రాతలకేం/ మన్య విప్లవం/మా చరిత్రలో/ వీచిన జంఝూనిల వీచిక! - అని నీరాజనాలిచ్చారు.

విప్లవం అణచివేత: రామరాజు ప్రజల స్థితిగతులు, విప్లవ స్థితిగతులు పరిశీలించి సాయుధ పోరాటాన్ని అణచివేయ దలచాడు. 1924 మే 7న రాజు మంప వద్ద ఏటి ఒడ్డున స్నానమాచరిస్తూ అల్లూరే ఒక కోయ బాలుని ద్వారా పోలీస్ వారికి కబురు పంపాడు. చింతలపూడి ఘాట్ లో నిరాయుధుడైన రాజును విచారణ జరిపించకుండానే క్రూరంగా కాల్చి చంపారు పోలీసులు. అయినా ప్రజల్లో విద్యుద్దీపంలా వారి అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి చిరుదివ్వెని వెలిగించాడు అల్లూరి.

ఆ వీరుడు కలిగించిన స్ఫూర్తిని గురించి కుందుర్తి 'బంధించిన/బానిసత్వ/విచ్ఛేదక వీరమూర్తి/విప్లవ శరదాకాశం/వెలిగించిన విద్యుద్దీపం/రామరాజు/హృదయంలో/రగిలిన స్వాతంత్ర్యేచ్ఛ' అంటూ రాజు స్వాతంత్ర్య కాంక్షతో చేసిన విప్లవాన్ని మన్యం వీరుని జంఝానిల వీచికగా వర్ణించారు అభ్యుదయోద్యమ, స్వాతంత్ర్యోద్యమ భావజాలం ఖని కుందుర్తి.

విప్లవం విఫలమైనా ఈ పోరాటం అద్వితీయం. గెరిల్లా పద్ధతుల ద్వారా ఆంగ్లేయులపై దాడి చేయడానికి కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాడు అల్లూరి. అతి తక్కువ మంది అనుచరులతో, అననుకూల పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యర్థులకు ముందుగా విప్లవ దాడులను గురించి తెలియజేసి ఒంటరి పోరాటం చేసిన యోధుడు అల్లూరి.

ముగింపు: 'మన్యంలో' కవితలో కుందుర్తి కథాత్మక, వర్ణణాత్మక, ప్రబోధాత్మక చైతన్యాలను ముప్పేటగా సాగించాడు. విప్లవ సైన్యం కర్కోటక ప్రభువులపై జయించడాన్ని ఇతివృత్తంగా స్వీకరించి కర్కోటక శాసనాలతో ప్రజలను హించించిన రాజుల కాలం పోయిందన్నారు. కథ, పాత్రచిత్రణ, సన్నివేశ కల్పనలతో సమగ్రమైన వచన కథా కావ్యంగా "మన్యంలో" వచన కవితని మలచడంలో కుందుర్తి కృతకృత్యులయ్యారు.

'మళ్లీ ఇన్నాళ్లకు' అంటూ రాసిన పీఠికలో “ఆరోజుల్లో కుండపోతగా ఆవేశం కుమ్మరించడమే కవిత్వమనే వాదం మాది" అని కుందుర్తి గారే స్వయంగా చెప్పినట్లు ఈ వచన కథాకావ్యంలో ఆవేశం 'నయాగరా' జలపాతంలా దుమికింది. "మన్యంలో” కవితలో సంక్షిప్తత, ఏకాగ్రత, నిర్భరత, స్వయం సమగ్రత, సంవాద చాతుర్యాలతో ఏకసూత్రతని సాధించిన కుందుర్తి విప్లవ వీరులలో ధ్రువతారగా ప్రకాశిస్తున్న అల్లూరి వలె వచన కవితా వినీలాకాశంలో ధ్రువతారగా ప్రకాశిస్తున్నారు.

**ఆధార గ్రంధాలు:**

1. నారాయణ రెడ్డి సి. - ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు, 7వ ముద్రణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, నవంబరు 2011.
2. యాదగిరి కె. సంపాదకులు, సత్యనారాయణ యస్వీ - తెలుగులో కవిత్యోద్యమాలు- అభ్యుదయ కవిత్వం, తెలుగు అకాడమి, హైదరాబాదు 2011.
3. రామదాస్, ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం- నయాగరా, ద్వితీయ ముద్రణ, శ్రీ వరలక్ష్మి ప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాదు, మార్చి 1975.
4. రామారావు ఎస్వీ - తెలుగులో సాహిత్య విమర్శ (అవతరణ -వికాసములు), పసిడి ప్రచురణలు, 2007.
5. వేంకటేశ్వర్లు బూదాటి - తెలుగు సాహిత్య చరిత్ర, మదురై కామరాజు విశ్వవిద్యాలయం, మదురై, హిమకర్ పబ్లికేషన్స్, హైదరాబాదు, 2012
6. శ్రీకాంతశర్మ ఇంద్రగంటి ఆలోచన, సారస్వత వ్యాసాలు గేయకవితా వికాసం నవోదయా పబ్లిషర్స్, మొదటి ముద్రణ, విజయవాడ, గుంటూరు, మార్చి, 1981,
7. సారస్వత వ్యాసములు కవిసామ్రాట్ శ్రీ నోరి నరసింహ శాస్త్రి గారి వ్యాసములు, ఐదవ సంపుటము, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, ప్రథమ ముద్రణ, కళాభావన్, సైఫాబాదు, హైదరాబాదు-4, 1979.
8. చంద్రశేఖర్ ఎస్.జి.డి. - వచన కవిత్వం కుందుర్తి పాత్ర, 1985.
9. రామమోహనరావు అద్దేపల్లి కుందుర్తి వచన కవితా వైభవం.
10. సంపత్కుమారాచార్య కోవెల వచన కవిత - కథా కావ్యం.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

# షాజహానా కథలలో సామాజిక జీవన చిత్రణ

1. **షేక్ జరీన బేగం**, పరిశోధకులురాలు,
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్
2. **డా ll ఇరపని మాధవి**, అసోసియేట్ ప్రొఫెసర్, పర్యవేక్షకులు
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**ఉపోద్ఘాతం:** హితాన్ని చేకూర్చేది సాహిత్యం. సమాజ శ్రేయస్సును కోరుకునేది సాహిత్యం. అంతేకాదు మనిషిలోని భావాలను, ఊహలను, ఆనందాలను, ఎదుర్కొనే బాధలను, అసమానతలను, వైరుధ్యాలను తెలిపే కళాత్మకమైన సాధనమే సాహిత్యం అని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యం పరిణామశీలం గలది. కనుకనే తెలుగు సాహిత్యం నిరంతరం నవ్యతను సంతరించుకొని శోభిస్తుంది. తెలుగు సాహిత్యంలో ఆధునిక సాహిత్యంలో చాలా ధోరణులు వెలువడ్డాయి. భావ కవిత్వం నుంచి దళితవాదం వరకు వెలువడిన కవితా ధోరణులు తెలుగు సాహిత్యానికి కొత్తదనాన్ని, నిండుదనాన్ని కలిగించాయి. ఇదే విధంగా ఆధునిక తెలుగు సాహిత్యం లో వెలువడిన మరో కవితా ధోరణి ముస్లిం వాద సాహిత్యం.

మొట్టమొదటిసారి ఖాదర్ మొహియుద్దీన్ "పుట్టుమచ్చ" లో వినిపించిన ముస్లింవాద స్వరం తెలుగు సాహిత్య ప్రపంచాన్ని కుదిపివేసింది. పుట్టుమచ్చ 1991 ఫిబ్రవరిలో అచ్చయ్యింది. మనుషులుగా ఈ దేశ పౌరులుగా తమ అస్తిత్వానికి సంబంధించిన ముస్లిముల తొలి ప్రకటన ఇది. ముస్లింవాదం మొదట దళితవాద కవిత్వంలో భాగంగా కొనసాగింది. దళిత వాదంలో భాగంగా వచ్చిన చిక్కనవుతున్న పాట, పదునెక్కిన పాట, చిత్తరువు కవితా సంకలనాలలో ముస్లింవాద కవిత్వం ఉంది. ఆ తర్వాత దళితవాదం నుంచి వేరై ముస్లింవాదం ఒక ప్రత్యేక శాఖగా మారింది.

**ముస్లీంవాదంలో ప్రధానంగా కనిపించే అంశాలు :**

* తమపై వివక్షను అణిచివేతను నిరసించడం.
* ఇస్లాం పేరిట మత పెద్దలు మైనారిటీ నాయకులు అనుసరిస్తున్న అవకాశవాదం ధోరణి ని వ్యతిరేకించడం.
* ఇస్లాంలో మహిళలని అవమానపరిచే ధోరణిని తిరస్కరిస్తూ సంస్కరణలని అనుసరించడం.

" నేను పుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదై వుంది నా పేరు

మహాకవి శ్రీశ్రీ కసాయి, సాయిబు అనే పదాల్ని కలిపి కసాయిబు అనే పదబంధాన్ని సృష్టించడం, ప్రజాకవి సుద్దాల హనుమంతు తురకలను తరిమేయాలని పాట రాయడం, నిజాం నవాబు ముస్లిం కాబట్టి ముస్లింలందరినీ తరిమేయాలని పిలుపునివ్వడం వంటి సన్నివేశాలు ఖాదర్ మొహియుద్దీన్ పుట్టుమచ్చ దీర్ఘ కవితకు కారణమయ్యాయి. అంతేకాదు ఈ కవిత ముస్లింలు అనుభవిస్తున్న ప్రతి సమస్యను కళ్ళకు కట్టింది. ఇలా ప్రారంభమైన ముస్లింవాదంలో జావేద్ సికందర్ ఎండి,యాకుబ్ పాషా, సయ్యద్ గఫర్, ఖాజా,అప్సర్, స్కై బాబా, షాజహానా, మెహజబీన్ మొదలగు రచయితలు భాగస్వాములయ్యారు ముస్లీం వాదం లో ప్రధానంగా మతంలోని స్త్రీ ల పరిస్థితి మెరుగుపడాలని ఆశించేవారు. ఈ మార్పు కోసం ప్రయత్నిస్తున్న గొప్ప ముస్లింవాద రచయిత్రి షాజహానా గారు.

**రచయిత్రి సంక్షిప్త పరిచయం:** షాజహానా ఖమ్మం జిల్లా కమలాపురంలో జన్మించారు. తల్లిదండ్రులు డాక్టర్ దిలావర్, యాకుబ్బి. నాన్న దిలావర్ నుంచి మంచి సాహిత్యాన్ని వారసత్వంగా పొందారు. షాజహానా అమ్మమ్మ ఊరు పూర్వ వరంగల్ జిల్లా రాజోలు. దిలావర్ ప్రముఖ రచయిత. సోదరుడు అక్బర్ కూడా కవి, ఈ మధ్యనే ఆరాధన అనే కవితా సంపుటి తీసుకొచ్చాడు. సోదరి షంషాద్ మహమ్మద్ రచయిత్రి. ఆమె కవిత సంపుటి పేరు "ఈ కిటికీ తెరుచుకునేది ఊహల్లోకి".

షాజహాన జీవిత సహచరుడు నల్గొండకు చెందిన స్కై బాబా ప్రముఖ ముస్లింవాద రచయిత. ఖమ్మం జిల్లా లోని వివిధ గ్రామాల్లోనూ కొత్తగూడెంలోనూ చదువు కొనసాగింది. కోఠి ఉమెన్స్ కాలేజీలో ఎంఏ తెలుగు, రాజమండ్రి తెలుగు యూనివర్సిటీలో ఎం.ఫిల్ (గోల్డ్ మెడల్) ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తెలుగులో ముస్లిం వాద సాహిత్యం - పరిశీలన అంశంపై పిహెచ్. డి. చేశారు. అస్మిత షాహిన్ లాంటి ఎన్జీవోల్లో పనిచేశారు. అన్వేషి నుంచి దూదేకు స్త్రీల మీద ప్రాజెక్ట్ చేశారు. వెలుగు ప్రాజెక్ట్ లోను పనిచేశారు.

షాజహాన రచనలు ఇంగ్లీష్ హిందీ జర్మన్ కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. 'నఖాబ్' ముస్లిం స్త్రీ కవిత్వం - 2005, 'చాంద్ తారా' స్కైబాబా తో కలిసి (2009), 'దర్ది' -2012 లో వెలువరించారు.అలావా ముస్లిం సంస్కృతి కవిత్వం సంపాదకత్వం (స్కైబాబాతోకలిసి2006) వహించారు. ముఖామి కవితా సంకలనానికి కూడా స్కైబాబా తో కలిసి సంపాదకత్వం వహించారు. 2016లో 'లదాఫ్ని' అనే కథా సంపుటి వెలువరించారు ముస్లిం స్త్రీల తొలి తెలుగు కథా సంకలనం'మొహర్' కు సంపాదకత్వం వహించారు.'ఫిజా' కవిత్వం 2021లో ప్రచురించారు.

'నఖాబ్' కవిత్వం కన్నడలోకి అనువాదమై పుస్తకంగా వెలువడింది. సిల్ సిలా కథ ఆంగ్లం లోకి అనువాదమై 'సంయుక్త' ( ఏ జర్నల్ ఆఫ్ ఉమెన్ స్టడీస్) లో అచ్చయింది. ఆక్స్ ఫర్డ్ ప్రచురణ ట్వంటీయత్ సెంచరీ తెలుగు పొయెట్రీలో, ఇండియన్ లిటరేచర్, సాహిత్య అకాడమీ, ఇంకా అనేక సంకలనాలలో కవితలు అచ్చయ్యాయి. 'జస్ట్ బిట్వీన్ అజ్ ' (ఉమెన్ స్పీక్ అబౌట్ థైర్ రైటింగ్స్) లోను 'స్వీపింగ్ ద ఫ్రంట్ యార్డ్ ' (స్పారో ప్రచురణ) లలోను ఇంటర్వ్యూలు వచ్చాయి.

మనదేశంలోని ఎన్నో రాష్ట్రాల్లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో కవితా పఠనం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాంస్కృతిక శాఖ నిర్వహించిన అనేక కవి సమ్మేళనాల్లో పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర విశిష్ట మహిళ పురస్కారాన్ని 2017 లో అందుకున్నారు. రంగవల్లి మెమోరియల్ అవార్డు, రంగినేని ఎల్లమ్మ అవార్డు, నందివాడ

శ్యామల - కుందుర్తి అవార్డు, వెంకట సుబ్బు అవార్డు, గుర్రం జాషువా అవార్డు, తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం, రొట్టమాకు రేవు అవార్డు, లదాఫ్ని కథా సంపుటికి కొలకలూరి భాగీరథి అవార్డులే కాక ఢిల్లీలో సంస్కృతి ప్రతిష్ఠాన్ అవార్డు అందుకున్నారు.

భారత ప్రభుత్వం తరపున గౌరవ అతిథిగా ఫ్రాంక్ ఫర్ట్ బుక్ ఫెయిర్ ( జర్మనీ - 2006 ) మాస్కో బుక్ ఫెయిర్ ( రష్యా - 2009 ) లో కవితా పఠనం చేయడం విశేషం. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఉద్యమ కవిత్వం రాశారు. లెక్చరర్ గా, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో జర్నలిస్టుగా పనిచేశారు. ప్రస్తుత నివాసం హైదరాబాద్.

**షాజహానా కథలలో సామజిక జీవన చిత్రణ**

**వతన్ కథా సంపుటి:** వతన్ కథా సంపుటి స్కైబాబా గారి సంపాదకత్వంలో వెలువడింది. షాజహానా గారు ఈ కథ సంపుటికి సంపాద వర్గంలో సభ్యులుగా ఉన్నారు. అంతేకాక ఆమె ఈ కథ సంపుటిలో రచించిన సిల్ సిలా కథ ఆంగ్లంలో అనువాదమై ఎంతో గొప్ప కథగా నిలిచింది. ఈ కథాసంపుటి గురించి చెబుతూ స్కై బాబా గారు ఇవి కహానీలు కావు జిందగీలు అని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో ముస్లింల జీవితాలను చిత్రీకరించడం మరియు వారి జీవితాలను కథలుగా పరిచయం చేయడమే ఈ కథాసంపుటి ప్రధాన ఉద్దేశం.

**షాజహాన - సిల్ సిలా:** షాజహాన గారి రచనల్లో అసలైన నిజజీవన చిత్రణ వుంటుంది. ఈ కథలో కూడా దూదేకుల కులానికి చెందిన తన పెద్దమ్మ అనుభవించిన వేదన వుంటుంది.

మసీదులో బయాన్ లలో నమాజులలో అందరూ సమానమే కానీ, పెళ్లిళ్లు చేసుకోవడంలో వక్ఫ బోర్డ్ ఎంపికలో, మౌల్వీల్ గా మారడంలో మాత్రం దూదేకులను, బోరేవాలే,ఫకీర్లు మొదలగు వారిని తక్కువగా చూడటం ముస్లిం మతంలో మనకు కనిపిస్తుంది. దూదేకులను సగం ముస్లింలుగా చూడటం ముస్లిం మతంలో జరుగుతుంది. సిల్ సిలా కథ కూడా అసమానతలు నుంచి పుట్టినదే ఈ కథ షాజహాన జీవితంలో జరిగిన సంఘటన కావడం విశేషం. అందుకే స్కైబాబా గారు ఈ కథలను జిందగీలు అంటే జీవితాలు అని అన్నారు.

"సెల్లే గరీబ్ దాన్నయితే అయిన గాని ఇంటికి వచ్చిన సుట్టాన్ని అప్పుదెచ్చయిన పానం తీర్గ జూసుకుంట గాదె. ఈ ఎండాకాలం సెల్వలన్నా మున్ని ని పంపరాదే" అన్న మాటలతో కథ ప్రారంభమవుతుంది. మున్ని వాళ్ళ పెద్దమ్మ ఈసారైనా వేసవికాలం సెలవులకి ఇంటికి రావాలని మున్ని వాళ్ళ అమ్మని అంటే తన చెల్లిని అడుగుతుంది. అయినా మాలాంటి పేదవారింటికి ఎందుకు వస్తారులే అంటూ బాధపడుతూ వెళుతుంది. మున్ని తన తమ్ముడితో కలిసి వాళ్ళ పెద్దమ్మ వాళ్ళ ఇంటికి వేసవి సెలవులకు వెళ్తుంది. ఇలా వెళ్లడానికి వాళ్ళ నాన్న అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. అక్కడికి వెళ్ళిన తర్వాత వాళ్ళ పెద్దమ్మ వాళ్ళకి చాలా ఆప్యాయంగా ప్రేమగా రుచికరంగా వండి పెడుతుంది మున్ని వాళ్ళ పెద్దమ్మను నువ్వు ఎందుకు పెదనాన్నను పెళ్లి చేసుకున్నావు అని అడిగితే అప్పుడు పెద్దమ్మ దానికి కారణం చెబుతుంది.

వాళ్ళ నాన్నకు అంటే మున్నీ వాళ్ళ తాతకు నలుగురు అమ్మాయిలు. పెద్ద అమ్మాయిని రైల్వేలో పనిచేసే అతనికి ఇచ్చి పెళ్లి చేశారు. మూడోఅమ్మాయి ఐన మున్ని వాళ్ళ అమ్మ మరియు చివరి అమ్మాయి చాలా అందంగా ఉండే వారనీ, వారిని వివాహం చేసుకోవడానికి ముస్లిం కుటుంబం నుంచి సంబంధం వచ్చిందని, మరి వారి వివాహం జరగాలంటే వాళ్ళకంటే ముందు పుట్టిన తన వివాహం కావాలి కాబట్టి తనను సన్నాయి, గజ్జెలు వాయించే మా పెదనాన్నకిచ్చి వివాహం చేశారని చెప్పింది. ఆరోజు మున్నీ, వాళ్ళ పెదనాన్న తాగి వచ్చి పెద్దమ్మని కొట్టడం కళ్ళారా చూసి బాధపడుతుంది. పెద్దమ్మ జీవితం ఇలా అవడం తనను చాలా కలవరపెడుతుంది. మున్నీ తిరిగి ఊరు వెళ్లే రోజు పెద్దమ్మ వద్దన్నా వినకుండా 300 రూపాయలు ఆమె చేతిలో పెట్టి తన కుమారుడి పెళ్లికి నెల రోజులు

ముందు రావాలని ఆప్యాయంగా చెబుతూ, ఏడుస్తూ ఆటో ఎక్కిస్తుంది. మున్ని కూడా కన్నీళ్ళతో వాళ్ల పెద్దమ్మకు వీడ్కోలు చెప్పడంతో ఈ కథ ముగుస్తుంది.

సిల్ సిలా షాజహానా గారి మొదటి కథ. సిల్ - సిలా అంటే వరుస అని అర్థం. ఈ కథలో కూడా ఒకదానికొకదానికి సంబంధం ఉంటుంది. ఉదాహరణకి, మున్ని వాళ్ళ పెద్దమ్మ ఎందుకు పేదరికం గా ఉండాలి? వివాహం కారణం. ఎందుకతనిని వివాహం చేసుకోవాలి? తండ్రి కారణం. తండ్రి అలా ఎందుకు చేసాడు? మిగతా ఇద్దరు ఆడపిల్లల వివాహం జరగాలి కాబట్టి. ఇలా ఒకదానికొకటి చైన్ లాగా ఉంటుంది ఈ కథ.

ఈ కథలో ముఖ్యంగా రచయిత ముస్లిం మతంలోని ఉపకులాల మధ్య వున్న వ్యత్యాసాలను చూపించారు. దూదేకులను ఎలా తక్కువ చేసి చూస్తున్నారో వివరించారు. మునీన్ని వాళ్ళ తమ్ముడు ఊరిలోకి వెళ్లి లతీఫ్ గారి ఇల్లెక్కడా అంటే ఎవరు చెప్పరు. మున్ని వాళ్ళ అమ్మ మాటలు గుర్తుకు తెచ్చుకొని "అది గాదె తాత దూదేకు లత్తయ్య, దూదేకుల కరింబి వాళ్ళు లేరు.... గదేనే సన్నాయి లత్తయ్య గాలిల్లు" అనగానే గుర్తుపట్టి వాళ్ళ ఇంటికి తీసుకువెళ్తారు. ఒక వ్యక్తి సామాజిక ఆర్థిక స్థాయిని బట్టే కాక అతను ఉన్న కులాన్ని బట్టి కూడా గౌరవం మారిపోవడం మనం ఇక్కడ గమనించవచ్చు.

ముస్లిం మతంలోనూ ఉపకులాలైన దూదేకుల పట్ల వివక్షత ఉంది. దూదేకులకు పెద్ద ముస్లిం కుటుంబం నుంచి పెళ్లి సంబంధం వచ్చిందంటే చాలా అదృష్టంగా భావించేవారు. ఈ కథలో కూడా మున్ని వాళ్ళ తాతయ్య మిగిలిన ఇద్దరు పిల్లలకు ముస్లిం కుటుంబం నుంచి సంబంధం రాగానే సంతోషపడి అంగీకరిస్తాడు.

అలాగే ముస్లిం కుటుంబాలలో ఉండే ప్రధాన సమస్య అధిక సంతానం. పోషించే స్తోమత వున్నా లేకున్నా సంతానం మాత్రం అధికంగా వుండేది. దీని వలన చివరికి పేదరికంలో బ్రతకడం లేదా మున్ని వాళ్ళ పెద్దమ్మ జీవితంలా కుటుంబంలో ఆడపిల్లలు అన్యాయమై పోవడం జరుగుతువుంటుంది.

పెద్దమ్మ తన కథ చెబుతున్నప్పుడు మునీన్ని కి వాళ్ళ నాన్న వాళ్ళ అమ్మని దూదేకులదానా అని తిట్టడం గుర్తుకొస్తుంది. ఈ మాటలు దూదేకులను ఎంత తక్కువగా చూస్తున్నారో తెలుపుతున్నాయి.

సిల్ - సిలా కథలో పేద పెద్దమ్మ జీవితం చిత్రీకరించబడింది. వర్గ వివక్ష జాతి వివక్షతలను చూపించింది. ధనంతో అనుబంధాలు ఎలా ముడిపడి ఉన్నాయో తెలిపింది. అందంగా వున్నారని వివాహం చేసుకుని సందర్భం వచ్చినప్పుడు కులం పేరుతో అవమానించడం ఈ కథలో మనం గమనించవచ్చు. పితృస్వామ్యం గురించి ఈ కథ వివరిస్తుంది. వర్గ, జాతి, పేదరికం లో, పితృస్వామ్యం లో కొట్టుమిట్టాడుతున్న దూదేకుల స్త్రీల జీవితాలను అత్యద్భుతంగా చిత్రీకరించింది ఈ కథ.

**లద్దాఫ్ని కథా సంపుటి:** షాజహాన గారి మొదటి కథాసంకలనం ఇది. వాస్తవ సమాజాన్ని చిత్రీకరించడం ఈ కథల లక్ష్యంగా కనిపిస్తుంది. పదకొండు కథలతో కూడిన సంకలనం ఇది.

" లద్దాఫ్ని జీవిత చిత్రణ ను చేసిన షాజహానా కథలలో అమ్మాయిలు అంతకఠోరమైన జీవనపరిస్థుతులలోను కలలు కంటారు. ముందుకు సాగే ప్రయత్నం చేస్తారు. వాడిపోతామని తెలిసినా చిన్న చిన్న ఆనందాలకు సంబరంగా నవ్వుతారు. ఈ జీవనోత్సవాన్ని తీసుకురావడం వల్ల షాజహాన్ కథలు ప్రత్యేకంగా నిలిచాయి". - ఓల్గా .

ఈ కథా సంపుటి లో ఒక అద్భుతమైన కథ "సండాస్". పేదరికంలో వున్న ముస్లిం కుటుంబాలలో ఎంతోమంది స్త్రీలకు జరుగుతున్న అవమానానికి నిదర్శనమే ఈ కథ. మలం, బయటికి వెళ్లడం వంటి విషయాల పైన కూడా కథలు రాస్తారా? కవితలు రాస్తారా? అంటే అవి నిత్యం మనకు తప్పనిసరిగా కావాల్సిన అవసరాలు అవి లేకపోతే మన

జీవితాన్ని ఊహించగలమా? అలాంటి వసతులు కూడా లేని జీవితాలను ముస్లిం స్త్రీలు గడుపుతున్న దుస్థితిని చూపించడమే ఈ కథ యొక్క ప్రధాన లక్ష్యం.

"ఏమైందీ....వలీమా అయి ఒక్క రోజన్నా కాలే, అప్పుడే పోవుడేంది ఏ ఇంట్లనన్న నీకన్నా ఉన్నదా గిసువంటి రీతి రివాజు?" అనే మాటలతో ప్రారంభమవుతుంది ఈ కథ. ఎన్నో కలలతో వివాహం చేసుకున్న కొత్త పెళ్లికూతురి కథ ఇది. ఎవరింట్లోనైనా పాయ్ ఖాన దొడ్లు బాగా లేకపోతే వారింటికైనా వెళ్ళని ఆడపిల్ల, పెళ్లయిన తర్వాత పాయిఖానానే లేని ఇంటికి కోడలిగా వెళ్లాల్సి వచ్చింది. ఆమె తండ్రి చనిపోవడంతో తల్లి గత్యంతరం లేక ఆమెను సైకిల్ షాప్ అతనికి ఇచ్చి వివాహం చేసింది. ఆ ఇంట్లో ముగ్గురు అమ్మాయిలు ఉన్నా పాయ్ ఖానా లేని దుస్థితి అక్కడ ఒక్క సండాస్ మాత్రమే ఉంది. నాలుగు కర్రలు పాతి గోనిసంచులు కట్టి లోపల ఒక గొయ్యి తవ్వి వుంది. అందులోనే అందరూ ఒక లోటా నీళ్లతో వెళ్లి వస్తుంటారు. దీనినే సండాస్ అంటారు. ఆ గొయ్యిలో నుంచి పురుగులు ఎలుకలు బొద్దింకలు వస్తూ ఉంటాయి. దీనిలోకే వెళ్ళాలి ఆ ఇంట్లో వారంత. పెళ్లికూతురు షమీమ్ అందులోకి వెళ్లలేక ఆమెకు దుఃఖం వస్తుంది. తనకి తన పుట్టిల్లు గుర్తుకొస్తుంది. ఆ రోజు రాత్రి అన్నం కూడా తినకుండా పడుకుంటుంది. ఆ తర్వాత వుండలేక కడుపునొప్పి అని చెప్పి పుట్టింటికి వెళ్తుంది. అక్కడ తన పెళ్లి కోసం ఇల్లు అమ్మేసారని ఇప్పుడు వారు ఒక అద్దె ఇంటికి వెళ్తున్నారని అమ్మ చెప్తే తెలుసుకుంటుంది. చిన్న చెల్లి వచ్చి పాప" ఓ ఘర్ మే పాయిఖానా భీ నై హై.... ఖాళీ సండాస్ హై " అంటుంది దిగులుగా. అంటే తాము వెళ్ళబోయే ఇంట్లో కూడా మరుగుదొడ్డి లేదని కేవలం సండాసే ఉందని తెలుపుతుంది. ఈ మాటలతో కథ ముగుస్తుంది.

పేదరికంతో తిండి లేని పరిస్థితులు చూసి వుంటాం. కానీ సండాస్ లోకి వెళ్లలేక తినని దుస్థితి ఈ కథలో చిత్రీకరించబడింది. ఇంత నవనాగరిక సమాజంలో వున్న మనకి తెలియని వేదనలను కథలుగా మలచి చిత్రీకరించింది షాజహాన. ఈ కథలో రచయిత ఒక దగ్గర వూర్లో ముస్లింలు కాని వాళ్లు ఊరి బయటకి వెళ్తారు కదా వీళ్లకు కూడా వెళ్తేంది అనే మాటలు ఆలోచింపజేస్తాయి. ఊరి బయటకు వెళ్లడమే దుస్థితి అనుకుంటే అందుకు కూడా నిషేధింపబడిన స్త్రీల పరిస్థితిని ఏమని నిర్వచించాలి. అందుకే ఈ కథలో షాజహాన గరీబ్ ముస్లిం ఆడాళ్ల బతుకులు ఇంతేనా? అని వాపోతోంది.

**ముగింపు:** అలా ఈ కథా సంపుటిలో ఒక్కొక్క ముస్లిం స్త్రీల జీవితం సాక్షాత్కరిస్తుంది. ఊరిలో అగ్రవర్ణాలు, కరణాలు, వ్యాపారస్తులు నిస్సహాయ స్త్రీలను ఎలా లొంగపరుచుకుంటారో ఖతిజా గఫూరే కథలో చెప్పింది. పితృస్వామ్యం, స్త్రీలపై లైంగిక అణచివేత వంటి అంశాలు వాద కథలో కనిపిస్తాయి. ఒక మంచి మనిషి కోసం జీవితంలో సాగే వెతుకులాట 'మంచిరాయి కథ' ఇలా ఈ కథలు వాస్తవిక జీవనాన్ని ప్రతిబింబించాయి.

**ఆధార గ్రంథాలు**

**1.** తెలుగు సాహిత్య చరిత్ర - ద్వాదశి నాగేశ్వర శాస్త్రి
2. తెలుగులో కవితోద్యమాలు - తెలుగు అకాడమీ
3. వతన్ కథా సంపుటి - స్కైబాబా
4. లద్దాఫ్ని కథా సంపుటి - షాజహాన

## శిఖామణి మువ్వల చేతి కర్ర -కవితా శిల్పం

**డాక్టర్ బి .సుబ్బలక్ష్మి**
తెలుగు అధ్యాపకులు
గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ (అ), రాజమండ్రి.
చరవాణి: - 9550699847.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

శిల అంటే రాయి ఇది నియమితమైన అర్థం. వేరే అర్థాలుఉన్న ఆ అర్థాలు ఏర్పడిన తీరు వేరు. అందుచేత అవి అనవసరం. శిలని ఒక ఆకారంగా మలిచేవాడు శిల్పి ఈ శిల్పి చేసే పనినే శిల్పం అంటాం. అలాంటి శబ్దాన్ని తాత్వికత ఆధారంగా కావ్యానికి కవితకి అన్వయించారు. అలాగ అన్వయించిన పదాలు సాహిత్యంలో చాలా ఉన్నాయి.

శిల్పానికి ప్రాధాన్య అంశాలు రెండు. ఒకటి బాహిరమైన ఆకృతి రెండోది ఆ ఆకృతి కి తగిన చైతన్యం. ఈ రెండు కల కలిసి ఉన్నప్పుడే అది శిల్పం అవుతుంది. చైతన్యం ఎక్కువగా ఉన్నప్పుడు జీవకళ ఉట్టిపడితే శిల్పం అంటారు.

అదే శిల్పతత్వం కవి సృజించిన కవితకి అన్వయిస్తుంది. రాతిని చెక్కిన శిల్పం లో జీవకళ ఎలా ఉందో, ఎందుకు వచ్చిందో వివరించడానికి అనేక కారణాలు ఉంటాయి. అలాగే కవి సృజనా శక్తితో వెలువరించిన కవితలోను ఔన్నత్యం, ఉ త్కృష్టత ఎలా ఉందో చెప్పడానికి అనేకమైన అంశాలు చోటుచేసుకుంటాయి ఆ దృష్టితో మువ్వల చేతి కర్రలోని కవితాశిల్పాన్ని అనుశీలించడం నా వ్యాస ఉద్దేశం.

మువ్వల చేతి కర్ర కవితా సంపుటి శిఖామణి గారి తొలి రచన. 1987 నాటికి మొదటిసారి, 2006 సంవత్సరం నాటికి రెండోసారి ముద్రింపబడింది. 1987 కి ముందే సుమారు ఐదుర సంవత్సరాలకు మునిపే శిఖామణి గారి కవితా మాధుర్యాన్ని లోకం ఆస్వాదించింది. వివిధ పత్రికల్లో అప్పుడప్పుడు రాసిన కవితలు 1987 నాటికి మువ్వల చేతి కర్ర కవితా సంపుటిగా ఆవిర్భవించాయి. అప్పటికి ఇంకా శిఖామణి గారు పరిశోధక విద్యార్థి దశలోనే ఉన్నారు. అప్పుడప్పుడు రాసిన కవితల్లోని గాఢతని,విలువలని, రుచిని, విమర్శక పాఠక లోకం ఆస్వాదించి, కవిగా గుర్తింపునిచ్చింది. మువ్వల చేతికర్ర కవిత సంపుటి వెలవడగానే ఒక్కసారిగా శిఖామణి కి ఆధునిక కవుల్లో విశిష్ట స్థానాన్ని కల్పించింది సాహితీ లోకం.

పత్రికలో పది రకాల విషయాలు చదువుతూ ఒక కవిత కూడా చదివినప్పుడు పొందే తృప్తి వేరు. కవిత బాగుంది అనుకోవటం, ఆ పత్రికలోని అన్య విషయాలని చర్చించుకోవటం సాధారణంగా జరిగేపని. ఒక కవితా సంపుటికే సమయాన్ని కేటాయించి దానిని ఆసాంతం చదివినపుడు మిగిలే సంతృప్తి వేరు. ఆ సమయంలో ఆ కవితాసంపుటి పైనే మనసు మమైకత్వం చెంది ఉ ంటుంది. శిఖామణి ఒక సాటిలేని ఆధునికకవిగా గుర్తింపు పొందారు.

మువ్వల చేతికర్రలోని ప్రతికవితా ఒక మేలిముత్యంలా ఉంటుంది. ఏదో ఒక ఉద్యమానికో, పరిమితికో ఒదిగిపోక మువ్వల చేతికర్రగా ఆవిర్భవించిన శిఖామణి కవితా భావాలు మానవతా వాదానికి కవితా రూపాలుగా దర్శనమిస్తాయి. ఏ అంశాన్ని స్పృశించినా పరిమితులు విధించుకుని ప్రకటింపబడటమో, ఏదొక పార్శ్వానికి చెంది ఒత్తిగిలటమో జరుగదు. మనిషి, మట్టి, మూలాలు, మూలాలకి మూలాలలో తన రూపం, తన బాధ్యత, పాత్ర ఎలాంటివి తడిమి చూసుకోవటం, వాటిగా రూపాంతరంచెంది లోకాన్ని పచ్చగా బ్రతికించడం కోసం ప్రయత్నించేవై ఉంటాయి. అంతటి సునిశితదృష్టి హృదయ వైశాల్యం, ఎవరూ ప్రసరింప చేయని లోచూపు, ఆలోచన విధానాలు ఈ కవి ఎలా పొదివి పట్టగలిగేడా అని ఆశ్చర్యపడకతప్పదు.

కవిగా పుడుతూనే మానవత్వపు అంతరాళలని, ప్రపంచతత్వాన్ని ఆకళింపు చేసుకున్న కవిగా ఆవిర్భవించడానికి కారణం ఉంది. శిఖామణికి చెందిన సొంత జీవితమే మానవతావాదిగా ప్రపంచాన్ని ఆకళింపుచేసుకున్నవాడిగాను తీర్చిదిద్దింది. ఆయన జీవితమే ఆయన కవితా సంద్రానికి చుక్కాని అయింది. ఆయన తొలినాళ్ళలో రాసిన మువ్వల చేతికర్ర కవిత్వాన్ని, చిన్నప్పటి ఆయన వాస్తవ జీవితాన్ని కలిపి వెనక్కి ముడిపెడితే, ఆయన హృదయంలో భావ సముద్రాలు ఎలా కట్టతెంచుకునేలా ఉన్నాయనేది తెలుస్తుంది. అలా ఆ సముద్రాల్లోంచి పెల్లుబికిన కొన్ని కెరటాలే ఈ మువ్వల చేతికర్రలోని కవితలు.

ముువ్వల చేతికర్ర కవితా సంపుటిలో 44 కవితలున్నాయి. ఏ కవిత ఎప్పుడు రాసిందో కవిత చివర ప్రచురణ వివరాలున్నాయి. భిన్నకాలాల్లో రాసిన ఈ కవితలు కాలానుక్రమంలో సంపుటికరింపబడలేదు. పోనీ అకారాదిక్రమంలో ఉ ంచడానికి ప్రయత్నించాడా? అంటే, అదీ జరగలేదు. కవితా శీర్షిక అందించే భావానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు గమనించవచ్చు మామూలు వ్యక్తులకు కన్పించని అంశాలు, విన్పించని ధ్వనులు కవి మాత్రమే గ్రహించగలడు. కవి తన భౌతికనేత్రాన్ని హృదయంలో సన్నిహితం చేసి, హృదయానికి చూసే నేర్పరితనాన్ని కలిగించగలవాడు కవి. ఈ లోచూపు, అంతర్నేత్రం కనికి మాత్రమే పరిమితం. అలాంటి కవి శిఖామణి. ఆయన చూపు, ఆలోచన, వ్యక్తీకరణలు ప్రత్యేకత కలిగినవై ఉన్నాయి. ఈ నేపథ్యంలో శిఖామణి కవితా శిల్పానికి తోడ్పడిన అంశాలు ఏమిటని పరిశీలిస్తే విమర్శకులు, పరిశోధకులు అందించిన కొన్ని అంశాలు ఉన్నాయి.

"ఉపమలో కవిత్వం రాసేవాడు మామూలుకవి, రూపకంలో రాసేవాడు. ఉత్తమకవి, మెటఫిజికల్ మెటఫర్లో రాసేవాడు అత్యుత్తమకవి. మెటఫారిక్ కన్సీట్లో రాసేవాడు ఉత్తమోత్తమకవి. కాకుంటే నీచోత్తమ అత్యున్నత కవి.

శిఖామణి కవిత కన్సీట్ కవిత. %జశ్రీఅఎవత్% అనే మాటకు నిఘంటువు ఇచ్చే అర్థంవేరు. జాన్ డన్,, క్రాషా, యాండ్రూమార్వెల్, హఫ్ కిన్స్, డేసన్, ఏట్స్, ఎలియట్ ఇత్యాది మహకవులు కన్సీట్లోనే రాస్తారు." అని శిఖామణి కవిత్వాన్ని 'మో' కన్సీట్ కవితగా అంచనావేశారు..

మెటఫిజికల్ -విశేషమైనచూపు. తర్కం, తత్వం, అప్రత్యక్షమైన జ్ఞానం, మెటఫర్- అలంకారానికి సంబంధించినది. వీటిని విడిచి అంటే అసాధారణమైన పోలిక అని అర్థాన్ని సాహిత్యసంబంధమైన అర్థంగా నిఘంటువులు చెబుతున్నాయి. అయితే నిఘంటువులు ఇచ్చే అర్థం వేరని ఆయనే ఖండించి, కొంతమంది ఆంగ్లకవుల పేర్లు ఉట్టంకించారు. అలాంటి కవిత శిఖామణిగారిదని 'మో' కష్టపడి చెప్పినది మనం ఆంగ్లకవులను అధ్యయనం చేసి తెలుసుకోవాలని తెలుపుతుంది లేదంటే ఈ చెప్పిన విధానం మన సంప్రదాయంలోని ఆకాశ భాషణానికి అప్పగారనుకోవాలి. ఆయన కాదన్న నిఘంటువు చెబుతున్న అర్థాన్ని గ్రహిస్తే శిఖామణి కవితలో 'అసాధారణమైన పోలిక' పాత పోలికల్ని, పాతకవిసమయాల్ని మోయడం శిఖామణికి ఇష్టం ఉండదు. ఆలోచించేది, మననం చేసేది, చెప్పేది వర్తమానం, వాస్తవం, సమకాలీనం, పచ్చని భవిష్యత్తుకు సంబంధించింది. అందుచేత 'మో' గారి ఉద్దేశం అసాధారణమైన పోలిక అనుకోవటంలో అనౌచిత్యం లేదు.

"శిఖామణికవిత్వవ్యక్తినిసంబోధిస్తుంది. తనకూడా నడిపించుకువెళ్ళి- పచ్చని చెట్ల నీడల్నీ- దట్టమైన ఆకు గుబురుల్ని, ఎండలో ఎగిరే పిట్టల రెక్కల మెరుపుల్నీ నది నీటి అలల చిరువెచ్చదనాన్నిసముద్ర గాంభీర్యాన్ని ప్రేమ అనే తలపులో పారవశ్యాన్ని పూల పరిమళాలనే, రేల వెన్నెల తళుకుల్నీ, ఋతువైభవాల అంతర్యాన్ని పరిచయం చేసి అనుభవించడం రకరకాల మరీమరీ గుర్తుచేస్తుంది. మరచిపోవద్దనిఅచేతనాల్లో చేతనత్వాన్ని, చేతనత్వం తమ సొమ్ముచేసుకునే మనుషుల్లోని అచేతనత్వాన్ని, ఎదురెదురుగా నిలిపి వ్యాఖ్యానించడం శిఖామణి కవిత్వంలో మరో విశేషమని నేననుకుంటాను.

శబ్దచిత్రాలనీ, అంకారాలనీ శ్రీశ్రీనే, ఒక్కొక్కసారి వాస్తవ ఘటనల్నీ, కూడ ఆశ్రయిస్తాడు. దృశ్యాన్ని చిత్రించడం, దానిని వ్యాఖ్యానించడం శిఖామణిలో నేను గమనించిన ప్రత్యేకత. శిఖామణి జీవితాన్ని కానగలిగేవి." అన్నారు ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు " ఆయన శిఖామణి కవితలోని చాలా అంశాలు తెలిపారు. నిజమే. ఏదో ఒక పదంతోనో, ఒక వాక్యంతోనో, శిఖామణి కవితని సూత్రాన్వయం చేద్దామంటే అది లొంగదు. జీవితాన్ని, వాస్తవాన్ని చేతనాచేతనలలోని మూలాన్ని, ప్రకృతిని పొదిమి పట్టగలిగిన నైపుణ్యం శిఖామణి కవితలో ఉందనే విషయం నిజం.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

"అచేతన పదార్థాలకు మానవత్వారోపణ చెయ్యటం ద్వారానూ, అనూహ్యమైన సంఘటనలు ఊహించటం ద్వారానూ శిఖామణి కవిత్వాన్ని సృజించగలడు... శిఖామణి కవిత్వంలో చిక్కని అంశాల్నీ, అనుభవాన్ని, కవిత్వీకరించిన పద్ధతుల్నీ ఇంకా సోదాహరణంగా విస్తరించి చెప్పవచ్చు" 2 -అని చేకూరి రామారావుగారు అన్నారు. ఆరోపణ చేయడంలోని శిఖామణి కవితాత్మ ఉంది.

ఇంద్రగంటి, చేకూరివారు శిఖామణి కవితల్లో కొన్ని అంశాలను మాత్రమే తెలిపారు. శిఖామణి కవిత్వంలోని ప్రాధాన్యాంశాలను విబద్ధంగా ఆలోచించి వెలికి తీసిన కవి, విమర్శకులు, సౌభాగ్యగారు - సౌభాగ్య శిఖామణి కవిత్వంపై నలభై వ్యాసాలకు పైగానే రాసినా ముప్పైఆరు వ్యాసాలని 'శిఖామణికవిత్వం- తాత్విక సౌందర్యం పేరుతో వెలువరించారు. వ్యాసాల సంఖ్య విస్తృతిలో పరిధి ఎక్కువగా ఉండటం వలన సౌభాగ్య శిఖామణి కవిత్వంలోని ఎన్నో కోణాలను, కవితాంశాలను ఫలితాంశ రూపంగా మాత్రీకరించడంలోను అవకాశం దక్కింది. సౌభాగ్యగారు వ్యక్తీకరించిన అంశాలను కొన్నింటిని, మువ్వల చేతికర్ర కవితాసంపుటికి మాత్రమే పరిమితమైనదని గ్రహించవలసి ఉంది.

"అతని తల్లి కవిత్వంగా అతనిలో ఉంది. శిఖామణి కవిత్వం విధ్వంసనాత్మకం..... గాఢంగా పరిశీలిస్తే బ్లాక్ హెల్ లాంటివాడు....... మానవ జీవన క్రియను శుద్ధిచేసే కవిత్వం.... మార్మిక మహామాత్రికుడు అంతఃప్రపంచాల ఆదిమస్పర్శ. శిఖామణి తెచ్చే పోలికల్లో సమగ్రత వుంటుంది. సంపూర్ణమయిన అనుభూతిని సహజంగా అందించడానికి అతని ఉపమానాలు సహకరిస్తాయి...... పచ్చదనాన్ని నిలుపుకున్న మట్టిమనిషి..... శిఖామణి మార్మికుడు. మార్మికుల మనఃప్రపంచాలు మనకందవు. ఎక్కడో కొన్ని గుర్తులు వదిలిపెడతారు. దిక్కులేనివాళ్ళ రోదనలు, ఎక్కిళ్ళే అతని కవితలన్నీ. అతని ఏకాంతం అతనికొక విలక్షణమయిన దృష్టి నిచ్చింది. తన చుట్టూవున్న పేదల, ధీనుల నిట్టూర్పుల్ని నిలువెత్తు చిత్రాలుగా చిత్రించాడు. పెద్దపెద్ద సామాజిక వర్గాలనుంచి వచ్చిన కవులెవరూ తేరిపార చూడలేనంత ఎత్తు ఎదిగాడు. "అని సౌభాగ్యగారు చాలా వివరణాత్మకంగా, విస్తృత పరిధిలో శిఖామణి కవితని అంచనా వేయడానికి ప్రయత్నించి సఫలీకృతులయ్యారు

సౌభాగ్య అభిప్రాయంలో మనవిగా చెప్పుకునే మాటల్లో శిఖామణి కవిత్వం. అతని తల్లినుంచి, ఆయన జీవితం నుంచి వచ్చిందని, పోలికలు, జీవనగమనాలు సహజంగా ఉంటాయని, అనుభూతి మానవతావాదం, మార్మికతలతో ధీనజనుల పక్షాన్నే ఉంటుందని, అతని కవిత్వం చదివితే దానిలో ఐక్యమైపోవడం ఖాయం అని చెప్పినట్లు గుర్తించాలని సౌభాగ్యగారు చెప్పారు.

ఈ అంశాలన్ని కూడ స్థూలంగా గుర్తించటానికే గాని, శిఖామణి కవితలో ఏ కవితా ఏ ఒక్క అంశానికో నిబంధించబడి ఉండదు. ఒక్కొక్క కవితలో అనేకాంశాలు నిబిడీకృతమై వుంటాయి.

**ఆధార గ్రంధాలు**

1. శిఖామణి మువ్వల చేతి కర్ర
2. సుదర్శనం ఆర్ఎస్ సాహిత్య నేపథ్యం
3. సోమ సుందర్ ఆవంత్స, శరచ్చంద్రిక
4. సౌభాగ్య , శిఖామణి కవిత్వం -తాత్విక సౌందర్యం

# బసవరాజు అప్పారావు గారి గేయాల్లో ఆత్మసమర్పణ భావం

**డా॥ మోగంటి సుధామయి**
తెలుగు అధ్యాపకురాలు (రిసెర్చ్ సూపర్వైజర్)
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతానగరం
ఫో: 9492149532
msudhamayitelugu@gmail.com

**స్థూల పరిచయం:** ఆధునిక తెలుగు కవితాధోరణుల్లో భావకవిత్వం ఒకటి. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో తెలుగు సాహిత్యంలో ప్రబంధ కవితా ధోరణిపై తిరుగుబాటుగా ఇది వచ్చింది. 1910 నుండి 1940 వరకు తన ప్రస్థానాన్ని కొనసాగించిన భావకవిత్వం ఆంగ్ల రొమాంటిక్ పొయెట్రీ ప్రభావంతో మొదలైందని చెప్పవచ్చు. రజిత రంజనిలో పేర్కొనబడినట్లు "కల్పన ప్రధానమైన ప్రేరణగా కలిగి వ్యక్తిగతమైన స్పందన అనుభూతులు వాస్తవికతను కాల్పనిక వాస్తవికతగా మార్చిన సృజనాత్మక రచనా సముదాయమే కాల్పనిక సాహిత్యం". భావకవిత్వం ఐరోపాలో కాల్పనిక వాదంగా, ఫ్రాన్సులో స్వేచ్ఛావాదంగా, ఇంగ్లాడులో సౌందర్యవాదంగా ఉపయోగించారు.

"ఆంగ్ల సాహిత్య చరిత్రలో ఈ కాల్పనికోద్యమం 18వ శతాబ్దంలో మొదలైంది. రూసోను పాశ్చాత్యులు "కాల్పనికోద్యమ పితగా" పేర్కొంటారు. రూసో ప్రతిపాదించిన "స్వాభావికతాపునరుద్ధరణవాదం" వర్డ్స్ వర్త్, షెల్లీ, బైరన్, కోట్సు, కోలరిడ్జి, స్కాట్, మొదలైన ఆంగ్ల కవులు మీద ఎంతో ప్రభావాన్ని చూపించింది.

ఆంగ్లసాహిత్యంలో సంప్రదాయ కవిత్వంపై తిరుగుబాటుగా రోమాంటిక్ ఉద్యమం ఆరంభమైనట్లుగా, ఆంధ్ర సాహిత్యచరిత్రలో పూర్వ బంధ, చిత్ర కవిత్వాలకు వ్యతిరేకంగా మొగ్గతొడిగిందే నవ్య సాహిత్యోద్యమం. మేధావివర్గం వ్యక్తి చైతన్యాన్ని సమాజపరంగావించేదుకు నడుం కట్టింది. దానికితోడు దేశం వ్యావసాయికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి సాధించి ఆర్థికవ్యవస్థ పటిష్టమైంది. ఆంగ్ల విద్యా విధానంతో ప్రజల ఆలోచనల్లో హేతువాదం చోటుచేసుకుంది. పాశ్చాత్య వాఙ్మయ పరిచయం వల్ల ఎన్నో నూతన సాహిత్య ప్రక్రియలు, ఛందోరీతులు ప్రచారంలోకి వచ్చాయి. దేశభాషలకు నిఘంటువులు, వ్యాకరణాలు వచ్చాయి. అందుకే 19వ శతాబ్దిని "రానున్న మహోదయానికి వైతాళికగీతులు పాడిన ఉషః కాలం"గా విమర్శకులు పేర్కొన్నారు. జాతీయ పునురుజ్జీవన వికాసం మొదటగా బెంగాల్ లో ప్రారంభమైంది. మైకేల్ మదుసూదనదత్, బకించంద్ర

వంటివారు నూతన సాహిత్య ప్రక్రియలన్నీ అనువాద రూపాలలో ఆంధ్రదేశంలో అడుగుపెట్టాయి. బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను కందుకూరి, రఘుపతి వెంకటరత్నంనాయుడు గార్లు ఆంధ్రదేశంలో ప్రచారం చేశారు. సంఘసంస్కరణకు సాహిత్యాయుధాన్ని ప్రయోగించి కందుకూరి వీరేశలింగం పంతులు గారు, వ్యావహారిక భాషోద్యమ సమరభేరితో గిడుగు రామమూర్తి పంతులుగారు ఆధునిక తెలుగుసాహిత్యానికి కొత్తదారులు తీసారు. యువకవుల హృదయాలు స్పందించి భావగీతాలుగా, కదంతొక్కాయి. వస్తువు, భాష, భావం, ఛందస్సు, శైలి ఇత్యాది విషయాలలో నూతన మార్గం పట్టి నవ్య కవిత్వావిర్భావానికి దారితీసాయి. ఆ నవ్యసాహిత్య చరిత్రలో ఆంగ్ల కాల్పనికోద్యమ మానసపుత్రికయే "భావకవిత".

మొదటిసారి భావగీతం అనే పదం వాడినవారు రాయప్రోలు సుబ్బారావు గారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి భావగీతం అని తన రచనల్లో ప్రయోగించారు. దీనికే అభినవ కవిత్వం, కాల్పనిక కవిత్వం, గీత కవిత్వం, నవ్య కవిత్వం అని పేర్లు. తెలుగు సాహిత్యంలో మొదటిసారి భావకవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారు వాడారు.

విశ్వనాథ సత్యనారాయణ, కవికొండల వెంకటరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, శ్రీశ్రీ. సి.నా.రె., మొ॥వారంతా భావకవిత్వానికిచ్చిన నిర్వచనాలను పరిశీలిస్తే "కవి యొక్క అస్పష్టమైన ఒక వాంఛ ఒక చిన్న కావ్యంలో ప్రకటింపబడితే" అది భావకవిత్వం.

బసవరాజు అప్పారావు గారి గేయాల్లో ఆత్మసమర్పణ భావం

ఆధునిక తెలుగు కవితాధోరణుల్లో భావకవిత్వం ఒకటి. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో తెలుగు సాహిత్యంలో ప్రబంధ కవితా ధోరణిపై తిరుగుబాటుగా ఇది వచ్చింది. 1910 నుండి 1940 వరకు తన ప్రస్థానాన్ని కొనసాగించిన భావకవిత్వం ఆంగ్ల రొమాంటిక్ పొయెట్రీ ప్రభావంతో మొదలైందని చెప్పవచ్చు. రజిత రంజనిలో పేర్కొనబడినట్లు "కల్పన ప్రధానమైన ప్రేరణగా కలిగి వ్యక్తిగతమైన స్పందన అనుభూతులు వాస్తవికతను కాల్పనిక వాస్తవికతగా మార్చిన సృజనాత్మక రచనా సముదాయమే కాల్పనిక సాహిత్యం". భావకవిత్వం ఐరోపాలో కాల్పనిక వాదంగా, ఫ్రాన్సులో స్వేచ్ఛావాదంగా, ఇంగ్లాడులో సౌందర్యవాదంగా ఉపయోగించారు.

"ఆంగ్ల సాహిత్య చరిత్రలో ఈ కాల్పనికోద్యమం 18వ శతాబ్దంలో మొదలైంది. రూసోను పాశ్చాత్యులు "కాల్పనికోద్యమ పితగా" పేర్కొంటారు. రూసో ప్రతిపాదించిన "స్వాభావికతాపునరుద్ధరణవాదం" వర్డ్స్ వర్త్, షెల్లీ, బైరన్, కోట్సు, కోలరిడ్జి, స్కాట్, మొదలైన ఆంగ్ల కవులు మీద ఎంతో ప్రభావాన్ని చూపించింది.

ఆంగ్లసాహిత్యంలో సంప్రదాయ కవిత్వంపై తిరుగుబాటుగా రోమాంటిక్ ఉద్యమం ఆరంభమైనట్లుగా, ఆంధ్ర సాహిత్యచరిత్రలో పూర్వ బంధ, చిత్ర కవిత్వాలకు వ్యతిరేకంగా మొగ్గతొడిగిందే నవ్య సాహిత్యోద్యమం. మేధావివర్గం వ్యక్తి చైతన్యాన్ని సమాజపరంగావించేదుకు నడుం కట్టింది. దానికితోడు దేశం వ్యావసాయికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి సాధించి ఆర్థికవ్యవస్థ పటిష్టమైంది. ఆంగ్ల విద్యా విధానంతో ప్రజల ఆలోచనల్లో హేతువాదం చోటుచేసుకుంది. పాశ్చాత్య వాఙ్మయ పరిచయం వల్ల ఎన్నో నూతన సాహిత్య ప్రక్రియలు, ఛందోరీతులు ప్రచారంలోకి వచ్చాయి. దేశభాషలకు నిఘంటువులు, వ్యాకరణాలు వచ్చాయి. అందుకే 19వ శతాబ్దిని "రానున్న మహోదయానికి వైతాళికగీతులు పాడిన ఉషః కాలం"గా విమర్శకులు పేర్కొన్నారు. జాతీయ పునురుజ్జీవన వికాసం మొదటగా బెంగాల్ లో ప్రారంభమైంది. మైకేల్ మదుసూదనదత్, బకించంద్ర వంటివారు నూతన సాహిత్య ప్రక్రియలన్నీ అనువాద రూపాలలో ఆంధ్రదేశంలో అడుగుపెట్టాయి. బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను కందుకూరి, రఘుపతి

వెంకటరత్నంనాయుడు గార్లు ఆంధ్రదేశంలో ప్రచారం చేశారు. సంఘసంస్కరణకు సాహిత్యాయుధాన్ని ప్రయోగించి కందుకూరి వీరేశలింగం పంతులు గారు, వ్యావహారిక భాషోద్యమ సమరభేరితో గిడుగు రామమూర్తి పంతులుగారు ఆధునిక తెలుగుసాహిత్యానికి కొత్తదారులు తీసారు. యువకవుల హృదయాలు స్పందించి భావగీతాలుగా, కదంతొక్కాయి. వస్తువు, భాష, భావం, ఛందస్సు, శైలి ఇత్యాది విషయాలలో నూతన మార్గం పట్టి నవ్య కవిత్వావిర్భావానికి దారితీసాయి. ఆ నవ్యసాహిత్య చరిత్రలో ఆంగ్ల కాల్పనికోద్యమ మానసపుత్రికయే "భావకవిత".

మొదటిసారి భావగీతం అనే పదం వాడినవారు రాయప్రోలు సుబ్బారావు గారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి భావగీతం అని తన రచనల్లో ప్రయోగించారు. దీనికే అభినవ కవిత్వం, కాల్పనిక కవిత్వం, గీత కవిత్వం, నవ్య కవిత్వం అని పేర్లు. తెలుగు సాహిత్యంలో మొదటిసారి భావకవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారు వాడారు.

విశ్వనాథ సత్యనారాయణ, కవికొండల వెంకటరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, శ్రీశ్రీ, సి.నా.రె., మొ॥వారంతా భావకవిత్వానికిచ్చిన నిర్వచనాలను పరిశీలిస్తే "కవి యొక్క అస్పష్టమైన ఒక వాంఛ ఒక చిన్న కావ్యంలో ప్రకటింపబడితే" అది భావకవిత్వం.

తెలుగులో ప్రముఖ భావకవులు రాయప్రోలు, గురజాడ, అబ్బూరి, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నాయని, నండూరి, అడవి బాపిరాజు, వెంకట పార్వతీశ్వర కవులు, వేదుల సత్యనారాయణశాస్త్రి, బసవరాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, కొడాలి ఆంజనేయులు, కవికొండల, తలావజ్ఝల, తుమ్మల, చింతాదీక్షితులు, దీపాల పిచ్చయ్యశాస్త్రి, పురిపండా అప్పలస్వామి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బొడ్డు బాపిరాజు, శ్రీరంగం నారాయణబాబు, తిలక్, బాలాంత్రపు, రజనీకాంతరావు, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, చావలి బంగారమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మి, పుట్టపర్తి కనకమ్మ మొ॥వారు.

కొత్తపల్లి వీరభద్రరావుగారు "ఆత్మాశ్రయమే కావ్యవస్తువు అని, అమలిన శృంగారం ప్రధానపాత్ర వహిస్తుందని, అతీంద్రియ వస్తువులకై అమితమైన ఆరాటం" అని భావకవిత్వాన్ని వెల్లడించారు. భావ కవితాలక్షణాలను శివలెంక ప్రకాశరావు గారు వివరించారు. అవి 1) స్వేచ్ఛాప్రియత్వం 2) ఆత్మాశ్రయత్వం 3) మననప్రాధాన్యం 4) సాధన ప్రాధాన్యం 5) ఖండకావ్యత్వం 6) అరాధనాతత్వం 7) మానవతావాదం 8) సంక్షిప్తత, భావకవిత్వం వస్తుస్వరూప స్వభావాలను బట్టి 9రకాలుగా ఉంది. అవి ప్రణయ, ప్రకృతి, ఆధ్యాత్మిక, దేశభక్తి, సంఘసంస్కరణ, మానవతావాద, స్తుతి, స్మృతి, బాలగేయ కవిత్వాలు.

భావకవుల్లో తలమానికమైన బసవరాజు అప్పారావు గారి గేయాల్లో ఆత్మసమర్పణ, భావం ఎలా తీగలు సాగిందో పరిశీలిద్దాం. భావకవి, పత్రికారచయిత బసవరాజు అప్పారావు 1894లో జన్మించారు. తల్లిదండ్రులు వెంకమ్మ, పిచ్చయ్య. విజయవాడలో జన్మించి 1933లో మరణించారు. "బసవరాజు అప్పారావుగీతాలు" పేరుతో ఒక భావకవితాసంపుటిని ప్రచురించినవీరు ఆంధ్రకవిత్వ చరిత్రను కూడా రాసారు.

ముందుగా "ప్రేమతత్వము" అనే తన ఒకటవ భావగీతంలో ఎదమెత్తనౌటకై సొదగుందరా అంత/మదిగల అహమ్మంత వదిలి పోవునురా అని చెబుతూ వలపెరుంగక బ్రతికి కులికి మురిసేకన్న / వలచి విఫలమ్మొంది విలపింపమేలురా అని, వలపు తీగెను జీవఫలముకాయునురా అని, ప్రేమించు సుఖముకై, ప్రేమించు ముక్తికై, ప్రేమకైయేమింకవలయురా" అని సహజమైన ప్రేమతత్వాన్ని వెలయించారు.

"నల్లవాడే గొల్లపిల్లవాడే, దాచుకొన్న వలపు దోచుకున్నాడే/ నాదు మది తనరూపు పాదుకొలిపాడే" అని కన్నయ్యను తన ఎదలో ప్రతిష్ఠించుకున్నారు. ఈ గీతం సినిమాల్లో ప్రసిద్ధిగాంచింది. రాధికాగీతంలో "నా జీవితేశుండు, నాడు వలపులఖేడు, ఆనందమయమైన ఆ ప్రేమరాజ్యమ్ము" అని ఉప్పొంగిపోయారు. వతపత్రశాయి అనే గీతంలో "ఒంటిగా

ఉయ్యాలలూగితివా నాముద్దు కృష్ణా / జంటగా నను పిల్వదగదోయీ" అని అడుగుతారు. విరహం అనే గీతంలో "బాల భానునిలా నీవ వచ్చి నన్నలరింపు కృష్ణా" అని అలంకార సమన్వితంగా కీర్తిస్తారు. గోపికాగీతాలులో "నీ సిగలోదొకటి నెమలికన్ను నీరా" అని అడుగుతారు. "రావాలంటే త్రోవేలేదా దేవదేవుడా నా నాధునకూ? తారలదారుల్లో, పూవుల దారుల్లో ప్రేమద్వారాల్లోంచి రాలేడా?" అని ప్రశ్నిస్తారు. "తగనా" అనే గీతంలో "దాసిగా నుండకైన తగనా? ప్రాణేశ దేవదాసిగానుంటకైన తగనా? పాదమ్ములు నొచ్చినంత పట్టుటకైనను తగనా? తలపై నీ పాదధూళి దాల్చుటకైనను తగనా? వదనమ్మును గాంచి భక్తి ప్రణమిల్లుటకుంతగనా? అని తన హృదయాన్ని ప్రేమసుధాపూరం చేస్తారు. రాగిణి అనే గీతంలో " వలచి వలచి దేవ నిన్నె వంతలన్ని మరచిపోతి" అంటారు. అంటే దైవాన్ని ప్రేమించడం వల్ల తన బాధలన్నీ మరచిపోయారట. పాడుసిగ్గు అనే గీతంలో "భావవీధిలో తనను కోరివచ్చిన దేవునిసైతం సిగ్గు వల్ల చూడలేక పోయానంటారు. "వలపంతా నా మీదే నిలిపిన ఆ దేవాధిదేవుని మోసం చేస్తే తన దోషాలన్నీ బయటపడతాయంటారు. విరహిణి అనే గీతంలో "దాసి వంటి తన దగ్గరకు వచ్చి తన ప్రేమను మన్నించమని అడుగుతారు. తనను ప్రేయసిగా భావించి "ప్రాణేశా! ఎవరు సంతోషింప నీ అలంకారంబు, ఎవరు మెచ్చుకొన నీ సొమ్ములెల్ల? అని ప్రశ్నిస్తారు. ప్రేమమాయ అనే మరొక గీతంలో "వంగెడు బంగారు వరిపైరు వోలె, అదృశ్యమై వచ్చు ఆతనిశక్తి వార్ధినుండి ప్రచండవాయువువోలె" కారణము నెరుగకయె మ్రొక్కెదను" అని ప్రకటిస్తారు.

"పూలను కదిపే చల్లగాలి లాగా, విశ్రాంతి లేక వేదన స్రుక్కు మదిలో మాధవా! నీదు గుమ్మము జేరువరకు ఈ జీవయాత్ర సాగిస్తాను" అంటారు. "సకల సంపదలైన స్వారాజ్యమై నా చిన్ని కృష్ణునికన్న ఎక్కువౌనే?" అంటారు. "రెండు హృదయాలు ప్రేమలో ఏకమైనట్లు శ్రుతిలోన వేణువు లీనమయ్యె, విశ్వమెల్లను నిండిన ప్రేమరాగమట్లు నీరాగమెల్లరునావహించె" అని తన్మయత్వాన్ని పొందుతాడు.

కవి బసవరాజు అప్పారావు గారు ఎంతో ఆశావాది కాలచక్రం గడిచాక తన అమృత తుల్యమైన, జీవిత భారంతో వంగిన తన గీతాలు విని రాధలాంటి తన ప్రేమ అగాధమైనదని జనులు గ్రహించి శ్రీకృష్ణుడెవరు అని అడుగుతారని ఆశావాదాన్ని వ్యక్తం చేస్తున్నారు. "ఏదికావలెనే" అని గీతంలో "ఇది సంపెంగ పూవిది మల్లెపూవు ఏది కావలెనే చెలియా? అంటూ ఇది కృష్ణప్రేమ, ఇది మిత్రప్రణయమేది కావలెనే" అని మననే భక్తిపారవశ్యంతో ప్రశ్నిస్తున్నాడు. "వాక్యం రసాత్మకం కావ్యం" అనే విశ్వనాథుని వాక్యాన్ని నిజం చేస్తున్నట్లు "ఆ మాట యీ మాట అర్థాంతరములోన వాక్యమైనట్లు మన మైక్యమౌదామే" అని భగవంతునికి, భక్తునికి ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలిపారు.

అవస్థాభేదం అనే గీతంలో కవి భావన మిన్నులుముట్టింది. "లేమావిళ్ళు తినే కోకిలకు లేకి తిండి ఎందుకు? హరిణికి ముండ్ల డొంకలెందుకు? గంగలో తిరిగే హంసకు ముఱికిచెరువెందుకు? ఇంగిత మెరిగిన మనమా నీకే యెంగిలి యోచన యెట్టిదే? అని మనసుని ప్రక్షాళనం చేయమన్నారు.

జీవయాత్ర అనే గేయంలో "మానవజీవితపు అల్పత్వాన్ని కళ్ళకు కట్టించారు." ఇల్లలకగానే పండుగా? ఈ మహాసముద్రంలో ఎన్ని తీరాలు చేరాలో, నావికుడు కూడాలేడు, చుక్కాని నీవె చేతపూని నెగ్గింపుమీయాత్ర" అని అంతర్యామిని వేడుకున్నారు. పాటకుడు గేయంలో కవి అప్పారావు భక్తి అతిశయించింది. "వీణచేజారిపడతూఉంది, శ్రుతి కుదరడంలేదు, గొంతుబొంగురు పోయేలా ఎంత పాడినా నీవు కన్పించటం లేదు. హాయిలో, పరవశత్వంలో మునిగి భక్తుని మరచిపోయావా? నీ దివ్య దర్శనమెపుడు నాకు ఇస్తావు? అని ఆర్తితో అడుగుతారు. బిచ్చగాడు కవిత దయార్ధ్రంగా ఉంది. " అన్ని ఆశలు వ్యర్థమయ్యాయి, నీవు తప్ప నాకింకదిక్కెవరు లేరు. నీ దయారూపం కరుణతో చూపించు" అని వేడుకున్నారు.

గొంతెమ కోరికలు అనే గేయం "కర్మలచేత ఈశ్వర రూపాన్ని చూడగలవా ఛాందసోత్తమా? అని ప్రశ్నిస్తుంది. శ్రీకృష్ణుని పదసీమ శోభించు పుజాసుమములను పూయించరాదా? ఆకాశసుమాలేల? అని అర్థిస్తారు కవి. లజ్జ అనే గేయంలో "మాటలైన తిన్నగరావే, ననుపాటపాడుమందువేమి దేవా? మేటి గాయకుడవగు నీ కడనే పాటపాడుటేమి సొంపుపదముల కూర్చె యెఱుగని నేనెటు పాటల నల్లంగలనో దేవా? అని రవీంద్రనాథ్ టాగూర్ గీతాంజలిలో వలె ఆర్తిగా అడుగుతారు.

కవికి గల ప్రకృతి పరిశీలన చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. మనస్సాక్షిగేయం "పడగ ముడుచుకొన్న పామును, శాంతంగా ఉన్న సముద్రాన్ని, నిద్దురపోయే సింహాన్ని, నిశ్శబ్దంగా ఉన్న రాత్రిని వర్ణించి మరణమనే ఆలోచన మానవునిలో సంతోష లతలను మోడు వారుస్తుంది. అని, తనకు పరమాత్మే దిక్కని దీనంగా వేడుకుంటారు.

'నివృతయాదార్ద్యం' అనే గేయంలో ప్రకృతి అణువణువులోనూ పరమేశ్వరుడు నిండి ఉన్నాడని నిండు హృదయంతో ప్రకటిస్తాడు. నీటి బిందువులో సూర్యబింబం మెరుస్తుందని, నిప్పురవ్వలో ప్రళయమూర్తి నిటలాగ్ని ఉందని, నిశ్చలభక్తితో కొలిచే భక్తుల హృదయపీఠాలలో పరమాత్మ తప్పక ఉంటాడని గాఢంగా నమ్ముతాడు కవి.

కవికి ఎన్నో సందేహాలు వస్తాయి. " చిలుకలు కొరికిన పండొకటి నా చేతుల్లో పడింది. అది తీయనిదో? విషముదో ఎలా తెలుస్తుంది? తోవలో ఒక పువ్వు దొరికింది, ఆ పూవు కమ్మనిదా? తలనొప్పి తెచ్చిపెట్టేదా? ఒక రెక్కలు తెగిన పిట్టను తాను ఆదరించానని దాని భారం పరమాత్మదేనని విశ్వసిస్తాడు.

బసవరాజు అప్పారావుగారి ఆత్మసమర్పణ భావానికై ఎత్తిన పతాకలు, నిరాలంబ స్థితిలోని పంక్తులు. నట్టనడి సంద్రాన నావలో ఉన్నాను నడినీటిలో ముంచుతావా, నా స్వామి నావవొడ్డంటించుతావా? చీమలూదూరని చిట్టడవిలోన చిక్కుకున్నానోయి దేవా? యేదైన దిక్కొక్కటి చూపించుతావా? ఆది అంతూలేని ఆకాశమధ్యాన అల్లాడుతున్నాను దేవా దయ ఉంచి చల్లగా యిల్లు జేర్చేవా? అని వేదాంతసారాన్ని చిన్నమాటలలో చెప్పారు.

నవజీవనం అనే గేయంలో "వాడిన పూవునకేటికి మరలను పరిమళమొసగెదు దేవా? అని ఎండిన బావిలో తిరిగి ఊటపారిస్తావు? నేల పడుచున్న గాలిపడగను పైకి లేపుతున్నావు? పారబోసుకున్న ప్రణయ పాత్రను పానీయముతో నింపుతున్నావు? ఆశలేని వాడికి ఆవ కూరుస్తున్నావు? అంధకారగర్భనరకంలో ఉన్న వారికి ఆనంద తేజాన్నిచ్చావా? అని ఆశావాద దృక్పథాన్ని స్పష్టం చేశారు.

ముగింపు: కవి హృదయమంతటితో రాసిన ఈ గేయంలో తన ఆత్మను పరమాత్మతో అనుసంధానించే అతి వేలమైన భక్తి వెల్లివిరుస్తుంది. "కాంచితి కాంచితి భగవంతుని నా కన్నులార నేడు కాంత రూపమున కన్నుల బడియెనే" అని పరమాత్మ ఒక స్త్రీ రూపంలో కవికి కన్పడినట్లుగా మనకు చెప్పడం జరిగింది. "పడితీ పిల్లలు కలరా నీకని" అడిగారట కవి. పాపం చేసినప్పటికీ పశ్చాత్తపులైన వారంతా నా పిల్లలే అని భగవంతుడు చెప్పారట. తిరిగి కవి "మెలతా! నీకెవ్వరైన మిత్రులు గలరా? అని అడిగారట, దాన్ని "లోకంలో పవిత్ర ప్రవర్తన కలవారంతా నా మిత్రులే అని" పరమాత్మ చెప్పారట. అతివా! నీ ప్రాణనాథుడెవడని కవి ప్రశ్నిస్తే "ఆడుదాని వలె హృదయము కానుకయర్పించినతడెనా నాథుడని" పరమాత్మ చెప్పారట. దానిని బట్టి కవి స్త్రీవలె తన హృదయాన్ని పరమాత్మకు త్రికరణశుద్ధిగా ఆత్మ సమర్పణ భావంతో, తన కవితామృతంతో, తన జీవిత పరమార్థాన్ని పొందారని స్పష్టమవుతుంది.

**ఆధార గ్రంథాలు:**

1) ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం- ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం
2) బసవరాజు అప్పారావు గీతాలు బసవరాజు అప్పారావు

3) తెలుగు సాహిత్య విమర్శ- ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు
4) 20వ శతాబ్దం తెలుగు కవిత్వం డా॥ కడియాల రామమోహన్రాయ్

# జాషువా కవిత్వం – మానవత్వం

**కె.సురేష్ బాబు**
తెలుగు లెక్చరర్
S.V.K.P & Dr.K.S.Raju Arts & Science College(A)
Penugonda,W.G.Dt - A.P
9492493103
suresh.karni@gmail.com

**స్థూలంశం**"చరిత్రకందని పుటల్లో చరిత్రకారుడు పొంచిచూడలేని గతాల్లో ఓ మానవుడుండేవాడు. అప్పుడు వాడి భావాలకు భాషలేదు. జీవితానికి క్రమంలేదు. ఆ ఆనాగరపు హృదయంలోకి ఆ అజ్ఞానపు జీవితంలోకి పొంచిచూచిన తొలిప్రొద్దు రేఖ కవి. మానవుడి జీవితాన్ని, జీవనాన్ని, జీవితక్రమాన్ని, జీవన గమనాన్ని, ప్రవచించే ప్రవక్త కవి. గాఢ సుషుప్తిలో ఒళ్ళుమరచి నిదరోయే సంఘాన్ని కవితా స్వరంతో జాగృతంచేసే వైతాళికుడు కవి. మనిషి మనిషికీ గుర్తుచేసే మానవత్వపు విలువల్ని నిలబెట్టగలిగే సంస్కర్త కవి. ఆ తొలిప్రొద్దురేఖ జాషువా. ఆ ప్రవక్త జాషువా, ఆ వైతాళికుడు జాషువా, ఆ సంస్కర్త జాషువా" అని కొప్పర్తి వెంకటరమణమూర్తి 'తొలిప్రొద్దురేఖ'లో పేర్కొన్నారు.

"అమృతం ప్రియజన దర్శనమ్" అన్నారు పెద్దలు. ప్రియజనులు కలిసినప్పుడు అమృత పానం గావించినంత ఆనందానుభూతి కలుగుతుందట. మరి మహాకవుల కావ్యపఠనం కూడ అమృత సేవనమే కదా! కవి కనుమరుగైనా ఆతని కావ్యకాంతి సమాజాన్ని సన్మార్గంలోనే నడిపింప జేస్తుంది. అలాంటి కవుల్ని వేళ్ళపై లెక్కించవచ్చు. వారిలో ప్రముఖుడు గుఱ్ఱం జాషువ. కవి వాక్కుకు చావులేదు. కవి నిరతము సుజనుల నాల్కలపై నివసిస్తాడు.

"జాషువ కవిత మానవాళికి మార్గం జూపింది
మానవాళి జాషువా కవితకు పూల బాటవేసింది
రవి వెలుగు నశించదు కవి సందేశం ఆగదు
అందుకు తార్కాణం జాషువ కవితమే"
అని షేక్ యాకూబ్ ఆలీగారన్నారు.

**కవి :** ఈ జగత్తుకు సృష్టికర్త బ్రహ్మ అని మనవారి నమ్మకం. కావ్య జగత్తుకు సృష్టి కర్త కవి. మన ఆలంకారికులు కవికి బ్రహ్మత్వాన్ని ఆపాదించారు. కవి ఇష్టానుసారమే కావ్యమంతా నడుస్తుంది. కనుక బ్రహ్మ వంటి వాడే కవి కూడా. బ్రహ్మ సృష్టిలో షడ్రుచులున్నాయి. కాని కవి సృష్టించిన కావ్యంలో నవరసాలుంటాయి. కవి హృదయాన్ని బట్టే కావ్యం ఉంటుందని ఆనందవర్ధనుడు అనే ఆలంకారికుడు ఈ క్రిందివిధంగా చెప్పాడు.

"అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః
యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే
శృంగారీ చేత్కవిః కావ్యేజాతం రసమయంజగత్
సఏవ వీతరాగశ్చేత నీరసం జాతమేవ తత్"
కాబట్టి జాషువా హృదయాన్ని ఆయన రచనల్లో కాంచగలం.

**మానవత్వం :**

"నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును నవ్వులు చిత్త వృత్తికిం
దివ్వెలు కొన్ని నవ్వ లెటు తేలవు, కొన్ని విష ప్రయుక్తముల్
పువ్వులు వోలె ప్రేమరసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైన లే
నవ్వులు నాకు నిమ్మఘవినాశక, వ్యాధులు సోకవెన్నడున్"
అని 'తొలికోర్కె' ఖండికలో అన్నాడు.

మానవునకు పశు పక్ష్యాదులకున్న ప్రధాన భేదం ఇది. "నరుడు నరుడౌట యెంత దుష్కరము సుమ్మ" అన్నాడు గాలిబ్ (అనువాదం దాశరధి). మానవ ప్రాముఖ్యాన్ని గూర్చి చాటేది మానవతావాదం". అంటే భావపరిణామంలో ఏర్పడ్డ ఒకానొక మార్పు అన్నమాట. ఆదిమ కాలంలో మానవుడు తన్ను గూర్చి తనచుట్టు ఉన్న పరిసరాల్ని గూర్చి ఆలోచించే వాడు కాదు. తన కంటె అతీతమైన శక్తిగా భగవంతుని కల్పించు కొని, తద్వారా స్వర్గ నరకాలు ప్రాప్తిస్తాయనే నమ్మకంతో జీవించేవాడు. దీన్ని ఆటవిక జీవనంగా భావించవచ్చు. క్రమేపి ప్రకృతిని పరిశీలించి, అధ్యయనం చేసి, వైజ్ఞానిక దృక్పథంతో జీవించడం ప్రారంభించాడు. ఇలా అనేకయుగాలు గడిచాక నవీన యుగంలో ఆధునికతకు శ్రీ గుర్తుగా మానవ మేధస్సులో మానవత్వం అనే భావం కలిగింది. దీన్నే మానవతావాదం అనవచ్చు.

మనదేశంలో వర్ణవ్యవస్థ అనాదిగా రాజ్యమేలుతోంది. వేదకాలంలో 'ఆర్యాః స్తే వర్ణికా' అని బ్రాహ్మణ క్షత్రియవైశ్య జాతులే పేర్కొన్నాయి. పురాణ కాలం వచ్చేటప్పటికి గీతలో చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః "అని కృష్ణుడే చెప్పాడు. చివరికి మానవ సాంకర్యం చేత పంచమ కులం కూడా ఏర్పడింది. సారాంశం ఏమిటంటే మానవుల సుఖదుఃఖాలకు మానవుడే కారణమని నమ్మేదే మానవతావాదం. మానవ ప్రాధాన్యాన్ని చాటి చెప్పే మధురమైన కవిత్వం జాషువా రచనల్లో మెండుగా కన్పిస్తుంది. మున్ముందు పరిశీలిద్దాం.

**పూర్వకవులు - జాషువా :** పూర్వకవుల్లో కవిత్వం చెప్పటం అంత తేలిక కాదు. దానికి ఎన్నో సౌకర్యాలుండాలని పెద్దన ఇలా చెప్పాడు. చ||
"నిరుపహతి స్థలంబు, రమణీ ప్రియ దూతిక తెచ్చియిచ్చుక
ప్పుర విడె మాత్మకింపయిన భోజన ము, య్యెలమంచ మొప్పుత
ప్పరయురసజ్ఞులూహ తెలియం గల లేఖక పాఠకోత్తముల్
దొరికిన గాక యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే"
అంతే కాదు రాజులిచ్చే అంభోజాక్షీ చతురంతయాన తురగీభూషాదుల కోసం కవిత్వం రాశారు. ఆనాటి కవులంతా పాత పురాణ వీధుల్లో వెతుక్కుని ఏదో ఒక కథను తీసికొని చిలువలు పలవులుగా అల్లి గొప్ప కవులనిపించుకునేవారు. మరి జాషువాకవిత్వం అలాంటిది కాదు. బాధా దగ్ధ హృదయం నుండి వచ్చింది. "కదిలేది కదిలించేదీ, మారేది మార్పించేది, పాడేది, పాడించేది, పెను నిద్దుర వదిలించేది, మునుముందుకు నడిపించేది, పరిపూర్ణపు బ్రతుకిచ్చేది కావాలోయ్ నవకవనానికి" అన్న శ్రీశ్రీ కవిత్వ నిర్వచనానికి అద్దం పట్టింది జాషువా కవిత్వం.

**జాషువా జీవితం బిరుదులు :** అస్పృశ్యత, దారిద్ర్యాలు వెంట తరుముతున్నా, సాహితీ క్షేత్రంలో కృషీవిదులు కావాలన్న ఆకాంక్షలతో ఆనాటి అననుకూల వాతావరణాన్ని, సానుభూతి కేర్పడిన దుర్భిక్షాన్ని ఎదుర్కొంటూ జాషువా ముందుకు సాగారు. "కృషితో నాస్తి దుర్భిక్షం" నానుడిని యథార్థం చేశారు. అనావృష్టులు, గాలివానలు గతస్మృతులైనాయి. కవితా క్షేత్రంలో పసిడిని పండించారు. ప్రాథమిక ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించిన జాషువా నాటి మూకీ చిత్రాలకు వ్యాఖ్యాతగా ఊరూర తిరిగాడు. వీరేశలింగం, చిలకమర్తుల ఆశీస్సులు పొంది కావ్య జగత్తులో స్థిర పడ్డారు. తిరుపతి వేంకట కవుల ప్రోత్సాహం జాషువాను ముందుకు నడిపించింది.
కవి కోకిల, కవితా విశారద, మధురకవి, మధుర శ్రీనాథ, నవయుగకవిచక్రవర్తి, పద్మభూషణ్, కళాప్రపూర్ణ మొదలైన బిరుదాలతో అలరారారు.
జాషువా మానవత్వానికి నిలువెత్తుసాక్ష్యం ఈ క్రింది పద్యం.

సీ|| తలిదండ్రిలేని బిడ్డల జూచి కన్నీరు
దానంబుచేయు నేత్రములు నావి
జంతుకోటికి గల్గు స్వామి భక్తిని మెచ్చి
తృప్తినందెడు నవ్యదృష్టినాది
సకల కార్మిక సమాజముల జీవిత కథా
నకము లాలించు కర్ణములు నావి
కఠినచిత్తుల దురాగతములు ఖండించి
కనికారమొలికించు కలమునాది
ఆ.వె. దొడ్డ పదవులెక్కి గడ్డిమేసెడువారి
నెత్తి పొడుచు చిత్తవృత్తి నాది
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు
తరుగు లేదు, విశ్వనరుడ నేను"

మరినిజమే కదా!

**మానవతావాద బీజము :**
జాషువా తల్లిదండ్రులు లింగమాంబ, వీరయ్యలు. వీరిది వర్ణాంతర వివాహం. ఆరోజుల్లో వర్ణాంతర వివాహమంటే గొప్ప సాహసమే. ఆ కారణంగా అటుఇటు బంధువులు దూరమయ్యారు. సాటి మానవుల ఆదరాభిమానాలకు నోచుకోలేక పోయారు. వీరి వివాహంలో సంఘ సంస్కరణ, మూఢ విశ్వాసాల నిరసనలు ప్రధాన పాత్రలు. వీరయ్య "గుఱ్ఱము" వారి వంశంలో గొల్లెల కాపరిగా జన్మించాడు. లింగమాంబ హరిజన స్త్రీ. ఈ వివాహం ఆనాడు

సంఘానికి ఎదురీత లాంటిది. ప్రేమించిన యువతి కోసం మరోజన్మ నెత్తడంలోనే వీరయ్య మానవత్వానికిచ్చిన విలువ యిమిడిఉందని ఆర్.ఆర్. సుందరరావు గారు పేర్కొన్నారు.
జాషువా మానవతావాది కావడానికి ఈ సంఘటన ఎంతగానో దోహదపడింది. అస్పృశ్యత, పేదరికం - ఈరెండు నాగురువులన్నాడు జాషువా.
రాజదర్శనంలో –

"నాకవితా వధూటి వదనంబు నెగాదిగా జూచి రూపరే
ఖాకమనీయ వైఖరులు గాంచి భళీ భళి యన్నవాడె మీ
దేకులమన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచి పోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర వచింప సిగ్గగున్"

ఇక్కడ మానసిక వ్యధకు కవి వాడిన పదాలు చివాలున లేచిపోవుట, బాకున క్రుమ్మినట్లగుట అనేవి. మానవతా విలువలు మంటకలిసిపోతున్నా. అయినా జాషువా జంకలేదు. మడమత్రిప్పని ఆంధ్రుడ ననుకొన్నాడు. వెక్కిరించినవారినే ధిక్కరించే కవిత్వం చెప్పాడు. అంతటితో ఆగలేదు

"కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి
పంజరాన కట్టువడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు, విశ్వనరుడ నేను"

అని తన విశ్వమానవ సామ్రాజ్యాన్ని చెప్పాడు.

"కోటానుకోట్ల నరులోక
మేటి జగన్మాతసుతులు మిత్రులని మదిం
చాటింపు యీసువార్తన్
చాటింపుము జీవితంబు సార్థక్యమగున్"

అని ముసాఫర్లు కావ్యం ద్వారా జాషువా సందేశాన్నిచ్చారు. మానవులందరు ఒకే తల్లి బిడ్డల్లాగా, స్నేహితుల్లాగా జీవించాలని, మదిలో ఈ భావాన్ని కల్గి ఉండాలని, మానవతావాద సత్యాన్నే చాటాలని జాషువా తన కవితా విపంచిపై పలికించారు.

**గబ్బిలం - మానవతావాదం :** జాషువా మదిలో కాళిదాసుని మేఘసందేశ భావన ఉండిపోయింది. కానీ జాషువా అంటరానివాడు. అన్ని వస్తువులు అతనికి అందవు. గబ్బిలం జంతు జాతికి, పక్షి జాతికి చెందనిది. అట్లే పంచముడు పసరమునకన్న హీనుడభాగ్యుడు. సమాజంలో వీడు జంతువు కాదు. మనిషికాడు. వీళ్ళిద్దరి పోలిక సరిపోయింది. ఒకే భావాలు కలవాళ్ళు ఒకట్రైనట్లు ఒకే బాధలు కలవాళ్ళు ఒకటవుతారు. అందుకే తన కావ్యానికి గబ్బిలాన్ని ప్రతీకగా గ్రహించాడు. ఇది ఒక గొప్ప మార్పు. కవితావస్తువు అంటే దేవతలు, రాజులు, భూసురులకు సంబంధించిందే ఉండాలని మనవాళ్ళ ఉద్దేశ్యం. అట్టివారికిది చెంపదెబ్బలాంటిది.

పాపమా అరుంధతీ సుతుడు పూరి గుడిసెలో చిన్ని ఆముదపు దీపంతో జీవిస్తున్నాడు. ఆ తరుణంలో ముక్కు మొగమున్న చీకటి ముద్దలాగ తిరుగుచున్న గబ్బిల మొకటి తన గుడిసెలోకి వచ్చింది. దాని రెక్కల గాలికి వాడి దీపం ఆరిపోయింది. ఇక్కడ దళితుడు కూడా ముక్కు మొగమున్న చీకటి ముద్ద వంటివాడే. ఎంత చక్కని ఉపమానం. అలాంటి గబ్బిలాన్ని చూసేసరికి ఆతనిలో కొత్త కొత్త ఆలోచనలు అంకురించాయి. దానితో తన కష్టాలను నివేదించుకున్నాడు. పూజారి లేని వేళ చూసుకొని వీటిని శివుని చెవిలో చెప్పమన్నాడు.

"ఆలయంబున నీవు వ్రేలాడు వేళ
శివుని చెవినీకు గొంత చేరువుగనుండు
మౌని ఖగరాజ్ఞి పూజారి లేని వేళ

వినవింపుము నాదు జీవిత చరిత్ర"

ఇక్కడ పూజారి అంటే పూజ చేసే వాడు కాదు. మనల్ని పూజ చేసుకోనివ్వనివాడని భావం. "దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వద్దా?" అంటారు కదా! జాషువా తన కావ్య నాయకుని దీన గాథ వినాలంటే "నాదు కన్నీటి కథ సమన్వయము సేయ నార్ద్ర హృదయంబు గూడ గొంతవసరంబు" అని ముందే వినవిన్నుకున్నాడు. ఎందుకంటే హృదయంలో ఆర్ధ్రత ఉన్నవాడే కన్నీటి కథను వినగలడు, సమన్వయం చేయగలడు.

దళిత హృదయాన్ని ఏవిధంగా ఆవిష్కరిస్తున్నాడో చూడండి. భరత దేశానికి అరుంధతీ సుతుడు కడగొట్టు బిడ్డడుగా జన్మించాడు. కాబట్టి "కాదేదీ కవితకనర్హం" అన్నట్లు కాదెవరు దోపిడీ కనర్హులు. కాబట్టి వానికి సుతునికి - ఆ అరుంధతీ

"ముప్పు ఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
పిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదములు కందకుండగా
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్"

ఆ అప్పునే యిప్పుడు ప్రభుత్వం తీరుస్తోంది.రిజర్వేషన్ల రూపంలో. కవి వాడియొక్క ఆవశ్యకతను కూడా తెల్పుచున్నాడు ఇలా

"వాని తెక్కల కష్టంబు లేనివాడు
సస్యరమ పండిపులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తి లేదు"

"వాని తల మీదంబులిమిన పంకిలమును
గడిగి కరుణింప లేదయ్యె గగన గంగ
వాని నైవేద్యమున నంటు వడిన నాడు
మూడు మూర్తులకును గూడ గూడు లేదు"

"పామునకు పాలు, చీమకు పంచదార
మేపుకొనుచున్న కర్మ భూమిం జనించు
ప్రాక్తనంబైన ధర్మ దేవతకు గూడ
నులికిపడు జబ్బుగలదు వీడున్న చోట

"వాని నుద్ధరించు భగవంతుడే లేడు
మనుజు డెట్లు వాని(గనికరించు
వాడు జేసికొన్న పాప కారణమేమొ
యింతవరకు వాని కెఱుకలేదు"

"ఆ యభాగ్యుని రక్తంబునాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలి సోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

ఈ విధమైన సమస్యలతో ఉన్న తాను పెండ్లాడి మరల కులం లేని కొడుకును కని, ఈ అఖాతంలోనే తోయలేక బ్రహ్మచర్య దీక్ష బూనినాడు పాపం.

"ముసలి వాడైన బ్రహ్మకు ఁబుట్టినారు
నలువురు కుమారులనుట విన్నాము గాని
పసరమున కన్న హీనుఁడ భాగ్యుఁడైన
యైదవ కులస్థు ఁడెవ్వరమ్మా సవిత్రి"

అని భారతమాతను కవి ప్రశ్నిస్తున్నాడు

అసలు ఈ గబ్బిలం ఒక వింత ప్రాణి. తల క్రిందుగ వ్రేలాడుతుంది. అది దాని నైజం. కాని కవి ఊహ అదికాదు. చూడండి.
"నరుని కష్ట పెట్టి నారాయణుని గొల్చు
ధర్మ శీలురున్న ధరణి మీద
కాలు మోపలేక గబ్బిలమొక్కటే
చరణయుగళి దివికి సాచినడచు"
ధర్మశీలురున్న ధరణి మీద భయమెందుకు అంటే ఎటువంటి ధర్మశీలురో అనేది వ్యంగ్యార్థం.
"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించు గానిదుః
ఖిత మతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరత మేదిని ముప్పది మూడు కోట్ల
దేవత లెగవడ్డ దేశమున భాగ్య విహీనుల క్షుత్తు లాఱునే" అంటాడు.
"నరుడు" అనే శీర్షికలో కోతిపిల్ల తన తల్లి నడుగుతుంది.
"మానవుడందు రెవండత
డీనేలకు వచ్చినట్టు లెఱుగ మతడు వి
జ్ఞానము గల వాడందురు
వానికి మనకుండు నంద్రు బంధుత్వంబున్"
"రూపమెట్టులుండు నేపాటి పొడవరి?
యెట్లునడచుచుండు నేమి గుడుచు
వాని గుణము లేమి? వర్ణింపు మమ్మరో
కనుల జూడనాస గలదు నాకు"
"మృగమాలమగు మనలో గల
సుగుణంబులలోన గొన్ని శూన్యమతనిలో
మృగముల బద్ధములాడవు
భగవంతుని పేర నతడబద్ధము లాడున్"
ఈ విధంగా మానవునిలో వుండవలిసిన మానవత్వాన్ని జాషువా ఆవిష్కరించాడు. జాషువా కవిత్వంలో ఏ పద్యాన్ని గిల్లినా మానవతావాదం చిప్పిల్లుతుంద

## "గోసంగి" దళిత దీర్ఘ కావ్యం - ఒక పరిశీలన

**డా॥ కసుకుర్తి ఈశ్వరమ్మ**
తెలుగు అధ్యాపకురాలు
దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల (అ) నెల్లూరు.
చరవాణి: 82470 52903.

**ఉపోద్ఘాతం:** 'గోసంగి' ఆచార్య ఎండ్లూరి రచించిన దళిత దీర్ఘకవిత. శ్రీకృష్ణదేవరాయల పంచశతాబ్ది ఉత్సవాల సందర్భంగా రచింపబడి నది. సుధాకర్ ప్రస్తావించిన గోసంగి శ్రీకృష్ణదేవరాయల సృష్టి ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలో ప్రవేశించే పాత్ర. విష్ణువుపై తనకు గల అచంచల భక్తి విశ్వాసాల శక్తి వల్ల పంచమ కులానిదైనా?? ఒక బ్రాహ్మణ రాక్షసునికి శాపవిమోచనం కలిగించగ ల స్థాయిని పొందుతుంది. సరిగ్గా ఈ షష్ఠాశ్వాసాన్ని ఆధారంగా చేసుకుని చరిత్రను తవ్వడం మొదలుపెట్టాడు సుధాకర్. ప్ర బంధ యుగ సాహిత్యానికి సంబంధించినంత వరకు పాతాళ ప్రశ్నలు వేస్తున్నారు. కొత్త నూతులు తవ్వలేదు. కానీ 16వ శ తాబ్దపు సాహిత్య బావులు పూడిక తీయడానికి సంకల్పించుకున్నారు. ఈ పూడికతీతలో కులభేతాళాలు కొన్ని పట్టవచ్చు. గోసంగి కవితకు ఆధారభూతమనదగిన ఆముక్తమాల్యదను,

మరి ఇతర ప్రబంధ సాహిత్యాన్ని దళిత దృక్పథం నుంచి వ్యాఖ్యా నించుకొని సరిచేసుకోవాలని కవి సుధాకర్ ఆశిస్తున్నారు.

రాయల యుగము రతనాల యుగమే కాదు ఆకలికి అలమటించిన వారు, తిరిగి తిరిగి అలసిపోయిన దాసరివారు ఉన్నారు. చమురైనతోలు కుబుసంబు ధరించిన అతి బీదవారైన దళిత గోసంగి వారు ఉన్నారు. అయినా రాయల యుగాన్ని గురించి చరిత్రలో అగస్టస్ యుగంతో పోల్చదగింది. రాయలు గొప్ప పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు అని కీర్తిస్తుంది. కా ని సుధాకర్ కృష్ణరాయల యుగము అనగానే చరిత్రకారులు చెప్పిన విశేషాలే కాకుండా, సంఘం ఆనాడున్న కొన్ని వాస్తవ విషయాలను కూడా తన దీర్ఘకవితలో ప్రస్తావించారు. అది స్వర్ణయుగం కాదు. 16వ శతాబ్దం పదహారణాల స్వర్ణయుగం అంటాడు. వివర్ణయుగంలో విధివంచితుడిని అని ప్రకటిస్తున్నారు.

కీర్తి గడించిన రాయల యుగంలోని దళితుల దుస్థితిని అందరి దృష్టికి తెస్తు ఆ యుగపు చివరి వాడయిన వేమనలోని మూఢాచార ఖండనను ప్రశంసించారు. అన్నమయ్యలో కనిపించే పంచముడు, బ్రాహ్మణుడు ఒకటేనన్న తత్వం శ్రీకృష్ణదేవరాయలులో కనిపించక పోవడం ఈకవికి నచ్చలేదు. అందుకే అన్నమయ్య నాకు ప్రాతఃస్మరణీయుడు. నా అంట రానితనంలోని అంటువ్యాధిని గుర్తించాడు అని అన్నమయ్యను కీర్తించారు.

ఈ మొత్తం గోసంగి దీర్ఘకవితలో సుధాకర్ దళితునికి ఆత్మకు ఇంపైన భోజనం, నివాసయోగ్యమైన ఇల్లు, ఏ చెరు వు, బావినీరైనా వాడుకోగల స్వేచ్ఛ, వీటన్నింటిని మించి, సామాజిక గౌరవం, భౌతికదాడులులేని సమాజం, గాయాలులేని చరిత్ర, నిషిద్ధాక్షరాలు లేని వర్ణ కోసం, నలువైపుల స్పృశ్యగీతికలు ఉండాలని కవి తన ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు.

**అంబేద్కర్ దృక్పథం:** ఆధునిక కవిత ఉద్యమాలలో దళిత కవిత్వం ఒకటి. ఆరంభంలో దళిత కవి గాంధీ వాదాన్ని ఆశ్రయించారు. ఉదా|| జాషువా వంటివారు, జ్యోతిరావ్ పూలే నేపథ్యంతో ఉన్న అంబేద్కర్ వాదంతో రచనలు చేసేవారు. సిద్ధాంత దృక్పథం కల వారు. కులనిర్మూలన సమాజావసరం అని కుల మత వర్ణ విధానం అంతా ఆర్ష సాహిత్య సృష్టి, వేదపురాణ ఇతిహాసాలు ప్ర తిపాదిస్తున్నాయి కనుక ఈ భావజాలానికి మూలమైన హిందు గ్రంథాల్లో, ఆలోచనల్లో మార్పు రావాలని సూచించటం, తదా ్వరా వ్యవస్థలో మార్పు రావాలనే కోరిక ఉండటం అంబేద్కర్ తత్వం.

ఎండ్లూరి సుధాకర్ తనలోని చైతన్యానికి, భావజాలానికి అంబేద్కర్ దృక్పథమే దిక్సూచి అని చెప్తున్నారు. అదే దళిత చైతన్యమని, ఆ చైతన్యానికి అక్షరరూపమే 'గోసంగి' కావ్యం అని ఆయన అభిప్రాయం.

ఆంధ్రరాష్ట్రంలో సుమారు 60 దళిత కులాలున్నాయి. అందులో కొన్ని ప్రధాన కులాలు, మరికొన్ని ఉపకులాలు, కొ న్ని ఆశ్రితకులాలు. అందరు ఎప్పుడూ చర్చించే ప్రధాన కులాలు మాల, మాదిగ అనేవి. వీటిలో మాదిగ కులానికి ఉపకులం 'గోసంగి'. ఈ గోసంగిని మొదట గుర్తించినవారు 16వ శతాబ్దికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు. తన ఆముక్తమాల్యద షష్ఠా శ్వాసంలో రాయలు 'గోసంగి'ని మహాత్మా! అని సంబోధించారు. ఆముక్తమాల్యదకు వ్యాఖ్యానం రాసిన వేదం వేంకటకృష్ణ శాస్త్రి గారు దానిని 'మాలదాసరి'గా మార్చేశారు. అప్పట్నుండి ఆ 'గోసంగి' కథ మాలదాసరి కథగానే చెప్పబడుతుంది. ఇకపై చరిత్రలో ఇలా జరుగకూడదనే ఇంగితజ్ఞానమే ఈ దీర్ఘకవిత పుట్టడానికి కారణమైంది. దళితునికి చోటులేని అతి దళి తుని గురించి ఆలోచించిన శ్రీకృష్ణదేవరాయయుగం స్వర్ణయుగం ఎందుకైంది ? ఈ యుగాన్ని ఇన్నేళ్ళు గుర్తుంచుకుని ఉత్స వాలు చేయాల్సిన అవసరం ఏమున్నదని అంబేద్కర్ దృక్పథమనే దిక్సూచితో ఒక దళితునిగా ప్రశ్నించారు.

అంతేకాదు చరిత్రలో మరుగున పడిన మట్టిలో మాణిక్యాల్లాంటి మనుష్యుల చరిత్ర బయటకు రావాలని ఇంకా ఈ సమాజంలో ఓటుహక్కు, కూటిహక్కు, గూటిహక్కు లేని

సంచార జీవులకు సముచిత స్థానం కావాలని, అతి దళిత కులాలకు సమాజంలో, సాహిత్యంలో సముచిత స్థానం కావాలని కవి కోరుకున్నా. రచయితలు, కవులు తమ కలాల్ని, గళాల్ని ఆ దిశ వైపు మళ్లించాలని, పాలకులు వీరిని ప్రోత్సహించి దళితకవిత్వం ఆదరింపబడేలా చూడాలని కవి కాంక్షించారు.

అతి దళిత కులాలైన డక్కలి, గోసంగి వంటి కులాల సాధికారత ఫలించాలనే ఎండ్లూరి సుధాకర్ గారి అక్షర ప్రయ త్నం. గోసంగి ఏళ్ల తరబడి నన్ను వెంటాడుతూనే? ఉన్నాడు. నా గుండె గుడిముందు నిలబడి కన్నీటి పాటలు పాడుతూనే ఉన్నాడు. రాతిగుండె దేవుడిలా నేను కూడా కదలలేక పోయాను. మెదలలేక పోయాను. అంబేద్కర్ ఉన్నాడు. నాగుండె గుడి ముందు నిలబడి గొంతెత్తి కన్నీటి పాటలు పాడుతూనే ఉన్నాడు. నాలో చలనం కలిగించాడు. దళిత జ్వలనం రగిలించాడు" అని తన హృదయంలోని భావాన్ని తెలియజేశాడు. నాకు దేవుడికాళ్లు కడగడం కంటే కూడా గోసంగుల కాళ్లు కడిగి ఈ 5 వ్యం అవ్వడం గొప్పగా ఉంటుంది అని కావ్యానికి 'గోసంగి గోస' అని నామకరణం చేసి గోసంగికే అంకితం చేశాడు.

**గోసంగి రూపురేఖలు:** గోసంగి కవితకు శ్రీకృష్ణదేవరాయలవారి ప్రబంధం 'ఆముక్తమాల్యద' ఆధారభూతం. గోసంగి 'ప్రత్యేక అస్తిత్వం ఉన్న ఒక దళితకులం'. ఈ కులాన్ని మొదట రాయలు గుర్తించాడు. తన ప్రబంధంలో మహాత్మా! అని సంబోధించాడు

రాయలు వర్ణించిన గోసంగి విష్ణుభక్తుడు. పరమ భాగవతోత్తముడు. అతని చరిత్రను రాయలవారు 'మాణిక్యానికి చుట్టిన మసి పాతగుడ్డవలె' ఉన్నాడని అతనిది నిర్మలబుద్ధి, నిశ్చలచిత్తం అని వర్ణించారు. అతడు ఎక్కడా వర్ణధర్మ అతిక్రమ ణకు పాల్పడటం లేదు. చాండాలికను మీటుతూ, రాళ్ళు కరిగిపోయేటట్లు గానం చేస్తూ తాండవమాడే వాడని అముక్తమాల్య దలో వర్ణించాడు.

దళితచేతన కలిగిన కవి ఎండ్లూరి సుధాకర్. అంబేద్కర్ స్ఫూర్తితో 'గోసంగి' దీర్ఘకవితను రచించాడు. అది రాయల కాలం నాటి దళితదాసరి గోసగా అభివర్ణించారు. 16వ శతాబ్దపు ఆ దళిత గోసంగి పాత్రలో లీనమై నాటిరాయల స్వర్ణయు గంలో దళితుని రూపురేఖలు, ప్రవర్తనను తనదైన శైలిలో మన ముందుకు తెస్తున్నాడు.

"పేర్కొనడానికి వీలులేని కులంలో పుట్టినవాణ్ణి
ముట్టుకోవడానికి ఇష్టపడని మురికిజలాన్ని" అని తన స్వాభిమానాన్ని ప్రకటించాడు.
నేనూ మాణిక్యాన్నే
కానీ మసిగుడ్డలో దాచబడ్డాను" అని తన ఆత్మగౌరవాన్ని వ్యక్తం చేశాడు కవి సుధాకర్.

తాను అన్నీ కోల్పోయిన బాధితుణ్ణి అని చెప్తూ, నాకు తోలుచొక్కాలే కానీ, పట్టు వస్త్రాలు లేవనీ చినిగిన కోకలేగానీ చక్కని కోకలు (వస్త్రాలు), నూలు బట్టలు, నీరావి పంచలు లేవు. నా మానం కప్పుకోవడానికి బిళ్లగోచీ ఏమీ లేదంటూ తన దైన్యస్థితిని వర్ణించాడు.

కృష్ణదేవరాయ వైష్ణవ రాజ్యంలో గోసంగి తెల్లవారుఝాము నుంచి మధ్యాహ్నం మండుటెండదాకా చాండాలిక మీటుతూ, శ్రీరంగనాధుని గుడి బయటే నించుంటాడు. గుండెలవిసేలా విష్ణునిసేవలో మంగళకైశికీ రాగానికి ప్రాణం పోసి, గొంతెత్తి సంకీర్తనలు పాడుతుంటాడు. మధ్యమధ్యలో సవర్ణులెదురైతే భయంగా, వినయంగా, విధేయంగా ముడుచుకుని ఒక పక్కకి తొలగిపోతుంటాడు. కడిగిన గర్భాలయ మలిన జలాన్ని శూద్రులు పైనుంచి పోస్తుంటే మోకాళ్లపై అందుకుని తీ ర్థం సేవించి తలకంటుకుంటాడు. ఎవరైనా దయతలచి పిలిచి చద్దిప్రసాదం పడవేస్తే తలవంచుకుని భక్తితో తంబురాతో అ ందుకుంటాడు. "కన్నీళ్లతో ప్రక్షాళన చేసుకుని కళ్లకద్దుకుని తింటాడు" అని సుధాకర్ తన గోసంగి తరపున వారి దీనస్థితిని రాయలవారితో స్వయంగా విన్నవించుకుంటున్నాడు.

రాయలు గోసంగిది' జాత్యుచిత చరిత్ర' అంటే సుధాకర్, రాయలవారి స్వర్ణ యుగమును 'అంటరాని కొండ' అని అది రాయలవారి చరిత్రలో మచ్చ అని వర్ణించారు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

**'దళిత స్త్రీ' సౌందర్యము:** దళిత స్త్రీ, పురుషులు సమానంగా కష్టించే శ్రామికులు. స్వచ్ఛత, ఆత్మాభిమానం వీరి సొత్తు. స్త్రీని దళిత కవులు, రచ యితలు అద్భుతశక్తిగా చూపారు. స్త్రీ గౌరవించే లక్షణం ఉన్న జాతి స్త్రీలోని అనన్య గుణ సంపదను విశేషంగా చూస్తుంది.

ఎండ్లూరి సుధాకర్ తన 'గోసంగి' దీర్ఘకవితలో (స్త్రీని సౌందర్యశాస్త్ర) సింహాసనం మీద కావ్యగౌరవంతో అభిషేకిం చాడు. కావ్యనాయికల కంటే ఎంతో శక్తివంతమైన సమర్థవంతమైన దళితస్త్రీని దళిత కావ్యనాయికగా నిలిపి ఆమె ఆత్మ గౌ రవాన్ని చాటాడు. ఎన్నో వ్యక్తిత్వాల సొగసులను ఆమెలో నిల్చి, దళిత కవితకు చైతన్యం కలిగించాడు. ప్రాచీన సౌందర్య శా స్త్రానికి ప్రత్యామ్నాయంగా దళిత సౌందర్య శాస్త్రాన్ని ప్రతిపాదించాడు.

మా సౌందర్యం శాస్త్రం కాలేకపోయింది
మా గోసంగి స్త్రీలు
గొప్ప అందగత్తెలు కాకపోయినా
తంగెడు పువ్వుల కొమ్మలవంటివారు
మోదుగ పూల రతనాల రెమ్మల వంటివారు
మా మాదిగ స్త్రీల వర్ణం
అరుంధతికి ప్రతిరూపం" అని ఆ స్త్రీల అందచందాలను వర్ణించాడు కవి. దళిత స్త్రీలలో ఒక్క గోసంగి వారినే గాక మిగిలిన దళిత కులస్త్రీలనంతటినీ వర్ణించారు దళితకవులు.
మా మాలెతల పూలతల చూస్తే
పాల పుంతలకు నీలిపులకింతలు?? అని మాలెత సౌందర్యం వర్ణిస్తు......
వారి స్త్రీల అందచందాలే గాక వారు నడవడికలోనూ ఉన్నతులుగా వర్ణించారు.
"నీతిలో మావాళ్లు నిప్పులాంటివాళ్లు
నడతలో కత్తికి పదును పెట్టేవాళ్ళు వారి అందాన్ని 16వ శతాబ్దం ఏ ప్రబంధం పట్టించుకోలేదు అనీ ఆ స్త్రీల పట్ల సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు.
'మా వీధులు వేశ్యా వాటికలు కావు' కూడా తీసుకు వస్తున్నారు రచయిత. మా శీలప్రసక్తిని ఏ శ్రీనాథుని సంతలో కొలుకివ్వలేదు అని శీల ప్రసక్తిని
దళిత స్త్రీల మట్టి వాసనల ఔన్నత్యాన్ని చెప్తూ.....
"పేరుకు పెద్దింటి స్త్రీలేగానీ
మావి మట్టివాసనలు" అంటారు.
అంతేకాదు 'వేశ్యాస్త్రీ' దుస్థితిని కూడా వివరించారు రచయిత.
వేశ్యల దేహాల వెలగట్టి
పడుపు వృత్తులవారి కడుపులు గొట్టి
విజయనగర సైనిక భృత్యులకు
జీతభత్యాలు చెల్లించిన చరిత్ర చూశాను
మా వేశ్యలు వేదాలకంటే పవిత్రులు
పసితనానికి పన్నుకట్టిన పదునైన లవిత్రులు?? అని వేశ్యాస్త్రీల వర్ణన కనిపిస్తుంది. దళిత స్త్రీ అన్నివిధాల దోపిడీకి గురి అయింది. అయినా ఎక్కడా ఆత్మాభిమానంను చంపుకొనలేదు అని ప్రాచీన సమాజంలోని దళిత స్త్రీని వర్ణించారు.
**దళితుల కళా నైపుణ్యం:** గోసంగిలో దళితుని కళానైపుణ్యాలను వర్ణిస్తు...
మా డప్పు విన్నాడా
శివుడు చిందేయాల్సిందే !
మా చెప్పు కొన్నాడా
కుబేరుడు 'పాదాభివందనం చేయాల్సిందే' అంటారు.

దళిత సాహిత్యం దళిత జీవితాన్ని ఎంతటినో ప్రోదిచేసుకుని ఉంది. ఎంతో సంస్కృతి ఉంది. ఎన్నో జానపద అంశా లు ఉన్నాయి. ఎన్నో జానపదకళలు వ్యక్తమయ్యాయి. ఈ కలలతో ముడిపడిన కష్టసుఖాలూ ఉన్నాయి. దళితులలో దరిదాపు 60 కులాలున్నాయి. వీరి జీవనం కళలతో ముడిపడి ఉన్నది. ఒక్కో కులము ఒక్కో కళను ఆరాధించింది. వారి వాద్యాలను బట్టి వారి కులాలకు పేర్లు స్థిరపడినాయి. డప్పు మాదిగలది. ఆటకి, పాటకీ డప్పు, సంతోషానికి, సంబరానికి, చావుకి, పెళ్లికి డప్పు, ఊరేగింపుకు డప్పు, చాటింపుకు డప్పు, పండుగకీ, జాతరకీ డప్పు. డప్పుతో ముడిపడిన అనేక కళలలో దళితు ల ప్రావీణ్య నైపుణ్యాలు స్పష్టంగా కనిపించాయి. నేడు. ఇవి లిఖిత సాహిత్యంలో ప్రతిబింబితమవుతున్నాయి. రాయల స్వర్ణ యుగం కళలకు కాణాచి. సాహిత్యంలో 'గోసంగి'కళకు స్థానమివ్వలేదని బాధను వ్యక్తం చేస్తున్నారు.

అలాగే చెప్పును గురించి వర్ణించారు కవి. ఎద్దు చర్మంతో ముడిపడి ఉన్న మాదిగల మరో వృత్తి చెప్పులు తయారీ. వీరికి చెప్పులంటే గౌరవం. తమవృత్తి అంటే గౌరవం. చెప్పులను తయారుచేసి తీసుకువెళ్లటంలో ఎంతో శ్రద్ధ ఉంది. తమ అద్భుత పనితనాన్ని మాదిగలు సాహిత్యంలో గర్వంగా చాటుకున్నారు.

"మా కిన్నెర మోత విన్నాడా
నారదమహర్షి మహతిని మర్చిపోవాల్సిందే!"

అంటూ ఈ కళలు వారి సంకేతంగా చెప్తున్నారు. వారి సంగీత సౌందర్యాన్ని తెలియ జేస్తున్నారు. డక్కలి కులస్తులు కిన్నెర వాయించటంలో నైపుణ్యం కలవారు. ఏడుమెట్ల కిన్నెరవీణ వీరికి ప్రత్యేకం. యక్షగానాలు చేస్తారు. 'ఢక్క' వారి వాద్యం ప్రాచీన కాలం నుండి సొరకాయ తంబుర మోగించటం ఒక కళగా వారి జీవనాలలో కన్పిస్తుంది. భుజాలు నొప్పులు పుట్టే దాకా తప్పెట్లు వాయించటం విని అశ్వనీ దేవతలు ఆకాశంలో నిలిచి తెల్లారి వారి పాటలు విని పోయేవారని కవి తెలియజే స్తున్నారు.

వారి బోనాలు, యక్షగానాలు మనిషికీ, దేవుడికీ మధ్య ఒక మాధ్యమంగా వర్ణించారు. 'గోసంగి పురాణం'లో ఎన్నో వ్యక్తం అవుతున్నాయి. వారి 'జాజర' పాటలు జాతి మెప్పు పొందిన కళ. 'పంబ' అనేది ఒక వాద్యం. ఈ వాద్యం మోగిస్తూ పాటలు పాడుతారు.

వీరి కళలలో 'చిందు' నాట్యకళకు జాతీయ?? అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. చిందు వీరు తాము ఊర్వశి వంశీక లమని చెప్తారు. చిందుతొక్కుతూ 'గోసంగి' పురాణాన్ని ప్రదర్శిస్తారు. 'గోసంగి' పురాణమే జాంబ పురాణం.

"మాది హిందు నాగరికతకాదు.
చిందు నాగరికత" అని కవి, ఈనాడు అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈ కళ అత్యంత ప్రాచీన భారతీయ కళ అ ని గుర్తు చేస్తున్నారు. 'బైండ్ల' కులస్తులు శుభకార్యాలకు పూజారిత్వాన్ని నిర్వహించే కులం. వీరే బవినీలు. వీరు ప్రాచీన సాహి త్యంలోనూ కనిపిస్తారు. వీరు పెళ్లిళ్లు చేసే పెద్దలు. గోత్రాలు?? మంత్రాలు చదువుతారు. బోనాలు చేయడంలో వీరు గొప్ప వారు. వీరి ప్రావీణ్యం యక్షగానంలోనూ కనిపిస్తుంది.

'గోసంగి' మరియు ఆముక్తమాల్యదలో దాసరి కూడా తన దైవభక్తిని మంగళకైశికీ గానము ద్వారా వ్యక్తము చేసిన ట్లు రాయలు (తన ఆముక్తమాల్యద ప్రబంధము నందు) వర్ణించాడు. తన కైశికీగాన ఫలాన్ని బ్రహ్మరాక్షసునకు దానం చేసి? ? అతడిని శాప విముక్తుడిని చేశాడు. ఎండ్లూరి కూడా తన దీర్ఘకవితలో గోసంగిని.

"చాండాలిక మీటుకుంటూ" మంగళ కైశికీ రాగానికి ప్రాణం పోసి గొంతెత్తి సంకీర్తనలు పాడుకుంటాడు" అని రచించారు.

**ముగింపు:** గోసంగి అతనితోపాటు మిగిలిన అతి దళితులందరూ ఈ కళా నైపుణ్యము కలిగిన వారని వారి విద్యలను వర్ణించా రు. వారి కళలలో ఆహారము?? వైద్యము కూడా వారికి పుట్టుకతో అబ్బిన విద్యలు. కత్తిని ఉపయోగించటము, కొంగవాల్ క త్తిచే ఒక్క వేటుకే

పశువును నరకటం వారి గొప్పతనం. ఈ దళిత సంస్కృతీ వైభవం కేవలం దళిత కులాలకు మాత్రమే చెం దినది కాదు. అది ఈ దేశపు నాగరికతను చాటే ప్రారంభం. ఆ గొప్పదనాన్ని గర్వంగా చాటారు కవి ఎండ్లూరి.

## రాయలసీమ అస్తిత్వదీపం - పెన్నేటి పాట

**డా॥ వంకం భాస్కర్**
**తెలుగు అధ్యాపకులు**
**ఎస్.సి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల**
**ప్రొద్దుటూరు, వైఎస్ఆర్. కడప జిల్లా, చరవాణి : 70130 61523**
**E mail: vankamramaiah@gmail.com**

**స్థూల పరిచయం:** రాయలసీమలో కరవు కాటకాలు విలయతాండవం చేస్తున్న రోజులవి. రెండు తరాల రైతు జీవితానికి సంబంధించిన కరవు గాథ. ఇది మోతుబరి రైతు నారపరెడ్డి జీవితానికి సంబంధించినది. నారపరెడ్డి కొడుకు రంగడి జీవితం చుట్టూ కథ అల్లుకొన్నది. దీనిని గురించి చెప్పాలంటే రాయలసీమ (కరవు సీమ) లోని రైతు జీవిత గాథే ''పెన్నేటి పాట''.

ఈ కథలో నారపరెడ్డిది బాగా బతికిన కుటుంబం. మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. అంతేకాదు దానధర్మాలు చేసి పేరు ప్రఖ్యాతులకు పోయి, అడిగిన వారికి లేదనకుండా చేతనైన సహాయ సహకారాలు చేసేవాడు. చివరకు చితికిపోయిన నారపరెడ్డి దివాలా రెడ్డి అనిపించుకొని, నారప్ప అనిపించుకొని, తీవ్ర అవమానంతో కృంగి,

కృశించిపోసాగాడు. అంతేకాక తన కొడుకు రంగడు దిక్కులేనివాడుగా మిగిలిపోయి, శరీరకష్టం నమ్ముకొని గంతకు తగ్గ బొంతలాంటి గంగమ్మని పెండ్లి చేసుకొని ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా దాంపత్య జీవితాన్ని గడుపుతుంటారు. చేతుల కష్టంతో దారిద్ర్యాన్ని అనుభవిస్తూ నీతి, నిజాయితీగా బతుకుతుంటారు.

రాయలసీమలోని పెన్నానది ఎండి, ఎడారిగా మారిపోవడంతో సీమలోని జనజీవనం అస్తవ్యస్తమయి, మానవ జీవితం ఛిద్రమై, విషాదకరమైన సంఘటనలు చోటు చేసుకోవడం ఇందులోని ప్రధానాంశం.

ఒకప్పుడు రాయలసీమంటే రతనాలను రాశులుగా పోసి అమ్మిన ప్రాంతం. సిరిసంపదలతో తులతూగిన ప్రాంతం, కవులు, కళాకారులకు, గాయకులు, పండితులకు, తత్వవేత్తలకు, హేతువాదులకు నిలయం. రాయలవారు పరిపాలన చేస్తున్న కాలంలో స్వర్ణయుగంగా ప్రసిద్ధిగాంచినది. రాయల కొలువుకూటం భువన విజయ మందిరంలో అష్టదిగ్గజ కవులతో విరాజిల్లింది. బంధాల ప్రబంధాలు, శృంగారరసరాజాలుగా పరిఢవిల్లాయి.

పల్లె జీవితాలు సస్యశ్యామల శోభాయమానంతో త్రాగునీరు, సేద్యపు నీరు, సౌకర్యాలు మెరుగుపడ్డాయి. బాగా అభివృద్ధి చెందింది. ఈ వైభవాల్ని 'పెన్నేటిపాట' కావ్యంలో కవి విద్వాన్ విశ్వం గారు ఈ విధంగా వివరించారు.

"కలమ పాలికల యాలల మేలి పాటల
జుమ్మని మ్రోయు మించుల సితారు
తెనుగు పెద్దన్నల గొనబు పల్కుల, గుబా
ళించిన జాజిమల్లెల గుడారు
జిలుగు జరీబుటా వలువ సింగారింపు
మెలకువ లూర్పునిగ్గుల కొఠారు
తలకు మించిన సత్యముల లోతులను జీల్చు
చునవోవు తెల్వియంచుల కఠారు
కడిది మొనగాని ఎడద చిక్కనకు పేరు
కటిక ఊలను కవ్వించి గజ్జ కట్టి
చిందు ద్రొక్కించు మాయల జిలుగు తేరు
కలదు రాయలసీమ పచ్చల బజారు." ` అంటూ రాయలసీమ గొప్పదనాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు కవిగారు.

ఇక నేటి రాయలసీమ కన్నీటి పాటను కూడా విద్వాన్ విశ్వంగారు ఆవిష్కరించినదే. ఈయన స్వయంగా ఆ కరువు పరిస్థితులను కళ్ళారా చూడడం తన హృదయం కరిగిపోవడం. తన మనస్సులో ఉన్న బాధాకరమైన పరిస్థితులు గుండెను దాటి సమాజ పరిస్థితులను తన పెన్నేటిపాటగా స్పృశించారు. అప్పటివరకు పెన్నానది రైతుల పాలిట మహా వరప్రదాయిని, కాలక్రమంలో కరవుకు నిలయం అయింది. పెన్నానది ఎండిపోయి రైతాంగాన్ని దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది.

"అదే పెన్నా అదే పెన్నా!
    నిదానించి నడు
విదారించు నెదన్, వట్టి
    ఎడారి తమ్ముడు.
ఏదీ? ఏదీ పెన్నా?
    ఏదీ పినాకినీ?
ఇదే పెన్నా! ఇదే పెన్నా!
    ఇదే పినాకిని!

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

ఏదీ నీరు? ఏదీ హోరు?
ఏదీ నీటి జాలు?
ఇదే నీరు! ఇదే హోరు!
ఇదే ఇసుక వాలు!
అదే పెన్న! అదే పెన్న!
నిదానించి నడు!
నిదారించు నెదన్ వట్టి
ఎడారి తమ్ముడు!" అంటూ పెన్నానది ఎండి ఎడారిగా మారిన తీరును వివరించారు. ఇంకా పెన్నానదిలో ఎటు తవ్వినా నీటి జాడ లేదు. ఎటు చూసినా ఇసుక మేటలే దర్శనమిస్తున్నాయి. చిన్న చిన్న వర్షాలకే నురగలు కక్కుతూ పొంగి నింగికెగసే పెన్నానది ఆకలితో ఉన్న మృగంలా దగ్గరకొచ్చే జీవరాశులన్నిటిని మింగేస్తుందని, పెన్నానది స్థితిగతుల్ని హృదయ విదారకంగా వర్ణించాడు. ఇది కర్నాటకలో నందిదుర్గం చెన్నకేశవ కొండల్లో పుట్టి, కర్నాటక మీదుగా బయలుదేరి అనంతపురం జిల్లా హిందూపురంలోకి ప్రవేశించి, పెనుగొండ, ధర్మవరం, కళ్యాణదుర్గం తాలూకాల గుండా గుత్తి, తాడిపత్రి మీదుగా కడపలోకి ప్రవేశించి, కమలాపురం సరిహద్దుగా ప్రవహించి, సిద్ధవటం గుండా నెల్లూరు జిల్లాలో ప్రవేశించి చివరికి ఊటుకూరు సమీపాన బంగాళఖాతంలో కలుస్తున్నది. ఈ పెన్నానది సీమ రైతాంగాన్ని కన్నీరు పెట్టిస్తున్నదని కవి విద్వాన్ విశ్వంగారు తన హృదయం కరిగి కన్నీరై పెన్నేటి పాటగా జాలువారింది.

పెన్నమ్మ నీళ్ళు కమ్మగా తీయగా ఉంటాయనీ దోసిటి నీళ్ళు పుక్కిలిస్తే జన్మ సార్థక మవుతుందనీ, నిష్కల్మషత్వం అబ్బుతుందనీ, రండతనం పోతుందనీ, ఖండితత్వం పెరుగుతుందనీ, తిండి లేకపోయినా, తుండ లేక పండువారినా, నిండు మనసు, నిజాయితీ, పట్టుదల పెంచుతుందని పెన్నానది నీటి మహిమను కవి విద్వాన్ విశ్వంగారు అద్భుతంగా వర్ణించారు.

"పెన్నానది ఎందుకెండిపోయెనో" అంటూ ప్రశ్నించే తత్వం ఈనాటికి జనుల హృదయాలను ఆకట్టుకొంటుందంటే ఆయన హృదయం కరిగిన తీరు సమాజ హితకాంక్షను ఇట్టే అర్థమవుతుంది.

ఇంతమంచి పెన్నతల్లి
ఎందుకెండిపోయెనో?
ఇంత మంది కన్నతల్లి
ఎందుకిట్లు మారెనో?
వంతులతో, చింతలతో
కంతలు పడిపోయెనో
సంతుకోస మేడ్చి ఏడ్చి,
గొంతుకారిపోయెనో. ` అంటూ కవి విద్వాన్ విశ్వంగారు పెన్నానది దుస్థితిని మన కళ్లముందుంచారు. పెన్నాలో పారే ప్రతి నీటిబొట్టులో రైతుల నెత్తుటి చాయలు కలిసి విచారం వ్యక్తం చేస్తున్నాయనీ, యేటి దిన్నలపై నక్కలు తిరుగాడుతున్నాయనీ, వేయారు పీనుగుల అంత్యక్రియలు అక్కడే జరుగుతున్నాయనీ, అలాంటి చోట దేవ, గరుడ, విద్యాధర, కిన్నెర, సిద్ధ, దైవత తరుణీ చరణారుణ పంకేరుహవరరేఖలు ఉండవనీ, కేవలం పెద్దజాతి నక్కలే తిరుగాడతాయని వాపోతారు.

ఇక కథలోకి వస్తే నారపరెడ్డి ఎదిగిన కూతుర్లు ఇద్దరికీ ఎనిమిది రోజుల పెళ్లి చేసేసరికి వేలకు వేలు కదిలిపోయాయి. ఇరువర్గాల వచ్చిన పెండ్లి బండ్లతో ధాన్యలక్ష్మి కదిలిపోయింది. రెడ్డిగారు పెళ్లిళ్లు బాగా చేశారని పొగడ్తలకు నారపరెడ్డి ఇది చాలనుకొన్నాడు.

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

నారపరెడ్డికి నల్గురు భార్యలు. మొదటి ముగ్గురు చనిపోవడంతో నాల్గో భార్యకు కొడుకు పుట్టాడు. ఆయన పేరే రంగడు. ఈయన పుట్టేనాటికి నారపరెడ్డి ముసలివాడయ్యాడు. క్రమంగా నారపరెడ్డి ఆస్తులు తరిగిపోసాగాయి. అప్పులు అంతకంతకు పెరిగిపోయాయి. గాదుల్లో గింజలు నిండుకొని గబ్బిలాలు చేరాయి. లోతైన పాతరల్లో గింజలు అడుగంటాయి. నిండిన ఇనుపపెట్టెలోని పత్రాలు దస్త్రాలు పారిపోయాయి. ఏ కుండలో చూసినా బంగారు నగలు అక్కరకు చెల్లిపోనాయి. పశువులూ, జీవాలు, ఎద్దులు అన్నీ పోయినాయి.

నారపరెడ్డి నారపయ్యాడు. ఊరి మోతుబరి ఉప్పరయ్యాడు. దార్లో ఉన్న పూరికొట్టంలోకి మారాడు. తన వెంట ఉన్నది చిన్న రంగడు ఒక్కడే. కుళ్ళి కుళ్ళి ఏడ్చి, కుక్కిమంచం ఎక్కాడు. మునుపటి చేవ పోయింది. రంగడిచ్చే లోటా
నీళ్ళు తాగి ముసలి రెడ్డి సాగిపోయాడు.

రంగడు తల్లిదండ్రులు లేని వాడయ్యాడు. బంధుమిత్రులు ఎవరూ రంగడిని చేరదీయలేదు. రంగన్నకు తల్లిదండ్రులనుంచి సంక్రమించిందల్లా శరీరం ఒక్కటే. బతకడానికి రంగడు పశువులను సాకాడు. పేడకల్లు తీసాడు. కసువులు దీశాడు. మోతుబరి రైతు కొడుకు పరిస్థితులు వికటించడంతో కూలోడయ్యాడు. ఇరుగు పొరుగు ఇళ్ళల్లో గంజి ఎత్తిపోసి, కసువు ఊడ్చి, కొర్రలు దంచి, రాగులు విసిరి పిల్లలను ఊపి, పక్కలు వేసి, అరవ చాకిరీ చేసిన వైనం కళ్లు చమర్చేలా ఉన్నాయి.

అంతేకాదు, రంగడు కటిక కారం సంగటి మింగుడు పడకపోతే బిందుల నీళ్లు తాగాడనీ, ఎండు రొట్టెముక్కలు తిని అరగించుకోవడానికి మిరప గింజలు నమిలి మింగాడనీ, ఏమీ దొరకనపుడు దోసెడు గవినీళ్లు తాగి ముడుచుకొని పడుకున్నాడనీ, వాడు పడ్డ బాధలు అన్నీ ఇన్నీ కావనీ, వాడి బతుకు వల్లకాడేననీ వాపోతారు.

**రంగడి దాంపత్య జీవితం ` కష్టానురాగాల సంగమం**

పెన్నేటి పాటలోని రంగడు, గంగమ్మల దాంపత్య జీవితం ప్రధానంగా చిత్రీకరించడం జరిగింది. రంగడు పనికి పోయి ఇంటికి వస్తే గంగమ్మ ఎదురెళ్లి ముంతతో నీళ్ళిచ్చేది. రంగడు గబగబా పారకడగా వేసి నీళ్లతో చేతులు, మొగము, ఎదురొమ్ము కడుక్కొనేవాడు. లోపల కుండలోని సంగటినంతా గోకి పెట్టి సంగటి మునిగేట్టు మజ్జిగ పోసి, ఒక పచ్చిమిరపకాయ ఇచ్చేది.

ఇక గంగమ్మ రంగడి కన్నా పదహారేండ్ల (16 సం॥) చిన్నది. ఆమెకు పైట వేసుకోవడమే రాదు. ఆమె సింగారపు బొమ్మ. రంగడి బతుకులో జాతిరత్నం. చక్కని కంఠం, అందచందాలు అన్నీ పుట్టుకతోనే పుణికిపుచ్చుకున్నాయి. కళ్లు జింక కళ్లు, పక్షిలాంటి చురుకుదనంతో అందచందాలు వెలిగిపోతున్నాయి.

గంగమ్మ తాను వేసుకొన్న వెండి కడియాలే సొబగును చేకూర్చుతున్నాయి. చెవులకుండే బెండుకమ్మలే వయ్యారాలీనుతున్నాయి. ఆమె కొప్పులోని చెండుపూవులే ఆమెకు నిండుతనం ఇస్తున్నాయి. రంగడు, గంగమ్మ ఎన్ని కష్టాలు పడ్డా, ఎన్ని ముప్పుతిప్పలు పడ్డా, నిప్పులా బతకడం వారి గొప్పతనం. గంగమ్మకు తల్లిదండ్రులిద్దరూ లేరు. అక్క, బావ కాడ పెరిగి పెద్దదైంది. బావ చనిపోవడంతో అక్క పడ్డ అష్టకష్టాలు, కడుపుగట్టి కంటినిండా నిద్ర కరువై, చెల్లెల్ని సాకి సంతరించింది. పేదరాలు కాబట్టి వెదికి, వెదికి రంగన్న లాంటి మంచి బుద్ధిమంతుడికి పెళ్లిచేసింది.

పెళ్లి అయిన కొత్తలో ఇద్దరి మధ్య ఎన్ని మోహనరాగాల బంధాలు ఉన్నా, కూటికోసం పని వెతుక్కోవడం తప్పలేదు. రంగడు కడుపుకూటికోసం గడ్డి కొడవలి, తాళ్లు తీసుకొని గడ్డి కోసుకురావడానికి అడవికి బయలుదేరాడు. రంగడొక్కడే కాక ఆ ఊరి జనం అంతా ఆ పూట గడపడం కోసం కొండ, వాగుల్లో వెదికినా బోద గడ్డి కంట పడుటలేదు. చిగురించిన గడ్డిమొక్కలు అసలే కనిపించవు.

పొలం పనులు లేని రోజులలో అడవికి పోయి గడ్డిమోపో, కట్టెలమోపో, ఎండు మొద్దో తెచ్చి అమ్ముతుంటాడు రంగన్న. అపుడు రంగన్న కళ్లు మూడు కుట్లు కోతుకు పోయుంటాయి. కడుపు వీపుకు కరుచుకు పోయుంటాది. వగడు లాగా అతడు వణికిపోతుంటాడు. ఇలా రంగడిని చూసినవారు ఇదేంటని చాలా బాధపడిపోతుంటారు. వారు బ్రతికిన తీరు ఇంతకు మునుపు ఉన్న పరిస్థితులు ఆ ఊరి జనం తలచుకొని, ఇదేమి లోకమని బాధపడుతుంటారు. రంగడిని చూసిన గంగమ్మకు కళ్లలో నీళ్లు సుళ్ళు తిరుగుతాయి.

రంగడు పడ్డ కష్టాలు ఎన్నో లెక్కలేనివి. రంగడికి గాయాలు గంగమ్మ చేతిస్పర్శతో మానిపోయాయనీ, కష్టం వల్ల మానమైపోయిన వంటి తీపులు వడలిపోయాయనీ, ఎపుడూ ఇన్ని బాధలు నీకోసమే పడుతున్నానని రంగడు అనలేదనీ, నీ సుఖం కోసమే నేను బ్రతుకుతున్నాననీ గంగమ్మ పలకడం లేదని వారి మనస్సులో పొరపచ్చాలు ఏమాత్రం కనపడవు. రంగడి అడుగు శబ్దాలు వినపడగానే గంగమ్మ మొగం విచ్చుకున్న పువ్వులా ఉంటుందనీ, అతని మాట రవ్వంత చెవిన పడగానే ఆమె కన్నుల్లో వెలుగులు విరజిమ్ముతాయనీ, అంతేకాక అతన్ని కంటి చూపుతో చూస్తే చాలు ఆమె తనువెల్ల పులకించి పోతుందని, వారి మధ్య ఉన్న ప్రేమానురాగాలను విద్వాన్ విశ్వంగారు చూడముచ్చటగా సహజవర్ణనలతో ఆర్ద్రంగా వివరించారు.

"చివరకు మూడు నాల్గు మాటలే
మూడు వేల ప్రేమ గీతాలు
ఆ వేగ సీమ దాటు
హృదయములె
వంటలాడుకో మొదలువెట్ట
నాల్క నటునిటు
కదిలించు నాథుడెవడు?
చూపులతోనే వలపుల
రూపు దిద్దుకొనుచు
ఆ పడంతి బువ్వబెట్టె
దాపున గూర్చొనుచు" ` అని వారి అన్యోన్యతను విద్వాన్ విశ్వంగారు వివరించారు.

**ఆశ నిరాశలు - బాధలు**

అంబటివారు అటుకులు దంచడానికి పిలవగానే గంగమ్మ కంబం లాంటి రోకలి చేతబట్టుకొని మధ్యాహ్నమే పోయింది. అటుకులు దంచడం అంటే మాటలు కాదు. గుప్పిటలో అగ్గి రేగుతుంది. ఉడికించిన వడ్లు ఒక పెద్ద పెనములో వేసి రోకటితో పిటపిటలాడేటట్లు దంచాలి. నలుగురు ఒకరి తర్వాత మరొకరు అలా పోటులు వేయాలి. అరచేతులు బొబ్బలెక్కిపోతాయి. నిలబడి దంచడం వలన కాళ్లు పీకుతుంటాయి. గుండెలు కూతలు పెడుతుంటాయి. రక్తం రగులు కుంటుంది. ముక్కులు మూసుకుపోయి ఊపిరాడడం కష్టంగా ఉంటుంది. కళ్ళు మంటలెత్తి అరమోడ్పులవుతాయి. రెప్ప వాలితే రోకలి పెఠిల్లు మంటుంది. చేతి రెక్కలు నొప్పులు పెడతాయి. ఇది శరీరకష్టంతో కూడుకున్న పని కావున విద్వాన్ విశ్వంగారు ఇంత వివరంగా వర్ణించారు.

రంగన్న గంగమ్మల బతుకుల్లోని కష్టాలన్నీ బాధల్ని దుఃఖాల్ని, కన్నీళ్లని కడగండ్లని, దైన్యాన్ని, హైన్యాన్ని కళ్ళారా చూసి, పాఠకుల హృదయాలు కరిగేలా కళ్లు చెమ్మగిల్లేలా చిత్రిక పట్టి చూపిన విద్వాన్ విశ్వం ఈ విధంగా వర్ణించారు.

"కండలు గోసి, పాళ్ళిడి
బికారుల జేసి
జనాల నెత్తురుల్ పిండుచు

కుక్క కూడయిన బెట్టన్
పొట్టల గొట్టి
కూళలన్ దిండుల కానబెట్టి
జగతిన్ గరుణార్ద్రత కగ్గిపెట్టు
పాషండుల వల్లకాడు
మనసా!
ఇది మానవ సంఘ మెట్లగున్?
దైవమా! ఉంటివా? చచ్చినావా నీవు?
ధర్మమా? గెంటిరా? నిన్ను ధరణినుంచి?
సంఘమా! తలకెక్కెనా నన్ని నీకు?
హృదయమా! మానవుడు నిన్ బహిష్కరించె''

అంటూ భూమి కంపించేలా కొండలు ద్రొల్లుకొనేలా, మేరుపర్వతం ఎక్కి ఆకాశం అదిరిపడేలా, ఈ లోకాన ఆత్మసాక్షి సచ్చిందంటూ నెత్తి నోరు కొట్టుకోనిండు నన్ను అంటూ హృదయ విదారకంగా...

ఇదే పెన్న! ఇదే పెన్న!
నిదానించి నడు!
విదారించు నెదన్ వట్టి
ఎడారి తమ్ముడా! ` అంటూ పెన్నేటి పాట నిర్వేదంతో ముగింపు పలకడం జరిగింది.

**ఆధార గ్రంథాలు :**

1. విశ్వం, విద్వాన్, (1983) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
2. నారాయణరెడ్డి, సింగిరెడ్డి, (2015), ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయాలు ` ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
3. చంద్రశేఖర్‌రెడ్డి, రాచపాళెం & నారాయణ సింగమననేని ( 1995), అనంత దర్శిని, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

## మానవ జీవన వేదం 'నాగలి కూడా ఆయుధమే' కొమ్మవరపు విల్సన్ రావు

**డా. రేచర్ల శ్రీ లక్ష్మి**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శృంగవరపుకోట
Mobile: 9948841065
Mail ID: Srilaxmi21@gmail.com

**స్థూల పరిచయం:** కవిత్వం ఒక సృజనాత్మక సాహితీ ప్రక్రియ. కవిత్వం ఒక అన్వేషణ, ఒక ముందుచూపు, ఒక దీర్ఘనిట్టూర్పు, నిరాశలో కాంతి రేఖ.ఒక్కోసారి కవిత్వం తీరని వేదన కూడా. అనుభవ వ్యక్తీకరణే కాక అనుభూతి ప్రతిఫలనం కవిత్వం. అస్తవ్యస్తమైన జీవితాల చిత్రాల్ని, చేరాల్సిన అభ్యుదయ తీరాల్ని, జీవన సారాన్ని, తత్వాన్ని, నడయాడే జీవన వేదాన్ని సాక్షాత్కరింప జేస్తుంది కవిత్వం. 'కవిత్వం ఒక తీరని దాహమని' శ్రీశ్రీ చే, 'వడగాడ్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వమని' జాషువా చే, 'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు, నా అక్షరాలు ప్రజా శక్తుల వహించే విజయ ఐరావతాలు' అని తిలక్ చే ఇలా ఎందరో కవులచే కీర్తించబడిన కవిత్వం అక్షర కాంతుల తేజస్సు తో నూతన పథాలకు, శకాలకు దారులు తీస్తూనే ఉంది. ఆ దిశగా వెలుగులీనే కవిత్వ తీరాలకు బాటలు వేసిన కవులనెందరినో తెలుగు సాహిత్యం పొదివి పట్టుకుంది. అటువంటి కవులలో కవిత్వపు వేదనాగ్ని జలపాతాల్లో మునిగి తేలి, కవాతు చేసే సైనికునిలా నిక్షిప్త రాగాల్ని ఆలపించిన ఆధునిక తెలుగు కవి కొమ్మవరపు విల్సన్ రావు గారు విశిష్టులు.

కొమ్మవరపు విల్సన్ రావు గారు మే 10,1960 వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా కాసబాద అనే గ్రామంలో జన్మించారు. కొమ్మవరపుఅక్కమ్మ,అచ్చయ్యలు వీరి తల్లిదండ్రులు. వీరు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పీ.జి పట్టా పొందారు.వృత్తి రీత్యా ఎల్.ఐ.సి లో అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ గా బాధ్యతలు నిర్వర్తించి 2020లో పదవీ విరమణ పొందారు.ప్రస్తుతం హైదరాబాద్ లో నివాసం ఉంటున్నారు.న్యాయ నిర్ణేతవూ నీవే( 2011), తెల్లారితే - (2014), దేవుడు తప్పిపోయాడు(2017) ,నాగలి కూడాఆయుధమే(2023) అను కవితా సంపుటాలు,ప్రేరణ అను వ్యాస సంకలనం( 2023)రచించారు. వీరి కవితలు పలు భాషల్లోకి అనువదించబడ్డాయి. 'A Blossom born of verse- an evolution of Wilson Rao poetry' అను పేర విల్సన్ రావు కవిత్వాన్ని డా. కొంపెల్లి రవిచంద్రన్ ఆంగ్లం లో అనువదించారు. వీరు సి.నా.రె సాహిత్య పురస్కారం, గుర్రం జాషువా సాహితీ పురస్కారం,గిడుగురామమూర్తిపంతులు సాహితీ పురస్కారం,,గోల్డెన్ స్టార్ సాహిత్య పురస్కారం,ఎ.ఎన్.ఆర్ నంది పురస్కారం,ఎన్టీఆర్ జాతీయ సాహిత్య పురస్కారం, జనరంజక కవి ప్రతిభ పురస్కారం వంటి పలు పురస్కారాలు పొందారు .దేవుడు తప్పిపోయాడు కవితా సంపుటానికి 8 జాతీయ రాష్ట్ర స్థాయి పురస్కారాలు పొందారు .ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ అకాడమీ 'జాతీయ భాషా భూషణ' అను బిరుదును ప్రధానం చేసింది.

విల్సన్ రావు గారి రచనలలో ప్రాణప్రదమైన అభివ్యక్తి తొణికిసలాడుతుంది. 'నాగలి కూడా ఆయుధమే ' కవితా సంపుటి ఉత్కృష్టమైన చిత్రవర్ణ జీవన రాగాన్ని ఆలపించింది. ఈ కవితా సంపుటి లోని కవితా రామణీయకత, భావానుశీలనమే ప్రస్తుత నా వ్యాసం. 'నాగలి కూడా ఆయుధమే ' లో 69 కవితలు ఉన్నాయి. ప్రపంచంలోని మనుష్యులందరిని ఏకం చేసే శక్తి ఒక్క కవిత్వానికే ఉందని ఎలుగెత్తి చాటిన ప్రముఖకవి కె. శివారెడ్డి. శివారెడ్డిగారి పై ఉన్న ఆరాధనతో ఈ కవితా సంపుటిని పచ్చని వేపచెట్టు లాంటి వాడని, పసిబిడ్డ నవ్వు లాంటి వాడని, నిత్యం తన ఆలోచనలకు చమురైనవాడని కీర్తిస్తూ శివారెడ్డి కే అంకితమిచ్చారు. శివారెడ్డి గారితో ఉన్న అనుబంధం తో నే ఈ కవితా సంపుటి లోని మొదటి కవితను 'శాస్త్ర' అను పేరు కవిత్వీకరించారు విల్సన్ రావు. "నాలుగు తరాలను ప్రభావితం చేసిన సరికొత్త నిర్వచనాల ప్రతీక " అంటూ శివారెడ్డి పై ఉన్న గౌరవ ప్రపత్తులను చాటాడు.

మట్టి పరిమళానికి, మనిషి జీవనానికి అవినాభావ సంబంధం ఉంది. మట్టి విలువ, మట్టికై బ్రతుకిచ్చే రైతు విలువ తెలిసిన వాడు కాబట్టి విల్సన్ రావు గారు తన కవిత్వంలో ప్రకృతిని ఒడిసి పట్టారు. మేఘమై వర్షించాడు. ఆకలి కేకలకు మెరుపై గర్జించాడు. పంట

పండించేందుకు శ్రమకు ప్రతీకైన నాగలి అవసరం. అయితే ఆయుధంగానూ మారగలదని సూచించారు. నాగలి కూడా ఆయుధమే అనే కవితలో పంట పండించడం కోసం నాగలితో

" నిత్యం మట్టికి మొక్కడమొక
సహజాతం మాకు
..............................
ఆకలి డొక్కలు నింపే
చట్టాలు చేయాల్సిన చట్ట సభలు
............................
నాగలిని నిలువునా చీల్చేస్తున్నప్పుడు
............................
ఇప్పుడు నాగలి ఒంటరి కాదు
నాగలి ఈ దేశపు జీవితం
నాగలి ఉత్పత్తికి జీవం
నాగలే మా సర్వస్వం
ఇప్పుడు నాగలే మా ఆయుధం " (నాగలి కూడా ఆయుధమే -51)

నాగలి దేశపు జీవం ,ఉత్పత్తికి పునాది. సంక్షోభంలో ఉన్న రైతు దుస్థితి, శ్రామిక దృక్పథం, శ్రమైక జీవన సౌందర్యం ,గిట్టుబాటు ధర ఇవ్వకుండా అన్నదాతను నిర్లక్ష్యం చేసిన రోజున నాగలి ఆయుధంగా కూడా మారి భవిష్యత్తును మార్చగలదని కవి స్ఫురింపజేసారు. విల్సన్ రావు గారి కవిత్వంలో అనువణువునా తొంగి చూసే మరో గుణం మానవతావాదం. 'మానవత లేని లోకాన్ని స్తుతింపలేను' అన్న చరబండ రాజులా విల్సన్ రావు కవిత్వంలో అమృతతుల్యమైన పరిమళం దాగుంది. అది గుండెను తడుతుంది.

"కొత్త పాటలు పాడు
మానవత్వం పరిమళించి
విశ్వమంతా విస్తరించే
పచ్చని చెట్టు లాంటి పాటలు పాడు" (ఒక దీనుడి యుద్ధం: 124)

"మనిషికి మనిషికి మధ్య వారధినై
అస్తిత్వానికి ప్రతీకనై
మట్టి కాళ్లతో కదం తొక్కుతూ
నా జాతికి తాత్విక గీతాన్ని
రచించే కలగంటున్నాను" (నల్ల మల్లె మొగ్గల కోసం : 151)

" గుండె దిటువు దించే నీరు పొయ్యాలి
బ్రతుకు ఆక్రమణకు గురికాకుండా
సరిహద్దు కంచె నిర్మించాలి " (ఆశల మొక్క: 122)

20వ శతాబ్దపు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన సిద్ధాంతాలలో మానవతావాదం ఒకటి. వ్యక్తి స్వేచ్ఛను, భావ స్వేచ్ఛను మానవతావాదం ప్రభావితం చేసింది. "వ్యక్తి స్వేచ్ఛను బలపరిచినది, అంధ విశ్వాసాలకు స్వస్తి చెప్పి విజ్ఞాన చక్షుస్సునందించినది మానవతావాదం" (ఆ.క.సం.ప్ర : సినారె -228) అన్నట్లు విల్సన్ రావు గారి కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తే ఆయన జీవితం మీద సాహిత్యం మీద మానవతావాదం ప్రగాఢంగా చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

డెజావు కవితలో

" మానవత్వపు వెర్రి వెతుకులాటలో
నిదుర పోరేదో
కన్నీటి చెమ్మను తుడిచి

నిశ్శబ్దంగా నాలోంచి తప్పుకున్నట్లు
చూపుల చౌరస్తాలో నిలబడి
నాణ్యమైన మనిషితనాన్ని అన్వేషిస్తూ
ఆత్మీయ వియోగపు దుఃఖ భారంతో
కోల్పోయిన శీతల స్పర్శల్ని వెతుక్కుంటున్నట్లు " (డెజావు: 68)

డెజావు ఒక ఫ్రెంచ్ భాషా పదం. దీని అర్థం మిథ్యా పరిచయభావం. ఓ వ్యక్తి ,సంఘటన, స్థలం ఇప్పుడే చూస్తున్నా ఇంతకుముందే దానితో సంబంధం ఉన్నట్లు అనుభూతి చెందడాన్ని డెజావు అంటారు. సాధారణంగా మెదడు గత అనుభవాలను, కొత్త అనుభవాలను వేరువేరుగా గుర్తుంచుకుంటుంది. కొన్నిసార్లు ఈ భావాలు అటు ఇటుగా మారుతాయి. అప్పుడు మెదడు కొత్త అనుభవాన్ని పాత జ్ఞాపకంగా భావిస్తుంది. ఇలా మెదడు సమాచారాన్ని ప్రాసెస్ చేసే విధానమే డెజావు. విల్సన్ రావు గారు నిజమైన మనుషులని, మానవతని ఆశించారు. మానవతను వెతుకులాడే ప్రయత్నం చేశారు. చల్లని చూపు , మంచి మాట అంటారు పెద్దలు. వాటిని మనిషిలోని ఆత్మీయతకు, మానవతకు ప్రతిరూపంగా అన్వేషించారు. డెజావు వంటి శాస్త్రీయతను కవిత్వానికి ఆపాదించి, మనిషిలో మాయమవుతున్న మనిషితనాన్ని అందుకోసం తాను పడే తపనని కనుల ముందుంచారు. వీరి మానవత్వ పరిమళతకి కొన్ని మచ్చు తునకలు

"ఎడతెగని వైరుధ్యాల సంఘర్షణ
పోరాట కెరటాల్ని నెత్తిన మోసుకుంటూ
అనంత ఆకలి యాత్ర..." (ఆకలి యాత్ర: 115)
"నొసటిన అక్షర సూర్యుణ్ణి మోస్తూ
ఆకలి పాట పాడుకుంటున్నాడు
వర్తమానాన్ని ఒంటికి చుట్టుకొని ప్రశ్నించే
గొంతులకు శ్వాసనిస్తాడు "(అతడెవరైతేనేం: 116)

ఒకవైపు ఆకలి యాత్రను, మరోవైపు పేపర్ బాయ్ పడే పొట్టకూటి బాధను, జీవన పోరాటాన్ని హృద్యంగా కవిత్వీకరించారు

స్త్రీ హితైషిణి, పరోపకారిణి. స్త్రీ సృష్టికి ఆధారభూతం. "యత్ర నార్యంతు పూజ్యతే తత్ర రమంతి దేవతా " అని ఆర్యోక్తి. స్త్రీని గౌరవించిన చోట, పూజించినచోట దేవతలు కొలువై ఉంటారు. విల్సన్ రావు గారి హృదయ మార్దవానికి నిదర్శనం అమ్మపై వారికున్న ఆత్మీయత. అమ్మ ప్రేమను గూర్చి అద్భుతంగా కవిత్వీకరించారు.

ఆకాశపు వైశాల్యం ఎంత అని ఒక పిచుకను అడిగాను అంటూ మొదలైన కవిత

" నా ప్రశ్నకు సమాధానం దొరికింది
ఆకాశపు వైశాల్యం అమ్మ ప్రేమంత " (ఆకాశపు వైశాల్యం: 136)

అంటూ కవితను సమాధానంతో ముగిస్తాడు. ఎంతో అద్భుతమైన భావ వ్యక్తీకరణ. అంటే ఆకాశం అంతులేనిది, అమ్మ ప్రేమ కూడా ఎల్లలు లేనిది, అనంతమైనదనే గొప్ప అర్థాన్ని ఎంతో అందంగా అలతి పదాలతో అక్షరీకరించారు.

అమ్మని ఎంత ఆరాధిస్తాడో ఆడపిల్లల్ని, స్త్రీలని అంతే మాతృభావనతో చూస్తాడని కొన్ని కవితలు నిరూపిస్తాయి. ఆడపిల్లల చిట్టితల్లుల రక్షణకై తపించడం విల్సన్ రావు గారి కవితల్లో కనిపిస్తుంది.

" ఏ తరగతికి ఏ బడిలో చేర్పించాలో
ఏ వయసు వాడు ఎలా స్పర్శిస్తాడో
ఎవడి స్పర్శలో ఏమేమి అర్థాలుంటాయో
నా బిడ్డకు అర్థమయ్యేలా చెప్పే
ఉపాధ్యాయుడెవరో వెతకాలిప్పుడు

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

జన సమూహంలో ప్రవహిస్తున్నప్పుడు
ఏ రాక్షస హస్తం నా బిడ్డని ఎలా చిదిమేసిన
బతుకు గింజను రాల్చేస్తుందో
అంతుపట్టక సతమతమవుతున్నాను
. ... ... ...............................
నేనిప్పుడు
నాలాంటి బిడ్డల కోసం
ఇంగిత జ్ఞానం బోధించే
అనేకానేక మహా విశ్వవిద్యాలయాలు నిర్మించాలి " (మహా సంకల్పం: 67)

మరో కవితలో

జాగ్రత్త తల్లి
అప్పుడెప్పుడో పొలాల్లోనూ అడవుల్లోనూ తిరిగే అనకొండలు
ఇప్పుడు మన పక్కనే ముసుగులతో తిరుగుతున్నాయి
అదును చూసి కాలనాగులై కాటేస్తాయేమో
జాగ్రత్త తల్లి
జీవితమంటే ఆటుపోట్ల మయం కదా
నవనవలాడే పసికందులను కూడా చూపులతో కాటేసే
కామాంధులు ఉన్న కాలమిది
పోరాటాల్ని అధిగమిస్తూ ధీరత్వంతో బతకాల్సిన కాలమిది
కలల సాకారం కోసం నిన్ను నువ్వు
దిద్ది తీర్చుకోవాల్సిన కాలమిది (జాగ్రత్త తల్లి ఇది బతకాల్సిన కాలం :85 )

మరోకవితలో

మీరు కాలిడితే చాలు
ఈ ఇల్లు
పచ్చని ఆత్మీయ పరిమళంతో జీవం పోసుకుంటుంది
............. .....
మీ అమ్మ మిమ్మల్ని కంటే
మీరు జీవాక్షరాలు కన్నారు
వాల్మీకి రామాయణం సృష్టిస్తే
మీరు మా జీవన కావ్యానికి ఊపిరి పోశారు (జీతే రహెూ బేటీ 73)

నేటి అభివృద్ధి చెందిన ఆధునిక సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే ప్రధానమైన సమస్య లైంగిక వేధింపులు.యవ్వనం లో ఉన్న ఆడవారినే కాదు పసిపిల్లలను కూడా వదలని ప్రబుద్ధులు ఉన్న లోకంలో బతుకుతున్నాం. ఒవైపు కుటుంబంలోని అసమానతలు ,సమాజంలో ఉన్న ఆంక్షలతోనే రోజు సతమతమయ్యే స్త్రీకి ఈ లైంగిక దాడులు వేధింపులు మరో అదనపు సమస్య. సమాజంలోని వాస్తవికతను అక్షరబద్ధం చేసి స్త్రీ ఆత్మవిశ్వాసంతో ధీరత్వంతో ముందుకు నడవాలని కవి ఆకాంక్షించారు.

2019 వ సంవత్సరంలో కరోనా వ్యాధి ఒక అదృశ్య విధ్వంసంతో మానవ జాతిని అతలాకుతలం చేసింది. చైనాలోని వుహాన్‌లో మొదటిసారిగా గుర్తించబడిన కరోనావైరస్ వల్ల కలిగే వ్యాధికి కరోనావైరస్ వ్యాధి (COVID-19) అని పేరు పెట్టారు - 'CO' అంటే కరోనా, 'VI' అంటే వైరస్ మరియు 'D' అంటే వ్యాధి.కరోనా మానవుల ఆరోగ్యం పై చూపిన దుష్ప్రభావం, రాలిన నిండుప్రాణాలు, మానవ సామాజిక జీవనం తో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ పై చూపిన దుష్ప్రభావాన్ని చూపింది. ఆ సమయంలో మానవుని శారీరక శ్రేయస్సు దృష్ట్యా శాస్త్రీయంగా ఆలోచిస్తూ, శుభ్రత పరిశుభ్రత, భౌతిక దూరం పాటిస్తూ ఆత్మ విశ్వాసం తో

ISSN: 3048-5908 ;Impact Factor: 5.379(SJIF)

ముందు కు వెళ్ళాలని, ఆరోగ్య భద్రత ఆవశ్యకతను తెలియజేస్తూ మానవ సామాజిక సాధారణ జీవనాన్ని ఆకాంక్షిస్తూ ,ఆరోగ్య భారత మే లక్ష్యంగా మానవజాతిలో స్ఫూర్తిని నింపి ,ఆశావాహ దృక్పథాన్ని,చైతన్యాన్ని కలిగించడం ఉద్దేశం గా మనిషి ఒక్కడే అజేయుడు,చంటి దాన్ని చంకనేసుకుని వంటి కవితలు విల్సన్ రావు గారి కలం నుండి జాలువారాయి.
ఇప్పుడు యుద్ధమంటే మానవ మేధస్సుదే అంతిమ విజయమని ప్రకటించడం...(52, 104)

కవి లోకోత్తర వర్ణనా నిపుణుడు ,రవిగాంచనిచో కవిగాంచును అంటారు. కవి శబ్దం బ్రహ్మకు పర్యాయపదంగా వేదమంత్రాల్లో కనిపిస్తుంది. ఋషులకు కూడా కవి శబ్దాన్ని ఉపయోగించారు.కవికి సాహిత్యం పట్ల బరువైన బాధ్యత ఉంటుంది. కవులు లోకానికి ఉదాత్తులై ,ఆదర్శనీయంగా ఉండాల్సింది పోయి పాలకులకు అనుకూల రాతలు రాస్తూ స్వార్థ జీవులుగా ఉండకూడదు. కానీ నేటి సమాజంలో మేధావులైన కవుల మౌనాన్ని విల్సన్ రావు గారు ఖండించిన తీరు ఈ క్రింది కవితలో దర్శనమిస్తుంది

"మూలాల్ని ప్రశ్నించాల్సిన నోళ్లు
ఆలోచనల ప్రవాహాల్ని బందీ చేసి
ఏలికల మచ్చికతో పన్నీటి స్నానం చేస్తున్నాయి
కవులు అంటే కణకణ మండే అగ్ని కణాలు కదా !
కవితో మాట్లాడడం అంటే సూర్యుడుతో మాట్లాడడం కదా (అహాన్ని గెలిచే రోజు కోసం :132 )

కవిగా కవిత్వం పట్ల తన ఆకాంక్షని ఇలా అక్షరీకరించారు.

కవిత్వం నా ఆశ
కవిత్వం నా శ్వాస
కవిత్వం నా అనిర్వచనీయమైన
ఆనంద రహస్యం (ఆనంద రహస్యం: 125)

తన ఆశ ,శ్వాస ,ఆనందం అంతా కవిత్వం రాయడమే అని కవిత్వాన్ని నిర్వచిస్తూ, కవి ప్రవర్తిళ్ళవలసిన తీరుని సూచించారు .

ఈ కవితా సంపుటిలో విల్సన్ రావు గారు ప్రేమించే సిన్సియర్ లవర్ ఒకరు ఉన్నారు. ఆ ప్రేమిక పై రెండు మూడు కవితలు కూడా మనకు కనిపిస్తాయి.

నా ప్రేమమయ జీవిత పుస్తకంలో
మొదటి వాక్యము చివరి వాక్యము అతడే
మాగిన మనిషి లాంటి వాసన వేస్తూ
నా వలపు కోరికలు తీర్చే చలివేంద్రం అతడు( హి ఇస్ మై సిన్సియర్ లవర్: 60)

మాకు మట్టిని ప్రేమించడం నేర్పావు
మనిషిలా నిలబడడం నేర్పావు
నీవు రగిలించిన చైతన్య జ్వాలల్లో
నిత్యం రగులుతూనే ఉన్నాం
నీ వెత్తిన చేతన ధ్వజానికి
శిరస్సు వంచి ప్రణామం చేస్తున్నాం( మట్టి స్వప్నం 69)

ఆ ప్రేమికుడు మరెవరో కాదు స్వయానా వారి తాతగారే. విల్సన్ రావు గారి మట్టి పరిమళ స్వాప్నికతకు, చైతన్యతకు మానవీయత లోతుకు కారణం వారి తాతగారేనని, వారు మాగిన మనిషి వంటి వారని, వయసు మీద పడడాన్ని మాగిన మనిషి అని ప్రయోగించడం అద్భుతమైన భావవ్యక్తీకరణ .కవి ఇటువంటి కొత్త పదాల ప్రయోగం భాష పరిపుష్టికి తోడ్పడుతుంది .

మరో కవితలో రోడ్లు ఊడ్చే కార్మికుడిని ఎంతో అందంగా చిత్రించిన తీరు ఆకట్టుకుంటుంది

"చెమట ముత్యాల్లో మెరిసిపోతున్న
నా పద్యానికి పూచిన పువ్వు అతడు
నాకవిత్వపుగుండెచెమ్మ అతడు"(పద్యానికి పూచిన పువ్వు:52)

అని సువర్ణ సంధ్య కాంతుల్ని అన్ని వీధుల్లో ఎదపెడతాడు ఆకలి పేగులను ముడేసుకుంటూ అంటూ కార్మికుడి శ్రమైక జీవనాన్ని ,,అతని శ్రమలోని సౌందర్యాన్ని ,అతని దీనస్థితిని ,తన కవితకు ఆధారతను అద్భుతంగా చిత్రించారు కవి .

ఇలా ఎన్నో అంశాలని మానవ జీవితంలోని మరెన్నో కోణాలని కవితల రూపంలో వెలువరించి నాగలి కూడా ఆయుధమే కవితా సంపుటాన్ని మానవ జీవన వేదంగా మలిచారు విల్సన్ రావు గారు .

ఉపసంహారం:- కొమ్మవరపు విల్సన్ రావుగారు అక్షరశిల్పి.తన కవిత్వంతో గుండె తడిని అతి సున్నితంగా తడమునూగలడు ,పదునైన భావాలతో మనసులో తీక్షణంగా పెనుగాడనుగలడు ,మానవీయ పరిమళాలని మట్టి వాసనతో మేళవించనూగలడు,అమృతతుల్యమైన ప్రేమ తత్వాన్ని బోధిస్తూనే ఆడపిల్లల జీవన వేదాన్ని సంకల్పించునూగలడు ,శ్రమైక సౌందర్యాన్ని ఆరాధించగలడు, కృషికి ప్రతీక అయిన నాగలిని ఆయుధంగా మలచి సమర శంఖం పూరించనూగలడు .అతని కవిత్వం కాలపు బరువులు మోసే అక్షర నౌక ,చైతన్య దీప్తులను ప్రసరింప చేసే ప్రభాతవీచిక.

ఆధారగ్రంథాలు:

1.ఆధునికాంధ్ర కవిత్వం సాంప్రదాయాలు-ప్రయోగాలు ,డాక్టర్ సి.నారాయణరెడ్డి ,విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్ హైదరాబాద్ :1999
2.కొత్తపాళీ, తాపీ ధర్మారావు ,విశాలాంధ్ర పబ్లిక్ హౌస్ హైదరాబాద్ :జూలై 2012
3.జాషువా సాహిత్యం దృక్పథం -పరిణామం ,ఎండ్లూరి సుధాకర్, శ్రీ రత్నా ప్రింటర్స్ రాజమండ్రి ,2016
4.నాగలి కూడా ఆయుధమే ,కొమ్మవరపు విల్సన్ రావు ,ప్రసన్న ఆఫ్ సెట్ ప్రింటర్స్ బల్కంపేట్ హైదరాబాద్ :2023
5.సాహిత్య వ్యాసాలు ,వి.త్రివేణి, విశ్వ శ్రీ ప్రచురణలు నిజామాబాద్: 2022

# ఉత్తరాంధ్ర వలస కవిత్వ వెతలు

**ఉషారాణి పిల్లి,**
తెలుగు అధ్యాపకురాలు,
ఎస్.వి.డి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నిడదవోలు.

**స్థూల పరిచయం:** తెలుగు సాహిత్యంలో ఎన్నో రకాల ప్రక్రియలు ఉద్భవించాయి. ఒక్కో సాహిత్య ప్రక్రియ ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకుంది. అటువంటి వాటిలో విశిష్టమైనది నిత్య నూతనమైనది కవిత్వం. కవిత్వం పాఠకుల మనసును ఆకట్టుకుంటుంది. కవిత్వం కవి యొక్క రచనా నైపుణ్యాన్ని, వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. తెలుగు సాహిత్యంలో కవితా ప్రక్రియను చేపట్టిన కవులు ఎందరో ఉన్నారు. 'ప్రపంచమొక పద్మవ్యూహం... కవిత్వమొక తీరని దాహం' అని అన్నారు మహాకవి శ్రీశ్రీ. 'వడగాడ్పు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం' అని అన్నారు జాషువా. కవిత్వము నిరంతరమూ ఒక సామాజిక ప్రయోజనాన్ని ఆశించేదై

ఉండాలి. కవిత్వంలో తమకంటూ ప్రత్యేకతను వైవిధ్యాన్ని ప్రదర్శిస్తారు కవులు. కవిత్వం ద్వారా సమాజంలో మార్పు కాంక్షిస్తారు.

కవిత్వం ప్రపంచానికి సంబంధించిన సాధారణ విషయాలను ప్రతిబింబించటమే కాక నిర్దిష్టతను కూడా ప్రతిబింబిస్తుంది. అందులో భాగంగా కవి తన ప్రాంత, కుల, మత, వర్గ సమస్యల్ని ప్రతిబింబిస్తాడు. అందులో భాగంగానే వివిధ అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయి. ఆయా ఆస్తిత్వాల తక్షణ సమస్యలు అసలు కారణం కాగా ఇన్నాళ్లు విస్మృతికి గురైన ఉపశ్రేణిలో చరిత్ర బయటకు రావాల్సి ఉంది. ఈ అస్తిత్వ ఉద్యమాలకు దోహదాన్ని కలుగచేశాయి.

ఆధునిక తెలుగు కవిత వికాసంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. ఉత్తరాంధ్ర ప్రజలు తమ అస్తిత్వాన్ని కాపాకుడుకునే స్థితిలో ఉధృతంగా కవిత్వాన్ని రాస్తున్నారు. తమ కళ్ళ ముందే తమ ప్రాంతం, తమ ప్రజలు విధ్వంసం అవుతుంటే ఆ సందర్భాలు అన్నిటి నుంచి రగిలిన కన్నీటి దుఃఖమే ఈ ఉత్తరాంధ్ర కవిత్వం. తమ చైతన్యాన్ని, తమ స్మృతుల్ని, తమపై జరుగుతున్న దోపిడీని, తమ వారు వలస వెళ్లే విధానాన్ని, తమ పోరాటాన్ని తమ కవిత్వంలో చిత్రిస్తూ తమ అస్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నం ఉత్తరాంధ్ర ప్రాంత కవులు చేస్తున్నారు.

తమకు జరిగే అన్యాయాలను లోకానికి తెలియజేయడానికి, అక్కడ ప్రజల్ని చైతన్యవంతం చేయడానికి ప్రాంత ఆస్తిత్వ చైతన్యం ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోలేదు. కానీ కవిత్వంలో వ్యక్తం అయింది. గురజాడ, రావిశాస్త్రి, కారా, శ్రీశ్రీ, నారాయణ బాబు, పాణిగ్రాహి, వెంపటావు సత్యం, భూషణం, వంగపండు, అప్పలనాయుడు, సిరికి స్వామి నాయుడు మొదలైన వారంతా కూడా ఈ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఉత్తరాంధ్ర పత్రిక అధ్యయన వేదిక వచ్చిన తర్వాత ప్రాంతీయ అస్తిత్వంలో చైతన్య కవిత్వం ఎక్కువగా వచ్చినట్లు కనబడుతుంది, వస్తు విస్తృతి పెరిగింది.

'బురద కుమ్మి బురద
బురికి బురికి నోళ్ళ మాట
మట్టే వాసనే వస్తుంది మరి
నా కవిత పాదాలను ముట్టుకుంటే
వేళ్ళకు మట్టి అంటకుండా ఎలా ఉంటుంది
నా పదాలను పలకరిస్తే
పశువుల్ని పలకరించినట్టు
నా పలుకుల్ని పరామర్శిస్తే
చేరను నాగేటి చాలను పరామర్శించినట్లే'నని కవి తన వ్యవసాయ జీవితాన్ని నెమరు వేసుకుంటూ రాసిన కవితగా కనిపిస్తుంది.

ఉత్తరాంధ్ర ప్రత్యేక సమస్యలు అతివేగంగా వీచే గాలి ఒకటి దానివల్ల నష్టాలు ఈ కింది నల్లి ధర్మారావు కవితల వ్యక్తం అయ్యాయి.

'మొగిలి రేకుల సొగసు మేసి మత్తెక్కిందో
కొబ్బెరకుల ఊసు కొంచమైనా ఎనక మా ఉసురుతీసింది
మాయదారి గాలి నంగనాచి గాలి నాశనాల గాలి
రెండు గడ్డిపరకలు లేకనే కదా దుక్కి తెద్దుల్ని సంతకు తోలింది
బతుకు బండి దారి మళ్లించి వలసకి వెళ్ళొచ్చామా
పురాకులే తప్ప పలక మిగిలింది లేదు' వంటి కవిత్వంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎలా వెనుకబాటుకు గురవుతుందో ఆ ప్రాంత ప్రజలు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఎలా దాపరించిందో వ్యక్తం అయింది.

ఉత్తరాంధ్ర వేదన కథల్లో వ్యక్తమైనంత విస్తృతంగా కవిత్వంలో వ్యక్తం కాలేదనే భావనని తొలగించాలనే దృఢ సంకల్పం నేడు ఉత్తరాంధ్ర కవుల్లో బలంగా ఉంది. పాయల మురళీకృష్ణ, లండ సాంబమూర్తి, బాల సుధాకర్ మౌళి వంటి కవుల కార్ఖానా ఇక్కడ పురుడు పోసుకుంది. రెండు దశాబ్దాలుగా కవిత్వం రాస్తూ, ఇటీవల 'నీటి గింజల పంట' కవితా సంపుటి వెలువరించిన కంచరాన భుజంగరావు కూడా ఈ వరుసలోనే కనిపిస్తారు. ప్రపంచీకరణ ప్రభావంతో ప్రపంచం ఒక కుగ్రామం అయిపోయిందనుకునేవాళ్ళే ఎక్కువగా కనిపిస్తారు. కానీ, సాంకేతిక, భాషా, సంస్కృతి ఆదానాల ప్రభావం వల్ల అన్నీ విధాలుగా గ్రామాలు తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆవేదన చెందేవారు అరుదు. అలాంటి స్వరాలకు ప్రతినిధి కంచరాన భుజంగరావు.

ఈ సంపుటి ప్రారంభ కవిత 'మౌనమే మట్టి రహస్యం.' పూలు, ఆకులు, నీరు అన్నీ తమ గొప్పతనాన్ని చాటుకునేలా ధ్వనుల్ని చేస్తున్నా అన్నింటికీ మూలమైన మట్టి మాత్రం మౌనంగా తన విధిని కొనసాగిస్తూ ఉంటుందంటాడు కవి.

"మట్టి / మౌనంగా ఒదిగిపోయింది
సష్టికి జీవం పోస్తూ....!"

నిశ్శబ్దంగా సృష్టికి జీవం పోస్తున్న మట్టి గొప్పతనాన్ని గమనించేది కర్మసాక్షి అయిన ఆ సూర్యుడు మాత్రమేనంటాడు. జీవుల మనుగడకు, వికాసానికి ప్రాథమికంగా మట్టే అవశ్యకమని 'ఉదాహరణనౌతా' కవితలో.

"జీవనిర్జీవ సంపదల్ని పదిలంగా దాచి ఉంచిన
మట్టి మహాపేటిక రహస్యాలను గాలిస్తాను.
పరిశీలించిన ప్రతి చోటా.... పరిశోధించిన ప్రతిసారీ....
బతుకు భూమిక మట్టేనని గ్రహింపుకొస్తాను
ఏ నాగరికతల వికాస వేదికయినా మన్నేనని
నిరంతరాయంగా ఎలుగెత్తుతాను
తడి స్పర్శకు పులకల మొలకయ్యే తల్లితనానికి
నన్ను నేను ఒక ఉదాహరణగా మలచుకుంటాను."

అంటాడు ఈ కవి.

ఉత్తరాంధ్రలో వేల ఎకరాల మెట్ట, బంజరు భూములే కనిపిస్తాయి. విత్తడానికి చేసిన అప్పుకి, చేతికొచ్చిన పంటకి మధ్య అంతరం సన్నకారు రైతు మెడకి ఉరి బిగిస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తరుగుతున్న వ్యవసాయం, భూములు అమ్మినా తీరని బాధ్యతలు వంటి ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. వీటన్నింటినీ ఈ కవి "నాగలి జెండా పట్టుకొని" కవితలో నిక్షిప్తం చేశాడు.

"బుక్కెడు బువ్వకు / హామీ పడలేనపుడు
ఎటూ పాలుపోక / వలస చితి మీద
సగం కాలి పైకి లేచిన / జీవశ్చవం కడనాడుల్లో
పరుగాపని నెత్తుటి బొట్టు / మా దినం కూలికి ఆఖరి మెట్టు" అంటూ వలస బతుకుల హృదయ విదారక పరిస్థితిని వివరించాడు. ఉత్తరాంధ్ర పల్లె దు:ఖాన్ని కూడా ప్రత్యేక కవితల ద్వారా ఉటంకించటం ఈ కవితా సంపుటిలో కనిపించే మరొక విశేషం. ఎందరో
మహాకవులను, కథకులను అందించిననేల ఉత్తరాంధ్ర, ఆ ఉత్తరాంధ్ర నుండి "వలస పాట" వినిపిస్తున్న కవి 'గవిడి శ్రీనివాస్'.

ఉత్తరాంధ్ర రచయితలు ఎవరు కవిత్వం రాసినా వలస గురించి ప్రస్తావించని కవులు ఉండరు అంటే అతిశయం కాదు, గవిడి శ్రీనివాస్ ఈ అంశము గురించి బలమైన కవితలు రాయడంతో పాటుగా, తన కవితా సంకలనానికి "వలస పాట" అని పేరు పెట్టడం విశేషం.

"ఉత్తరాంధ్ర వలస పాట" అనే మొదటి కవితతో ఈ కవితా సంకలనం ప్రారంభిస్తాడు రచయిత, ఈ కవితలోని వ్యక్తీకరణలో ఉత్తరాంధ్ర పల్లె పల్లె ఒక్కో దిగులు తల్లి అంటూ...
గాల్లో తేలాడే బుట్టలు
బరువెక్కిన బతుకు మీద
గాలిపటాల్లా నలుదిశలను వెదుకుతున్నాయి
చరిత్ర గుండెల్ని పిండినప్పుడల్లా
రాలుతున్న వలస పాటలు
బస్ స్టేషన్ వెంటో, రైల్వే స్టేషన్ వెంటో
తగులుతున్న దృశ్యాలై జ్వలిస్తున్నాయి
కాలం నడుస్తున్నా పని చిక్కని చేతిలో
పొట్ట కూడదీసుని
ఆశల మూటల్ని బరువుగా మోస్తూ
వలస బండి గడగడా కదిలిపోతుంది
ఎప్పటికీ తెరవని ఉపాధి ద్వారాలు, సూర్యోదయాన్ని చీకట్లో బంధించాయి
చెదిరే కాలం వెంట వలస విమానం పరిగెడుతుంది ఇప్పుడు అంటాడు రచయిత ఆర్ధ్రతతో.

ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేట్ దౌర్జన్యాలను చిత్రీకరిస్తూ ఉదయించే ప్రశ్నల రూపంలో ప్రశ్నల అస్త్రాలను సంధిస్తాడు "ప్రపంచీకరణ ఇంద్రజాలం భూములకు రెక్కలిచ్చి ఆశల్ని ఆకాశానికి వేలాడదీస్తున్నాయి నిట్టూర్పులో పరిశ్రమలు మట్టిని ఎంత వినయంగా మింగినా, హరిత స్వప్నం ప్రగతిని నిలదీస్తే మరో తరానికి ఆకలి ప్రశ్నలు ఎదురిస్తుంటాయి" అని వ్యక్తీకరిస్తారు రచయిత.

ఉద్దానంలో పెల్లుబికి ప్రాణాంతకమై నిత్యం మృత్యు గంటికలు మోగిస్తున్న కిడ్నీ వ్యాధుల పర్యవసానాల గురించి కూడా సాంబమూర్తి వేదనగా ఆర్ధ్రంగా రాసాడు..
'అంతం లేని వేదన' అన్న కవితలో
"ఉద్దానంలో ప్రతి గడపలో...
కన్నీళ్లు కాలువలు కడుతుంటాయి
ప్రతి ఊర్లో ఓ దుఖపు నది పారుతుంటుంది
తీరని వేదన సముద్రమై
సుడులు తిరుగుతుంటుంది
తీరంలో రోజూ కాకులు పిండాలారగిస్తుంటాయి
అప్పుడప్పుడూ వినిపించే భగవత్గీత శ్లోకాలు
ఇక్కడ ఎప్పుడూ వీధుల్లో
మంద్రంగా వినిపిస్తూనే వుంటుంది....
ఈ అంతులేని వేదనకు అంతమెప్పుడో
ఈ మరణ మృదంగం ఆగేదెప్పుడో
ఉద్దానం మళ్ళీ పచ్చగా నవ్వే దెప్పుడో!
ఇట్లా తన చుట్టూ వున్న అనేక అంశాల గురించి రాసిన సాంబ మూర్తి నాన్న గురించీ మంచి కవిత
రాసారు.

**ఆధార గ్రంధాలు:**

1. గాజు రెక్కల తునీగ : లాండ సాంబమూర్తి
2. గంటేడగౌరునాయుడు : ఎగిరిపోతున్న పిట్టల కోసం

3. గవిడి శ్రీనివాస్ : వలప పాట
4. కంచరాన భుజంగరావు : నీటి గింజల పంట

# భావ కవిత్వం - వస్తు నవ్యత

డా. జి. వెంకట లాల్
తెలుగు ఉపన్యాసకులు
సి ఎస్ టి ఎస్ ప్రభుత్వ కళాశాల, జంగారెడ్డిగూడెం

**ఉపోద్ఘాతం:** నవ్య కవిత్వంలో నిలిచిన ఉద్యమాలు రెండే రెండు. ఒకటి భావ కవిత్వం. రెండవది అభ్యుదయ కవిత్వం. ఈ రెండు ఉద్యమాలలో భావ కవిత్వోద్యమం దాదాపు మూడు దశాబ్దాల పాటుగా ఆంధ్రసాహిత్య కేదారంలో పసిడి పంటలా పండించింది. శేషాద్రి రమణ కవులు, కొమండూరి కృష్ణమాచార్యులు వంటి ప్రాచీన ఫక్కికి చెందిన విద్వత్కవులు కూడా భావ కవిత్వాన్ని స్పృశించారు. కావ్య వ్యాకరణ తీర్థులైన పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి వంటి విద్వద్విమర్శకులు దీనిని శాస్త్రీయ దృష్టితో సమర్థించారు. అభ్యుదయ యుగకర్తలైన శ్రీశ్రీగారు సైతం తొలి రోజులలో అసంఖ్యాకంగా భావకవితా ఖండికలు వెలువరించారు. 1940 లోపల పట్టిన నవ కవులెవ్వరూ దీని ముద్రను తప్పించుకోలేక పోయారు. ఒక్కమాటు భావకవితా విహాయసాన్ని పరికిస్తే రాయప్రోలు, వెంకట పార్వతీశ్వర కవులు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, అబ్బూరి, దువ్వూరి, నండూరి, బసవరాజు, వేదుల, నాయని, పింగళి, కాటూరి, జాషువా, తుమ్మల, తల్లావఝల, బాపిరాజు మున్నగు కవి నక్షత్రాలు అక్షరకాంతివృష్టిని కురిపిస్తూ కనిపిస్తాయి. ఈ కవులు భాకవిత్వంలోని వివిధ శాఖలకు, ప్రతినిధులు. వీరుకాక ప్రతిభామహితమైన భావకవిత్వాన్ని వెలయించిన కవులు పరశ్శతంగా ఉన్నారు. ఈ కవులందరూ ప్రకృతి కవిత్వం, ప్రణయ కవిత్వం, దేశభక్తి కవిత్వం మొదలగునవి ప్రక్రియలను కొంచం తేడాతో స్వీకరించిన వారే. కాబట్టి వారిలో నుండి ముఖ్యులయిన ఏ పదుగురి రచనలనో ఉదాహరణలుగా తీసుకుంటున్నాను. అంతమాత్రాన మిగిలిన కవులూ, వారి కృతులూ అప్రధానమైనవని కాదు.

**భావ కవిత్వ పరిచయం:** రాయప్రోలు వారి కావ్యాలలో "భావ పదము, భావగీతము" అనే పదాలు తొలిసారిగా కనిపిస్తాయి. తరువాత విశ్వనాథ వారు, కృష్ణశాస్త్రిగారు "భావగీతము" అనే శబ్దాన్ని ప్రయోగించారు. 'భావకవిత్వ' మనే పదాన్ని గాడిచెర్ల హరిసర్వోత్తమరావు గారు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారనీ డా|| గిడుగు తమ "History of Telugu Literature" లో పేర్కొన్నారు. గాడిచెర్లవారు ఈ పదాన్ని మాటిమాటికి ఆంధ్రపత్రికలో ప్రకటింపగా ఇది నవ్య కవిత్వానికి పర్యాయపదమైపోయింది. ఈ రకమైన కవిత్వం వ్రాసేవారిని నాడు భావకవులని పిలిచేవారు. కట్టులో, జుట్టులో, నడకలో, పలుకులో, భావకవులు తమ ప్రత్యేకతను కనబరిచారు.

భావ కవిత్వమంటే వస్తు భావ రచనలలో భావానికి ప్రాధాన్యమిచ్చిన కవిత్వం. అది ఉత్తమ శ్రేణిలో రచింపబడినప్పుడు రస శిఖరాన్ని అందుకున్న రచనయే అవుతుంది. భావ కవిత్వానికి అంతర్ముఖత్వం ప్రధాన లక్షణం. ఇది కేంద్రబిందువుగా భావ కవిత్వాన్ని పరిశీలిస్తే క్రింది విధమైన ఛాయలు అగుపిస్తాయి.
1. స్త్రీ పురుషుల బాహ్య సౌందర్యానికి బదులుగా ఆత్మ సౌందర్యం, గుణసౌందర్యం ఈ కవిత్వంలో వర్ణింపబడినాయి.
2. కవి తన సుఖ దుఃఖాలు తెరమరుగు లేకుండా వెర్రిగా వెల్లడించుకున్నాడు.

3. ఒక్కొక్కప్పుడు అవస్థాభేదాన్ని బట్టి అతనికి కొండంత సహనం అలవడింది. అందుకు తోడుగా దార్శనిక దృక్పథం ఏర్పడింది.
4. ప్రకృతి వర్ణనలలో బాహ్య విషయాలకు బదులుగా సుకుమారమైన సౌందర్యతత్త్వం నిర్దేశింపబడింది. అనగా చర్మ చక్షువుకు కనిపించే ప్రకృతి కాక మనోనేత్రానికి భాసించే ప్రకృతియే వర్ణ్యమైంది.
5. జాతికి సర్వాంగ వికాసం కలిగించే సంప్రదాయ సిద్ధమైన సంస్కార దృష్టి ఏర్పడింది. పూర్వజన్మ వాసనలు మళ్ళీ ఊపిరి పోసుకున్నాయి.
6. కవి తాను విన్న, కన్న ఏ చిన్ని సంఘటననైనా హృదయ తంత్రులను ఝుమ్మనిపించి కవిత్వ రూపంలో వెలిజిమ్ముకొని వచ్చింది.
7. ఆత్మార్పణతత్త్వం, ఆరాధన తత్త్వం పాదుల దన్నుకున్నాయి. అంతశ్చేతన లోని చైతన్యం హద్దులు దాటి వెలువడింది.
8. సామాన్యమైన సంతోషానికి బదులుగా సర్వే సర్వత్ర అలౌకికానందం అంచులు తీర్చుకున్నది. భావకవి చిత్రకవిత్వాన్ని నిరసించడంలో ఈ ఆంతర్యమే ఉన్నది.
9. కవి తన కొలబద్ధలతో జీవితాన్ని కొలవడం మాని తన వ్యక్తిత్వాన్ని విస్మరించి ఇతరుల సుఖదుఃఖాలలో లీనమైపోయే స్థితి ఏర్పడింది. దీనినే కీట్సు "Negative Capability" అని అన్నాడు.

**భావకవిత్వ శాఖలు:** భావకవిత్వంలోని శాఖలను స్థూలంగా ఈ విధంగా విభజించవచ్చు.
1. ప్రణయకవిత్వం (Love Poetry)
2. దేశభక్తి కవిత్వం (Patriotic Poetry)
3. ప్రకృతి కవిత్వం (Nature Poetry)
4. సంఘ సంస్కరణ కవిత్వం (Reformative Poetry)
5. భక్తి కవిత్వం (Mystic Poetry)
6. స్మృతి కవిత్వం (Elegies)

వీటిలో ఒక్కొక్కశాఖ అనంత వైవిధ్య విలసితం. ప్రణయ కవిత్వాన్నే తీసుకుందాం. ఇది రెండు విధాలుగా ఉంది. ఒకటి వస్త్వాశ్రయరీతి. రెండవది ఆత్మాశ్రయరీతి. అబ్బూరివారి మల్లికాంబ మొదటి కోవకు చెందిని రచన. కృష్ణశాస్త్రిగారి కృష్ణ పక్షం రెండవకోవకు చెందిన రచన. పైన పేర్కొన్న ఆరు శాఖల్లో ప్రక్రియా బాహుళ్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ ప్రక్రియలన్నీ ఇంగ్లీషు రొమాంటిక్ కవిత్వ ప్రభావం ఉన్నవి కావు. వీటిలో ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం ప్రాయికంగా ఆంగ్ల కాల్పనిక కవితా ముద్ర ఉన్నవే. దేశభక్తి కవిత్వంపై దీని ప్రభావం అంతగా లేదు. సమకాలీన పరిస్థితులను బట్టి, రాజకీయోద్యమాలను బట్టి పెకలివచ్చిన కవిత్వమిది. సంఘసంస్కరణ కవిత్వం కూడా సాంఘిక స్థితి గతులనుబట్టి ఉద్భవించిందే. భక్తి కవిత్వంపైన కొంత సాంప్రదాయిక ముద్ర, కొంత రవీంద్రుని ఛాయ, కొంత బ్రహ్మ సమాజం ప్రభావం అగుపిస్తాయి. ఈరీతిగా కొత్తపాతల మేలికలయికతో, సంప్రదాయ ప్రయోగాల సముచిత మేళనంలో తెలుగునాట వెలుగులు చిమ్మిందీ భావకవిత్వం.

**భావకవిత్వం : వస్తు నవ్యత**

ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలో ఇమేజరీ (Imagery) ప్రధాన స్థానం ఆక్రమించింది. ఇమేజరీ అంటే స్థూలంగా కల్పన అనవచ్చు. ఇమేజ్ అంటే కల్పనా చిత్రమనాలి. కానీ ఇమేజ్ అంటే మాటలతో కట్టిన బొమ్మ కాబట్టి పదచిత్రాలంటే సరిపోతుంది.

భావకవిత్వంలోని పద చిత్రాలను రెండు తెగలుగా విభజించవచ్చు.

**1. భావ చిత్రాలు, 2. ఊహా చిత్రాలు.**

భావచిత్రాలు హృదయానికి సంబంధించినవి. ఊహా చిత్రాలు బుద్ధికి సంబంధించినవి. భావకవులలో భావ చిత్రాలున్నంతగా ఊహాచిత్రాలు లేవు. భావచిత్రాలు వేసిన వారిలో కృష్ణశాస్త్రి, వేదుల, విశ్వనాధ, దువ్వూరి, నాయని మొదలగువారు ప్రసిద్ధులు, రససిద్ధులు. వారు ప్రధానంగా హృదయ తంత్రికలను స్పందింపజేసే మెత్తని భావచిత్రాలనే ప్రయోగించారు. అయితే విశ్వనాధ 'కిన్నెరసాని' పాటలలో, జాషువా 'స్వప్నకధ'లో మిన్నుముట్టే ఊహాచిత్రాలు కొన్ని లేకపోలేదు.

భావకవిత్వం ప్రధానంగా ప్రసాద మాధుర్య గుణాలను పెనవేసుకుని పుట్టింది. దేశభక్తి కవిత్వశాఖలో తప్ప ఓజోగుణం ఈ కవిత్వంలో అంతగా కనిపించదు. అందుచేత ఈ కవితకు లలిత మధుర పదవిన్యాసం, శైలీ సౌకుమార్యం, అలతియలతి జిలుగు విరుపులు సహజ గుణాలై పోయినవి. ప్రణయ కవిత్వంలోని వృత్తాలన్నీ ప్రధానంగా నన్నయ శైలినో, నంది తిమ్మన వంటి ప్రబంధ కవుల బాణీనో పుణికి పుచ్చుకున్నాయి. గీతపద్యం నడకలలో భావకవులు అపూర్వమైన విరుపులనూ జిలుగులనూ సాధించారు. దేశభక్తి కవిత్వశాఖలో సీసపద్యాన్ని రకరకాలుగా కదను తొక్కించారు.

భావకవులలో కృష్ణశాస్త్రి గారి చేతిలో పాతశబ్దాలే కొత్త పరిమళాలనూ, సరికొత్త వన్నెలనూ సంతరించుకున్నాయి.

**"//ఎలదేటి చిరుపాట సెలయేటి కెరటాల బడిపోవు విరికన్నె వలపు//**
**//తొలిప్రొద్దు తెమ్మెర తోవలో పయనమై పరువెత్తు కోయిల పాట//**
**//కారు రాతిరి కొసలు, "ఇరుల గుసగుసల//"**

మొదలైన అచ్చమైన తెలుగు మాటల కూర్పుల్లో,

**"//కరుణార్ద్ర వీక్షణ పరిమళములు//**
**//విరహవీక్షణ భయంకర మాధురులు//**
**//అగమ్య తమస్వినీ గర్భకుహరాలు//**
**//అంగుళీ కిసలయ చంచలాంచములు//"**

హేమంత కృష్ణానంత శర్వరి మున్నగు సంస్కృత సమాసాల పోహళింపుల్లో అపూర్వ నవ్యతా భరితమైన కమనీయం వెల్లివిరుస్తున్నది. తెలుగు కవిత్వంలో జిలుగు నగిషీలకు, సన్నపోగరుతనానికి ఎంత వీలున్నదో అంత సాధించి చూపారు కృష్ణశాస్త్రిగారు, వీరి శైలికి మించిన సౌకుమార్యాన్ని సాధించడానికి ప్రయత్నం చేయడమంటే మధు ధారను జలధారగా మార్చడమే.

అపూర్వ పదబంధాలు ప్రయోగించండంలో భావకవితనందుకున్నది. ఇవి రూపకాలు కావచ్చును లేక కర్మధారయాది సమాసాలు కావచ్చును. నీలంపు సిగ్గు, ఆశ్రుఝరులు, హాస మృదుల వాసనలు కొసరు తేనియలు, నెత్తావి గుసగుసలు, నిర్జీవ నిశ్శబ్దము, సురభిళాహ్వానములు, కైశికధ్వాంత నిశ్శబ్దము, రహస్తీరాలు, నిడుద చెర, నీలినీడ, కారు రాతిరి కొసలు, కార్చిచ్చు మంటయేళ్ళు, వలపుటాకలి, మూగ కనులు, వేదనాసుఖము, అరుణారుణాంధ గీతి, అమవస కన్నీటిపాట, ఇరుల గుసగుసలు, ముదుసలి నిరాశలు, పాటరెక్కలు, తీయతేనియ బరువు, విశ్వ వీణాగళము, విరహ విపంచి, సురభి సౌదామని, నిదుర పొదిగిళ్ళు (కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి నుండి); భాష్పభూషణములు, పూల వెన్నెలలు, మబ్బు కన్నెలు, వలపు నివాళి, తేనె తావుల బరువు,

తలిరుటెడద, జీవితంపు టెడారి, ఆశావిపంచి, మబ్బు కౌగిళులు, రేయికాటుక కనులు, చంద్రికా వసనము, విరభవిషాద రేఖ, నిసి కంటినీరు, తెమ్మెర యూర్పు - (దీపావళి నుండి); పోతు వెన్నెలలు, పూల - దీపము, వెలుగు పోచలు, నులివెచ్చ చిక్కవెన్నెలలు, కల్వపడంతి యూరుపులు, తావి దివ్వియ, వెచ్చ వెన్నెలలు - (శశిదూతము నుండి), తుషార దూతికలు, మేఘ పతాకలు (సౌభద్రుని ప్రణయయాత్రనుండి); లేత గుసగుసలు, గాలి బాలిక, తలిరు తురాయి - (మధుకీల నుండి; జాలివెన్నెల (గబ్బిలము నుండి); మంచుమంట- (హిమగళము నుండి)... ఇలాంటి వినూత్న పదబంధాలెన్నో వున్నాయి.

భావకవులు వృత్తాలను, జాత్యుపజాతులను, మాత్రా ఛందస్సులను సమానాభిరుచితో సంతరించారు. గద్య పద్య మయమైన చంపూరీతి రాయప్రోలుతోనే పరిత్యక్తమైంది. భావకవులు కూడా పద్ధతిలోనే కేవలం పద్య గేయకావ్యాలు రచించారు. గద్య పద్య సమ్మేళనం స్థానే పద్యగేయ సమ్మేళనం వీరి ప్రత్యేకత. సౌభద్రుని ప్రణయ యాత్ర, గిరికుమారుని ప్రేమగీతాలు, మల్లికాంబ వంటివి కేవలం పద్య రచనలు. కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి, హృదయేశ్వరి, దీపావళి, ఊహాగానము మొదలగునవి పద్యగేయమిశ్ర రచనలు. కిన్నెరసాని పాటలు, వకుళమాల, శశికళ, యెంకి పాటలు మొదలగునవి కేవలం గేయకృతులు.

ఈకవులలో శివశంకరశాస్త్రి గారు అనేక గతులలో అసంఖ్యాక గేయ పద్య రూపకాలు రచించారు. వీరు కొన్ని వృత్తాలను మూడు పాదాలతో, రెండు పాదాలతో రచించారు. గీత పద్యాలలో భావం ఎక్కడ విరుగుతుందో, అక్కడికే పాదం సమాప్తమయ్యే పద్ధతి ప్రవేశపెట్టారు. కృష్ణశాస్త్రి గారు కొన్ని సందర్భాలలో గీతపద్యాన్ని మధ్యలో యెత్తుకొన్నారు. భుజంగ ప్రయాతం వంటి ప్రాచీన వృత్తాలకు వెల్లవేసి గేయాభాష కలిగేటట్లు కొందరు రచించారు. సీసపద్యాలను వచన గేయాలవలె అచ్చువేసి, ఇంద్రజాలం చేసినవారు వెంకట పార్వతీశ్వర కవులు. ఈ పద్యాలను చదువుతుంటే వచనగేయాల లాగే అనిపిస్తాయి.

భావకవుల గేయాల్లో ప్రధాన గుణాలు గతి చమత్కారం, లయవిన్యాసం, గేయాలలో అధికభాగం ఐదైదు మాత్రల గణాలతో నడిచే ఖండగతిలో వున్నాయి. యెంకిపాటల్లో ఏ కొన్నో తప్ప మిగతావన్నీ ఈ గతిలోనే వున్నాయి. కృష్ణశాస్త్రిగారి గేయాలు కూడా అధికభాగం ఈ గతిలోనే వున్నాయి. ఇది ద్విపదకూ సీసానికీ సన్నిహితంగా వుండడంవల్ల, మన కవులు మొదట పద్యాలతోనే కవితా వ్యాసంగం ప్రారంభించినందువల్ల ఈ ఖండగతి అనుకోకుండా వారిని వశపరుచుకున్నది. ఈ ఖండగతిలోనే పాదసంఖ్యలో, మాత్రాధిక్యంతో, మాత్రాలుప్తితో ఈ కవులు సాధించిన నవ్యత అపూర్వం. భావకవిత్వ గేయాలలో చతురస్రగతి క్వచిత్తుగా ప్రయోగించబడింది. కిన్నెరసాని పాటల్లో ఈగతి సమమాత్రాకంగా, సమపాదంగా ప్రయోగింపబడింది. తల్లా వజ్ఝలవారు చరణాల చివర 'ప్రియురాలు' అనే మకుటాన్ని పునరావృతం చేసి నవ్యత సాధించారు. దువ్వూరి వారు 'ఆమని నిషా'లో కొన్నిచోట్ల మాత్రలు పెంచారు. ఇకపోతే మిశ్రగతి ముత్యాల సరంగా నవ్యకవిత్వంలో అశేషవ్యాప్తి పొందింది. రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, అబ్బూరి రామ కృష్ణారావు, నండూరి వెంకటసుబ్బారావు, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, బసవరాజు అప్పారావు, వేదుల సత్యనారాయణ మొదలగువారు కనీసం ఒక్క ముత్యాల సరమైనా సంతరించిన కవులే. వీరు ఈ గేయగతిలో సాధించిన వైచిత్రి గణింపదగింది.

భావకవులలో వచనగేయాలు వ్రాసిన వారిలో కవికొండల వెంకట్రావు, రామచంద్ర అప్పారావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, దువ్వూరి రామిరెడ్డి పేర్కొనదగిన వారు. కవి

కొండలవారు 'నక్కాసామి గాడు' అనే వచనగేయాన్ని 1933లోనే రచించారు. "నక్కసామిగాడు వాడొక మాలవాడు రాజుగారి కమతంలో పాలేరుగాడు. వాడు పోయాడు... "దెందులూరు కాడాక్కుండా వెళ్ళిన మెయిల్బీ ఆగిన మా ప్యాసెంజరు రయిల్బీ రెండింటినీ కూడా మరచి... స్థాయి......." ఈ విధంగా సాగిపోయిన వచన గేయం ఇది.

దీనిని 'వచన గీతిక' అని వారే స్వయంగా వ్రాసుకున్నారు. రచన శుద్ధ వ్యావహారికంలో ఉండడం, చమత్కారమైన అంత్యనియమాలుండడం చరణ విభాగం ఆధునిక వచనగేయంలాగే వుండడం ఈ గేయంలోని ప్రత్యేకత. రామచంద్ర అప్పారావుగారి 'రక్తవిహారము' అనే గేయం కొంతదూరం వచనగేయం లాగా సాగి, మధ్యలో తేటగీతిగా మారి, మళ్ళీ వచనగేయంగా రూపొంది చివరికి తేటగీతిగా ముగుస్తుంది. మల్లవరపు వారి 'కళ్యాణ కింకిణి'లో 'స్త్రీ' అనే శీర్షికతో చక్కని వచన గేయముంది. ఇది శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా!' అనే గేయాన్ని పోలివున్నది. దువ్వూరి వారి 'నైవేద్యము'లో కూడ 'లూఠీ' వచనగేయం ఉంది. దీనిని ప్రయత్నించి చతురస్రగతిలోనికి ఈడ్వవచ్చును. కానీ స్థూలంగా వచనగేయంలా కనిపించే రచనయిది. విశ్వనాథవారు 'శృంగార వీధి' చివర 'రాధిక' అనే శీర్షికతో కొన్ని వచనాలు రచించడం జరిగింది.

అభ్యుదయ కవిత్వ యుగం శిష్ట్లా ఉమామహేశ్వర రావు, నారాయణబాబు, పట్టాభి, శ్రీశ్రీ మొదలగు కవుల చేతులలో సహస్రాంచలాలతో మెరిసిన వచనగేయానికి భావకవిత్వ యుగంలోనే ఇరవయ్యో శతాబ్ది మూడవపదిలోనే బీజావాపం జరిగిందనవచ్చును.

విశ్వనాథవారు మహాకావ్యాల నుంచి రసవర్ణట్టాలుగానీ, ఏక విషయాన్ని గూర్చి రాసిన కొన్ని పద్యాలు కాని విడిగా తీసినట్లైతే అవి ఖండకావ్యాలంటారు.

భావకవిత్వంలో శైలీసౌకుమార్యం విశిష్టస్థానాన్ని పొందినట్టిది. ఇది రచనా నవ్యతకు చెందినట్టిది.

**'కన్నీటి కెరటాల వెన్నెలేలా! నిట్టూర్పు గాడ్పులో నెత్తావియేలా!'**

'ప్రళయకాల మహోగ్ర జీమూతోరు గళ ఘోరగంభీర ఫెళ ఫెళార్భటులలో మెరుపేలా' ఇలా చమత్కారాన్ని సాధించడం, 'కారురేతిరి కొసలు', తీయతేనియ బరువు, పూలవెన్నెలలు వేదనాసుఖము, శారదశర్వరీమధుర చంద్రిక, అంగుళీకిసలయ చంచలాంచలములు వంటి తెనుగు, సంస్కృత పద సమాసాల, పదబంధాల కూర్పుతో మనోహరంగా సాగుతుంది వీరి శైలి.

అభ్యుదయ కవిత్వ యుగం శిష్ట్లా ఉమామహేశ్వర రావు, నారాయణబాబు, పట్టాభి, శ్రీశ్రీ మొదలగు కవుల చేతులలో సహస్రాంచలాలతో మెరిసిన వచనగేయానికి భావకవిత్వ యుగంలోనే ఇరవయ్యో శతాబ్ది మూడవపదిలోనే బీజావాపం జరిగిందనవచ్చును.

**ముగింపు**: ప్రాచీన గద్యపద్య సమ్మేళన స్థానంలో పద్యగేయాల సమ్మేళనం భావకవులలోని ఒక నవ్యత అనవచ్చు. సౌభద్రుని ప్రణయ యాత్ర, కష్టకమలవంటివి కేవల పద్యమయాలైతే దీపావళి, కృష్ణపక్షాదులు పద్యగేయమిశ్రమాలైతే, కిన్నెరసాని పాటలు, వకుళమాల, యెంకిపాటలు గేయ కావ్యాలు. ఖండగతి, చతురస్రగతి, త్రస్యగతి, మిశ్రగతి, వచన గేయాలు కూడా భావకవిత్వంలో ఎంతో రమణీయంగా ప్రయోగింపబడ్డాయి.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. నారాయణ రెడ్డి, సి.2011. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు, ప్రయోగములు. విశాలాంధ్ర బుక్ హౌస్, సప్తమి ముద్రణ.
2. నారాయణరావు, వెల్చేరు. 1987. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. నవోదయ ప్రచురణలు.
3. రంగనాథాచార్యులు కె.కె. 2005 ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు. ఆంధ్రసారస్వత పరిషత్.
4. తెలుగులో కవిత్వోద్యమాలు. 2011. తెలుగు అకాడమి